చీలకమర్తి లక్ష్మీనృసింహకవి

సంపూర్ణ గ్రంథావళి

షష్టిపూర్తి ముద్రణము

3-వ సంపుటము—నవలలు

గణపతి - రామచంద్రవిజయము - రాజనీతి

V.R NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D.P.R.I.
Acc. No.
10461

షష్టిపూర్తి సంఘకార్యదర్శి :

పాలకోడేటి గురుమూర్తిగారిచే

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N10461

11
894.82709
LAK

రాజమహేంద్రవరము

శ్రీ సుజనరంజనీ ముద్రాక్షరశాలయందు

పోతాప్రగడ శేషగిరిరావుగారిచే

ముద్రింపఁబడియె.

1927.

VAVILALA GOPALAM LIBRARY

AOUA104B106.

గణపతి

మొదటి ప్రకరణము.

"శుక్లాంబరధరంవిష్ణుం శశివర్ణం చతుర్భుజం
ప్రసన్నవదనం ధ్యాయే త్సర్వవిఘ్నోపశాంతయే."

అని విఘ్నేశ్వర దేవతాకమైనస్తుతిశ్లోకమొకటికలదు. "తెల్లని వస్త్రములు ధరించువాఁడు, సర్వవ్యాపకుఁడు, చంద్రునివలె ధవళవర్ణుడవాఁడు నాలుగుభుజములు గలవాఁడు ప్రసన్నమైన మొగము గలవాఁడు నగువిఘ్నేశ్వరుని సర్వవిఘ్న శాంతికొఱకు ధ్యానించుచున్నాఁడ" నని యాశ్లోకమునకర్థము. సర్వతోముఖపాండిత్యముగల యొకానొకబుద్ధిమంతుఁడు చమత్కారముగ నీశ్లోకము గాడిద నుద్దేశించి చెప్పఁబడినదని విపరీతార్థముగల్పించి చెప్పెను. అదియెట్లనఁగా శుక్లాంబరధర మనఁగా ధవళవస్త్రములు ధరించునది. చాకలివాఁడుదికిన తెల్లవస్త్రములుమోయునది గావున నీశబ్దము గాడిదకేయర్థమగుచున్నదని చెప్పెను. విష్ణుశబ్దమునకు సర్వవ్యాపకత్వ మర్థమున్నదిగదా. గాడిద యెక్కడఁజూచిన నక్కడే కనఁబడుచుండును. కావున నిక్కడవిష్ణుశబ్దమునకు గాడిదయే యర్థమని వాక్రుచ్చెను. శశివర్ణ మనఁగా చంద్రునివలె ధవళమైనది. గాడిద తెల్లగా నుండుట గావున నీయర్థము నిర్వివాద మనియెను. చతుర్భుజ మనఁగా నాలుగుభుజములు గలది. గాడిదకు నాలుగుభుజము [illegible] వలనఁ జతుర్భుజశబ్దము సార్థక మనియెను. అపిభుజములుకావు. పాదములని

చదువరు లెవ్వరైన సందియంపదురేమో. "నిరంకుశాః కవయః" యను నార్యోక్తి జ్ఞప్తికిఁ దెచ్చుకొనుఁడు. కవులు నిరంకుశులు. వారు పాదములు భుజములు చేయఁగలరు. భుజములు పాదములు చేయఁ గలరు. ప్రసన్నవదన మనఁగా ప్రసన్నమైనముఖముగలది. ప్రసన్నమైన మనస్సుతో మనము చూచినయెడ దానిమొగము ప్రసన్నమై యుండును. కావున నదియు నిర్వివాదమే. ఇటువంటిగాడిదను సర్వవిఘ్నోపశాంతికొఱకు ధ్యానించు చున్నాఁడనని యీశ్లోకార్థమెనట్లు తన నిరుపమానపాండిత్యప్రకర్షముచేత నావిద్వాంసుఁడువిపరీతార్థము జెప్పిసమర్థించెను. గణపతియనఁగా విఘ్నేశ్వరుడు. మహేశ్వరునియొద్ద పరమభక్తులగు ప్రమథులకు దివ్యులు కొండఱుగలరు. ఆప్రమథులకే ప్రమథగణమని పేరు. మహేశ్వరుఁడు నిర్హేతుకజాయమానకటాక్షముచేతనో లేక నిరుద్యోగియైన తనకుమారుని నేదేని నొకయధికారమునం దుంచవలయు ననునిచ్ఛచేతనో నాయకుఁడు లేనియెడ బ్రమథులు కట్టుతప్పి చెడిపోవుదు రను భయముచేతనో యాప్రమథగణమునకు వినాయకుని నాయకుని జేసెను. ఆగణమునకధిపతియగుట చేత వినాయకునకు గణపతియను పేరువచ్చెను. గణపతియనఁగా విఘ్నేశ్వరుఁ డగుటచేత విఘ్నేశ్వరు నుద్దేశించి చెప్పఁబడిన పూర్వోదాహృతశ్లోకముయొక్క విపరీతార్థము నీగ్రంథకథానాయకుఁడైన మాగణపతి కన్వయింపఁజేయ వలదని కోరుటకై యాశ్లోక ముదాహరించితిని. ఆగణపతి ప్రమథగణపతిగదా. మాగణపతి యేగణమునకధిపతియని మీరడుగవచ్చును. అది నేను చెప్పుట కష్టము. మీరే యూహించుకొనవచ్చును. తల్లినంపు లీతనికి గణపతినామ మేల పెట్టిరో నాకు తెలియదు. కానిగణపతియందుండులక్షణము లనేకము లీతనియందుఁగలవు. ఉండ్రిముముక్కలమీఁద నతని కెంతయిష్టము గలదో వర్ణించుటకు సపాదలక్షగ్రంథ[illegible]మహాభారత మురచించిన

వేదవ్యాసుఁడు దిగి రావలయును గాని సాధారణకవులు సామాన్యవచనగ్రంథప్రణేతలు పనికిరారని కంఠోక్తిగాఁ జెప్పఁగలను. అది మొదటి సామ్యలక్షణము. పానకము వడపప్పు గొబ్బరికాయలుమాగణపతికిఁగావలసినన్ని దొరకవుకాని దొరకినపక్షమునఁ దక్కినప్రజ్ఞావిషయమున కాకపోయినను భోజనవిషయమున మహాగణాధిపతిని మాగణపతి యవలీలఁగ జయింపఁగలఁడు. ఇది రెండవలక్షణము. మహాగణపతిది గుజ్జురూప మని గ్రంథములు చెప్పుచున్నవి. మాగణపతిది గూడ గుజ్జురూపమే యని శపథముఁజేసి చెప్పఁగలను. ఇది మూఁడవ లక్షణము. ఆవిఘ్నేశ్వరుని దేహసమొగము. మాగణపతిది యేనుఁగుమొగమువంటి బుంగమొగము. ఇదినాల్గవలక్షణము. సామ్యములైన లక్షణములు గణపతుల కిద్దఱకు మూఁడు కలవు గాని మాగణపతి యాగణపతికంటె నెన్నోవిషయములయందు ఘనుఁ డని చెప్పవచ్చును. భోజ్యవిషయములో మాగణపతియగ్రతాంబూలమునకర్హుఁడనిఁపండితులెందఱో సెలవిచ్చియున్నారు. లంబోదరశబ్దము విఘ్నేశ్వరునకు నేతిబీరకాయవలె సార్థకముగాదనియు మాగణపతియందు లంబోదరత్వము సార్థకమైనదనియు నాదృఢవిశ్వాసము. విఘ్నేశ్వరుఁ డేకదంతుఁడు. మాగణపతి ముప్పదిరెండుదంతములుగలవాఁడు. స్థాలీపులాకన్యాయముగఁ బైనుదహరింపఁబడిన కొన్నియతిశయలక్షణములు జూపఁబడియె. మహాగణపతికి సమానములైనలక్షణములుకొన్నియతనికంటె నతిశయములైనలక్షణములు కొన్నియుండుటచేత మొత్తముమీఁద గణపతి శబ్దము మాకథానాయకునియందుఁ గొంతవఱకు సార్థకమైనదని మీకిప్పుడు నమ్మికకలిగియుండవచ్చును. జగదారాధ్యుఁడైన వినాయకునియందుఁ గలలక్షణంబులె తమ ప్రియమిత్రునియందుఁ గలుగునని నమ్మి తలిదండ్రులీనామ మతనికిచ్చియుందురాయని మీరు మమ్మడుగవచ్చును. దాని కుత్తరముఁ జెప్పుట మిక్కిలి కష్టము.

తలిదండ్రులు బిడ్డల కొకప్పుడు తమయిష్టదైవముల పేర్లు పెట్టవచ్చును. ఆ దైవతములయందున్న గుణములు బిడ్డలయందు పొడగట్టవచ్చును. పొడగట్టకపోవచ్చును. రామునినామము ధరించినవారందఱుఁబితృవాక్య పరిపాలకులై యేకపత్నీవ్రతస్థులైరా? తలిదండ్రులను నిరంతరముఁ గొట్టి తిట్టునట్టికష్టచరిత్రుఁడుగూడ రాముఁడను పేరంబఱుగుచుండును. అట్టిమూర్ఖుఁడు సాపాటిరాముఁడగునుగాని గుణములలో దశరథరాముఁ డగునా? నోరు విప్పునపుడెల్ల నబద్ధములే చెప్పువాఁడు హరిశ్చంద్రుఁ డనుపేరఁ బరఁగవచ్చును. లక్ష్మీప్రసాదుఁ డనునామధేయము గలవాఁడు నిరుపేద గావచ్చును. తలిదండ్రులు వెఱ్ఱెయ్యయని పేరు పెట్టుకొన్న బాలుఁడు మేధావంతుఁడై తన ప్రతిభాప్రభావముచేత జగంబును వెలయింపవచ్చును. తలిదండ్రి లొకయుదేశముతోఁ బేరు పెట్టవచ్చును. కుమారుని యుత్తరచరిత్రమాయుద్దేశమునకు వైరుధ్యమును జూపవచ్చును. గణపతి తలిదండ్రులు తమకుమారున కిష్టదేవత పేరే పెట్టియుండవచ్చును. లేదా వినాయకచతుర్థినాఁ డతఁడుజన్మించియుండుటచే నానామము గలిగియుండవచ్చును. కాదేని వాని వృద్ధప్రపితామహుఁడో మాతామహుఁడో యాపేరువాఁడైయుండనోపు. అదియును గానిపక్షమున బుట్టినప్పుడు బుల్లిబొజ్జ బుంగ మొగము బుఱ్ఱముక్కు గుజ్జురూపముఁజూచి తమభక్తికిఁ దమ తపఃప్రభావమునకు మెచ్చి యదితికశ్యపులగర్భమున శ్రీమన్నారాయణుఁడు వామనరూపముధరించి జన్మించినట్లు తమ్ముధన్యులఁ జేయుటకుఁ దమపేరు మహీతలమున వెలయించుటకుఁ దమవంశము పావనముఁజేయుటకు గణపతితమగర్భవాసమున జన్మించియుండునని నమ్మి మాతాపిత్రులానామమిచ్చియుండవచ్చు. ఒక్కవిషయమునఁదక్క నితఁ డన్నివిషయముల గణపతికిఁ దుల్యుఁ డనవచ్చును. మహాగణ్డపతి విద్యల కధిపతి. మన గణపతి క దొక్కటే కొఱంత. ఇట్లనుటచేత నితఁడు చదువురానివాఁ

డని తలంపవద్దు. ఆకొఱత దీర్చుకొనుటకై యతఁడుపాధ్యాయత్వము జేసి కొందరుబాలుర బాగుచేసెను. తాను గ్రంథములు చదువుకొనుటకు విద్యరాదు. కాని యొకరికిఁ జెప్పుట కతనియొద్ద నెంత విద్యయైనఁగలదు. ఏవంగుణవిశిష్టుఁడైనగణపతియొక్క చరిత్రమునందుపోద్ఘాతము వ్రాయఁబడినది. ఈయుపోద్ఘాతముచదువఁగానె వానిచరిత్రము నామూలాగ్రముగఁ జదువవలయు నని మీమనస్సులు, వినవలయు నని మీచెవులు, నువ్విళ్ళూరుచుండ వచ్చును. అందుచేత నామధేయప్రకరణమును విడిచి వంశరూపధేయాది ప్రకరణములయందుఁ బ్రవేశింతము. గణపతిచరిత్రము మిక్కిలి గొప్పది. ఇది చదువరుల యదృష్టముచేత మాకు లభించినది. వాల్మీకికిట్టిచరిత్రదొరికినపక్షమున రామాయణమును మాని యతఁడాకథయే వ్రాసియుండును. వేదవ్యాసున కిట్టిది లభించినపక్షమున కష్టసాధ్యములైన పదునెనిమిది పురాణములను మహాభారతమును రచియించుట మాని తనయశస్సు కల్పాంతస్థాయి యగునట్లు లాచరిత్రమునే రచియించి కృతార్థుఁడై యుండును. ఇంకఁ గాళిదాస భవభూతి ప్రముఖుల మాట చెప్పనేల ఇటువంటి చిత్రకథ శ్రవణగోచరము గాకపోవుటచేతనే బాణుండు కాదంబరీహర్ష చరిత్రల విధిలేక వ్రాసి యుండును. మనపూర్వజన్మ పుణ్యముచేత లభించిన యీయద్భుత చరిత్రమును గణపతిప్రతిష్టకుఁ దగినట్లు రచియింపలేకపోయినను నేదోవిధముగ యథాశక్తిసహాగమనము వలె రచియింపఁ దలఁచుకొంటిని.

రెండవ ప్రకరణము.

అహాహా! మనదేశమునందు జీవచరిత్రములు లేనిలోపమిప్పుడు కనఁబడుచున్నది. చరిత్రరచనమునందు మనపూర్వులకు శ్రద్ధయెంత

మాత్రము లేకపోవుటచే నొక్క మహాపురుషుని చరిత్రమైనఁ జదివెడు భాగ్యము మనకబ్బినదికాదు. రాజరాజనరేంద్ర ప్రముఖులగు మహారాజులయొక్కయు నన్నయభట్టారకతిక్కనసోమయాజిప్రముఖ మహాకవులయొక్కయుఁజరిత్రములు చేకూరనందున మన మంతవిచారింపవలసిన పనిలేదు. కాని గణపతియొక్క చరిత్రము సంపూర్ణముగ లభియింపనందుకు మనముకడుంగడువిచారింపవలయు. ఆవిచారములోనె గుర్రిడ్డిలో మెల్లయనునట్లు కొంతచరిత్రము మన కసంపూర్తిగ నైన లభించినందుకు సంతోషింపవలయు. సంగ్రహముగనైన నీచరిత్రము నాకెట్లు లభించినదో చెప్పెదవినుండు. ఒకనాఁడు నేనొక మిత్రునింటికివిందారగింపఁబోతిని. ఆమిత్రునియింట వివాహముజరుగుచుండెను. ఆవిందునిమిత్తము మిత్రులనేకులు వచ్చియుండిరి. ఇప్పటివలె చీట్లుపంపి భోజనమునకుపిలిచెడు నాచారమప్పుడులేదు. పెంద లకడ భోజనముపెట్టు నాచార మంతకంటె లేదు. విస్తళ్ళుపేయునప్పటికి రెండుజాముల రాత్రి యయ్యెను. వడ్డించునప్పటికి మఱినాలుగు గడియలు ప్రొద్దుపోయెను. భోజనముచేసి లేచునప్పటికి కొక్కురోకో యని కోఁడికూసెను. విస్తళ్ళువేయకమునుపువిస్తళ్ళముందుగూర్చుండిన తరువాతను భోజనము సేయుచు నెడనెడ వంటకములు వచ్చులోపలను నేను నాలుగు కునుకులు కునికితిని. ఆనిద్రలో నా కొక స్వప్నము వచ్చెను. ఆస్వప్నములోవిలక్షణమైనయొకవిగ్రహముకనబడెను. కరోటకుఁడు కఱచినతరువాత మారురూపము దాల్చిననలుఁడాయితఁడనియావిగ్రహమునుజూచి నేనువితర్కించుకొంటిని. వామనరూపుఁడాయని మఱికొంతసే పనుకొంటిని. అప్పటికి నాకుఁదోచిన కొన్ని కారణములచేత నేననుకొన్న రెండురూపములుకావనినిశ్చయించుకొని యది పిశాచమైయుండునని భావించి భయపడితిని. ఆపురుషుఁడు నాభయము జూచి నవ్వి "భయపడకు భయపడకు. నేను నీకు

హాని సేయఁదలఁచి రాలే"దని మీఁద చెయివైచి తట్టి వెండియునిట్లనియె. "అయ్యా! నేను గణపతిని. కాని పార్వతీపరమేశ్వరుల కుమారుఁడైన వినాయకుఁడఁగాను. నాచరిత్రము మిక్కిలి రమణీయమైనది. ఇది మీ రాంధ్రభాషలో రచియింపవలయునని నాకోరిక. నాచరిత్రము మిక్కిలి లోకోపకారకము. ఇదిమీరుతప్పమఱియెవ్వరువ్రాయఁజాలరు. సాహిత్యవిద్యా చతుర్ముఖులైన విద్వాంసులు లోకమున బెక్కండ్రు కలరు. తర్కవ్యాకరణశాస్త్రపారంగతు లగు పండితులుఁ బెక్కండ్రు కలరు. కాని వారిచేత నాచరిత్రము వ్రాయించుకొనవలయునని నాకిష్టములేదు. వారు నాచరిత్ర వ్రాయఁదగరు. వారెంతసేపు భావాతీతములైన యుత్ప్రేక్షలతో నతిశయోక్తులతోఁ గాలక్షేపము సేయుదురు. వారిదృష్టికి వెన్నెలలు చందమామలు తామరపువ్వులు కలువపువ్వులు హంసలు చిలుకలు తోఁటలు కోటలు మేడలు మిద్దెలు మలయమారుతములు విరహతాపములు మకరందప్రవాహములు మొదలయినవే నచ్చును కాని నిగర్వమైన నాచరిత్రము వారికినచ్చదు. అందుచేత గీర్వాణవిద్వాంసులగీర్వాణముఁ జూచిన నాకు దలయేరు. ఇప్పుడు నాచరిత్రము మీకుఁజెప్పెదను. వినివ్రాయకపోయిన పక్షమున మీరు కాశీలోగోహత్య జేసినట్లె. ప్రయాగలో బ్రహ్మహత్యనల్పినట్లె. కురుక్షేత్రములోఁగుక్కను తిన్నట్లె. ఇంకను మీరు వ్రాయనిపక్షమున నేను దయ్యమునై మిమ్మును మీవంశము వారిని బదునాలుగుతరములవఱకు బట్టుకొని పీకికొని తినియెదను. జాగ్రత. మీరు వ్రాసినతరువాత నాచరిత్రము పఠియించిన వారికి పంచమహాపాతకము లడఁగును. పఠియింపనివారు చదఫురుగులై పుట్టి మఱియొక జన్మమునఁ బుస్తకముఁ దినివేయుదురు."

అని చెప్పి తనవృత్తాంతము సంగ్రహముగ నా కెఱిఁగించెను. నాలుగు కునిఁకిపాటులలో నాలుగుపావులుచెప్పి సంగ్రహమైన యీ

కథ మఁగించి నీ కేమైన సందేహము లున్న నడుగుమని మఱిమఱి యడిగెను. అడుగుటకు నేను ప్రయత్నముఁజేసి నోరు తెరవఁబోవు చుండ వడ్డనబ్రాహ్మణుఁడు నాచేతిమీఁద వేఁడిచారుపోసెను. నేను విస్తరిముందరఁ గూర్చుండి చా రెంతసేపటికి రాకపోవుటచే గోడకు జేరఁబడి దొన్నెలోఁజేయిపెట్టుకొని కునుకుచు స్వప్నసుఖ మనుభవించుచుండఁగా మోటబ్రాహ్మణుఁడు నాచేయి గాల్చెను. అందుచేత నాకు మెలకువవచ్చెను. మరల మజ్జిగ వచ్చునప్పటికిఁ గొంత యాలస్యమైనది కాని చేతిమంటచే నిద్రపట్టినదికాదు. మరల నిద్ర పట్టిన పక్షమున గణపతి నాకలలో మరలఁ గనఁబడి నాసందియములఁదొలగించియుండును. మఱియొకసారియడుగుదమని తలంచితినిగానినాఁటికి నేఁటికి మరల నతఁడు స్వప్నమునఁగనబడ లేదు. భోజనానంతరమున నేను నాగృహంబునకరిగిమంచముపైఁ బండుకొంటినికానినిద్రపట్టినది కాదు. భుజించినవంటకములు త్రేన్పురాఁదొడఁగెను. గణపతిచరిత్రము స్మృతిపదమున నిలువఁజొచ్చెను. అతనిమూర్తి నాకన్నుల యెదుట నిలిచినటులేయుండెను. ఇది నిజముగా స్వప్నమై యుండునా నామనోభ్రమయా యని నేను కొంతసేపు వితర్కించితిని. నిశ్చయముగ స్వప్నమేయని సిద్ధాంతము చేసితిని. కలలోని వృత్తాంతమునునమ్మి గణపతిచరిత్రమును నేనువ్రాయవలసియుండునాయని నాలోనే నాలోచించుకొంటిని. వ్రాయుటయే సర్వోత్తమమని నిశ్చయించితి. వ్రాయకపోయిన పక్షమున నతఁడు పిశాచమై పీడించునను భయమునను నే నిది రచియించిన సమకట్టలేదు సుడీ! ఎందుచేత నన నేను దయ్యములు లేవని వాదించు వారలలో నొకఁడను. అట్లయిన నేల వ్రాసితి నందురేమో? స్వప్నమునం దొక పురుషుఁడు కనఁబడుటయుఁ దన చరిత్రము సంక్షేపముగఁ జెప్పుటయు నది వ్రాయుమని కోరుటయు నది యెంతో చిత్రముగ నుండుటయు మొదటి కారణము. ఆంధ్ర

భాషాభిమానము రెండవకారణము. భారత భాగవత రామాయణాది పురాణములు విని విని చెవులు తడకలు కట్టినవారికి వినోదమేదైనఁ గల్పింపవలయు ననునది మూఁడవకారణము. ఆంగ్లేయ భాషాభివృద్ధి యగుచున్న యీ దినములలో స్వప్నములలో మనుష్యు లగపడుట గ్రంథములు వ్రాయు మనుట చదువరు లనేకులు నమ్మకపోవచ్చును. నమ్మకపోయిన నాకేమి భయము. ఇది యబద్ధము కాదుగదా. మహాకవియగు తిక్కనసోమయాజికి నతని జనకు డగుఁ కొమ్మనదండ నాథుఁడును హరిహరనాథుఁడును స్వప్నమున సాక్షాత్కరించి మహాభారత రచనకుఁ బురికొల్పలేదా. కృష్ణదేవరాయలవారికి శ్రీకాకుళమున నాంధ్రనాయకస్వామి కలలో సాక్షాత్కరించి విష్ణుచిత్తీయ మను నామాంతరము గల యాముక్తమాల్యదను రచియించి తన కంకిత మిమ్మని కోరలేదా? తెలుగు కవులు కావ్య రచనకుముందు కలలు గనుట సాంప్రదాయసిద్ధము. కాఁబట్టి మాకలలో నంత వైపరీత్య మేమియు లేదు. కలమాటఁ గట్టిపెట్టి కథాకథనములోనికి దిగియెద.

ఆంధ్రకవులు తమకావ్యముఖములకు మనోహరతిలకంబులై యుండునట్లు గృతిపతులయొక్కయుఁ గథానాయకుల యొక్కయు వంశముల వర్ణించుట సుప్రసిద్ధము. నేనును నాలుగు పద్యము లల్లనేర్చి కొందఱచేతఁ గాకపోయినఁ గొందఱచేత నైనను గవి ననిపించుకొనుటచేఁ గవుల సాంప్రదాయ మనుసరింపవలయు నను దృఢసంకల్పము నాకుఁ గల్గినది. అందుచేత నీ కథానాయకుని వంశము ముం దభివర్ణించెద. మా కథానాయకునిది లోకముతగులఁ బెట్టు సూర్యవంశము గాదు. దొంగపోటుగ రాత్రులు తిరుగు మచ్చ గల చంద్రవంశము గాదు. ఈ వంశమునకు బ్రహ్మదేవుఁడే మూల పురుషుఁ డగుటచేత నిది పవిత్రమైన బ్రహ్మవంశము. ఆ బ్రహ్మ

వంశములో నొక్కశాఖ పప్పుభొట్లవా రనుపేరఁ బరగఁజొచ్చెను. ఇది కేవల పౌరుషనామము కాని యూరక పెట్టుకొన్న పేరు కాదు. మా గణపతి పూర్వులలో నొకఁడు పందెమువేసి మూఁడు తవ్వల కందిపప్పు వండించుకొని తానొక్కఁడే భక్షించి మూఁడు వరహాలు బహుమానముగ గ్రహించుటం జేసి నాఁటనుండియు వాని యింటిపేరు పప్పుభొట్లవా రని ప్రసిద్ధికెక్కెను. గోదావరీ తీరమున మందపల్లి యను నొక గ్రామము కలదు. ఇక్కడ శనైశ్చరుఁడు శివప్రతిష్ఠఁ జేసెను. శనికి మందుఁడను నామాంతరము గలదు. కావున శనిప్రతిష్ఠితుఁడైన యీశ్వరుఁ డచ్చోట మందేశ్వరుఁ డని వ్యవహరింపఁబడుచుండును. ఈ మందేశ్వరస్వామివలన నీగ్రామము గోదావరీ మండలముననే గాక కృష్ణాగోదావరీ మండలములయందుఁ గూడ మిగులఁ బ్రసిద్ధికెక్కెను. శనిపీడ గలవా రీగ్రామమునకుఁ బోయి బ్రాహ్మణులకు వలసిన తిలదానము లిచ్చి తైలాభిషేకము మందేశ్వరునకుఁ జేసినపక్షమున శనిదోషంబు శమియించు నని స్థలపురాణజ్ఞులు చెప్పుదురు. ఆస్తికబుద్ధిగల మనవా రందఱు శని గ్రహవిష్టులైనప్పు డచ్చటకుఁ బోయి కొంత ధనము వ్యయముఁ జేసి శని విముక్తు లగుచుందురు. అనేక మహర్షులు దేవతలు బ్రహ్మ స్థలములయందు మహేశ్వరప్రతిష్ఠలు చేసిరి. కాని శనైశ్చరుఁడు ప్రతిష్ఠఁ జేయుట తరుచుగ వినము. సేతువు దగ్గర రఘురామునిచేతఁ బ్రతిష్ఠింపఁబడిన మహేశ్వరుఁడు, రాజమహేంద్రవరమున మార్కండేయునిచేతఁ బ్రతిష్ఠింపఁబడిన మహేశ్వరుఁడు, మఱియు నగస్త్యాది మహర్షులచేతఁ బ్రతిష్ఠింపఁబడిన మహేశ్వరుఁడు, శనైశ్చరునిచేత నేల ప్రతిష్ఠింపఁబడె నని నాకు వలెనె మీకును సంశయము దోఁపకపోదు. మృత్యుంజయుఁడైన సదాశివునకుఁగూడ శనిగానివలన భయము జనించియుండు ననియు నతఁడు తన్ను

బ్రతిష్ఠింపఁ గో[illegible]రినపుడు భయపడి వలదనఁజాలక యియ్యకొనియె ననియు నాశ్చర్యం దోఁచుచున్నది. అంతకన్న శంకరుఁడు శనైశ్చర ప్రతిష్ఠ నంగీకరించుటకు మఱియొక కారణ మగపడదు. ఆమంద పల్లియే మన కథానాయకుని పూర్వుల నివాసస్థానము. ఆగ్రామమున మరగణపతి యిల్లిది యని యుద్దేశించి చెప్పుటకు వీలు లేదు. ఆతని సంతతివారుండినపక్షమున మాపెద్దల స్థల మిదియని యిల్లిది యని చెప్పుకొందురు. పప్పుభొట్లవారివంశము బ్రహ్మచర్యదీక్షితుఁడై జీవనము వెళ్ళఁబుచ్చిన మన గణపతితో సమాప్తమైనందున గణపతి కక్కసెల్లెండ్రైనను లేమి దౌహిత్రులను గూడ లేకపోవుట చేతను పప్పుభొట్ల వంశస్థులకు పరంపరగా నివాసమైన నివేశనస్థలము నిర్దేశించుట కవకాశము లేకపోయినది. అట్లు నిర్దేశింపఁగలిగినపక్షమున మందపల్లివెళ్ళిన తీర్థవాసు లందఱు మందేశ్వరస్వామివారి యాలయముఁజొచ్చి తరించినట్లె గణపతిగారి గృహముగూడ ప్రవేశించి చూచి తరించుచుందురుగదా. ఆ యదృష్టమాంధ్రదేశమునకు లేదు. గతించినదానికి విచారించిన ఫలమేమి! ఆ గ్రామమం దున్న పాడు దిబ్బలలో నేదో యొకదిబ్బ పూర్వము గణపతియిల్లై యుండవచ్చును. కాదేని నేఁడు సకల సంపదలు కలిగి కలకల లాడుచున్న యిండ్లలో నొకటి మన కథానాయకునిదై యుండవచ్చును. గణపతికిఁ బూర్వ లేడుపురుషాంతరములవారు మందపల్లిలో నివసించిరి. అంతకుముందు వారి పూర్వుల నివాసస్థానము నక్కపల్లి. ఈగ్రామము తూర్పునాడున నున్నది. నక్కపల్లినుండి గణపతి పూర్వులు మందపల్లికి వచ్చుటకు గొప్ప కారణము గలదు. గణపతి కెనిమిదవ పూర్వపురుషుఁడు నక్కపల్లిలోఁ గాపురము సేయుచుండి యొకానొక దినమున భార్య మీఁద మిక్కిలి కోపగించినవాఁడై కోప మాపుకొన లేక జందెములు తెంపివేసి చెఱువుగట్టున నున్న రావిచెట్టుకడకుఁ బోయి ముండ

నము జేయించుకొని సన్యసించెను. సన్యాస మిప్పించు కెవరైన గురువు కావలయు నని శాస్త్రములో నున్నదిగదా! కోపమే పరమ గురువై యీతనికి సన్యాస మిప్పించుటచేత నీతని సన్యాస మశాస్త్రీయమని వైరాగ్యభావముచేత సంప్రాప్త మైనది కాదని గ్రామ మండలి బ్రాహ్మణు లాయపూర్వస్వాములవారిని వెలివేసి భిక్షలు చేయుట మానిరి. ఒకరు భిక్షలు చేసెడిదేమి ? నాయిల్లే మఠము. నా భార్యయే నాకు శిష్యురాలు. నా బిడ్డలే ముఖ్యశిష్యులని యా ధూర్తస్వామి కడుపుమంట కాగలేక మూఁడవనాఁడెస్వగృహంబున కరిగి భార్యను బ్రతిమాలి యొడంబఱచి సన్యాసమునకు సన్యాస మిప్పించి కోమటి వేరిశెట్టి దగ్గఱ జందెములు వెలకుఁ గొని మెడలో వేసికొని రెండుమాసములలోఁ బిల్లజుట్టుఁ బెంచికొని మరల గృహస్థుఁ డయ్యెను. ఊరివా రందఱుఁ గట్టుగట్టి కుటుంబమున కంతకు నాంక్షజేసి బాధించుటచే నక్కడ బాధ పడలేక కుటుంబ సహితముగ బహుగ్రామములు తిరిగి తిరిగి యెట్టకేలకు మందపల్లి జేరెను.

మూఁడవ ప్రకరణము.

గణపతిపూర్వులకు స్థిరాస్తికొంత కలదు. కాని యదిలోకులందఱకుఁ గల స్థిరాస్తివంటిది కాదు. లోకములో స్థిరాస్తియనఁగా భూములు మాన్యములు మొదలగునవి. పప్పుభొట్లవారికిఁగలభూములు రుద్రభూములు. మాన్యములు సామాన్యములు. ఇంకగృహవిషయము విచారించితిమా యెప్పు డెక్కడ నివాసముగ నున్న నదియె వారి గృహము. అది మొదట వారి గృహము కాకపోయినను గ్రామక్రిమ

చుండెను. వేదశాస్త్రసమ్మతమైన యట్టివృత్తి నవలంబించి వా రెన్నో తరములు సుఖజీవనముఁ జేసిరి. గణపతి పూర్వులలో నతని పితృపితామహుల చరిత్రము దక్క దక్కినవారిచరిత్రములు లభించినవి కావు. అతని పితామహునిపేరు పాపయ్య. పప్పాభొట్ల వారు వైదికు లగుటచేత సాంగవేదాధ్యయనము వారి కవశ్యకర్తవ్య మయినను వారు యజుస్సామాథర్వణవేదములను విడిచి ఋగ్వేదమునం దెనిమిదవయట్టమును విడిచి తొమ్మిదవయట్టమును మాత్రము విడువక ప్రాణపదముగ నెంచుకొని పారాయణముఁ జేయుచు వచ్చిరి. ఆయట్టములో మనపాపయ్యకుఁ గలప్రజ్ఞ యసాధారణము. పదము క్రమము జట చెప్పఁగలఁడని చెప్పనేయక్కఱలేదు. ఆయట్టములో నతఁడు ఘనాపాఠీ యని బిరుదు పొందెను. ఆరంభించినాఁ డంటే గుక్క తిరుగకుండ నోరు తడబడకుండ గొంతెండిపోకుండ గంటలకొలఁది కాలము పారాయణముఁ జేయఁ గలఁడు. అందఱుఁ జదివినవేదమే పాడినదే పాడరా యన్నట్లు తానును జదివినపక్షమున నందు గౌరవము లే దని పప్పాభొట్ల వారీయట్టమును బ్రత్యేకముగ వర్ణించిరి. వంశక్రమాగతమైన విద్య యగుటచేతను విశేషించి బుద్ధిజాతి మిక్కిలి గొప్ప దగుటచేతను పాపయ్య కొన్నికొన్ని క్రొత్తపనసలు కనిపెట్టి పూర్వు లందఱికంటె గొప్పవాఁ డనిపించుకొనెను. పాపయ్యకుఁ దక్కిన వేదాధ్యయనమన్నఁ దలనొప్పి. స్వాధ్యాయ మతనిచెవిని బడినప్పుడు "ఈ బ్రాహ్మణులు చెవిని గోసిన మేఁకలవలె యఱచు చున్నారు. వీళ్ళగొంతులు కోయ" యని విసుగుకొను చుండును. సామగాన మతనిచెవిని బడినప్పుడు "వీళ్ళపాట తగులఁబెట్ట. ఏడిచినట్లె యున్నదిరా" యని తిట్టుచుండును. అతని వేదమున కొక్కటే స్వరము, కాని యిన్నిస్వరములు లేవు. అందుచేత

నతనికిఁ దక్కిన స్వరములు సామము, నసహ్యములు. బ్రాహ్మణు లందఱు యజన యాజనాధ్యయనాధ్యాపకదానప్రతిగ్రహషట్కర్మ నిరతులైనను నియోగులు మొదలగువారు యజ్ఞముచేయుటయె గాని చేయించుటమానిరి. వేదాధ్యయన మాచరించుటయె గాని యధ్యాపకత్వము మానిరి. దాన మిచ్చుటయె కాని పుచ్చుకొనుట మానికొనిరి. వైదికు లీ షట్కర్మలు గూడ తమయందు నిలిపి కొనిరి. నియోగులకున్న యధికారము తన కెందుకుండఁ గూడ దని శంకఁదెచ్చుకొని షట్కర్మలలోఁ గొన్నికర్మలు తానుగూడ విడిచి కొన్నిఁటిని మాత్రమె గ్రహించెను. ఎన్నివిడిచి యెన్ని గ్రహించె నని మీ రడుగవచ్చును. అయిదింటిని విడిచి యాఱవది యగు దాన ప్రతిగ్రహము మాత్రము గ్రహించెను. ఆఱింటిలో మూఁడు కర్మలనువిడిచి మూఁడింటిని స్వీకరించుటకు నియోగుల కెంతయధికారముకలదో, యేడింటినివిడిచి యొక్కటి స్వీకరించు టకు మాపాపయ్యకు నంత యధికారమె కలదు. ఇట్లనుటచేతఁ దక్కినపంచకర్మల నతఁ డెన్నఁ డాచరింపలేదని మీ రనఁగూ డదు. ఆతఁడు కొన్నిదానము లప్పుడప్పుడు చేయుచు వచ్చెను. అందు ముఖ్యమైనవి రెండు కలవు. పితృదేవతలకు పిండప్రదాన మొకటి; తనమిత్రుల కప్పుడప్పు డిచ్చు పొగచుట్టల దానము రెండ వది. యజ్ఞములు చేయలేదని లోకమున నతనికి నిష్కారణముగ నప్రతిష్ఠ సంభవించినది. కాని నిష్పక్షపాతముగ నతనిచరిత్ర వ్రాయుదుమేని నతఁ డొకయజ్ఞముఁ జేసినాఁ డని వ్రాయక తప్పదు. ఆయజ్ఞమునిమిత్త మతఁ డెవ్వరిని బాధింపలేదు. పందిళ్ళు పాకలు వేయలేదు. విశ్వప్రయత్నములు చేయలేదు. యథావిధిగ నతఁడె రెండవకంటివాఁ డెఱుఁగ కుండ జేసెను. అది యెట్లు చేసె నందురో వినఁడు. అతఁ డిరువదియేండ్ల వయసుగల వాఁడై

నప్పుడు తల్లి రాత్రి రొట్టె. కాల్చుకొనవలయు నని చిరుపప్పు చేటలోఁబోసి వాకిటిలో నెండఁబెట్టు కొనెను. ఒక మేఁక యెక్కడి నుండియో వచ్చి యాపప్పు దినుచుండెను. చత్వారముచేతఁ దల్లి కది కనంబడలేదు. పాపయ్య వీధిలోనుండి వచ్చి యది చూచి మేఁకను గొట్టుటకు మంచికఱ్ఱ దొరకకపోవుటచేఁ గాలు సాచి సత్తువకొలఁది నొక తన్ను దన్నెను. ఆ మేఁక పదిగజములదూర మునఁ బడి యొక్క యఱ పఱచి వెంటనే చచ్చెను. ఆవార్తవిని మేఁక యజమానుఁ డగుగొల్లవాఁడు తనచుట్టములగుంపుతో వచ్చి యింటిమీఁదఁ బడి మేఁకకు జరిగినంతపని పాపయ్యకుఁ జేయ వలయునని సంకల్పించెను. కాని పలువురు చేరి మేఁకకు నాలుగురూపాయలు వెల గట్టి చెరిసగము జెడుదుమని తునితగవు జేసి పాపయ్య చేత రెండురూపాయలు వాని కిప్పించి పంపిరి. యజ్ఞములో గూడ మేఁకలను జంపుటయె ప్రధానము గనుక పాపయ్యకు యజ్ఞఫలము చేకూరిన దని చెప్పవచ్చును. లోకుల నందఱఁ బీడించి ధనము సంపాదించి పండిళ్ళు పాకలు వేయించి యన్నము దినకుండ మల మలమాడి కుమ్మరులచేత మేఁకలను జంపించి కుండలములు వేసి కొన్నవానికి యజ్ఞఫలము దక్కి పాపయ్యకు దక్కకపోవునా? బ్రహ్మయు ఋత్విక్కులు నుద్గాతయు హోతయు నధ్వర్యుఁడు మొదలగువా రక్కఱలేకుండ మంత్రములతోఁ బనిలేకుండ నతఁడు గాంధర్వవివాహమువలె నట్టహాసము చేయక రహస్యముగయజ్ఞము చేయుటచే లోకు లతని హీనునిగఁ జూచుచున్నారు. తక్కువ వర్ణమువారైనకుమ్మరులచేత ముక్కు చెవులు మూసి బాధపెట్టి చంపించుటకంటె స్వచ్ఛమైన బ్రాహ్మణుఁడు స్వయముగ జంపుటవలన మేఁకకు సద్యోమోక్షము సంప్రాప్తమై యుండు నని యొక్కఁడైన నాలోచింపఁడుగదా. లోకములో న్యాయములేదు.

ప్రస్తుతము లోకు లేమన్నను పాపయ్యకు భవిష్యత్కాలమున నైన రావలసినకీర్తి రాకపోదు. 'విద్యావిత్తకరీ' యని యొక లోకోక్తి కలదు. పాపయ్య నేర్చికొన్న తొమ్మిదవయట్టముగూడ నొకా నొకవిద్యలోఁ జేరినదేకావున దానివలన నతఁడు ధనసంపాదన మప్పుడప్పుడు చేయుచుండెను. పచ్చనితోరణము గట్టుకొని యెవరు వివాహము చేసికొన్నను బాపయ్య నాఁడొక యవధానిబిరుదమో దీక్షితబిరుదమో సోమయాజిబిరుదమో వహించి యచ్చోటికిఁ బోయి సంస్కారులతోఁబాటు తన్నుఁగూడ సత్కరింప వలసినదని కోరుచుండును. అట్లువారు సత్కరింపనిచోఁ జిన్ననాఁటనుండియు ముష్టిజీవనమున కలవడి యుండుటచేత ముష్టియుద్ధము ప్రారంభించి పురోహితులను గన్యాప్రదాతను వధూవరులను తద్బంధుగణమును దననవమాటముతోఁ గొంతవఱకు దీవించి తోరణములు తెంపి పెండ్లిపందిలి యుద్ధభూమిగ మార్చి తనపంతము నెగ్గించుకొని సంభావన దండిగ లంకించుకొని వచ్చును. అందుచేత నతనికి బండ బూతుల పాపయ్య యనియు, పిడిగుద్దులపాపయ్యయనియు రెండు పౌరుషనామములు కలిగినవి. అధికారుల యిండ్లచుట్టుఁ దిరిగి వారి సేవకుల నాశ్రయించి చుట్టముల నాశ్రయించి పండ్లు పంచదారచిలు కలు మొదలగు సూడిద లంపి యధికారుల యనుగ్రహమునకుఁ బాత్రులై కొంద ఱీకలియుగమున బిరుదుల కనర్హులయ్యు సంపాదించు చుందురు. పాపయ్య సంపాదించిన బిరుదము లట్టివి కావు. బిరుదుల నిమిత్త మతఁడొకరి నెన్నఁడాశ్రయింపలేదు. అతనికంఠ శక్తియు భుజశక్తియు నతనికి బిరుదులు సంపాదించిపెట్టినవి. కాని యధికారుల కటాక్షవీక్షణములచేతఁ బ్రసాదింపఁబడినవికావు. పాపయ్యకుఁ దొమ్మిదవయట్టము నేర్పిన గురు వెవ్వరై యుందురని మీకు సందియము తోఁచవచ్చును. అతనికి గురువే లేఁడు.

గురుకులవాసము లేకయె శుశ్రూషాపీడ లేకయె యెందఱు బహువిద్యలలో నధిక ప్రౌఢులై రని మనము విచుచుంను టలేదు? తనవిద్యావిషయమున మన పాపయ్యయు నట్టి పట్టికలో జేరఁ దగినవాఁడె సుఁడీ. ఇట్లనిన మీరు నమ్మక నవ్వ మొదలు పెట్టెదరు. వాల్మీకి ఛందో వ్యాకరణాది లక్షణజ్ఞానము గురుబోధ లేకయే సముపార్జించెనన్న మీరహహా యనినవ్వి యానందింతురు. భాగవత ప్రణేత యగుపోతరాజు సహజపాండిత్యముగలవాఁడనిచెప్పి నంతమాత్రముననె విశ్వసింతురు. సహజపాండిత్య మొకరిసొమ్మా? ఈవిద్య యావిద్య యనకుండ సకలవిద్యలలో వారివారి పూర్వజన్మ వశముననో యదృష్ట వశముననో సహజపాండిత్య ముదయించు చుండును. కాఁబట్టి పక్షపాతముమాని పాపయ్యకుఁ గూడ విద్యలో నట్టి ప్రతిభావిశేషము గలదని నమ్ముఁడు. అతని పుణ్యమేమో కాని పాపయ్యకు బాల్యము నుండియు నద్వైతసిద్ధి సహజముగానె గలిగి నది. ఎంతెంతో శ్రమపడి యెంద ఱెందఱో గురువులకు శుశ్రూష జేసి శంకరభాష్యసమేతముగ దశోపనిషత్తులు భగవద్గీతయు బ్రహ్మ సూత్రములు వర్ణించిన మహానుభావులకె స్థిరమైన యద్వైతభావము వార్థకమండైనఁ గలుగుట మిక్కిలి కష్టము. అట్టిమెడ నూనూగు మీసాలు మొలక లెత్తకమునుపు నపనయన మైనఁ గాకమునుపె గోణమును విడిచి యుపవస్త్రమును గట్టకమునుపె మాటలైనను సరిగ రాకమునుపె స్వవస్తు పరవస్తు భేదజ్ఞానము నశియించి పరవస్తువు లన్నియుఁ దన వస్తువులే యను నద్వైతభావము గలుగుట యెంత గొప్పమాట. అది యెంతటివానికి లభియించును! పూర్వయుగము లలో నట్టిబుద్ధి యనేకుల కుదయించి యుండవచ్చును. కాని కలి యుగములో నది మండపల్లి నివాసుఁ డగుపప్పాభొట్ల పాపయ్యకే సిద్ధించినది. నాణెములు కానీ చెంబులు కానీ వెండిగిన్నెలు కాని

వస్త్రములు కానీ తినియెడు పదార్థములుకానీ యతని కంటఁ బడెనా యెప్పుడో యవి యతనిచేతఁ బడినవే. ఈ వస్తువుఁ దీసితివా యని యెవరైన నడిగిన పక్షమున నతఁడు స్పష్టముగ లేదని చెప్పుఁ చుండును. లే దనుటలో నతఁ డబద్ధమాడె నని యెవ్వరు దలంపఁ గూడదు. "గజం మిథ్య పలాయనం మిథ్య" యన్నట్లు వస్తువు లేదు. దొంగతనము లేదని యతని యభిప్రాయమై యుండవచ్చును. లోకులు కాకులవంటివారు కదా. పాపము పాపయ్య లేమిచేతనో యద్వైతభావముచేతనో హస్తచాపల్యముచేతనో చిరతరాభ్యాసము చేతనో హస్తలాఘవముఁ జూపు నభిలాషచేతనో గ్రామములలో నున్న కొన్నియిండ్లలోఁ జొరఁబడి కొన్నివస్తువులను గ్రహించినాఁ డనుకొనుఁడు. గ్రామవాసులు తమ పుట్టియంతయు మునిఁగిపోయినట్లు పెద్దగోలచేసి యతని నల్లరిపెట్టఁ దొడఁగిరి. పరుల వస్తు వేమిటి మన వస్తు వేమి టను నద్వైతభావము పాపయ్య కున్నట్టు వస్తువులు మన యింట నుండిననేమి, పాపయ్యయింట నుండిన నేమి యనునద్వైతభావము గ్రామవాసులలో నొక్కరికైన లేకపోయినది. అందు చేతనే వీరు పాపయ్యతోఁ బోల్పఁ దగరు. అట్టి యద్వితీయ భావ మతని కుండుటచేతనే పాపయ్యచరిత్ర మక్షర రూపముగ నాంధ్ర దేశమునఁ బ్రచార మగుచున్నది. అట్టి భావము శూన్యమగుట చేతనే మందపల్లిగ్రామవాసులలో ఘనులగు తర్కవ్యాకరణజ్యోతిష శాస్త్రపండితు లున్నను వారిచరిత్రములు లిఖింపఁబడు చున్నవా? గ్రామస్థులు చేసిన యల్లరివలన వివాహయోగ్య వయస్కుఁడైన పాపయ్యకుఁ బిల్ల నిచ్చుట కెవ్వరు రారైరి. తనకుమారునకు వివాహము కాలేదని విచారించి విచారించి తల్లి కాలధర్మము నొందెను. అధీనము తప్పిన యాడుపడుచులు గాని మఱి యేయాఁడు దిక్కుగాని లేఁపోవుటచే నతఁ డప్పుడప్పుడు వంటఁ జేసికొనవలసి

వచ్చెను. బ్రాహ్మణార్థములవలన నతఁడు పొట్టబోసికొనఁ గలఁడు. కాని యందు మూఁడునాలుగుచిక్కులు సంభవించినవి. మున్నూట యఱువది దినములు భోక్తయై యుండుటకు గ్రామమున మూఁడు వందలయఱువది శ్రాద్ధములు లేవు. ఆకాలమున మందపల్లిలో నున్న బ్రాహ్మణగృహములే నలువది యేఁబది. ఇంటికి రెం డాబ్దిక ములకన్న నెక్కువగా నుండవు. అదియుఁ గాక ప్రతివారు పాప య్యనే పిలువరు కదా. పిలువఁదలంచుకొన్నవారు గూడ నితఁడు కలహప్రియుఁ డని యెంచి పిలుచుట మానిరి. వస్త్రమీయలే దనియొ దక్షిణ స్వల్పముగా నిచ్చినా రనియొ నితఁడు గృహయజ మానితోఁ దరుచుగాఁ దగవు లాడుచుండును. ఇతఁడు కంఠమెత్తి కేక లారంభించెనా భూదేవతవలెఁ గాక శ్రాద్ధమునకు వచ్చినవిశ్వదేవతలు పితృదేవతలు గూడ గడగడ వడఁకి పాఱి పోవుదు రని గ్రామస్థుల యభిప్రాయము. అది యటుండ నిమం త్రితుఁడై పాపయ్య శ్రాద్ధభోజనముఁ జేసి వెళ్ళునపుడు గృహయజ మానుల కన్నుబ్రామి యేదో వీలు చూచుకొని గిన్నెయొ పంచ పాత్రియొ పట్టుకొని పోవును. శ్రాద్ధభోక్తల కుదకకుంభదానముఁ జేయ వలయు నని శాస్త్రమం దుండినను సాధారణముగ నట్లెవ్వరుఁ జేయకపోవుటచే పితృకర్మలు చేయువారి కుదకకుంభదానఫలముఁ గల్పింప వలయునని పాపయ్య యేవో పాత్రలు పట్టుకొనిపోవు చుండు నని పౌరబ్రాహ్మణులు తెలిసికొనలేక యతనిని భోక్తగఁ బిలుచుట మానుకొనిరి. పిలువకపోవుట కిదియె ప్రధానకారణమని చెప్పవచ్చును. ఉపకారణము గూడ మఱియొక టున్నది. అదిచెప్పక పోవుట దోషము కావునఁ జెప్పఁబడుచున్నది. పాపయ్య గంభీర కాయుఁడు. ఆకారమునకుఁ దగిన యాఁకలి యాఁకలికిఁ దగినభోజన సౌష్టవము నతనియందుఁ గలవు. అగ్నిహోత్రమునందు సర్వము

హుత మైనట్లె యతనిజఠరాగ్నియం దేది వేసినను వెంటనే హుతమై పోవును. అదృష్టవశమున నట్టిగాఢ జీర్ణశక్తి యతనికిఁ గలిగినందుకు సంతసింపక గ్రామవాసులలోఁ గొందఱు విరోధముచేతను గొంద ఱసూయచేతను "ప్రతిమనుష్యునకు గర్భమందే జీర్ణకోశ ముండును, గాని పాపయ్యకు జీర్ణకోశము శరీర మంతటఁ గల" దని పరిహాసాస్పదముగఁ బలుకఁజొచ్చిరి. కొందఱు దయ్యపుతిండి యనిరి. అభాగ్యుల కాఁకలియెక్కువయని మఱికొంద ఱాడిరి. చాటుచాటుననె గాని యతనియెదుటఁ బడి యెవ్వ రిట్టిమాట లన లేదుసుఁడీ. అతఁడు భోక్తగా వెళ్ళిన గృహమున శ్రాద్ధమునకు ముఖ్యమని పనసకాయకూరవండిన పక్షమున వండిన కూరంతయుఁ బాపయ్యయె భక్షించును. అతనిని బిలిచినప్పుడు గృహయజమానులు గారెలు నరిసెలు సంతర్పణమునకు వండుకొన్నట్లు వండుకొన వలయును గాని సూక్ష్మముగఁ జేసికొనుటకు వీలు లేదు. పైతృకములయందు సుష్ఠుగా భోజనము చేయువారిని బిలిచి పెట్టుట యెవరో కొందరికి సంతోష మైనను జనసామాన్యమున కట్లుండదు గదా. పాపయ్యకు శ్రాద్ధభోజన మరుదగుట కిది యొక హేతు వయ్యెను. పాపయ్యయొక్క జీర్ణశక్తిని విస్పష్టముగఁ దెలియజేయుట కతనిబాల్యమునఁ దండ్రి జీవించియున్నపుడు జరిగిన యొకవృత్తాంత మిందుఁ దెలుపుట సముచితము. భావికాలమున నేదోవిషయమున మహాప్రజ్ఞావంతు లగువారియం దాలక్షణాంకురములు బాల్యమునందె పొడసూపు చుండును. పాండవ సింహమని చెప్పఁదగిన భీమసేనుఁడు దుర్వారభుజబల శోభితుఁ డనియెల్లవా రెఱుఁగుదురు కదా! ఆమహాబలసంపత్తి యతనిబాల్యమునందే గోచరమయ్యెను. కుంతీదేవి భీమసేనుఁడు పుట్టిన పదియవనాఁడు శుద్ధిస్నానముఁ జేసి కొడుకు నొడిలో వైచి

కొని దేవతాదర్శనమునకుఁ బోవుచుండెను. అప్పు డొక బెబ్బులి యామెం దఱిమెను. పాండురాజు పులి నొక యమ్మునఁగూలనేసెను. కాని యాలోపున నామె భయపడి విసవిస పరుగిడ నారంభించెను. ఒడిలో నున్న భీమసేనుఁడు నేలఁ బడియెను. నెత్తురు గుడ్డగుటచే బిడ్డాదెబ్బకు మృతినొందె నేమో యని కుంతీదేవి తత్తరపడియెను. కాని బాలుని దేహము కందలేదు. నలుగలేదు. అతని శరీర సంపర్కముగలిగినంతమేర యాఱాతినేల పిండిపిండియయ్యెను. ఆతని యందువలెనే పాపయ్యయందుఁ గూడ బాల్యమున నతని జఠరాగ్ని శక్తిద్యోతక మయ్యెను. దృష్టిదోషము తగలు నని తండ్రి యితరుల కది వెల్లడింపలేదు. పాపయ్య పదియాఱేండ్ల ప్రాయము వాఁడైనప్పుడు తండ్రి కుమారుని వెంటఁబెట్టుకొని కోనసీమలోఁ బ్రయాణము సేయుచుండెను. చలిదికూడు లేక పాపయ్య యొక్క యడుగైన నడువఁ జాలఁడు. అందుచేఁ దండ్రి యొక నాఁడొక యూర నొక యింటి కరిగి "అమ్మా! మాకుఱ్ఱవానికి రవంత చలిదియన్నము దొరకునా" యని యడిగెను. కుఱ్ఱవాఁడు చలిది యన్నము గోరుచున్నాఁ డనఁగానే సాధారణముగ లే దనువా రుండరు. పాపయ్య పదియాఱేండ్ల వయసు వాఁడైనను నప్పటికే తండ్రివలె చెయ్యెత్తు మనుష్యుఁ డయ్యెను. అయినను జనకుని దృష్టి కతఁడు కుఱ్ఱవాఁడె కదా. కుఱ్ఱవాఁ డనుటచేత గృహయజమా నులు వచ్చినవాఁడు పదియేండ్లవాఁడో యై దేండ్లవాఁడో యను కొని "యయ్యో! నాయనా పిల్లవానికి పట్టెడు చలిదియన్నము బెట్టమా. అదిగో చల్దివణ్ణాలగది. పెట్టికొనితినుమనుఁడు. లేదామీరు పెట్టవచ్చు" నని యాగదిఁ జూపిరి. ఆజానుబాహుఁడైన తన కుమారునిఁ జూచినపక్షమున వారు చలిదియన్నముఁ బెట్ట రేమో యనుభయమున నతఁడు మొదట వానిని వీథిలోనెయుంచి వెళ్ళి గది

చూచి వచ్చినతరువాత నింటిలోని యాడువాండ్రుపనులసందడినున్న పుడు దొడ్డిదారిని తనబిడ్డనిఁ దీసికొనిపోయి యాగదిలోఁ బ్రవేశ పెట్టి యన్నము బెట్టికొని తినుమని చెప్పెను. ఆగదిలో మానెడుబియ్యపన్న ముండెను. దానికి సరిపడిన యూరుఁగాయలు పచ్చళ్లు నుండెను. తవ్వెడు గేదెపెరు గుండెను. రమారమి గిద్దెడు పేరిన నేయి యుండెను. పాపయ్య యాయన్న మంతయువడ్డించుకొని యూరుఁగాయలు పచ్చళ్ళు నేయి పెరుగు మిగులకుండ సుష్టుగాఁ దిని యెప్పటియట్లు దొడ్డిదారిని వెలుపలకు వచ్చెను. భోజనసమా ప్తమైన తరువాతఁ దండ్రి యా యింటి యాఁడువాండ్రనడకుఁబోయి "అమ్మా! మీపయవలన మావాఁడు చలిదియన్నము దిన్నాఁడు. నేనుసెలవుపుచ్చుకొని వెళ్ళుచున్నా" నని చెప్పి వెళ్ళిపోయెను. ఆయింట నైదాఱుగురు చిన్నబిడ్డలుండిరి. ఆబిడ్డ లందఱకు సరిపోవు నని వారాయన్న మక్కడ దాఁచిరి. పాపయ్య తిని వెళ్ళిన గడియ సేపటి కాయిల్లాలు చలిదియన్నముఁ బిల్లలకు పెట్టనెంచి యాటలు మానిపించి వాళ్ళనందఱ నక్కడకుఁ బిలిచి కంచము పెట్టి యన్న పాత్రఁ జూచునప్పటి కందులో నొకమెతుకైన లేదు. అయిల్లాలు తెల్లబోయెను. కుక్క తినిపోయెనేమో యని మొదట ననుకొనెను. కాని యూరుఁగాయలు పచ్చళ్లుగూడ లేకపోవుటచే నట్లనుకొనుటకు వీలు లేకపోయెను. ఇంటిలోనున్న యాఁడువాండ్రింద ఱక్కడఁజేరి కొంతసేపు మీమాంస చేసి తుదకు బ్రాహ్మణ కుమారుఁడే తిని యుండునని నిశ్చయించి కుఱ్ఱవాఁడు మానెడు బియ్యపన్నముఁదిన్నం దుకు మనసులో మిక్కిలి యాశ్చర్యముపొందియు బ్రాహ్మణునకుఁ బెట్టిన తిండికి కంటగించుకొనుట దోష మనినోరుమూసికొని యూర కుండిరి. పాపయ్యచరిత్రముఁగూడ భీమసేనునిచరిత్రమువంటిదే. ఆఁక లిలో నిద్దఱు వృకోదరులే. ఇద్దఱు మహాకోపనులే. అయినను

వేదవ్యాసునివంటి మహాత్ముఁడు తనరచనా చమత్కృతి నంతయుఁ జూపి వర్ణించుటచే భీమసేనుఁడు వంద్యుఁ డయ్యెను. అట్టిమహాకవి యాదుకొనకపోఁబట్టి పాపయ్య నింద్యుఁ డయ్యెను. ఇట్టియితిహాసము లనేకములు కలవు. కాని గ్రంథవిస్తరభీతిచే నవి స్పృశియింపక కథలోని ముఖ్యాంశమే వర్ణింపఁబడును. "తల్లిచచ్చిన జిహ్వాచచ్చు" ననునార్యోక్తి పాపయ్యకడ నిశ్చయమైనది. సరిగా నతని కన్న మమర లేదు. వండుకొను కష్ట మటుండఁగా ముమ్మారు మూఁడు మానికెల బియ్య మతనికిఁ గావలెను. ఆతండులములు, వానికిఁ గావలసిన రసవర్గములు సంపాదించుట స్వగ్రామమున దుస్సాధ్య మయ్యెను. అదియునుం గాక వివాహముఁ జేసికొని వంశము నిలుపు కొనవలయు నని గట్టిసంకల్ప మతనికిఁ గలిగెను. అతనికి విద్యఁ జూచి పిల్ల నిత్తురా? ధనముజూచియిత్తురా? మళ్ళ రూప్యములు జూచియిత్తురా? వరదిట్టము కావలసినంత యున్నది. కలియుగములో నరుని దౌర్భాగ్యము, సాంప్రదాయముఁ జూదువా రెవ్వరు? ఎల్లవేద వాండ్ర విషయములో నయినట్లె పాపయ్య విషయమున వివాహము దుర్వైకసాధ్యమయినది. దుర్దినము స్వగ్రామమున సంపాదించుటకుఁ దగినయనువులు లేవు. కాఁబట్టి దేశాంతరములకుఁ బోవలయు నని పాపయ్యకు దృఢసంకల్పము గలిగెను. ఏ దేశమునకుఁ బోవలయునని యతఁడు మనస్సులో మీమాంస జేసెను. కాశికిఁ బోవలయునని కొంతకాల మతఁడు తలంచెను. కాశిలోని సత్రములలో యథేచ్ఛముగ భోజనము జరుగును. కాని వివాహమునిమిత్తము కావలసినధన మచ్చట దొరకదని యతని కెవ్వరో చెప్పి పునహాపట్టణమందుఁ దెనుఁగుబ్రాహ్మణులమీఁద నారద మెక్కువగల దక్కడికిఁ బొమ్మని హితోపదేశముఁ జేసిరి. ఆమాట యతనికి నచ్చెను. తోడనె పునహాకుఁ బ్రయాణ

మయ్యెను. ఆతనియింట లోకమంతటగల పంచభూతములేగాని యితరమైన యాస్తియేమియులేదు. పాత్రలు మృణ్మయపాత్రలు. త్రాగుట కొకయిత్తడిచెంబు మాత్రమున్నది. కట్టుకొనుటకు మూఁడు నాలు గంగవస్త్రములు కలవు. ఎన్నోతరములనుండి వంశపారంపర్యముగ వచ్చుచున్న యక్షయపాత్ర యుండ వలయును గదా. అది యేమైనదని మీకు సందియము దోఁచవచ్చును. పాపయ్య బద్ధకముచేత నక్షయపాత్రవ్యాపారము మానికొనెను. వ్యాపారము మానికొన్నను జాలకాలమునాఁటనుండి యచ్చివచ్చినపాత్ర దాచకూడదాయని మీకు సందేహము దోఁచవచ్చునేమో? అది తలయుత్తరించుకొని పోవుసమయమున కుపయోగింపఁబడెను. చీట్లపేకలో వచ్చినదండుగ నిచ్చుకొనుట కాపాత్ర యుపయోగింపఁ బడెను. ఇది యొక్కటియెగాదు. అప్పుడప్పుడు హస్తలాఘవముచే నతని వశమగుచుండిన రాగి కంచుచెంబులు పంచపాత్రలు మొదలగునవి గూడ తన్నిమిత్తమె వినియోగింపఁబడెను. పెట్టెలు లేవా యని మీరడుగ వచ్చును. పెట్టెలలో దాఁచవలసిన వస్తువులు లేనప్పుడు పెట్టె లెందుకు? అందుచేత నతనికి సర్దుకోవలసిన సామగ్రులు లేకపోయెను. చిఱకాలమునుండి బూజుపట్టుచున్న కృష్ణాజినమును దర్భాసనమును దీసి పాపయ్య బూజు దులిపి యెండలో వేసి దర్భాసనమును కృష్ణాజినములో వేసి కట్టి యొకనాఁడు తెల్లవారు జామున నాకృష్ణాజినమును భుజముమీఁద వేసికొని యిత్తడిచెంబు మూతికి గట్టిన యంగవస్త్రమును నడుమునకు గట్టుకొని ప్రాతధోవతి గట్టుకొని తలకొక ప్రాతయుత్తరీయమును జుట్టుకొని పునహాకుఁ బయన మయ్యెను. మార్గమధ్యమున నతఁడు గావించిన విచిత్రవివాదములు, హస్తలాఘవములు, లీలలు వర్ణింపఁదొడఁగినపక్షమునఁ బాఠకులకు విసుఁగు పుట్టు ననుభయమున నవియెల్ల

మానవలసి వచ్చెను. బ్రాహ్మణుఁ డెంత పేదవాఁడైనను జేత నొక నేబుసయితము లేకుండ సేతుహిమాచలపర్యంత మగు దేశమంతయుఁ దిరిగి రావచ్చును. ప్రతిపట్టణమునసత్రములున్నవిగాని కొన్ని సత్రములలో నొకపూట మాత్రమె భోజనము పెట్టుదురు. కొన్ని సత్రములలో రెండుపూటలు నిరుప్రొద్దు భోజనము పెట్టుదురు. కొన్ని చోట్ల భోజనము కాక కానియొ రెండుకానులో దక్షిణగూడ నిచ్చెదరు. దక్షిణదేశమున కొన్ని సత్రములలో బాటసారులగు వితంతువులు రాత్రి రొట్టెకాల్చుకొనుటకు పిండి గూడ నొసంగుదురు. సత్రముల మాట యటుండఁగా బ్రాహ్మణుల కన్నము లేదను బ్రాహ్మణ గృహస్థులు సాధారణముగ నుండరు. కాఁబట్టి పాపయ్య చిల్లిగవ్వ చేత లేకుండ సుఖముగ వెళ్ళఁగలిగెను. ప్రాతఃకాలమునందు లేచి జాముప్రొద్దెక్కువఱ కతఁడు నడచి యొక గ్రామముఁజేరి యచ్చట సత్రమున్న సత్రమును, లేనిచో సామాన్యగృహస్థులయిండ్ల భుజించి సుఖముగ నిద్రించి మరల జాముప్రొద్దువేళ బయలుదేఱి నడచి యేయూరికడ సాయంకాల మగునో యచ్చట బస జేసి యెవరి యింటనో భుజించి మరల వేకువను లేచి పయనము సేయుచుండును. ఈవిధముగ నతఁడు నాలుగుమాసము లగునప్పటికి సుఖముగ శ్రీమంతులగు పీష్వాలకు మున్న రాజధానియైన పునహాకుఁ జేరెను. పునహాలోఁ బూర్వకాలమున బాజీరాయఁడు మొదలగు పీష్వాలు రాజ్యధురంధరులై యున్నకాలమున బ్రాహ్మణపూజ విశేషముగ జరుగుచుండెను. అందు వేధాధ్యయన సంపన్నులకు జరిగెడుపూజ మిక్కిలిమెండు. భరతఖండ మంతటిలోను కృష్ణాగోదావరీ తీరవాసులగు బ్రాహ్మణులు మిక్కిలి గంభీరముగ నుదాత్తానుదాత్తస్వరితస్వరములు తప్పకుండ నపశబ్దము రాకుండ స్వచ్ఛముగ మనోహరముగ వేదము చదువఁగలరని మహారాష్ట్రదేశమున గొప్పవాడుక

గలదు. ఆప్రఖ్యాతి కాంధ్రబ్రాహ్మణు లర్హులనుటకు సందియము లేదు. హిందూదేశమున ననేకభాష లున్నను నందులో ననేకములు సంస్కృతములే మాతృకగ గ్రహియించినను నాంధ్రభాషవలె నవి సర్వవిషయము సంస్కృతము ననుకరింపలేక పోయినవి. అక్షర ములదగ్గఱనుండి తెలుఁగుభాష సంస్కృతము ననుసరించిన కారణ మున నాంధ్రులు సంస్కృత శబ్దములను స్వచ్ఛముగ నిర్దుష్టముగ నుచ్చరింపఁగలరు. తక్కినవా రట్లుచ్చరింపలేరు. వంగదేశీయుఁడు వేద మనఁబోయి బేద మనును. సద్గుణ మనఁబోయి షద్గుణమనును. ఓఢ్రదేశీయుఁడు జనకుఁ డనుటకు జొనొకొయనును. ఇట్లె ఘూర్జర మహారాష్ట్రబ్రాహ్మణవిడకర్ణాటాదిభాషలు సంపూర్ణభాషలు గావు నా యాదేశస్థులనాలుకలు సంస్కృతోచ్చారణమునకు సరిగా నలవడి యుండలేదు. సంస్కృతోచ్చారణమున కాంధ్రులే దక్షులు. ఆ కా రణంబున శ్రీమంతులగుపీష్వాలు, వారినింబట్టి మహారాష్ట్రులుండఱుఁ ద్రిలింగదేశబ్రాహ్మణుల నోటనుండి వేదమును వినవలయు ననియు శ్రౌతస్మార్తాదికర్మలను జరిపించుకొనవలయు ననియుఁ గుతూహల ము గలిగియుండి యట్టివారు లభించినప్పుడు వారిని రావించి సకల విధముల సమ్మానించి సకలపూజల సత్కరించి పంపుచుందురు. అందుచేత నాంధ్రబ్రాహ్మణులలో స్వాధ్యాయవేత్తలు శ్రౌత స్మార్తప్రయోగదక్షులు. శ్రీమంతులకాలమునను శ్రీమంతులరాజ్య మస్తమించినవెనుకను గూడ పునహాసతారాలకుఁ బోవుచుందురు. అట్టివేదవేత్తలుఁ గర్మిష్ఠులుఁ బోవుచోటికి పొట్ట కోసి కంచుకాగ డాల వెదకినను నొక్కయక్షరము ముక్కయైనఁ గనఁబడని పాపయ్య యేమిచేయవలయు నని వెళ్ళి యుండునో గదా యని యెల్లవారికి సందియము దోఁచకమానదు. ఘూర్జరులు మహారాష్ట్రులు మిక్కిలి దాతలనియు, గోదావరీ తీరబ్రాహ్మణుఁడు వివాహార్థము యాచిం

చినతోడనె రూకలవర్షము గురియుననియు నందువలన సులభముగ వివాహము జేసికొనవచ్చు ననియు నితరులవలన విని యతఁడు నమ్మెను. అదియును గాక యాదేశమున బ్రాహ్మణభోక్తకు సయితము రూపాయకుతక్కువదక్షిణ నియ్యరనియు నందుచేత బ్రాహ్మణార్థములు చేసియె గొనెసంచెడు రూపాయలు సంపాదింపవచ్చు ననియు నతని కాశపుట్టి వెళ్ళెను. ఎట్టెటో యతఁడు పునహా జేరెను. చేరి సత్రములలో భోజన మారంభించెను. ఆవకాయ మాగాయ మొదలగు నూరుఁగాయలను గోంగూరపచ్చడి తోటకూర బచ్చలకూర మొదలగు పులుసులు బెల్లపుటరిసెలు మినుపగారెలు పీశెబూరెలు గుమ్మడికాయధప్పళము మొదలగు తెరఁగు వంటకములకు రుచిపడిన పాపయ్యనాలుకకు మహారాష్ట్రిదేశపురొట్టెలు పలుచని పప్పులు కారము లేనిపచ్చళ్ళు మొదట నచ్చినవికావు. పచ్చిమిరపకాయ కారమున కతఁడు మొగమువాచి స్వయముగఁ జేసికొని మహాపదార్థముగ దాచుకొని భోజనమునకు వెళ్ళినప్పుడు పొట్లము గట్టి తీసికొనిపోయి పంక్తిలో నున్నమహారాష్ట్రులు నివ్వెరపడి చూచి యితఁడు బ్రాహ్మరాక్షసుఁడని తలంచున ట్లది కలుపుకొని తినుచుండును. కొన్ని నెల లగునప్పటి కతఁడు మహారాష్ట్రిభోజనమున కలవడెను. అలవాటు పడినతరువాతమహారాష్ట్రి లెవ్వరతని కందలేదు. పునహా వెళ్ళినతరువాత రెండుమూఁడుమాసముల కతఁడు వివాహము నిమిత్తము యాచన నారంభించెను. చరువుసంధ్యలు రాని శుంఠ యగుటచే రెండణాలు నాలుగుడబ్బులు రెండుడబ్బులు చేతిలోఁ బెట్టినవారేకాని రూపాయ లిచ్చినవా రెవ్వరులేరు. దమ్మిడీకాసులె కాని పెద్దకాసు లతనిచేత పడలేదు. ఆకారణమున తాను విన్నట్లు మహారాష్ట్రులు గొప్పదాతలు కారని నమ్మక తోఁచెను. అందుచేతనో మఱి యెందుచేతనో మహారాష్ట్రులమీఁద నతనికిఁ గొంత

యనిష్టము గలిగెను. "మహారాష్ట్రులు మగవాండ్రు నాడువాండ్రు నను భేదము లేకుండ నందఱు వితంతువులె. మహాష్ట్రుల కాచార వ్యవహారములు లేవు. వీళ్ళు వట్టికూదుర్లు. పంక్తిబాహ్యు లని చాటుచుఁ దనమిత్రులతోఁ జెప్పుచుందురు. ఏల యని వారడిగిన నతఁ డిట్లు ప్రత్యుత్తరమిచ్చెను." వితంతువులెగాని మన దేశములో రొట్టెలు తినరు. ఈదేశములో మగవాండ్రుగూడ రొట్టెలుతిందురు. కాన వారు గూడ వితంతువులె. భోజనకాలమందు మహారాష్ట్రులలో దృష్టిదోషములేదు. మన దేశములో వేదపండితుఁ డన్నమాట యక్కఱలేదు. ఎటువంటిబ్రాహ్మణుఁ డైనను శూద్రుఁడు రవంత తొంగిజూచినప్పటికి బ్రాహ్మణుఁ డన్నమువదిలిపెట్టి లేచి వెళ్ళును. ఈపాపిష్టిదేశములో బ్రాహ్మణుఁడు భోజనము చేయుచుండఁగా శూద్రుఁడు చూచుటయెగాక, ఆగదిలోనె తా నొకవిస్తరి వేసి కొని వేరుపంక్తిలో బ్రాహ్మణుని కెదురుగఁ గూరుచుండి శూద్రుఁడు భోజనము చేయును. ఈ దేశములో వట్టి మాలకూడు. అటువంటి పాడుదేశములో నీ వెందు కున్నా వందురేమొ? కాలము తప్పివచ్చినపుడు వసుదేవుఁడు గాడిదెకాళ్ళు పట్టుకొన్నాఁడు. పొట్టగడువక వీళ్ళ నాశ్రయించవలసివచ్చినది. అదిగాక మరాటి వాండ్రు పుల్లాకులలోఁ దినుచట్టివాండ్రు. ఎట్లందురా? మన వలెవా రాకులలో భోజనము సేయరు. పళ్లెములలోను గిన్నెలలోను తిందురు. తినిఅవికడిగి దాఁచికొందురు. కానిపాఱవేయరు. తినిపాఱ వేయనివి పుల్లాకులు కావా?" రహస్యములో నిటువంటి సంభాషణలు సేయుచున్ననుబహిరంగముగఁ బాపయ్య వారిని వేవిధములుగ ధనమునిమిత్తము స్తోత్రములు చేసినను మనోరథము సిద్ధించలేదు. వివాహమునకు సొమ్ముపోగుపడునట్లు కనంబడలేదు. యాచనవల్ల దొరకినది, సంభావనవల్ల నార్జించినది, బ్రాహ్మణార్థమువల్ల చేఁజిక్కి

నది పాపయ్యపొగచుట్టలకుఁ దమలపాకులకు వక్కలకు నడుమనడుమ నంగళ్ళకుఁ బోయి కొనితినులడ్డు బందరు ఫేణి మొదలగుమధురాహారములకు సరిపోయెను. కాని మిగులుటలేదు. ఇంతదూరమువచ్చి వివాహముఁజేసికొనకుండ మరల స్వదేశమునకుఁ బోవుట యప్రతిష్ఠయని యతఁడు భావించి తనవంటివానికి సొమ్ము చేతినిండ సమకూర్చునట్టివృత్తి నేదేని నవలంబింపవలయునని సంకల్పించుకొనెను. అట్లు చేయుటలో నతఁ డొక క్రొత్తవృత్తి నారంభింపఁదలంచెను. ఒకనెల దినములు విచారించి విచారించి యతఁడొక నిశ్చయమునకువచ్చెను. ఆవృత్తి యాంధ్రుల కాశ్చర్యము గలిగించునట్టిది. మహారాష్ట్రులు మెచ్చునట్టిది. ఆపత్సమయమున నక్కఱకువచ్చునట్టిది. ఎప్పటికప్పుడు చేతిలో రొక్కము పడునట్టిది. అందఱకుఁ దనతోఁ బని గలిగించునది. ఏనుఁగుపాడివలె తరుగనిది. విరుగనిది. అట్టి యపూర్వమైన వృత్తి యేదందురా వినుఁడు. ఆంధ్రబ్రాహ్మణులు ముఖ్యముగ గౌతమీకృష్ణవేణీతీరవాసులు, నందు ముఖ్యముగ వైదికులు రామచిలుకలవలె గొఱవంకలవలె నర్థము దెలియకుండ నొకరు చెప్పినదాని బండవల్లె వేసి స్వాధ్యాయము చెప్పుటకును శ్రౌత స్మార్త కర్మలు నిరాఘాటముగఁ చేయించుటకును కావ్య నాటకాలంకారగ్రంథములు తర్కవ్యాకరణజ్యోతిష వేదాంతాదిశాస్త్రములునేర్చి పాఠముచెప్పుటకును గొన్నిక్రతువులు చేయుటకును మాత్రమె బహుసమర్థులనియుఁ దదితరవ్యాపారములకు వారనర్హులనియు దేశమున నొకగొప్ప యపకీర్తి కలదు. పాపయ్య యవలంబించినవృత్తి యాంధ్రులకు సంభవించినయాగొప్ప యపకీర్తిని దొలఁగించునదికూడ నయ్యెను. ఆవృత్తి కథమపకీర్తి నలుఁగురైన నుండవలయును గాఁబట్టి పాపయ్య తాను వెళ్ళినకొలఁదిదినములకె తనవలెనే గంపంత యాశపెట్టుకొని తనవలెనే భగ్నమనోరథులై యిందందుఁ దిరు

గులాడుచున్న మఱిమువ్వురను శిష్యులుగ స్వీకరించెను. ఆ నలుగురుఁ గలిసి తాము ప్రత్యేకముగ యజ్ఞములు చేయలేక పోయినను కోటి యజ్ఞఫలప్రదమైన వ్యాపార మారంభించిరి. "అనాథప్రేతసంస్కారేణ కోటియజ్ఞఫలం లభేత్." అని యార్యోక్తికలదు. దిక్కులేనిశవములను గాల్చుటచేత కోటియజ్ఞఫలము లభించు నని యావాక్యమున కర్థము. అది పుణ్యజనోచితమైనవృత్తియని పాపయ్య దాని నుపక్రమించెను. మొట్టమొదట నతఁడు ధరలు చవుకగానే యుంచెను. కాని పని తగిలినకొలఁది ధరలు హెచ్చింపవలసి వచ్చెను. అటువంటివృత్తి నవలంబించుటకుఁ బురికొల్పినయతని నిపుణతబుద్ధిఁ జూచి యోర్వలేకను నాంధ్రబ్రాహ్మణులు తక్కిన వ్యాపారములకు సమర్థులు కారని లోకమున నున్న యపకీర్తిని దొలఁగించుటకుఁ దగినట్లు కృతజ్ఞులు కాకనుదెలివి మాలినవాండ్రు కొందఱు పాపయ్య పరోక్షమునను నెట్టయెదుటను నిందించి కొన్ని ప్రశ్న లడుగుచు వచ్చిరి. అందుఁగొన్ని ప్రశ్నలివి. "నీ వీ వృత్తినేల యవలంబించితివి? పుణ్య మందువా, సొమ్ముదీసికొనకుండ శవదహనము జేసినపక్షమున నది పుణ్యము. దిక్కులేని శవములఁ గాల్చుట పుణ్యము. నీవు మోయుశవములు వెనుకదిక్కుగలవె. అవి యనాథప్రేతలు గావు. అంధ్రులకు నీమూలమునఁ దలవంపులు వచ్చుట లేదా" ఇటువంటి వెఱ్ఱివెఱ్ఱిప్రశ్నలకుఁ దగినట్లుగ నతఁ డీక్రిందివిధమున సమాధాన మిచ్చెను. "బ్రతికియున్నవారికి దిక్కుండును. కాని పీనుఁగులకు దిక్కెక్కడుండును. కాఁబట్టి శవములన్నియు ననాథప్రేతలే. వారికి మోసెడువారెదిక్కు. మేమే వారికి గతి. ఇది గౌరవమైనవృత్తి. నీళ్ళుమోసి వంటలుచేసి గోడలు పెట్టి యిండ్లునేసి మనుష్యులెట్లు సంపాదించుచున్నారో నేను గూడ భుజములు కాయలుకాయునట్లు శవములను మోసిమోసి కష్టపడి చమట

యూచ్చి సంపాదించుచున్నాను. నా సొమ్ములో గుర్రిడ్డిగవ్వయైన నన్యాయార్జితము లేదు. అంతయు న్యాయార్జితమే. నాలుగుమాటలు చెప్పి నాలుగుగడియలలో నాలుగువంకలో నాలుగువేలో గడించు ప్లీడరుడబ్బుకంటె నానాకష్టములవస్తువులనమ్మి సొమ్మార్జించువర్తకుని డబ్బుకంటె పండినను మండినను దప్పక సొమ్ముపుచ్చుకొను సర్కారు సొమ్ము కంటె, వడ్డీవ్యాపారముజేసి మళ్ళుమాన్యములు కొంపలు గొడ్లుదయలేక యస్తించి లక్షాధికారులగువారిసొమ్ముకంటె నాసొమ్ము న్యాయమైనది. నాకొక్కగవ్వ నెవ్వరు నుచితముగ నీయనక్కఱలేదు. నే నొకరిదగ్గఱకువెళ్ళి చేయిజాచి యాచింపను. ఒకనియింటికి వెళ్ళి నిందుఁడ వని చందుఁడ వని వానిని భూషించి వానిసమయ మగుదాక కనిపెట్టుకొనియుండి పీకి పీడపెట్టి విసిగించి తిట్లుతిని నాలుగుడబ్బులు సంపాదించి సంతోషించు యాచకునివృత్తికంటె నావృత్తి ఘనమైనది. వేదముఁ జదువుకొనలేదని శాస్త్రముఁ జదువుకొనలేదని నన్ను మీరునిందించుచున్నారు. వేదముచదువుకొన్నవారివృత్తి యేమిటి? ముష్టి. శాస్త్రము నేర్చికొన్న వారివృత్తి యేమిటి? ముష్టి. చదువుకొని ముష్టియెత్తుటకంటె చదువుకొనక పీనుఁగులమోయుట మంచిది. ఆముష్టివిద్యలు నాకక్కఱలేదు. ఒకరింటికి వెళ్ళనక్కఱలేదు. నాయింటి కందఱు వత్తురు. అందఱకు నాతో పని గలదు. నేను కాలుమీఁద కాలువేసికొని యింట్లో కూర్చుండినప్పటికి నాయింటికడ కందఱువత్తురు. నావృత్తివరహాలచెట్టు. ఎప్పటికప్పుడె పంట. ఇది నెలజీతములవృత్తి కాదు. అది వట్టి పాడువృత్తి. ముప్పదిదినములు రాత్రియుఁ బవలు పనిజేసి పదోయిరువదోయాపాయలను సంపాదించుట యేమిప్రయోజకత్వము? నన్నాక్షేపించువారిలోఁ గొందఱు యాచకులే. కొందఱు పెద్దలు సంపాదించి పెట్టిన భూములమీఁదజీవించువారు. అటువంటివారందఱుమనోవృత్తిముండ

లు. తనభుజశక్తిమీఁదసంపాదించలేనివాఁడు పిత్రార్జితమునుసమ్ముకొని కాలక్షేపము సేయువాఁడు వట్టి యపరియోజకుడు. నేను గట్టిపరియోజకుఁడను. నాభుజశక్తివల్ల జీవనము సేయుచున్నాఁడను. పల్లకి మోయుటయెటువంటిదో కటుకుమోయుటయటువంటిదె. పెండ్లిపల్లకి మోతకు డబ్బుపుచ్చుకొనుట న్యాయమై దీనిమోతకు డబ్బు పుచ్చుకొనుట యన్యాయమగునా? నావలన మీకు తలవంపులు వచ్చుచున్నవా? తెలుఁగువాళ్ళు మరెందుకుఁబనికిరారన్న యపకీర్తిఁ దొలఁగించి యేపనిలోఁబెట్టినను సరె తెలుఁగువారు సమర్థులె యని లోకములో వెల్లడిఁ జేసినాను. అందుకైన నామీఁద మీకు విశ్వాసము లేదే. చీ మీకో మాట్లాడఁ గూడదు. పొండి" అని యెదుటివాఁడు మరల నోరెత్త లేనట్లు యుక్తులు చెప్పి తనయుక్తులు చాలనప్పుడు తనతొమ్మిదవయట్టము పారాయణముఁ జేసి "శేషం కోపేన పూరయేత్" అనుమాట పార్థకముఁజేయుచుండెను. పాపయ్య యే నుదినమున నేమంచిముహూర్తమునఁ దనవృత్తినారంభించెనో కాని యది దినదినపరివర్థమాన మయ్యెను. పునహా పెద్దపట్టణమగుటచేఁ బ్రతిదినమతఁడు రెండుమూఁడుపర్యాయములు దుర్భిక్షభూమికిఁ బోవలసినపని గలుగుచుండెను. మహూచి, విహూచి వచ్చినకాలములలో నతఁడు భూతగణపరివృతుఁడైన, సాక్షాదుమ్రీఁడువలె శిష్యసమేతుఁడై తరుచు శ్మశానములలోనే యుండుచువచ్చెను. పనితొందరచే నొకానొక దిన మతఁడు భోజనముఁ జేయకపోవుటయుఁదనపొలములోనికే యన్నము దెప్పించుకొని తిరు పంటకాపునలె శ్మశానమునకే పదిరొట్టెలు తెప్పించుకొని యెట్లో తీరికఁజేసికొని యారొట్టెలు నోటిలో వేసికొని మరలఁ బనిచేయ తటస్థించుచుండును. మూకెడేసిపొడుగుపొగచుట్టలు నోట వెలుఁగుచున్న సమయములో బాపయ్యను శిష్యులను రాత్రులు దూరమునుండి చూచువారు కొఱవి దయ్యములు శ్మశాన

మ.లో విహరించుచున్న వని పలుమాఱు భయపడి పరుగులెత్తుచు వచ్చిరి. అన్నివృత్తులలో ధర్మమున్నట్లె పాపయ్యవృత్తిలోఁగూడ కొంతధర్మముండెను. పేదపీనుఁగుల నప్పుడప్పుడు మూల్యము గొనకుండ నతఁడు తీసికొనివెళ్ళుటకలదు. తనయనిష్టులకడను ధనవంతులయొద్దను నెక్కువధనము గ్రహించుట కలదు. ఒకరికడ నెక్కువ యొకరికడ తక్కువయేల తీసుకొందు వని యెవరైన నడిగినప్పు డిది వ్యాపారము; సమయముకొలఁది బేరము. ధాన్యాదులధర నేఁడుపుట్టి యిరువది. మెల్లుండి ముప్పది యుండగూడదా" యని వారివాదములు ఖండించు చుండును. శవమునకు నాట్లువరహాలు, నెనిమిదివరహాలు పదివరహాలు పుచ్చుకొనుటయెగాని తక్కువలెక్కలేదు. మఱియు వరహాలలెక్కయెగాని చిల్లరలెక్కలేదు. లోభత్వముచేతను ధనహీనతచేతను గొందఱుప్రేతబంధువులు సహాయముచేయు మని వేడినప్పు "డీసారిగాదు. మఱియొకసారి చూడవచ్చును లెండి" యని బదులు చెప్పుచుండును. అనవుడు వారది యమంగళముగ నెంచి చీ యిది యేమయ్యా! ఈసారికే మేమింత ఘోరదుఃఖ మనుభవించుచుండ మఱియొకసారి యిటువంటిది రావలయు ననుచున్నావా" యని వారు దూషణపూర్వకముగ నడుగుటయు నతఁడిట్లు ప్రత్యుత్తరమిచ్చును "ఏమంతఁబాయిత్యము. ఈపోయినవాఁడొక్కఁడుతప్ప మీయింట మఱియెవ్వరుఁ జావరా? ఉట్టిగట్టుకొని యేమారేసదురా? చిరకాలజీవులాయేమిటి? దేహములు కాని యివిలోహములు కావుగదా "జాతస్య మరణం ధ్రువం" అను మాట వినలేదా? ఎప్పటికైన మీరందఱు నాచేతిలోఁబడువారె" అతనితో వాదముచేయుట కార్యభంగముఁ జేసికొనుటయని యెవ్వరు మాటలాడువారుకారు. ఈ శవవహనమునకుఁ దోడుగ నేకమహాపిండభక్షణ మతనికి విశేషధనమునుగూర్చెను. బ్రాహ్మణుఁడు మృతినొందినప్పుడు ముప్పదిరెండు

చిన్నచిన్నయన్నపిండములు నేతిలోముంచి బ్రాహ్మణునిచేతఁ దినిపింపవలయునని ధర్మశాస్త్రము గలదు. అదే యేకాహ మందురు. అవి తినుట మిక్కిలి తప్పు. గొప్పయమంగళము. అందుచేత నవి తినుట కొప్పుకొనరు. అందుచేత నెల్లవారు నవి యగ్నిహోత్రమున హుతము సేయుదురు. ఎక్కడో దేశానకొక్కఁడు మహాశూరుఁడు బయలుదేఱి పిండమున కొక్కొక్కవరహాపుచ్చుకొని యవితిని పదిమంది తిట్టికొట్టుదు రనుభయమున నెవరికిఁ గనఁబడకుండ రాత్రివఱకేదోగదిలోఁ గూర్చుండిపాఱిపోవుచుండును. ఆపిండములు బ్రాహ్మణులుతిన్నపక్షమునఁ దమపితృదేవతలుతప్పక మోక్షపదమునుబ్రాపింతురని మహారాష్ట్రబ్రాహ్మణులకు నమ్మిక గలదు. అందు గౌతమీకృష్ణవేణీతీరబ్రాహ్మణులు తిన్నచో వేఱుకొఱతలేకతనపెద్దలనిమిత్తము వైకుంఠద్వారములు తెఱచియుండు నని వారిదృఢవిశ్వాసము. అట్టివారెవ్వరిదివఱకు వారికి దొరకకపోవుటచే నేకాహపిండము లగ్నిహోత్రము పాలగుచుండెడివి. పాపయ్యవెళ్ళినతరువాతనట్టికొఱతతీరిపోయినది. వైకుంఠకైలాసలోకములద్వారములు ముద్దలుమ్రింగుటకు తెరవఁబడిన పాపయ్యనోరువలెనేయెల్లప్పుడు తెఱవఁబడియుండును. అగ్నిహోత్రునినోట కరక్కాయ గొట్టి పాపయ్య ముప్పదిరెండుముద్దలు నేతిలోముంచినముద్దకువరహా రెండువరహాలుమూడువరహాలు సమయముకొలఁది లాగివేయుచుండును. సర్వభక్షకుఁడైనయగ్నిహోత్రునకైననునెయ్యిసరిగా జీర్ణముకాకయజీర్ణముచేసి యుండును. కాని పాపయ్య యెన్నఁడు నజీర్ణ మెఱుఁగఁడు. పూర్వపువారు భయముచేత రహస్యముగఁ దినుచు వచ్చిరి. పాపయ్య కట్టిభయము లేదు. కావున నతఁడు బహిరంగముగఁ దినుచు వచ్చెను. పాపయ్య నమ్మిన దానిని సరిగ నాచరించునట్టి మహాశూరుఁ డని చెప్పుట కేమిసంది యము కలదు? ఈవిధముగ నిర్భయముగ రెండువరహాల నిటీవల ననే

కులు చేసిరి. కాని వారందఱు పాపయ్యశిష్యులె. అట్టివారందఱుఁ బాపయ్య పేరుచెప్పి దీపముఁబెట్టి మ్రొక్కుకొనవలెను. అది యతఁడు పెట్టినబిక్షమె. పై రెండువృత్తులవల్ల పాపయ్య నెలకు వందలకొలఁది రూపాయ లార్జించెను. కాని యదియంతయు నిలిచినదికాదు. ఎంత చెట్టు కంతగాలి. అర్థప్రాణములు కవలపిల్లలు, అమగమగునఁ బ్రాణమున కెన్నిగండము లున్నవో యర్థమున కన్నిగండములె యున్నవి. పాపయ్యగొప్పదాత. అదివఱకు బ్రాహ్మణులు బ్రాహ్మణులకెగాని దాన మియ్యరని గొప్పయపకీర్తి గలదు. ఆయపకీర్తి పాపయ్య తొలఁగించి శూద్రులకుఁ గూడ దానము లియ్యఁ జొచ్చెను. మగవారికె దానము లిచ్చుట మనలోఁ బూర్వాచారము. ఆ యాచారమును మార్పు చేయఁదలఁచి యతఁడాఁడువాండ్రికెదానము లీయఁజొచ్చెను. కుంటివాండ్రకు గుడ్డివాండ్రకు నేదేని విదుల్చుట యతనికిష్టములేదు. వారేదో ఘోరపాపముఁ జేయఁబట్టి భగవంతుఁడు వారిని దండించుటకై యంగవైకల్యము వారికి బ్రాప్తింపఁజేయుటచే నట్టివారిని మనము డబ్బిచ్చి పోషించినపక్షమున రాజద్రోహులను రక్షించినవారిపై రాజునకుఁ గోపమువచ్చినట్లె యీశ్వరద్రోహులను రక్షించినపక్షమున నీశ్వరునకు మనపైఁ గోపమువచ్చి మహానరకమునఁ ద్రోయునని యతఁడు నమ్మి యటువంటివారి కేమియు సాయముచేయక రూపరేఖావిలాసములు కలిగి ప్రియముగలిగి హాయలు గలవారికె నేవైన గుప్తదానములు చేయు చుండును. పాత్రదానప్రవీణుఁ డైనపాపయ్యకతమున నెందఱో చాకలిసానులు మంగలిమగువలు గమళ్ళగరితలు నీడిగయెమ్మెకత్తెలు సాలిజవరాండ్రు గొల్లగుబ్బెతలు బాగుపడిరి. ఈదానములు లేనిపక్షమున బాపయ్య బంగారుగోడలు కట్టియుండును. కాని లక్ష్మి పక్షపాతమనస్కురాలు. అందుచేత మగవానియండనుండక తనజాతి యాఁడువాండ్రికడకుఁ

బోయెను. అదిగాక పాము కన్నగుడ్లన్నియు బ్రతుకునా? పులికిఁబుట్టి నపిల్లలన్నియు బ్రతుకునా? పల్లేరుచెట్లన్నియు నెదిగి వృక్షము లగునా? అట్లయినచో జగము లాఁసునా? ప్రతివాఁడు సంపాదించిన దంతయు నిలువచేసినపక్షమున జ్యేష్ఠాదేవికి నిలువ నీడ యుండునా? పాపయ్య కిప్పటి కేబదిసంవత్సరములు వచ్చినవి. పునహాకు వచ్చి యిరువదిసంవత్సరములైనది. పోయినవి పోగా నతనియొద్ద మూఁడు వేలరూపాయలు నిలిచినవి. అప్పుడప్పు డొకమారువాడీయొద కొంత సొమ్మతఁడు నిలువచేసి యుండుటచే నీమాత్రమైనఁ గనఁబడినది. ఆసొమ్ముగూడ నెన్నోసారులు తీసికొనుట కితఁడు ప్రయత్నించి మారువాడిని గట్టిగా నడిగెను. కాని "యీబ్రాహ్మణుఁడు దిక్కు లేనివాఁడు. ఏపడపుకత్తెయింటనో యేశ్మశానములోనో యాకస్మి కముగఁ జచ్చిపోఁగలఁడు. అప్పు డీసొమ్మంతయు మనకే దక్కఁ గలదు. వీని కిప్పు డెందు కిచ్చి చేతఁజిక్కినది పోఁగొట్టుకొనవలయు" నని యామారువాడీతలంచి పాపయ్య వచ్చినపుడెల్ల యేదోవంకఁ జెప్పి పంపివేయు చుండును. ఎట్లైన నేమి. మారువాడీ మనోరథము భగ్నమైనది. మారువాడీ మరూచికమువచ్చి మృతినొందెను. అతని కొడుకు పాపయ్యపొ మిమ్మచ్చివేయఁ దలఁచెను. పాపయ్య కప్పుడు పెండ్లిమాట జ్ఞప్తికి వచ్చెను. మూలస్థానములో నొకపిల్ల యున్న దని యతనికిఁదెలిసి తనకిమ్మని యాపిల్లతండ్రికి వర్తమానమంపెను. ఆవర్తమానము తెలిసినతరువాత బాలికతండ్రియగు అన్నంభొట్ల అప్పన్నగారు పిల్లకు బండ్రెండుసంవత్సరములు వయస్సు, కావునపం డ్రెండువందలరూపాయ లీయవలసిన దనియు మూడువందలరూ పాయలు నగలు పెట్టవలసిన దనియు నుభయ మంగళసూత్రములు బెండ్లికొడుకె చేయించుకొని యుభయులకర్చులు బెండ్లికొడుకు పెట్టు కొని మందపల్లిలో గాని వేంకటేశ్వరులవాడపల్లిలో గాని పెండ్లి

చేసికొనవచ్చు ననియు నతనికి వర్తమాన మంపెను. అది విని కళ్యాణకాలము తనకు నేఁటి కానన్నమైనదని పాపయ్య సంతసించి యాపద్ధతి కొడంబడి మామవాడీయొద్దనుంచి రాజమహేంద్రవరములో నున్ననారాయణకర్నుగారిమీఁదికిమూఁడవేలరూపాయలకు దర్శనహుండి పుచ్చుకొని పునహానగరము విడిచి బయలుదేఱెను. అతఁ డానగరమువిడిచినపు డెందఱు స్త్రీలు కంటఁదడివెట్టిరని చెప్పను. చాపచుట్టలు గిరవాటు వేసినట్లు తమయూరేశవములను మోయు వారు లేరనియు ననర్గళముగ నేకావాహపిండములు గుటుకుగుటు కున్రమింగి తమపెద్దలను వైకుంఠద్వారసోపానము లెక్కించువారు లేరనియు నగరవాసు లెంతో విచారించిరి. పాపయ్య పునహాను విడుచు చున్నాఁడు గావున నతని విషయమై యిక్కడనె యొక మాట చెప్పవలయును. అందఱు తమతమవృత్తులలో నిగ్రహానుగ్ర హాసమర్థులైనట్లె పాపయ్యయుఁ దనవృత్తిలో నట్టివాఁడు. అనుగ్ర హించెనా యథాశక్తిగా శవ మూరక మోయును. కోపించెనా దండించును. ఇందుకొకతార్కాణము గలదు. ఒకనాఁ డొకపేటలో నొకయింట నైదేండ్లపసిబిడ్డ మృతినొందెను. గృహయజమానునికడ రెండువరహాలు పుచ్చుకొని యాబిడ్డను మూటఁగట్టి రాత్రి యగుటచే నది తనవిరోధియైన యొక మహారాష్ట్రినివీధియరఁగుమీఁదఁ బెట్టి పాఱిపోయెను. మరునాఁడాగృహస్థులు లేచి యది యేదో యనుకొని విప్పి చూచి భయపడికళవళపడియమంగళముగ భావించి పాపయ్యను బిలిపించి తీసివేయు మని ప్రార్థించిరి. పాపయ్య తన ప్రాతకసి తీరునట్లు పాతికరూపాయలక్కడపెట్టించియాపీడానివారణముఁజేసెను. ఇంక ననేకోదాహరణములుగలవు. గ్రంథవిస్తరభీతిచే మానవలసి వచ్చె. పాపయ్య రాజమహేంద్రవరములో హుండీమార్చుకొనిమంద పల్లి వెళ్ళి యిల్లుకట్టుకొని మూలస్థానమునుండి అన్నంభొట్లు అప్పన్న

గారిని సకుటుంబముగ రావించి పండ్రెండువందలు వారి కిచ్చి మూడువందలు నగలు పెట్టి సంబంధము గుదిర్చినవానికి నూరురూపాయలు రుసుమిచ్చి యన్నప్పగారికుమార్తెయైనపిచ్చమ్మను వివాహమాడెను.

నాల్గవ ప్రకరణము.

వివాహసంబంధములైన వేడుకలు విశేషముగా వర్ణింపఁదల్చుకొనలేదు. అయినను ముఖ్యమైన వొకటి రెండు కలవు. పప్పూభొట్లవారితో నన్నంభొట్లవారు వియ్యమందినప్పుడు వారి కుభయులకు సనాదిబంధువులైన నేతివారు దయచేసి వారితోఁ గలసిమెలసి వివాహమున కెంతోశోభ దెచ్చిరి. నేతివారుగాక ముఖ్యముగ నన్నంభొట్లవారికి బంధుమిత్రులైన కందావారు చెమ్మకాయలవారు బీరకాయలవారు చేమకూరవారు వంకాయలవారు మిరియాలవారుదోసకాయలవారు దయచేసి రేయుంబగళ్ళు విరిగి ముక్కలగునట్లు పనిచేసిమెప్పువడసిరి. ఉప్పువారు మొదటనుండియు నచ్చటనెయుండిరి. కానివారి కన్నంభొట్లవారితోనంత యైకమత్యములేదు. ఉప్పువారికిని మనపప్పువారికిని నతికిన ట్లన్నంభొట్లవారితో నతకదు. ఉప్పువారికిని బంధుమిత్రులకుఁ గూడ నెక్కువ కలయిక యుండెను. గొల్లపోలునుండి చల్లావారు మొదట నేకారణముచేతనో రాక కడపట విచ్చేసిరి. కడపట విచ్చేసినను మొదటినుండియు నన్నంభొట్లవారి కాప్తు లగుటచేత వారిసమాగమమెంతోరసవంతముగ నుండెను. ఉభయులకర్చులు పాపయ్యయె వహించుటచేత నన్నప్పగారు పుచ్చుకొన్నపండ్రెండువందలరూపాయలలోఁ జిల్లిగవ్వయైన వ్యయము కాలేదు. కాక కాక

యైనవివాహమగుటచేఁ బాపయ్య యధికశోభస్కరముగవివాహముఁ జేసికొనఁ దలఁచి యైదుదినంబులుం బల్లకి నెక్కియూరేగెను. పాపయ్య దీర్ఘకాయుఁ డగుటచేఁ బల్లకిలోఁ గూర్చుండినపుడు చిన్నచిక్కు సంభవించెను. అతనితలకు దండియు దండి పైఁ బఱచెడుపింజరియుఁ దగులు చుండుటచే నతఁడే పెండ్లికూఁతురుభావము వహించి తల వంచుకొనవలసినవాఁడయ్యెను. అందుచేతఁ బల్లకిలో నున్నసమయములో నతనిని జూచినవారు మెడగుళ్ళు వంగిన వనికొందఱు, గూను వచ్చినవనికొందఱు, కాదుకా దఱువదియువపడిలోఁ జిన్నపిల్లను వివాహమాడినందుకు సిగ్గుపడి తల వంచుకొన్నాఁడని కొందఱుఁ దోఁచిన విధముగ ననిరి. దీర్ఘకాయమునకుఁ దోడుగ నతఁడు లావు గలవాఁ డగుటచేతను గూనంత బొజ్జ గలవాఁ డగుటచేతను, దండాడింపు సమయమునఁ బెద్దచిక్కు సంభవించెను. వచ్చినబంధువులలో మిత్రులలోఁ బరిచితులలో నతని నెత్తుకొని దండాడింపు చేయఁగలవారు లేక పోయిరి. పాపము నేఁటికాలమునకుఁ బాపయ్య యొకయింటివాఁ డగు చున్నాఁడు గదా, యతనిముచ్చటమాత్రము తీర వలదా యని యొకబంధువుఁడు సాహసించి పెండ్లికుమారు నెత్తుకొని రెండు గంతులు వేయునప్పటికినూనెసిద్ధివలెనున్న పాపయ్యబొజ్జజాఱిపోవలక్క గుమ్మడికాయవలె నతఁడు క్రింద గుభాలునఁ గూలెను. చుట్ట నొప్పి పెట్టెను. పిమ్మట నతఁ డొకయరుఁగుమీఁదఁగూర్చుండి పెండ్లికుమార్తెమీఁద బుక్కా బగ్గుండ జల్లి యాయుత్సవ మైన దనిపించెను. ఇంక భోగము మేళమును గురించి రెండుమూఁడుమాటలు చెప్పవలెను. పాపయ్య జన్మముచేత శుద్ధవైదికుఁ డైనను బాలకాలము పునహానగరములో నివసించిననాగరకుఁ డగుటచే గొప్పరసికులలో జేరినవాఁడు కావున శృంగారదేవతలగు వేశ్యలు లేని పెండ్లి పెండ్లికా దని యభిప్రాయపడి వెలయాండ్రకుఁ బ్రసిద్ధికెక్కినపసలపూఁడి మంచపేట

మొద లగుగ్రామములకుఁ బ్రత్యేకముగ మనుష్యులనంపి మేళము లకై ప్రయత్నించెను. అది వివాహకాలమగుటచే మేళములన్నియు నం దంపఁ గుదిరి యుండుటచేఁ దగినమేళము దొరక లేదు. మేళ ముండితీరవలయు నని పాపయ్య పట్టుపట్టెను. అందుచేత నతనిమిత్రుఁ డొకఁడు మేళము దీసికొని వచ్చెను. ఆ వేశ్యపేరు చంద్ర వదన. చిన్నప్పు డది మిక్కిలి చక్కనిదె కాని మశూచికములో దాసిచేతులు మోరులు దిగుటచేతను తిరుగలిగంట్లవలె మశూచికపు మచ్చలు మొగమున నుండుటచేతను కుడికాలు కొంచెము వంకరగ నుండుటచేతను దాని నెవ్వరు మేళమునకుఁ బిలుచుట లేదు. దాని నెనుక తాళపుహంగు చేయునది పాటకత్తెయే కాని కొంచెము నత్తిది యగుటచే దానిపాట శోభించుటకు వీలు లేకపోయెను. కుంటిదైనను సరే గ్రుడ్డిదైనను సరే నత్తిదైనను సరే సంగిదైనను సరే వేశ్య వివాహకాలమునఁ బెండ్లిపందిరి నలంకరించ వలయు నని పాపయ్య దృఢసంకల్పముఁ జేసికొనియుండుటచే నమావాస్యనాఁటిచంద్రబింబ మువంటి మొగముగల యాచంద్రవదనను బిలిపించి పాపయ్య మేజు వాణి చేయించెను. వచ్చినబంధువులు దోషైకదృక్కులు గాక గుణ గ్రహణపారీణు లగుటచే మోరుచేతులదానియభినయమునకును నత్తి దానిగానవైఖరికిని మహానందభరితులై రాత్రి ప్రొద్దుపోవువఱకు నుదయమున రెండుజాములవఱకు మేజువాణీ జేయించుచుండిరి.

శుద్ధవైదికు లగుటచే రసికత నెఱుఁగక యిట్లు వారు సంత సించి రని కొందఱుపడుచువాం డ్రిన సాహసించిరి కాని యామా ఱలు మీరు నమ్మఁ గూడదు. వా రల్పసంతోషు లనియు గుణమెంత వఱకు నున్న నంతవఱకు గ్రహించి యానందించువా రనియుఁ దలంపవలయును. వివాహము ముగిసెను. వివాహమైనందుకు మన పాపయ్య మిక్కిలిసంతసించెను; కాని యతనిమనస్సులో నొకవిచార

ముండెను. అత్తవారియింటికి మరుగుమనునకుఁ బోవుట మొదలగు ముచ్చటలు తీరుటకవకాశము లేకపోయినందున నది గొప్పకొఱంతగా నతఁడెన్ను కొనుచువచ్చెను. అత్తమామలు వివాహమైన తరువాతఁ గూడఁగొంతకాలమునందపల్లిలో నెయుండియల్లుఁడుతను యింటఁజేరు వలసిన మరుగుమనుపు తామేయల్లునియింటఁజేయసాగిరి. చూచువారికిఁ బాపయ్య మామగారైనట్లు నన్నప్ప యల్లుఁడైనట్లుండెను. తనకు సరియైనగౌరవము జరుగలేదని యల్లుఁడు బెట్టుసరిజేయుట కవకాశము లేకపోయెను. కాని యన్నప్ప నడుమనడుమఁ గొంతబెట్టుసరి చేసి యన్నము మాని యింటికి రాక తగవు లాడఁ జొచ్చెను. పాపయ్య మామగారిని బతిమాలి యింటికి దీసికొని రావలసివచ్చెను. అన్నప్ప వివాహమైనవెంటనే మూలస్థానము వెళ్ళఁదలఁచెను. కాని పదియాఱు దినములపండు గైనతరువాత వెళ్ళుట మంచిదని యాగెను. ఆపండుగ ముగిసినతరువాత నన్నప్పభార్యకుఁబెండ్లిబడలికవలనఁ గొంచెము జబ్బు చేసెను. అదినివారణ మగునప్పటి కన్నప్పకే కొంచెమనారోగ్యము కలిగెను. అన్నప్ప తనకు నెమ్మదిగా నున్నతరువాత బయలు దేఱి పోవలయు నని పంచాంగము జూడఁగా నొకనాఁడు వారము మంచిది కాకపోయెను. మఱియొకనాఁడు తిథి మంచిది కాకపోయెను. వేఱొకనాఁడు నక్షత్రము మంచిది కాకపోయెను. ఇవి యన్నియుఁ గుదిరి యొకనాఁడు బయలుదేఱఁగా పిల్లియెదురుగా వచ్చినందున నాదినమునకుఁ బ్రయాణ మాగి పోవలసి వచ్చెను. తిథివారనక్షత్రములు మరలగుదురునప్పటికి నొక్కమాసముదినములు పట్టెను. అప్పుడన్నప్ప బయలుదేఱి వీథిలోనికి రాఁగానే యతనినిమిత్తమే కనిపెట్టుకొని యున్నట్లు చేత నొకపిడకయుఁ బిడకమీఁద నిప్పును బెట్టుకొని వితంతు వెదురుగా వచ్చెను. క్రొత్తపెండ్లికూఁతును దీసికొని యట్టిదుశ్శకునసమయమున బయలుదేరుట యెంతమాత్రము సముచి

తము కాదని యన్నప్ప గిరుక్కున వెనుకకు మరలి తరువాత రెండు మూడుముహూర్తములు ప్రయాణమునిమిత్తము పెట్టించెను. ఒంటి బ్రాహ్మణుఁడొకసారి తెలికవాఁడొకసారి యెదురుగా వచ్చి ప్రయాణమునిలిపిరి. వెయ్యేల! మండపల్లిలోనున్నవారంద ఱేవోవిఘ్నముగ నన్నప్పప్రయాణమున కాటంకమే గలిగించిరి. మూలస్థానమునకు వెళ్ళి స్వగృహమున గాఫురము జేసినయెడలఁ దనసొమ్ము కర్చుపడు ననుభయమున నన్నప్ప యేదోవంక బెట్టి మండపల్లిని విడువక యల్లునియింటనే తిష్ఠ వేసికొని తేరకూడు తినుచున్నాఁడని గ్రామస్థులుకొందఱు చాటుచాటున నడకొనుచున్నట్లు విని యతఁడు తీవ్రకోపముదాల్చి మండపల్లివాసులందఱుఁ దుంటరు లని నీచు లని దిట్టి "ఛీ! యీగ్రామమం దొక్కనిమిష మైన నుండఁగూడ" దని యల్లునిమీఁదఁ గూడ గేకలువైచి కూఁతును గొడుకును భార్యను దీసికొని బయలుదేరెను. ఆముహూర్తబలిమి యెట్టిదియొకానీ వారు పొలిమేర దాటియైన వెళ్ళకమునుపే గొప్పమబ్బు పట్టి యుఱుములతో మెఱుపులతో నేనుఁగుతొండములావుధారలతో గొప్పవర్షము కురిసెను. అన్నప్ప సకుటుంబముగ నీలువున నీరై తడిసి మోపైడై దైవప్రాతికూల్యమున కేమియుఁ జేయఁజాలక విధి లేక మరల జామాతృగృహము జేరవలసినవాఁడయ్యెను. అల్లుఁడు పదియవగ్రహమని లోకమున నున్నసామెత యీవిషయమునఁదారుమారై మామగారే పదియవగ్రహమైనట్లు లోకులకుఁ దోఁచెను. స్వగృహమున నున్నప్పు డన్నప్పకు ప్రాతయుసిరికపచ్చడియొ కాల్చినమిరపకాయయొ గంజయొ చింతపండుపచ్చడియొ నన్నమున కాధారముగ నుండినఁ జాలును. తత్త్వము మారిపోవుటచేతనో మఱి యేకారణముచేతనో యల్లునియింటనున్నంతకాలమన్నప్పకుఁ బ్రాతబియ్యపన్నము పప్పు నధ్యమపక్షు మొకకూర పచ్చడి పులుసు మొదలగునవి

కావలసి వచ్చెను. నడుమనడుమ మినపసున్ని యరిసెలు వేపుడు బియ్యము నటుకులు మొదలగు నుపాహారములు కావలసి వచ్చెను. గాదిక్రిందిపండకొక్కవలె మామగారు తనయింటఁజేరి దోఁచుకొని తిను చున్నాఁడనియుఁ బూర్వము పునహానగరములో సంపాదించిన ధనము పెండ్లికుమార్తె యోలినిమిత్తమైననేమి పెండ్లికర్చులనిమిత్తమైన నేమి నవ్వలికర్చులకైన నేమి మొత్తముమీఁద నన్నప్పగారి నిమిత్తమే వ్యయమైనదని పాపయ్యకు విచారము పుట్టెను. చూచి చూచి మామగారిని వెళ్ళఁగొట్టలేఁడు. వివాహమైనతరువాత పాపయ్యను గలిసికొన్న వారంపఱు మామగారి యద్భుతప్రజ్ఞావిశేషంబుల నప్పుడప్పుడు కైవారములు చేయు చుండుటచేత నన్నప్పకాగ్రహము దెప్పించుట కిష్టములేదు. అన్నప్ప తనంతట తాను వెళ్లునట్లు కనఁబడలేదు. వివాహమై యప్పటి కాఱుమాసము లయ్యెను. అత్తవారికుటుంబభరణమున కైనవ్యయ మటుండఁగా మామగారప్పుడప్పుడు చేఁబదులు పుచ్చుకొన్న దేఁబదిరూపాయలయ్యెను. మందపల్లినీళ్లు తనకు వేఁడి చేసినదని యన్నప్ప వారమున కొకసారి యాపునేతికో మంగలివేఁదలయంటించుకొని తలయంటుకూలియు నేతివెలయు నల్లునికె గట్టుచుండెను. భార్య వచ్చిన దన్న సంతోషముపోయి పాపయ్యకు మామగారిరూపమున శని దాపుర మయ్యెనని విచారము పుట్టెను. శనిగ్రహపీడ వదలించుకొనుటకై దేశమందలియెల్లవారు మందపల్లి బోవుచుండఁగా మందపల్లిలోనే యున్న పాపయ్యకు శనిగ్రహపీడ వదలక పోయెను. ఇది తిలదానముతో వదలెడి శనిగాదు; తైలాభిషేకముతో వదలెడి శనిగాదని పాపయ్య మునసబుకరణాలతోను గ్రామములోనితక్కిన పెద్దమనుష్యులతోడను నాలోచనలు చేయసాగెను. ఎవరికిఁదోఁచినట్లు వారు సలహాజెప్పిరి. నాయింటనుండి మీరు లేచి పోవలసినదని స్పష్టముగఁ జెప్పుటయె

మంచి దని మునసబు సలహా జెప్పెను. ఉప్పు పప్పు బియ్యము మొద లగుపదార్థము లింట లేకుండఁ జేసి నీవు పదిదినములపా టేగ్రామ మైన వెళ్లవలసిన దని కరణము హితోపదేశము చేసెను. ఆరెండుప దేశములు బాపయ్య కంత రుచింపలేదు. ఇఁకఁ గొంతకాల మోపిక పట్టవలయునని యతఁడు నిశ్చయించుకొని పిల్లిమీఁదఁబెట్టి యెలుక మీఁదఁ బెట్టి సూటిపోటుమాటలు మామగారి కర్థమగున ట్లనఁ జొచ్చెను. పిచ్చికమీఁదఁ బెట్టి పీటమీఁదఁ బెట్టి యన్నప్ప యల్లుఁ డన్నమాటలకుఁ దగినట్లు ప్రత్యుత్తరముఁ జెప్పసాగెను. ఎట్టకేలకు బాపయ్య కోపిక క్షీణించెను. ఒకనాఁటిరాత్రి భోజనానంతరమున నూతి నరసింహ మనెడుమిత్రుని బిలిచికొనివచ్చి మామగారిని వెళ్ళి పొమ్మని యతనిచేత వర్తమాన మంపెను. నరసింహమెంతో మృదువు గాను యుక్తియుక్తముగాను బాపయ్యయభిప్రాయ మన్నప్పగారితోఁ జెప్పెను. కాని యాపలుకులువినఁగానే యన్నప్పకు వచ్చినకోప మిం తిం తని వర్ణింపనలవి గాదు. కూర్చుండినవాఁ డువ్వెత్తుగా లేచి యిల్లెగిరిపోవునట్లు బెద్దబెద్ద కేకలు వేయుచుఁ గొండముచ్చువలె గంతులువేయుచుఁ జేతులు బారలు జాపుకొని యాడుచుఁ దనకోప ములోఁ గొంతభాగము నీవిధముగ వాక్యరూపమున వెళ్లఁబుచ్చెను. పునహాసతారాలలోఁ జేరి పీనుఁగులు మోసికొనునట్టివానికిమాణిక్యము వంటిపిల్లను దీసికొనివచ్చి కట్టఁ బెట్టుట నాదే బుద్ధితక్కువ. తన వంశ మెక్కడ నిలువకపోవునో యనుభయముచేత నాపిల్ల నిమ్మని యెందరిచేతనో నాకువర్తమానమంపి నాకాళ్లు కడుపుబట్టుకొని బతి మాలుటచే బ్రాహ్మణవంశ మొకటి నిలువఁబెట్టిన పుణ్యము బ్రతి ష్టయుఁ గలుగు నని పిల్లనిచ్చితిని. లేనియెడల నఱువదియేండ్లవానికి నేను నాపిల్లనిత్తునా? పెద్దవాఁడైనప్పటికి సాంప్రదాయము కల వాఁడు పరువుగలవాఁడు గదా యనుకొంటినిగాని పరువుమర్యాదలు

లేని వంటపూటి వెధవయనుకొనలేదు. ఇది యేమి పాడుగ్రామము కాని యీదరిద్రగొట్టు గ్రామమునుండి యెన్నిసారులు పయనమై పోవఁడలఁచినను దుశ్శకునములే. ఊరునిండ మాయపిల్లులు. మాయముండలు. ఇంటిలోనుండి వీధిలోని కడుగుబెట్టితిమా యెదురుగానొక ముండసిద్ధము. తొంగిచూచితిమా యొకపిల్లి సిద్ధము. శనిగాని ప్రతిష్టగల గ్రామములో నింతకంటె నెక్కువుండునా! చీ నాగౌరవము గంగపాలు చేసినావు. నాపరువు బండలుచేసినావు. నేనెంతో గౌరవముగఁ గాలక్షేపము సేయుచున్నాను. అత్తమామలకు నాలుగు దినములు పట్టెడన్నమైనను బెట్టలేక లేవఁగొట్టిన నీపరువు మీఁద నిప్పులుపోయ. నీదికూడ నొకబ్రతుకటా? ఇరుపార్శ్వముల నన్నదమ్ములుగాని యక్కసెల్లెండ్రు కాని చుట్టములుఁ బక్కములు గాని లేని సన్యాసిముండాకొడుకువీఁడు. దిక్కుమాలినపాడకట్టు. గంజికాఁచి పోసెడు దిక్కైనలేదు. పెండ్లియైన మరునాటినుండియు సోలెడుబియ్యముతానే పొయ్యిమీఁదఁబెట్టుకొని చేతులు గాల్చుకొని నిత్యవిధిలాగున వండుకొనితినవలె పాపమని జాలిపడి ఉపకారబుద్ధిచేత నేనుపది దినములు నాపనులు చెరుపుకొని గంపంతకమాటము వదులుకొని రెండుపూటలు నాభార్యచేతనే మడికట్టించి యీవలచెం బావలఁ బెట్టి మెఱుఁగని నాకూఁతుచేత పయిపనిచేయించి వేఁడి చేసి నాకళ్ళు మసకలు గ్రమ్మినప్పటికి నాలోనేనే మోర్చుకొని నేనుకూలివానివలె రాత్రింబగళులు చాకిరిచేయఁగా నాచాకిరీవిషమైనది. చీ నీకొంపలో నేనొక్కగడియ యుండను. ఓసీ! ప్రయాణమై మూఁటగట్టవే. పిల్లను పిల్లవానినిలేపవే. ఈరాత్రినీకొంపలో నుంటినా చండాలుఁడేసరి."

అని లోనికివెళ్ళి నిద్రపోవుచున్న పిల్లలను లేపి తన బట్టలు కొన్ని పాపయ్యబట్టలుకొన్ని తనచెంబులు కొన్ని పాపయ్య చెంబులుకొన్ని కలిపి మూటగట్టుకొని యామూట నెత్తిని బెట్టుకొని

యాలుబిడ్డలను వెంటఁబెట్టుకొని "నాకంఠములోఁ బ్రాణముండఁగా నేనీకొంపలోఁ దిరిగి యడుగుపెట్టరు. ఇంతయవమానముఁజేసిన తరువాత నేనీగ్రామము మరల రాఁగలనా? నేను కూటికి మొగము వాచలేదు. గుడ్డికు మొగమువాచలేను. అల్లుఁడు పదియవగ్రహమన్నమాట నాకిప్పుడర్థమైనది. నేఁటితోనాకు నాపిల్లకు ఋణము దీరిన" దని గుమ్మముదిగెను. ఆపలుకులకు మిక్కిలి కనలి పాపయ్య పునహానుండి దెచ్చినదుడ్డుకట్టతో రెండుదెబ్బలు దీయఁ దలఁచెను. కాని నూతి నరసింహ మతనిని వారించి మెల్లఁగాఁ నన్నప్పతో నిట్లనియె. "అన్నప్పగారూ! మీరు కోంచెము శాంతించవలెను. మీయల్లుఁడు విశేషముగ ధనమున్న సంసారికాఁడు గనుకను నతనిక్షేమము గూడ మీరుచూడవలయును గనుకను రెండుసంసారముల నతఁడు భరింపలేఁడు గనుకను గష్టనిష్ఠురములు చెప్పుకొనుటకుఁ మీరు తప్ప యతనికి మఱెవ్వరులేరు గనుకను నేను మీయుభయులకుఁ గావలసిన వాఁడను గనుకను నాచేత రహస్యముగఁ దన సాధకబాధకములు వత్తమాన మంపినాఁడు. దీనికి మీరెంత కోపపడవలసినపనిలేదు. ఈ రాత్రియె వెళ్ళవలసినయవసరము లేదు. స్థిమితముమీఁద వెళ్ళవచ్చును. అర్ధరాత్రివేళఁ జిన్నపిల్లనుదీసికొని మీరెక్కడకువెళ్ళఁగలరు. కాఁబట్టి యీరాత్రి యిక్కడపండుకొని రేపు భోజనము చేసి వెళ్ళవచ్చును. నిలువుఁడి" అని వేఁడుకొనుటయు నన్నప్ప దెబ్బతిన్న తాఁచువలె నాగ్రహము రెట్టింప "నీరాత్రి గాదు కదా యొక్కగడియ యిక్కడుండను. అన్నంభోట్లవారంటే యొక్కమాటమీఁదనె నిలఁబడఁగలవారు. ఇతనియింటిలోనిద్రిపోవుటకంటెశ్మశానమున నిద్రిపోవుట మంచిది. నన్నుపలుకరించవద్దు. నానోరు మంచిదికాదు. మీయుద్దఱిపరువు సమానము గనుక మీకు కలిసినది. నాకు మీతోఁ గలియదు. ఈయాఱుమానములువిధిలేక ముండ్లమీఁదున్నట్లున్నాను

వెనుకదిక్కు లేనివాని నొక్కనిని విడిచి వెళ్ళినాననునింద నానెత్తి మీఁద లేకుండ మీనోటితో మీరేవెళ్ళుమని చెప్పినారు. కావున నింద నామీఁదలేకుండ సరిపోయినది. నన్ను మీరాపవద్దు. ఇదిగో వెళ్లుచున్నాను." అని విసవిస నడువసాగెను. నిద్రామధ్యమున మేలు కొలుపఁబడుటచేఁ గొడుకుఁ గూఁతురుఁ గన్నులు నలుపుకొనుచు వెంటఁజనిరి. బిడ్డలవెనుక భార్యయరిగెను. అట్లు వారు పయనమై రెండవవీథి కరిగి యొకయసంగుమీఁదఁ బండుకొని తెల్లవారుజామున లేచి మరల పయనమై రేవు దాటి స్వగ్రామముఁ జేరిరి. నాఁడు మొదలుకొని పాపయ్యకు మామగారికినోటిమాటయుఁ గంటిచూపును లేవు. ఉత్తరప్రత్యుత్తరము లంతకుముందే లేవు. పాపయ్య మామ గారిపోక శనిగ్రహవిమోచనమట్లు తలంచి తల తడవిచూచుకొనెను. వివాహమైన రెండుసంవత్సరములకు భార్య యుక్తవయస్కురాలైన దని పాపయ్యకు వర్తమానము తెలిసెను. కాని మామగారుశుభలేఖ వ్రాయలేదు. పాపయ్య స్వయముగావెళ్ళి నిజస్థితిఁ గనుఁగొని యా వార్తనిజమయ్యెనేని పునస్సంధానము చేయవలసిన దని యనుగఁ దలఁచెను. కాని యల్లుఁడదివఱకు చేసిన మహాపరాధమును మరువఁ దలఁచినను మామగారికి మరపు రాకుండుటచేత నతఁడు తన్నిఁటికి రానిచ్చునా తనకు పట్టెడన్నము బెట్టునా? సొమ్ము కర్చుపెట్టియతఁడు పునస్సంధానముఁ జేయునా యని సందేహము దోఁచెను. అందుచేత నతఁడు స్వయముగా వెళ్ళుటకంటె రాయబార మంపుట మంచి దని చెరువు సీతారామయ్యయను బంధువును మామకడకంపెను. అతఁడు మూలస్థానము వెళ్ళి యన్నప్పగారిని గలిసికొని కూఁతురు రజ స్వలయైనమాట సత్య మని యతనినోటనే విని పునస్సంధానము మాట తలపెట్టెను. అల్లునిమాటఁ దలపెట్టఁగానే యన్నప్ప నిప్పులు త్రొక్కిన కోఁతివలె చిందులు త్రొక్కి బిగ్గఱగనఱచుచు నిట్లనియె

"పాపయ్యకిప్పుడు నేను మామగారునైనాను గాఁబోలు! నాకిప్పు డాయన యల్లుఁడైనాఁడుగాఁబోలు! చీఁకటిలో జాము రాత్రివేళ నన్ను దనయింటనుండి యాలుబిడ్డలతోఁగూడ లేవఁ గొట్టినమాట తాను మఱచినను నేను మఱవలేదు. నాడొక్కలో శూలించుచున్నది. అది జన్మజన్మములకైనను నాకు మఱపురాదు. నేను మధ్యవాళ్ళ మాటనమ్మి నిష్కారణముగ నాపిల్లగొంతుక కోసినాను. అటువంటి మగనితో నాపిల్ల కాపురము చేయుటకంటె నాకు రెండవ మగపిల్ల వాఁడులాగున నాబంతినింతయన్నము దిని యిచ్చటనేయుండఁగలదు. అత్త లేదు. ఆడబిడ్డ లేదు. పెద్దదిక్కు లేదు. ఏకాకిముండాకొడుకు వాఁడు. కాలు నొచ్చును, చేయి నొచ్చును, పిలిచినా పలుకువారు లేరు. పట్టెడన్నము కంచములో బెట్టువారులేరు. నారాయణ నారాయణా యీపిల్లమాట తలఁచుకొనే నేను బెంగఁ బెట్టుకొన్నాను. ఇన్నిమాటలెందుకు? నేనుఘనస్సంధానము జేయఁదలఁచుకొనలేదు" అనవుడు సీతారామయ్య శాంతవచనముల నతని బతిమాలి కట్టకడ పట నిట్లనియెను. "మహర్షులవంటి మహానుభావులు సయితము మనుష్యులుచేసిన పాపములపరిహారము నిమిత్తము ప్రాయశ్చిత్తము విధించిరి. ప్రాయశ్చిత్తము లేనిదోషము లేదు. పొరబాటు లెవరివల్ల వచ్చినను వచ్చినవే. అందుచేత పాపయ్యకుఁగూడ నేదోప్రాయశ్చిత్తము విధించండి. అనఁగా మీకాళ్ళుపట్టుకొని మిమ్ములనబతిమాలు మని చెప్పండి. ఏదోవిధముగ మనలో మనము సర్దుకొని పిల్లకాపురము పొత్తుచేయవలెను. కాని చెడగొట్టుట మంచిదికాదు." అని పలుక నన్నప్పటల పైకెత్తి కొంచె మాలోచించి "సరే! పెద్దలు చెప్పి నారుగనుక మీమాటప్రకారము నేను నడచుకోఁ దలఁచుకొన్నాను. ఏదోప్రాయశ్చిత్తము విధించు మన్నారు, గనుక మూఁడువందలరూ పాయలు మూటగట్టి నాచేతి కిచ్చినపక్షమున మరు పైన దేమిటో

యైనదని వెనుకటివంతయు మఱచి కార్యముచేసెదను. లేదా నాపిల్ల విధవాఁడపడుచువలె నాయింటనెయుండును. ఈమాటలె పాపయ్యకు జెప్పండి. మూటలెగాని యింకమాఱుమాట లక్కఱలేదు. ఇన్నిమాటలు లేవు నాతో" నని కంఠోక్తిగఁబలికెను.

ఆసందేశమును సీతారామయ్య యథోక్తముగఁ బాపయ్యకెఱింగించెను. మూఁడువందలరూపాయ లిచ్చుట యతని కిష్టములేదు. చేతులారపిల్లను వదలుకొనుటకంతకన్న నిష్టములేదు. కొన్నిదినములు వితర్కించివితర్కించియెట్టకేలకు మిత్రులప్రోత్సాహమునమూఁడువందలరూపాయలు మూటగట్టి సీతారామయ్యచేతనే పంపెను. వెండిబంగారములు బరిశుద్ధపదార్థములకావున స్వీకరించినవారి మనస్సులుగూడ పరిశుద్ధములు చేయును. రజతదర్శనముచేత నన్నప్ప కోపమంతయునుపశమించెను. వివాహముపెండ్లికొడుకువారియింటజరిగినప్పుడు పునస్సంధానముగూడ నచ్చట జరుపవలెనని యన్నప్ప నియమముఁ జేసికొని సకుటుంబముగ మరల మందపల్లి వెళ్లెను. బ్రహ్మచర్యము వదలి భార్యతో నేమైనం జాలునని పాపయ్య వారిని సగౌరవముగ నెదుర్కొని తీసికొని వచ్చెను. ముహూర్తమేర్పడెను. పునస్సంధానమయ్యెను. క్రొత్తపిల్ల యగుటచే సిగ్గుపడుననియు మగనిదగ్గఱ బెదురు తీరలేదనియు వంటనేర్వవలసియున్నదనియుఁ జెప్పి యన్నప్ప గర్భాధానమైన యాఱు మాసములవఱకు మందపల్లిలో నుండెను. మామగారి కోపపువేఁడిమి మున్నూరు రూపాయలను గ్రక్కించినందున నీసారి పాపయ్య నోరెత్తి పలుకలేదు. అత్తగారి యిష్టప్రకారము మామగారి యిష్టప్రకారము నడచుకొనెను. అంతలో నన్నప్పగారి పూర్వజన్మసుకృతముచేతనో యీజన్మసుకృతముచేతనో పిచ్చమ్మకు నెల తప్పెను. వేవిళ్లు ప్రారంభ మయ్యెను. వేవిళ్ళబాధపడుచు నిజముగ నొకపట్టెడన్నమైనను దినక మంచము

మీఁదనుండి సరిగ లేవకయున్న కూఁతు నొక్కరిత నత్తాడుబిడ్డలు లేని యత్తవారియింట విడిచిపెటి యెంతనిర్దయులైన తలిదండ్రులైన ను వెళ్ళఁజాలనప్పుడు తనపుత్రికయె తనపాటి భాగ్యదేవత యని కల్పవృక్షు మని భావించుకొనుచుఁ బ్రియపుత్రిక నెడబాసియుండుట కన్న లోకనిందకైన నోర్చి దానిదగ్గఱనె యుండుట మంచి దనుకొ నుచున్న గారాబు తలిదండ్రులు విడిచి రాఁ గలరా? రమ్మని బ్రాతి గుండెవాఁడైన నసఁ గలఁడా? అక్కడ నుండఁబట్టి తన కెన్నో పనులు చెడిపోవుచున్న వనియుఁ దనకు వెళ్ళక తీరదనియుఁ జెప్పి యన్నప్ప రెండుమూడుసారులు పయన మయ్యెను. కాని యీసారి యల్లుఁడేబతిమాలి యాయననాపెను. అల్లునిమాట నన్నప్ప తీసివే యలేక యూగెను. పిచ్చమ్మకుఁ దొమ్మిదినెలలు నిండెను. పదియవమా సమున మూఁడుదినములు కష్టపడి యామె సుఖముగఁ బ్రసవించెను. మగశిశువు గలిగెను. ఏఁడవనాఁ డాశిశువు పోరు పెట్టెను. పిచ్చమ్మ తల్లికన్నప్పగారితండ్రి గంగయ్య కలలోఁ గనఁబడి తన పేరుపెట్టుమని కోరెను. అట్లు చేయుదు మని యింటిల్లిపాది మ్రొక్కుకొనిన తోడనే శిశువు పోరుమానెను. పదునొకండవనాఁడు పురిటిశుద్ధి కాఁ గానె బారసాల యయ్యెను. బాలునకు గంగాధరుఁ డని పేరుబెట్టిరి. చంటిపిల్లతల్లిని విడిచిపెట్టిపోవుటకు మనసొప్పక విధిలేక యన్నప్ప యల్లుఁడును, మఱికొంతఱును బతిమాలినపిదప మనుమనికి నాలుగు మాసములు వచ్చువఱకు నుండఁదలఁచెను. తరువాత నాఱవమాస మున నన్నప్రాశనము కాఁగానె యాముచ్చటఁజూచి వెళ్ళఁదలఁచెను. అన్నప్రాశనమైనతరువాత ప్రయాణమునకుమంచిముహూర్తమన్నప్ప వెదకిపెట్టెను. ఆముహూర్తపటుత్వ మెట్టిదో కాని యాసమయమున కన్నప్పగారి ప్రయాణ మాగిపోయి పాపయ్య కూర్ధ్వలోక ప్రయాణము సంప్రాప్త మయ్యెను. గొప్ప జ్యోతిష్కుఁడు పెట్టిన

ముహూర్తమగుటచే నప్పుడెవరికోయొకరికి ప్రయాణము కాకతప్పినది కాదు. పాపయ్య యదివఱకు మూఁడునాలుగుదినములనుండి వరుసగ శ్రాద్ధభోక్తయై పెసరపప్పు గారె లరిసెలుఁ దినియెను. వార్ధక మగుటచే నమితభోజనము సరిపడకపోయెను. ఆదినములలో మందపల్లిలో మరిడిజాడ్యములు బయలుదేఱెను. పాపయ్య దానివాతఁ బడెను. లోకమునకు విశ్వాసములేదు. కోటియనాథప్రేతలనుగట్టి పుల్లలవలెఁ గాల్చినపాపయ్యను మట్టిచేయుటకెవ్వరు రారైరి. ఎట్టకేలకు మామగారును మఱియొకరును సాయముపట్టి యెట్టెటో సంస్కారము జేసిరి. అన్నప్ప మందపల్లి విడిచిపెట్టి వెళ్ళుటకు శాశ్వతముగ వీలు లేకపోయెను.

ఐదవ ప్రకరణము.

మనుష్యులు గతింప వచ్చును; కాని వారు సంపాదించినయశస్సు వారియనంతరమునఁ జాలకాలము నిలుచును. పాపయ్య కాలధర్మము నొందినాఁడు. కాని యతఁడార్జించినధనము చాలవఱకువ్యయమైనను యశస్సు తరుగలేదు. వేదశాస్త్రంబులు చదువుకొననివారు చదువుట వ్రాయుట చేతగానివారు హాయిగా శవములు మోసికొని బ్రతుకవచ్చుననియు ధన మార్జింపవచ్చు ననియు నాంధ్రప్రపంచమునకు బోధించిన ప్రథమాచార్యుఁ డతఁడే కదా! స్వదేశమున నన్నవస్త్రములు దొరకనప్పుడు విదేశములకువెళ్ళి ప్రఖ్యాతపురుషులు కావచ్చునని తెలుఁగునాఁడువారికి నేర్పినపరమగురు వతఁడే కదా! ఏఁబదిసంవత్సరములవఱకు స్వకాయకష్టపడి ధన మార్జించి తానుసంపాదించినవిత్తము విదేశములలో వ్యయముఁ జేయక స్వదేశా

భిమానము గలిగి వార్ధకదశయందు స్వస్థలమునకు వచ్చి స్వగ్రామాభిమానముఁ బూని మందపల్లిలోనె వసియించి తాను జన్మించిన చోటనే మృతినొందిన దేశాభిమాని యితఁడే కదా! అందుచేత నతఁడాంధ్రుల కందఱకుఁ గాకపోయినను నతనియభిప్రాయముతో నేకీభవించువారికైనను మాననీయుఁడు. ఈతనిమార్గ మనుసరించి యీనాఁడు సయిత మాంధ్రులనేకులు విదేశములలోనెగాకస్వదేశములలోఁ గూడ నొకరి నాశ్రయించవలసినపనిలేనియావృత్తి నవలంబించి జీవయాత్రను జరుపుచున్నారు. పాపయ్యయొక్క యుత్తరక్రియలు నెరవేర్చినతరువాత నన్నప్ప కూఁతుదగ్గఱఁ జేరి యామెకు సంభవించిన దురవస్థకు మఱియొకసారి విలపించి యిట్లనియె. "అమ్మాయీ! నీ మగనియొద్ద గొప్పగానో కొంచెముగానో ద్రవ్యమున్నట్లు విన్నాను. అతఁ డిది యితరులకు బదులిచ్చి యున్నాఁడు. దస్తావేజులమీఁద నిచ్చినాఁడో నోట్లమీఁద నిచ్చినాఁడో తెలియదు. కాగితములు ముందుగఁ జూడనీ. ఊరకుంటిమా కాలదోషము పట్టఁ గలదు. అటుతరువాత మనముచేయవలసినపని లేదు. చీమతలకాయంత సందు దొఱకెనా యప్పు పుచ్చుకొన్నవాం డ్రెగబెట్టుటకె ప్రయత్నము సేయుదురు. లోకులు దుర్మార్గులు. అందులో నీయూరివారు మఱియు దుర్మార్గులు. అందుచేత సందువాపెట్టె తాళముచేయి నాచేతి కిమ్ము. కాగితములు చూచి యవసరమైన పని చేసెదను." అని బుజ్జగించి పలుకుటయు దుస్సహమైన నవవైధవ్యదుఃఖమున మఱుగుచున్న పిచ్చమ్మ తనప్రాణములు దాఁచినపెట్టెతాళ మిచ్చినదో యన్నట్లు సందువాపెట్టె తాళముచేయి దండ్రిచేతి కిచ్చెను. అతఁడు మెల్లఁగా సందులోనున్న నోటులన్నియుఁ దీసి చూడఁగా మొత్తము పదియేను వందలరూపాయలుండెను. ఆకాగితములు తీసికొని వెంటనే యతఁడు బాకీదార్లవద్దకువెళ్ళి యానోట్లు తిరిగి తనపేర వ్రాయుమని కోరెను.

భార్యయుండగఁ గుమారుఁ డుండఁగ మీపేర నేల వ్రాయవలయు నని యందుఁ గొంద అడిగిరి. అట్టి యనవసరప్రశ్నముల కన్నప్ప యిట్లుత్తరము చెప్పెను. "అయ్యా! మీరనుమానించవద్దు. నాబిడ్డ సొమ్ము నాకక్కఱలేదు. మగపిల్లలకంటె నా కాఁడుపిల్లలమీఁదనె ప్రేమ యెక్కువ. నాసొమ్ము దానికి పెట్టఁ దలఁచుకొన్నాను. కాని యెడల నీపదియేనువందలరూపాయ లేమూలకుసరిపోవును. పిల్లవానికి వడుగు గావలెను. చదువుసంధ్యలు చెప్పించవలెను. బట్టలు పాతలు గావలెను. సంసార మనఁగా సముద్రము. మీకు తెలియనిదేమున్నది. అదిగాక యీవ్యవహారములలో నేదైన నొకటి కోర్టు కెక్కినా నాకూఁతు రాఁడదికదా. అది కోర్టుకు రాఁగూడదు కదా? పిల్ల వాఁడు కోర్టుకువెళ్ళ టంతకంటె వీలు లేదుకదా. నేనే కోర్టుకు వెళ్ళి యావత్తుగ్రంథము జరిపించవలసినవాఁడను గనుక నాపేరనె కాగితము లున్నపక్షమున నెంతో వీలుగ నుండును. నామాట వింటి రా మీ కేదో కొంతసదుపాయము జేసెదను." ఆమాట నోటరాఁ గానే కొందఱు బాకీదారులు వడ్డి మాను మనిరి. కొంద అసలులోఁ గొంత తగ్గించమనిరి. కొందఱు కొన్ని శంకలు బయలుదేఱఁ దీసిరి. పిల్లవాఁడు చిన్నవాఁడు కదా! అతఁడు పెద్దవాఁడైనతరువాత వెను కటికాగితములను బట్టి మామీఁద వ్యాజ్యములు వేసి మాకొంప లమ్మించును. అప్పుడు మీరును మీమనుమఁడును సుఖముగనుందురు. నడుమ మేము చెడిపోవుదుము. దీని కేమి చెప్పుదురని వారు స్పష్టముగ నడిగిరి. సమయోచితబుద్ధికి బృహస్పతి యని చెప్పఁ దగిన యన్నప్ప దానికిఁ దగినయుత్తర మీయలేక పోవునా? పాపయ్య పేర నున్ననోట్లు మీయెదుట జించి వైచెదను. క్రొత్తగా మీరు నాయొద్ద బదులుపుచ్చుకొన్నట్లు నోట్లు వ్రాసి యియ్యవచ్చును. మీరు నాకు వడ్డియియ్యనక్కఱలే దని పలికెను. ఈ యేర్పాటు

బాకీదార్లకు నచ్చెను. అంతఱుఁ దిరిగి యన్నప్పపేర నోట్లు వ్రాసి యిచ్చిరి. ఇటువంటివిషయములలో నన్నప్ప మాటదప్పనివాఁడు. కావునఁ దనయల్లునిపేరనున్న వెనుకటినోట్లు వారియెదుటనె ముక్కముక్కలుగఁ జించిపాఱవైచెను. తాను వ్యవహారములోఁ జేసినమార్పు కూఁతున కెఱిఁగింప లేదు. ఎందున కెఱిఁగింప లేదని యడుగుదురేమో మగనిపేరు చెప్పినమాత్రమునను వాని కాగితములవిషయమెత్తినమాత్రమునను వానిసొమ్ముమాట సంస్మరించినమాత్రమునను సముద్రమువలె దుఃఖము పొరలిపొరలి రాఁగా బిడ్డ బెంగఁబెట్టుకొనునని చెప్పక యుండవచ్చును. లోకులు కాకు లన్నమాట నిజము. కూఁతురు మనుమఁడు కోర్టు లెక్కవలసినయవసరము లేకుండ నొక్కబాకీదారునియింటికి వెళ్ళి యడుగవలసినయవసరము లేకుండఁ గాలదోషమెప్పుడు పట్టునో యని కాగితములుచూచుకొనవలసినయవసరములేకుండ నన్నప్ప కూఁతురుసొమ్ము తనసొమ్ముగ మనుమనివ్యవహారము తనవ్యవహారముగఁజూచుకొనుచుండఁ గిట్టనివాండ్రుకొందఱు లేనిపోనినింద లతనిపై వైచిరి. ఎవ రేమనుకొన్న నతని కేమి? అతఁడు చేయఁదలఁచుకొన్నపని సూటిగఁ జేసెను. దూషణభూషణతిరస్కారంబులు దేహంబునకుఁ గాని పరమాత్మకు లే వన్నమాట యన్నప్పకు సాక్షికముగఁదెలియును. బంధువులుగ్రామస్థులు బిల్లవాని కేమైనఁ గొంతయాస్తిగలదాయని యన్నప్ప నడిగినప్పు డతఁ డిట్లు చెప్పుచుండును. 'పాపయ్య పునహాసతారాలు వెళ్ళి యేదో మూట సంపాదించి తెచ్చినాఁడన్న పేరేగాని ప్రాణముపోవునప్పటికి పట్టుమని పదిరూపాయలు లేవు. దినవారములకర్చు నేనే పెట్టితిని. పిల్లవాఁడు మీగ్రామస్థుఁ డగుటచేతను పాపయ్య మిమ్మునే నమ్ముకొనియుండుట చేతను మీరే పీరిని గాపాడవలెను.'

ఇట్లనుటలో నన్నప్ప యసత్య మాడెనని మనము తలంపఁ

గూడదు. పాపయ్యపోవునప్పటికింటిలో రొక్కము పదిరూపాయలైన లేనిమాట నిజమే. ఉన్నసొమ్ము బదు లిచ్చి యుండుటచే నన్నప్ప దినవారములకర్చుపెట్టినమాట నిజమే. దినవారములు నలువదిరూపాయలతోఁ దేల్చెను. పాపయ్యకుటుంబమును గ్రామస్థులు పోషింపవలసినమాట నిజమే. ఏలయన మనపాపయ్యభార్య పేరఁగాని కుమారుని పేరఁగాని చిల్లిగవ్వలేదు.

అల్లుఁడు పోయినతరువాత నన్నప్ప యాఱుమాసములకాలము మంచపల్లిలో నుండి పిమ్మట మూలస్థానము వెళ్ళవలసినపని యున్నదని ప్రయాణము లారంభించెను. అల్లుఁ డున్నప్పు డతనికి మంచితిథిగాని ముహూర్తముగాని శకునముగాని దొరకుటయె దుర్లభమయ్యెను. ఈసారియో ప్రయాణయోగ్యము లైనమంచితిథు లనేకములు లభించెను. తన్ను విడిచి వెళ్ళవద్దని కూఁతురు బహువిధముల బతిమాలెను. పరమార్థముల నెఱిఁగి పని చేయువారికడ స్త్రీలదీనాలాపములు పని చేయునా? దీనురాలైనబిడ్డను విడచి వెళ్ళుట న్యాయము కాదని గ్రామస్థులు మందలించినప్పు డన్నప్ప వారి కిట్లనియె. 'అయ్యా! మీకేమి? పైనుండి యెన్నిమాటలైనఁ జెప్ప వచ్చును. మునుపు పాపయ్య సంపాదించి తెచ్చిపెట్టు చుండెడివాఁడు గనుక నే నెన్ని దినము లున్నప్పటికి విచారము లేకపోయెను. క్రొత్తడబ్బువచ్చునట్టి విధములేదు. నాకుటుంబముతో నేనికడఁగూర్చుండి తిన మొదలు పెట్టితినా వాళ్ళకొంపగూడ పోవును. నేను నాయింటికివెళ్ళి నాపొట్ట నేను పోసికొంటినా నాబిడ్డకు భార ముండదు. దాని గంజి యది త్రాఁగి దాని యిల్లది దిద్దుకొను చుండెనా నే నప్పుడప్పుడు వచ్చి చూచిపోవుచుందును. ఇది నాబిడ్డక్షేమముకొఱకు చేయుచున్నపనిగాని మఱియొకటిగాదు.' ఆయుత్తరము విని నమ్మినవారు నమ్మిరి. నవ్వినవారు నవ్విరి. విచారించినవారు విచారించిరి. ఎన్నివిధములఁ

దాను బతిమాలినను వినక తండ్రి వెళ్ళిపోవుటకె సంకల్పించుకొని యున్నాఁ డని దృఢవిశ్వాసము దోఁచినతరువాత నొకనాఁటిరాత్రి పిచ్చమ్మ తండ్రినిఁ బిలిచి దగ్గఱఁగూర్చుండి పిల్లవాని నతనియొడిలోఁ బెట్టి పొరలిపొరలి వచ్చుదుఃఖ మాపుకొన లేక కొంతసే పేడ్చి గద్గదస్వరముతో ని ట్లడిగెను. "నాన్నా ! మీయల్లుఁడు పోయి యిప్పటి కెనిమిదిమాసములైనను నేను నోరెత్తి మాటలాడలేదు. ఏ మున్నదో యేమి లేదో నే నెఱుఁగను. అర్థప్రాణములు నీచేతనె బెట్టితిని. నిన్నే నమ్ముకొంటిని. లోకులు కొందఱు మనకు సొమ్ము య్యవలెనని చెప్పితివి గదా. ఆసొమ్మేమైనది? పుట్టెడుదుఃఖముతో నున్నదానను. నేనే మొగము పెట్టుకొని నిన్ను వ్యవహారమువిషయమై యడుగనని నీవే నాకప్పగింతువని యింతకాల మూరకుంటిని. నీదా రిని నీవు వెళ్ళుచున్నావు. నాగతి యేమి?' అడుగుటయు నన్నప్ప హిమవత్పర్వతమువంటి ధైర్యశాలియగుటచే నాఁడుదానివలె ధైర్య హీనుఁడు గాక నిబ్బరమైనమనసుతో నిట్లనియెను. 'అమ్మాయీ ! నీభర్తృమృతినొందునప్పటికి నీకునాలుగైదువందలరూపాయలు లోకు లవల్ల రావలెను. ఎక్కువవడ్డీ కాసపడి పాపయ్య పైమీఁద బట్ట లేనిపక్షీరుల కప్పిచ్చెను. ఆసొమ్ము చెట్టెక్కెను. ఒక్కఁ డైనను నియ్య లేదు. నేను నానాకష్టములుబడి రేయుంబగళ్ళు తడిమన్ను పొడిమన్ను గునట్లు వాళ్ళయిండ్లచుట్టుఁ దిరిగి రెండువందలరూపాయలు వసూలు చేసినాను. ఆసొమ్ము మన మీయెనిమిదిమాసములనుండి తినివేసినా ము. నీగతి యే మందునా! యిల్లు తనఖా బెట్టి నూరురూపాయ లెవరిదగ్గఱనైన బదు లిప్పించెదను. ఆసొమ్ముతో మీరిద్దఱే గనుక నొకసంవత్సరము కాపురము చేసితిరా తరువాత దేవుఁ డున్నాఁడు. ఈలోపుగ నేను కాలు చెయ్యి గూడతీసికొని నీయప్పు నేనేతీర్చి నీ కేదోయుపాధి గల్పించెదను. నిన్ను నేను వదలిపెట్టి యూరకుందు

నా? నాకవతల వ్యవహార మొకటి మించి పోవు చున్నది. గనుక నన్ను వెళ్ళనీ. నీభర్త పోవుచు నిన్ను నీబిడ్డను నామెడకు గుదెకట్టి వలెఁ గట్టి పోయినాఁడు. అని పలుకఁ దనపని వట్టిదయ్యె నని తెలిసికొని పిచ్చమ్మ కొంతసేపు వలవల యేడ్చి కొంత దుఃఖోపశమన మైనతరువాత "సరే! యిల్లు తనఖాపెట్టి రూపాయలు తెచ్చి యిచ్చి వెళ్ళు. తరువాత దైవమే యున్నాఁ" డని తనబిడ్డనుదీసికొని గదిలోనికి వెళ్ళిపోయెను. ఆమరునాఁ డన్నప్ప మనుమనిపక్షమునఁ గుమారైను సంరక్షకురాలుగ నేర్పఱచియామెచేతనె నిశాని పెట్టించినూరు రూపాయ లిప్పించి తనబత్తెకర్చుక్రింద రెండురూపాయలు మాత్ర మందులోనుంచితీసికొని రెండుదినములతరువాత మందపల్లి విడిచి మూలస్థానమునకు సకుటుంబముగఁ బోయెను. తరువాత మాసికములు పెట్టుటకుఁ గాని తదితర కార్యములకుఁ గాని యన్నప్ప మందపల్లి వచ్చుట కెంతమాత్రము దీరిక లేక పోయినది. పిల్లవానికి జబ్బుచేసిన దని పిచ్చమ్మ వర్తమానము పంపినప్పు డైనను వచ్చి చూచి పోవుటకు సయిత మన్నప్ప కవకాశముగలిగినది కాదు. బహుకార్యభారము పైన వేసికొన్నవారికి బంధుసమాగమము దుర్లభము గదా! పాపయ్యయొక్క సాంవత్సరికమునకైనను మామగారు రాఁ జాలక పోయెను. మందపల్లిలో నున్నకాలమున నల్లునిమాసికమాసికమునకు మిక్కిలి శ్రద్ధతో నన్నప్ప నేతిగారెలుఁ గారపుగారెలు కరకరలాడునట్లు మఱియొకవేపు రానిచ్చి వండవలసిన దని వంటకు వచ్చినవారితోఁ జెప్పు చుండుటచేత గారెలమీఁది ప్రేమచేత నైనసాంవత్సరికమునకుఁ దప్పక వచ్చునని యెఱిఁగినవా రనేకు లనుకొనిరి. కాని కావలసినప్పు డెల్ల గారెలువండుకొని తినుటకుఁ దగినయేర్పాటు పాపయ్యవలన శాశ్వతముగ జరిగినందున నతఁడు రాలేదు. సంవత్సరమిట్టె తిరిగివచ్చెను. నూరురూపాయలు గవ్వలవలె కర్చయ్యెను.

అందుచేత మరల నూరురూపాయలు పిచ్చమ్మ బదులు పుచ్చుకొని యెను. నాలుగుసంవత్సరము లగునప్పటి కిల్లమ్మివేయ వలసి వచ్చెను.

ఆఱవ ప్రకరణము.

కూఁతురు గృహ మమ్ముకొన వలసివచ్చినపు డైన నామె నొకసారి చూచుట కన్నప్పకుఁ దీరిక లేక పోయెను. కాపురముండుటకు మందపల్లిలో వారికి మఱొకయిల్లు దొరకనందున గంగాధరుని దోడ్కొని పిచ్చమ్మ యేనుఁగులమహాలుగ్రామమునకుఁ బోయెను. మందపల్లి కేనుఁగులమహాలు మిక్కిలి సమీపమున నున్నది. గోదావరీస ప్తశాఖలలో నొకటి యగు కౌశికి యను పాయ యేనుఁగులమహాలునకు మందపల్లికి నడుమ ప్రవహించు చుండెను. గోదావరిపాయ యనుగొప్పపేరే గాని యది యొక గొప్పకాలువ వలె నుండును. మహైశ్వర్యసమన్విత మగు నొక గొప్పకుటుంబము వివాదములు పెరిగి యాఱేడుకుటుంబములుగ భిన్న మైనవెనుక విభక్తకుటుంబములు తొల్లింటిసంపదను గౌరవమును గోల్పోయి లోకములోని సామాన్య సంసారముల వలె నుండుపగిది రాజమహేంద్రవరముకడ విశాలమై యఖండగౌతమి యను పేరువడసి నేల పైఁ బఱచిన గొప్పనీటి రేకువలె నొప్పుచుండుగోదావరి ధవళేశ్వరమునొద్ద నేడుపాయలుగఁ జీలిపోయినందున నాపాయలు వైశాల్యమునఁగానిజలసంపదయందుఁ గాని గాంభీర్యమునఁగాని యఖండగౌతమిని బోలక సామాన్యనదుల ట్లున్నది. కొన్ని నామావశిష్టము లైనవి. కొన్ని యంతర్వాహిను లైన వని చెప్పుదురు. కొన్ని స్వల్పములై గోస్తనీనదిమొదలగుచిన్న యేళ్ళవలెఁ బాఱుచుండును. కౌశికి ఇట్టివానిలోఁ జేరి పంటదినములలోఁ బుష్కలముగ ధాన్య మున్నకతనఁ గడుపునిండఁ దిని దేహపుష్టిగలిగి ధాన్యమైపోయినతరువాత పుష్టిలేక బడుగు వలెను పేదరయితువలె వర్షకాలమున వరద పొడిచినపుడు కొంచెము విజృంభించి గాంభీర్యము కలిగి దుస్తరమై యుండి శీతకాలమందుఁగాలినడ

కను దాటుట కనువై మండువేసంగియందు నీరేలేక తిప్పలు బయల్పడియుండును. వానకారుననేరుపొడిచినప్పుడు మందపల్లి యేనుఁగుల మహాలు లన్నవి వేర్వేరుగ్రామములుగఁ దోఁచును. కాని వేసవి కాలమున నొక్కటేగ్రామ మని భావింప వలసి యుండును. గంగాధరుఁడు స్థలభాండవిసర్జనము జేసి మందపల్లి విడిచి యేనుఁగులమహాలు చేరునప్పటికి రమారమి యేడుసంవత్సరములయీడు గలవాఁడై యేనుఁగుగున్నవలె నుండెను. ఏనుఁగులమహాలునకు రాక మునుపె గంగాధరుని కుపనయనముఁ జేయవలయునని పిచ్చమ్మకు సంకల్పము కలిగెను.

బ్రాహ్మణకుమారునకు గర్భాష్టమునం దుపనయనము జేయ వలయు నని ధర్మశాస్త్రమునందుండుటచేత నామెకుమారున కేడవయేఁట నుపనయనముఁ జేయఁదలఁచెనని చదువరు లూహింపవచ్చును. ఆయూహ సరి కాదు. గర్భాష్టమ మేమొ ధర్మశాస్త్రమేమొ పిచ్చమ్మకుఁ దెలియదు. ఉపనయనసంకల్పమున కొక్కటే కారణముగలదు. వేదతనమె ప్రధానకారణము. అన్నవస్త్రములకు వారికి మిక్కుటమైన యిబ్బంది కలిగెను. గంగాధరుఁడు వయసునఁ బిల్లవాఁడెకాని భోజనవిషయమునఁ బెద్దవాఁ డని చెప్పవచ్చును. ముమ్మారు మూఁడుసోలలబియ్య మతని కొకవిధముగ సరిపోవుచుండును. తల్లి వితంతువగుటచే మధ్యాహ్నమొకసోలెడుబియ్యపన్నము మాత్రమె తిని రాత్రి యుపవసించు చుండును. మొత్తముమీఁదఁ గావలసిన శేరుబియ్యమైన వచ్చెడుదారిలేదు. ఉపనయనము చేసెడుపక్షమున రెండుగ్రామములలో శ్రాద్ధబ్రాహ్మణార్థములు చేయవచ్చును. పొత్తరలు పట్టనచ్చును. ద్వాదశిబ్రాహ్మణుఁడుగ నమావాస్యబ్రాహ్మణుఁడుగ నుండవచ్చును. సంభావనకు వెళ్ళవచ్చును. కుమారుఁ డీవిధముగఁ దనపొట్టఁ దాను బోసికొను చున్నపక్షమున

పిచ్చమ్మ తా నెవరింటనైనఁ జేరి స్వోదరపోషణముఁ జేసికొనవచ్చు నని యుపనయనముఁ దలపెట్టెను. ఉపనయనముఁ జూచుటకుఁ గాక పోయినను బీటలమీఁదఁ గూర్చుండి జందెము వేయుట కైన నెవరు లేరుగావున నందులకైన నొకసారి రావలసినదని పిచ్చమ్మ తండ్రికి వర్తమాన మంపెను. కాని యన్నప్పకు వేదాంతము ముదురుటచేఁ బిల్లవానికిఁ దండ్రి లేనికారణమున జందె మెవరు వేసిన నది కూలికె యని తలంచి మఱియొకరిచేత నది చేయింప వలసినదనియుఁ దనకుఁ దీరిక లేదనియు వర్తమాన మంపెను. పాపము పిచ్చమ్మ యెవరినో బ్రతిమాలి జందెము వేయించి యుపనయన మైన దనిపించెను. ఏ మంచిముహూర్తమందు భిక్షాం దేహి యనుమాటగంగాధరునినోట వచ్చెనో కాని జన్మాంతమువఱకు నించుమించుగ నతఁడు దానినివదలి పెట్టక యేదోవిధముగ స్మరియించుచు వచ్చెను. అదియె యతనికిఁ దారకమంత్రమయ్యెను. ఉపనయన మైనయొకమాసమున కతఁడు ముందుగా యాయవార మారంభించెను. ఆగ్రామములో సరిగా వారిసంసారమునకుఁ గావలసినబియ్యము దొరకుట దుర్లభమైనందున మధ్యాహ్నము మాధుకరముఁ జేయు చుండును. శ్రాద్ధభోక్తగ వెళ్ళిన నాఁడు మాత్రము మాధుకరము మాను చుండును భగవంతుఁడు నిర్హేతుకజాయమానకటాక్షముచేతఁ గొందఱకు బాల్యమునందె యీడునకుఁ దగినప్రజ్ఞ నిచ్చుచుండును. ఈశ్వరానుగ్రహముచేత భగవానుఁ డగుశంకరాచార్యుఁ డేడవయేఁటనె సాంగవేదాధ్యయన సంపన్నుఁ డయ్యెనఁట. ఒకఁ డెనిమిదవయేటనె కవిత్వముఁజెప్పెను. పూర్వజన్మసుకృతము చేతనో యీజన్మసుకృతముచేతనో గంగాధ రునకుఁగూడ నట్టియద్భుతప్రజ్ఞ చిన్ననాఁటనె గలిగెను. అది భోజన విషయమైనప్రజ్ఞ. అతనిభోజన మీడునకుఁ దగినది కాక పోవుటచేఁ దల్లి దృష్టిదోషము తగులు ననుభయమునఁగొంతకాలము

తరుచుగ బ్రాహ్మణార్థములకుఁ బోవనీయక మాధుకరవృత్తిచేతసం పాదించినయన్న మతనికిఁ బెట్టుచు నది మూఁడుపూటలకుసరిపోవమి యాయవారమెత్తి తెచ్చినబియ్యము వండి పెట్టుచుఁ గాలక్షేపము సేయుచుండెను. తల్లిప్రాణ మగుటచే బిడ్డ దృష్టి తగిలి యెక్కడ చెడిపోవునో యని కడు భయంపడుచు బ్రాహ్మణార్థముల కతఁడు పోయివచ్చినతరువాత మిరపకాయలుదిగదుడిచి పొయిలోఁబోసియుఁ గచ్చిక లాముదములో ముంచి దీపము వెలిఁగించి చుట్టుఁ ద్రిప్పి వీథిలోఁ బాఱవైచియు నుప్పుఁదిగదుడిచి నూతిలోఁ బాఱవైచియుఁ బిచ్చమ్మ బహువిధములఁ దనయున కంగరక్షలు చేయుచుండును. ఇంటికిఁ జుట్టములు వచ్చినపుడు పిచ్చమ్మ కుమారుని వారిపంక్తి కెన్నఁడు రానీయదు. గంగాధరున కన్నాదరువులు విశేష మక్కఱ లేదు. తరవాణిలోనియన్న మూరుఁగాయగాని నీరుల్లిపాయ గాని నంజుకొనుచు నదియెంతో యాప్యాయనముగఁదినును. తరవాణికుండ యతనిపాలిఁటి కమృతభాండమె. పెద్దవాఁడైన తరువాతఁగూడ గంగాధరుఁడు చిరకాలసహవాసముచేతఁగాఁబోలు తల్లినైన విడువఁ గలిగెను. కాని యుల్లిని తరవాణికుండను విడువ లేకపోయెను. వెయ్యేల! యదియతనికీలువేల్పు. ఈనాఁటివారుప్రాతఃకాలముననుపగ లు మూఁడవజామునను కాఫీ గాని టీ గాని త్రాగక పోయినయెడల నెట్లు వసివాళ్ళు వారి తలనొప్పులచేత బాధపడి కూర్చుండినచోట నుండిలేవలేక పోవుదురో, యానాఁడుగంగాధరుఁడుగూడ నట్లెయున యమునఁ దరవాణిఁద్రాఁగక యదికలిసిన యన్నము కొంచెముతినక యిల్లువెడలఁ జాలఁడు. పలుపిండివంటలతో శుభకార్యములయందును గుడుములు మొదలగువానితో శ్రాద్ధములయందును షడ్రసోపేతముగ భుజియించి వచ్చినతరువాత సయితము గంగాధరుఁ డొక్కనిద్దురదీసి సత్తుతప్పెలెడు తరవాణి త్రాఁగినంగానియతనిప్రాణము తెప్పిరిల్లదు.

ఎండఁబడి వచ్చెనా యతని కదేశరణ్యము. తరవాణి యంతచే టల వాటైనప్పుడు గంగాధరుఁడు శ్రాద్ధభోక్తగ వెళ్ళినవాఁడు సయితము ముందుగా నది కొంచెము పుచ్చుకొని వెళ్ళునాయని మీకుసందేహము గలుగవచ్చును. అట్టిసందేహములకుఁ బనిలేదు. త్రికరణశుద్ధిగ నతఁడు పుచ్చుకొని వెళ్లును. అట్లయిన శ్రాద్ధము చెడదా యందురే మొ శ్రాద్ధము చెడనీ పితృదేవతలు చెడనీ గంగాధరుఁడు చెడఁడు. అదియునుఁగాక "అన్నము పరబ్రహ్మ స్వరూపము. అదిచేసినదోషములేదని యార్యులు వక్కాణించుధర్మోక్తులు పండితులనోటవ్యర్థముగ వచ్చుచుండునుగాని యనుభవసిద్ధిఁ గనవు. గంగాధరుఁ డావాక్యములయందు దృఢవిశ్వాసము గలిగి యన్నమెప్పుడు తిన్న, నెన్ని మారులుతిన్న నెంతతిన్న నెక్కడతిన్న తప్పు లేదని నమ్మి నమ్మినట్లు నడచు చుండును. వివాహాదికార్యములలో నతఁ డెక్కడికైన సంభావనలకు వెళ్ళినప్పుడుపదిమందిని జుట్టుంజేర్చికొని యతఁడు తరవాణిమీఁద నుపన్యాస మిచ్చునపుడు విని తీరవలయును. మతిలేని బ్రహ్మదేవుఁ డోర్వలేక యతనిని నిరక్షరకుక్షినిజేసెఁగాని నిజముగ నతనికివిద్యాపరిచయమున్నపక్షమున నతఁడుతరవాణిమాహాత్మ్యమొలేక తరవాణిపురాణమొ వ్రాసియుండును. దానింగూర్చి యతఁడు పెద్దవాఁ డైనతరువాత నప్పుడప్పుడు చేసినయుపన్యాసములలోని సారాంశములు కొన్ని యీక్రింద నుపహరింపఁబడుచున్నవి.

"దేవతల కమృతము, మనుష్యులకుఁ దరవాణి బ్రహ్మదేవుఁడు విధించినాఁడు. అమృతముమీఁద విసుగెత్తి దేవతలు తరవాణికొఱకుఁ దపస్సు జేసినారు. కాని యిది వారికి దొరకలేదు. గుర్రెక్కఁడు తరవాణి త్రాగెనా చంద్రునికళంక మిన్నాళ్ళుండునా? దినమునకు ముమ్మారు మూఁడుసత్తుగిన్నెలచొప్పున తరవాణియొకమండలము సేవించెనా సాంబమూర్తికంఠములోనినలుపు హరించిపోదా? ఇది రెండు

చుక్కలు నోటిలోఁ బడెనా శివునకు విసముఁదిన్న వెగటు నశింపదా? ఈతరవాణిత్రాగియె భీముఁడు దుర్యోధనునితోడలు విరుగఁగొట్టెను. అర్జునుఁడు శత్రువులను జావఁ గొట్టెను. వానరులు వారిధి గట్టిరి. ఆంజనేయులు సముద్రము దాటెను. లక్ష్మణస్వామి మూర్ఛపోయినపు డాంజనేయులు వెళ్లిపడి సంజీవిఁ దెచ్చెను. కాని యుప్పుకలిపిన పుల్లనితరవాణి గిద్దెడు నోటిలోఁ బోసి యొకపచ్చియుల్లిపాయ నంజుకొనఁబెట్టినచో గిరుక్కున లేచి కూర్చుండకపోవునా? తెలివితేటలు లేవు. తరవాణికుండ నూరావులపాడిపెట్టు. ఆవులకు గడ్డి కావలె. గాదము కావలె. ఒకపూట దూఁడ కుడుచుకొనిపోవుట, మఱియొక పూట తన్నివేయుట మొదలగు చిక్కులుగలవు. తరవాణికుండ కట్టి చిక్కులులేవు. అది లేనికొంప కొంపగాదు. రోగములు వచ్చినపుడు పాడుకషాయములు రుచిలేని యరఖ్ఖులు త్రాఁగి గిజగిజ తన్నుకొనుటకంటె మాత్రివేసికొని తవ్వెడేసితరవాణి త్రాగితే యెక్కడ జబ్బక్కడ యెగిరిపోవును. తరవాణి త్రాగుమని చెప్పని వైద్యుఁడు వైద్యుఁడా? కుడితి పశువుల కెంతబలమొ మనుష్యులకు తరవాణియంత బలము."

ఇట్లు పలుమారు పన్యాసములు చేయుటతోఁ దనివిఁ జెందక తరవాణికుండలు కొందఱియిండ్లలో బోధచేసి పెట్టించెను. మిక్కిలి రుచిగానున్నవస్తువు దిన్నప్పు డెవరైన "నహాహా! యిది యమృతము లాగున్నదిరా" యని మెచ్చిరేని గంగాధరుఁడు వెంటనే కోపపడి "ఛీ అమృతములాగున్నదనుచున్నావా? తరవాణిలాగున్నదని చెప్పు" మని చీవాట్లు పెట్టుచుండును. అట్టివాండ్రు చిన్నవాండ్రైనయెడల నట్టి మాట లిక నెన్నఁ డనవలదని బుగ్గలునులిమి యొకటిరెండు చెంపకాయలు గొట్టుచుండును.

ఇట్లు యాయావరమాఘకరవృత్తులచేతను బ్రాహ్మణార్థము

చేతను గంగాధరుఁడు తనపొట్టఁ బోసికొని మాతృసంరక్షణముఁ జేయు చుండెను. అట్లు కొంతకాలము నడచెను. గంగాధరునకు మిక్కిలి ప్రియమైనయుల్లిపాయయొక్క వాసనవలెనే యతనికీర్తి యెంతకప్పి పుచ్చినను దాగక నలుదెసల వ్యాపించెను. తలుపులు వేసికొని తెల్ల వారుజామునను యెవ్వరుఁ జూడకుండ నతఁడు తరవాణియన్నము మిక్కిలి రహస్యముగఁ దినుచున్నను లోకులెట్లో యావిషయము గ్రహించిరి. నాలుగుగోడలనడుమ జరిగిన యారహస్యవృత్తాంతము బయలుపడుటచే లోకు లనుకొనునట్లు గోడలకు చెవులేగాక నాలుక కూడ నున్నదేమోయని సందేహింపవలసియున్నది. బ్రాహ్మణార్థ ములకు వెళ్ళినప్పు డపరాహ్ణము తిరిగె నేని తక్కిన బ్రాహ్మణు లాఁకలిచేత గిలగిల లాడుచుండఁగా గంగాధరుఁ డాకలిదప్పికలు లేక యాయివలెఁ గూర్చుండుటచేతను వానినోరప్పుడప్పు డుల్లిపాయకంపు గొట్టుచుండుటచేతను నతఁడు తరవాణితో నభిషేకము జేసి చల్ల కూఁడు నైవేద్యము పెట్టి యాత్మారాముని సేవించి యుండునని గ్రా మవాసు లూహించి యొకటిరెండుసారు లతనిని బిలిచి యడిగి దూషించి యతనిని బ్రాహ్మణార్థములకుఁ బిలుచుటమానిరి. కొంద ఱాతనికి వెలిసిని తమయిండ్ల శుభకార్యములకు సయితము రానీయక పోయిరి. కొందఱు మాఘకరము పెట్టుట మానిరి. యాయావరము నందు సయిత మక్షయపాత్రి ముసుపటివలె నిండుటలేదు. ఈకారణ ములచేత గంగాధరుఁ డేనుఁగులమహాలునుండి రంగస్థలము మార్పఁ దలఁచెను. దీర్ఘాలోచనమీఁద గోదావరీమండలమునకుఁ బ్రధానపురమై న కాకినాడ తన ప్రజ్ఞాప్రదర్శనమున కుత్తమరంగమని తోఁచెను. తోఁచుటయె తడవుగ నది తల్లితోఁ జెప్పి మరునాఁడు పయనమైపో యెను. పోయి యక్కడ మొదట రెండుదినములు సత్రములోఁ దాను భోజనము జేసి తల్లి నత్తిసరు పెట్టుకొమ్మని చెప్పి పట్టణ మంతయుఁ

దిరిగి స్థితిగతులు పరిశీలించి కాకినాడలో నాకాలమున జనులు నీరు దొరకక విశేష మిబ్బంది పడుచుండుటచే వారిబ్బంది తీర్చుటకై తనజన్మము వినియోగింపఁ దలఁచెను. అతని నిర్ధారణము తల్లిమాట సంగీకరించినందున మరునాఁడె కావడి బద్దయు రెండుమట్లు గొని తెచ్చి మొదట నొకరిద్దరివాడుకలు సంపాదించి నీళ్లుమోయనారంభించెను. ఆతనిచాకచక్యము కార్యవ్యగ్రత మొదలైనవి చూచి పట్టణము దనేకులు వానినే నీళ్లుపోయుమని కోరిరి. దినమునకు ముప్పదికావిళ్ళైనను గంగాధరుఁడు మోసెననుట యతిశయోక్తిగాదు. కాకులు కూసినవేళ లేచి సూర్యాస్తమయ మగువఱకు నించుమించుగ నతఁడు కావిడి దింపఁ డనుట నిశ్చయము. కొంతపైకము చేతఁ జిక్కువఱకు నతఁడు సత్రములోనె కాపురముండి పిమ్మట నొకచిన్నయిల్లద్దెకుఁ బుచ్చుకొనెను. గంగాధరునిపేరు పట్టణ మంతయు వ్యాపించెను. కలక్టరుకచేరీలోని గుమాస్తాలు మొదలగువారు తమలోఁదమరు సరస సల్లాపములు చేసికొనునప్పుడు మనకన్న గంగాధరుఁడు మిక్కిలి యదృష్టవంతుఁడు. చదువురాక యతఁడు నెలకు ముప్పదిరూపాయలు సంపాదించుచుండఁగా మన మెన్నో పరీక్షలలోఁ గృతార్థులమై పదియేనురూపాయలు తెచ్చికొనుట దుర్ఘటముగ నున్నదని చమత్కారముగఁ బలుకుచుందురు. తనచేత నీళ్లు పోయించుకొనువారు నెలకొక్కనాఁడు రెండుపూటలఁ దనకు భోజనము పెట్టవలసినదని గంగాధరుఁడు నియమ మేర్పఱచి యట్లొప్పుకొన్నవారికె నీళ్ళు పోయుచుఁ దనతిండికిఁ దడవుకొన నక్కఱలేకుండ హాయిగఁ గాలక్షేపము సేయుచుండెను. ఎవరిపంచనైన సోలెడుబియ్యము కాఁచుకొని దల్లిం దినుమనక ప్రత్యేకముగ నొకచిన్నయిల్లు గంగాధరుఁ డేల బాడిగెకు పుచ్చుకొనవలయునని మీకు సందేహము తోఁచవచ్చును. అందుకు ముఖ్యకారణ మిది. తనపాలిటి కల్పవృక్షమై కామధేనువై చిం

తావణిమై ఉకన్నతల్లివలె తన్ను చిన్ననాఁటనుండియుఁ గాపాడు చుండిన తరవాణికుండను బ్రతిష్ఠించుటకుఁ బరగృహమందు వీలుండ దనియు నొకవేళ ప్రతిష్ఠించుటకు వీ లున్నను దనగుట్టు దాఁగదని యు నెఱిఁగి యతఁడు ప్రత్యేకముగ నిల్లుప్రుచ్చుకొనియెను. నెలకు ముప్పదిరూపాయలు సంపాదించు చున్నాఁడు గనుక గంగాధరుఁడు కావలసినంత ధనము కూడఁబెట్టునని మీలోననేకులు తలంపవచ్చును. కాని యట్లు తలంపఁగూడదు. ఎంతచెట్టు కంతగాలి యన్నమాట జ్ఞాపక ముంచుకొనుఁడు. అతఁడు నలమహారాజంతవాఁడై ధర్మరా జంతవాఁడై ధనముగడ్డిపఱకగఁ జూడ నారంభించెను. జూదమునందు మంచిపందెములు పెట్టుటకు నలమహారాజువలె రాజ్యముకాని, ధర్మ రాజువలెభార్యగాని గంగాధరునకు లేకపోయినను యథాశక్తిగ నతఁడు కష్టపడి సంపాదించిన విత్త మెప్పటి కప్పుడు ప్రాచిద్రవ్యము లేకుండ నొడ్డుచుఁ దరుచుగనోడిపోవును. అప్పుడప్పు డప్పులపాలగుచు సొమ్ము దాచవలసినబాధ లేకుండఁ గాలము గడుపుచుండెను. ఎప్పు డైనఁ నతఁడు గెలిచెనా యాసొమ్మదివఱకు జేసిన ఋణమును దీర్చుట కిందఁబోవును. అప్పు తీరగా నించుక మిగిలెనా యది సింహాచల యాత్రకిందఁ సరిపోవును. చిత్తజల్లుసింహాచలమని యాయూర నొకవే శ్యాంగనకలదు. దానివయస్సు గంగాధరునివయస్సుకంటె రెట్టింపు గలదు. కాకినాడపురవాసులలో ననేకులదివఱకు సింహాచలసేవ చేసి చేసి విసిగి యితరదేవతాప్రభావములు విని వారిసేవలకై పోయి యుండుటచే నప్పుడు సింహాచలము పూజాపునస్కారములులేక పాడు దేవాలయములో బూజుపట్టియున్న దేవతావిగ్రహమువలెనే యుత్స వములు లేక నల్లమందు కైనను సరిగా వచ్చుబడి లేక ప్రాతగుల్ల లొక్కొక్కటేయమ్ముకొని జీవనముచేయుచుండఁగా దానిపాలిటిదైవ మువలె గంగాధరుఁడు వెళ్ళియామనుకొని యప్పుడప్పుడుకొంతహిరణ్య

ము సమర్పించుచు దిక్కుమాలినకుటుంబము బోషించినపుణ్యము గట్టుకొనుచుండెను. అతనిదాతృత్వమునకుఁ దగినసొమ్మతనికిభగవంతుఁడీయలేదు. కాని యిచ్చినపక్షమున నతఁడుగూడ దానికొకగొప్ప మేడ మేటిసాహుకారులు తమప్రియురాండ్రకుఁ గట్టించినవిధముగఁ గట్టించియుండును. కోరినధన మీయలేకపోయిన గంగాధరుఁడు సింహాచలమునకు శక్తివంచనలేక యుపచారములు చేయఁదలఁచి తలదువ్వుట, తలయంటి నీళ్ళుపోయుట, గారెలు బూరెలు మొదలగుపిండివంటలు స్వయముగావండిపెట్టుట, గుడ్డలుతుకుట, యంట్లుతోముట మొదలగుకార్యములు శంకాతంకములేకచేసి దానిమెప్పువడసి ధన్యుఁడగుచుండును. ఆతనియుదారభావమును దీనిబట్టియే మీరు గ్రహింపవచ్చును. తానగ్రజన్ముఁడైనబ్రాహ్మణుఁ డని గర్వింపక సందేహింపక యది నీచకులజురాలని యేవగింపక యీపనియాపని యనక శంకింపక యట్టియుపచారము చేసినవాఁడు సామాన్యుఁడా ?

కాకినాడలోనున్నకాలమున గంగాధరుఁడు కనఁబఱచినప్రజ్ఞను గూర్చి యొకటిరెండుమాటలు చెప్పవలసియున్నవి. గంగనుమోయుటచేత గంగాధరుఁడు, సాక్షాత్తు గంగాధరుఁ డయ్యెననుట కల్పనాగౌరవము కాదు. శివుఁడు తలపై నిడుకొని గంగను మోసెను. మనగంగాధరుఁడు కావడిలో నిడుకొని గంగనుమోసెను. ఆగంగాధరుఁడు శూలముధరించుటచేత శూలియయ్యెను. ఈగంగాధరుఁడు కడుపుమానమెఱుఁగక తినినందున సంభవించినపరిణామశూలగలవాఁడగుటచేశూలియయ్యెను. ఆగంగాధరుఁడు శిరమున నర్ధచంద్రరేఖధరించెను. ఈగంగాధరునికిఁగూడ శిరస్సునఁ గాకపోయినమానె మెడమీఁద నర్ధచంద్రప్రయోగములు చాలసారులుజరిగెను. గంగాధరుఁడనేకలక్షణములలోశివునకు సమానుఁడగుటయేగాక నొకవిషయమున నారాయణుఁడంతవాఁడని చెప్పవచ్చును. క్షీరసాగరమందు శేషశా

యిట్లై నిరంతరము వసియించుటచేత నారాయణుఁడను పేరుకలిగెను. నారమనఁగా జలము. అయనమనఁగా స్థానము. నారాయణుఁడనఁగా జలమెస్థానముగాఁ గలవాఁడు. గంగాధరుఁడుగూడ తఱుచుగా జల గ్రహణార్థము చెరువులలో నుండుటచే నారాయణుఁడని చెప్పుట తప్పుగాదు. ఒక్కనారాయణునితోడనేగాదు. గంగాధరు ననేకదేవ తలతోఁబోల్పవచ్చును. గంగాధరుఁడు పాకశాసనుఁడు. పాకుఁ డను రాక్షసుని శాసించుటచేత నీపాకశాసనశబ్దము లోకమున దేవేంద్రుని యందు వర్తించుచున్నది. పాక మనఁగా వంటను శాసించుటచేత గంగాధరునియందుఁగూడ నీశబ్దము సార్థకమని చెప్పవచ్చును. గంగా ధరుఁడు వంటచేయునని యిదివఱ కెక్కడను జెప్పియుండకపోవుటచే నతనియం దాశబ్ద మెట్లు సార్థకమగునని మీరనుమానింపవలదు. ఒకఁడు తర్కవ్యాకరణములను రెండుశాస్త్రములయందు నిర్దుష్టపాం డిత్యముగలిగియుండియు నేదో యొకటే యభిమానవిద్యగ స్వీకరించి యందెక్కుడుకృషి చేసియుండవచ్చు. అటులే గంగాధరుఁడు పాకశా స్త్రమందును జలవాహనశాస్త్రమందును గూడ నధికపరిచితుఁడై జలవాహనశాస్త్రమందె యధికాభిమానము గలిగి విశేషాభ్యాసము జేసెనని గ్రహింపవలయునే కాని పాకశాస్త్రమందుఁ బరిచితి లేదని గ్రహింపఁగూడదు. ఈకారణమున గంగాధరునకుఁ బాకశాస్త్రమం దుఁ బరిచితి గలదని మీరొప్పుకొనక పోవుదురేని సింహాచలమున కిష్టమైనపిండివంట వండిపెట్టుచుండెడివాఁడని యిదివఱ కుదాహరింపఁ బడుటచేత మీ రీవాద మంగీకరింపవచ్చును. ఒకసంవత్సరము శ్రావ ణమాసములో నీయింటిమీఁదకాకి యాయింటిమీఁద వాల కుండ నాకసము చిల్లిపడునట్లు వానకురియుచుండఁగా గంగాధరుఁడు జడి వానలకు లెక్కపెట్టని దున్నపోతువలె నించుకేనియుఁ జలింపక నెప్ప టిచాకచక్యముతో నీళ్లుమోయుచుండుటఁ జూచి ఛందశ్శాస్త్రము

నూతనముగ నేర్చికొని పద్యములు చెప్పవలయు నని యుబలాటము పడుచున్న యొక బాలకవి గంగాధరునిప్రజ్ఞయె విషయముగఁ బుచ్చి కొని కొన్ని పద్యములు రచియించెను. ఆపద్యములు లభింపలేదు. కాని వానియందలిభావముమాత్రము మాకు లభించినందున క్షీర మునుపిడిచి దానిసారమైన మీగడముద్ద నిచ్చినట్లు తత్సార మిందుఁ బొందుపఱుపఁబడుచున్నది. "ఓగంగాధరా! నీప్రజ్ఞవర్ణించుట కాది శేషునకు వేయినాలుకలుచాలవు. నీవు కావడిబద్దపట్టుకొన్నప్పుడు గాండీవము ధరించిన యర్జునుఁడు జ్ఞప్తికి వచ్చును. పచ్చడి చేయుటకు నీవుబండపుచ్చుకొన్నప్పుడు రోఁకలిధరించిన బలరాముఁడు జ్ఞప్తికి వచ్చును. వడ్డించుటకుఁ బళ్లెము పుచ్చుకొన్నప్పుడు సుదర్శన చక్రము ధరించినహరి మనంబునందట్టును. నీపాకము నలపాకభీమపాక ముల మించును. నీవు చిమ్మిలిముద్దలు మ్రింగుచున్నప్పుడు చూచిన వారు పూర్వకాలము శంకరుఁడు కాలకూటవిషపుముద్ద నిట్లెమ్రింగె ననిసముద్రమథనవృత్తాంతముజ్ఞప్తికిఁదెచ్చుకొని సంతసించుచుందురు. నీకీర్తి బుఱ్ఱగుంజువలె ముంజెవలె సున్నమువలె చల్లవలె విభూతి వలె వరిబియ్యపన్నమువలె ముసలివానితలవలె నెంతో తెల్లనైదిక్కుల యందు వ్యాపించి యున్నది. ఆకృతిపతికి నీకృతికర్తకు నాకవిత్వ మునకు "తగు దాసరికి మెడపూసలకు" నన్నట్లు సరిపోయెను.

ఏడవ ప్రకరణము.

భగీరథుఁడు మహాప్రయత్నముఁజేసి కష్టపడి గంగను భూమికిఁ దెచ్చి జగజ్జనులకు మహోపకారము చేసిన తెఱఁగున గంగాధరుఁడు కష్టపడి గంగను దెచ్చి కాకినాడపురవాసుల కిచ్చి వారికి మహోప

కారముఁ జేయుచుఁ గాలముఁ గడపుచుండఁగా నొక వైపరీత్యము జరిగెను. అది కాకినాడపురవాసులు చేసికొన్న దురదృష్టము వలనసంభవించినది. ఆపట్టణమందొకగొప్పవైశ్యునియింటవివాహము జరిగెను. విజయనగరమునుండి మగపెండ్లివారు తరలివచ్చిరి. కన్యాప్రదాత లక్షాధిపతి. వరునితండ్రియునట్టివాఁడె. సుముహూర్తసమయమున వందలకొలఁది జామారులు, శాలువలు, పెద్దకాసులు, పిల్లకాసులు, కన్యాప్రదాత సభలో వెదజల్లెను. కుండలములు ధరించినవారికి రుద్రాక్షలుదాల్చినవారికి పిండికట్లుపెట్టినవారికి పిల్లజుట్లవారికి దర్భాసనాలవారికి సిఫారసులు దెచ్చికొన్నవారికి నివి విశేషముగ ముట్టెను. అందు గంగాధరున కొక్కటియుముట్టలేదు. అతని కెవ్వరుసిఫారసు చేయలేదు. అందుచేతఁ గాకినాడపురవాసు లందఱుఁ గృతఘ్నులని యతఁ డెంచికొనెను. చెంబు చేతితో నెత్తి కాకినాడలో దాహము పుచ్చుకొన్నవారిలో ననేకులు గంగాధరునిపేరు తలఁచుకొనవలసినదే కదా! వేదశాస్త్రములురాక వెఱ్ఱికుక్కలవలె వీధులవెంటఁ దిరుగుబండవాండ్రి కెందఱకు మొగమోటమిచేత సిఫారసులచేతఁ బండిత సంభావనలుజామారులు ముట్టలేదు? అదివఱకు వెంకన్న, సుబ్బిగాఁడు, గంగప్ప యనుపేళ్ళుగల నిరక్షరకుక్షులు నీళ్ళబ్రాహ్మణులు వంటబ్రాహ్మణులు నాఁ డాహితాగ్నులై వెంకటావధానులు, సుబ్బన్నదీక్షితులు, గంగప్పసోమయాజులు ననుబిరుదులు ధరించిరి. ఎన్నో దర్భాసనములబూజు దులుపఁబడెను. ఎన్నోజారీచెంబు లెఱ్ఱగాఁ దోమఁబడి హస్తములయం దమరెను. ఎన్నో చినిఁగినశాలువలు శిరస్సుల నలంకరించెను. ఒకకోమటి యుంచుకొన్న వెలయాలిచెల్లెలి నుంచుకొన్న యొకవంటబ్రాహ్మణున కాకోమటి సిఫారసు జేసి పండితుఁడని పిల్లకా సిప్పించెను. ఆబ్రాహ్మణుఁడు గూడ శాలు వెక్కడో యెరవు దెచ్చికొని తలకుఁ జుట్టుకొని యాపూటకు గరిటి యావలఁబాఱవైచి

గంటము దాఁటి యూరు చేతఁ బుచ్చుకొని గొప్పపండితునివలెఁ గనఁబడెను. గంగాధరున కట్టి యుపాయము చెప్పువా రెవ్వరు లేకపోయిరి. అతనికి స్వయముగ నుపాయము తోఁచలేదు. తోఁడివంటబ్రాహ్మణునకుఁ బిల్లకాసు దొరకుటయె గాక పండితుఁ డని గౌరవము గూడ సభలోఁ గలిగినందున గంగాధరునికడుపులో మంట హెచ్చెను. మనంబున మత్సరము వృద్ధిఁబొందెను. పురవాసులపై నలుక రెట్టియయ్యెను. ఆనాఁటి కెట్లో కోపము లోలోపల జీర్ణముఁ జేసికొనిఁ యతఁ డింటికిఁ బోయి సదస్యమునాఁ డెక్కువసంభావనదెచ్చికొనుట కుపాయము వెదకుచుఁ దనచేత నీళ్ళు మోయించుకొను నొకరిద్దఱు పెద్దమనుష్యులయొద్దకు వెళ్ళి సిఫార సిమ్మని యడిగెను. "నీవు ఘనాపాఠివా? షోడశకర్మాధికారివా! మహాపండితుఁడవా? ఏమని నీకు నేను సిఫార సియ్యఁగలను? నీళ్ళబ్రాహ్మణునకు సిఫార సిచ్చిన పక్షమున నాగౌరవ ముండునా" యని యొకఁడు బదులు చెప్పెను. "నేను పెండ్లి వారి నెఱుఁగ" నని మఱియొకఁ డుత్తరముఁ జెప్పెను. ఆపలుకులు వినఁగానె గంగాధరున కెంతకోపమువచ్చినదని చెప్పను! "ఛీ మీకు విశ్వాసములేదు. ఇఁకమీఁద మీయిండ్లలో నీళ్ళు మోసితినా కాశీలో గోహత్యఁ జేసినట్టె" యని మహాకోపముతో వారియిండ్లు వెడలి వచ్చి "యొకనిర్భాగ్యుఁడు నాకు సిఫారసు చేయు టెందుకు? దేవుఁ డిచ్చినకాళ్లు చేతులు నుండఁగా నే నొకరి నాశ్రయింప నేల" యని మఱెవ్వరిని సిఫార సడుగక స్వయంసహాయమె మంచిదని తత్ప్రయత్నముఁ జేయుచుండెను. సదస్యమునాఁడు బ్రాహ్మణసంతర్పణ మైనతరువాత సంభావన సాయంకాల మీయఁ దలఁచి పెండ్లివారు భోజనానంతరమున బ్రాహ్మణుల నందఱ నొక దొడ్డిలోఁ బెట్టిరి. రెండువేలబ్రాహ్మణ్యము చేరెను. ప్రతివాఁడు ముందుగా సంభావన గ్రహింపవలయునని యొండొరులం ద్రోసికొ

నుచు ద్రొక్కి-కొనుచు విసనకఱ్ఱలతోఁ గొట్టుకొనుచుఁ దిట్టికొనుచు బ్రాహ్మణు లాకాశము పగులునట్లరచుచుండిరి. సంభావన లిచ్చుటకు మొదలు పెట్టునప్పటికి సాయంకాల మయ్యెను. గంగాధరుఁడు దృఢదీర్ఘకాయుఁ డగుటచేఁ దనకంటె ముందున్నవారినెందఱినో వెనకకులాగివైచి ముందువెళ్ళిపడి సంభావనకుఁ జేయిచాచెను. పెండ్లివారువివాహ మైనవారికి రూపాయచొప్పునను బ్రహ్మచారుల కర్ధరూపాయ చొప్పుననునీయఁదలఁచిరి. పాపము గంగాధరుఁడు ముప్పదియేండ్ల వయసువాఁడై చిన్నతాఁడిచె ట్టంతపొడుగున్నను వివాహితుఁడు కాకపోవుటచే నేఁ డెనిమిదిసంవత్సరముల వయసుగలిగి యతనిమోకాలంత పొడుగైన లేని చిన్నబ్రాహ్మణులకు ముట్టినంత సొమ్ము ముట్టెను. గంగాధరునివంటిప్రజ్ఞాశాలికి మహాభిమానికి నిది యొక గొప్పయవమానముకాదా? కన్యాప్రదానకాలమున జరిగినయవమానమున కిది తోడై యతనిమనస్సు మఱింత మండింపఁజేసెను. వివాహము కానివెలితి యప్పుడతనికిఁ గనఁబడెను. క్రతువులను జేసినసోమయాజు లగ్నిహోత్రమునిమిత్తము వివాహము జేసికొనవలసి వచ్చినట్లు సంభావనలనిమిత్తము గంగాధరుఁడు వివాహముఁ జేసికొనవలయు నని యప్పుడు నిశ్చయించుకొనెను. సింహాచల మతనికిభార్యయై యుండినను భార్యయున్నదని చెప్పుకొనుటకు నొంటిపోగుజందెముదీసి నాలుగుజందెములు వేసికొనుటకు వీలులేదు కదా. పెండ్లివారరరూపాయ చేతిలోఁబెట్టగానే విధిలేక యదిపుచ్చుకొని గంగాధరుఁడు మనసులో నున్నమంటయొక్కపొగ యేమో యన్నట్లు కనుబొమలుబిరుసులై విజృంభింప ధుమధుమలాడుచు నావలకుఁ బోయెను. ఆదినమున సింహాచలము రెండురూపాయలు తెమ్మనియాజ్ఞాపించెను. పెండ్లివారు గొప్పవారు కదా రెండేసిరూపాయ లిత్తురని యతఁడు నిశ్చయించుకొని వెళ్ళెను. కాని చేతిలోఁబడిన దర్ధరూపాయమాత్రమె

యయ్యెను. రెండురూపాయలు దీసికొనివెళ్ళక పోయినచో సింహాచలము చీఫురుకట్టపూజఁ జేయును. అది మనసుపడి యొకవర్తకునియొద్ద గులాబిరంగు పట్టురవికెలగుడ్డ వెలకుఁ దీసికొనియెను. ఆసొమ్ము మరునాఁడుదయమున నిచ్చితీరవలె. ఈయనియెడలఁ దనకుఁగాని దానికిఁ గాని మాటదక్కదు. పాపము గంగాధరునకు గొప్పచిక్కు సంభవించెను. ఇదియా గొప్ప చిక్కని చదువరులు నవ్వుదురు గాఁబోలు. ఎవనిమట్టుకు వచ్చినఁగాని వారికిఁ దెలియదు. మీ కిటువంటిచిక్కు సంభవించినపుడు గాని మీకుఁ దెలియదు. ఈవిపద్యోగమునకు మంచిమందేదియని గంగాధరుఁడు కొండొకసే పాలోచించి యిట్లు నిశ్చయించెను. "నేనిప్పుడె బజారునకు వెళ్ళి కోమటికోటయ్యవద్ద సీమనూలుజందెములజత కొని మెడలోవైచికొని సంభావన నిచ్చునట్టి దొడ్డికి వెనుకవైపుననున్న గోడయెక్కి దొడ్డిలో దుమికి రెండవసారి సంభావనకు వెళ్లెద. మొగ మానవాలు తెలియకుండ విభూతి పాముకొనియెద. దీనితో మఱియొకరూపాయ చేతఁబడును. పైమాట చూచుకొనవచ్చును." నిశ్చయించుకొన్నట్లు వెంటనే జరిగించెను. పదివందలరూపాయలు కర్చుపెట్టినను లభించుటకు దుర్లభమైన పెద్ద జందెము గంగాధరునకు క్షణములో మంత్రములతోఁ బనిలేక నాలుగుడబ్బులతో లభించెను. అతనిబుద్ధికుశలతకుఁ జదువరులు సంతోషింతురని మాయభిప్రాయము. నూతనయజ్ఞోపవీతధారణమైనవెనుక విభూతి పాముకొని క్రొత్తపలుపు మెడనిడ్డదున్న పోతువలె వెలయుచునతఁడు దొడ్డివెనుకకుఁ బోయి వానదెబ్బచేత మదురూడిపోయిన భాగమున మెల్లఁగా గోడయెక్కెను. ఈశ్వరుఁడు తోడుపడకపోయిన తరువాత మానవ ప్రయత్న మేమిసాగును? గంగాధరుఁడు ధృఢశరీరముగలవాఁ డగుటచే నతని శరీరభారమున గోడ విరిగిపడెను. గోడతో గంగాధరుఁడుగూలెను. కుడిచెయ్యివిరిగెను. పడఁగానె క్రొం

చెమునేపు స్మృతిదప్పెను. వీధివైపునకుఁ బడినందున దారిఁబోవువా రెవరో చూచి గంగాధరుఁ డని తెలిసికొని యొకబండిమీఁదఁ బడ వైచి యింటికిఁదీసికొనిపోయిరి. కొన్ని దినములతఁడు మంచముమీఁద నుండి లేవనేలేదు. ఆసుపత్రికివెళ్ళి వైద్యముఁ జేయించుకొ మ్మని కొంద ఱతనికి సలహా యిచ్చిరి. కాని యాసుపత్రివైద్యులను దొర తనమువా రభిమానముచేత నిలుపుచున్నారు. కాని వారికి వైద్యమే మియుఁ దెలియదని మొదటనుండియు నతనికి నమ్మికయగుటచే నతఁ డాపొంతఁ బోవక కుమ్మరగురవయ్యను బిలిపించి యేఁబదిరూపాయ లిచ్చుట కొప్పుకొని చేయి వానిచేతఁ దోమించుకొననారంభించెను. చెయ్యి యొకవిధముగ స్వాధీనమగునప్పటి కాఱుమాసములుపట్టెను. ఆయాఱుమాసములు తల్లి యన్నము దినిపించెను. ఏడవమాస మున నతనికన్నము దినుటకుమాత్రము చేయి స్వాధీన మయ్యెను. కావడిమోయుటకు బిందె లెత్తుటకు నది స్వాధీనము గాకపోయెను. కాఁబట్టి కాకినాడపురజనుల భాగ్యదోషమున గంగాధరుఁడుపూర్వపు వృత్తిపడలవలసివచ్చెను. తల్లి యక్కడక్కడఁ బనిచేసి యీయాఱు మాసము లతనిని బోషించెను. పైగా నూరురూపాయి లప్పయ్యెను చిరకాల మన్నవస్త్రములిచ్చి సకలసౌఖ్యము లిచ్చి పోషించినకావడి బద్దను మట్లను మూలఁ బాఱవైవవలసి వచ్చినపుడు సంపూర్ణశస్త్ర సన్యాసముఁ జేయు మహావీరుఁడువలెను గదాగాండివములు జమ్మిచె ట్టుమీఁద దాఁచిన భీమార్జునులు వలెను గంగాధరుఁడు కన్నులనుండి జొటజొట బాష్పములు దొఱఁగ నేడ్చి యటమీఁద నుదరపోషణ మెట్లని విచారింపఁజొచ్చెను. అతనిచేయి విరిగినదినములలో నెమాతా మహుఁ డైన యన్నప్ప యవతారముఁ జాలించెను. తండ్రితన్న భోగతిపాలు చేసినను సహజమైనపితృప్రేమచేఁ బిచ్చమ్మకొంతవగచి యొకసారి తేరిన జూడఁవలఁచెను. కాని కుమారున కన్నముఁ

దినిపించువారు లేకపోవుటచేతను విశేషించి గంగాధరుఁడు వెళ్ళఁదలఁ చినందుకు మిక్కిలి దూషించుటచేతనుమానుకొనియెను. గంగాధరుని భవిష్యద్వృత్తిని గూర్చి తల్లికిఁ గూడ మనోవ్యథకలిగెను. అందఱి కంటె సింహాచలమున కెక్కువవిషాద ముదయించెను. గంగాధరుఁడు పరిత్యజించినపక్షమునఁ గాకినాడపట్టణములో దానిమొగముఁ జూచు వారు లేరు. కావున దానివిచారమున కంతములేదు. నారువోసిన దేవుడు నీరు వోయకమానఁడని గంగాధరునకుగట్టినమ్మకముకలదు. అతనివిశ్వాసప్రకారమె యతని కదృష్టముకలిసివచ్చెను. కాకినాడలో నదివఱకు నగ్నిప్రచ్ఛాదనములు, తిలదానములు పట్టుచుండిన బ్రాహ్మణుఁ డొకఁడు మృతినొందెను. ఆస్థానమాక్రమించుటకుఁ దగిన వారెవ్వరని పురవాసులాలోచించుచుండనంతలో గంగాధరుడు తానందుకుఁ దగినవాఁడనని చెప్పి గ్రామపురోహితులఁ సభా పతుల నాశ్రయించెను. వచ్చినదానిలోఁ గొంతభాగము వారికిచ్చు నట్లు గంగాధరుఁ డొడంబడినందున వారాపదవి కితనిని పట్టాభిషిక్తు నిజేసి యెఱిఁగిన-చోట్ల "నితఁడుమనలనందఱ నమ్ముకొన్నాఁడుగనుక నితనికే యియ్యవలయు" ననిచెప్పి యెఱుఁగనిచోట్ల నితఁడు పిల్లలు కలవాఁడుఁ బహుకుటుంబీకుఁడు, పెద్దమనుష్యుఁ డని చెప్పి యెట్లో వారీయఁదలఁచుకొన్న దానికన్నధికముగ నిప్పించియుపకారము జేయ జొచ్చిరి. అట్లువచ్చినధన మతఁడు నాలుగుభాగములుగ విభజించెను. "శరీరమాద్యం ఖలుధర్మసాధన" మన్నారు గనుక నొకభాగము తనసంరక్షణమునిమిత్తము, రెండవభాగము తనకు దానము లిప్పించి న పురోహితులనిమిత్తము మూఁడవభాగము తనకు ప్రాణప్రాణ మైన సింహాచలము నిమిత్తము, నాల్గవభాగము నిమిత్తమై తన్న నలచక్రవర్తియంతవానిని జేసినజూదమునిమిత్తము నతండు విధియో గించుచుండెను. ఈవృత్తి యవలంబించినతరువాత నెవరికిప్పుడు కావ

VARLA MEMORIAL LIBRARY
VARNARLA
D. P. R.
Acc. No.

లసినన్ని ధాన్యము లెక్కలేనన్ని పీటలు నెంచరానిచెంబులు తిను టకు వీలులేనన్ని యరటికాయలు కందదుంపలు మొదలగుకూరలు విశేషించి యెన్నో మంచములు నెన్నోపరుపులు నెప్పటికప్పుడు రొక్కము కావలసినన్ని బియ్యము మొదలగునవి చేకూరఁజొచ్చెను. ఎప్పటి కప్పు డీవస్తువులతో నిల్లు నిండి చాలకపోయెను. విశూచి మశూచి మొదలగుజాడ్యములు ప్రబలినపుడు మంచములుమొదలగు నవి స్థలము చాలమి, యింటికి పట్టుకొనివెళ్లుటకు వీలులేక, యప్పటి కప్పుడే బేరము లిచ్చి యమ్మివేయు చుండును. కూరలు కావల సినవారికి తల్లి దానము చేయఁజొచ్చెను. పూర్వము తాను దల్లియు జాపలు మీఁదనె బండుకొనుచు వచ్చిరి. ఇప్పుడు తల్లికి మంచము పరుపు. తనకు మంచము పరుపు. సింహాచలముయొక్క గృహ మున మూఁడు మంచములు మూఁడుపరుపులు. తనస్థితి కొంచెము స్థిరమైనతరువాత గంగాధరుఁడు కొంచెము త్రాపుబారి పురోహి తులకీయవలసిన భాగము క్రమక్రమముగ నేదోవంక బెట్టి యెగ బెట్టఁజొచ్చె. అందుచేతగొంచెముడబ్బుచేతనిలువజొచ్చెను. అదివఱకు నల్లమందుకైన సరిగా డబ్బు లేనితల్లి బియ్యము పప్పులు మొదలగు నవి యిరుగుపొరుగువారి కమ్మి కొంతసొమ్ము చేసికొనియెను. అతని జాతక మావిధముగ మహోచ్చదశగలిగి పెళ్ళునవెలుగుచున్న కాల ములోనతనికొకగొప్పవిపత్తుసంభవించెను. ఇంచుమించుగా గాకినాడ వచ్చినది మొదలుకొని యతని యర్ధదేహమై యుండిన సింహా చలము కాలధర్మము నొందెను. సింహాచలము పెద్దదగుట చేత దానిమరణ మంత లోకవిరుద్ధముగ లేక పోయినను గంగాధరుఁడు చిరకాలసహవాసముచేత మిక్కిలి వగచి పదిదినము లన్నముఁ దినక యేమియుం దోఁచక పిచ్చివానివలెదిరిగి మిత్రుల యూరడింపులవలనను మఱికొందఱు చేసిన జ్ఞానోపదేశములవలనను

ధైర్యముఁ దెచ్చికొని కొంతదుఃఖోపశమనముఁ జేసికొనియెను. కాని సింహాచలము మీఁదఁ దనకుఁగల యనురాగాతిశయముఁ దెలియఁ జేయుటకు దాని పేరుగ నొక్కపిల్లయైనను లేకపోయెను గదాయని పలుమాఱు విచారించెను. అయినను విచారించినఁ గార్యము లేదని గ్రహించి దానికుత్తరగతులు కలిగింపవలెనని రమారమియేఁబదిరూపాయలు కర్చుచేసి దానికులమువాండ్రిందఱు మెచ్చున ట్లుత్తరక్రియలు చేయించి సంతర్పణ చేయించెను. జ్ఞానము వచ్చినతరువాత నతనికిఁ గలిగినగొప్పకష్టమిదియె. సింహాచలము బ్రతికియున్నపుడు మూఁడునాలుగుదినముల కొకసారి గంగాధరుఁడు దానికి నల్లమందుఁ గొని తెచ్చి యిచ్చుచుండువాఁడు, గావున నది మృతినొందినతరువాత నాఱుమాసములవఱకు నల్లమందు దుకాణము కనఁబడినపు డెల్ల నతఁడు పట్టరానిదుఃఖముగలిగి యేగోడకొ జేరఁబడి కొంతసే పేడ్చి పోవుచుండును. దైవవశమున సింహాచలము తోడి స్నేహబంధము విడిపోయినతరువాతను గంగాధరుఁడు నిస్పృహుఁడై మఱియొకతె సహవాస మపేక్షింపక వివాహముఁ జేసికొన వలయునని దీక్షగలిగి ధనము నిలువఁ జేయఁ దలంచెను. కాని జూదపుపాక వానిప్రయత్నమునకు విఘ్నము గలిగించుచు వచ్చెను. అక్కడకు వెళ్ళకుండ వలయునని యప్పు డప్పు డతఁడు నిశ్చయముఁ జేసికొను చుండును. కాని యభ్యాసముచేత ప్రయత్నము లేకయె కాళ్ళు వాని నక్కడ కీడ్చుకొని పోవఁ జొచ్చెను. జూదపుబాక జగన్నాయకపురములో సముద్రపుటొడ్డున నొకమూలగ నుండెను. గంగాధరుఁడు పని లేనప్పుడు పట్టపగలును, పగలు పని యున్నపుడు తప్పక రాత్రివేళను భాగ్యవంతుని నిర్భాగ్యుని, నిర్భాగ్యుని భాగ్యవంతుని క్షణకాలములో జేయఁగలయాద్యూతగృహమునకుఁ బరమభక్తుఁడు దేవాలయమున కరిగిన ట్లరిగి యోపికయున్నంతసమర్పించి

వచ్చుచుండును. అతఁడు తీరికగనున్న కాలము పూర్వము సింహాచల గృహమునకు ద్యూతగృహమునకు సమానముగవిభజించెను. ఇప్పుడు సింహాచలయాత్రి కట్టుబడి పోవుటచే తత్కాలముఁ గూడ ద్యూత గృహమునకె వినియోగింపఁ జొచ్చెను.

ఇట్లుండఁ బూర్వము తెనాలి రామలింగముయొక్క పిల్లికి పాలు చూడఁగనె భయము గలిగినట్లు జూదపుబాకపేరు చెప్పఁ గానె గంగాధరున కడలు పుట్టించునట్టినై పరీత్య మొకటి జరిగెను. ఒక యమావాశ్యనాటిరాత్రి యేడెనమంచుగురు జూదగాండ్రు మై మఱపించుసంతోషముతో జూద మాడ నారంభించిరి. పొరుగూరి నుండి వచ్చిన యొకకాఁపువాఁడు నాటిరాత్రి లక్ష్మీకటాక్షసంప న్నుఁడై యైదువందలరూపాయలు గెలుచుకొనెను. ఓడిపోయినందు వలన గలిగిన పరాభవమునకుఁ దోడై ధననష్టము జూదగాండ్రకు మేరలేని మత్సరము గలిగించెను. ఆకాఁపువాఁడు గెలిచిన విత్తము మూటఁ గట్టుకొని స్వగ్రామమునకుఁ బోవ సమకట్టెను. మరల జూదమాడ వలసిన దని తక్కినజూదరులు వానిని బలవంతము పెట్టిరి. ఎంతనిర్బంధించినను వాఁడు పందెము వేయనని బిఱ్ఱబిగిసి కూర్చుండెను. గంగాధరుఁడుఁ గూడ కాఁపువానిని జూచి "నీకిది న్యాయము కాదు. అందఱిసొమ్ము నీవు గెలుచుకొనిమూటగట్టుకొని పోవుట మంచిది కాదు. తెల్లవారినదాక నీవాడి యవ్వటి కెంత సొమ్మిండునో యది పట్టుకొని పోవుట ధర్మ" మని హితోపదేశ ముఁజేసెను. కాపువాడు గంగాధరునిమాట లెక్క సేయఁ డయ్యె. ఇద్దఱుముగ్గురు జూదగాండ్రావలకుఁ బోయి యేమో గుసగుస లాడి తిరిగి పాకలోనికి వచ్చిరి. కాఁపువాఁడు మూట పట్టుకొని లే చెను. అప్పు డిద్దఱుజూదగాండ్రు వానిని రెండుతన్నులు తన్ని నేలఁ బడవైచి నోట గుడ్డలు కుక్కి చెప్పులకాళ్ళతో గొంతుమీఁద

ద్రొక్కి గడియలోఁ జంపిరి. అట్లు చేయుదు మని వారు గంగాధరునితో నాలోచింప లేదు. అంతపని జరుగునని యతఁ డెన్నడుఁ దలంప లేదు. అతఁ డాజానుబాహుఁడైనను మున్నెన్నఁడు గ్రౌర్య మెఱుఁగనిబ్రాహ్మణుఁ డగుటచే నతనిగాళ్లు గడగడ వడఁకెను. మేన ముచ్చెమటలుఁ బోసెను. అయ్యో! యయ్యో! యనునవ్యక్త ధ్వని తప్ప యతని నోట మాటమాట రాదయ్యెను. తక్కినజూద గాండ్రు కాఁపువాని శవము రాళ్ళుకట్టి సముద్రములో బాఱవైవ వలయునని బండలనిమిత్తము వెదకు చుండఁగా నంతలో దొంగ లాంతరు చేతఁ బుచ్చికొని జూదపుబాకలోఁ దమ కేర్పడిన మామూలు వసూలు చేసికొనుటకై ముగ్గురుపోలీసువాం డ్రక్కడకు వచ్చిరి. అందులో నొకఁడు హెడ్డు; తక్కినవాం డిద్దఱు సామాన్య భటులు. ముందుగా వారు పాకలోఁ బ్రవేశించి జూదగాండ్రకు నాయకుఁ డైనవెంకటస్వామిని బిలిచిరి. వెంకటస్వామి లేఁ డని యొకఁ డుత్తరముఁ జెప్పెను. ఆపండుకొన్నవా రెవ రని యొకఁ డడిగెను. రెండవవాఁడు మఱికొంత ముందుకుఁ బోయి చూచి వాఁడు పండుకొన లేదు. చచ్చిపడియున్నాఁడని హెడ్డుతో బదులు చెప్పెను. "ఓరీ తుంటరులారా! కూనీ చేసినారా? ఇప్పుడు మి మ్మందఱను బట్టుకొని స్టేషనుకుఁ దీసికొనిపోదును. నిలువుఁడు నిలువు" డని హెడ్డధికారముఁ జేసెను. రాళ్లనిమిత్తము వెళ్ళిన వెంకటస్వామియు మఱియొకఁడును వారిరాకఁ జూచి పిక్కలబల మును శరణుజొచ్చి తిరిగి చూడక యొక్కపరుగున నిల్లు జేరిరి. గంగాధరుఁడు తక్క తక్కినవా రంద ఱానరహత్యలో నేదో కొంతభాగము కలవారె. పోలీసువారిని జూడఁగానె గంగాధరుని మీఁది ప్రాణములు మీఁదికి పోయెను. హెడ్డు కోరచూపులు చూచి "యిప్పుడు మిమ్మందరను నెఱ్ఱుచేసినారు. పాక వదలి వెళ్ళ

వ" ద్దని హుంకరించి పలికెను. రాజభటులను బ్రసన్నులఁ జేసి కొనుటలో నాతితేటినజూదరు లిద్దఱుమగ్గు రందులో నుండిరి. అందొకఁడు హెడ్డు నావలకుఁబిలిచి రెండుచేతులు బట్టుకొని యిట్లని యెను. "అయ్యా! మీరిందులో మ మ్మిలాగున శ్రమ పెట్టఁ గూడదు. ఏఁడాదికి మీకు ముప్పదిరూపాయలు మీకానిస్టేబు లందఱికి నేబదిరూపాయలు, మీయిన స్పెక్టరుగారికి ప్రత్యేకముగా నూరురూపాయలు మామూల్లిచ్చుచున్నాము. అవి గాక మీపై యుద్యోగస్తులు వచ్చినా రన్నపుడు కోళ్లు కోడిగుడ్లు రెండు మూఁడుసారులు మేఁకలు పాలు పెరుగు మీకిచ్చినాము. చిక్కు వచ్చినపుడు కాపాడకపోయిన మే మేమి కావలసినది? అతనిని మేము చంపలేదు. వాఁడు జూదమాడుటకు వచ్చినమాట నిజము. అతనికి రాఁగానె గుండెలలో నొప్పివచ్చినది. జాముసేపు గిజగిజ తన్నుకొనిచచ్చినాఁడు. ఇదిగో యెదువందలరూపాయలమూట. ఇది తమరుపుచ్చుకొనియనుగ్రహించి మమ్మొకదరికిఁ జేర్పవలయును. " ఆమూటచూడఁగానె యతఁడు కూని మాట మఱచెను. "ఏడిచినట్లె యున్నది. గుండెలలో నొప్పి వచ్చి యితఁడు పోయినమాట నిజమై యుండవచ్చును. కాని త్వరగా నేదియొ యొకటి తేల్చుకొండి. రెండుజాములు దాటి పోయినది. మీరు మంచివా ళ్ళన్నమాట మాకు తెలియును గనుక వదలివైచినాము. మఱియొకరైతే యీ పాటికి మిమ్మల్నిండఱను స్టేషనులో బెట్టియుందును. ఇఁక మే మిక్కడ నుండఁ గూడదు. మీపని మీరుచేసికొనుఁ" డని భటులసిద్ధఱవెంట బెట్టుకొని యతఁడు పాపము మూటగట్టుకొన్నట్లెయెదువందలరూపాయలు మూటగట్టుకొని భటులకుఁ జెరియొక పాతికరూపాయ లిచ్చి తనజాతకము మిక్కిలి గొప్పదనియుఁ దనయట్టి యదృష్టవంతుఁడు లేఁడనియు నెంచికొనుచు నింటికిఁ బోయెను. రాజభటులరిగిన తరువాత

కొందఱుజూదరు లాశవమునకు రాళ్లు గట్టి సముద్రములో పాఱవై చిరి. అదియెల్ల గంగాధరుఁడు చూచుచు నూరకుండెను. ఆకార్యము వల దన్నపక్షమున వారు తన్నుగూడ చంపుదురేమోయని శంకించి నోరు మూసికొని యూరకుండెను. శవమును బాఱవైచి జూదగాం డ్రొకఁడు బోయిన దెస కొకఁడు పోవజారిరి. అందఱు వెళ్ళిన తరు వాత గంగాధరుఁడు మిక్కిలి భయపడుచు మాటిమాటికి వెనుకకుఁ ముందునకు జూచికొనుచు నులికిపడుచు జగన్నాయకపురము దాటి కాకినాడ వెళ్ళి యొకయరుగుమీఁదఁ బండుకొని నిద్రపట్టక కాఁపువాని విగ్రహమె మాటిమాటికిఁ గన్నులముందర గనఁబడవెఱగందుచు లేచి కూర్చుండి తెల్లవారునప్పు డుప్పుటేటికిఁబోయి స్నానము జేసి యాది నమన్నముఁదినక యేపనియుఁ జేయఁజాలక జబ్బుగా నున్నదనిమును గుపెట్టుకొని పండుకొని "యికముందెన్నఁడు జూద నూడఁగూడదు. నాయెత్తుధనముపోసినను జూదపుబాకలోనికి వెళ్ళఁగూడదు. నేటితో నాకుబుద్ధివచ్చినదని నిర్ధారణము జేసికొనియెను. చేసికొనుటయె గాదు. ఆనిర్ధారణముప్రకారము యావజ్జీవము నడచుకొనియెను. ఎప్పు డైన జూదముమీఁద ధ్యాసమువారెనా నాటిరేయిదారుణకర్మయుత నికిజ్ఞాపకము వచ్చి యాసంకల్పము మరల్చుచుండును. సింహాచలము స్మృతినొందుటచేతను జూదముమీఁద వైరాగ్యము పొడముట చేతను వివాహము గురి చేసికొనుటచేతను గంగాధరుఁడు కొంతసొమ్మునిలవ జేసెను. అతనియిల్లు ధనధాన్యసమృద్ధి గలదై వెలయు చుండెను. పలువాఱుచూచి మందపల్లినివాసుఁడైన కోట కోనప్ప యను బ్రాహ్మణుఁడు పిచ్చమ్మ బ్రతిమాలినమీఁదట రెండుసంవత్సరముల వయస్సు గలతనకూఁతురు నాలుగువందల రూపాయలు పుచ్చికొని గంగాధరునకీయ నిశ్చయించెను. అప్పుడు గంగాధరునకునలువదిసంవ త్సరములు వయస్సు, ముక్కుపచ్చలారని చిన్నబిడ్డను నలువదియేండ్ల

వానికిచ్చి పెండ్లిసేయుచున్నావా యని కోనప్పను కొండఅడుగ నతఁ డిట్లనియెను. దైవానుగ్రహము కావలెను. కాని చిన్నయేమిటి పెద్ద యేమిటి. మొన్న నీమధ్య పదియేండ్లపిల్లను పదియాఱేండ్ల పిల్లవాని కిచ్చి లక్షాధిపతియైన యొకబ్రాహ్మణుఁడు వివాహము జేసినాఁడు. మూఁడునెలలు తిరగకుండగనె పిల్లవాఁడు పోయినాఁడు. మా పిన తండ్రిగా రఱువదియేండ్లు వచ్చినతరువాత పెండ్లిజేసికొని నలుగురు కొడుకులను కన్నాఁడు. అదృష్టము ప్రధానము కాని వయస్సుకాదు. అది యదృష్టవంతురాలైనపక్షమున నే మందేశ్వరస్వామివారి యను గ్రహముచేత నైనను దానికడుపున నాలుగు కాయలు కాయకపోవు. ఇంతకు గంగాధరునియొక్క వంశము నిలబెట్టి పున్నెము గట్టుకొనవలె నని మంచియుద్దేశముతో పిల్ల నిచ్చుచున్నాను. కాని యెల్లవారివలె నేను కేవలము డబ్బే ప్రధానముఁ జేసికొని పిల్లనిచ్చుచున్నయాశా పాతకుఁడను కాను. భాగ్యవంతునకు భూములున్న వానికి బ్రతిమాలి యెవరో యొకరు కాళ్లుకడిగి వరదక్షిణనిచ్చి కన్యాదానము జేయు దురు. ఇటువంటివానికి పిల్లనిచ్చుటయె యిచ్చుట. పిల్లమీఁదనాలుగు వందలు పుచ్చుకొన్నప్పటికి మాకవి పెండ్లికర్చులకింద సరిపోవును. అందులో మిగులునదిలేదు. మేముతిన్నది లేదు. వట్టియల్లరే కాని నాకిందులో లాభములేదు. ఒకవేళపుచ్చుకొనుట దోష మైనప్పటికి వంశము నిలిపినపున్నె మెక్కడికిబోవును! వరుఁడా దిట్టమైనవాఁడు. కావలసినవాఁడు. మాపెద్దలు వాళ్ళపెద్దలు గలసి యొకకుటుంబము లాగుననుండెడివారు. పెండ్లికుమారునకు ముక్కువంకర కన్నువంకర లేవు. అన్నోదకములిచ్చి యాలుబిడ్డలను బోషించగల సమర్థుఁడు. సాంప్రదాయముమాట మనము పేరె నెంచుకొన నక్కఱలేదు. కాదాయెనంటె నీళ్ళుమోసినాఁడా? దానికేమి డబ్బులేనప్పు డేపని యైనఁ జేయవచ్చును. అందుచేత నేనుగంగాధరునకు నాబిడ్డనుతప్పక యిచ్చెదను.

అనుకొన్నట్లు వివాహము జరిగెను. వివాహములోఁ బెండ్లి కూఁతురు మారముపెట్టి యరఁటిపండ్లు దిన్నందున జలుబుచేసి జ్వరమువచ్చి బాలపాపచిన్నె గనఁబడెను. కాని యగ్గిపెట్టెలుఁ బొగచుట్టలు గంగాధరునియొద్ద నెప్పుడు సిద్ధముగ నుండుటచే నతఁడు బ్రహ్మాస్త్రమువలెఁ బొగచుట్టదెబ్బ ప్రయోగించిభార్యను బ్రదికించికొనియెను. పొగచుట్ట కాల్చుట దోషము కాదనియు నొకానొకప్పు డది మహోపకారకమనియు దానివలన నెన్నోప్రయోజనములు కలవనియు నప్పుడు గంగాధరుఁడు తనచుట్టుఁ జేరిన బంధుగణమునకుఁ జెప్పి చక్కని లంకాకుచుట్టలు హోమము జేసినపక్షమున దేవతలు సయితము దానివాసనలకు సొక్కి మనము చెప్పినట్లు విందురని యుపన్యసించి దానిరుచి దానివాసన దానిపోకు నెఱుఁగని పరమశుంఠలు గొందఱు వైదికులు తప్పందురు. కాని దాని సారస్యమెఱిఁగినవారు దానిని మెచ్చి కొనియాడుదు రని వక్కాణించి యదివర కలవాటులేనివా రందఱు నిఁకమీఁదనైన యలవాటు చేసికొని సౌఖ్యమనుభవించవలసినదని హెచ్చరించి కట్టకడపట నిట్లనియె. "నాకే శంకరాచార్య స్వాములవారి యధికారమున్నపక్షమున చుట్టకాల్చని చచ్చువెధవ లందఱిని వెలి వేయకపోదునా? ప్రతిదొడ్డిలోను పొగాకుమొక్కలు నాటించనా? చుట్టకాల్చినవారి శరీరము వజ్రశరీరమగును. కాని వాని కెప్పుడు రోగము రాదు. లంకపొగాకుకషాయము కాచి మూఁడుపూటలిచ్చినపక్షమున యజ్ఞములు చేసిన సోమయాజుల వారికి శాస్త్రులవారికి ఛాందసము వదలిపోవును."

పెండ్లి సలక్షణముగ జరిగెను. పరిణయానంతరమున గంగాధరుఁడు కాకినాడకుఁబోయి యెప్పటియట్ల దన వృత్తియం దుండెను. కాలక్రమమున సింగమ్మ బాలారిష్ట దోషములు గడచిపదమూఁడవ

యేట రజస్వలయయ్యెను. ఏబదిమూఁడవయేట గంగాధరునకుఁ బున
స్సంధానమయ్యెను. అప్పటికతనికి దురదృష్టవశమున దగ్గు సంభ
వించెను. కానిశరీరము దృఢముగానేయుండెను. గంగాధరుఁడు పున
స్సంధాన మైనతరువాత మామగారి ప్రేరణముచేతఁ గాకినాడ వదలి
మండపల్లిలో నొకయిల్లుగొని యందుఁబ్రవేశించెను. కాపురమునకు
వెళ్ళిన నాలుగేండ్లకు సింగమ్మకు వరప్రసాదియై పప్పుభొట్ల వంశ
రత్నాకరపూర్ణచంద్రుఁడై యీకథానాయకుఁడైన గణపతిజన్మించె.

ఎనిమిదవ ప్రకరణము

చదువరులారా! మీరెన్నఁడైన జన్మమన్యమం దొకపిల్ల
పిశాచమును జూచియుందురా? "ఓహోహో! పిశాచగణములోఁ
జేరినవారికెగాని పిశాచములు కనఁబడవు. మే మట్టిపిశాచగణము
లోఁ జేరినవారముకాము కనుక పిల్లపిశాచమునుగాని పెద్దపిశాచము
నుగాని జూచియెఱుఁగ" మని మీరుసాగ్రహముగ నాప్రశ్నకుత్తర
మిత్తురుకాబోలు. సరే అట్లయినక్షమింపుఁడు. పిశాచములమాటనెత్త
దలఁచుకొనలేదు. పోనీ మఱియొకమాట కుత్తర మిండు. మీ రె
న్నఁడైన నొకకొండముచ్చును జూచియుందురా? చూచియుందురా
యని నేను వేరె యడుగనక్కఱలే దని తలంచెదను. ఏలయనఁ
గొండముచ్చుదర్శనము జేయనివా రెవ్వ రుండరు. పండితరాయ
లని ఢిల్లీశ్వరునిచేత బిరుదుపొందిన జగన్నాథపంతుఁడు చెప్పినట్లు
మహోన్నతవృక్షశాఖలు పీఠములుగ కిచకిచలు సరససల్లాపములు
బరుకులు కరపులు బంధుసత్కారముగఁ దోటలలో దొడ్లలో
గొలువుదీర్చి యుండు నీకిష్కింధాపురాగ్రహారీకుల మొగము లెవ్వ

రెఱుంగరు. మానవజాతికెల్ల మూలపురుషుఁ డని ప్రకృతిశాస్త్రజ్ఞులచే నిర్ణయింపఁబడి కళత్రవియోగముచే నంతరాయము లేని యలమట నొంది రఘురామునకు సముద్రబంధనమందును లంకా విజయమునందును రావణకుంభకర్ణాది దుష్టరాక్షససంహారమందును మిక్కిలి తోడ్పడి చాంచల్యమున కెల్ల నిలయ మైన యామర్కటము నొక్కమారు స్మరింతు రేని మీకిహపరములు రెండును గలవు. ఇహమెట్లుకలుగు పరమెట్లు కలుగు నని మీకు సందేహము దోచవచ్చును. పరబ్రహ్మస్వరూపుఁడని ప్రాచీనులచే వర్ణింపఁబడి శ్రీరాముని సేవకులను దలఁచుకొన్నంత మాత్రమున మీ పాపపుంజము భస్మపటల మగును. ఇదే పరము. ఇహమేది యన మర్కటరూపము మనసున నిల్పినంతమాత్రమున మనకథానాయకునిరూపు రేఖావిలాసములు కొంతవఱకు దేటపడవచ్చును. ఒకకొండ ముచ్చున్న దనుకొనుఁడు. తోక లేదనుకొనుఁడు. అది మనుష్యాంగనయొడిలోనుండి పాలు ద్రావుచున్న దనుకొనుఁడు. అది చెట్టుకొమ్మమీఁదగాక యొకయింట నొక నులకమంచము కుక్కిమీఁదఁ బండుకొన్న దనుకొనుఁడు. దానిమొగముమీఁద తిరుగలి గంట్లవలె మశూచకము మచ్చ లున్నవనుకొనుఁడు. కుడికన్ను మెల్లయనుకొనుఁడు. కుడికంటిలో గోప్పకందిగింజంత కాయయను కొనుఁడు. చేతులు మోరులు దిగిన వనుకొనుఁడు. దొడ్డికాళ్ళనుకొనుఁడు. మొదటనే గుజ్జురూప మనుకొనుఁడు. ఆగుజ్జునకు దగనిబొజ్జ యున్న దనుకొనుఁడు. శరీరమునిండ రోమకళ యనుకొనుఁడు. మనస్సు మఱియొక పదార్థముమీఁదికి గాని యాలోచనమీఁదికి గాని చలింపకుండ నిశ్చలము చేసి యొక్కనిముసము మీరు ధ్యానము జేయుదు రేని గణపతిరూపము మీకు భావ గోచరమగును.

గణపతి సహజముగానె వికృతరూపుఁడు. మశూచిక మా

మీఁద మెరుగులుదిద్దినది. మొదలే కోతి యామీఁద ధయ్యము పట్టిన దన్నట్లు మొదలే కుపంపియైన వానికి మశూచికము వికారములు దెచ్చినపుడు వానియందు మింక వేరె చెప్పవలయునా ? గణపతి పుట్టిన రెండుమూఁడుమాసములకే గంగాధరునితల్లి యనుపిచ్చమ్మ కాలధర్మము నొందెను. గంగాధరుఁడు తనకుమారుఁడు చెడ్డ నక్షత్రమున జన్మించుటచే దనతల్లి మృతి నొందె నని విచారించి నాయనమ్మగండమున బుట్టినవెధవ వీడని తఱచుగాఁ దిట్టుచుండును. ఆగ్రామమున జోస్యుల జోగావధాను లనుగొప్పజ్యోతిశ్శాస్త్రజ్ఞుఁడుండెను. గంగాధరుఁ డాయనయొద్దకు.బోయి "యయ్యా! నాకుమారుఁడు పుట్టినమూఁడునెలలకే మాయమ్మ చచ్చిపోయెను. వీడిమూలమున నిం కెవరెవరు చచ్చిపోవుదురో యని భయ మగుచున్నది. కాఁబట్టి వీనిజాతకము వ్రాసి మీ రెవరెవరి కేమి గండములున్నవో యేమిశాంతులు చేయవలెనో చెప్పవలె" నని యడిగెను. అనవుడు జోగావధానులు మీపిల్లవాఁడు జన్మించిన తిథి వారము నక్షత్రము చెప్పినపక్షమున జాతకము వ్రాసెదనని బదులు చెప్పెను. అన గంగాధరుఁడు తలయెత్తి పైకి చూచి కొంచె మాలోచించి వ్రేళ్ళుమడిచి లెక్కపెట్టి యయ్యా! మావాఁడు పుట్టినరోజు సరిగా జ్ఞాపకములేదు. ఉండఁడి. ఉండఁడి. ఆలోచించి చెప్పఁగలను. వెంకన్నపంతులుగారి తల్లిగారి నెలమాసికము రేపనఁగా నారాత్రిదీపాళవేళ పుట్టినాఁడు. నీ కేలాగున జ్ఞాపక మున్నదందు రేమో. వినండి. మరునాఁడు బ్రాహ్మణార్థమునకురమ్మని వెంకన్నపంతులుగారు నన్ను పిలువ వచ్చినారు. నాపెండ్లాము నొప్పులు పడుచున్నది. పురుఁడు రాకపోయినపక్షమున రేపు రాఁ గలను. వచ్చినయెడల రా నని చెప్పినాను. ఆయన వెళ్ళిపోయినగడియలోనే వీఁడు జన్మించినాఁడని యతఁ డుత్తరము చెప్పెను. సరే వెం

కన్నపంతులుగా రెప్పుడు పోయినారో నీ వెఱుంగుదువా ? యని జ్యోతిష్కుఁడడుగుటయు గంగాధరుఁడు తమ గ్రామములోని కెవరో తూర్పునుండి గొఱ్ఱగేదె లమ్మదెచ్చినారే అప్పుడు. అదెప్పుడో చెప్పగలను. వినండి అమ్మవారిజాతరి యెల్లుండనఁగా నే నప్పుడమ్మవారికి బలినిమిత్తమై మేఁకకోసము తిరుగుచుండఁగా 'వెంకన్నపంతులుగారు పోయినారు. మీరు మోక్షకు రా వలసిన' దని నన్ను నరిసిగాడు పిలిచి తీసికొని పోయినాఁడు. మఱొకసంగతి. 'కంచరి కామాక్షిగారి పశువులపాక కాలిపోయినరోజంటి' యని కొన్నిసంగతులు జ్ఞాపకముచేసెను. ఆసంగతులనుబట్టి గణపతియొక్క జన్మదినము జోగావధానులుగారికి స్ఫురింపలేదు. గొఱ్ఱగేదెలెవరు తెచ్చిరో యెప్పుడు తెచ్చిరో యాయనకు జ్ఞాపకములేదు. ప్రాణమువిసికి యెట్టకేలకాయన వెంకన్నపంతులుగారెప్పుడు పోయినారో యాయనకొడుకు నడిగి తెలిసికొనిరా దానినిబట్టి నెలమాసిక మెప్పుడైనదో పంచాంగము జూచి మీపిల్లవానిజాతకము వ్రాసెదను. మూఁడురూపాయలుమాత్రము తీసికొనిరా యని చెప్పి పంపెను. ఆసాయంకాలముననె గంగాధరుఁడు మూఁడురూపాయల ముడుపు చెల్లించి వెంకన్నపంతులుగారి మరణదినము కుమారు నడిగి తెలిసికొని వచ్చి చెప్పెను. మరునాఁడు సాయంకాలముననె జాతకము వ్రాయఁబడియెను. జాతకము తాటియాకుమీఁద వ్రాసి యది గంగాధరునకిచ్చి జోగావధానులు "గంగాధరుఁడా నీవాఁడఖండప్రజ్ఞావంతుఁడై దేశదేశములందు మహాప్రసిద్ధి కెక్కి నీవంశమున కెంతో పేరుప్రతిష్ఠలు తెచ్చును. ఇంతకు నీయదృష్టము మంచిది. నీపుణ్యముచేత నీకు సుపుత్రుఁడు కలిగినాఁడు. ఇటువంటి జాతకము నేనెక్కడ చూడలేదుసుమీ. మీయింట నింక నెవరికి గండములు లేవు. ఉన్నగండమేమో ముసలమ్మమీఁద కొట్టుకొని పోయినదని

స్తుతించి సంతోషపఱచి పంపెను. గంగాధరుఁడు తనకొడు కేగాజు నొద్దనైన మంత్రియె యగునో లేక చతుశ్శాస్త్ర పండితుఁడెయగునో ధనము సంపాదించి కోటికి పడగెత్తునో సర్కారువారియొద్ద గొప్ప యుద్యోగముచేయునో యేదో గొప్పయైశ్వర్యము కుమారున కున్న దని కులుకుచుఁ దనయింట నెవరికి మఱిగండములు లేవని చెప్పినం దుకు మిగులసంతుష్టి నొందుచు జాతక మున్న త్రాటియాకు నింటికి దీసికొనిపోయి పడమటింటివసారాచూరులో విభూతిబుట్టకట్టినచో టునకు సమీపమున దోపెను. జోగావధానులుగారి జ్యోతిష్యము గణపతివిషయమున మిడతంభట్టుశకునమువలె గొంతవఱకు నిజము యైనను. దేశదేశములయం దతఁడు ప్రఖ్యాతుఁడగు ననుమాట యక్షరాల నిక్కమయ్యెను. ఇఁకమీఁద గండములు లేవని యాయన చెప్పిన మాటమాత్రమబద్ధమయ్యెను. వరప్రసాదివలె జనియించిన యీకుమారుని ముద్దుముచ్చటలు కన్నులారజూచి యానందించుట కును జాతకములో సూచింపఁబడిన ప్రకారము కుమారుఁడు ప్రసిద్ధి పురుషుఁడై యుండఁగా గనుగొనుభాగ్యము గంగాధరునకు లభియిం చినదికాదు. గణపతికి నాలుగేండ్లయిననిండకమునుపే గంగాధరుఁడు మృతినొందెను. గణపతి కప్పటి కుపనయనము కాకపోవుటచే గంగాధరున కుత్తరక్రియలు బాలకునిమీఁదనె కర్తవ్యముపెట్టి మేన మామ చేసెను. గంగాధరునియొద్ద నున్నధన మతఁడుండఁగానె చాలమట్టుకు వ్యయమయ్యెను. మిగిలిన దతఁడు పోయినవత్సరము లోపుననె కర్చుపడెను. సంసారము మొదటికి వచ్చెను. గణపతి మాతృసమేతముగ మేనమామయింటనె ప్రవేశించెను. అతనిస్థితి కొంచెము బాగుండుటచే నతఁడు మేనల్లుని బోబుట్టువును గొంతకా లము పోషింపగలిగెను. గణపతికి గర్భాష్టమం దుపనయనము జరి గెను. బలిచక్రవర్తిని వంచించుటకై పూర్వకాలమవతరించిన వామ

సమూర్తియొక్క యవతారమన్నట్లు, కరోటకుఁడు కఱచి విషప బాహుకుం డనువేరుతో ఋతుపర్ణనాశ్రయించియున్న సాక్షాన్నల రూపమట్లు చూచువారి కెంతోనవ్వు పుట్టించుచు గణపతి భూమికి జానెడై వడకపెండ్లికొడుకై పీటలమీఁదఁ గూర్చున్నపుడు చూచిన వారిదె యదృష్టము. గాయత్రిమంత్రి మతనినోట నుచ్చరింపఁ జేయుట పురోహితుని తరమైనది కాదు. గాయత్రిమంత్రము వచ్చు గాక రాకపోవుగాక మెడలో జందెముపోగులు మాత్రము పడెను. అక్షరాభ్యాస మైనవయేటనె యైనను నుపనయన మైనతరువాతనె గణపతిని బడికి పంపించిరి. చదువుసంధ్యలు రెండును సమానము గానె వచ్చెను. గణపతియొక్క తెలివితేటలకు గాయత్రిమంత్రి ముపదేశించునపుడు పురోహితుఁ డెంతసంతోషించెనో యోనమాలు చెప్పునపుడు వ్రాయించునపుడు పంతులుకూడ నంతే సంతోషించెను. గణపతిని బడికిబంపుట తల్లికి మేనమామకు నష్టకష్టములలో నొకకష్ట మయ్యెను. గణపతి పాఠశాలకు బోవునపుడు జరిగెడు నుత్సవమును భాగవతము జలక్రీడలు మొదలగు నాటలు జూచుటకు బోయినట్లె పోయి యూరిలో ననేకులు తీరుబడి చేసికొని చూచి సంతోషించుచుందురు. గణపతి యాకారముచేతను వయస్సుచేతను మిక్కిలికుఱ్ఱవాఁడైనను వానిని బడి కొక్కరు తీసికొని పోవజాలఁ డయ్యెను. ఆపని తల్లికి సాధ్యము కాకపోయెను. పంతులుగారు చింతబరిక పుచ్చుకొని ప్రతిదినము నుదయమును సాయంకాలమునను మెఱియలవంటి నలుగురుపిల్లలను వెంటబెట్టుకొని రావలయును. ఆనలుగురు యజ్ఞపశువును బడద్రోసినట్లు గణపతిని నేల బడద్రోచి కాళ్ళిద్దఱు చేతు లిద్దఱు బట్టుకొని తీసికొని పోవుచుందురు.

గణపతి సమయోచితముగ పీలువెంబడిని తనపాలిటి యమకింకరులవంటి యానలుగురు పిల్లలను గోళ్ళతో బరికియు గిల్లియు

వాడిపండ్లతో గఱచియుఁ గాళ్ళతో దన్నియు నిట్టటు పిసిరి తలతో గొట్టియు మీఁద నమిసియు నోటికివచ్చినట్లు తిట్టియు నూరందఱు జేరునట్లు కేకలువైచియుఁ బూటపూట కొకనాటక మాడుచుం డును. పంతులుగారు వజ్రాయుధమువంటి చింతబరికెతో నెడనెడ పీఠముమీఁద సమయోచితముగ వడ్డించుచుండును. బరకులు కఱపులు తన్నులు గిల్లులు మొదలగు బహుమానములలో గురువుగారికి భాగములేకపోయినను శరపరంపరలై వెడలుతిట్లలో మాత్రి మాయ నకు పెద్దభాగమె వచ్చుచుండును. బడికి వెళ్లినతరువాత నయి తము గణపతి గురువుగారిని సుఖముగ నుండనిచ్చువాఁడు కాఁడు. కన్నుమూసి తెఱచునంతలో నతఁడు మాయ మగుచుండును. చుట్టుప్రక్కల వెదకివెదకి పంతులు కనుగొనలేక విసుగుచుండును. బడిపేరు చెప్పగానె గణపతికి నడుము నొప్పి కాళ్ళుతీత కడుపునొప్పి గుండెపోటు తలనొప్పి మొదలగురోగములు పొడసూపు చుండును. ఈరోగముల నప్పుడప్పుడు పంతులుగారు బెత్తము ప్రయోగించి చికిత్సలుచేసి కుదుర్చుచుందురు. ఎన్నిమారులు చికిత్సలు చేసినను వాని కారోగముమాత్రము కుదుర లేదు. ఎల్లరోగములు చికిత్స లకు సాధ్య మగునా? బడిమాని యేపని చేయు మన్నను మనగణ పతికి పరమానందము. బరిపేరు చెప్పగానే యతని మొగము వెల వెలబోవును. ఈమహాపద దప్పించుకొనుటకై యతఁ డెన్నోయుపా యములు పన్నజొచ్చెను. తెల్లవారు చున్న దనఁగానె యతని కెంతో భయము. ఏలయన మేనమామ బడికి పొమ్మనును అందుచేత నతఁడు దిన మంతయు రాత్రిగానె యుండవలయు నని యతఁడు కోరుచుండును. పంతులుగారికి రోగము రావలయు నని యతఁ డెన్నిమారులో కోరెను. కోరుటయె గాదు. ఒకసారి చీకటిరోనే లేచి కాకులు కూయకమున్నె యమ్మనారిగుడికిఁ

బోయి తలుపుదగ్గఱ నిలిచి యమ్మవారా తల్లీ మాపంతులుగారికి విశూచిజాడ్యమైన మఱియేరోగమైన దెప్పించి చంపితివా నీకు బలిసినకోళ్ళను రెంటిని యెత్తుకువచ్చి బలి యిచ్చెదను. లేనా ముష్టియెత్తియైన మంచి మేకపోతును బలి యిచ్చెద" నని దండము పెట్టి మ్రొక్కుకొనెను. కాని యాయమ్మవారి కతఁ డేమివిషము పెట్టెనో కాని యతనిమొక్కులు సరకుగొనక పంతులుజోలికిపోక యూరకుండెను. ఎన్నిచూరలు చలిదిన్నై వేద్యములు వేఁడిన్నై వేద్యములు చలిమిడి పానకములు గ్రహించి యొకటి రెండుసారులు గరగలుకూడ గైకొని యాగ్రామదేవత యవసరము వచ్చినప్పుడు కృతఘ్నురాలై తనపని చేయక తనయెడ ననాదరణము చూపినందుకు గణపతి కెంతోకోపమువచ్చినది. కాని యమ్మవా రగుటచేత తన కేదేని యాపద గలిగించు ననుభయముచేత నామెను దూషింపక యూరకుండెను. బడికి వెళ్లవలసివచ్చినప్పుడు కడుపునొప్పిబాధ నభినయించి యూరక వాముకసము శొంఠిరసము ద్రాఁగుచుండును. తలనొప్పి లేకపోయినను రెండు కణతలు పట్టుకొని చాలబాధ నభినయించి కణతలకు శొంఠిగంధము మెత్తును. బడికి బోవ కుండుటకై యతఁ డెన్నోసారులు రోగముపేరు చెప్పి మిరియాలరసము గూడ ద్రాఁగెను. ఒకనాఁడు గణపతినడుమునొప్పియని బడిమానగా మేనమామ చిత్రమూలరసము తీయించి పట్టువేయించెను. దానిమంటకైన నతఁడు సహించెను. కాని బడికి బోవుట కిచ్ఛగింపఁ డయ్యె. ఒకటిరెండుసారు లాదుండగుఁడు గాజుపెంకుతో దనశరీరము గీచికొని కోఁతిపుండు బ్రహ్మరాక్షసియయ్యె నన్నట్లు దానిని గొప్పపుండు చేసికొని యెన్నిమందులు వైచినను పుండుమానకుండునట్లు ప్రయత్నముచేసి కొన్నిదినములు బడిమానెను. పాఠశాలాపత్తు తప్పించుకొనుటకై యతఁడు దాఁగనిచోటు లేదు. ఎక్కని

చెట్టులేదు. దూరనిడొంక లేదు. ఒకనాఁడు పొణకలోఁ గూర్చుం డును. ఒకనాఁ డటకమీఁద నెక్కి కనఁబడ కుండును. పాడుగృహా ములలోఁ గూర్చుండును. గణపతిబుద్ధి పాదరసమువంటి దగుటచేత బడియాపదఁ దప్పించు కొనుటకై యతఁ డెన్నెనోప్రయత్నములు చేసెను. కాని జీవచరిత్రలు సరిగా వ్రాయువారు లేక పోవుటచే నవియెల్ల మనకు దొరకినవికావు. చదువరుల యదృష్టవశమున స టువంటి వొకటి రెండుమాత్రము లభించినవి. అటువంటివి లభించి నప్పుడు వ్రాయకపోవుట చరిత్రయెడ మహాదోషము జేయుట యని గ్రంథవిస్తరదోషమున కైన నొడంబడి వాని నీక్రింద నుదా హరింప వలసివచ్చె. గణపతి కొకనాఁడు తెల్లవారుజామున నాలుగు గడియలప్రొద్దుండఁగా మెలఁకువవచ్చెను. పెందలకడ మెలఁకువ వచ్చినపుడు దైవప్రార్థనము జేసికొనవలసిన దని తల్లియు మేన మామయు నతనితో జెప్పుచుందురు. కాని యట్టిపనిఁ జేయుట కతని కెన్నడవకాశము చిక్కలేదు. తెల్లవారుచున్న దనఁగానె పంతులుగారు పాఠశాల పంతులుగారిచేతిలో బెత్తము వానికన్నులకు గట్టిన ట్లెదుట కనఁబడుచుండును. ఆయాపద నెట్లు తప్పించుకొన వలయునని యుపాయములు వెదకుటతోడనె కాలము వెళ్ళిపోవు చుండును. ఆనాఁడతఁడు తెల తెల్లవారుచుండగా లేచి దొడ్డిదారిని పాఱిపోయి చాకిరేవున కరిగి పెద్దచాకిబానక్రింద దూఱి కూర్చుం డెను. నాలుగుగడియలప్రొద్దెక్కినతరువాత చాకలివాఁడు రేవు నకుఁబోయి తనగూన నెత్తి చూచునప్పటికి దానియడుగున గణ పతి కూర్చుండి యుండెను. పంతులు తనజాడ దెలిసికొని వచ్చె ననుకొని గణపతి గూన యెత్తగానె పాఱిపోయెను. తనగూన బగులగొట్టుటకు వీఁ డెవఁడో ప్రయత్నము జేయుచున్నాఁడని చాకలి వానినిదఱుముకొనిపోయి లేఁడివలె పఱుగెత్తుచున్న యాడింభ

కుని బట్టుకొనలేక మరలి వచ్చెను. మఱియొకనాఁడు బడికి బోవ నందుకు మేనమామ కోపించి యీతజువ్వతో నెత్తురు వచ్చునట్లు కొట్టెను. ఆసాయంకాలము మేనమామ వీధిలోనికి వెళ్ళినతరువాత నే నీదెబ్బలు తినలేను. చచ్చిపోవుదు నని గణపతి తల్లితోఁ జెప్పెను. తల్లి బతిమాలి కోమటింట నటుకులు బెల్లము జీడెలు గొనిపెట్టి యోదార్చెను. గణపతి యవియెల్ల భక్షించి మేనమామ నెట్లయిన లొంగతీయవలయు నని సంకల్పించి రాత్రి యైనతరువాత నిల్లు కదలి వెళ్ళుట కతనికి మిక్కిలిభయ మగుటచేత తనవంటిదుండగునె మఱియొకనిని సాయము రమ్మని వాని సహాయమున మేనమామ భోజనము జేయుచుండగా దొడ్డిలోనికిఁ బోయి యాపిల్లవాఁడును దానును దోడుపట్టి రాయియొకటి నూతిలోఁ బడవైచిరి. ఆచప్పు డేమిటని మేనమామ తల్లి నడిగెను. అంతలో గణపతిసహాధ్యాయి యైన బాలుఁడువచ్చి మీపిల్లవాఁడు నూతిలో బడినా డండోయి యని కేకవైచిపాఱిపోయెను. మేనమామ భోజనమువదిలి అయ్యో! అయ్యో! యని లేచెను. సింగమ్మ అయ్యో కొడుకో, అయ్యో కొడుకో నేనేమి జేతును రా తండ్రీ ఈదిక్కుమాలినచదువు నీప్రాణము కోసమువచ్చినది రాతండ్రీ యని గుండెలు బాదుకొనుచు నేడ్చుచు మొత్తుకొనుచు దనయన్నగారిం దిట్టుచు బడిపంతులను దూషించుచు దైవమును దూఱుచు తనయదృష్టమును నిందించుకొనుచునూతికడకు బోయి నూతిచుట్టు దిరుగుచుండెను. ఆగోలవిని చుట్టుప్రక్కలవారం దరుఁ జేరిరి. మేనమామ తాళ్ళు దాగరలు నిచ్చెనలు మొదలైనవి సిద్ధము చేసి యీఁతనేర్చినసాహసులనిద్దఱను బాలుని వెదకుటకై నూతిలో దింపెను, ఎంత వెదకినను బాలుఁ డగుపడలేదు. ఊబిలో గూరుకుపోయినాఁడని కొందఱు, పడగానె చేఁపలు తినివైచినవని కొందఱు, బావిలో బాలుఁడు పడలే దని కొందఱు నన జొచ్చిరి.

సింగమ్మ తానుగూడ నూతిలోదిగి చచ్చెద నని నూతియంచుపైఁ గూర్చుండెను, అక్కడ నున్నవా రందఱు పట్టుకొని యాత్మహత్య జేసికొన గూడదని మందలించి యిల్లు చేర్చిరి. పిల్లవాఁ డేమై యుండునని మేనమామ తలపోయజొచ్చెను. నిన్న బెదరించుటకై కుఱ్ఱవాఁ డీయల్లరి చేసి యుండును. కాని కుఱ్ఱవాఁడు నూతిలో బడ లేదని యక్కడ చేరినవా రతనితోఁ జెప్పిరి. కళేబరము కనఁబడ పోవుటచే సింగమ్మకు గూడ తనకొడుకు బావిలో బడ లే దని నమ్మకము కలిగెను. ఆరాత్రి తల్లియు మేనమామయు నిద్రపో లేదు. రెండుజాము లైనతరువాత వారియింటిపొరుగునున్న యొక బ్రాహ్మణుఁ డిద్దఱు బాలకుల బట్టి తోడ్కొనివచ్చి యిదుగో మీ పిల్లవాఁడు. ఈతోడిదొంగ లిద్దఱుఁ జేసినదుండగ మిది. అంతేకాని నూతిలో బడలేదని చెప్పి నప్పగించెను. తల్లి గణపతిని జూచి నాయనా! బ్రతికివచ్చితివా" యనికౌఁగిలించుకొని యేడ్చెను. మేన మామ గుండె బాదుకొని యెంతదుర్మార్గుడవురా? నీనిమిత్తము నాప్రాణ మెంతయలజడి పడినదిరా? ప్రాణనష్ట మటుండఁగా లోకములో నాకెంతలో యపకీర్తి వచ్చినదని నేనెంతో కుళ్ళికుళ్ళి యేడ్చుచున్నాను, సరే నాయదృష్టము బాగుండబట్టి నేను నూతిలో బడవలయునని యిచ్ఛ లేకపోయిన దని తన చెల్లెలి నుద్దేశించి "ఓసీ! సింగమ్మా నీకొడుకుతో నేను వేగలేను. నాయెముకలు చిట్లము కట్టిపోవుచున్నవి. వీనికోసము నే నెన్నెన్నో బాధలు పడి యున్నాను. ఇకమీఁద నేను పడజాలను. అల్లరిపిల్లవాఁ డైనప్పుడు కొట్టవలసి వచ్చును. తిట్టవలసి వచ్చును. మందలించగానె నూతిలో బడి గోతిలోబడి చచ్చిపోవుదు నని బెదిరించినపక్షమున నే నెట్లు వేగ గలను. నేను కొంతకాలము మిమ్ములను సంరక్షించినాను. ఇఁక మీఁద సంరక్షణ చేయ లేను. మీయిష్టమువచ్చినచోటికి వెళ్ళి

పొండి" యని కఠినముగ బలికెను. ఆపలుకులు విని సింగమ్మ కంట దడివెట్టుకొని "అన్నయ్యా! నీవాలాగున నంటే నే నింక గంగాప్రవేశము కా వలసినదె. పిల్లవాఁ డల్లరిచేయునపుడు శిక్షింప వద్దని యెవ్వరన్నారు. నేనుమాత్రము కొట్టనా తిట్టనా? కాక పోయినా వీఁడు బండవాఁ డగుటచేత నాకిన్ని పాట్లు వచ్చిన" వని తనకొడుకుతో వచ్చిన రెండవపిల్లవానిని చూచి "యీదొంగపిల్ల వాఁడు మాపిల్లవానిబుద్ధి విరిచి పాడు చేయుచున్నాఁడు. అంతకు ముం దింతపాపము లేదు. వీఁ డెవండో మాయింటికి మారకుఁడు బయలు దేఱినాఁడు. నూతిలో మావాఁడు పడనిదె పడినాఁ డని కేకవైచి పాఱిపోయినాఁడు. ఈపాడుపిల్లలమూలమున నేను బ్రతుక లేకున్నాను. మాయింటికి రా వద్దంటే మానరు. ఇది నాకర్మ" మని మొత్తుకొనెను. అప్పుడు సింగమ్మతో సోదరుఁడిట్లనియె. "నేఁడు మొదలుకొని నీకొడుకు నాచెప్పుచేతలలో నున్నపక్షమున నాచేత నైనట్లు నేను బాగుచేసెదను. నేనుకొట్టినను, తిట్టినను పడవలయును లేదా మీకు నాకు సరి. ఈమాటు నీకొడుకు పాఱిపోయినాఁడా కాలికి బొండ వైచెదను." అనవుడు సింగమ్మ నీయిష్టము వచ్చినట్లు చేయవచ్చు నాయనా! చదువు రాకపోయినప్పటికి బుద్ధి కొంచె ముంటే చాలు నని నే నేడ్చుచున్నాను. బుద్ధికూడ లేక పోయినదికదా!" యని యేడ్చెను. అక్కడ చేరినవారు తలకొక మాటయని యెవరిదారిని వారు జారిరి. సింగమ్మ కుమారుని పండు కొనబెట్టి తానును కొంతసేపు విలపించెను. ఆమెసోదరుఁడును తన గదిలోనికిఁ బోయి నిద్రించెను. మరునాఁడునుండి గణపతి యెప్పటి యట్లె బడి పెద్దపులి యని భావించి యాగుమ్మ మెక్కకపోవుటయె గాక వేళకు భోజనమునకు రాక యెంతవెదకిన గనఁబడక రాత్రి లుమాత్రి మింటికి వచ్చుచుండెను. మేనమామ విసికి బొండ

చేయించి గణపతికాలికి దగిలించెను. అతనిం జూచుటకు విద్యార్థులు తీర్థప్రజవలె వచ్చిరి. అభిమానధనుఁడైన గణపతి వారిం జూచి మొదట సిగ్గుపడియెను. కాని తరువాత తరువాత సిగ్గు వదవలసిన యవసరము లేదనుకొని యెప్పటియట్లు ముచ్చటలాడుచు మనసు గలసినమిత్రులను బిలిచి యెవరు లేనప్పుడు వారితో "నోరీ మామామ లోపల భోజనముచేయునప్పుడు దొంగతాళము తెచ్చి నాబొండదీసి నన్ను వదలించరా! హాయిగా మనమిద్దఱము తినగ వచ్చు" నని హెచ్చరించుచుండును. అతనియుపదేశప్రకార మొక రిద్ద ఱతని కొకటిరెండుసారులు సాయముజేసిరి. ఈసారి యతఁడు సాయంకాల మింటికి రాక స్నేహితులయిండ్లనె విందు లారగించుచు మేనమామకు నాలుగైదు దినములవఱకు గనఁబడక పోయెను. కనఁబడగానె మేనమామ యల్లునకు మొట్టికాయలు గుద్దులు చర పులు చెంపకాయలు తొడపాశములు కానుక యిచ్చి యలుకదీర్చి యింటికి దీసికొనివచ్చెను. ఇప్పటికి గణపతికి పదియేండ్లు నిండెను. అప్పుడప్పుడు పంతులు గుంటయోనమాలు వ్రాయించి చెప్పిన చదువువలన నైదుబరులు గుణింతములు నేర్చి పుస్తకము పట్టెను. మఱి రెండుసంవత్సరములపాటు చదువుకొన్నపక్షమున దనకొడుకు బడిపంతులుపని చేసియైన నింతయన్నము దెచ్చికొని తిన గలఁడని తల్లి తలంచు చుండెను. కాని దానికి దగినయవకాశములు గణపతికి గలుగ వయ్యెను. మిత్రు లెక్కువైరి. వ్యాపారము లధికమయ్యెను. ఇంట నిముసమైన నిలుచుటకు దీరిక లేకపోయెను. కష్టపడి చీట్లపేక యాడుట నేర్చికొనియెను. తురుపులాట దొంగాటపట్టాట మొదలగు వానియం దెంతో నేర్పరియయ్యెను. డబ్బుపెట్టి పేకాడ వలయు నని యతని కుత్సాహము కలిగెను. కాని పాపము దైవ మతనిని దుర్భాగ్యవంతులయింట బుట్టింపక నిలువేదలయింట బుట్టించెను. "ధన

మూలు మిదంజగత్తను" మాట మొదటిసారి యతనికిఁ దోఁచెను. ఆ మాట నారంభించినతరువాత మేనమామ విభూతిబుట్టలో వైచు చున్నడబ్బులు తల్లి తనవదినెగారు చూడకుండ బియ్య మమ్ముకొని యుప్పుబుట్టలోను గూటిలోను దాఁచుకొన్నడబ్బులు మాయమై పోవ జొచ్చెను. మేనమామ కప్పుడప్పుడు మేనల్లునిమీఁద ననుమా నముకలిగి యావిషయము చెల్లెలి కెఱిఁగింప యామె యభిమానము చేతనో నిజముగా నమ్మి యుండుటచేతనో "అన్నయ్యా! నీమేనల్లుని దగ్గఱ మఱియేదుర్గుణ మున్నదన్న నొప్పుకొన వచ్చును కాని దొంగతన మున్నదని యొప్పుకొన లేము. ఇదివఱ కెన్నఁడు జూడ లేదు. చూడని మాటలు మన మన గూడదు. దుండగుఁ డగుటచేత వీఁడే పాపములకెల్ల భైరవుఁడనియపవాదము వచ్చుచున్నది. విఘ్నే శ్వరు చవితినా డక్షతలు నెత్తిమీఁద వైచికొనకుండ ముందుగా జందురిని జూడవద్దని నే నెన్నిమాట్లు చెప్పినను వినఁడు విన నందుకు దానిఫల మనుభవించు చున్నాఁడు. ఇంతకు నేను చేసి కొన్నపాపము. లేకలేక వంశాన కొక్కఁడు పుట్టినాఁ డనుకొంటే వానిమీఁద దొంగతనములు వచ్చి పడుచున్నవి. నే నేమి చేయ గల"నని యుత్తరము చెప్పెను. "సరే ముందుముందు నీకే తెలియ యగల" దని సోదరుఁ డూరకుండెను. తల్లియు మేనమామయు డబ్బు లు జాగ్రత్తపెట్టి దాఁచుకొన జొచ్చిరి. అప్పుడు పేకాటకు పైకము దొరకక గణపతి పొరుగిండ్లకు బోయి యథాసందర్భముగ దొరకినం తవఱకు హస్తలాఘవము చేసి యాటలోపడిన ఋణములుదీర్చి కృత కృత్యుఁ డగుచు వచ్చెను. పేకాటలోనిస్నేహితులు చాలమందిపొగ చుట్టలు కాల్చువారగుటచేత గణపతికిగూడ చుట్టలుకాల్చవలయునని సరదా పుట్టెను. ముందుగా సరదాతీర్చుకొనుటకై గోసుపుల్లలు కా ల్చెను. తరువాత నసఁటిచొరుగు చుట్టలుచుట్టి కాల్చి కొంతవఱ

కుత్సాహము దీర్చికొనియెను. కాని మిత్రులందఱుఁ బొగచుట్టలు కాల్చుచుండగాఁ దాఁ ననఁటిచొరుగుచుట్టలు కాల్చుట తనకెంతో యవమానకరముగ నుండెను.

అందుచేత నతఁడు బొగచుట్టలే కాల్చ వలయు నని నిశ్చయించుకొని యనుభవముగల స్నేహితులతో నాలోచించి పాటి యాకు మిక్కిలిగాటుగానుండి వికారపెట్టును కావున గాటు తక్కువగనున్న లంకాకుచుట్టలు కాల్చుట మంచిదని యొక స్నేహితు నడిగి యొకచుట్ట బుచ్చుకొని కాల్చెను. అది వికారపెట్టెను. వమన మయ్యెను. మిత్రులతని నొకచాపమీఁద బండుకొనబెట్టి కొంచెము చింతపండుదెచ్చి యతనినోట వైచి యుపచారములు జేసిరి. వికార పెట్టినది కదా. ఇది స్పృశింపఁగూడదని గణపతి తలంపలేదు. తనసంగడికాండ్రందఱు వికారము లేకుండ యథేచ్ఛముగ గుప్పు గుప్పున లంకాకుచుట్టలు బాటియాకుచుట్టలు గాల్చి సుఖించు చుండఁగా వికారపెట్టిన దని తన యొంటికి సరిపడ దని తా నది కాల్చుట మానినపక్షమున మిత్రమండలిలో దన కప్రతిష్ట సంభవిల్లు నని త న్నప్రయోజకుఁ డనుకొందు రని భయపడి యశఃకాముఁ డగుటచేత నెట్లయిన వీఁడు చుట్టలు కాల్చుటలో దిట్ట యని పేరు సంపాదింప వలయు నని నిశ్చయించి కుశాగ్రబుద్ధి యగుటచే నట్లు నిరంతరాయముగ చేయుట కుపాయములు వెదకెను. తదేక ధ్యానముతో నున్న యాబుద్ధిమంతున కొకయుపాయము బొడగట్టెను. వికారపెట్టినప్పుడు వెంటనే ప్రాతయుసిరిక పచ్చడికాని రెండేండ్లనాటినిమ్మకాయముక్కకాని నారదబ్బకాయముక్కకాని ప్రాత చింతకాయపచ్చడి కాని నోటిలో వైచికొన్న పక్షమున వికారమడఁగు నని గ్రహించి చుట్టకాల్చుట నిర్వికారముగ నలవాటగు వఱకు నెవఱినో యొకరి నడిగి యావస్తువులలో నేదో యొకటి

తెచ్చితిని కష్టపడి యలవాటు చేసికొని దినమునకు నూరుచుట్టలు కాల్చినను వికారపెట్టనంత దిట్టయయి మిత్రవర్గములో నప్రతిష్ఠ పాలు గాకుండ బొట్టివాఁడు గట్టివాఁడురా యని పేరు వడసెను. గణపతి పూనికవంటిపూనిక దేశములో నెందరికి గలదు? ఎందఱో తెలివి తక్కువవాండ్రు చుట్టలు వికార పెట్టగానె యొకదండము పెట్టి మానివైచిరి. కాని గణపతివలె దాని యంతముకనుగొనువారు కలరా? అందుచేతనె యతనిచరిత్రము పురాణమైనది.

చిన్ననాట నుండియు గుఱ్ఱ మెక్క వలయు నని గణపతి కుబలాటము కలిగెను. మందపల్లిలోను నేనుగుల మహాలులోను గుఱ్ఱములు లేవు. అప్పు డప్పుడు దూరపుటూళ్ళనుండి గాజులవర్తకులు గుఱ్ఱము లెక్కి తనయూరికి వచ్చినపుడు గణపతి వారికడ కరిగి వారినిబతిమాలి యావకాయముక్క యోమాగాయముక్క యో తల్లి జూడకుండ నింటనుండి పట్టుకొనిపోయి నాలుగుచుట్టము క్కలు కొసరిచ్చి యొకసారి గుఱ్ఱము మీఁద నెక్కించు మని వారిని వేడికొని యెక్కి నాలుగువీధులు దిరిగి తనకు గలిగిన యశ్వారోహణవైభవము తోడిసంగడికాండ్రకు గలుగనందున గర్వ పడుచు మార్గమధ్యమున వారు కనఁబడినప్పుడు వెక్కిరించుచు నుబలాటము దీర్చుకొనుచుండును. ఈయయిశ్వర్య మేడాదికి రెండు మూఁడుసారులకంటె నెక్కువగ లభియించుటలేదు. ఒకరిని యా చించి యెరువుగుఱ్ఱ మెక్కి రెండుమూఁడుగడియలు స్వారివెడలుట గణపతికి లజ్జాకరముగ నుండెను. సాధ్యమైనంతవఱకు సొంతవాహ నముగాని నిరంతరము గ్రామమునందె యుండు వాహనముగాని సం పాదింపవలయు నని యతఁడు సంకల్పించుకొనియెను. అశ్వములు మొదలైన వర్థసాధ్యములు. అర్థములేని గణపతివంటి వ్యర్థున కవి యెట్లు సాధ్యమగును? సాధ్యముకానిచో నుబలాటము తీరు టెట్లు?

అశ్వారోహణమందలి యౌత్సుక్యము దీర్చుకొనుటకై యతఁ డుపాయముల వెదకెను. గుఱ్ఱము లేనప్పుడు దానికి బదులుగా మనుష్యుఁ డెక్కి తిరుగుటకు వీలైనది మఱియొక జంతువు లేదా యని యతఁడాలోచించెను. గాడిద నేల యెక్కఁగూడదని యతఁడు విమర్శింపఁదొడఁగెను. గాడిద నెక్కినపక్షమున గలిగెడు లాభ నష్టము లేవియని యతఁడిట్లు వితర్కించెను. "గుఱ్ఱమువలె దానికి గూడ నాలుగుకాళ్ళున్నవిగదా. మనుష్యులను మోయగలదుగదా. కడుదూరము నడువగలదు గదా. రూపమున భేదముతప్ప గుణముల యందు భేదమేమియు గనఁబడదు. విశేషించి గుఱ్ఱమునకు గుగ్గెళ్ళు దాణా పెట్టవలెను. గాడిదెకు గుగ్గెళ్ళక్కఱలేదు. ఏబీటిలో వదలిపెట్టినను నేచేనిలో వదలిపెట్టినను దానంతటది మేతతిని వచ్చును. గుఱ్ఱమున కొకసాల గావలెను. గాడిదె కక్కఱలేదు. ఏచెట్టుక్రిందవదలినను నేబైటి దిరిగినను దానికి భయములేదు. గుఱ్ఱమును మాలీను చేయుట కొకకాపరి కావలెను. వానికి జీత మీయవలెను. అందుకు డబ్బు కావలెను. గాడిద కట్టికాపరి యక్కఱ లేదు. అశ్వమునకు సుళ్ళు మొదలైనవి చూడవలెను. మంచిసుళ్ళు లేనిగుఱ్ఱ మైనచో యజమానుని కొంపదీయును. గాడిదకు సుడి చూడనక్కఱ లేదు. గుఱ్ఱమును సొమ్ముకర్చుపెట్టి కొనవలెను. గాడిదెను వెలయిచ్చి కొనన క్కఱలేదు. చాకలివాండ్రివద్ద కావలసినన్ని యున్నవి. గుఱ్ఱము మీఁదజీను వేయవలయును. కళ్ళెములు కావలెను. గాడిదెకవియేవియు నక్కఱలేదు. దానికి సంరక్షణమక్కఱలేదు. అంగరక్షులపనిలేదు. వెల యక్కఱలేదు. సులభసాధ్యమై కొంగుబంగారమువలె నున్న గాడిదను వదలి గుఱ్ఱమునకై దేవులాడుట వెఱ్ఱితనము. అందుచేత సర్వవిధముల గాడిదయే శ్రేష్ఠము. కాదాయెనంటె నలుగురు నవ్వుదురు. ఒకరినవ్వుజోలి నాకెందుకు? నన్నుజూచివారు నవ్వినపక్షమున వారిని

జూచి నేను నవ్వెదను. వారిమొగమోటము మాకేమి! నేను కుక్క నెక్కుదును. గుఱ్ఱము నెక్కుదును. గాడిదనెక్కుదును." అని పూర్వ పక్షములు సిద్ధాంతములు తనమనంబునఁ జేసికొని యెట్టకేలకు గార్దభవాహన మధిరోహించుట కతఁడుకృతనిశ్చయుఁడయ్యెను. తమకు బట్టలుదుకు చాకలివానియింటికిఁబోయి నాలుగుచుట్టముక్కలు వానికి దానమిచ్చి వానిగాడిదను యెరు విమ్మని యడిగెను. ఆమాట వినగానె వాఁడువచ్చి "బాపనోరు గాడిద నెక్కకూడ దండీ తప్పు తప్పని" మందలించెను. చాకలి వెధవవు బ్రాహ్మణునికంటె నీ వెక్కు వెఱుఁగుదువా? అవకతవక ప్రసంగములు చేయక తీసికొని రా. నీవు నీగాడిద నీయకపోతే మఱియొకగాడిదను తేగలను. ఊరు నిండ కావలసినన్ని గాడిదలున్నవి. నీగాడిదనే యిచ్చితివా యావ కాయ మాగాయపచ్చళ్ళు కూరలు నీకు దెచ్చిపెట్టుచుందును. నేన ప్పుడప్పుడు బ్రాహ్మణార్థములు చేయుచుందును. చేసినప్పుడునావిస్త రిలోవడ్డించిన యరిసెలు గారెలు యజమానులు జూడకుండ చెంబు లలో పెట్టికొని దొన్నెలలో బెట్టికొని దాచి తెచ్చి నీకిచ్చుచుం దును. భోజనమునకు వెళ్ళినప్పుడు గూడ నీలాగే బూరెలు తెచ్చిపెట్టు దును. కావలసినన్ని చుట్టల నప్పుడప్పుడు డబ్బులు నీకుబహుమాన మిచ్చుచుందును. లేనిపోని శ్రీరంగనీతులు వెప్పక తీసికొని రానీగాడిద నని తిట్టి యాసగోలిసి వాని నొడంబఱచెను. వాఁడును దనమైల గుడలు మోయుగాడిదెను తీసికొనివచ్చి యెదుటబెట్టెను. గణపతి కప్పటికి పదునాలు గేండ్లవయస్సున్నను వయసునకు దగినంతపొడ గరి గాకపోవుటచే దానిపై కెక్కలేక చాకలివానిని క్రిందఁ గూ ర్చుండఁబెట్టి ముందు వానిభుజముమీఁద నెక్కి పిమ్మట గార్దభవా హన మధిరోహించెను. కళ్లెములేకుండ దానిమీఁద నతఁడు కూ ర్చుండుట కిష్టములేకపోయెను. త్రాటియాకులగుది కళ్లెముగ నుప

యోగింపు మని చాకలివాఁ డుపదేశించెను. చదువుకొన్నవానికంటె చాకలివాఁడు మే లన్నమాట నిజమైనది. నీయుపాయమే బాగున్నది. నీవే కట్టితీసికొనిరా" యని చెప్పి వాఁడు కట్టితెచ్చినత్రాటి యాకులగుది కళ్ళెముగఁ బెట్టి దానినిచేతఁ బుచ్చుకొని వెనుక నడచుచుఁ జాకలివాఁడు గాడిదనుదోలుచుండ పైయుత్తరీయము కుచ్చువచ్చునట్లు తలకుఁజుట్టి చుట్టవెలిగించి నోటబెట్టి గుప్పు గుప్పు మని పొగలెగయ నీతబెత్తముతో గాడిదను నడుమనడుమగొట్టి యదలించుచు ముందుగా జాకలివాండ్రి యిండ్లదగ్గఱతరువాత దక్కినవీథుల వెంబడినిదిరిగెను. ఆమహోత్సవము జూచుటకు వీథివీథిని బిన్నలు పెద్దలు స్త్రీలుఁబురుషులు గుమిగూడిరి. పట్టాభిషేకమహోత్సవసమయమున బసిడియంబారివైచి మదపుటేనుఁగు నెక్కి నగర మందు జరియించు మహారాజునకైనను నైరావతము నెక్కి యమరావతము నందు దిమ్మరు దేవేంద్రునికైనను నంతటిసంతోషము నంతటిగర్వము నంతటిప్రాభవము నుండదని నిశ్చయముగజెప్పవచ్చును. గార్దభవాహనారూఢుఁడైన గణపతి తన్ను ప్రజలు చూడవచ్చి నప్పుడు సిగ్గుపడలేదు. చిన్నవోవలేదు; సందియము నందలేదు. జంకలేదు. ముప్పదినలువదిమందిచిన్నపిల్లలు రాసభమువెనుకఁ జేరి చప్పటలు జఱచుచుఁ గేకలువైచుచుఁ ద్రాటియాకులు బుట్టలు చేటలువాయించుచు నల్లరి జేయసాగిరి. గాడిద బెదరి పరుగిడఁ జొచ్చెను. ఆతొందరలో నది త్రాటియాకులకళ్ళెము తెగఁగొరికెను. గణపతి తన్ను గార్దభము పడవైచు నని ముందుకు జరిగి వంగిదానిచెవులు గట్టిగఁ బట్టుకొనును. చెవులు నొప్పి పెట్టుటచే నది మఱింత పరుగెత్తును. అదృష్టవశమువలన నప్పుడు గార్ధభయజమానుఁ డగుచాకలివాఁడు ముందుకుఁ బోయి యాపెను. అందుచే గణపతి నేలఁగూలుట తప్పెను, ఇంతలో నతనిమేనమామ కొందఱుబాలకులవలన మేనల్లునిఖర

వాహనారూఢవృత్తాంతము విని కోపోద్రేకమున నొకదుడ్డుకఱ్ఱ చేతఁ బట్టుకొని తిట్టుచు నతని కెదురుగావచ్చెను. మేనమామను జూడఁగానె గణపతి వాహనముమీఁద నిలువ లేక గుభాలున దానిమీఁద నుండి నేలకు దుమికికాలిసత్తువకొలఁది పరుగెత్తెను. గణపతిమీఁదఁ బడవలసినదుడ్డుకఱ్ఱ తనమీఁదఁ బడునేమోయని చాకలివాఁడుగాడిద నక్కడవిడిచి పిక్కబలముజూపెను. వెంటనున్నపిల్లలు నానాదిశలకుఁ బరుగెత్తిరి. పాఱిపోవుచున్న మేనల్లుని బట్టుకొనుట యసాధ్య మని మేనమామ వానివెంట నరుగక గణపతిని గాడిదను రజకుని నిందించుచు గృహంబున కరిగెను. అనంతరము మూఁడుదినములవఱకు గణపతిమేనమామయొక్క కోపశిఖి వేఁడిమి మందగింపనందున గృహంబున కరుగుటకు వీలు లేకపోయెను. "ఆదౌర్భాగ్యుఁడు నాయింటికి వచ్చెనా కుక్కనుకొట్టినట్లు దుడ్డుకఱ్ఱతోఁగొట్టి చంపెదను. ఈదుర్మార్గునిమూలమున నా కెన్నోతలవంపులు వచ్చుచున్నవి" యని మేనమామ తన్ను జూడ వచ్చినవారితో ననుచుండినట్లు గణపతికి వినవచ్చెను. మేనమామకు మిత్రులైనవారు కొందఱు గణపతిం గలసికొని "కుఱ్ఱవాఁడా! నీకిదేమివినాశకాలము రా! ఏనుఁగు నెక్కినవారున్నారు. గుఱ్ఱమునెక్కినవారున్నారు. కాని బ్రాహ్మణకులములోఁ బుట్టినవాఁడు గాడిదె నెక్కఁగా నెక్కడఁ జూడలేదు. నీమూలమున దన కెంతో యపకీర్తి వచ్చుచున్నదని నీమేనమామ యేడ్చుచున్నాఁడు. ఈపాడుబుద్ధి నీకెవరైననేర్పినారా? నీకేబుట్టినదా. ఇటువంటి యవకతవకపనులు మాని తిన్నగా నడచుకొంటివా మీమామతోఁ జెప్పి నిన్నింటికిఁ జేర్చెద" మని మందలించిరి. అనపుడు గణపతి నవ్వి వారి కిట్లనియె. "అయ్యా! గాడిద నెక్కినఁ దప్పేమున్నది? భాగ్యవంతుఁడు వరియన్నము దినును. పేదవాఁడుజొన్నకూఁడు తినును. అగ్రహారీకు లంటుమామిడిపండ్లు తిందురు. పేదవాఁడు జీడిమా

మిడిపండ్లు తినును. అలాగే మెక్కువ డబ్బున్నరా జేనుఁ గెక్కును. కొంచెము డబ్బున్నవాఁడు గుఱ్ఱమెక్కును. గవ్వైనలేనివాఁడు గాడిద నెక్కును. దానికి దీనికి భేదమేమి? గుఱ్ఱము సకిలించును. గాడిద యోండ్రము పెట్టును. దీనికిఁగూడ జీను వైచి కళ్ళెముపెట్టి డెక్కల కినుపనాళములు వైపించి నడక నేర్పించి ముద్దు చేసినపక్షమున గుఱ్ఱమును మించియెయుండును. పనికిమాలిన దని పదిమంది పేరు పెట్టినచో నది పనికిమాలినదె యగును. గాడిద నెక్కుటవలన గొప్పలాభమున్నది. అది యేది యనఁగా ముందు గాడిదమీఁద స్వారి నేర్చుకొన్నపక్షమున గుఱ్ఱపుస్వారి సులభ మగును. ఇవియన్నియు నటుండనిండు. గాడిద యెంతగొప్పదో మీరెఱుఁగుదురా. శ్రీకృష్ణమూర్తివారితండ్రియైన వసుదేవుఁడంతవాఁడు తన కాపద వచ్చినప్పుడు గాడిదకాళ్ళు పట్టుకొన్నాఁడు. ఏనుగుకాళ్ళు పట్టుకొన్నాఁడా? గోవు కాళ్ళుపట్టుకొన్నాఁడా? గుఱ్ఱముకాళ్ళు పట్టుకొన్నాఁడా? అనుహాపత్సమయమున వసుదేవుఁడు దానికాళ్ళు పట్టకపోయినపక్షమున కృష్ణమూర్తి బ్రతుకకనేపోవును. నేను వసుదేవునికంటె గొప్పవాఁడనా మీరు గొప్పవారా? నేను దానిమీఁద నెక్కితిని. కాని వసుదేవునిలాగ కాళ్ళుపట్టుకొనలేదు. గాడిద నెక్కుట తప్పని నామేనమామకుఁ దోఁచినపక్షమున మంచిగుఱ్ఱము నొకదానిని కొనియిమ్మనిచెప్పండి. అది యిచ్చెనా గాడిద నెక్కుట మానెదను.

గణపతిపలుకులు విని వారందఱుఁ జిఱునగవునగి ఁవీని బ్రతుకుకాల. పొట్టచించికంచుకాగడాల వెదకినను నొక్కయక్షర మైనను గానరాని వీఁడు తనపనికిఁగావలసినపురాణసాంప్రదాయములఁ గూడ నెఱుఁగును. వీఁడు వసుదేవునిసాటువు దెచ్చికొన్నాఁడు. పొట్టివానికి బుద్ధులు పుచ్చె డన్నమాట నిజమైనది. వీఁడు దేవతలకు సయితము పంచాంగము చెప్పఁగలవాఁడు. వీనికి మన ముత్తరము చెప్పలేము.

పదుండి" యని వెడలిపోయిరి. గణపతియొక్క ఖరవాహనారోహణ వృత్తాంతమువిని యది యన్యాయకార్యమనియునతఁడు సజ్జనదూరుఁడనియు వట్టినిర్భాగ్యుఁడనియు మీరు నిశ్చయింతు రనుసందియము కలుగుచున్నది. అట్లు మీరు తలంచుట న్యాయముకాదు. ఏలయన నిట్టివారనేకులు గలరు. ఎవరిమాటయొ యెందుకు. అసాధారణప్రభావసమేతులగు దేవతలం జూడుఁడు. దేవతల కెల్ల దొరయె ముజ్జగంబులయేలికయై కల్పవృక్షము కామధేనువు చింతామణి మొదలగుకామప్రదానపదార్థముల కొడయఁడైన నిర్జరేంద్రునకు మేఘములువాహనములు. నీరు గాలి మెఱుపు పొగ మొదలగుపదార్థములతోఁజేయబడిన మేఘమా యతనికి వాహనముగ నుండవలసినది. తక్కినవేల్పులం జూడుఁడు. సకలయాగములకు సకలస్మార్తకర్మలకు నాధారమైన యగ్నిహోత్రునకు వాహనముగొఱ్ఱె. దక్షిణదిక్కునకు నాయకుఁడైధర్మాధర్మవిచారణానిపుణుఁడైనయమధర్మరాజునకువాహనము దున్నపోతు. జలధినాయకుఁడైన వరుణుఁడు మొసలిపై నెక్కును. మహాబలుఁడై సముద్రజలముఁ బైకెగరఁ గొట్టియుమహావృక్షములఁ గూల్చియు క్షణకాలమున జగన్నిర్మూలనము జేయఁ గలవాయుదేవుఁడు లేడిమీఁద స్వారి జేయును. 'ఆదౌ పూజ్యో గణాధిపః' యన్నట్లుసకలశ్రౌతస్మార్తకర్మలకు ముందుపూజనీయుఁడగుగణాధిపతియెలుకనెక్కి పందికొక్కునెక్కి బయలుదేఱును. ఉమామహేశ్వరులకుమారుఁడైన గణపతి కింతకంటె వేరువాహనము లేకపోయెనా? కొంపత్రివ్వునట్టి యెలుకా వానితురంగము! సకలగృహపతి యగు మార్జాలచక్రవర్తి కొక్కకబళముగ నుపయోగపడునెలుకమీఁద నాప్రమథగణపతి యెక్కఁగా మనగణపతి గాడిదెమీఁదనెక్కుటతప్పా? ఆతనిమాట యటుండనిండు. లక్ష్మీనారాయణుల పుత్రుఁడై గరళకంఠునివంటి మహాదేవుని జయించిన జోడై చండశాసనుఁడై సకలలో

కలబులంగల సకలజంతువులను బూవుటమ్ములతో గొట్టి పడవైచు నట్టిమన్మథునకు వాహనమేమో యెఱుఁగుదురా? చిలుక. ఆమన్మథునితండ్రియగు నారాయణునితురంగ మేమో యెఱుఁగుదురా? బొల్లిగ్రిద్ద. ఎక్కడ దిక్కులేనట్లు తండ్రికొడుకులైన మాధవమన్మథులు ఎక్కాడినఁగాని బ్రతుకులేని దిక్కుమాలినపక్షులపై నెక్కుచున్నారు. అనంతకోట్యవతారంబులు నెత్తి పరాత్పరుఁ డనియుఁ జరాచరాత్పరుఁ డనియు వ్యాస వసిష్ఠ వామదేవాది మహర్షులచేత వినుతింపఁబడిన శ్రీమన్నారాయణుఁ డెక్కుటన లోకమున బొల్లిగ్రిద్దతప్ప వేరువస్తువులు లభింపవా? ఇఁక శివునిమాట తడవఁ బనియే లేదు. ఆయన వెల్లయెద్దు నెక్కి విహారము చేయును. అడ్డమైనగడ్డి కఱచునట్టిపశువుమీఁదనా శివుఁ డెక్కవలసినది? మహేశ్వరుఁ డెంతవాఁడు? లలాటనేత్రజ్వలన కీలలచేత నిమిషార్ధమున విష్ణుపుత్రుఁడగు దర్పకుని బిడికెడుబూడిద చేసినాఁడు! క్షీరసాగర మథనకాలమున సముద్రగర్భమునుండి బొడమి లేచినహాలాహల విషము సకలలోకభయంకరమై వ్యాపించి బ్రహ్మాండము భస్మపటలముఁ జేయునట్లు లుండ ముప్పదిమూఁడుకోట్ల దేవతలు వెఱచి రక్షింపు మని చేతులుమోడ్చి మొక్కి తన్ను వేఁడ కరుణాళుఁడై వెన్నముద్దవలెయావిసపుముద్దను మ్రింగి యత్తరి నప్పాల సంద్రమునఁ బుట్టినకల్పవృక్షమును నైరావతమును నుచ్చైశ్రవము నిందుని కిచ్చి లక్ష్మీకౌస్తుభములు విష్ణునకిచ్చి తనలోకోపకారశీలతయు నిస్పృహత్వమును వెల్లడిచేసెను. అట్టిమహనీయుఁ డెద్దెక్కుట బాగున్నదా? ఈయనకుమారుఁడగు కుమారస్వామి జగత్త్రయకంటకుఁడగు తారకాసురుని శక్తిప్రయోగమున సంహరించి వేల్పుల కృతజ్ఞతకుఁ బాత్రమయ్యెను. ఇతఁడు క్రౌంచపర్వతము భేదించిన మహాయోధుఁడు. అతఁడు దేనిమీఁద నెక్కునో యెఱుఁగు

దురా? నెమలిమీఁద. వన్నెలచిన్నెలబండారమే కాని నెమలి గొప్ప యేమున్నది? బ్రహ్మదేవుఁడు చతురాననుఁ డఁట! సురజ్యేష్ఠుఁడఁట. హిరణ్యగర్భుఁడఁట. ప్రజాపతి యఁట. వాణీనాథుఁడఁట. సృష్టికర్త యఁట. వానచుక్కలు మీఁదఁబడినమాత్రిన త్రోఁక త్రెంచుకొని పాఱిపోవుహంస వీనివాహన మఁట. మహిషాసురమర్దని యగుకాత్యాయని సింహ మెక్కును. నిగ్రహానుగ్రహసమర్థులు, నిరుపమాన మహిమాఢ్యులు, కళ్యాణగుణ సంపన్నులు, కామరూపులు, సకలలోకపూజ్యులు, సర్వధర్మపరిజ్ఞాతలు నైన దేవతలె గొఱ్ఱెనెక్కి బఱ్ఱెనెక్కి యెలుకనెక్కి చిలుక నెక్కి యెద్దునెక్కి గ్రద్ద నెక్కి మఱియు నిచ్చవచ్చిన జంతువుల నెక్కి పులుఁగుల నెక్కి బెదురు లేక బిడియములేక సిగ్గులేక చింతలేక తిరుగుచుండ నేప్రజ్ఞ లేక మనుష్యమాత్రుఁడై కించిజ్ఞుఁడై బాలుఁ డైన గణపతి గాడిదనెక్కి తిరుగుట యేమితప్పు? దున్నపోతుయొక్క యతిశయ మేమి? మూషికముయొక్క ముఖ్యతయేమి? గాడిద చేసిన కానిపని యేమి? అభిమానముచేత నెద్దులను దున్నపోతులను నెక్కినవారిని మహర్షులుపురాణములలోఁ గొనియాడఁగనే మీరును బళీబళీయని మెచ్చి పూజించుచున్నారు. గణపతి డబ్బులేని పేదబాపనయ్యకొడు కగుటచేత గాడిదనెక్కినంతమాత్రమున నిర్భాగ్యుఁడనుటకు సాహసించుచున్నారు. పక్షపాతమె ప్రేమ గలిగించును. పక్షపాతమే యేవ గలిగించును. గుణశూన్యుఁడైనను మెచ్చిపొగడువారున్నపక్షమున గుణరత్నాకరుఁడగును. మెచ్చి కొనియాడువారు లేనప్పుడు గుణరత్నాకరుఁడు సయితము శుంఠ యగును. నోరు గలవాండ్రిఁ గొంగఱఁ జేరఁదీసిన దేవానాం ప్రియుఁడు సతతము మహాపురుషుఁడుగఁ బరిగణింపఁబడుచున్నాఁడు. ఆలంబము లేనివాఁ డణఁగిపోవుచున్నాఁడు. మాగణపతి యాత్మగౌరవముగలిగి

స్వప్నములోఁ గనఁబడిన తన వృత్తాంతముఁ జెప్పఁబట్టి యదివారి యువా రొకరు దొరకబట్టి యీమాత్రము గ్రంథమైన బయలుదే తినది. కాని లేకపోయినచో నేమి కావలసినది? అడవిలోఁ బుట్టి యడవిలోఁబెఱిఁగి యడవిలో రాలిపోయిన యుమ్మెత్త పువ్వువలె సముద్రములో బుట్టి సముద్రములోఁబెఱిగి సముద్రములో నణఁగి పోయినన త్తగుల్లలపోగువలె నితని చరిత్రము లోకమందు ప్రసిద్ధ ముగాకయుండును గదా. ఎట్లోయొక యట్లు చరిత్ర ప్రసిద్ధమైనది. కాఁబట్టి యతఁడు గార్దభ మెక్కినంత మాత్రమున నింద్యుఁ డని మీరు భావింపవలదు.

తొమ్మిదవ ప్రకరణము.

గణపతి యింటికి రాక పరగృహంబున వసియించుట మాతు లునకు మనఃఖేదము గలిగింపకపోయినను దల్లికిఁ దగనితల్లడపాటును గలిగించెను. మధ్యాహ్నము భోజనమైన తరువాత నామెసోద రుఁడు చూడకుండఁ గొడు కున్నకడకుఁ బోయి వాని బ్రతిమాలి యుఁ జీవాట్లు పెట్టియు బెదిరించియు నెన్నోవిధముల నింటికి రమ్మని యడుగుచు వచ్చెను. నిజముగ మేనమామ దుడ్డుకఱ్ఱతో బుఱ్ఱ పగులఁగొట్టుననినమ్మి తెనాలిరామకృష్ణునిపిల్లి పాలపేరు చెప్పఁ గానె భయపడి పరుగెత్తినట్లు గణపతి యిల్లుపేరు చెప్పఁగానె యులికి పడి "నేనాయింటికి రాను. నీయన్నగారు దుడ్డుకఱ్ఱతో నన్ను కుక్కనుగొట్టినట్లుకొట్టి చంపివైచును. నేను చచ్చినతరువాత నీవేమి చేయఁగలవు? అన్నము లేక చచ్చిపోయెదఁ గాని దుడ్డుకఱ్ఱదెబ్బ తిని చావను. నేను గాడిదెనెక్కిన దన కెందుకు? నాజోలికి రానని

యాయనగారు వర్తమానము పంపినపక్షమున నేను వచ్చెదను. లేనిచో రాను నని బదులు చెప్పెను. తల్లి యది విని దిగులు గుండెతో నింటికిఁ జని రెండుదినములు గడచినతరువాత నొకనాఁడు సోదరుని జూచి యిటనియె. "నాయనా! కుఱవాఁ డింటికి వచ్చుటలేదు. ఎంతో బెదిరిపోయినాఁడు. వాండ్రి యింటను వీండ్రియింటను దిరుగుచున్నాఁడు. దొరికినపూట తినుచున్నాఁడు. లేనిపూట లేదు. చిక్కి శల్యమైనాఁడు. కన్నులు గుంటలు పట్టినవి. ఇంటిలో నడుగుబెట్టఁగానె నీవు చంపివైతు వని భయము కలిగినది. నీవు రమ్మంటే వాఁడు నిర్భయముగ వచ్చి నీపంక్తి నింతగంజియన్నముఁ దిని వెళ్ళును. చిన్నప్పటినుండియు నీవే వాఁడు చేసినతప్పులు భరించి పెంచినావు. చెడ్డసహవాసముల చేత వాఁ డాలాగునఁ జెడిపోయినాఁడు. మేనమామవైన నీవే. తండ్రివైన నీవే. వెనుకటిలాగుననె యీసారికూడ తప్పులు క్షమించి యింటికి రానీ. ఈపర్యాయము గాడిద నెక్కకుండ బుద్ధి జెప్పెదను" అనవుడు సోదరీవచనములకు భద్రాచల మిట్లనియె. "అమ్మాయీ! గాడిదమీఁద వానిని జూచినప్పుడు నాకోపమాగక కుక్కనుగొట్టినట్లు దుడ్డుకఱ్ఱతోఁ గొట్టెద నని నేనన్నమాట నిజమే. దుడ్డుకఱ్ఱ కాదు. వాఁడు చేసినపనికి రోఁకలితో వానితల చితుకఁబొడువవలయు నని నాకున్నది. కాని కోపము వచ్చినపు డన్నంతమాట చేయఁగలమా? ఈదుర్మార్గునిదుండగముల నన్నిఁటిని నేను కడుపులోఁ బెట్టుకొని భరించలేదా. ప్రేగుతీపిచేత నట్లు భరింప వలసి వచ్చినది. పాలకోసము తాయి మోయుమన్నాఁడు. మన వంశమం దెన్నడు లేని పాడుపని జేసి వీఁ డపకీర్తి దెచ్చుచున్నాఁ డని నే నేడ్చుచున్నాను. కాని నీకొడుకును జంపవలయునని కాదు. చీరవలయునని కాదు. వచ్చి యెప్పటిలాగున నుండుమని చెప్పు.

ఇంకొకసారి యిటువంటిపని జేసెనా తాటికమ్మతో వెన్ను బ్రిద్దలు కొట్టెద" నని చెప్పు. నీవు చేయుచున్నగారముపట్టి వాఁడు చెడి పోవు చున్నాఁడు. గారము గజ్జల కేడ్వఁగా వీఁపు దెబ్బల కేడ్చిన దన్నట్లు దెబ్బలు లేకపోబట్టి వాని కా వినాశకాలము వచ్చినది, పరువుమర్యాదలు వాఁడు జంపుకొన్నాఁడు. తనతండ్రి యెంతవాఁడో తనతాత యెంతవాఁడో యివతల నే నెటువంటివాఁడనో వాఁడె ఱుఁగఁడు. గాడిద నెక్కి కుక్క నెక్కి వాఁ డేదో గొప్పవాఁడ నైనా ననుకొనుచున్నాఁడు. నాకవి కిట్టపు. వచ్చి జాగ్రత్తగ నుండు మనుము." ఆపలుకులు సింగమ్మకు మేఱ మీఱినసంతోషము కలి గించెను. అంతకుముందు కుమారునకుఁ దనకు శాశ్వతవియోగ మగు నని బెంగ బెట్టుకొనెను. సోదరునివాక్యములవలన బెంగతీఱి నందున నామె యేరుఁగు నెక్కినట్లు సంతసించెను. ఆపూటనె యామె వెళ్లి కొడుకును దోడితెచ్చి యెప్పటివలె నింట నుంచెను. గణపతి రెండుమూఁడు దినములవఱకు మేనమామయొద్ద మిక్కిలి భయభక్తులు కలిగి యేజోలికిఁ బోక యిల్లు కదలి వెళ్ళక జాగ్రత్తగ నుండెను. కాని వీరణము చప్పుడు వినఁగానె పైత్యపుమేనివా నికి శివ మెత్తినట్లు మిత్రులను జూడఁగానె యతనికి వెరుకటి యుత్సాహము మరల నంకురించెను. నాలుగు పొలిమేరలనడుమనున్న నేల యంతయు నతనికి విహారభూమి యయ్యెను. అన్నితోఁట లత నివె. అన్నిదొడ్లతనివె. పండినమామిడిచెట్లకడకుఁ బోయి ఱాళ్లు రువ్వి పచ్చికాయలు పడఁగొట్టి సంగడికాండ్రిచేత నుప్పు కారము దెప్పించి యాకాయలు గరిగమ్మతోఁ గోసికొనియొ పండ్లతోఁ బీకియొ ముక్కలుచేసి కార మద్దుకొని తినుచుండును. తోఁటకాఁపులు దూర మునఁ గానఁబడినతోడనె వారి యదలింపుమాటలు చెవులఁ బడిన తోడనె తానును జెలికాండ్రును లేళ్ళవలెఁ బరుగెత్తి పోవుదురు.

నేర్పరులైన శిష్యులకాళ్ళకు బండములువైచి కొబ్బరిచెట్లెక్కించి కాయలు తీసి పగులఁగొట్టి నీరుద్రావి గుంజు తినుచుండుదు. నీరాటరేవులలో సాయంకాలమప్పుడు నిలువఁబడి బెడ్డలువిసిరి నీటికుండలు పగులఁగొట్టుచుండు. కుండ పగులగానె తూనీఁగలాగు పఱుగెత్తుచుండును. పట్టువడినప్పుడు చెంపకాయలుపుష్కలముగఁ దినుచుండును. ఒకనాఁ డొకజామితోఁటలో దొరఁగా బండినపండ్లు గణపతియు మిత్రులును శిలావర్షము గురిపించి నేలరాల్చుచుండ నంతలోఁగాఁపువాఁడు వాండ్రికెదురుగా రాక వెనుకపాటున వచ్చి యొకచేతితో గణపతిని మఱియొకచేతితో వానిస్నేహితులలో నొకనిని, బట్టుకొని బరపర లాగికొనిపోయి వారినిరువుర నొకచెట్టునకు తెక్కలు విఱిచి కట్టి చింతబరికెలతో నెత్తురు దొరఁగునట్లు కొట్టి యెన్నఁడు తోఁటవరికి రా ననిపించి పంపెను. అభిమానవంతుఁ డైన గణపతి యీపరాభవము తనతోడిదొంగయైన యీబాలునకు దక్క రెండవ వానికిఁ దెలియకుండ జాగ్రత్తపెట్టెను. అట్లుతట్టియు నుండ్రాళ్ళతట్టియు వచ్చెనా గణపతిసంతోషమింతింతయని వర్ణింప నలవికాదు. నాఁటిమధ్యాహ్నమె కొందఱు స్నేహితులనువెంటఁబెట్టుకొని పొదలలోనికి రుప్పలలోనికి దుబ్బులలోనికిఁ జని రెండుబుట్టలు పల్లేరుకాయలు, కొంతదూలగొంజి, పదియీఁతజువ్వలు, రెండుబుట్టలు బొమ్మరాళ్ళు బెడ్డలు దెచ్చి యొకచోట దాఁచును. రాత్రిభోజనము చేయఁగానె పండుకొని తోడిబాలకు లందఱుఁ దెల్లవారుజామున లేచుచుండ, దాను రెండుజాముల రాత్రివేళనె లేచి తల్లిని మేలుకొలిపి తల్లిసాయమున నిరుగుపొరుగువారి యిండ్లకుఁబోయి యచ్చటిబాలురను లేపి మరల గృహంబునకరిగి చప్పుడుచప్పున మొగము గడిగికొని యుల్లిపాయలపులుసుతోను నువ్వుపొడముతోను పొట్లకాయపరమాన్నముతోను గేదెపెరుగుతోను భోజనముచేసి కొన్ని పల్లేరు

కాయలు మూటగట్టుకొని భుజముపై వైచికొని రాళ్ళబుట్టయొకటి యెడమచంక నిరికించుకొని నోటచుట్ట వెలిగించి కుడిచేత నీతజువ్వ పుచ్చుకొని కేకలు వైచుచు వింతవింతలపాటలు పాడుచు వీధుల వెంటఁ దిరుగును. ద్వాపరయుగమునం దెన్నఁడో శ్రీకృష్ణునిమీఁది యాగ్రహముచే దేవేంద్రుఁడు ఆళ్ళవాన గురియించె నని భాగవతము హరివంశము మొదలగు మహాపురాణములయందు వర్ణింపఁబడుటయెగాని కలియుగమం దట్టి ఆళ్ళవాన నెవ్వరుఁ జూచి యెఱుఁగరు. దేవగణపతి నిజముగ నట్టివాన గురిసెనో లేదో చెప్పఁజాలము గాని మనగణపతి నిజముగ నెన్నో ఆళ్లవానలు గురిపించెను. మగవారు లేక కేవల మాఁడువాండ్రే యున్న యిండ్లమీఁదను నంచు ముఖ్యముగ ముసలియవ్వ లున్నయిండ్లమీఁదను గణపతి హస్తములు ఆళ్ళు విసరుటలో భారతరణమందు గౌరవసేనపై నవలీలగ శరపరంపర కవదొనలనుండి తీసి యెడము లేకుండఁ బ్రయోగించిన యర్జునుని హస్తము దలపించును. ఆవిషయమున గణపతి సవ్యసాచి యని చెప్పవచ్చును. తెల్లవారుజామున లేచి చలిదియన్న మారగించి చిన్నీబిన్ని మొదలగు పాటల నాడుకొనుచుండు నాఁడుపడుచు లున్నచోటికి మెల్లమెల్లఁగఁ జని యేచాటునుండియో మూఁట విప్పి పల్లేరుకాయలు తీసి వాళ్ళకాళ్ళ నడుమఁ జల్లును. పల్లేరుకాయ లాకాలునకు గుచ్చుకొని యీకాలునకు గుచ్చుకొని జవరాండ్రు కళవళముపడి నానాముఖములఁ బరుగులెత్తుచుందురు. కొందఱు తిట్టుచుందురు. కొందఱు తమ మగవాండ్రు బిలిచికొని వచ్చుచుందురు. గణపతి మెఱుపుతీఁగవలె మాయమగును. తనస్నేహితులలోఁ గొందఱవీపుమీఁద దూలగొండ రాయుచుండును. దురద లెత్తి వారు వీపులు బరికికొని పరుగులెత్తు చున్నపుడు మహానందరసభరితమై యుండు గణపతి

మొగము చూచి తీరవలయును. పోటోగ్రాఫు లాకాలమందు విరివిగా లేవు గాని యీనాఁటివలె నవి పుష్కలముగ నుండినపక్షమున గుణగ్రహణపారీణుఁడై యెవఁడైన నతనిప్రతిరూపము దీసియుండిన పక్షమున నట్టిప్రకృతి యెంతవినోదకరముగ నుండును? ఎంతజగన్మోహనముగ నుండును! ఎన్నికోట్లప్రతులు కర్చైయుండును! గణపతియొక్క మూర్తివిశేషముఁ జూచుభాగ్య మాంధ్రమహాజనులకు లేదు. మూర్తియంతయుఁ జూచుభాగ్యము లేకపోయినను దానిండ్లమీఁద రాళ్లు విసరినప్పుడు స్త్రీలకాళ్ళనడుమఁ బల్లేరుకాయలు చల్లినప్పుడు సంగడికాండ్రి మేనులకు దూలగొండ రాచినప్పుడు ముసలమ్మలు యువతులు స్నేహితులుఁదన్ను దిట్టుచుండ నత్తరిపండ్లిగిలించి యతఁడునవ్వినవైనఁ బ్రతిబింబములోఁ జూచుభాగ్య ముండినను మనము ధన్యులమైయుందుము. మందభాగ్యుల కట్టి ధన్యత యేలగలుగు? రూపదర్శనమువలనఁ గలుగుసంతోషము లేకపోయినను శ్రీకృష్ణలీలలకన్నను మిక్కిలిరమణీయములైన గణపతిలీలలలోఁ గొన్నిఁటిని జదివి యానందించుభాగ్య మబ్బినది. కనుక చదువరులు కొంతవఱ కదృష్టవంతులె. గణపతికి క్షీరపానమునందు మిక్కిలి యాసక్తి. పాలు కొని త్రాగుట కతనిదగ్గఱ డబ్బు లేదు. అనేకోపాయములచేత సంగ్రహించినడబ్బు పొగచుట్టలకైనఁ దిన్నగా సరిపోదు. కొనుటకు డబ్బు లేనంతమాత్రముచేతఁ బాలు త్రాగుట మానికొనునంతటిమూర్ఖుఁడు కాఁడు. కావున గణపతి క్షీరసంపాదనమున కొకయుపాయముఁ గనిపెట్టెను. పొలమునుండి సాయంకాల మింటికిఁ దిరిగి వచ్చునావులను గేదెలను వీథులవెంటఁ దిరుగు మేఁకలను బట్టుకొని యొకప్పుడు బందముపైచియు మఱొకప్పుడు వైవకయుఁ బాలు పిదికి యతఁడు త్రాగుచుండును. ఆవులు తమతమగృహంబులకుఁ బోయిన తరువాత యజమానులు పాలు పిదుకఁ

డమకింప నవి పాలియ్యకపోవుటంజేసి తమయావులకు దృష్టి తగిలిన దనియు దయ్యములు పట్టినవనియు మనోవేదనము జెంది దిగతుడుపులుతీసి సోదెకుఁ బోవుచుందురు. వారికళవళము వారిచిత్తక్షోభము జూచి యేమియు నెఱుంగనివాఁడుపోలె నటించుచుఁ దన యఖండప్రజ్ఞయె గదా వారిని వ్యాకులపెట్టుచున్న దని సగర్వముగ మనంబున కులుకుచుండును. కావలసినకర్చులు చేసికొనుటకు గణపతిచేతిలో డబ్బు కొంచెమైనను లేకపోవుట గొప్పవిచారకారణ మయ్యెను. మేనమామ డబ్బులు విభూతిబుట్టలలోఁ బెట్టుటమానెను. తల్లిగూళ్ళలో వైచుటమానెను. ఏదో నిరంతరము నమలు చుండవలయును. కాని, గణపతినోరూరకుండదు. కొబ్బరికురిడీలు శనగయుండలు పేలపుండలు తాటిచాప తేఁగలు జీళ్ళు శనగపప్పు మొదలైనవస్తువు లూరక యిచ్చువా రెవ్వరు లేరు. తోఁటలోనికిఁ బోయి మునుపటివలె దోచుకొనివచ్చుట కంతవీలు లేదు. ఏలయన దోఁటకాఁపు లీబందెపోటుదొంగలవిషయమై మిక్కిలి జాగరూకులై యుండిరి. సూక్ష్మబుద్ధి గలవాఁ డగుటచే గణపతి యావిషయమై కన్నులు మూసికొని రెండవచింతవిడిచి యొక్కజాఢ్యాలోచించి యెట్టకేలు కొకయుపాయము పన్నెను. డబ్బు కావలసివచ్చినపు డతఁడు చుట్టుప్రక్కల నున్న చిన్నచిన్నగ్రామముల కరిగి గ్రామమండలి ప్రముఖులనందఱఁజూచి "మాతండ్రి చనిపోయినాఁడు, వేదసంసారము, దినవారములు జరిగించుకొనుటకు డబ్బులేదు. మీ రందఱు సాయముచేసి యీబ్రాహ్మణకర్మ యేలాగైనఁ గడతేర్చి నన్నొకదరిఁ జేర్పవలయు. శ్రాద్ధకర్మ చేయకపోయిన యెడల బందుగులు వెలివెట్టుదురు. చనిపోయినవానికి మంచిగతులు గలుగవు. తండ్రి పోయినందుకే నే నేడ్చుచుండఁగా మీఁదుమిక్కిలి శ్రాద్ధము పెట్టుటకైన డబ్బు లేకపోయినదని నే నిట్లు బిచ్చ మె

త్తవలసి వచ్చినది. తండ్రి దినవారములకుఁ గూడ డబ్బులేనంత దురవస్థ నాకు భగవంతుఁడు తెచ్చిపెట్టినాఁ"డని కన్నుల నీరు పెట్టుకొని రానిదుఃఖము దెచ్చిపెట్టుకొని యేడ్చును. పదునాలుగుసంవత్సరములపిల్లవాఁడు పితృఋణవిముక్తుఁడు కాఁదలఁచి యాచిఁచుటయె జాలి గలిగించును. అట్టియెడ నబ్బాలుని కన్నుల బాష్పోద్గమమయ్యెనా యట్టియెడ నెవనిమనసు కరుగదు? ఎవనికడుపు చుమ్మలు చుట్టదు. ఆయాగ్రామములలోనిజను లతని బూటకములు నమ్మి యెవరికిఁ దోఁచినమట్టుకువారు సాహాయ్యముచేయుచుందురు. ఒక్కొక నాఁడతనికి రెండుమూఁడురూపాయలు గూడ దొరుకుచు వచ్చినవి. సాధ్యమైనంతవఱ కతఁడు వెళ్ళినయూరు వెళ్ళకుండ నీవ్యాపారము సాగించుచుండెను. విధిలేకయె మఱచిపోయియె. మునుపు జమాబందీయైనగ్రామమె మరల వెళ్లవలసి వచ్చినపుడు తండ్రి చచ్చిపోయినాఁ డన్నమిష సాగదని తల్లి చచ్చిపోయిన దని వంకపెట్టును. తల్లి యింట ఆయిలాగుననుండఁగ నామె చనిపోయినదని చెప్పుటకు నోరెట్లు వచ్చినదని మీరు సంశయింతురు కాఁబోలు! అట్లు సంశయింపవలసినపని లేదు. ఏలయన 'జాతస్య మరణం ధ్రువ' మ్మనుమాట మీరు విన్నారుకదా. 'పుట్టినవాఁడు గిట్టక మానఁడ'ని దీనియర్థము. అటయందు గణపతికి మిక్కిలివిశ్వాసము కలదు. తనతల్లి యెప్పుడో చావక మానదని గణపతి యెఱుఁగును. ఎప్పుడైనను జచ్చిపోవలసినదె కనుక తనకు డబ్బువసర మున్నపుడు చచ్చిపోయిన దని చెప్పుటచేత నెంతమాత్రము పాపము లేదని గణపతి యాశయము. పదిసంవత్సరములతరువాత జరుగఁ దలఁచిన కార్యము పదిసంవత్సరములముందు జరిగినదని చెప్పుట తప్పుగా నతఁ డెంచలేదు. ఒకప్పుడు తల్లిమాసిక మని బిచ్చ మెత్తును. ఒకప్పుడు తండ్రితద్దిన మని యడిగికొనును. ఒకప్పుడు తాను ప్రయాణము

చేయుచుండఁగా మార్గమధ్యమున దొంగలు కొట్టి చెంబు గుడ్డలు బత్తెకర్చునిమిత్తము దగ్గఱనున్నడబ్బు తీసికొన్నా రని చెప్పి ముష్టి యెత్తును. కొన్ని గ్రామములకరిగి యతఁ డీక్రిందిపిధముగఁ భిక్షాటన ము జేసెను. "అయ్యా! నాతల్లి కెందఱో బిడ్డలు చచ్చినతరువాత నేను పుట్టితిని. నేను పుట్టినపుడు మాతల్లి నన్ను తిరుపతి తీసికొని వెళ్లవలయునని మ్రొక్కుకొన్నది. వేదవాండ్ర మగుటచేత మ్రొక్కు తీరినదికాదు. ఏడుకొండల వేంకటేశ్వర్లు వడ్డికాసులవాఁ డన్న మాట మీకుఁ దెలియునుకదా. అతని మ్రొక్కులు ముడుపులు చెల్లకపోయినయెడల వెండిబెత్తములతోను బసిడిబెత్తములతోను వీపు పగులఁగొట్టునని మీరంద ఱెఱిఁగియె యున్నారు. రాత్రులు దెబ్బలు తినలేక నేను మిక్కిలి శ్రమపడుచున్నాను. నా కీశ్రమ మీరు తప్పించవలెను. వేంకటేశ్వరులవారికి వెండిచెంబొకటిచేయించి నేను ముడుపు చెల్లించవలెను. దాని కేఁబదిరూపాయలు కావలెను. దగ్గఱ గ్రుడ్డిగవ్వలేదు. బ్రాహ్మణబాలకుని యాపద తప్పించవలసినభారము మీపై నున్నది. ఈసహాయము జేసిన మీకెంతో పున్నెముండును. వెంకటేశ్వరులవారిచేత దెబ్బలు తిని చచ్చిపోకుండ నన్ను మీరందఱుఁ గాపాడవలయును. నాకు మీరే తల్లి. మీరే తండ్రి" అని యడుగుటయు వానిదీనాలాపముల విని మగవాండ్రు నాడువాండ్రు జాలినొంది తోఁచినసహాయము జేయుచు వచ్చిరి. ఈవ్యాపారములో దిగినతరువాత గణపతియొద్ద ప్రతి దినము కొంచెముగానో గొప్పగానో డబ్బు నిలవయుండఁజొచ్చెను. కావలసినన్ని పొగచుట్టలు కావలసినన్ని తమలపాకులు కొనుట కవకాశము గలిగెను. అతఁడు స్నేహితుల కప్పుడప్పు డొకయణా రెండణాలు బదు లియ్యఁజొచ్చెను. గణపతి భోజనమునందు మహాగణపతిత్తుల్యుఁ డగుటచే నెంతడబ్బు వచ్చినను వానియుపాహారములకె

సరిపోవుచు వచ్చినది. ఈవిధముగ వ్యాపారము చిరకాలము సాగినది కాదు. ఒకగ్రామవాసులు మఱియొకగ్రామమునకుఁ గార్యాంతరముమీఁద వెళ్ళుట తటస్థించుచుండును. కావున గణపతియొక్క చేష్టలు క్రమక్రమముగ బయలుపడెను. జనులకు విశ్వాసము తగ్గెను. చుట్టుపట్ల గ్రామములలో నతనిమాటలకుఁ జెల్లుబడి లేకపోయెను. అందుచేత మునుపటివలె నతనిచేతినిండ డబ్బు చిక్కుట కవకాశము గలుగనయ్యెను. మరల నతనికి డబ్బు సందర్భమైన యిబ్బంది తటస్థించెను. ఆయిబ్బందిగడచుటకై యతఁ డొకనాఁడు దీర్ఘముగా నాలోచించి వైదికులపాలిఁటి కల్పవృక్షమని కామధేనువని చెప్పఁదగినశ్రాద్ధభోజనమె శరణ్యమని నిశ్చయించెను. సామాన్యమైన యాబ్దికమునకు నిమంత్రితుఁడై పోయినవారికి నొక్కడబ్బు కంటె నెక్కువ దొరకదు. మాతాపితృభక్తి యత్యధికము గలవారు రెండుడబ్బు లిచ్చుచుందురు. మిక్కిలిభాగ్యవంతు లగువారు వస్త్రము లిచ్చి యొకయణా గాని రెండణాలు గాని దక్షిణ నిత్తురు. కడపటివారు మిక్కిలి యరుదుగ నుందురు. అట్టిబ్రాహ్మణార్థములకుఁ బోయినపక్షమునఁ గడుపునిండ భోజనము లభించుటయె తప్ప దక్షిణ బాగుగ దొరక దని షోడశబ్రాహ్మణార్థములు చేసినపక్షమునఁ జేతినిండ బుష్కలముగ సొమ్ముంటు నని తద్విషయమై ప్రయత్నించెను. చుట్టుప్రక్కల నేబ్రాహ్మణుఁడు చనిపోయినను బదియొకండవనాఁడును పండ్రెండవనాఁడును విఘ్నేశ్వరపూజాసమయమున స్థాపింపఁబడుపసుపు గణపతితో బాటు మూర్తీభవించిన శ్రాద్ధదేవతవలె పితృలోకమునుండి వచ్చినప్రేతవలె మనగణపతి యుండితీరవలయు. గణపతి తిండిపోతని చదువరు లిదివఱకె యెఱుఁగుదురు. భోజనవిషయమున నతని ప్రజ్ఞ యాకారమునకుఁ దగ నిది. అతని విగ్రహము పొట్టిదైనను వాని యూఁకలి మిక్కిలిపొడుగుది. బ్రహ్మ

దేవుఁడతని కీయఁదలచిన ప్రజ్ఞ యంతయు జీర్ణకోశమునందె పెట్టెను. శ్రాద్ధభోజనములయం దతఁడు మెక్కునట్టి యరిసెలు గారెలు కుడుములు మొదలగునవి పుంజీలలెక్కప్రకారము చెప్పుకొనుట సుకరముగాని విడిగా లెక్కించుట సుకరము కాదు. భోజనవిషయమున నతఁడు సర్వభక్షకుఁ డని చెప్పవలెను. ఇది యిష్ట మది యిష్టము లే దన్నమాట లేదు. ఏమియు దొరకనప్పుడు పెసరకాయలు కందికాయలు శనగకాయలు జొన్నచేలలో నూనబియ్యము తాటిపండు మొదలైనవిగూడ నతఁ డారగించును. శ్రాద్ధభోజనముల వలన నతనికి మరల కొంతడబ్బు దొరకఁజొచ్చెను. ఆదినములలో నతని జీవచరిత్రలో నొకమార్పు తెచ్చుటకు సమర్థమైన కార్యమొకటి జరిగినది. ఏనుఁగులమహాలునుండి కోమటి లొకరు రాజమహేంద్రవరములో వివాహసంబంధము నిశ్చయించి తరలివెళ్ళిరి. పెండ్లికుమారునకును గణపతికిని మొదటినుండియుఁ జిట్లపేకదగ్గఱ స్నేహమగుటచె నతఁడు ప్రియమిత్రుఁడైన గణపతిని తనవివాహమునకు రమ్మని పిలిచెను. మిత్రునియభీష్టసిద్ధి చేయఁదలఁచి మిత్రవిధేయుఁడైనగణపతి వారితోఁ గలిసి వెళ్లెను. రాజమహేంద్రవరములో నున్నకాలమున గణపతి కొత్తప్రపంచమున నున్నట్లుండెను. ఆపురవీథులలో నడచునట్టి తనయీడు బాలకుల కందఱకు గిరజాలుండుట యతఁడు చూచి యాబాలకులవలె తాను గూడ గిరజాలు నున్నగా దువ్వి చెవులసందుననుండి వెనుకకు దువ్వి మడిచి యుంగరములుగఁజుట్టి తిరుగవలె నని యతని కుబలాటము గలిగెను. పిల్లజుట్టుపై నతని కెంతోయసక్తము గలిగెను. గిరజా లుంచుకొననివాని బ్రతు కెందుకనిపించెను. ఎన్నిజన్మములయందు మంచితపము చేసిన యదృష్టవంతులకోగాని గిరజా లుంచుకొనునట్టి భాగ్యము కలుగదని యతఁ డనుకొనియెను. అనుకొన్నవిషయ మాచరణములోఁ

బెట్టుటలో నతఁ డగ్రగణ్యుఁ డని పూర్వచరిత్రమువలన మీరు తెలిసికొని యుండవచ్చును. ఒకనాఁటి రాత్రి యీరీతి ననుకొనెను. మరునాఁ డుదయమున పెందలకడ లేచి భజంత్రీమేళములో నున్న యొకమంగలిని బిలిచి తనపిల్లజుట్టు గొరిగివైచి గిరజాపెట్టుమని కోరెను. వెంటనే మంగలివాఁ డతనికోరికప్రకారముచేసెను. ఆమహాకార్యము చేసినందుకు మంగలివాని కొకయణాయిచ్చి తద్ఋణమును దీర్చికొని కృతకృత్యుఁ డయ్యెను. అట్టినూతనవేషముతో నున్న గణపతిని జూచి పెండ్లివారిలో సంతసింపనివారులేరు. ఏదో ఘనకార్యము చేసినవాఁడువోలె నన్యులకు దుర్లభమైనసువర్ణకిరీటము మస్తకమున ధరించినవాఁడువోలె నాఁటిదిన మంతయు గణపతి మిక్కిలి యుత్సాహము గలిగి చూపులలోను మాటలలోను నడకలలోను ముఖవైఖరిలోను గర్వముట్టిపడునట్లు సంచరించెను. పెండ్లివారితో వచ్చినయువజను లందఱును జతురోక్తులయం దాసక్తి గలకొందఱు పెద్దలును నాఁటిదినమున వేశ్యలమేళమున కరుగక గణపతిచుట్టుఁ జేరి వాని మాటలు విని వానిచేష్టలుచూచి వినోదము నొందిరి. పెండ్లికొడుకుచేత సిఫారసు చేయించుకొని పెండ్లికి వచ్చిన యాఁడువాండ్రదగ్గఱనుండి సంపంగినూనె దెప్పించి లేతమొక్కలకు మంచియెరువు వైచుకాఁపువాఁడువలె తనతలకు రాచికొని వెండ్రుకలు త్వరగా యెదుగుసాధనము లేవియని దనకన్నులకు బండువుగా నుండునట్లు పెద్దగిరజాలను పెంచుకొన్నవారిని పలుమారు గ్రుచ్చి గ్రుచ్చి యడుగఁ జొచ్చెను. పరిహాసము చేయుటలో మిక్కిలి ప్రౌఢుఁడైన యొకానొకయువజనుఁడు గణపతిని రహస్యముగా నొక చోటికిఁ దీసికొనిపోయి యతనిశిరోజవృద్ధియం దత్యంతాసక్తి గలవాఁడుపోలె నతనిచెవిలో నిట్లనియెను. ఆగరునూనెతోను సంపంగి నూనెతోను దలవెంట్రుక లేపుగాఁ బెరుగవు. మంచివంటయాము

దము దెచ్చి నాలుగుదినములు రాచితివా వానచినుకులు పడఁ గానె చికిలింత మొలిచినట్లు వెంట్రుకలు చురుకుగా నెదుగును. నే నట్టిదోహదము చేయబట్టి నా గిరజా లింతసొంపుగా నెదిగినవి. నీ వెంట్రుక లెదుగుట మనసులో నిష్టములేనివారు నేను చెప్పినదో హదము చేయవద్దని నీకు దుర్బోధనలు చేయవచ్చును. వారెన్ని చెప్పినను నీవె నీవది వినవద్దు. సరిగా నేను చెప్పినట్లు చేయుము" అయుపదేశముచేసి యతఁడరిగెను. అది యెవరికిఁ జెప్పక బ్రహ్మో పదేశమునుంబలె మనసులోఁ బెట్టుకొని రాత్రి భోజనానంతరమున నందఱు నిద్రాసక్తులైన సమయమునఁ జాకలివాండ్రి కాగడాల నిమిత్తమై యిత్తడిసిద్దెలలో దాచికొన్న యాముదము వారు చూడ కుండ దొంగతనముగా రెండుచేరల నిండఁ బోసికొని తలకు రాచి కొని పెద్దమనుష్యులు కూర్చుండుటకు వైచినతివాసిమీఁద కరిగి దిండుమీఁద తలబెట్టుకొని పండుకొనియెను. మరునాఁడు గణపతి కాకులు కూసెడువేళనె లేచి గోదావరికరిగి రాగిడిమట్టితోఁ బలు సారులు తల రుద్దుకొని స్నానముచేసివచ్చి మరల బట్టలు కట్టుకొని కూర్చుండి కనఁబడినవారినెల్ల బిలిచి "నాగిరజా లేమైనా నెదిగిన వేమో చూడుఁ" డని యడిగెను. గణపతియొక్క విచిత్రచరిత్ర మదివఱకె సువ్యక్తమై యున్నందున వా రందఱు నగుమోము లతో 'నీ వేమి దోహదము చేసితివో కాని మిక్కిలి యేపుగా నీవెంట్రుకలు పెరుగుచున్నవి. నిన్నటికి నేఁటికి నెంతోభేదము గని పించుచున్నది. ఆవిధముగానె దోహదము చేయు చుండుము. నీతల జొన్నచేనువలె నెదుగు' నని చెప్పిరి. అతఁ డాముదమె శిరోజవృ ద్ధికి దివ్యౌషధ మని నిశ్చయించి యదియె యుపయోగింపఁ దలఁ చెను. చాకలివాం డ్రుదయమున లేచి తివాసులు జముఖానాలు దులుపునప్పుడు దిండుమీఁద మెండుగానుండిన యాముదపుమరకలు

చూచి దానిమీఁద నాముద మెట్లయ్యె నని యెల్లవా రడుగఁ జొచ్చిరి. అడుగఁబడినవా రందఱు "మే మెఱుగము. మేమెఱుఁగ" మని బదులు చెప్పిరి. చాకలివాఁ డొకఁడు గణపతి నట్లు ప్రశ్నించుటయు నతఁడు మిక్కిలి కోపించి "ఎవఁడవురా నీవు తాహా తెఱుఁగకుండఁ బెద్దపిన్న తారతమ్యము లేక నన్నిట్టిప్రశ్న లడుగుచున్నావా? నీయంతర మేమి నాయంతర మేమి? నీకు బొత్తుగా భయభక్తులు లేవు. చూడు పెళ్ళివారితోఁ జెప్పి నిన్నేమిచేయించుతునో. నీవు తుంటరిలా గగపడుచున్నావు. నేనేమి తల కాముదము రాచికొని దీనిమీఁద పంపుకొన్నా ననుకొన్నావా యేమి జాగ్రత్త బుద్ధిచెప్పించెదను. దొంగవెధవలు మీరే యాముదపుసిద్దెలు తెచ్చి దిండుమీఁదఁ బెట్టినా రేమో. అది గాకపోతే యాముదపుచేతులతో మీ రిద్దిండు ముట్టుకొని సవరించినా రేమో. లేకపోతే దాని మీఁద నాముదపుమరక లెట్లువచ్చు"నని విడిదియింటఁ బ్రతిధ్వనులు సెలఁగునట్లు గొంతు బొంగురువోవునట్లు కేకలువైచెను. ఆ కేకలతో నంద అక్కడ చేరి చాకలివాండ్ర నదల్చి యవ్వలకుఁ బొమ్మని చేసిన సంభాషణమునుబట్టి గణపతియే తలవెండ్రిక లెదుగు నిమిత్త మెవరో పరిహాసకుఁడు చెప్పినమాటలు విని తల కాముదము రాచికొని యుండు నని మనసులో నిశ్చయించుకొని చిఱునవ్వులు నవ్వుకొనుచు "గణపతీ! చాకలివాండ్ర బుద్ధిపొరబాటు చేత నిన్నాలాగున ననిరి. నీవంటివాఁ డిటువంటిపని చేయునా? కాని యాదొంగ యెవఁడో మనమందఱి మీరాత్రికలిసి పట్టుకొంద"మని వెడలిపోయిరి. ఆనాఁటిరాత్రి కూడ గణపతిగతరాత్రిమునందువలెనే శిరస్సునకు హేరండతైలమర్దనమునం దభిలాష గలవాఁడై రజకులు పండుకొన్న నెలవున కరిగి మెల్లఁగా నొకసిద్దె వంచెను. చాకలివాండ్రలో నొకఁడు సారా త్రాగివచ్చి పండుకొని సమీప

మున దొరలుచు మరలఁ ద్రాగుటకు నొక సీసానిండ సారా తెచ్చి సిద్ధెలప్రక్క బెట్టుకొనియెను. గణపతి చీఁకటిలో నది కనిపెట్ట లేదు. ఆరజకుఁడు గణపతిని జూచి తనసారా దొంగిలించుకొని పోవుట కెవఁడో దొంగ వచ్చెనని భావించి "దొంగతొత్తుకొడుకా! నాసీసా దొబ్బుకొనిపోవుటకు వచ్చినావా" యని లేచి వెన్నుమీఁద రెండుచరపులు చరచి తిట్టనారంభించెను. ఆచరపుల చప్పుడుతోను దిట్లతోను దక్కినచాకలివాండ్రు మేల్కాంచి దొంగ వచ్చినాఁడను కొని గణపతిని బట్టుకొనిరి. అతఁడు ప్రతిష్టారక్షణమందు మిక్కిలి జాగరూకుఁ డగుటచే సుముహూర్తసమయమునను సదస్యమునాఁడు రనకు దొరికినసంభావనడబ్బులు చాకలివాండ్రచేతులలోఁ బెట్టి తనను నలుగురిలో నగుబాట్లు సేయ వల దని చేతులు పట్టుకొని వాం ద్రను బతిమాలి యాముదపుమరకలు దిండుమీఁద చేసినది తానే యని యొప్పుకొని వారిబారినుండి తప్పించుకొనిపోయెను. ఈపరమ రహస్యమును జాకలివాండ్రు తిరుమంత్రమువలె నెవరికిఁ జెప్పకుండ దాఁచ దలఁచిరి కాని వారికడుపులలో నది యిమిడినది కాదు. నోట నువుగింజ నానని తుచ్ఛులనోళ్ళలో రహస్యము దాఁగునా? చాకలివాండ్రు మంగలివాండ్రితోను, మంగలివాండ్రు బాకాలూదు దూదేకులసాహెబులతోను, వాండ్రు తనయాప్తులతోను, జెప్పఁగాఁ బరమరహస్యము సూర్యోదయ మగునప్పటికె గుప్పు మని వెల్లడి యయ్యెను. అందఱు గణపతిని జూచి ముసిముసినవ్వులు నవ్వువారె. అందఱు నతనితలమీఁదఁ జెయి వైచి గిరజా లెదిగిన వా యని పరిహాసము చేయువారె. అందఱు శిరోజవృద్ధికి దోహద ములు చెప్పువారె. వెంకిబంగారు దొంగలుపోయి యాముదపు దొంగలు బయలుదేరినా రని యొకఁడు, తలవెంట్రుకలు పెరుగు టకు తగినదోహద మాముదమే యని యొకఁడు, తైలముకంటె

మొట్టికాయలు డిప్పకాయలు వెంట్రుకల వృద్ధికి మంచియౌషధ మని యొకఁడు చమత్కారముగ మాటలాడిరి. గణపతి తక్కిన మాటలకు సరకు చేయలేదు. కాని యాముదపుదొంగలు వచ్చినా రన్నపుడుమాత్రము కొంతప్రసక్తిని గల్పించుకొని యాముదము దొంగిలించునట్టి నిర్భాగ్యు లెవ్వరుండరు. చాకలివెధవల మాటలు నమ్మి మీరుకూడ గంతులు వైచుచున్నారని ప్రత్యుత్తరమిచ్చెను. "గుమ్మడికాయలుదొంగ యనఁగా భుజముతడిమి చూచుకొన్నట్లు" పెండ్లికివచ్చినవారిలో నింతమందియుండఁగా "ఆముదముదొంగ యన్నపుడు నీవేపూసికొని రానేల" యని మిత్రు లెగతాళి చేయఁ జొచ్చిరి. న్యాయము చెప్పినాను. కాని నాకెందు కని గణపతి ప్రత్యుత్తరముచెప్పి, యెంద రెన్నివిధము లెగతాళి చేసినను వానిభావము గ్రహింపలేక తనగుట్టు బయలుపడలేదని నమ్మి సంచరించెను. రాజమహేంద్రవరయువజనులను జూడఁగా నతనికి మఱియొకయుబ లాటము గలిగెను. చెప్పులు మోటవాండ్రు దొడిగికొనవలసినవెకాని నాగరకులకుఁ దగనివనియు నాగరకులు పాదములకుఁదొడిగికొన వలసినవి ముచ్చెలో చడావులో గాని చెప్పులు కావనియు నతనిమనస్సునకుఁదట్టెను. తట్టినతోడనే యతఁడు తనప్రాంతచెప్పు లమ్మఁజూపెను. ఆచెప్పు లతని కాలునకేగాని మఱియొకరికాలునకు సరిపడని వగుటచే నవి కొనువా రెవరు లేకపోయిరి. సంపాదించిన డబ్బులు చాకలివాండ్రికు లంచ మిచ్చుటక్రింద వెచ్చబెట్టబడినం దున క్రొత్తజోడు కొనుట కతనికడ డబ్బు లేకపోయెను. అదిగాక ముచ్చెలు కొనుట మంచిదా చడావులుకొనుట మంచిదా యను విషయ మతఁడు విచారణ సేయఁదొడఁగి సంగడికాండ్ర నడుగఁ జొ చ్చెను. "మిట్టముచ్చెలు నీకాలి కెంతో యందముగ నుండును. అవి తొడిగికొని టక్కుటిక్కుమని నీవు నడచితివా చూచువారి కెంతో

ముచ్చటగ నుండును. కాబట్టి ముచ్చెలే కొను" మని యొకఁడు సలహాచెప్పెను. ఒంటియట్ట చడావు నీపాదమున కెంతో సొగసుగ నుండును. చడావుతొడిగికొని యవి కిట్టుకిట్టు మని చప్పుడు చేయుచుండ నీవు వీధులవెంట నడుచునప్పు డెల్లరకు ముద్దుగా నుండును. కాబట్టి చడావులే కొనవలసిన దని మఱియొకఁ డాలోచనము చెప్పెను. చేతిలోడబ్బు లేకపోయినది కాని గణపతి ముచ్చెలు చడావులు కూడ కొనఁగోరెను. రెండింటిని గొనుమని యడిగిన బాగుండ దని తనలోఁ దానె విచారించుకొని పెండ్లికుమారునికడ కరిగి కొంతసే పామాట లీమాట లాడి యతఁడుఁగూడ తనగిరజాల విషయమై కొంతపరామర్శ చేసినపిదప తనమనోరథ మెఱిఁగింపఁ దలఁచి యిట్లనియె. "నీ వింతవైభవముగ వివాహము చేసికొనుచున్నందుకు నా కేదైన మంచిబహుమానము నీవు చేయవలెను. ఏలాగైనను నీ వొకజామారుగుడ్డ నాకీయకపోవు. జామారు నా కక్కఱలేదు. ఈమధ్యషోడశబ్రాహ్మణార్థములలో, నా కేడెనిమిది గుడ్డలు దొరకినవి. బట్టలకరవు లేదు. నాకిప్పుడు కావలసినది మంచి పెద్దాపురపుపైజార్లజోడు. పొట్టివాఁడ నగుటచేత మిట్టపైజార్ల జోడు నాకాలి కందముగా నుండునని మనవాళ్ళు చెప్పినారు. దాని ఖరీదర్థరూపాయ. ఏలాగైనను నీవు నాకిది కొనిపెట్టక తప్పదు. ఏమిటి నీయభిప్రాయము? నాకోరిక తీర్చెదవా లేదా." అనవుడు పెండ్లికుమారుఁ డిట్లనియె. "నాదగ్గఱ డబ్బులు లేవు. నాలుక పెరికి కొన్నను మాతండ్రి నాచేతికి రాగిడబ్బైన నీయఁడు. సదస్యము నాఁడు నీవుచూచితివి కదా. రూపాయరూపాయసంభావనవచ్చునని బ్రాహ్మణులెంతో యాసపడి రాఁగా మాయయ్య బేడబేడయిచ్చి సాగనంపినారు. బ్రాహ్మణులు తోరణములు త్రెంపినారు. ఎంతో గందరగోళమైనది. నీసంభావనడబ్బు లేమి చేసికొన్నావు? అవి

పెట్టికొనరాదా" అని యతఁడు పలుక గణపతి "గోదావరిలో స్నానము చేయు చుండఁగా మూట విడిపోయి సంభావనడబ్బులు పడిపోయినవి. నీవంటివాని నాశ్రయించినందుకు నాకోరిక తీరకపోవలసిన దేనా. పోనీ మీనాన్నచేత బదు లిప్పించు. రెండు షోడశబ్రాహ్మణార్థములు చేసి నీయప్పు తీర్చెద" నని యుత్తరము చెప్ప పెండ్లికుమారుఁడు "మాయయ్య నాసిఫారసుమీఁద నీ కప్పియ్యఁడు. అటియాస బెట్టుకొనకు" మని బ్రత్యుత్తరమిచ్చి పంపెను. గణపతి యప్పటికి భగ్నమనోరథుఁడైనను ముచ్చెలెట్లయిన సంపాదించి తీర వలయు నని కృతనిశ్చయుఁడై యుపాయాన్వేషణము జేయఁ జొచ్చెను. ఉపాయము పొడ గట్టెను. అతనియదృష్టవశమున నా సాయంకాలము బంధువైన వైశ్యుఁ డొకఁడు పదియేండ్లవయసుఁ గల తనకుమారుని వెంటఁబెట్టుకొని పెండ్లివారిని జూడవచ్చెను. అప్పుడు రెండుగడియలరాత్రి యయ్యెను. అతనికుమారుఁడు జరీపనిచేసిన ముచ్చెలజోడు తొడిగికొనివచ్చి యది గుమ్మముదగ్గర విడిచి లోనికిఁ బోయెను. అది ముద్దులమూటగట్టుచున్నట్లు గణపతికిఁ దోచెను. ఎట్లయిన నదిగాని యటువంటిదిగాని తనకుండినపక్షమున తనజన్మము ధన్యమగు నని యతఁడు భావించెను. కొంచెమునే పిట్టటు బచారు చేసి తన పాదమందులోబెట్టి సరిపోవునేమో యని చూచెను. అది సరిగా నతనికి సరిపోయెను. అటువంటిది మఱియొకటి దొరకనప్పుడిదియె తాను గ్రహింపఁ దగు నని నిశ్చయించి యటు చూచి చే జాచి జోడుతీసి యుత్తరీయమున జుట్టి దొడ్డిదారిని బోయి తన బట్టలమూటలోఁబెట్టెను. ఆకోమటియుఁ గుమారుఁడు దాంబూలము పుచ్చుకొని వీధిగుమ్మముకడకుఁ బోలు చూచునప్పటికి జోడుకనఁబడలేదు. జరీపని చేసినముచ్చెలజోడు కావలయునని కొడు కెంతో ముచ్చటపడ నాకోమటి యాకాలమున నట్టిజోళ్ళకుఁ బ్రసిద్ధి

కెక్కిన పెద్దాపురమునం దది పురమాయించి చేయించి తెప్పించెను. ఆపూటే కొడు కది తొడిగికొని వచ్చెను. కుఱ్ఱవాఁ డేమపు మొగముపెట్టి యింటికిఁ బోయెను. విడిదిలో జోడుపోయిన దని పెండ్లికుమారునితండ్రి యెంతో నొచ్చుకొని కూడ వచ్చినవారినం దఱ నడిగెను. కాని యది బయలుపడ లేదు. అక్క డున్నవారం దఱు దొంగిలించినవానిని నోటికి వచ్చినట్లు తిట్టిరి. వారితోపాటు గణపతియు నాలుగుతిట్లు తిట్టెను. గణపతి కార్యవాది కాని ఖడ్గ వాది కాఁడు. గనుక కార్యసాధనము నిమిత్తమై తిట్లన్నియుఁబడెను. పెండ్లివారు మూటలు పరీక్షసేయుదు రేమోయని భయపడి గణపతి తనమూట దీసికొనిపోయి వే రొకయింటఁ బెట్టెను. మొ త్తముమీఁద దొంగతనము బయలుపడకుండ జాగ్రత్తపడి జోడు సంపాదించెను.

గిరజాలయుబలాటము ముచ్చెలయుబలాటము దీరినపిదప గణపతికి మఱియొకకోరిక పుట్టెను. పుట్టి బుద్ధియెఱింగినతరువాత నతఁడు కోటుతొడిగి యెఱుఁగఁడు. చీట్లపేకలోపలికోటులే కాని శరీరాచ్ఛాదనముచేయుకోటు లతఁడు చూచి యెఱుఁగఁడు. తల్లి చిన్నప్పుడు ముద్దునిమిత్తము బొందుల చొక్కాలు రెండు కుట్టించెను. కాని యవి చిరిగిపోయెను. కోటుతొడిగిన మనుష్యుఁ డతని కెంతో విచిత్రపరుఁడుగఁ గనఁబడెను. రెండుకోట్లుకూపాయ లున్నను హాయిగాదొడిగికొనుటకు రెండుకోట్లులేనిపక్షమునవానిజన్మమంతయు వ్యర్థము. పశువునకును వానికిని భేదమే లేదని యతని మనం బునకుఁ దోఁచెను. ఎటులైన నొక కోటుగాని రెండుకోట్లుకాని కుట్టించుకొనవలయు నని తలఁచి చేతడబ్బు లేనందు కతఁడు విచా రించి గుడ్డలు చేతితోస్పృసించియుఁ గన్నులం జూచియు ధన్యత జెందవలయు నని మంచికోటుగుడ్డలున్న దుకాణము లన్నిటికిం జని

యెంతవెలయైన నిచ్చి కొనువానివలె మూటలు విప్పించి గుడ్డ నన్నింటిని బేరమాడి చేతితో నాడెము చూచి రంగు వెలియదు కదా? చాలకాలము మన్నునకదా యని యడిగి తక్కువ వెలు కడిగి బేరము కుదరక వెడలిపోయినట్లు దుకాణములు విడిచి వెళ్ళెను. ముచ్చెలజోడు సంపాదించినవిధమున నీకోటుగుడ్డలు సంపాదించుట కెంతమాత్రము వీలు చిక్కకపోయెను. ఆరాత్రి యతని కావిచారముచేత నిద్రయే పట్టలేదు. అప్పుడప్పుడు తనమనంబున నిట్లనుకొనెను "తద్దినములకు షోడశములకు బ్రాహ్మణులకుఁ బని కిమాలిన సైనుగుడ్డ లిచ్చెదరు. కాని శుభ్రమైన కోటుగుడ్డలు రెండు మూడు తెచ్చియిచ్చినపక్షమున నెంతబాగుండును. తెలివితక్కువ ముండకొడుకులు స్వయముగఁ దెలిసికొన లేరు. ఆలోచనలు చెప్పిన వారిమీఁద మూరెడుకోపము. కోటుగుడ్డలీయని చోటికి బ్రాహ్మణార్థమునకు వెళ్ళవద్దని బ్రాహ్మణార్థములు చేయుకుట్టువాం డ్రింటికు నచ్చచెప్పి కట్టుకట్టించెదను. అప్పుడు కాని వాండ్రరోగము కుదురదు" అట్లనుకొనుచుండఁగా మెల్లమెల్లగ నిద్దురపట్టెను.

పదియవ ప్రకరణము.

వివాహానంతరమున గణపతి కోమటులతోఁ గలసి స్వగ్రామము జేరెను. ఇతరుల సొత్తునకుఁ దన సొత్తునకు భేదములే దను నద్వైతబుద్ధిచేతనైన నేమి హస్తలాఘవముచేతనైన నేమి ముచ్చెల విషయమున ముచ్చట తీర్చికొనుట కవకాశము కలిగినది. కాని కోట్ల విషయమున ముచ్చట తీరినది కాదని యతనికి బెంగ పట్టెను. కోటు గుడ్డలున్న దుకాణములలో హస్తలాఘవము చేయుటకు వీలువిక్క

నదికాదు. పోనీ కట్టిసిద్ధముగా నున్న కోటులే హస్తలాఘవము చేసి సంపాదింపవలె నన్న నతని గుజ్జురూపమునకుఁ దగిన కోటులు దొరకుట యరిది. స్వగ్రామముచేరిన నాలుగుదినములకు దనబుద్ధి విశేషముచేత నార్జించిన ముచ్చెల నుపయోగింపవలయు నని యభిలాష వొడమ గణపతి మూటవిప్పి జోడు దీసి చూచి దానియందమునకుఁ గడుంగడు సంతసించి యది యున్నదున్నట్లుగాఁ దొడుగనొన్నపక్షమునఁ దన దొంగతనము వెంటనే బయటపడునని శంకించి దానికి మారురూపము గల్పింపఁ దలఁచి దాని మీఁదనున్న జల్తారు నూడఁబెరికి యావలఁబాఱవైచి తొడిగికొని మొదటిదినమునఁ దన యింటిలోనే బదిసారు లిటునటుఁ బచారుచేసెను. తనయైశ్వర్యముం జూచి చుట్టములు నెచ్చెలులు సంతోషింపవలె నని లోకమునఁ బ్రతి మనుష్యుఁడుఁ గోరునుగదా. అటులే గణపతిగూడఁ దన భాగ్యవశమునఁ దనకు లభించినదియు నాగ్రామమున ననన్యలబ్ధమైనదియు నగు ముచ్చెలజోడు దొడిగికొని బంధుమిత్రుల కనులకు విందు సేయవలెనని తలంచి నోట చుట్ట వెలిగించి కుచ్చు తలపాగ జుట్టి రాజమహేంద్రవరమునందలి కొందఱు పెద్దమనుష్యులవలెఁ జేతిలో కఱ్ఱ బట్టుకొని ముచ్చెలు దొడిగికొని టక్ టక్ మని చప్పుడగునట్లు నాలుగువీధులు దిరిగి పనిలేనిచోటనైత మాగుచుఁ దన చెలిమికాండ్రిం బిలిచి యేదో సంభాషణ సేయుచు "మీగాళ్ళ వాపు మొగముమీఁదనే తెలియు" నన్నట్లు ముచ్చెలజోడు లభించె నన్న యానందము ముఖవికాసమె తెలియఁజేయునట్లు విహరించెను. కొందఱు స్నేహితులాతనిం జూచి "గణపతి! పైజారు లెంతకు గొన్నావురా?" యని యడుగ నతఁడు వెల వెలఁ బోయి తత్తరపడి నొకనితో నర్థరూపాయ యనియు మఱియొకనితో మూఁడుపావలా లనియు యొకనితో రూపాయ యనియు వేఱొ

కనితో నాకిది రాజమహేంద్రవరములో నొకకోమటిపిల్లవాఁడు బహుమాన మిచ్చెననియు, నింకొకనితో మామామ కొనిపెట్టినాఁడనియు నొకనితోఁ జెప్పినవిధమున మఱియొకనితోఁ జెప్పక పరిపరివిధములఁ బ్రత్యుత్తర మిచ్చెను. మిత్రు లనేకులు "గణపతి మిక్కిలి యదృష్టవంతుఁడు. అతఁడేదోవిధమునఁదనకోరికదీర్చుకొను" ననిశాఘించిరి. ఒకరిద్దఱుమాత్రము "వీఁ డెక్కడనో దొంగతనము జేసి తెచ్చినట్లున్నాఁడు. కానియెడల వీని కీజోడుబహుమానమిచ్చువాఁడెవ్వఁడు? పెండ్లికివచ్చినప్పుడు వీనిదగ్గఱ నెఱ్ఱని యేగాని లే' దని నిరసించిరి. వారిమాటలకు గణపతి యెంతమాత్రము సరకు సేయక "చేతగానికుంకలు, అప్రయోజకవిధవలు. తాము ప్రయోజకత్వముచేతఁ దెచ్చికొనలేరు. ఎవఁడైన సంపాదించుకొన్న యెడల దొంగతనమని సింగినాదమని జీలకఱ్ఱయని పేర్లు బెట్టి వెక్కిరించుచుందురు. ఈనిర్భాగ్యు లేమనుకొన్న నాకేమి? ఏలాగో యొకలాగు సంపాదించుట ప్రయోజకత్వము. ఒకఁడు సంపాదించుకొన్నాఁడని యోర్వలేక పేర్లుపెట్టుటవట్టియప్రయోజకత్వము. దొంగతనము చేసిననుసరె పట్టుపడకుండుట తెలివి. నేనుకొంటే వీళ్ళ కెందుకు? నేను కొనకపోతే వీళ్ళ కెందుకు? చేతనైతే సంపాదించుకొనవలె లేకపోతే నోరు మూసికొని యూరకుండ వలె" నని తన మీఁద నింబారోపణము చేసిన వారికిఁ బదిపుంజీలచీవాటంటగట్టి తన కాప్తులయినవారిని నలుగురిని వెంటఁ బెట్టుకొని యిచ్చవచ్చిన చోటులెల్ల విహరించి యింటికిఁ బోయెను. ముచ్చెలజోడు తొడిగికొని తనకన్నులకుఁ బండువు చేయుచున్న కుమారుని జూచి తల్లి యానందించి రాత్రిభోజనమైనతరువాత గణపతిపండుకొనఁగా నతని ప్రక్కఁజేరి యిట్లనియె. "నాయనా! జోడు మిక్కిలి బాగున్నది. మొట్టమొదట నది యిప్పటికన్న బాగున్నది. నీకిదేలాగున దొరికి

నది? నీవు కొన్నావా? ఎవరైన బహుమాన మిచ్చినారా? దాని మీఁద జరీపోగు నీవెందుకుతీసివేసినావు? ఎవరిదైన దొంగతనముగా దీసికొని రాలేదుకద. ఎఱ్ఱతలపాగాల బంటోఱ్ఱతులువచ్చి అక్కలుగట్టి తీసికొనిపోదురేమోయని భయము. అందుచేత నడిగినాను. ఏలాగున దొరికినదో చెప్పు నాయనా! తెలియక దొంగతనముగఁ దెచ్చినపక్షమున వారిది వారికిచ్చివేయుదము. మామయ్యవిన్నపక్షమున మిక్కిలి కోపపడి నిన్నఁగొట్టఁగలఁడు. ఈగడిబిడ యెందుకు? ఉన్నదున్నట్టు చెప్పు. ఈయూరిదయితే రాత్రివేళ గోడమీఁదనుంచి వారివాడ్డిలో గిరవాటువేయవచ్చును. పొరుగూరిదయితే మరియొకలాగు సర్దుకోవచ్చును" అని మందలించుటయు నులకకుక్కి మీఁదఁ బండుకొన్న గణపతి దిగ్గునలేచికూర్చుండి తల్లికిట్లనియె. "అమ్మా! ఎందుకు నీకు భయము. ఇది ఈగ్రామములో నెవరిది కాదు. కోమటులయింట వివాహమునకు నేను రాజమహేంద్రవరము వెళ్ళినప్పుడు నాయదృష్టవశమువల్ల నాకిది దొరికినది. దొంగతనమే చేసినానో దొరతనమే చేసినానో సంపాదించినాను. కొడుకు గొప్పప్రయోజకుఁడై ముద్దినుసువస్తువులు సంపాదించుచున్నాఁడని సంతోషింపక వెఱ్ఱిముండలాగు విచారించుచున్నావెందుకు? అయినదానికి కాని దానికి విచారించిన దానిబ్రదుకు విచారపుబ్రదుకే యగును. ఈగ్రామములో నే నెందుకును పనికిరాకున్నాను గాని రాజమహేంద్రవరంలో నే నంటె యెంతో గౌరవము. అక్కడివారు నన్ను నెత్తిమీఁద బెట్టుకొన్నారు. ఏదుకాణములోకి నేను వెళ్ళినప్పటికి వర్తకులు బీరువాలు తెఱచి మూటలు విప్పి ముద్దినుసుగుడ్డలు నాకు చూపించినారు. నన్ను దయచేయు మని మర్యాదచేసి దండము పెట్టినారు. నాకీజోడు దొరికినది. దొరికినది దొంగవస్తువగునా? వీధిలో మనముపడిచి వెళ్ళునప్పుడు మనకేవస్తువయినదొరుకవచ్చును.

అది మన డగునా కాదా? అలాగే నాకీజోడు దొరికినది. ఒకరిచేతిలో నుండఁగా నేను లాగికొనలేదు. ఒకరిపెట్టె బ్రద్దలు కొట్టి నేను దీసికొనలేదు. ఒకరికాలినుండి నే నూడఁదీయలేదు. నాపుణ్యమువలన నాకు దొరకినది. ఇదే దొంగతనమైతే మనము చేయుచున్న ప్రతిపనియు దొంగతనమే యగును. యజమానునితోఁ జెప్పకుండ మనము దంతధావనముకొఱకు చెట్టునుండి యొక పల్లు త్రోంచిముప్పుడక విఱుచుకొందుము. అదిదొంగతనము గాదా? చెట్ల నుండి పువ్వులు కాయలు కోసికొనుచున్నాము. అది దొంగతనము కాదా? కష్టపడి కన్నదూడలకు లేకుండ ఆవులను గట్టిపెట్టి పాలు పితుకుకొనుచున్నాము. ఇది దొంగతనము కాదా? దొంగతనముల మాట నాదగ్గఱ జెప్పకు. ఎవరికేది ప్రాప్తమో ఆవస్తువు వారిదగ్గఱ పడును. అది దొంగతన మనుట తెలివితక్కువ. ఇది నా కెలాగు వచ్చినదో రెండవకంటివా డెఱుఁగఁడు. ఇందుకోసము బెంగపెట్టి కొని నీవు చావనక్కఱలేదు. బంకురోతులు లేదు బింకురోతులు లేదు. భయపడకు. ప్రపంచమంటే యేమిటో తెలియని యమా యకపుముండవు కనుక ఎఱ్ఱతలపాగాలవారంటె నీకుభయం. నాకట్టి భయము లేదు. వాళ్ళు నాదరికి వచ్చినారంటె తుపాకిని వేయించఁ గలను. రెండుకోట్లు నాకుండనీ! ఆకోట్లు తొడిగికొని గిరజాలు నున్న గాదువ్వుకొని కుచ్చుతలపాగజుట్టి ముచ్చెలుదొడిగికొని బెత్తము జేతఁబట్టుకొని టక్కు టిక్కు టక్కు టిక్కు మని బయలుదేఱి నానంటే ఎఱ్ఱతలపాగాలవాళ్ళు. నల్లతలపాగాలవాళ్ళు వీఁడెవఁడురా బాబూ డిప్టికలెక్టరులా గున్నాఁడని తోఁకతెంచుకొని పోఁగలరు. నేనేమి, మునుపటి చచ్చుగణపతి ననుకొన్నావా యేమి? రాజమహేం ద్రవరములో నెన్నిటస్సాలు నేర్చినాననుకొన్నావు? ఎన్నితమాషాలు నేర్చినాననుకొన్నావు? గిరజా యెదిగిన తరువాత, కోటు కుట్టించిన

తరువాత నాదర్జా యేమిటో మీకందఱకు తెలియఁగలదు. మా నాయనసంపాదించినబిందెయే దైననున్నపక్షమునను నాకియ్యి. అమ్మియో తాకట్టుపెట్టియో రెండుకోటులు కుట్టించుకొందును. కోటు లేనివారి కీకలియుగములో గౌరవమేలేదు. కొంపలేకపోయినను భయములేదు. భూములు లేకపోయినను విచారములేదు. ఉద్యోగములేకపోయినను కొఱఁతలేదు. కాని కోటులేకపోతే యావత్తు వెలితియే. కోటు లేని వాఁడుచిల్లిగవ్వచేయఁడు. రాజమహేంద్రవరములోనున్న మగవాళ్లం దఱు కోట్లు వేసికొనబట్టియే మిక్కిలి గౌరవము పొందుచున్నారు. రెండుకోట్లున్నపక్షమున నేనీగ్రామములో శిఖామణినై యుండెదను. అప్పుడు నేను తగవులు దిద్దఁగల పెద్దమనిషినై యుందును. అప్పుడు అందఱు నాదర్శనమే చేయుదురు. నన్నే యాశ్రయింతురు. నన్నే పిలుతురు. నాకే దండములు పెట్టుదురు. పూర్వకాలములో జడలువుంచుకొన్న మునీశ్వరులకే గౌరవము. ఈకాలములో గిరజాలు పెంచుకున్న పడుచువాండ్రికె గౌరవము. పూర్వకాలములో మంచి కాషాయవస్త్రాలు కట్టుకొన్నవాళ్లె పూజ్యులు. ఇప్పుడు కోట్లుతొడిగికొన్నవాళ్ళే పూజ్యులు. పూర్వకాలములో దండము చేతిలో దాల్చినవారికిమర్యాద. ఇప్పుడు బెత్తము చేతితోఁ బట్టుకొన్నవారికి మర్యాద. పూర్వము పావుకోళ్ళఁ దొడిగిన వాళ్ళది గొప్ప. ఇప్పుడు ముచ్చెలు చెడావులు తొడిగికొన్నవాళ్ళది గొప్ప. కాలము మారిపోయినది. గౌరవమునకుఁ గావలసినాలుగు వస్తువులలో నేను మూఁడుసంపాదించుకొన్నాను. అవేవనఁగా గిర జాలు, ముచ్చెలు, చేతికఱ్ఱ. నాలుగవది కోటు. రెండుండుట మంచిది. అధమపక్షమొకటియైన నే గుట్టించితీరవలెను. మామ య్య చూడకుండ మనబిందె యావల పడవేస్తివా నాగౌరవము కాపాడినదాన వగుదువు. తల్లంటె నీవే తల్లివి. ఈయుపకారముచేసి

తివా వే యిజన్మములకై ననీకడుపుననే పుట్టవలెననికోరుదును. ఇప్పుడు మనకు బిందె యెందుకు? మామయ్యగారు వాడుకొనుచున్నారు. మనకవసర మున్నప్పుడు వా రెందుకు వాడుకోవలెను? రెండు కోట్లు కుట్టించుకొని నేను తగుమనుష్యుండ నైనతరువాత కావలసి నన్ని బిందెలు సంపాదింపఁగలను. బిందెలే కావు. గంగాళములు గాబులు సంపాదింపఁగలను. గౌరవము కోటులోనున్నది. దేవుఁడు కోటుజేబులో కూర్చుండును. ఆపదానవు. అందులో మాయా మర్మ మెరుగని దానవు. కనుక నీకు తెలియదు. కోటుసంగతి మగ వాఁడను చదువుకొన్నవాఁడను ప్రయోజకుఁడను గనుక నాకుఁ దెలు సును దానిసంగతి. ఈపట్టున కోటుపురాణము వ్రాయమంటె కావ లసినంతగ్రంథము వ్రాయఁగలను." అంతరాయము లేనిధోరణితో గణపతి యుపన్యాసము చేయుచుండ నల్లమందు పట్టిచ్చుటచే నామెకు కునికిపాటు వచ్చెను. అందుచే నామె జోగిజోగి మంచము మీఁదనుండి క్రిందఁబడెను. "ఓసీ! నీనిద్ర తగులఁబెట్టు. కునికిపాట్లు పడుతున్నానటె? పూటపూటకు కుంకుడుకాయంత నల్లమందు వుండలు మ్రింగి చెడిపోయినావు. సరె యిప్పుడు పడుకో. రేపటి దినము మాటాడవచ్చును" అని గణపతి పండుకొనెను. తల్లి నిద్రా భారముచేతఁ గన్నులు తెరువలేక ప్రక్కవైచికొనలేక వట్టినేలనె పండుకొనెను. గణపతి నిద్రించి, బిందె తీసికొనిపోయి యమ్మినట్లు రెండుకోట్లు కుట్టించుకొన్నట్లు నవి తిన్నగా నుదుకనందుకుఁ జాకలి దానితోఁ గలహ మాడినట్లు స్వప్నములు గాంచెను. మరునాఁ డుద యమున లేచి గణపతి బిందె యిమ్మని తల్లిని మిక్కిలి పీడించెను. అమాయకురాలైన యాయిల్లాలు కొడుకుమాట లన్నియు వట్టికోత లని తెలిసికొనలేక యవి సత్యములేయని నమ్మి బిందె తాకట్టు వెట్టియో విక్రయించియో రెండురూపాయలు తెచ్చి యిచ్చినపుడు

మున తనకుమారుఁడు మిక్కిలి గొప్పవాఁడై విశేషధన మార్జించి తన నుద్ధరించునని తలంచెను. అందుచేత బిందె కుదువబట్టవలెనని యామెకూడ సంకల్పించెను. కాని సోదరుఁడు సోదరభార్యయుఁ జూచుచుండఁగా నట్టిపని చేయుట కిష్టములేదు. వారాపని సాగనియ్యరని యామె యెఱుఁగును. అందుచేత నామె మరునాఁడు రాత్రి సోదరుఁడు నిద్రించినతరువాత గడచినరాత్రివలెనే కుమారుని ప్రక్కలోఁ గూర్చుండి యిట్లనియె "నాయనా! బిందె తాకట్టు పెట్టుట నాకిష్టమెకాని నీమేనత్తయు నీమేనమామయుఁ జూచుచుండ నట్టిపని చేయుటకు నాకిష్టములేదు. అందులో ముఖ్యముగ నీ మేనత్త నిన్ను జూచినప్పుడెల్ల కన్నులలో నిప్పులుపోసికొనును. నీవు పచ్చగానుండుట యామె కెంతమాత్రి మిష్టములేదు. నీవు గిరజాలు దువ్వుకొని కోటు దొడిగికొని యల్లారుముద్దుగా నుండుట దాని కిష్టము లేదు. అది చూచుచుండఁగా బిందె తీసికొనుటకు వీలులేదు. బిందె చిల్లివడినందున నీళ్లు పోసికొనుటకు వీలు లేక సున్నిపిండి కుంకుడు కాయలు పోసుకొనుచున్నారు. అది నేను తీసికొంటినా నీమామతోఁ జెప్పి తిట్టించును. ఆవిడ నాలుగుదినములలో పురిటినిమిత్తము పుట్టింటికి వెళ్ళును. మీమామపొలము వెళ్లుచుండును. అప్పుడు మనకు స్వేచ్ఛగా నుండును. గనుక బిందె నేనే తాకట్టుపెట్టి సొమ్ము తెచ్చి యిచ్చెదను. అంతవఱకు కోపికపట్టుము" అనవుడు గణపతి కోపించి పండ్లుకొఱికి బోడిపెత్తనములు వెధవ పెత్తనములు మనబిందె మనము తీసికొనుటకు వీలులేక వచ్చినది. ఈకోట్లు కుట్టించుకొన్నతరువాత మన మొకరియండ నుండికుండ హాయిగ స్వేచ్ఛగ నుండవచ్చును. సరే నీయిష్టమువచ్చిన ట్లామె పుట్టింటికి వెళ్ళినతరువాత చేయవచ్చు నని పండుకొనెను. నాఁడు మొదలుకొని గణపతి యెప్పుడు మేనమామభార్య పుట్టింటికి వెళ్ళు

నెప్పుడు బిందె కుదువఁబెట్టి తల్లి రూకలు తెచ్చి తనచేతఁ బడ వేయు నెప్పుడు కోట్లు తాను కుట్టించుకొనుట కరువు పడు నని నడు చునప్పుడును స్నానము చేయునప్పుడును భోజనము సేయునప్పుడును జిత్తంబు దానియందె నిలిపి కాముకుఁడు దనప్రియురాలియందనురా గము నిలుపునట్లు, భక్తుఁడుతనయిష్టదైవమునందు మనంబునిల్పునట్లు తదేకధ్యానపరాయణుఁడై యుండెను. అంతలో సమీపగ్రామమున నొకబ్రాహ్మణునితండ్రి మృతినొందఁగా పదునొకండవ దినమునను బండ్రెండవదినమునను గణపతి మిత్రులతో శ్రాద్ధభోక్తగానియుంపఁ బడెను. ఈకాలమునందునలెఁగాక యాకాలమునఁ గావలసినంతమంది శ్రాద్ధభోక్తలు దొరకుచుండెడివారు. ఒకప్పుడు గావలసినవారికంటె నెక్కువసంఖ్య లభించుటయుఁగలదు. వారి కీయవలసినదక్షిణకూడ నిప్పటివలె నధికముకాక నాలుగణాలకు మించకయుండెను. గణపతి తనమిత్రబృందముతో నచ్చటికరిగి తన చెలికాండ్రను దనకుఁబరి చితులుగాని యితరగ్రామవాసులగు భోక్తలను బిలిచి స్నానపు నెప మునఁజెఱువుగట్టునకుఁదీసికొనిపోయి వారి చెట్టుక్రిందఁ గూర్చుండఁబెట్టి పొగచుట్టలుగాల్చు నభ్యాసముగలవారి కందఱకుఁ దలకొక చుట్ట నిచ్చి తానొకచుట్ట వెలిగించి కాల్చుచు నీక్రిందివిధమునమాట్లాడెను.

"మీకందఱకు నేనొక సలహా చెప్పఁదలఁచుకొన్నాను. అది మనకందఱకు మిక్కిలి యుపయోగకర మయినది. షోడశబ్రాహ్మ ణార్థములు మనమందరము చేయుచున్నాముకదా! కాఁబట్టి మన యవసరము బ్రాహ్మణులకందఱకున్నది. భోక్తలుగా మనముకూర్చు న్నందుకు మనకు వారు నాలుగణాలు రొక్కమో లేక యొక్కొక్కరు గుడ్డయో యిచ్చుచున్నారు. ఆగుడ్డలు చిరకాలము మన్నవు. అవి ప్రేతకళకక్కుచుండును. అవి కట్టుకొన్నవానికి ముసుగున్న కళకాం తులుకూడ నశించును. మంచిగుడ్డలు వేసికొనవలె నని మనకుఁగూడ

నుబలాట ముండునుగదా! అందుచేత మన మందఱ మొకకట్టుకట్టి భోక్తలకు సైనుపంచె లిచ్చుటకుమారుగా మంచికోటుగుడ్డ లీయవలసినది. అలాగీయనిపక్షమున మేము బ్రాహ్మణార్థములు చేయమని స్పష్టముగా చెప్పవలసినది. మనమందఱ మొక్కమాటమీఁదనిలువఁబడినపక్షమున మనకోరిక సిద్ధించును. కప్పలతక్కెడవలె నొకరితో నొకరు సంబంధములేకున్న యెడల మనయందుగౌరవముండదు. ఒక్కమాటమీఁదనుంటిమా కర్మలుచేయువారు మనకాళ్ళమీఁదఁ బడుదురు. ఏమిటి మీయభిప్రాయము మీకందఱకిష్టమా? అయిష్టమా?" అపలుకులు భోక్తలుగా వచ్చినవారిలోఁ గొందఱకు సంతోషకరములయ్యెను. మంచిమంచికోటులుదొడిగికొని తిరుగవచ్చుననివారాసలహాబాగున్నదనిరి. కోటుగుడ్డలెట్టివో యెఱుఁగనికొంద అందుండిరి. వారంద ఱాసలహాకు సమ్మతింపక "చీ కోటుగుడ్డ లేమిటి పెద్దలనాఁటినుండి సైనుగుడ్డ లిచ్చుటే యాచారమై యున్నది. కోటుగుడ్డ లిచ్చుట పుచ్చుకొనుటగూడ మిక్కిలి యనాచారము. ఇదివిన్నపక్షమున శంకరాచార్యులవారు మనలనందఱ వెలివేయుదురు. ఈకట్టుకట్టితిమా దేశములో మనకుప్పైనఁ బుట్టదు. కాఁబట్టి మీజిట్టులోకి మేముర" మని భిన్నాభిప్రాయులయిరి. "ఇందు స్వాములవారు వెలివేయుట కేమున్నది? మన మేమి యకార్యకరణము చేసినా" మని గణపతిపక్షముఖారు రెండవపక్షమువారి నడిగిరి. "ప్రాతపద్ధతులు విడిచి క్రొత్తపద్ధతు లవలంబించుటే తప్పు. శ్రాద్ధముల కోటుగుడ్డ లేమిటి? ఎవరయినవిన్నపక్షమున మొగము మీఁద నుమ్మి వేయుదు" రని వారుబదులు చెప్పిరి. మొగముమీఁద నుమ్మివేయుదురన్నమాట గణపతికి గణపతిపక్షమువారికి మహాగ్రహము కలిగించెను. తీవ్రములైనమాటలతో వారుకొంతసేపు యుద్ధముచేసిరి. ఆమాటలు క్రమక్రమముగా ముదిరెను. చేతులుకలసెను. కొందఱు చేతులలో చెట్లు,

కొమ్మలు, బెడ్డలుపుచ్చుకొని కొట్టుకొనిరి. కొందఱు జుట్టుజుట్టుపట్టుకొని నేలఁబడిరి. ఏడ్చువారుకొందరు, తిట్టువారుకొందఱు, పారిపోవువారు కొందఱు, మనగణపతి కడపటిగణములోఁ జేరెను. బెడ్డలు దెబ్బలుతగిలి కొందఱికి నెత్తురు కారెను. అది నీళ్ళరే వగుటచే నీళ్ళకువచ్చినస్త్రీలు స్నానముచేయవచ్చిన పురుషులు చుట్టుం జేరి వివాదకారణ మేమని యరసి శ్రాద్ధములలో సైనుగుడ్డలకు మారు కోటుగుడ్డలు భోక్తలు పుచ్చుకోవలసిన దనువిషయమునుగూర్చి వివాదము పొడమి తుద కీవిధముగఁ బరిణమించినదని విని కడుపుచెక్కలగునట్లు నవ్విరి. భోక్తలుగా వచ్చినవా రిరువదిమంది. అందుఁ బదునలుగురు గణపతిపక్షమై యుండిరి. గణపతి పారిపోయి మరియొక రేవున స్నానముచేసి తనపక్షమున్నవారికందఱకు వత్తమానమంపి వారి కిట్లనియెను.

"ఒరే! మనకు వ్యతిరేకముగ నున్నవారికంటె మనమె యెక్కువమందియున్నాము. మనముపట్టుపట్టితిమా యజమానుఁడులొంగితీరును. నేఁడుపడకొండోదినము. కాఁబట్టి పదియెనమందిగురు బ్రాహ్మణులు కావలెను. మనముమానివేసితిమా సంఖ్యకుదురదు. శ్రాద్ధము చెడును. అందుచేత మీరు మెత్తపడక నేనుచెప్పినటులనడువుఁడు. సైనుగుడ్డలువద్దోయి కోటుగుడ్డలుకావలెనోయి యని నేనుకనుసంజ్ఞచేయఁగానే కేకలువేయుఁడు. అప్పుడు చచ్చినట్లు మనముకోరినదిచ్చితీరును నవరాత్రములలో హాయిగా మంచికోటులు వేసికొని తిరుగవచ్చును బ్రాహ్మణార్థముచేసినప్పటికి మనముకూడ శుభ్రమైన బట్టలు కట్టుకొని యుద్యోగస్థులవలె నుండవచ్చును. చూడండి! నేను ముచ్చెలు తొడిగికొని బ్రాహ్మణార్థమునకు వచ్చినాను. ఎవరివృత్తి వారిది. కూటికి పేదలమైనా గుడ్డకు పేదలముకా నవసరములేదు. మనది శరీరమే. మనకు ముచ్చట లున్నవి. కాఁబట్టి మనము తప్పక కోటు

గడ్డలే కోరవలెను. జ్ఞాపక మున్నదా? మరిచిపోరు గదా?" అనవుడు వారందఱు మరచిపోము జ్ఞాపకమున్నది. మీరు చెప్పినట్లె యందు మనియరచిరి. వారిమాటలయందునమ్మికలేక గణపతి వారందఱిచేత గాయిత్రిసాక్షి యనియు దైవసాక్షియనియు నిన్న జంపుకొన్నట్లె శిపాగజూచినట్లె, ఆమ్మతోడు బాబుతోడని యొట్లు పెట్టించుకొనెను. పిమ్మట నందఱు స్నానముచేసి శ్రాద్ధగృహమునకరిగిరి. ఈలోపున రెండవపక్షమువారిలోఁ గొందఱు కర్తగృహమునకరిగి గణపతిచెఱు వుగట్టువద్దఱ రావిచెట్టుక్రింద భోక్తలనందఱఁ జేరఁదీసి కోటుగుడ్డ లనడుగుమని యుపన్యసించుటయు దమ భిన్నాభిప్రాయులైయతని యుపదేశంబుల నిరాకరించుటయు మాటలాడుట క్రిమక్రిమముగా ముదిరి పోటులాడుటగా మారుటయుఁ దమసంఖ్య స్వల్పముగానుండు టచేఁ దాము దెబ్బలు తిని యోడిపోవుటయు మున్నగు వృత్తాంత మంతయు నాతని కెఱింగించి తమగాయములం జూపిరి. శ్రాద్ధభోక్త కోటుగుడ్డలుకోరుటకలికాలమహిమయనుకొని యాకర్తదానికిందగు బ్రతివిధానము మనసులో నాలోచించి సిద్ధముగానుండెను. అంతలో గణపతి మిత్రబృందముతో వెళ్ళి కూర్చుండెను. రెండుజాము లైనతరు వాత బ్రాహ్మణుల యథాస్థానములఁ గూర్చుండఁబెట్టి కర్తయర్చింపఁ దొడఁగెను. అర్చింపఁబడువారిలో మొట్టమొదటివాఁడు గణపతి. పసుపుగణపతిపూజ యైనతోడనే నిజమైనగణపతిపూజ వచ్చెను. పసుపుగణపతివలె నేమిచ్చిన దానితోనే తృప్తినొందక మనగణపతి బొజ్జనిండఁ గోరికలు పెట్టుకొనియుండెను. భోక్తకు వస్త్ర మియ్యవల సినసమయమున తడిసిన సైనుగుడ్డ తెచ్చి కర్త యియ్యవచ్చినప్పుడు "నే నీగుడ్డ పుచ్చుకోను. మంచికోటుగుడ్డేదైన నాకియ్యవలెను. మరొ కటి నేను పుచ్చుకొనను"నని పలికెను. కర్త యప్పలుకులు విని మిక్కిలి యచ్చెరువడి గణపతివంక తేరిచూచి "ఏమీ! కోటుగుడ్డలే

కాని పుచ్చుకొనవా? కోటుగుడ్డలిదివరకెన్నడైన పుచ్చుకొంటివా? కలికాలముచేత నేటికాలమునకు నీవొకఁడవువింతకోరికలుకోరమొద లిడినావు. నీకీబుద్ధి లెవరు గరపినా' రని మందలించెను. అనవుడు గణపతి ‹అయ్యా! నేనొక్కఁడనేకాదు. మావాళ్ళకందఱ కట్టికోరి కలేయున్నవి. అడిగిచూడండి! ‹ఓరీ! ఏమిరా మీకేమికావలెనురా, యని యరచెను. అరచుటయుగణాధిపతిమాటననుసరించుప్రమథగణ మువలెఁ దక్కినపదమువ్వురు నైకకంఠ్యముగ మాకు సైనుగుడ్డలు వద్దోయి కోటుగుడ్డలు కావలెనోయి'యని యింటిమీఁదియాకులెగిరి పోవున ట్లరచిరి. అదియెల్ల గణపతిచెప్పినపాఠమే యని కర్త నిశ్చ యించి కార్యవాదమెగాని ఖడ్గవాదము కర్తవ్యము గాదని క్షణ మాలోచించి శ్రాద్ధము చెడకుండునట్లు మనసులో నొకయుపాయము పన్నుకొని యిట్లనియె. ‹సరే! మీకందఱకు సైనుగుడ్డ లిష్టములేక పోయినపక్షమున మీకేమి కావలయునో యవే తెచ్చి యిచ్చెదను. కాని యాగుడ్డ లిప్పుడుమాగ్రామములో దొరుకవు. కాకినాడకైనను రాజమహేంద్రవరమునకైనను మనుష్యు నొక్కని బంపి యాబట్టలు తెప్పించవలెను. రేపుసాయంకాలమున కెట్లో తెప్పించెదను. ప్రస్తు తము కథ కానియ్యండి. సైనుగుడ్డ లెవరికిష్టమో వారే పుచ్చుకో వచ్చు' నని యనునయించెను. గణపతిప్రశాంతుఁడయ్యెను. అతనితో శిష్యగణమంతయుఁ బ్రసన్న మయ్యెను. అతని ప్రతిపక్షులు సైనుగు డ్డలు స్వీకరించి సంతుష్టులైరి. గణపతియు శిష్యులును రెండుదినములు కూడ నేమియు స్వీకరింపక కోటుగుడ్డలకై నిరీక్షించుచుండిరి.

ప దు నొ క ం డ వ ప్ర క ర ణ ము.

పదునొకండవనాఁటిరాత్రి గ్రామచావడియరుఁగుమీఁద గణపతి మిత్రబృందసమేతుఁడై పండుకొని నెచ్చెలులతో నిట్లు ప్రసంగించెను.

"ఒరే! యజమానుఁడు కాళ్ళబేరమునకు వచ్చినాఁడు. కాని యతఁ డేదో నాలుగు తుక్కుగుడ్డలు తెప్పించి యివే కోటుగుడ్డలు పుచ్చుకోండి యను నేమో? అందుచేత మనము మంచిగుడ్డలుకోరుకోవలెను. ఏరకముగుడ్డలు బాగుండునో మన మాలోచించుకొనవలెను. చలికాలములో తొడుగుకొనుటకు మంచిబనాతుగుడ్డలు కావలె నని కోరుకొందమా, లేకపోయిన మంచిపట్టుబట్టలు కోరుకొందమా? అతలస్‌గుడ్డ లడుగుదమా? ఏరంగుగుడ్డ లడుగుదము? చాఱలగుడ్డ లున్నవి. అందులో తెల్లచాఱలు నల్లచాఱలు పచ్చచాఱలు నెఱ్ఱచాఱలు గలగుడ్డ లున్నవి. మనలో నెవరెవరి కేగుడ్డలు బాగుండునో యవి కోరుకోవలెను. నామట్టుకు నా కేగుడ్డ బాగుండునో మీరు చెప్పండి!" అనుటయు "ఒరే! గణపతి నీకెఱ్ఱబణాతుగుడ్డ బాగుండునురా" యని యొకఁడు "నల్లబణాతు బాగుండునురా రంగు రంగులో కలిసిపోవు" నని యొకఁడు "ఒరే చాఱలగుడ్డ బాగున్నదిరా పెద్దపులిలాగ నుండఁగల" వని వే ఱొకఁడు పలికెను. "ఛీ! మీసలహాలు నాకు బాగులేవు. నేను పట్టుగుడ్డ కోటుకుట్టించుకొందును. వంగపండుచాయ పట్టుగుడ్డమీఁద నా కెంతకాలము నుండియో మనసుగానున్నది. ఆగుడ్డ నిమ్మని నేను కోరెదను. మీరే మందురు?" అని గణపతి వారి నడిగెను. "సరే! యదె కోరు" మని వారైకకంఠ్యముగఁ బలికిరి. ఎవరిగొంతెమ్మ కోరికె వాఁడుకోరెను. మాటలాడుచుండఁగానెయొక్కొక్కరికన్నలుమూత

పడెను. అందఱు గుఱ్ఱుపట్టి నిద్రించిరి. అందఱు తమకిష్టములైన గుడ్డను కోట్లుకుట్టించుకొని ధరించుకొని తిరిగినట్లు స్వప్నములు గాంచిరి. తాను కుట్టించుకొన్న వంగపండుచాయకోటు తన స్నేహితులలో నొకఁ డెవరు పుచ్చుకొన్నట్లు మరల దానిం దెచ్చి యాయుఃయపహరించినట్లు గణపతి కలగని కోపముతో కలలోనే స్నేహితునిమీఁద చేయి విసరెను. కోటు నపహరించుట కలలోనివార యైనను చేయి విసరుటవలన దనప్రక్కనె నిద్రించుచున్న మిత్రునకు మాత్రము చెంపకాయ గట్టిగాఁ దగిలెను. దానితో నతఁ డులికిపడి లేచి "యెవఁడురా నన్ను కొట్టినాఁ" డని బిగ్గరగా నఱచుచు నల్లరి జేసెను. గణపతికి మెలఁకువ రాలేదు. తక్కినవా రందఱులేచిరి. మేలుకొన్నవారందఱు ప్రయత్నముమీఁద గణపతిని మేల్కొల్ప నతఁడు తాను నిద్రలో నల్పినదుండగ మెఱుఁగక నతనికిఁ దగిలిన దెబ్బకుఁగారణ మేమి యని పలువిధముల విచారించి యెట్టకేల కిట్లనియె. "ఒరే! అప్పుడప్పుడు దయ్యములు వచ్చి మనుష్యులు నిద్దురపోవుచున్నప్పుడు బాధపెట్టుచుండును. ఒకప్పుడు రాత్రిలు మనము పండుకొనఁ బోవునప్పటి కేమియు లేక తెల్లవారునప్పటికి శరీరముమీఁద రక్కులు గీరులు గనఁబడును. ఒకప్పుడు తెల్లవారునప్పటికి మనచేతులు వాచును. నిద్రలో నన్నెవరు బరికినారు? ఎవరు రక్కినారు? ఎవరు చేతులు విరిచినారు? దయ్యము వచ్చి యాపనులు చేయుచుండును. నిన్ను కూడ దయ్యమే కొట్టియుండును. దయ్య మని భయపడవలసినపని లేదు. ఇవి ప్రతిదినము జరుగుచున్నముచ్చటలే. అవి కొంటెతనముకొఱ కిటువంటిపనులు జేయును. గాని హానిచేయుటకుఁగాదు. చిన్నపిల్ల లెవరైన మనకు ముద్దుగాఁ గనఁబడినప్పుడు మనము వాళ్ళబుగ్గ గిల్లియో చిన్నచెంపకాయ గొట్టియో చేతిలో నున్నవస్తువు లాగికొనియో వారిని మన

మేడిపించుచుందుము కదా! తమాషాకే మన మాపని జేయుచుందుముగాని బిడ్డల నేడిపించుటకని యుద్దేశమున్నదా? అలాగే దయ్యములుగూడ మంచియుద్దేశముతోఁ జమత్కారముకోస నిటువంటి పనులు చేయును. కాఁబట్టి భయపడ నక్కఱ లేదు." ఆయుపన్యాసము విని దెబ్బతిన్నయతఁడు సంతుష్టుఁ డయ్యెను. అప్పుడు తెల్లవారుజా మగుటచే మేలుకొన్నవారిలో గణపతి దక్క తక్కినవారు మరల నిద్రింపకైరి. అంతలో నాలవజాముకోడి కూసెను. కొంతసేపటికిఁ దెల్లవాఱెను. కాల్యకృత్యములు దీర్చికొని గణపతి సపరివారముగ యజమానునికడకుఁ బోయి "అయ్యా! కోటిగుడ్డలలో మీయిష్టమువచ్చినవి దెప్పించుటకు వీలు లేదు. మేము మాకోరికలు చెప్పెదము. ఆప్రకారము దెప్పించవలెను. నాకు వంగపండు చాయ పట్టుబట్ట కావలెను. తక్కినవాండ్రు తమకు గావలసిన గుడ్డలు తామే చెప్పుదు రడుగండి!" యని చెప్పెను. యజమానుఁడు ముందు మాటలాడక యప్పలుకులు విని గణపతివంక తేఱి చూచి "సరే! మీమీకోరికలప్రకారమె చేసెదను లెండి" యని బదులు చెప్పెను. తక్కినవాండ్రుఁగూడఁ దమమనోరథములు దెలిపిరి. అనంతరము గణపతి వారినందఱను వెంటఁ బెట్టుకొని చెఱువునకుఁ బోయి స్నానముచేసి వచ్చెను. ఆదిన మేమగుము భోక్తలే కావలసినను యజమానుఁ డందఱుభోక్తల కన్నము బెట్టి సంతుష్టుఁ జేసెను.

భోజనానంతరమున మాకు సెలవు దయచేయుఁడని గణపతి ప్రముఖులు యజమాను నడిగిరి. "మీరు కోరినబహుమానము లీ రాత్రి దెప్పించుచున్నాను. రేపుదయమున మీరు వెళ్ళవచ్చు"నని యజమానుఁడు బదులు చెప్పెను. సంతుష్టహృదయులై వారందఱచ్చట నారాత్రి నిలువఁ దలఁచిరి. గణపతి యాకారము వేఱఁగాక

పోయినను గొప్ప యాకలిచే నైన వృకోదరుం డగుటచే నతనికి నారెండుదినములలో రాత్రి మిక్కిలి యాకలిబాధ కలిగెను. ఉదయమున జల్లికూడు లేకపోవు టొకటి, రాత్రి మజ్జిగన్నమైన దొరకకపోవుట యొకటి. ఈ రెండులోపములచేత నతఁడు మధ్యాహ్నమునఁ గుడుములతోడను గూరలతోడను సుష్టుగా భుజించినను రాత్రి పేరాకలికి నకనకఁబడి తెల్లవారునప్పటికి వాడి వత్తియయ్యెను. పండ్రెండవనాఁటిరాత్రి క్షుధానలముయొక్క దండయాత్రల కాతనిగర్భకోశ మాగఁజాలకపోయెను. అందుచే నతఁ డుదరశాంతికై ప్రయత్నములు చేయఁజొచ్చెను. ఒక్కనిముస మాలోచించునప్పటి కుపాయము దోఁచెను. ఆగ్రామమున నతనితల్లికి దూరపుజుట్టుమైన యొకముసలమ్మ యుండవలె నని యతనికి జ్ఞప్తివచ్చెను. రాఁగానె తనమిత్రబృందమును విడిచి యాయువ్వబస యెక్కడని గ్రామమున భోగట్టచేసి తెలిసికొని యామెయింటికిఁ బోయి పలుకరించి తన్నెఱిఁగించుకొనెను. ఆయువ్వయు నతనిని గౌరవించి వచ్చినపని యడిగి యతఁడు భోక్తగా వచ్చినవాఁడని యతనినోటనే విని బ్రాహ్మణార్థపుమైల సోకినందున దూరముగాఁ గూర్చుండు మని నాలుగు మాట లాడి "నాయనా! ప్రొయిమీఁద రొట్టెవెచినాను. మాడిపోవుచున్నదేమో" యని లోపలికిఁ బోయెను. గణపతి పడమటింటిగుమ్మము ముందరనే గూర్చుండెను. రొట్టెకాలి పతనవాసముసలమ్మ పడమటియింటి హద్దుగోడవద్ద రొట్టెతోనున్న బూరెల మూఁకుడు పెట్టి బిందెడునీళ్ళు తోడి తెచ్చుకొనుటకు దొడ్డిలోని నూతికడకుఁ బోయెను. ఆబూరెలమూఁకుడు చూచినది మొదలుకొని గణపతి కన్ను లారొట్టెమీఁదనే యుండెను. నోరూరఁ జొచ్చెను. ఎంతకాలముండియో తినుట కేమియు లేక మలమల మాడుచున్నవారివలె నతఁ డెట్లయిన దానిని గ్రహించి తిని ప్రాణ

ము నిలుపుకొన సంకల్పించెను. పొట్ట యుపాయములపుట్ట యగుటచే నాలస్యము లేకయే యతని కుపాయము దోఁచెను. కుక్క యచ్చటికి రాకపోయినను గణపతియె తత్కాలమున శునకరూప మెత్తి మూఁకుడు జరజరలాగి "చీచీచీ లేలేలే కఱ్ఱదే కఱ్ఱదే" యని కేకలు వైచెను, ముసలమ్మ బిందె యెత్తుకొని వచ్చుచుండఁగా నీమాట లామెచెవిని బడెను. పడుటయు విసవిస నడిచి "నాయనా! కుక్క వచ్చినదా యేమిటి? దానితల బ్రద్దలైపోను. ఆనల్లకుక్క నానెత్తురు పీల్చివైచుచున్నది. కొంపత్రివ్వి రొట్టె ముట్టుకోలేదుగదా" యని బిందె దింపెను. అనవుడు గణపతి యిట్లనియె. "అయ్యో! అవ్వా నేను పరధ్యానముగా నటువైపు తిరిగి కూర్చుండఁగా మూఁకుడు జరజర లాగినట్లు చప్పుడైనది. ఇట్టె తిరిగిచూడఁగా నల్లకుక్క లాగుచున్నది. వెంటనే దానిని కొట్టితిని. ఈదారిని పాఱిపోయినది. పెద్దగుఱ్ఱములాగున్నది. పాపము సిద్ధముగా నున్నరొట్టె పోయినది. నూతికి వెళ్ళినప్పుడు కుక్కబాధ యున్నది. జాగ్రత్తగాఁజూచుచుండుమని చెప్పినావు కావు. పాపము! నీ వీరాత్రి యూరక పండుకోనవలెను గాఁబోలు! కొంచె మటుకులైన నానవైచికొనితిను" అనుచుండ నాముసలమ్మ యిట్లనియె. "నాయనా! అటుకు లున్నవి. అటికలో నానవైచికొని తినఁగలను. కాని రొట్టెపోయినందు కేవిచారము లేదు. ఇప్పు డీకుక్కయెంగిలి ముట్టుకొని స్నానము చేయలేను. పెద్దదానను. కొంచెముజబ్బుగానున్నది. ఏలాగా యని యాలోచించుచున్నాను." అనవుడు గణపతి చివాలున లేచి "అవ్వా! నేను పరాయివాఁడనా? నేను నీమనుమఁడనె యనుకో! నేను మైలభోజనము చేసి నాను గనుక రేపువుదయమున స్నానము చేయవలెను. ఈరాత్రి నాకు భోజనము లేదు. ఈబూరెల మూఁకుడు చెఱువుగట్టునకుఁ దీసికొనిపోయి రొట్టె యేకాపుల కుఱ్ఱ

వానికో బెట్టి మరల మూఁకుడు దెచ్చి నీ కప్పగించి యీసల మలికి వెళ్ళెదను" అని యామె మైలపడకుండు నట్టియుపాయము జెప్పెను. రొట్టెపోయినందున కామె విచారింపక కుక్క యెంగిలి ముట్టుకొనకుండఁ దనపాలిటిదైవమువలె గణపతి వచ్చి తనకు సహాయము చేసినందుకు సంతసించి "నాయనా! ఈపని నేనే నీకుఁ జెప్పుటకు సందేహించి యూరకుంటిని. కావలసినవాఁడవు గనుక మనస్సులో నరమరిక లేక యీపని కొప్పుకొంటివి. ముసలమ్మమీఁద నెంతో యభిమానము. ఎక్కడున్నానో యని వెదకికొనివచ్చినా కిపూట సాయము జేసితివి. రేపు శుద్ధిస్నానము చేసి మాయింట పట్టెడుమెతుకు దిని వెళ్ళు నాయనా!" యనెను. "రేపు గ్రామములోనున్న పక్షమున నాలాగే చేసెదనులే. ఇదిగో బూరెలమూఁకుడు తీసికొని పోవుచున్నాను వెంటనే వచ్చెద" నని చెప్పి యా బూరెలమూఁకుడు చెఱువుగట్టునకుఁ దీసికొనిపోయి పాలుగోరుచున్న మిత్రుల కీమాటచెప్పక రావిచెట్టుక్రిందఁ జెట్టుకొని రొట్టెరవంతయు మిగులకుండఁ దిని నీళ్లుద్రాగి గట్టున త్రేన్చి యామూఁకుడు తానే తోమి కడిగి యవ్వకప్పగించి కుక్క ముట్టుకొన్న చోట గోమయముతో నలికి శుద్ధిచేసి ముసలమ్మను వీడ్కొని వెన్నెలరాత్రి యగుటచేతను రెండుగడియల ప్రొద్దుకంటె నెక్కుడు కాకపోవుట చేతను నిర్భయముగా మిత్రు లున్నచోటికి వెళ్ళి పండుకొనియెను.

మరునాడు తెలతెలవాఱుచుండఁగా భోక్తలు పండుకొన్న చోటి కొకబ్రాహ్మణుఁడు వచ్చి గణపతిని లేపి యజమానుఁడు పిలుచుచున్నాఁడని చెప్పెను. గణపతి కన్నులు నులుముకొనుచులేచి తనమిత్రులం జూచి "ఓరీ! కోటుగుడ్డలు వచ్చినవి కాఁబోలు. అందుకే నానిమిత్తమై యాయన వర్తమాన మంపించినారు. నేను వెళ్ళి యిప్పుడే వచ్చెదను. మీ రిక్క డుండుఁడి." యని చెప్పి

యాతనివెంట నడుచుచు "ఏమయ్యా! ఎందుకు నాకోసము వర్త మాని మంపించినారు? గుడ్డలు తెప్పించినారా యేమిటి? మంచి వేనా గుడ్డలు? చాలాలగుడ్డలు వచ్చినావా? చాలా త్వరగాఁ దెచ్చినారేగుడ్డలు." అని గుడ్డలవిషయమై తనకుఁ గల యాత్రిముఁ దెలుపఁజొచ్చెను. తోడుకొనిపోవుచున్న బ్రాహ్మణుఁడు వాని మాటలు విని తనలోఁ దాను నవ్వుకొనుచు "ఎందుకు వర్తమాన మంపించినారో నే నెఱుఁగను. మంచిమంచిగుడ్డలు వచ్చినవని చెప్పి కొన్నారు. అందులో మీకు మిక్కిలి ప్రశస్తమైనబహుమానము చేయఁదలఁచుకొన్నారని విన్నాను." అని చమత్కారముగాఁ బ్రత్యుత్తరము జెప్పెను. అప్పుడు గణపతిమన స్సెట్లున్నదో వర్ణింపఁ దరమా? యజమానుఁడు తాను కోరినగుడ్డ లిచ్చినట్లు తా నది జంగముచేతి కిచ్చి కట్టించుకొనినట్లు, తొడుగుకొన్నట్లు షికారుచేసి నట్లు గూడ నతని కప్పుడే తోఁచెను. ఏజంగముచేతి కిచ్చి కోటు కుట్టింతునా యని యాలోచింపఁ దొడంగెను. స్వగ్రామమం దున్న కుట్టుపనివాండ్రి పల్లెటూరివాం డ్రిగుటచే కత్తిరింపులు సరిగా జేయలేరనియుఁ, గుట్టు నాజూకుగా నుండదనియుఁ దలఁచి యాగుడ్డ బట్టుకొని రాజమహేంద్రవరము వెళ్ళి యచ్చట మిక్కిలి సొగ సుగాఁ గుట్టఁగల జంగముచేతికిచ్చి కుట్టించుట మంచిదని నిశ్చ యించుకొనెను. తక్కినశాస్త్రభోక్తలవలెఁ దాను సైనుగుడ్డనుపుచ్చు కొనక తోడిబ్రహ్మచారులచేత గట్టికట్టు కట్టించి తనకోరికె ప్రకారము కోటుగుడ్డలే పుచ్చుకొనఁ గలిగినందుకుఁ దనపంతము నెగ్గించుకొన్నందుకు మిక్కిలి సంతోషించుచు గణపతి యతనివెంటఁ బోయెను. ఆబ్రాహ్మణుఁ డతనిని యజమానునియింటిలో మిక్కిలి లోపలి గదిలోనికిఁ దీసికొనిపోయెను. యజమానుఁడు మంచము మీఁదఁగూర్చుండెను. ఆయనయొద్ద మెరియలవంటి వంటబ్రాహ్మణు

లిద్దఱు నిలిచియుండిరి. గణపతి రాఁగానె యజమానుఁ డతనిని జూచి "ఏమయ్యా! కోటుగుడ్డలు రాలేదు. సైనుగుడ్డలు తీసికొందువా లేదా" యని యడిగెను. 'నాకు సైనుగుడ్డ లక్కఱలే' దని కోపమును గ్రిక్కుమొగముతో నిట్లు ప్రత్యుత్తర మిచ్చెను. "అట్లయిన నీవిప్పు డేమి చేసెదవు? చేతులు నలుపుకొనుచు వెళ్ళిపోవు" యని యజమానుఁడు పలికెను. "అబ్బ! చేతులు నలుపుకొనుచు వెళ్లిపోవలెనే? ఈమాత్రపుదానికి మమ్మెందు కావవలెను! తప్పక యిచ్చెద నని చెప్పి శ్రాద్ధము సరిగా జరిపించుకొని యేఱు దాటి తెప్ప తగులవైచిన ట్లవసరము తీరినపిదప చేతులు నలుపుకొనుచు వెళ్లుమందురా? సరే! యీమాటు అవసరము దాటినదిగదా యని మీరు సంతోషించుచున్నారుగాబోలు! ఇంతటితో నైపోయినదా? ఈవేళ కాకపోతే రేపైనా తిరిగి అవసరము రాదా? మీరు చావరా? మీబందుగులు చావరా? అప్పుడు భోక్తలతో నవసరముండదా! అప్పుడే మీపని చెప్పఁగలను. తొందర పడకండి. ఇల్లలుకగానే పండుగ కాలేదు. తొందర పడకండి! తద్దినపుమంత్రము జెప్పెడువాండ్రితోను భోక్తలతో నవసరము లేనివాఁడు లోకములో లేఁడుగదా' యని గణపతి క్రోధావేశంబున నౌచిత్య మెఱుఁగక నోటికి వచ్చినట్లు బ్రసంగించెను. యజమానునిమనసులో నదివఱకే రవులుచున్న కోపాగ్ని నాపలుకులు మండించెను. కోపాగ్ని ప్రజ్వరిల్లుటయు యజమానుఁడు 'ఊరకున్నా రేమిరా!' యని ప్రక్కనిలిచిన వంటవాండ్రితో ననియెను. అనుటయు నావంటవాండ్రిరువురు గణపతిని బట్టికొని కొల్లాయిగుడ్డతో నతనిని పందిరిపట్టెమంచపుకోటికిఁ గట్టివైచిరి. యజమానుఁడు క్రొత్తగాఁ జెట్టునుండి కోసి తెచ్చినపొడుగుపాటి యీతజువ్వ తీసికొని 'భడవా! తుంటరివెధవా! శ్రాద్ధబ్రాహ్మణార్థములు చేసి పదిమంది నాశ్రి

యించి బ్రిదుకవలసినకుంకవు, నాలుగుకొల్లాయిగుడ్డలు కట్టుకొని కాలక్షేపము చేయవలసిన చచ్చుపీనుఁగవు, నీకు కోటులు నీటులు కావలెనా! పోకిరీవేషములు వేయఁదలఁచి భోక్తగాఁ గూర్చుండి యర్పించినతరువాత గొంతెమ్మకోరికలు కోరి శ్రాద్ధము భంగము చేయుదువా? ముం దెన్నఁడైన నిటువంటిపనులు చేయవుగదా!' యని యాజువ్వతో పీఫుమీఁద రెండు దెబ్బలు కొట్టెను. పాపము గణపతి "స్థానబలిమి గాని తనబలిమి గాదయా విశ్వదాభిరామ వినర వేమా" యనినట్లు గణపతి పూర్వపుబింక మంతయు వదలి "బాబోయి! బాబోయి! యికముం దెన్నఁడు చేయనండి! రక్షించండి! బుద్ధితక్కువొచ్చింది నావల్ల" యని యేడ్చుచు వేడు కొనెను. వైదికబ్రాహ్మణుని—అందులోఁ దనయింటికి శ్రాద్ధభోక్త గావచ్చి యున్నవానిని—నంతకంటె నెక్కువగా శిక్షింపఁగూడ దని యాగెండుదెబ్బలతోనే శిక్షచాలించి కట్లు విప్పించి యిట్లనియె. "జాగ్రత్త! బుద్ధిగల్గి బ్రతుకు. మనదేశములో బ్రాహ్మణు లంటే మిక్కిలి భక్తిగనుక బ్రాహ్మణుఁ డేమి చేసినను జెల్లు ననుకొంటివి కాఁబోలు! భోజనము దగ్గఱ నీ వాగడము చేయుటయేగాక మీరు చావరా మీ బందుగులు చావరా యని మొదలు పెట్టితివి. ఈలాగున మఱియొకసారి ప్రేలితివా త్రివ్వి పాతిపెట్టించెదను. చర్మ మొలిపించెదను. నీఋణము నే నుంచుకొనఁ దలఁపలేదు. ఒక్కొక్కభోక్తకు రెండేసిసైనుగుడ్డలు మే మీయఁ దలఁచుకొ న్నాము. నీకు నీజట్టుపిల్లలకు రావలసిన సైనుగుడ్డ లివిగో! ఇవి మూట గట్టుకొని తీసికొని పోయి వారి కిచ్చి తిన్నగా నీదారిని పో యని గుడ్డలమూటఁ జూపెను. గణపతి కిక్కురుమనకుండ నెంతో బుద్ధిమంతుఁడై యామూట పట్టుకొని కన్నులనీ రచ్చటనే తుడిచికొని తనమిత్రులున్నచోటి కరిగెను. గణపతి మిక్కిలి సొగ

సైనగుడ్డలు తెచ్చు ననుకొని వాటినిఁ జూడ వలయునని మిత్రు లెంతో ముచ్చటపడుచు వానియాగమనమునకు నిరీక్షించుచుండిరి. అంతలో గణపతి గుడ్డలమూట తీసికొని వెళ్లుటయు మూటలో నున్నవి ముద్దినుసుకోటుగుడ్డ లనుకొని పండ్లగంపచుట్టు పిల్లలు మూఁగినట్లు వారాతనిచుట్టు మూఁగి మూట క్రిందకుదిగలాగి విప్పి చూచి విస్మితులై "ఇదేమిరా గణపతీ! చిట్టచివరకు సైనుగుడ్డలే పట్టుకొని వచ్చినావు. వ్రతము చెడినను ఫలము దక్కవలయును గదా! మనము రెండువిధముల భ్రష్టుల మైతిమి. నలుగురితో మనకు గూడ నీగుడ్డలే యిచ్చినప్పుడు పుచ్చుకొనక తెగనీల్గితిమి. కోటు గుడ్డలు కావలె నని గోల చేసితిమి. ఇప్పు డా సైనుగుడ్డలే రహస్యముగాఁ బుచ్చుకొనుచుంటిమి. మాచేత నీవు కట్టుగట్టించి మమ్మల్గరిపాలు చేయుటకా యీగొడవ. నిన్ను నమ్ముకొనుట కుక్కతోఁక పట్టుకొని గోదావ రీఁదుట. ఇటువంటిపని యేలచేసితివి? ఈగుడ్డలు పుచ్చుకొమ్మని నీతో మేము చెప్పితిమా? మాయిష్టము లేకుండ నీ వేల తేవలెను" అని యిష్టము వచ్చిన ట్లతనిని మందలించిరి. కారణ మేదో చెప్పకపోయినపక్షమున వారు సంతుష్టి చెందరు. గావున గణపతి నిమేష మాలోచించి వారి మనస్సులు తృప్తి పొందించుటకై యిట్లుచెప్పెను. "ఓరీ! వెఱ్ఱికుంకలారా! దండుగు బేరములో దిగుటకు నే నంత పిచ్చివాఁడనా? దీని కొక కారణ మున్నది. చెప్పెదను వినుండు. పాప మాయజమానుఁడు మిక్కిలిమంచివాఁడు. కాని డబ్బు లేదఁట! యింటిడాబు వాఁకిలిడాబే గాని డబ్బు లేదఁట. సంసారము మేడిపండువాటముగా నున్నదఁట. ఆయన నన్ను రప్పించిన పని నేమనుకొన్నారు? పాపము! సంపన్నగృహస్థుఁడు నన్ను బిలిపించి నా రెండుచేతులు బట్టుకొని నాయనా! గణపతీ! యివి చేతులుగావు కాళ్ళనుమీ. నాపరువు కాపాడవలెను.

నేను వట్టి వ్యర్థుఁడను. ఋణములపాలై యున్నాను. ప్రస్తుతము కోటిగుడ్డలు నీ కియ్యలేను. ఇప్పటికీ సైరుగుడ్డలు పుచ్చుకొని సంతోషించవలసినది. మీస్నేహితులు నీవు చెప్పినట్లు నమచుకొందురు. నీకున్నపలుకుబడి నిజముగా మహారాజుకైన లేదు. నీ స్నేహితులతో మాట్లాడి వారి నొడఁబరిచి నన్నొకదరికిఁ జేర్పవలెనని వేఁడుకొనుచున్నాఁడురా! అంతవాఁడు నాచేతులు పట్టుకొని ఎంతో వినయముతో వేఁడుకోఁగానే నామనసు కరిగిపోయినది. నేను రెండవ మాట చెప్పలేక పోయినాను. మీచేత తిట్టుపడినను సరేకాని యాయనకోరికప్రకారము చేయవలెనని యీమాట బట్టుకొని వచ్చినాను. మీయిష్టము వచ్చినట్లు చేయండి. మీరు తిట్టినను సరే కొట్టినను సరే నాకిష్టమే. నేను స్వలాభము చూచుకొనలేదు. ఆ బ్రాహ్మణున కుపకారము చేయవలయునని యిట్లు చేసినాను" అని సత్యమును గప్పిపుచ్చి తనపరాభవము వారికిఁ దెలియకుండ మాటు చేసి యిచ్చవచ్చిన తెఱఁగున దంభములు కొట్టెను. వారు యథార్థస్థితి నెఱుఁగరు కావున నిది సత్యమని నమ్మిరి. అంత దీనముగా బతిమాలుకొన్నప్పుడు మన మొప్పుకోవలసినదే యని కొంద అనిరి. అంతచేతగానివాఁడు మొదట మనము కోరిన కోరికల దీర్చెదనని యేల ప్రతిజ్ఞలు కొట్టవలె నని కొంద అనిరి. శ్రాద్ధము చెడిపోవు నని యాప్రకారము చేసె నని మఱికొంద అనిరి. "ఇంతకు మనయదృష్టములు బాగుగ లేవు. మనము కోటు తొడిగికొనునట్టి యోగము మనకుఁ బట్టలేదు. మన మొగముల కటువంటిభాగ్యము గూడనా" యని యొకఁ డనెను. "తొందరపడకండి! ఆభాగ్యము నేఁడు పట్టకపోయిన మఱియొకనాఁడు పట్టదా" యని గణపతి పలికెను.

ప్రథమభాగము సమాప్తము.



గణపతి

ద్వితీయ భాగము

గణపతి

ద్వితీయభాగము.

మొదటిప్రకరణము.

గణపతిమేనమామభార్య గర్భముఁ దాల్చెను. ఆమెకు నెల మసలినదిమొదలుకొని గణపతితల్లికి మనస్సులో నెన్నెన్నో కోరికలుదయించెను. ఆమె కడుపున నాడుపిల్ల పుట్టవలయు నని యామె యిష్టదైవముల వేయువిధముల వేఁడుకొనుచుండెను. ఇల్లు వాకిలి లేక మడులు మాన్యములు లేక విద్యాబుద్ధులు లేక రూపము లేకయున్న తనకుమామునకుఁ బిల్లనిచ్చి వాని నొకయింటివానిని జేయుటకు లోకములో మేనమామతప్ప మఱియెవ్వరు లేరని యామె యూహించి స్వలాభపరాయణమై యట్టికోరికలఁ గోరఁ జొచ్చెను. ఈమెమనోబలమెట్టిదో కాని యామె కాఁడుబిడ్డయే కలిగెను. బిడ్డ పుట్టఁగానే నాకు కోడలు పుట్టినది, కోడలు పుట్టినది! యనియామె యఱచి యానందాతిశయమున గంతులు వైచెను. పురిటాలిం జూడవచ్చిన యమ్మలక్కలందఱు గణపతికిఁ బెండ్లాముపుట్టినదని సంతోషించిరి. ఆమాట చెవినిఁబడినప్పుడెల్ల గణపతిమేనమామ మొగము చిట్లించుకొని "అయ్యో! నాకూఁతురు నీనిర్భాగ్యునకొయిచ్చి పెండ్లిచేయునది!" యని తనలో ననుకొనుచుండును. పురుడు సుఖముగా వెళ్ళిపోయెను. గణపతి తల్లికి సోదరునిభార్యమీఁదను నామెబిడ్డమీఁదను మునుపెన్నఁడులేని

మహానురాగము నెలకొనెను. బాలెంతరాలిని మంచముమీఁదనుండి దిగనీయక పథ్యపానములు జాగ్రత్తతోఁ జేసిపెట్టుచు బిడ్డకు నీళ్ళుపోయుట మొదలగు సంగరక్షలు తానే స్వయముగాఁ జేయుచుండును. బిడ్డ కాఱుమాసములు గడిచెను. అన్నప్రాశన మయ్యెను. విద్దెములు చేయఁజొచ్చెను. అత్త తాత యనుమాటలు వచ్చెను. తనకు భార్య జనియించినదనుసంతోషము మనంబునఁ గలుగుచుండిననుగణపతికిప్పుడొక క్రొత్తచిక్కు సంభవించెను. అతఁడు సంగడికాండ్రితో యథేచ్ఛముగఁ దిరుగకుండఁ దఱుచుగాఁ దనతల్లికి మేనత్తకుఁ బనితొందరలు గలిగినప్పుడు బిడ్డ నెత్తికొని యాడించవలసినపని లతని మీఁదఁ బడెను. ఇది యతని కెంతో విసుగు బుట్టించుపనియయ్యెను. బాలికను వివాహమాడవలె ననుసంకల్పము గణపతికిఁ గలదుగాని యామె నెత్తుకొని యాడించి తనపనులను జెఱుపుకొనుట కెంతమాత్ర మిష్టము లేకపోయెను. ఎంతెంతయుద్యోగములు చేయువారికైనను దీరిక లుండునుగాని యేయుద్యోగములేని గణపతికి నిమేషకాలమైనను దీరికలేదు. ఒకవేళ నింటికడ నతఁ డుండవలసి వచ్చెనేని నట్టి కాలము వ్యర్థముకాకుండ నతఁడు గాఢనిద్ర పోవుచుండును. ఈబిడ్డ వలన నతనికిఁ నిద్రాభంగము మొదలగునవి కలుగఁజొచ్చెను. అవి యతఁడు సహింపలేక యావిషయమై గట్టిగనాలోచించి యొకయుపాయము పన్నెను. బిడ్డనెత్తుకొమ్మని మేనత్తగాని మేనమామగాని తనచేతికిచ్చి వెళ్ళఁగానే యొక్కనిముస మెత్తికొన్నట్లె యుండి మెల్లమెల్లఁగా గిల్లనారంభించును. గిల్లినతోడనే బాలిక గుక్కపెట్టి యేడ్చుట సహజముకదా! అంత గుక్కపెట్టి యేల యేడ్చుచున్న దని మేనత్త యో మేనమామ యో పరువెత్తుకొనివచ్చి యడిగినప్పుడు గణపతి నవ్వుచు "నేనేమి చేయఁగలను! అది నాదగ్గఱనుండదు. నామొగముచూడగానే యేడ్చుచుండు"ననియుత్తరముచెప్పుచుండును. నోరు

లేనిపిల్ల కావుఁ దనకతనివల్లనే బాధకలిగిన దని యాశిశువు చెప్పఁ జాలనందున గణపతి యాతంత్రము కార్యసాధన మని పలుమాఱుఁ బ్రయోగింపఁజొచ్చెను. ఈప్రయోగమువలన బాలిక గణపతిని జూడఁగానే పెద్దపెట్టున నేడ్వ నారంభించెను. "చూచినారా! అది నన్ను జూడఁగానే యేడ్చుచున్నది. నామాట మీరు నమ్మరు." అని గణపతి మేనమామతో మేనత్తతోననుచుండును. ఒకటిరెండుసారులు బాలిక మే నెఱ్ఱఁగా గందియుండుటఁ జూచి మేనత్త. "ఏమోయీ గణపతీ! దీనికాలిమీఁద నెఱ్ఱగా కందినదేమి? వీపుమీఁద నెత్తురు గ్రిమ్ముచున్నట్లున్నదేమి?" యని యడిగెను. "కండచీమలు కుట్టినవి కాఁబోలు" ననియతఁడుబదులుచెప్పెను. "నీచంకనుండగా కండచీమ లేలాగున వచ్చికుట్టినవోయి?" యని యామె మఱల నడుగ "సరి సరి! బాగున్నదిలే కండచీమలు కుట్టకపోతే నేనుగిల్లినాననుకొన్నావా రక్కినాననుకొన్నావా? ఎత్తుకొనియాడించినందు కేవో యక్షింతల గింజలు నాలుగు నానెత్తిని వైవదలఁచుకొన్నావా యేమి?" యని పెద్దగొంతుకతో నఱచి బదులుచెప్పెను. అనవసర కలహము సంభవించునని వానితో వాదింపక లోనికిఁ బోయెను. తెనాలి రామకృష్ణునిపిల్లి పాలు జూడఁగనే పాఱిపోయినట్లు గణపతిమొగముజూడఁగానే బాలిక పెడమొగము పెట్టుకొని యతనికడకుఁ బోవుటయే మానెను. గణపతి కృతార్థుఁడయ్యెను. బిడ్డ యెంతగుక్కపెట్టియేడ్చుచున్నను మేనత్తగాని మేనమామగాని దాని నెత్తుకొమ్మని మేనల్లునితో ననుట మానిరి. గణపతి బిడ్డనుగిల్లినట్లో యేదో బాధపెట్టినట్లో యనుమానపడి మేనత్త సూదిపోటుమాట లనుచుండ గణపతి తల్లి యని సహింపక యిట్లనుచుండును. "మాయబ్బాయి పిల్లను కొట్టినాఁడో తిట్టినాఁడో యని నీ కనుమానమున్నది కాఁబోలు! వాఁడా లాటివాఁడుకాఁడు. వాఁ డెత్తికొనుట దీని కిష్టము లేదు. ఎందుచేత

నంటే దానికి సిగ్గు. మావాఁడు దాని మగఁడు గనుక మగఁ డెత్తి కొనియాడించుట దాని కిష్టములేదు. చిన్నపిల్ల కేమిసిగ్గని మీరను కోవద్దు. దేవుఁడు వారి నిద్దఱిని మగఁడు పెండ్లాములుగా నేర్పాటు చేసినప్పుడు సిగ్గు దానంతటదే లోపలినుండి బయలుదేఱును. లేనిపోని పాపముమాట లాడుకోవద్దు. నీ కేమోగాని మా యబ్బాయిమీఁద లేనిపోనికోప ముకలిగినది. మేనమామ పిల్లనిచ్చి మాయబ్బాయినొక యింటివానిఁ జేయఁదలచుకొన్నాఁడని తెలిసి పిల్లను వాని కియ్య కుండఁ జేయవలెనని నీవీపన్నాగముపన్నుచున్నావు. ఈలాటిబుద్ధులు నీకు కూడవు. నీకు గిట్టకపోతే గిట్టనట్టెయుందువుగాని యిటువంటి లేనిపోని నిందలు వేయకమ్మ."

ఇట్టి మాటలచేత మనస్సులోనున్న కోపాగ్ని రగిలి మండక మానునా? ఈబిడ్డనూలమున వారికిఁ దఱచుగా కలహములు సంభ వించుచువచ్చెను. ఆతగవులు తీర్చలేక గృహయజమానుఁడు విసిగి కొనిమొత్తుకొని యన్నము తినక పస్తుండి తన్నుదిట్టికొని యొకప్పుడు భార్యనుగొట్టి రెండుమూఁడుదినములింటికి రాకయుండును. పిమ్మటఁ గ్రమక్రమముగా వారికి సఖ్యత గలుగుచుండును. గణపతిమేనమామ నేమియు ననజాలకపోయినను దఱుచుగా మేనత్తను మేనమామ లేనప్పుడు సూదిపోటుమాటలని నొప్పించుచుండును. ఇట్లుండ శివ రాత్రికి మేనమామ కోటిపల్లె తీర్థమున కేగ సమకట్టెను. గణపతి తల్లియుఁ దన్ను వెంటఁబెట్టుకొనిపొమ్మని సోదరుని వేఁడుకొనెను. ఆవేఁడుకోలు నంగీకరించి యతఁడామెం దోడ్కొని కోటిపల్లెకు వెళ్ళెను. ఇంటియొద్ద భార్యను బిడ్డను నిలిపి వారికి సహాయముగాన నింటనే పండుకొమ్మని గణపతితోఁ జెప్పి యెన్నోబుద్ధులుచెప్పి మే మామ చనియెనుగాని యా బుద్ధులు మేనల్లునికుడిచెవిలోఁబడి క్షణ మాత్రమైన మనసులో నిలువక యెడమచెవిలోనుండి యావలకు

బోయెను. ఒక్కనాఁడైన వేళ కతఁడు భోజనమునకు రాలేదు. ఒక్క రాత్రియైన నింటఁ బండుకొనలేదు. అట్లు రెండుదినములు చేసిన తరువాత మేనత్త గణపతిం బిలిచి "యేమోయి! సరిగా వేళకు భోజనమునకు రావు. చిన్నపిల్లను పెట్టుకొనినేనింటనొక్క రనుపండుకొనఁజాలకున్నాను." అని మందలించెను. మునుపే మేనత్తపై ద్వేషభావమూనియున్న యాతనిమనస్సున కాపలుకులు ముంచుకులవలె నాటి నొప్పి కలిగించెను. ద్వేషము ద్విగుణమయ్యెను. అంతమాటతన్నామె యన్నందుకు మరల నామె కేదైన పరాభవము జేయవలె నని సంకల్పము కలిగెను. ఆవిషయమై కొంతసే పతఁ డాలోచింపఁ జొచ్చెను. ఉపాయము పొడకట్టెను. ఆయుపాయము భోజనసమయ మందతఁడుపయోగింపఁదలఁచెను. మధ్యాహ్నముభోజనమునకు గణపతికి మేనత్త విస్తరినిండ నన్నమువడ్డించెను. ఉపాయప్రయోగమునకదే సమయ మని గణపతి చివాలున పీటమీఁదనుండి లేచి విసవిస నడిచి వీథిలోనికిఁ బోయి దారిం జనుచున్న యొకబ్రాహ్మణునిబిలిచి లోనికిం దోడ్కొనిపోయి "అయ్యా! చూడండి ఈబిడ నామేనత్త. ఎంతన్నము పెట్టినదో చూడండీ! నేను కుఱ్ఱవాఁడను కదా! అమ్మవారికికుంభముపోసినట్లువిస్తరినిండ రాసెడన్నముపెట్టినది. ఇంతన్నము నేను తినఁగలనా? ఇదినామీఁద గిట్టక చేసినపనికాని ప్రేమచేత చేసిన పనియా? అన్నముతినలేక పాఱవైచినపక్షమున తిన్నంతతిని పాఱవైచినంతపాఱవైచె నని నాన్నెత్తిమీఁద లేని పోని నిందలు వేయుటకును పెట్టినయన్నము దిగబెట్టుట మంచిదికాదని యేలాగో యొకలాగు తిన్నపక్షమున మామేనల్లుఁడు పూటకు తవ్వెడుబియ్యపన్నము లకోటాకు మెతుకులేకుండ తినునని వాడుకలువైచుటకును యీమె నీపని చేయుచున్నది. ప్రతిదిన మీలాగుననే జరుగుచున్నది. ఒకసారి మీవంటి పెద్దల కీచిత్రము చూపించినపక్షమున బాగుండు నని నేను

మిమ్ము దీసికొనివచ్చితిని. నేనుమాత్రము అమ్మవారినా, పోతురాజు నా? నాదిమాత్రము కడుపుగాక మడుగా యేమిటి?" యని యా యన్నముఁ జూపెను.

సాక్షిగా వచ్చిన బ్రాహ్మణుఁ డాయిల్లాలిం జూచి "అమ్మా! యితఁడు పదునెనిమిదిసంవత్సరములలోపుపిల్లవాఁడు కదా! అంత యన్నము తినఁగలడనే మీరుపెట్టినారా, లేక పొరబాటుచేత పెట్టినారా? కొంచెమన్నమే మొదట వడ్డించి కావలసినపక్షమున మరల మీరు వడ్డింపరాదా? రెండుసారులు తిరుగుట తప్పిదమా? పాప మాకుఱ్ఱవాఁడు మీరు పెట్టిన యన్నపుపోగుచూచి యడలిపోయి నాఁడు. ఇదెంతమాత్రము బాగులేదు. మీపెనిమిటిమాత్రి మిటు వంటిపని కొప్పుకొనునా" యని మందలించెను. అనవుడు బ్రాహ్మణుని కామె తలుపుచాటున నొదిగి యుండి మెల్లగా నిట్లనియె. "అయ్యా! మీరెఱుఁగరుగాని మాగణపతి మామూలుగ తినగలంత యన్నమే నేను పెట్టినానుగాని యెక్కువ పెట్టలేదు. ఆతఁ డసంగతి మీకు తెలియదు. నామీఁద నేమో కోపమువచ్చి నలుగురిలో నన్ను రట్టుపెట్టుట కిట్టు చేయుచున్నాఁడుగని నేను జేసినతప్పులేదు. ఆ యబ్బాయిని కంటగించుటకు నేనీలాగ నలేదు. పోనీ నేనొకవేళ నిజముగా నన్నమెక్కువ పెట్టినా ననుకొన్నప్పటికి అత్తా! యన్న మెక్కువపెట్టినావు తియ్యమనరాదా. మేనమామ నాలుగురోజులు లేకపోగానే నన్నల్లరి పెట్టతలఁచినాఁడు." అనిపలుక నాబ్రాహ్మణుఁడు "ఓరీ! గణపతి! నీతల్లివచ్చువఱకు నీవెట్లో గడుపు కొమ్మని సలహాచెప్పి వెడలిపోయెను. గణపతి కోపావేశమున భోజనముచేయక యొకస్నేహితునియింటికిఁ బోయి యన్నము దినెను. మిత్రునియింటికి వెళ్ళినవాఁడు తల్లి వచ్చువఱ కచ్చటనే భుజియించునని మేనత్తయనుకొని రాత్రి యతనినిమిత్తమై బియ్యము

పోయలేదు. గణపతి రాత్రిభోజనమునకు సిద్ధ మయ్యెను. నీవురావ నుకొని నీకోసము బియ్యము పోయలేను. వండిపెట్టెద నుండు మని మేనత్త ప్రత్యుత్తరము జెప్పఁ జుట్టుప్రక్కలనున్న యామె వాండ్రి మగవాండ్రిఁ బిలిచి "చూచినారా, రెండు రోజులు మాయమ్మ గ్రామములో లేకపోఁగానే నాకీమె యన్నము పెట్టుట మానినది. వీళ్ళకొంపలో నేను పొట్టకూటి కున్నానని యాబిడయభి ప్రాయము కాఁబోలు! నే నన్నములేక మాడి చచ్చిపోవలసిన దేనా? ఈగ్రామములో నాకన్నముపెట్టువా రెవరు?" అని కళ్లబొళ్లి యేడ్పు లేడవఁజొచ్చెను. ఆయేడ్పు వినఁగానే చుట్టుప్రక్క లమ్మ లక్కలకు జాలిచేత మనస్సులు కరిగిపోయెను. "మాయింటికి రా నాయనా. పట్టెడన్నము మాలోపల తిను నాయనా" యని ముస లమ్మలు కొందఱనిరి. "నేనే వండిపెట్టెదనమ్మా, మీయింటి కెందుకు రావలె" నని గణపతిమేనత్త వారితోఁ బలికెను. అందులో నొక్క ముసలమ్మ గణపతింజూచి "నాయనా! మేనమామభార్య మేనత్త కాదు. పినతండ్రి పెండ్లాము పినతల్లికాదు. నీ సంరక్షణము నీతల్లికి విధాయకము గాని మేనత్త కేమివిధాయకమురా? ప్రేమచేత పేగు పెరపెర కోసికొనిపోవుచున్నదాయేమి? రా నాయనా. నీకెంతన్నము కావలె?నాలుగుమెతుకులు.నీవన్నముతినకుండయీరాత్రిపండుకున్నా వన్నమాట మీయమ్మవింటే గొల్లున యేడ్చి మొత్తుకొనును. లేక లేక వరప్రసాదిలాగు నొక్కడవు పుట్టినావు. నీమీఁద గంపెడాశ పెట్టుకొని ఆముండయున్నది. అన్నము తినక చచ్చిపోకు. మాయిం టికిరా" యని చేయిపట్టుకొని నాలుగడుగులు వెనుకకుఁ దీసికొని పోయెను. అదిచూచి మేనత్త కోపించి "నామేనల్లునిం దీసికొని పో వుటకు నీవెవతవు? అనుకొన్నప్పుడు నాల్గుమాట లనుకోఁగలము. లే నప్పుడు కలియఁగలము. మాకు మాకు విధాయకము "సత్తిరాజు

వారింటికి నీవెక్కడితోత్తు' వన్నట్లు నడుమ నీ వెవ్వరమ్మా! అన్న మీరాత్రి పెట్టఁగలవుగాని యెల్లకాలముపోషింపఁగలవా? మేనమామ పెళ్ళాము మేనత్త గాదని నోటికివచ్చినట్లన్నావు. నీ వాయబ్బాయికి మేనత్తవా తల్లివా పెత్తల్లివా యెవతెవని పిలిచినావు? చాలుచాలు నోరుమూసికో యని కఠినముగాఁ బలికెను. మాటమీఁద మాట వచ్చెను. మాటలు తిట్లుగా మారెను. బారలు చాపుకొని వారిద్ద రొండొరులను దూషించుకొనుచుఁ దల్లిదండ్రులను చుట్టాలను బ్రతికి యున్నవారిని చచ్చినవారిని నన్యోన్యమాతృపితృవంశముల నేమతర ములవారిని నిందించి దెప్పుకొని గొంతులు పోవున ట్లఱచి పోరాడి కలహమాడుట కోపికలేక లోపలికిఁ బోయిరి. గణపతి తనపక్షము వహించినముసలమ్మను వెనుకవైచికొని మేనత్తను నాలుగుమాట లని యెట్టకేల కారాత్రి ముసలమ్మ గృహమందే భుజించి పండుకొనెను. గణపతి మరునాఁడుకూడ ముసలమ్మయింటనే భోజనము చేయఁదలఁ చెను గాని గణపతిభోజనమువైఖరి రాత్రి చూచినతరువాత ముస లమ్మ గుండెబాదుకొని యటమీఁద వానినెట్లయినవదలించుకొనవలె నని తలంచి యుదయముననే గణపతిం జేరఁబిలిచి "నాయనా! ఈ పూట వెళ్ళి నాకు బియ్యముపోయవలసిన దని చెప్పు. పోయనంటే మాయింటియొద్ద తినవచ్చును. ఎందుకు పెట్టదో చూడవలె. దీని బాబుగారిముల్లె తెచ్చిపెట్టుచున్నదా యేమి? నీమేనమామ సొమ్మే కాదా నీకు పెట్టుచున్నది. వెళ్ళి చెప్పిరా, యేమనునో చూత" మని మెల్లఁగా నుపదేశించెను. సరే యని చివాలున లేచి గణపతి యింటికిఁబోయి "ఇదిగోనమ్మా! యీపూట మనయింటికే భోజ నమునకు వత్తును. వంట చేయవలసినది." యని చెప్పెను. 'సరే' యని మేనత్త యూరకుండెను. ఆమాట ముసలమ్మతో మరల జెప్పెను. ముసలమ్మ తనకొంపలోనుండి గణపతి వెడలి పోయినం

దుకు మనస్సులో మిక్కిలి సంతోషించి ప్రేమ ముట్టిపడునట్లుఁ బైకిట్లనియె. 'ఓరీ! గణపతి! నీవు గుప్పెడన్నము మాయింట తిన్నంత మాత్రమున నాకు లోటు లేదు. నీయిష్టము. ఎక్కడతిన్నాసరె. నీయింటికి వెళ్ళుటకు నీకిష్టములేక పోయినపక్షమున మాయింటనే తిను. కాని, దానింటికి వెళ్లి దానిపొగ రణచవలె. రాఁగానె యీ సంగతులు మీయమ్మతో చెప్పి మీ మేనమామతో చెప్పి చావఁ గొట్టించు. ఒక్కమాటు జాతరై తేనేగాని బుద్ధి రాదు. పొగరెక్కియున్నది. కట్టుపొగరుబోతు. గిద్దెడుప్పు నేనుబదులుపుచ్చుకొన్నాను. ఇరువదిసార్లు తిరిగి నిలువబెట్టి పుచ్చుకొన్నది. ఉప్పుబదులు తీర్చక దీనిఋణమున నుండిపోదునా? దానిబుద్ధి యది చూపించుకొన్నది గాని, మీమామతో నేనుకూడ చెప్పి ధూపము వేయ తలఁచుకొన్నాను. నీవుకూడ గట్టిగా చెప్పు. మేనల్లుఁడంటే యింత గిట్టకపోనా? గిట్టనివాళ్ళున్నారు. అన్నము పెట్టనివా ళ్ళెక్కడ లేరు. దానిసాంప్రదాయ మేలాటిది? దానిబామ్మ పెనిమిటి కన్నముపెట్టక వెళ్ళకొట్టింది. ఆముసలివాఁడు హోరున నేడ్చి కాశీరామేశ్వరాలు వెళ్లి యెక్కడనో చనిపోయినాఁడు. ఇందుకే ఆఁడపిల్లను తెచ్చుకొనేటప్పుడు సాంప్రదాయాలుచూచి తెచ్చుకోవాలన్నారు. మనము తగినప్రాయశ్చిత్తము దీనికి చేయవలె. సరె నాయనా నేను మడికట్టకోవలె. నీవు వెళ్ళు. అన్నానికిమట్టు కిబ్బందిపడకు నాయనా! ఎప్పుడు లేకపోయినా నేనున్నాను.' అనిచెప్పి పంపెను.

గణపతి యిట్టట్టు దిరిగి రెండుజాము లగునప్పటికి స్వగృహమున కరిగి యన్నము పెట్టుమని మేనత్త నడిగెను. వెనుకటిదినమున నన్న మెక్కువ పెట్టినందుకు గొప్పయల్లరి చేసినాఁ డని మేనత్త యాదినమున గణపతికి విస్తరినిండఁ బెట్టక యన్నము కొంచెము తక్కువగాఁ బెట్టెను. అది చూచి గణపతి చివాలున పీటమీఁదనుండి

లేచి విసవిస వీధిలోనికి నడచిపోయి దారిని వెళ్ళుచున్న బంధువు నొక్కనిఁ బిలిచికొనిపోయి తనపిస్తరిలోనున్న యన్నముఁ జూపి "చిత్తగించినారా! యీదురన్యాయము. సరిగాఁ బెట్టక కడుపు మాడ్చి చంపుచున్నది. చూడండి! విస్తరిలో నాలుగుమెతుకులు పెట్టినది. ఈ నాలుగుమెతుకులతో నాయాకలి తీరునా? పట్టెడన్నము పట్టెడుకూర తినఁగలముండకొడుకునుగదా! ఈలాగున డొక్క మాడ్చి చంపవచ్చునా? నోరెత్తి మాటాడితేతంటా. ఎక్కువ పెట్టి నావేమంటే నాలుగు మెతుకులే పడవైచును. తక్కువపెట్టినా వేమంటే గ్రామదేవతకు కుంభము తోడినట్లు తోడును. ఇంతకు నాతల్లిముండ కోటిపల్లె వెళ్ళి కొంపతీసింది." అని చెప్ప వచ్చినచుట్ట మామె నుద్దేశించి యిట్లనియె "అమ్మాయి! అర్ధాన్నము పెట్టుట మహాదోష మని పెద్దలు చెప్పినారు. అలా గెప్పుడు చేయకమ్మా! కావలసిన దేదోపెట్టి మాటదక్కించుకో తల్లి వచ్చినదాక" యని "ఓరీగణపతి! నేనిక్కడనే కూర్చుందును. నీవన్నము తిను. కావల సిన దేమొ యామెవడ్డించకపోతే యామెనే చీవాట్లు పెట్టెదను." అని గణపతిని గూర్చుండఁబెట్టి తాను ప్రక్కనఁ గూర్చుండెను. గణ పతి మేనత్త యాచుట్టము నదివఱకె యెఱిఁగి యుండుటచేత జాటున దాగక యెట్టయెదుటికివచ్చి "అయ్యా! ఎగతీసిన గోహత్య దిగఁదీసిన బ్రహ్మహత్య, యన్న సామెతనిజమైనది. మామూలుగానతఁడు తినగలిగి నంత యన్నమే నేను నిన్న విస్తరిలో పెట్టినాను. అమ్మవారికి తోడి నట్లు కుంభము తోడినానని కోపపడి యెవరో బ్రాహ్మణునితీసుకొని వచ్చి కనుపఱిచి నన్నల్లరి పెట్టినాఁడు. కావలసినపక్షమున మారు పెట్టవచ్చునుగదా యని నే నీరోజున తక్కువయన్నము పెట్టినాను. నాలుగుమెతుకులే పెట్టి కడుపు మాడ్చఁదలఁచుకొన్నాఁ నని మిమ్ము తీసికొనివచ్చి గొడవపెట్టినాఁడు. ఇతనితో నేను వేఁగలేను. ఏదో

మనస్సులో పెట్టుకొని పూటపూట కీలాగున నానాబాధలు పెట్టు చున్నాఁడు. అన్న మెక్కువుంటే తీయమనవచ్చును. తక్కువుంటే పెట్ట మనవచ్చునుగాని వడ్డించినవి స్తరి వదలిపెట్టి వీధిలోనికి వెళ్ళి దారిని వచ్చువారినిఁ దీసికొనివచ్చి నన్ను రవ్వ పెట్ట వచ్చునా? నావల్ల తప్పుంటే మేనమామగారితో చెప్పి నన్ను శిక్షచేయించవచ్చు ను. తన తల్లితో చెప్పి చీవాట్లు పెట్టించవచ్చును. అంతేగాని పూట కూళ్ళదానిని దాసిదానిని యల్లరిచేసినట్లు ఈలా గల్లరి చేయవచ్చు నా?" అని కంటఁ దడివెట్టికొని గద్గదస్వరముతో మాటాడెను. అన వుడు బంధువుఁ డిట్లనియె. "అమ్మా! గృహకృత్యములలో నొకరు తగవుచెప్పుట కష్టము. అయిన దేమొ అయినది. ఆమాట మీరు తలఁచుకోవద్దు. ఈరాత్రియో రేపో అతనితల్లి వచ్చును. వచ్చిన తరువాత మఱేగొడవ లుండవు. చిన్నతనముచేత వాఁడుచేసిన తెలివి తక్కువపనులు పాటింపక సర్దుకోవచ్చును. సరె ప్రస్తుతము వానికి కావలసినవస్తువు లొడ్డించండి. అన్నము తిన్నదాకయుండి తరువాత నావెంట తీసికొనిపోదును." అనవుడు నామె మంచిదని కావలసిన వస్తువులు వడ్డించెను. గణపతి మారుమాటాడక భుజించి వెళ్ళిపోయె ను. గణపతి భోజనము చూచినతరువాత చుట్టము గణపతి తిండిపుష్టి గలవాఁ డనియు నతనికిఁ గొంచె మన్నముమాత్రమే పెట్టుట మే నత్త లోపమనియు గణపతిచేసినయల్లరికిఁ గొంతకారణము లేకపోలే దనియుఁ దలంచెను. గృహకలహములలోఁ బౌర్వాపర్యములు విచారింపక నొకపక్షముమాత్రమే వినువారి కిట్టి యభిప్రాయములు దోఁచుట యాశ్చర్యముగాదుగదా! ఆసాయంకాలము కోటిపల్లినుండి గణపతితల్లియు మేనమామయు వచ్చిరి. రాఁగానే గణపతి యాడిన విచిత్రనాటకవృత్తాంతమంతయు మేనత్త తనయాఁడుబిడ్డతోడనుభర్త తోడను బూసగుచ్చినట్లుచెప్పి తనకతఁడు గావించిన పరాభవమును

దలంచుకొని వలవల యేడ్చెను. ఆవిషయమున భార్య నిర్దోషురాలని భర్తమనంబునకు నచ్చెను. నచ్చుటయు గణపతినిఁ జూచినంతమాత్రమునను మిరింగివేయవలె నన్నంతకోప మాయనమనస్సులో నుదయించెను. కాని గణపతితల్లికిమాత్రము సోదరభార్యచెప్పిననేరములు తల కెక్కలేదు. ఆమె యేదో గొప్పయనాదరము చేసియుండఁబట్టి మిక్కిలి బుద్ధిమంతుఁడైన తనకొమారుఁ డిట్టిగొడవఁ జేసియుండునే గాని యూరక మేనత్తకు నిష్కారణపరాభవము గలిగింపఁడని యామె యభిప్రాయపడెను. అంతలో నంతకుముందు జరిగినగొడవలలో గణపతిపక్షమూనిన ముసలమ్మ తీర్థయాత్రలు చేసికొనివచ్చిన గణపతితల్లిం జూడవచ్చి కోటిపల్లివెళ్లి సోమేశ్వరస్వామివారిదర్శనముచేసి ధన్యులైనందు కామెను శ్లాఘించి చెవిచెంతఁజేరి మెల్లఁగా "నాతల్లి! నీవు లేని నాలుగురోజులలో మీవదినెగారు నాలుగుభాగవతములాడినది. అది యెంతకైన సాహసురాలే. నీకొడుకుకు సరిగా నొకపూటైన అన్నము పెట్టలేదు. నాలుగురోజులు నాలుగుయుగములైపోయినవి. అన్నము లేక బిడ్డ అడలిపోయినాఁడు. ఒకపూట మాయింటికి తీసికొని వెళ్లి పట్టెడన్నము పెట్టినాను. వాడివల్ల రవంతయైన దోషము లేదు. అది కొంపలుమాపఁగల కొఱవి. దాని మొగము చూచితే పంచమహాపాతకములు చుట్టుకొనును. నీకొడుకు చాలా మంచివాఁడు కనుక నాలుగురోజులు ఎంతో ఓపికపట్టి బాధలు పడినాఁడు. నాబోటిదానినైతే కొంపంటించి లేచిపోదును. నీబిడ్డను మాత్రము నీ వేమి తిట్టకు కొట్టకు" మనిచెప్పి వెళ్ళెను.

తానుపడినయభిప్రాయమే సరియైనదనియుఁ దనకుమారుఁడు నిర్దోషి యనియు నామె మరియు దృఢముగా నమ్మెను. మేనమామ గణపతిమీఁద మహానుగ్రహము కలిగి యిల్లెగిరిపోవునట్లు కేకలు వేయఁ జొచ్చెను. ఈవృత్తాంతము తనమిత్రునివలన విని

గణపతి యాపూట యింటికి రాక మున్ను దనపక్షముబూనిన ముస లమ్మయింటిలోఁ గూర్చుండి మేనమామయొక్క నరసింహావతార చేష్ట లన్నియుఁ గనిపెట్టుచుండెను. అతఁడిక్కడున్నవార్త యాము సలమ్మ తల్లి కెరుకఁజేయఁగా నామె వచ్చి కొడుకుం గౌఁగిలించు కొని గట్టిగా నేడ్చినపక్షమునఁ దనసోదరికి వినఁబడు నని శంకించి మెల్లగా నేడ్చెను. తల్లినిఁగౌఁగిలించుకొని కుమారుఁడుకూడనేడ్చెను. అన్యోన్యాలింగన పురస్సరముగా మాతాపుత్రులు కొంతసేపు రోదనము చేసినతరువాతఁ దల్లి కుమారున కిట్లనియె.

"నాయనా! నీ కెంతకష్టము వచ్చినదిరా. అన్నము లేక నీవెంత మలమల మాడిపోయినావో, నీ కెంతయాఁక లైనదో, ఆలాటప్పుడు నన్నుఁ దలఁచికొని నీ వెంతయేడ్చినావో నీవు ఆవగలాడి కొంచెమైన జాలిలేక పెనిమిటితో నీవడ్డమైనమాట లన్నా వని చెప్పినది. దానివలలోఁ బడిపోయి వాఁడు నిన్ను చంపివేయవలె నని యున్నాఁడు. నేనేమి చేతునురా తండ్రి" అనవుడు గణపతి తల్లి కిట్లనియె.

"అమ్మా! విచారించకు. నావల్ల లోపములేదు. మామయ్య పెండ్లాము చెప్పినమాటలు తథ్యముగా గ్రహించి నామీఁద గంతులు వేయుచున్నాఁడు. ఆడుదానిమాటలు విని నన్ను చావఁ గొట్టుటకు సిద్ధమగుచున్నాఁడు. అతని యింటిలో మన ముండవద్దు. ముష్టియెత్తియైన నిన్ను నేను పోషింపఁగలను. పోదాములే. "పెండ్లా ముబెల్లము, తల్లి దయ్య" మన్నట్టిసామెత నిజమయినది. ఇత నెంత, యితని యన్నమెంత, యితని యిల్లెంత? నూరుతిట్లుతిట్టి పట్టెడన్న ము పెట్టినంతమాత్రమున లాభమేమిటి? నాకా అన్నము వంట బట్టుటలేదు. రేపుదయము వెళ్లిపోదములే." అనవుడు నామె "నా యనా తొందరపడకు. మామయ్యతో మన కెన్నో పనులున్నవి.

ఆతనిదగ్గఱ పిల్ల ఉన్నది. పెండ్లాము కిష్టము లేకపోయినప్పటికి అతని నేలాగో మెడలు వంచి పిల్లను మనము చేసికొనవలెను. కోప పడకు. తమాయించుకో. నిదానించు. తొందరపడకు. కార్యము సాధించుకోవలెను గాని చెడదీసుకోఁగూడదు." అని మందలించెను.

సరేయని గణపతి యొప్పుకొని తల్లినిఁబంపి తానొకటిరెండు దినములక్కడక్కడ భోజనముచేసి తరువాత మేనమామ లేనప్పుడు చాటుగాఁబోయి తినుచుఁ బిమ్మట మెల్లమెల్లగ మేనమామకంటఁ బడుచు నెప్పటియట్ల నుండెను. మేనమామయుఁ గ్రమక్రమముగఁ గోపపువేఁడి చల్లనగుటచే గణపతి నూరకుండెను.

రెండవ ప్రకరణము.

తోఁబుట్టువు మేనల్లుఁడు దనగృహమునందె యుండుటచేత నాదాయముకంటె వ్యయ మెక్కువై నాగన్నకు నలువదివఱా లప్పయ్యెను. మేనల్లుఁడైన గణపతి కుటుంబమునకుఁ జేయునట్టిది కలహాదాయమేగాని యన్యములేదు. ఋణప్రదాతలు నాగన్నను ఋణము దీర్చుమని పలుమారులు వేధింపఁ జొచ్చిరి. అప్పు వడ్డితో నేబదివఱా లయ్యెను. ఈఋణము దీర్చునట్టి యుపాయము నాగన్నకుఁ గనఁబడదయ్యెను. ఒకనాఁటిసాయంకాల మప్పులవాఁడు వ్యాజ్యము వేయుదు నని మిక్కిల తొందర సేయ నాగన్న విషాదభరితమనస్కుఁడై సరిగా భోజనము చేయక మంచముమీఁదఁ బండుకొని యుండ గంగమ్మ భర్తయవస్థఁజూచి ఋణవిమోచనమున కుపాయముఁ జెప్పఁదలంచి యిట్లనియె.

"ఈలాగున బెంగబెట్టుకొని అన్నము తినక నిద్రపోక విచార పడినంత మాత్రాన ఋణము దీరునా? దీనికి నాకొక్క యుపాయము తోచినది. అది చెప్పుచున్నాను వినండి. నాయుపాయము మంచిదైతే నేచెప్పినట్లు చేయండి, లేకపోతే మానండి. మాపినతల్లి కొడుకు రాయప్పను మీరెరుగుదురుకదా! మన బుచ్చి పుట్టింది మొదలుకొని వాఁడు దానిని తన కిమ్మని నన్నడుగుచున్నాఁడు. ఆమధ్య వాడిక్కడికి వచ్చినప్పుడు ఓసీ! గంగమ్మా మీబుచ్చిని నాకిచ్చిపెండ్లిచేసి నాబ్రహ్మచర్యము వదల్పవే నావంశము నిలిపిన దాన వగుదువు" అని యెన్నో విధముల బతిమాలినాఁడు. వాఁడు పునహా వెళ్ళి ఐదారువందల రూపాయలు సంపాదించుకొని వచ్చి నాఁడు. ముసలివాఁడు కాఁడు. ముక్కవాఁడుకాడు. నోటికిచేతికియెం గిలిలేనిసంబంధము. మనకు చేలోకువైనవాఁడు. మనబుచ్చిని వాడి కిచ్చి పెండ్లిచేసినపక్షమున మనఋణము దీరిపోవును. నాలుగేండ్లు పిల్లగనుక నాలుగువందలు వాఁ డివ్వఁగలఁడు. ఒకవందరూపాయలు వస్తువులుకూడ పెట్టుమని నేను చెప్పి పెట్టించగలను. ముప్పదేండ్లు కంటె యెక్కువ లేవు. కాలు నొచ్చినా కడుపు నొచ్చినా కాకి చేతవర్తమాన మంపితే రెక్కలు కట్టుకొనివచ్చి వాఁ డిక్కడవాలి మనపని చేసి వెళ్ళిపోవును. మానాయనకూడ మనపిల్లను రాయ ప్పకే యిమ్మని రెండుమూడుసారులు నాతో చెప్పినాఁడు. మాయమ్మ సరేసరి నూరుసారులు చెప్పింది. మనకు నూరువరహాలు చేతి కిచ్చి పిల్లకు నూరురూపాయలు నగలుపెట్టి ఉభయఖర్చులు తానే పెట్టుకొని పెండ్లిచేసికొని వెళ్ళునట్లు మానాన్నద్వారా నేనేర్పాటు చేయఁగలను. పెండ్లి యిక్కడచేసినను సరే మానాన్నగారి యింటి దగ్గర చేసిననుసరే వాఁడొప్పుకొనును. ఈసంగతి మీరు గట్టిగా ఆలోచించుకొని మాకేదోసమాధానము చెప్పండి. తరువాత మా

నాన్నకు వర్తమాన మంపించెదను.

భార్య చెప్పిన యుపాయము నాగన్నకు నచ్చెను. నాయప్పకుఁ గాని మఱియొకఱికిఁగాని నాలుగువందలు పుచ్చుకొని పిల్లను వివాహము చేసినపక్షమునఁ దనకు ఋణవిమోచన మగు నని యొకదారి యతనిమనస్సునకుఁ బొడకట్టెను గాని పుత్రికావివాహము తలఁపునకు రాఁగానే తోఁబుట్టువుమాట యతనికి జ్ఞప్తి రాఁగా సతీపతుల కిద్దఱికి సంభాషణము జరిగెను.

"మాగణపతికి పిల్ల నీయకపోయినపక్షమున నాచెల్లెలు దుఃఖపడునని మనస్సులో సందేహము కలుగుచున్నది."

గణపతికి పిల్ల నిచ్చుటకంటె పెద్దగోదావరిలో దింపుట మంచిది. అతనిదగ్గఱ ఒక్కగుణమైన నాణెమైనది లేదు. పిల్లవాఁడు మరగుజ్జు. బుద్ధులు పాడుబుద్ధులు; ఇల్లులేదు, వాకిలి లేదు, భూములు లేవు. పుట్రిలేదు. తినబోతే అన్నము లేదు. కట్టబోతే గుడ్డలేదు. ఏమిచూచికొని పిల్ల నివ్వను?

ఇల్లు వాకిలి భూమిపుట్రి విద్యాబుద్ధులు వుంటే పిల్ల నెవరయిన యివ్వగలరు. లేనివాఁడు కనుకనే మనమియ్యవలసివచ్చినది.

మేనల్లుడని జాలిదలఁచి పిల్లగొంతుక కోయఁదలఁతురా? పెండ్లాము బిడ్డలకు అన్నము పెట్టుటకైనశక్తియుండవలెనా లేదా! దాని మాటటుండనీయండి? ఇప్పుడు మనకు ఋణవిముక్తి కావలెను గదా? గణపతిదగ్గఱ నాలుగువందల రూపాయలు కాదుగదా, నాలుగు రూపాయలుకూడ లేవు. మన కేమియ్యగలడు? పిల్లను మేనల్లున కుచితముగా నిచ్చి వివాహము చేసినపక్షమున అప్పులవాళ్ళు మనయిల్లు వాకిలి అమ్ముకొనిపోదురు. నిలువ నీడలేక మనముచెట్టు మీదిపక్షులులాగు దేశములుపాలై పోవలెను. అందుచేత గణపతికి

పిల్లనియ్యవలెనన్నమాట తలచుకోవద్దు. నేచెప్పినట్టు మారాయప్పకే యివ్వండి !

నీవు చెప్పినమాటలు సరిగనే యున్నవికాని ఆడుపడుచు దుఃఖపడిపోవు నని నా కాలోచనగానున్నది. లేకలేక దాని కొక్క పిల్లవాడు కలిగినాడు. ఏలాగైనా వాని నొక యింటివాని చేయవలె నని దాని సంకల్పము. వాడు బుద్ధిలేనివాడన్నమాట నిజమె. అది నన్నే నమ్ముకొనియున్నది. అది యేడ్చిపోవును.

పిల్లనియ్యకపోతే ఆబిడేడ్చి పోవును. ఇచ్చినపక్షమున నే నేడ్చిపోదును ! ఇన్నిమాట లెందుకు? గణపతికి మీరు పిల్ల నియ్య దలంచుకొన్నపక్షమున నే నేగోతిలోనో దిగదలంచుకొన్నాను. ఇది నిశ్చయము.

లేనిపోని సాహసపుమాటలాడకు. తప్పు.

మీయిష్టము. నేనాలాగున జరిగించదలంచుకొన్నమాట నిజము.

అంతటితో సంభాషణ ముగిసెను. నిద్రపట్టెను. తెల్లవారు జామున నాగన్న మేలుకొని భార్య చేసిన హితోపదేశముయొక్క పూర్వాపర్యములు స్థిమితముగా మనస్సులో విచారించి గణపతికిం దనకూఁతు నిచ్చి వివాహము చేయుటవలన లాభములకంటె నష్టము లెక్కువ యున్న పని తెలిసికొని యిల్లాలుచేసినహితోపదేశమె సమంజసమై యున్న దని గ్రహించి తనయభిప్రాయము భార్య కెరిఁగించి తన మనోనిశ్చయమును మామగారికిఁ దెలియఁజేయుటకై జాబువ్రాసెను. ఆజాబుచూచుకొని యతని యత్తమామలు పెండ్లి కొడుకైన రాయప్పను వెంటఁబెట్టుకొని వచ్చిరి. ఈబంధువు లేల వచ్చిరో నాగన్న తోఁబుట్టువునకుఁగాని గణపతికిఁ గాని స్పష్టముగఁ దెలియలేదు. కాని భార్యాభర్తలు పలుమారు గుసగుస లా

డుటంబట్టియు గణపతియుఁ దల్లియు వచ్చునప్పు డూరకుండుటంబట్టి యు నత్తమామల రాకంబట్టియు వా రనుమానపడిరి. కాని స్పష్ట మగువఱకు నోరెత్తఁగూడదని యూరకుండిరి. గంగమ్మ చెప్పిన ప్రకారముననె రాయప్ప నాలుగువందల రూపాయలు రొక్క మిచ్చుటకును నూరురూపాయలు నగలు పెట్టుటకు బాజాభజంత్రీల తోఁ దరలివచ్చి వివాహము చేసికొనుటకు నొడంబడి ఋణము దీర్చికొనుటకు ముందుగా నేబదివరాలు అనఁగా రెండువందలరూపా యలు నాగన్నకిచ్చెను. నాగన్న ఋణముదీర్చి బాధానివారణము చేసికొనెను. అనంతరము నాగన్నయొక్క యత్తమామలును రాయ ప్పయు వారి స్వగ్రామమగు పలివెలకుఁ బోయి ప్రధానముచేసి కొనుటకును ముహూర్తము నిశ్చయించుటకురమ్మని నాగన్నకు జాబు వ్రాసిరి. నాగన్నయు మంచిదినము చూచుకొని పలివెల వెళ్ళెను. మేనమామ ఋణము దీర్చినసంగతి గణపతికిఁ దెలిసెను. అతఁ డావార్త తల్లికిఁ జెప్పెను. తల్లి చుట్టుప్రక్కల నున్నయమ్మలక్కల కెరిగించెను. అమ్మలక్కలందరు సభజేరి భూమి విక్రయింపకుండ గృహ మమ్మకుండ నాగన్న రెండువందలరూపాయలు సంపాదింప సమర్థుఁడు కాఁ డనియుఁ దనకూఁతు రాయప్ప కిచ్చి వివాహము చేయనొడంబడి యాతనియొద్దనే రెండువందలరూపాయలు పుచ్చు కొని ఋణము తీర్చుకొని యుండుననియు నిశ్చయించి మేనల్లుఁడుం డఁగా మేనమామ పిల్లను పైవానికిచ్చుట యధర్మమని నిర్ధారణము చేసి పిల్ల నిమ్మని గట్టిగా నడుగవలసిన దనియు నల్లరిచేయవలసి నదనియుఁ బదిమందిని బిలిచి తగవుపెట్టవలసిన దనియు నాలోచన చెప్పిరి. ఆయుపదేశము మాతాపుత్రులకు నచ్చెను. నాగన్న పలి వెల వెళ్ళి ప్రధానము చేసికొనివచ్చిన తరువాత నొకనాఁడురాత్రి భోజనానంతరము సోదరునిఁ బిలిచి తోఁబుట్టు విట్లనియె.

"అన్నయ్యా! మనబుచ్చి పుట్టింది మొదలుకొని తప్పకుండ దానిని నీవు గణపతికిచ్చి పెండ్లిచేయుదు వని గంపంత ఆశ పెట్టుకొని యున్నాను. నీవేమో రాయప్పకు పిల్లనియ్యఁ దలఁచుకొన్నావని గ్రామములో చెప్పుకొనుచున్నారు. ఇది నిజమేనా?"

ఆహా! నిజమె. నేను మనబుచ్చిని రాయప్పకిచ్చి పెండ్లిచేయఁ దలఁచుకొన్నాను. ఈవేళో రేపో నేనే ముందుగా నీతోఁజెప్పఁదలఁచుకొన్నాను. నీవే అడిగినావు గనుక చెప్పుచున్నాను. ఆమాటనిజమే. ప్రధానము చేసికొని వచ్చినాను. ముహూర్తనిశ్చయముగూడ అయింది. పెండ్లి నెల్లాళ్ళున్నది. మాఘశుద్ధ దశమినాఁడు సుముహూర్తము.

ఆమాట చెవినిబడఁగానె యామె మహాపద వచ్చిన తెఱంగున గుండెబాదుకొని మొత్తుకొని 'అయ్యో! అయ్యో! నాయనా! యెంతపని చేసినావురో నాకొంపతీసినావురా అన్నయ్యా! నన్ను చంపివేసినావురా అన్నయ్యా! నావంశము నాశనముచేసినావురా అన్నయ్యా! నాకొడుకును ఘోటకపు బ్రహ్మచారినిచేసినావురా అన్నయ్యా! అని యంతతో నిలువక 'ఓఅమ్మా! ఓనాయనా!' యనుచు మృతి నొందిన తల్లిందలంచుకొని కొంతసేపు తండ్రిందలంచుకొని కొంతసేపు మగనిందలంచుకొని కొంతసేపుపెద్దపెట్టునరోదనముచేసెను. ఏమో కీడుమూడినదనిచుట్టుప్రక్కలవారందఱుఁ జేరిరి. అయమ్మలక్కలామొగములు గనఁబడఁగానే యామెదుఃఖము మఱింతయధికమగుడు నామెదుఃఖపరవశయై 'ఓపుల్లమ్మత్తా! ఓనరసమ్మపిన్నీ! ఓసీతమ్మవదిన! ఓమాచమ్మక్కయ్యా! విన్నారటె మీరు మాఅన్నయ్య మాబుచ్చిని నాగణపతిగాడి కివ్వక యెవరికో యిచ్చుకోదలచుకొన్నాడట! మావదినకు నెలతప్పినది మొదలుకొని ఆడపిల్లేపుట్టవలెనని అది నాకోడలు కావలె నని యెంతో ముచ్చట పడి పుట్టెడాస పెట్టుకొని యు

న్నాను. నాయాసలడుగంటి పోయినవే పుల్లమ్మత్తా! నాకొడుకు దిక్కుమాలిన పక్షి అయినాడు పుల్లమ్మత్తా! ఎవడో దిక్కుమాలిన ముండాకొడుకు వచ్చి పిల్లనెత్తుకొని పోదలచుకొన్నాడు పుల్లమ్మత్తా! ఇక నేనేం చేతునుపుల్లమ్మత్తా! పల్లకిలో గణపతి, బుచ్చి కూర్చుండగా ముచ్చటగా చూడవలెననుకొన్నానే అమ్మా! బుచ్చి బుల్లి చేతులతో గణపతినెత్తిమీద తలంబ్రాలు పోయగా రెప్పవేయకుండా చూడవలెననుకున్నానే యమ్మా! తలుపులు దగ్గర వేరులు చెప్పించి వినవలె ననుకొన్నానే అమ్మా! గంధాలు పూయించవలె ననుకొన్నానే అమ్మా! నాకన్నులు కాలిపోయినవేఅమ్మా! నేనెంత పాపిష్టిముండనే అమ్మా!" యని పరిపరివిధముల వన్నెలు చిన్నెలు పెట్టియేడ్చెను.

ఆయేడ్పు విని జాలినొంది చూడవచ్చిన యిరుగుపొరుగు పడంతులు "మేనరికమంటే ఆడపడుచు ఆశపడకపోదుకదా. దాని కొడుకు బ్రహ్మచారియై పోవలసి వచ్చిందిగనుక దాని కంతబాధగా నున్నది. మేనల్లు డేలాటివాడైనప్పటికి మేనమామ పిల్లనిచ్చుట న్యాయ"మని కొందరు, 'అల్లరిచేయక ఆతనికాళ్ళమీదనుబడి మెల్లగాబతిమాలుకోవే.నీయన్నగారుఎల్లవారివంటివాడుకాడు. ఎంతోమంచివాడు. నీపెనిమిటి పోయినప్పటినుంచి నిన్ను నీకొడుకును కడుపులో పెట్టుకొని ఆదరించి వేయి విధముల కనిపెట్టినాడుకదా' యని యొకతె 'ఏమిజూచుకొని పిల్లనిమ్మన్నావమ్మా' యని మరియొకతె తోచినభంగి పలుకఁ జొచ్చిరి. ఆమెయేడుపు కొంత యణగిన తరువాత నాగన్న తోఁబుట్టువున కిట్లనియె.

"ఒసీ! నీవు గయ్యాళితనము జేసి నన్నల్లరిపెట్టఁదలఁచుకొన్నావా యేమిటి? నేను సుఖముగా బిడ్డవివాహము చేసికోఁదలఁచుకొని ప్రధానము చేసికొని వచ్చినాను గదా! నాయింటిలో నెవరో

చచ్చినట్లు, నీవు ఏడువవచ్చునా? శుభకార్యమువలఁచుకొన్నప్పుడు అశుభముగా మాటలాడఁగూడదు. నోరుమూసికో! నీకొడుకును పిల్లను ఏమిచూచికొని యిమ్మన్నావు? గోష్పాదమంతభూమి లేదు. గిద్దెడుగింజలు వచ్చుట కాధారములేదు. పెండ్లిచేసినతరువాత రేపు నీకొడుకు చచ్చిపోతాఁ డనుకో! మనవర్తికైన భూమి ఉండవలెనా? తలదాచుకొనుటకు కొంపైన లేదు. ఇక నీకొడుకు గుణములమాట చెప్పనక్కరలేదు. ఎన్నిదుర్గుణము లుండవలెనో అన్నిదుర్గుణములు నీకొడుకుదగ్గరనే యున్నవి. అటువంటివిరాభాగ్యునకు పిల్ల నేలాయి య్యగలదు? గుణములమాటలటుంచు. నాకిప్పుడు రెండువందలఋణ మున్నది. ఆఋణము తీర్చికోవలెను. నాకు నీవు నాలుగువందలరూ పాయ లివ్వగలవా పిల్లమీద? బుఱ్ఱగొరిగించుకునేందుకుగూడ ఏగా ణియైన దగ్గరలేక చిక్కుపడుచున్నముండవు నీవు నాలుగువందల రూపాయలునాకిచ్చి పిల్లకు ముచ్చటతీరుటకు వందరూపాయలునగలు పెట్టి పెండ్లిచేసికోగలవా? మేనల్లుఁడుగనుక తండ్రి చచ్చినప్పటినుం చి అన్నవస్త్రములిచ్చి పోషించినాను. నేనంతకన్న చేయవలసిన దేమిలేదు. నీ వేడ్చినప్పటికి మొత్తుకొన్నప్పటికి నేను పిల్లనియ్యను."

అనవుడు సోదరి సోదరునకిట్లనియె. "అన్నయ్యా! యిల్లు లేని మనుష్యులు భూమిలేనిమనుష్యులు బ్రతుకుటలేదా చచ్చి పోయినారా? మగవాడుకదా నాలుగూళ్ళు తిరిగి ముష్టెత్తి భార్యను పోషించుకోలేకపోవునా? లోకములో అందరికి భూము లున్నవా' పుట్రి లున్నవా? గుణములు మంచివికానన్నావు. చిన్నతనముకనుక అల్లరి చిల్లరిగా తిరిగినాడేకాని పెద్దవాడైనతరువాతకూడనీలాగేయుం డునా? పైవేషాలేగాని గణపతిమనస్సంతమంచిమన స్సెవరిదిగాదు. వాడు జాలిగుండెవాఁడు. ఎంతో బుద్ధిమంతుఁడు. నీ పెండ్లాము మా మీద గిట్టక మమ్ము లేవగొట్టించవలెనని నీతో అయినప్పుడు కా

నప్పుడు కొండెములు చెప్పి నామీద మాఅబ్బాయిమీద నీకుకోపము తెప్పించినది. దానిమందులు నీకు తలకెక్కినవి. దానిమాటలు పథ్యమైనవి. అది నావుసురుపోసికొన్నది. నావలెనే అదికూడ హోరున యెప్పు డేడ్చునో, దానియాశ లడుగంటిపోనో, దాని పుట్టింటివారు బుగ్గయిపోవునో. నన్ను పెట్టినవుసురు తగులకపోదు. ఆడపడుచు నుసురుపెట్టినవా ళ్ళక్కరకురారు. ఆడపడుచుల ఉసురు ఒక్కనాటితో పోదు. ఏడేడుతరాలు కట్టికుడుపకపోదు. ఆడపడుచు నేడిపించినవారివంశము నిర్వంశమైపోకమానదు. ఆదిక్కుమాలిన రాయప్ప యెక్కడదొరికినాడురా నాయనా ? వాని మొగమునుండ. వానిమొగాన ప్రేతకళేగాని మంచికళ లేదురా నాయనా ! పెండ్లి యోగ మెక్కడున్నదో ఆమొగానికి నాకు తెలియదు." అని రెండవసారి రుద్రపారాయణము చేసెను. గంగమ్మను నామెప్పుట్టినింటి వారిని జామాతకావలసిన రాయప్పను నోటికివచ్చినట్లు తిట్టుటచేత గంగమ్మకోపించి యాతిట్లు ఋణ మాడుబిడ్డకు వడ్డితోదీర్చెను. ఇద్దరు కలియఁబడికొట్టుకొన్నట్లుకయ్యమాడిరి. అంతట నాగన్నకోపావిష్టుఁడై సోదరిం జూచి "నీయిష్టమువచ్చినట్లు కాఱుకూఁతలుకూసినన్ను నాభార్యను నాయత్తవారిని నాయల్లుని నోటికి వచ్చినట్లు తిట్టుచున్నావు. సుఖముగా నేను పెండ్లిచేసికోఁ దలఁచుకోగా నీవు అమంగళము లాడుచున్నావు గనుక నీవు నాయింటిలో నుండవద్దు. నీవు నీకొడుకు ఈక్షణం లేచిపోండి. ఒక్కనిమిష మున్నారంటె నే నోర్చను. పొండి. మీసామాను లేమున్నవో తీసికొనిపొండి !" యని కఠినముగాఁ బలికెను. మేనమామ తనవిషయమై పలికిన పలుకులకుఁ దల్లి నాడినమాటలకుఁ దగిన ప్రత్యుత్తరముఁ జెప్పవలెనని గణపతి రెండుమూఁడుసారు లుంకించెను గాని బదులు చెప్పినచో మేనమామ బుఱ్ఱ వంగఁదీసి చావగొట్టునని భయపడి నో

రెత్తక "అమ్మా! రావే అతఁ డింతటిలో క్షణ ముండఁగూడ దని యతఁ డనుచున్నప్పుడు సిగ్గులేక మనముండఁగూడదు. అన్నము లేకపోతె నాలుగూళ్ళు ముష్టెత్తుకు తినవచ్చును రా. మాటలుమన ము పడఁగూడదు. లే." యని చేయి బట్టుకొని లేవఁదీసి కొని పోయెను. ఆమె గొల్లుమని యేడ్చుచు వీధిలోనికిఁ బోయి "దేముఁ డా! దేముఁడా! నాతోడబుట్టినవాడు చచ్చిపోయినా డమ్మా! నా పుట్టింటికి నాకు ఋణముతీరినదమ్మా! నాపుటిల్లు బుగ్గిఅయిపోయిం దమ్మ!" యని కేకలువేయుచు నేడ్చుచు దోసెడు మన్నుతీసి యన్నగారిగుమ్మముమీఁద పారబోసి రవంతమట్టి తనవోట వేసి కొని తల మోదుకొని గుండె బాదుకొని లబలబ మొత్తుకొని మున్న గంగమ్మకు విరోధురాలైన యవ్వయింటికి గణపతి యీడ్చుకొనిపోగా వెళ్ళి పెద్దపెట్టున రోదనము చేసెను.

మూఁడవ ప్రకరణము.

భగవంతుఁడు గణపతికిఁ గావలసినంత యభిమానమునే ప్రసాదించెనేగాని యైశ్వర్యమును బ్రసాదింపలేకపోయెను. మేన మామమీఁది కోపముచేత వేరింటికాపురము చేయవలయు నని తల్లినిదోడ్కొనిపోయి పొరుగింట నిలుపఁ గలిగెనేగాని, తనభుక్తికిఁ దల్లిభుక్తికి నొక్కపూఁటకు సరిపడునంతబియ్యమైనఁ దేఁ జాలక పోయెను. గణపతికిఁ దల్లికి, నాగన్నమీఁదను గంగమ్మమీఁదను గ్రోధ మెక్కించి పుల్లవిఱుపుమాట లనియెడుసమిధలచేత ద్వేష వహ్ని రగుల్కొలిపిన యవ్వయుఁ దక్కిన యమ్మలక్కలును మా

తాపుత్రులను రెండుమూఁడుపూటలు పోషించునప్పటికే కష్టమయ్యెను. తల్లికొడుకు లని లెక్క కిద్దరైనను రమారమి యే డెనమండ్రిగురు మనుష్యులు గలకుటుంబమునకుఁ గావలసినంతసామగ్రి వారికిఁ గావలసెను. గణపతి ప్రియమున నిరువదేండ్లలోపువాఁడైనను జూపులకు వామనమూర్తియైనను జఠరాగ్ని వృకోదరునిజఠరాగ్నివంటిదని యీగ్రంథమునందే స్థలాంతరమున వర్ణింపఁబడియెఁ గదా? గణపతి భోజనప్రమాణముబట్టి యతనితల్లిభోజనప్రమాణము జదువరులు మీరూహించుకొనవచ్చును. అందుచేత సామాన్యగృహస్థులు వారిని భరించుట కష్టమని వేఱె చెప్ప నవసరము లేదు. దినమునకు మూఁడుసేరులు బియ్య మున్నపక్షమున వారి కొకవిధముగా సరిపోవును. అది వచ్చునట్టిదారి పొడకట్టదయ్యెను. తల్లికొడుకులు తనకొంపమీఁదఁ బడి తిందు రేమో యనుభయమున బస యిచ్చిన యాయవ్వ గణపతినిఁ దల్లిం గూర్చుండఁ బెట్టుకొని మూఁడవనాఁ డిట్లనియె.

"ఓరీ గణపతి! మీతల్లిని బోషింపవలసినభారము నీది. కుక్కదానముపట్టి కుటుంబము పోషించు మన్నాఁడు గనుక నీవు యాయవారము చేసి మీకు సరిపడిన బియ్యము తీసికొనిరా! గ్రామములో నున్నపెద్దమనుష్యులను నల్గురను జూచి మేనమామ నన్ను నాతల్లిని లేవఁగొట్టినాఁడని చెప్పు. ఏధర్మాత్ములకైన జాలి పుట్టవచ్చును. తలకొకకుంచెడు ధాన్యము వారివ్వవచ్చును. దానివలన మీ కుటుంబపోషణగావచ్చును. ముందుగా యాయవారమారంభించు మావారు రామేశ్వరయాత్ర వెళ్ళినప్పుడు కొనితెచ్చిన పెద్దకుంభకోణపుచెంబున్నది. అది మానెడుబియ్యము పట్టవచ్చును. రేపటినుంచి నీ వభిమానపడక ఆలాగున చెయ్యినాయనా" యని యుపదేశింప గణపతి యాయుపదేశమునకు సమ్మతింపక యిట్లనియె.

"చేస్ నేను బ్రాహ్మణార్థములే మానివేయఁదలఁచు కొన్నాను. యాయవారము వృత్తినొప్పుకొందునా? అటువంటిమాటలు నాకు పనికిరావు. అమ్మా! నాకొక యుపాయము తోచింది విను. కొద్దిరోజులలో మన మీయూరు విడిచి వెళ్ళిపోవుదము. అంతవఱకు నీవు యాయవారముచేసి బియ్యము తీసుకొనిరా ! ఈగిరజాలతోను ముచ్చెలతోను నేను యాయవారముచేయుట బాగుండదు. నా కది పరువుతక్కువ. రెండుమూఁడుమాసము లాలాగు నీవు గడపితే నే నేదో యుద్యోగము సంపాదించి యొకరికంటె నెక్కువగా నిన్ను పోషింపఁ గలుగుదును. అంతవఱకు మాట దక్కించు" మని ప్రత్యుత్తరము చెప్పెను.

మాతాపుత్రులలో నెవరు భిక్షాటనము చేసినను నుపదేశము చేసిన యవ్వకు సమానమె గనుక యామె యాసలహా నంగీకరించి బిచ్చమున కామెల బురికొల్పెను. మరునాఁడుదయమునను నుండి యామె యాయవార మారంభించెను. ప్రతిదిన ముదయము గణపతికిఁ గడుపునిండఁ జల్లియన్నముఁ బెట్టి యామె గ్రామసంచారమున కరిగి రెండుజాము లైనతరువాత వచ్చి స్నానముచేసి మడి కట్టుకొని వంటచేసి కొడుకునకుఁ బెట్టి తాను దినును. గణపతి చల్లికూడు తిని తల్లి తెచ్చినబియ్య మప్పుడప్పు డమ్మి డబ్బు లేనప్పుడు పొగచుట్టలు కొనుచు బియ్యమే యిచ్చి యీఁతపండ్లు, జీడిమామిడిపండ్లు, వెలగకాయలు, రాచయుసిరికాయలు, చెఱుకుకఱ్ఱముక్కలు నేరేడుపండ్లు మొదలగు చిఱుతిండినస్తువులు వీథిలోని కమ్మవచ్చి పప్పుడు దీసుకొనుచు నున్నఁగా గిరజాలు దువ్వుకొని చుట్టలు కాల్చుచు గ్రామమువెంటఁ దిరిగి తిరిగి రెండుజాములగునప్పుడు టక్కుమని ముచ్చెలు చప్పు డగునట్లు గృహమునకువచ్చి "వం టైనదా? లేదా?" యని గొప్ప యధికారి వంటకత్తె నడిగిన ట్లడిగి, యైన

దన్నప్పుడుముందు తనకేపెట్టుమనితిని. 'కాలేదునాయనా'యనియన్న ప్పుడు" దౌర్భాగ్యపుముండా! పెంటముండా! వంట పెండల కడ చేయక గుడ్డిగుఱ్ఱమునకు పండ్లు తోముచున్నావా? నీకు నాలుగు చంపకాయలు తగులవలె లేకపోతే బుద్ధిరా" దని యొకప్పుడు మా టలతోనే పోనిచ్చును. మఱియొకప్పుడు చేయి విసరి రెండు తగుల నిచ్చుచు యథేచ్ఛముగఁ దిరుగఁ జొచ్చెను.

గ్రామస్థులలోఁ గొంద ఱప్పు డప్పుడు గణపతియొక్క స్వ చ్ఛందవ్యవహారములఁ జూచి నవ్వుచు "యేమిరా యీ యన్యా యము. చెట్టంత మగబిడ్డవు. నీవుండఁగా మీయమ్మ బిచ్చ మెత్తు కొనుట న్యాయమఁటరా? ఆ గిరజా లేమిటి? ఆ పొగచట్ట లేమిటి? ఆ ముచ్చె లేమిటి? ఆ టక్కటక్కు లేమిటి? తల్లి యాయవార మె త్తు టేమిటి సిగ్గులేదా? పెద్దముండ ఆవిడను పోషించుటకు మాఱుగా నిన్నే యాబిడ పోషించవలెనా?" యని చీవాట్లు పెట్టఁ జొచ్చిరి. అది విని గణపతి రోసము దెచ్చుకొని తల్లచేత బిచ్చ మెత్తంపఁ గూడ దని యామెను మాన్పించి తానే చెంబు దీసికొని యాయ వార మారంభించెను. అ దెట్లనఁగా నుదయమున లేచి చల్లికూడు తిని గిరజాలు దువ్వుకొని కోటు దొడుగుకొని తెల్లపంచె కట్టుకొని పొగచుట్ట నోట పెట్టుకొని కుడిచేతితో చెంబు పట్టుకొని యెడమ చేతి తర్జనమధ్యమాంగుళీయములతోఁ బొగచుట్ట నోటినుండి దీసి పట్టుకొని యుమ్మివేయుచు యాయవారము చేయును. ఆ వేషమును జూడ గ్రామమండలి స్త్రీపురుషులు బాలురు పనులు మానుకొని వచ్చి గణపతితో నించుకసేపు పని లేక పోయినను బ్రసంగించి పొట్టలు విచ్చునట్లు నవ్వుకొని వినోదించుచుందురు. గణపతి యక్ష యపాత్రము బుచ్చుకొని యెవరి యింటికైనను వెళ్ళినప్పుడు వారు లోపలినుండి బియ్యము తెచ్చుట యాలస్య మైనపక్షమున నచ్చట

నిల్చియుండక వారివాకిట మంచ మున్నయెడల మంచముమీఁదఁ దివాసి యున్నయెడల తివాసిమీఁదఁ గుర్చీ యున్నయెడలఁ గుర్చీ మీఁదఁ గూర్చుండి యాలస్యముగ బిచ్చము తెచ్చినందుకు "ఇంత సే పెందు కాలస్య మైనది? ఎల్లకాలము మీ యింటి దగ్గఱ నేను పడి యుందు నను కొన్నావా యేమిటి? మీరు నాకు నిలువుజీత మిచ్చిన ట్లున్నారు. నేను మీవా కిట్లో నిలిచియుండుటకు మీ నౌకరును కాను! పెద్దమనుష్యుఁడు వచ్చినప్పుడు వెంటనే పంపక యీ యాలస్య మేమిటి?" యని మందలించుచుండును. గణపతి మందలింపులు స్త్రీపురుషుల కాగ్రహము తెప్పించుటకుమాఱు మందహాసము సంతోషము గలిగించుచు వచ్చెను. ఈ తెఱంగునఁ దల్లి కొన్నినాళ్ళు కొడుకు కొన్నినాళ్ళు యాయవారముచేసి పొట్టబోసుకొనుచుండిరి. అంతలో నాగన్నకూఁతురు వివాహము సంభవించెను. వివాహమునకు విఘ్నము లాపాదింపవలెనని గణపతియుఁ దల్లియు బహువిధోపాయములు వెదుకఁజొచ్చిరి. గణపతి కంటికిఁ గనఁబడినవారినెల్ల వివాహము కాకుండఁ జేయుట కుపాయముఁజెప్పు మని యడుగుచుండును. మేనమామయైన నాగన్నకు సన్నిహితజ్ఞాతి యొకఁ డుండెను, అతనిపేరు పుల్లయ్య. పుల్లయ్యకు నాగన్నకు సరిహద్దు గోడలగూర్చియు, పొలములలో గట్లిగూర్చియు, నీళ్ళబోదెలంగూర్చియు, మనస్పర్ధలు పొడమి విరోధములు ప్రబలినందున వారికి మాటలుగాని శుభాశుభ కార్యములందు భోజనప్రతిభోజనములు గాని లేవు. శక్యమైన యెడల నాగన్న కపకారము చేయవలెనని పుల్లయ్యయు, పుల్లయ్య కపకృతిచేయవలెనని నాగన్నయుఁ జూచుచుండిరి. అట్టి సమయములో నొకనాఁడు గణపతి పుల్లియ్యయింటికిఁ బోయి నాగన్న కూఁతురుయొక్క వివాహము కాకుండఁ జేయుట కుపాయము చెప్పు

మని యడిగెను. పుల్లయ్య ముహూర్త మాలోచించి "వహ్వా మంచి యుపాయము దొరకిందిరా గణపతి! ఇది సాగెనా బుచ్చి, రాయప్పకుఁ దక్కకుండ నీకే దక్కు" నని యుత్సాహముతోఁ బలికెను. పిల్ల తనకే దక్కు నన్నమాట వినఁబడఁగానే గణపతి సంతోషముచే హృదయ ముప్పొంగ "పుల్లయ్యమామ! ఉపాయ మేదో త్వరగాఁ జెప్పు. నాగన్నగాఁడి రోగము మన మందఱము చేరి కుదర్చ వలె" ననియెను. అనుటయు పుల్లయ్యయిట్లనియె. "బుచ్చిని నీవు తీసుకొనిపోయి రహస్యముగా నేదోయొకగ్రామములో దేవాలయములోఁ బెండ్లి చేసుకో. దానితో నాగన్నరోగము రాయప్ప రోగముకూడ కుదురును. రాయప్పగాడికి రెండువందలరూపాయిలు తిరుక్షౌర మన్నమాటె. నీకు దమ్మిడి ఖర్చులేకుండా బెండ్లి యగును. ఒకసారి పెండ్లియయిన పిల్లకు తిరిగి పెండ్లి చేయఁగూడదని మనశాస్త్రము. ఏడువనీ మొత్తుకోనీ తిట్టనీ! పెండ్లిమాత్రముచేయుటకు వీలులేదు. ఎప్పటికైనను బుచ్చి నీ పెండ్లాము. తప్పదు. ఈపని నీవు చేసితివా మనగ్రామములో జనులేగాక చుట్టుప్రక్కగ్రామములవాండ్రుకూడ గణపతిగాడు బహాద్దరురా మంచిపని చేసినాఁ డని మెచ్చి సంతోషింతురు. కనుక నీ పివిషయములో గట్టిపని చేయవలెను. ఇసుక తక్కెడకు వెంటనే పేడతక్కెడ ఉండవలెను. కుక్కకాటుకు చెప్పుదెబ్బ తగలవలెను." అని యుపదేశము చేయుటయు, గణపతి సంతోషించి "పుల్లయ్యమామ! నీయుపాయము బాగున్నది. కాని యిది యేలాగు నెరవేరఁగలదు. ముందు మనకు పిల్ల స్వాధీన మగు టేలాగు? అది యొంటిగా మనకు దొరకునా? దొరకినప్పటికిఁ దలిదండ్రుల విడిచిపెట్టి మనతో నది పొరుగూరు వచ్చునా? బలవంతమునఁ దీసికొనిపోతిమా యది యేడ్చి గోల చేయదా? ఆగోల విని పదిమంది చేరరా? అప్పుడు మనప్రయత్నము

చెడిపోదా? అదిగాక యేగ్రామములో వివాహము చేసికోఁగలను? ఎవరికిఁ దెలియకుండ ముం దర్కడఁ బ్రయత్నము చేయవద్దా? డబ్బు కావలెఁ గాఁబోలు. నాదగ్గర డబ్బులేదు. వీటి కన్నిటికి నీవే యేదోయాలోచన చెప్పవలె" నని పలికెను. అడుగుటయు నతనికి ఫుల్లయ్య యిర్లనియె. "ఆగొడవ నీ కక్కరలేదు. కావలసిన సొమ్ము నేనే పెట్టుబడి పెట్టఁగలను. నీతల్లి మాయింటి యాడుపడుచు. నీవు నాకు మేనల్లుడవు. నాదగ్గర నలుసంత ఆడపిల్ల ఉన్నపక్షమున నేనే నీకు పిల్ల నిచ్చి పెంట్ల చేయవలసినవాఁడను. వేయేండ్లు తపస్సు చేసినను కలిసినసంబంధము దొరకునా? నిర్భాగ్యుఁడు గనుక నాగన్న సంబంధము చెడఁగొట్టుకొన్నాఁడు. దాని కేమి? డబ్బుగొడవ నీకక్కరలేదు. వానపల్లి దేవాలయములో నీకు నేను వివాహము చేయించఁగలను. పిఱ్ఱి నేదోవిధముగా నేనే తీసుకొని రాఁగలను. అప్పుడప్పు డాపిల్ల మాయింటిప్రక్కనున్న కందర్పవారి యింటికి వచ్చి యాడుకొనుచుండును. ఏదో మచ్చిక వేసి పిల్లను తీసికొని రావచ్చును. నేను ముందుగా వానపల్లి వెళ్ళి పురోహితుని గుదిర్చి ముహూర్త మేర్పాటు చేసి పూజారితో మాటలాడి భజింత్రీలను గుదిర్చి వచ్చెదను. బుచ్చిపెండ్లి దశమినాడుగదా తండ్రి యేర్పరచినాడు. ఈలోపుగా షష్ఠినాడో, సప్తమినాడో మనము తలఁచుకొన్నపనిచేసి తీరవలెను. నీవు పంచమినాడే వానపల్లి వెళ్ళియుండు. నేను తెప్పుదయమున బయలుదేరి వానపల్లి వెళ్ళి వచ్చెదను. పాతికరూపాయలసొమ్ము మేనల్లుఁడవు కనుక నీనిమిత్తమై కర్చు పెట్టెదను. ఈసంగతిమట్టుకు నీ వెవరితోను జెప్పవద్దు. మీ యమ్మకుఁగూడ తెలియనీయవద్దు. ఆడుదానినోటిలో రహస్యము దాగదు. పూర్వము ధర్మరాజులవారు "ఆడుదానినోట రహస్యము దాగఁగూడ" దని కుంతికి శాప మిచ్చినారు. అప్పటినుంచి యాడ

దానితో చెప్పిన యేకాంతము లోకాంత మగును, ఇది మనకిద్దఱకె గాని, యీగ్రామములో మరెవ్వరికిఁ దెలియఁగూడదు సుమీ!" అనవుడు గణపతి తన కాపూట వివాహ మైనట్లె మహానందము నొంది లేచి "ఫుల్లయ్యమామ! నిజముగా నీవే నామేనమామవు. నాగన్నగాఁడు నామేనమామ కాడు. నీకున్నయభిమానము మఱెవరికిలేదు. ఈదెబ్బతో నాగన్నగాఁడిరోగము కుదిరిపోవును. బ్రహ్మాస్త్రమువంటి యుపాయమిది. ఇక నేను వెళ్లెదను. నీవు వానపల్లి వెళ్ళి వచ్చినతరువాత మనము తిరిగి కలుసుకొందుము" అనివెళ్ళెను. ఫుల్లయ్య వీధివఱకు వానిని సాగనంపి చిరకాలమునుండి నాగన్న మీఁద తనకుఁగల క్రోధమును దీర్చికొనుటకుఁ దగిన యవకాశముల భించినదనిమనంబున మిగులసంతసించెనుఁ నాగన్న మీఁదికోపముచేత పాతికముప్పదిరూపాయలుకూడ నతఁడు కర్చుపెట్టఁదలఁచెను. క్రోధ మేపనిఁ జేయింపదు? ఫుల్లయ్య మరునాడు తెల్లవారుజామునను లేచి వానపల్లి వెళ్ళి యచ్చటనున్న విష్ణుదేవాలయముయొక్క పూజారిని కలుసుకొని రెండురూపాయలు వానిచేతిలోఁ బెట్టి రహస్య వివాహము జరుగునని యతనితోఁ జెప్పి సాయము చేయవలెనని కోరి పిల్లతండ్రిపేరు మొదలైనవి చెప్పక తనకుఁ జిరకాలమిత్రుఁడైన ద్రావిడబ్రాహ్మణుని మంథామహాదేవశాస్త్రిని గలిసికొని తన సంకల్ప మాయనతోఁ జెప్పి యాయనసమ్మతిం బడసి పురోహితుఁడుగా నుండవలెనని యతనినే గోరిరెండురూపాయలు ముందాయన కిచ్చి మాఘశుద్ధ షష్ఠినాడు ముహూర్తము పెట్టించి బాజాభజంత్రీలను గుదుర్చుమని యతనితో చెప్పి తిరిగి వచ్చునప్పు డిట్లనియె— "మహాదేవుడుబావ! పిల్లను షష్ఠినాడువీలైతే షష్ఠినాడు తీసికొని వచ్చెదను. సప్తమినాడువీలైతేసప్తమినాడుతీసికొనివచ్చెదను. అందుచేత రెండురోజులుకూడమహూర్తములుపెట్టిమీరుంచవలెను. నేను త్త

రమువ్రాసియిచ్చి పెండ్లికొడుకునుమీయింటికిపంచమినాడేపంపెదను. అతనికి మీయింటిలోనే భోజనముపెట్టండి. దేవాలయములో రాత్రి వివాహములు చేయఁగూడదని పెద్ద లన్నారు. మీరు రాత్రి ముహూర్తము పెట్టినారేమి?" అనిపలికెను. "రాత్రులు దేవాలయములో వివాహముచేయఁగూడదని నేనెరిగినంతవఱ కేశాస్త్రములోను లేదు. అందుచేతనే రాత్రిముహూర్తము పెట్టినాను. ఇటువంటి పిచ్చిపిచ్చి సందేహములు పెట్టుకొనక పిల్లను తీసికొనిరా! మూఁడు నిమిషములలో వివాహము చేయించెద"నని మహాదేవశాస్త్రిబదులుచెప్పెను పుల్లయ్య సంతుష్టుఁడై వాసపల్లివిడిచి స్వగ్రామమునకుఁ బోయెను. అతఁడు వచ్చునప్పటికి గణపతి వాని వీధియరుగుమీఁద గూర్చుండెను. గణపతిని జూచి పుల్లయ్య మీఁదఁ జేయివైచి తట్టి గణపతీ! నీవదృష్టవంతుడవురా! నీపేరుఫల మేమోగాని యెక్కడికి వెళ్లితే అక్కడ దిగ్విజయమె. పురోహితుఁడు కుదిరినాడు; పూజారి యనుకూలముగా నున్నాఁడు; సమస్తము నేటివఱకు శుభప్రదముగానే యున్నది. నీకు తప్పక కళ్యాణకాలము వచ్చినట్లు కనఁబడుచున్నది. కక్కువచ్చినప్పుడు, కళ్యాణము వచ్చినప్పుడు ఆగదన్నారుపెద్దలు. ఇంతకునీదినములుమంచివి, యని బహూకరించెను. "మామ! ఇది నీచలవగాని నాప్రజ్ఞ యేమున్నది? నన్నొకయింటివానిం జేసినాడన్నప్రతిష్ఠ నీకుఁ దక్కనలసి యున్నది. నామేనమామ బ్రతికి యున్నప్పటికిఁ జచ్చినవారిలోజమ. నీవే నా మేనమామవు." అని గణపతి ప్రత్యుత్తరమిచ్చెను. అనవుఁడు "పంచమి యెల్లుండేకదా! యెల్లుండి యుదయమున నీవు నాదగ్గరకు రా! ఉత్తరము వ్రాసియిచ్చెదను. అది పుచ్చుకొని మహాదేవశాస్త్రిదగ్గరకు వెళ్లుదువుగాని వివాహ మగువఱకు నీ వక్కడనే యుండవలెను. జాగ్రత్తసుమా! నోరు జాఱి యెవరితోనైన రహస్యము బయలుపెట్టెదవే

మో?" యని హెచ్చరించి ఫుల్లయ్య వాని నంపెను. గణపతి పరమసంతోషముతో నింటికిఁ బోయి మరునాఁడుదయమున వాన పల్లి కరిగెను. బుచ్చమ్మపెండ్లి పలివెలలో శ్రీకొప్పులింగేశ్వరస్వామివారి యాలయములోఁ జేయవలె నని నాగన్న తలంచెనుగాని, రాయప్ప దేవాలయములోఁ జేసికొన్న వివాహమువలన వధూవరులకు ముచ్చటలు తీరవని గుడిలో పెండ్లి వల్లకాదనియు, నైదుదినములు యథావిధిగ వివాహము జేయవలసినదనియు వ్యయ మంతయుఁ దానే చేయుదుననియు నాగన్నయొక్క యత్తమామలతోఁ జెప్పి వారి నొడంబఱిచెను. అత్తమామ లొప్పుకొనఁగానే నాగన్నయు నొప్పుకొనెను. పుట్టింటనే తనకూతురువివాహము జరుగుచున్నప్పుడు గంగమ్మ నిరుపమానందముతో నొప్పుకొన్నదని వేఱుగా వ్రాయనక్కఱలేదు కదా! పలివెలలోనే వివాహము జరుగునుగావున నాగన్న స్వగృహమందు వివాహప్రయత్న మేమియుఁ జేయనక్కఱ లేకపోయెను. అప్పడములు వడియములు పెట్టించుట యఱిసెలు వండించుట, యటుకులు కొట్టించుట, పందిళ్ళు పాకలు వేయించుట మొదలగుసమస్తప్రయత్నములు రాయప్ప తనపినతల్లి యొక్కయుఁ బినతండ్రియొక్కయు పెత్తనముక్రిందఁ జేయించెను. నాగన్న పుత్రికను, భార్యను దీసికొని మాఘశుద్ధసప్తమినాఁడు పలివెల వెళ్ళ నిశ్చయించెను. పెండ్లికూఁతురైన బుచ్చమ్మ నాలుగేండ్ల పిల్ల యగుటచే లక్కపిడతలు లక్కబొమ్మలు కఱ్ఱబొమ్మలు మొదలగునవి తీసికొని కందిపప్పు, బెల్లపుముక్క మొదలగునవి పట్టుకొని తన యీడుపిల్లలతో తఱుచుగా నాడుకొనుటకుఁ బోవుచుండును. షష్ఠినాడు సాయంకాల మా బాలిక ఫుల్లయ్యగారి యింటి ప్రక్కనున్న యొక బ్రాహ్మణగృహమున నాడుకొని నాలుగుగడియలప్రొద్దువేళ మరల నింటికిఁ బోవుచుండెను. ఆబాలిక యొక్క

రాకపోకలను మిక్కిలిజాగరూకతతోఁ గనిపెట్టుచుండిన పుల్లయ్య యామె యొంటరిగాఁ బోవుచుండుటఁ జూచి యదివఱకే తాను గొనియుంచిన ఖర్జూరపుపండుపొట్లము విప్పి యామె చేతికిచ్చి "అమ్మాయి! ఈపండు తిను. మాయింటికిరా! ఆడుకొందువుగాని" యని యెత్తుకొని ముద్దుపెట్టుకొనెను. బుచ్చమ్మ ఖర్జూరపుపండు యొక్క యెఱలోఁ బడి యది తినుచు మాటాడక యూరకుండెను. పుల్లయ్య యాబిడ్డనెత్తుకొని "అమ్మాయి! మీయమ్మదగ్గరకుఁ దీసికొని వెళ్ళనా రా" యని చల్లఁగా మాటలు చెప్పుచుఁ దానదివఱకుఁ గుదిర్చియుంచిన బండిమీఁద నెక్కించి బండి కీప్రక్క నాప్రక్క రెండు గుడ్డలుకట్టి మిక్కిలి వేగముగ బండితోలుమని బండివానితోఁ జెప్పి "బుచ్చమ్మ! నీకు లక్కపిడతలు కొనియివ్వనా? బొమ్మలు కావలెనా? మంచి పరికిణిగుడ్డ లున్నవి. నీవు కుట్టించుకొని కట్టుకొంటావా?" యని యిచ్చకములాడుచు ఖర్జూరపుపండు తినినవెంటనే మిఠాయిపొట్లము చేతి కిచ్చి యేదోవిధముగా నేడువకుండ రాత్రి నాలుగుగడియ లగునప్పటికి వానపల్లి తీసికొనిపోయి మహాదేవశాస్త్రిగారియింటిదగ్గర బండి దిగెను. పూజారి గుడిలో సిద్ధముగా నుండెను. మహాదేవశాస్త్రిగారియొక్క యేర్పాటుచేత రెండు కాగడాలు సిద్ధముగా నుండెను. భజంత్రీలువచ్చి కూర్చుండిరి. మహాదేవశాస్త్రి యానాఁటియుదయముననే గణపతిని దనయింటనే పెండ్లికుమారుని జేసెను.

బుచ్చమ్మ బండిలోనే నిద్దురపోయినందున నామెను భుజము మీఁదఁ బండుకొనఁ బెట్టికొని పుల్లయ్య మహాదేవశాస్త్రియింటికిఁ బోయి యతనిం బిలిచెను. గణపతియు మహాదేవశాస్త్రియు నత్యంత సంతోషముతో నాతని నెదుర్కొని నిర్విఘ్నముగా బాలికం దోడితెచ్చినందుకు వానిని గడుంగడుఁ బ్రశంసించిరి. అప్పుడు పుల్లయ్య

మహాదేవశాస్త్రిం జూచి 'ఏమోయి! కన్యాప్రదాన మెవరుచేయు దురు? ఆమాట నీతోఁ జెప్పమఱచితిని. అందు కెవరినైనఁ గుదిర్చి తివా లేదా' యని యడిగెను. నీవు మరచిపోయినావుగాని నాకా మాట జ్ఞాపకమున్నది. కన్యధారపోయుటకు దంపతులను సిద్ధముచేసి యుంచినా' నని యతఁడు బదులు చెప్పెను. 'వహవ్వా! మహాదేవ శాస్త్రియంటే సామాన్యుఁడా? బృహస్పతి వంటివాఁడవు. నీ వుండఁగా మాకు లోటు జరుగునా? ఇంతకు మీరు పెట్టినముహూర్త ము మంచిది. ముహూర్తబలిమిచేతఁ బిల్ల దొరకినదిగాని, లేకపోతే సామాన్యముగా దొరకునా ? కాని, కన్యాప్రదానమునకు సిద్ధ మైన దంపతు లెవరు?" అని పుల్లయ్య యడిగెను. మహాదేవశాస్త్రి యిట్లనియె.

"ఎవరేమిటి! మాగ్రామములో మంగలపల్లి నర్సయ్య యనే యొకబ్రాహ్మణుఁడున్నాఁడు. ఆయనది కృష్ణాతీరము కాపురము. మునుపు కొన్నాళ్ళమలాపురములో నీళ్ళకావిళ్ళు మోసినాఁడు. అక్కడుండఁగా నరసాపురమునుంచి బ్రాహ్మణవితంతు వొకర్తె లేచివచ్చినది. అది తలవెండ్రికలవిధవ, అమలాపురములోనున్న ప్పుడే దానిని వీఁడుంచుకొన్నాఁడు. దానికి కొంతకాలమునకు కడు పైనది. బిడ్డను చంపివేయుట కిష్టములేక ఆగ్రామము విడిచి దంప తులమని చెప్పుకొని వా రిక్కడఁ బ్రవేశించిరి. ఆబిడ్డ విధవారూప ముం దీసివైచి పసుపురాచికొని కుంకుమబొట్టు పెట్టుకొన నారం భించినది. వాళ్ళకిప్పు డిద్దఱుపిల్ల లున్నారు. వారు దంపతులేయని మేముకూడ మొదట నమ్మినాము. తరువాత నాకీ రహస్యమంతయు నమలాపురపుబ్రాహ్మణుఁ డొకఁడు చెప్పినాఁడు. అదివిని నరసయ్యను పిలిచి యడిగినాను. లేదులేదని మొదట బొంకినాఁడు కాని చివరకు నారెండుకాళ్ళుపట్టుకొని యేడ్చి బ్రతిమాలుకొన్నాఁడు. స్వాముల

వారిపేర వ్రాసి అంక్షపత్రిక తెప్పించి డొక్క బ్రద్దలుచేసెదనని నేను వానిదగ్గర పదివరాలుసొమ్ము గుంజుకొని రహస్యము బయలు పెట్టక కాపాడినాను. వాఁడిప్పుడు నగ్నప్రచ్ఛాదనలు చుట్టుప్రక్కల పదిపన్నెండు గ్రామములలో పట్టుచున్నాఁడు. నామాటంటె చాలగౌరవము. నేను గీచినగీటు దాటఁడు. వాఁడు నేను చెప్పినట్టు చేయఁగలఁడు. ఆదంపతు లిద్దఱుఁ గూర్చుండి కన్యాదానము చేయ నొప్పుకొన్నారు."

"సరె? చాలబాగున్నది. వారికిఁ ద్వరగావర్తమానమంపండి! పిల్ల నిద్రపోయినది. ఈసమయములో నేగబగబముడివేయవలెను. లేచిన పక్షమున నేడ్చునేమో, రండి దేవాలయములోనికి" అని పుల్లయ్య వారిం ద్వరపెట్టెను.

గణపతికి మెడలోఁ బెద్దజందె మొకటి పడుటే ప్రధానము గాని కన్యాప్రదానము తల్లిదండ్రులే చేయవలెనను పట్టింపు లేదు. అప్పుడు వారందఱు దేవాలయమునకుఁ బోయిరి. తొలుతగ్రహించిన రెండురూపాయలకుఁ దోడుగా మఱి రెండురూపాయలు వచ్చునను నాసతో నర్చకుఁ డచ్చటనే గూర్చుండెను. మంగలపల్లి నరసయ్య పుత్రికళత్రసమేతుఁడై వచ్చి కన్యాప్రదానమునకు సిద్ధముగఁ గూర్చుండెను. భజంత్రీలు మేళము సేయనారంభించిరి. మహాదేవశాస్త్రి పుల్లయ్యచేసిన తంత్రము సఫలము చేయుటకై మంత్రములు చదువ నారంభించెను. అంతలో బుచ్చమ్మ బాజాచప్పుడువలన మేలుకొని "మాఅమ్మేది? నన్ను మాఅమ్మదగ్గరికి తీసుకొనివెళ్ళు" అని పెద్ద పెట్టున నేడ్వనారంభించెను. పుల్లయ్య మిఠాయిపొట్ల మిచ్చెను. అఱటిపండిచ్చెను; బెల్లపుముక్క జూపెను; కాని యవి యామె యేడ్పును నివారింపలేకపోయెను. బ్రతిమాలెను, బెదరించెను, ప్రాణము విసికి రెండు చెంపకాయలుకొట్టెను. ఎన్నిచేసినను బుచ్చమ్మయేడ్పు

మానలేదు. విఘ్నేశ్వరపూజనిమిత్తము పళ్ళెములో బోసినబియ్యము బుచ్చమ్మకిందబడి దొర్లి యేడ్చునప్పుడు కాళ్ళతో దన్ని పారబోసెను. ఈయేడ్పువల్ల జూడవచ్చినవారు పిల్లను దొంగతనముగా దీసికొని వచ్చినట్లు దెలిసికొని వివాహము చెడగొట్టెదరేమో యని గణపతిగుండెలు పీచుపీచుమనెను. తన కేదైన చిక్కు వచ్చునేమో యని పుల్లయ్య భయపడెను. కుశాగ్రబుద్ధియైన మహాదేవశాస్త్రి సమయోచితముగా నాలోచించి దేవాలయముయొక్క వీధితల్పులు గట్టిగా మూసివేయించి పిల్లదానియేడు పెవ్వరికి వినబడకుండ గట్టిగా మేళము చేయుమని భజంత్రీలతో జెప్పెను. వారు గట్టిగా వాయించి యొకరిమాటొకరికి వినబడకుండఁ జేసిరి. పిల్ల యేడ్పుగాని, మహాదేవశాస్త్రిమంత్రములుగాని యెవరికివినబడలేదు. ఏడ్చియేడ్చి పిల్ల నేలఁ బండుకొని నిద్రిపోయెను. కదిపినయెడల మరలలేచి గోల సేయునేమోయను భయమున దానిని లేపక పండుకొనియుండఁగానే గణపతిచేత మహాదేవశాస్త్రిమంగళసూత్రములు కట్టించెను. నిద్రించుచుండఁగానే గణపతి బుచ్చమ్మతలమీఁద తలంబ్రాలు పోసెను. కాని బుచ్చమ్మ తలంబ్రాలు తనమీఁద పోయునట్టిభాగ్య మబ్బలేదని యతఁడు విచారించెను. ఏలాగో యొకలాగు వివాహమయ్యెను. మూఁడు పోచలుజందెము వదలిపోయి దూడకన్నెవంటి పెద్దయజ్ఞోపవీతము మెడలోఁ బడెను. మంగళస్నానము చేయించినట్లు కనబడదేమని పూజారిప్రశ్నముచేయఁగా మహాదేవశాస్త్రి 'మాయింటిదగ్గఱ మంగళస్నానములు చేయించి తీసికొని వచ్చినానయ్యా! మంగళస్నానములు లేకుండ నేను వివాహము సేయింతునా?' యని యతఁడు తిరస్కారభావముగాఁ బలికెను. "జడ జడపాళముగానే యున్నదే. మంగళస్నానము లెట్లుచేయించితి" వని యతఁడు మరలఁ బ్రశ్న చేయఁగా "జడ విప్పకుండఁగనె చేయించితి"నని బదులుచెప్పి యతని

సూత్రములు భర్తకుఁ దమ్ముఁ జూడవచ్చినవారికిఁ జూపించెను. చూచి నాగన్న 'ఔనౌను. ఇదిగో కాళ్లను బసపుకూడ కనఁబడుచున్నది. కన్నుల కాటుకగూడ కనఁబడుచున్నది. పిల్లయేడుపు వలన కొంతవఱకు కాటుక కరగిపోయినది. పాప మెంతయేడ్చినదో యెంత బెంగపెట్టికొనినదో. అమ్మా! నిన్నెవరు తీసుక వెళ్ళినారు? అని కూఁతు నడిగె. మూఁడేండ్లపిల్లయగుటచే బుచ్చమ్మమాటలు సరిగరాక 'వోరోబ్బి బన్నిమీఁద తీచికెళ్ళాడు.' అని బదులుచెప్పెను. ఆమెను గణపతియే తప్పక తీసికొనిపోయి దొంగపెండ్లి చేసికొనియుండు నని యచటి వారందఱు నిశ్చయించిరి. నాగన్నకు దుఃఖము కోపము మనంబున మల్లడిగొనినందున నవి యాపుకొనలేక పండ్లు పటపటఁ గొఱుకుచు 'నోరెఱుఁగని బిడ్డను దొంగతనముగా తీసికొనిపోయి పెండ్లిచేసికొని వీఁడు గృహస్థుడు కాఁదలఁచుకొన్నాడు కాఁబోలు! వెధవపెండ్లి, బోడిపెండ్లి, ఆవెధవబ్రతుకు గృహస్థాశ్రమముకూడానా? ఆపాడుముండకొడుకు ఘోటకబ్రహ్మచారియై చావవలసిందేకాని పెండ్లి కానిత్తునా? ఈపెళ్ళి పెళ్ళికాదు. ఆవెధవ కిది పెండ్లాము కాదు, ఇదిగో! పెండ్లి పెటాకులు చేసినాను. నాకూఁతురికి నేను తిరిగి పెండ్లి చేయకమానను' అని మంగళసూత్రములు పుటుక్కునఁ ద్రెంచి పాఱవైచెను. అక్కడఁ జేరినవారిలో వద్దువద్దాపని చేయవద్దని కొందఱు, తుంటరిపనిచేసినందున కావెధవకాశిక్ష కావలసినదే యని కొందఱు, శాస్త్రమొప్పదనికొందఱు, శాస్త్రములేదు చట్లుబండలు లేవు దొంగపెండ్లికి శాస్త్రమున్నదా యని మఱికొందఱుఁ దోచినచొప్పునఁ బలుకఁజొచ్చిరి. ఆపలుకులు విని నాగన్న యిట్లనియె. 'ఆశాస్త్రము చెప్పఁగలవాఁడెవఁడో రమ్మను. నాకడుపు మండిపోవుచున్నప్పుడు శాస్త్రమెందుకు; మీశాస్త్రాలు గీస్త్రాలు

తుంగలో పూరదొక్కుతాను. శాస్త్రిలు దొంగపెండ్లిచేసికోమని చెప్పినవా యేమిటి? స్వాములవారు వెలివేసినప్పుడు చూచుకుం దాములే. ఇదివఱకు నేను నాపిల్ల నెవరికియ్యనలచుకొన్నానో యత నికేయిచ్చివేసెదను. చూతునాదెబ్బ. నాకూఁతురికి తిరిగి పెండ్లిచేయు టేకాదు. గణపతిగాడు కంటికగపడ్డాడా-చంపి నెత్తురుబొట్టుపెట్టికొం టానుకొండి. నరసింహమూర్తి హిరణ్యకశిపునిచంపి పేగులు మెడ లోవేసికొన్నట్లు వాడిపేగులు నేను జందెముగా వేసికొనకమానను. సర్కారువారు నన్నురిదీసిననుసరే ఆవెధవను నేను చంపకమాన ను. ఈయూరు వచ్చినాడంటే చచ్చినాడన్నమాటే' అతఁడాలా గనుచుండ గంగమ్మ కంటదడిపెట్టుకొని గద్గదస్వరముతో నిట్లనియె. ‘ఒక్కగానొక్క పిల్లగదామ్మా! అచ్చటముచ్చటా దీనివల్ల మాకు తీరు ననుకొన్నాము. సుఖముగా మేమిద్దఱము పీటలమీఁదఁ గూ ర్చుండి చేతులార బిడ్డను కన్యాదానము చేసికోవలెననుకొన్నాము. ఇంతలో మాయచచ్చినాఁడు మారీచుడులాగ వచ్చి వాడిపెండ్లి పెటా కులు గాను, వాడి దుంప తెగిపోను! వాడి కల్యాణం నేల బడ, నాపిల్లకోసం నేను నిన్నరాత్రి యేడ్చినట్లు వాడితల్లి వాడికోసం యెప్పుడేడ్చునో, వాడి గూనదింప, వాడి తల్లికడుపుమాడ, వాడింట పీనుఁగువెళ్ళ మాకండ్లలో దుమ్ముపోసి మాణిక్యములాగు ఆడుకొను చున్నదానిని యెత్తుకొనిపోయి పుస్తికట్టినాడమ్మా వీడితాడు కోటి పల్లిరేవులో పుటుకుపుటుక్కని తెంప. వాడిపిండాకూడు పిల్లులు తిని పోను. వాడివంశము నిర్వంశముకాను. అంతంతమాట లాడకూడదం టారేమో మీరు. మేము వాడిచేత వాడితల్లిచేత మహాకష్టాలుపడి పడియున్నాము. అందుచేత నాప్రాణం విసికిపోయినది. ఆచండాలపు ముండాకొడుకు నేమన్నప్పటికి తప్పులేదు.”

అనుచు గంగమ్మ గంగాప్రవాహమువంటి శాపపరంపరను

నోటినుండి వెలివరచుచుండ నాగన్న తన తిట్లచేత నామెతిట్లకు వన్నె వెట్టుచు గొంతుబొంగువోవునట్లు మేనల్లుని చంపుదునని తోడ బుట్టినపడుచుం జంపివేయుదునని ప్రతినలు సలుపుచు వీధిప్రహ్లాద నాటకములో నరసింహమూర్తి చిందులుత్రొక్కినట్లు చిందులఁ ద్రొక్కి పరుగులెత్తినట్లు పరుగులెత్తెను. నరసింహమూర్తిని బట్టు కొన్నట్లు చూడవచ్చినవారాయనం బట్టుకొని నాటకము సమాప్త మైనదని ప్రేక్షకులొక్కరొక్కరే వెడలిపోయిరి. అన్నగారి ప్రతి జ్ఞలను, వదినెగారితిట్లను గణపతి యొక్క తల్లి ప్రక్కయింటి దొడ్డిలో నుండివిని తనసోదరుఁడు కొడుకుం జంపివేయునేమోయని భయపడి చప్పుచప్పున సోదరజ్ఞాతియగు పుల్లయ్య యింటిఁబోయి "పుల్లయ్యన్నయ్యా! నామా టేమిచెప్పినావురా నాయనా! గణ పతిని మావాఁడు చంపి నెత్తురు బొట్టు పెట్టుకుంటా నని ప్రతి జ్ఞచేసినాఁడు. నాబిడ్డను బ్రతికించరా నాయనా! నాకు పుత్రభిక్షము పెట్టరా నాయనా! నేనేమి జేతునోయి పుల్లయ్యతండ్రి! నాగణ పతిని నాకప్పగించవోయి పుల్లయ్యతండ్రి! ఈపెండ్లి వాడి ప్రాణ ముకోస మొచ్చిందిగాబోలునోయి నాయనా! పెండ్లి లేకపోయినా బ్రతికిపోదువోయితండ్రి! వా డెక్కడున్నాడో చూపించవోయి తండ్రి! వాఁడు కనఁబడకపోతే నేను బ్రతకలేను నాయనా!" యని పలువిధముల విలపించి వానిని రక్షింపు మని వేఁడికొనెను. ఆమె దీనాలాపములు విని పుల్లయ్య "ఓసివెఱ్ఱిముండ! నీవెంత తెలివితక్కువ దానవుగనుకనే వాండ్లు నిన్నీలాగున యేడిపించినారు. నాగన్న పరవళ్ళుతొక్కగానే సరేటే చంపుతానన గానే చంపగలఁడా? నెత్తురుబొట్టుపెట్టుకోగలడా? ఈయవకతవకకూతలకు కోతలకు వట్టి వెఱ్ఱిముండవు గనుక నీవు భయపడుచున్నావుకాని యెఱిగినవారెవ్వ రు భయపడరు. "వెధవనాగన్న కాఁబోలు వెలఁదిమగఁడు" అన్న

ట్లు నాగన్న సంగతి యెవ్వరెఱుఁగరు? వీడు గణపతినిచంపితే సర్కారువా రురితీయక మానుదురా? భయపడకు వెళ్లు. గణపతి ప్రాణానికి నాప్రాణ మడ్డముపేయగలను. ఏభయములేదు. మంగళసూత్రాలు తెంపివేసినాఁడుగాబోలేమి? తెంపనీ తెంపనీ కోర్టులోవ్యాజ్యముపేసి నాగన్న తాడు నేను తెంపుతాను. నీవువెళ్ళు. భోజనముచేసి మాయింటికిరా గణపతిని నేను తీసికొనివచ్చి నీకప్పగింతునులే." యని ధైర్యముచెప్పి యామెను పంపెను..

పంపిన నాఁటిసాయంకాలముబయలుదేఱి పుల్లయ వానపల్లి వెళ్ళి మహాదేవశాస్త్రియింట మనుకుడుపు పెండ్లికొడుకై యున్న గణపతిని జూచి మేనమామ యాడిన నాటక మంతయుఁ దెలిపి యిట్లనియె..—

నీమేనమామ మోటముండకొడుకు. నీవు కంటబడితివా చప్పున దుడ్డుకఱ్ఱతో బుఱ్ఱబద్దలు కొట్టఁగలఁడు. నెత్తిపగిలెనా ప్రాణము పోగలదు. తల్లికొక్కడవు. ఆముసలిముండ నిన్నే నమ్ముకొనియున్నది. కనుక నీవాగ్రామము పదిదినములదాఁక రావద్దు. కాని మీయమ్మ నిన్నుచూడవలెనని యేడ్చుచున్నది. దానినే నీదగ్గఱకు పంపించెదను. పిల్లపుస్తెలు తెంపివేసినాఁడవిచారించవద్దు. నేనెక్కడో నొకచోట పిల్లనుమాట్లాడి నీకుమరల వివాహము చేసెదను. ఒకవేళ నిన్నెవరైన పిలిచిపిల్లను దొంగతనముగా దీసికొనివచ్చి నీ కెవరు పెండిచేసినారని అడిగినపక్షమున నాపేరుచెప్పకు. నాకొంపముంచకు. నాగన్న నాకొంప ముంచగలఁడు. ఏపొలమో వెళ్ళివచ్చునప్పుడు దారిలో నాతల పగుల గొట్టఁ గలఁడు. ఈమాట గట్టిగా జ్ఞాపకముంచుకో." అని నొక్కినొక్కి చెప్పి తనపేరు బయట బెట్టకుండునట్లు జేతిలోఁజేయి వేయించుకొని మరునాఁడుదయమునను నింటికివచ్చి గణపతిక్షేమముగా నున్నాఁడని శుభవార్త తల్లి కెఱిగించెను. తల్లి

యుఁ గుమారుని జూడఁ గోరినందున నొక కూలివానిని సాయమిచ్చి యామెను వానపల్లి పంపెను, ఆమెయుఁ గూలివాని సాయమున వానపల్లిజేరి మహాదేవశాస్త్రి గృహమున కరిగి పోతవిగ్రహమువలె వీథియరుగుమీఁద గూర్చున్న కుమారునిఁ జూచి కౌఁగిలించుకొని యిట్లు విచారించెను. "నాతండ్రి! పసపు పారణి కాళ్ళకు పెట్టుకొని మొగమున కళ్యాణపుబొట్టు పట్టుకొని కన్నులకు కాటుకపెట్టికొని బుగ్గను చుక్కబెట్టికొని పల్లకిలో కూర్చుండఁగా చూడవలెనని యెంతో అంతముచ్చటపడితినిరా నాయనా! నాకన్నులు కాలిపోను. ఆయదృష్టము నాకులేదురా నాయనా! తక్కువ నోములు నోచిన వారి కెక్కువఫలములు వచ్చునటరా నాయనా! వంశము నిలుచు ననుకొన్నానురా నాయనా! పుల్లయ్య మన కుపకారం చేసినాడు గాని దైవ మోర్చలేదురా నాయనా. ఆదుర్గార్గపు ముండాకొడుకు మంగళసూత్రాలు తెంపివేసినాడు. వాఁడి చేతులు పడిపోను. పోనీ విచారించకు నాయనా! పెండ్లిగాకపోతే బ్రహ్మచారివై యుందువు గాని నాకంఠములో ప్రాణమున్నట్లయిన నిన్నేదోవిధముగ గృహస్థుఁ జేయకమానను. నీవు బెంగపెట్టుకోకు." అని యూరడఁ బలికి గణపతిని ముద్దుపెట్టికొని యతఁడు దోడ్కొనిపోవ మహాదేవశాస్త్రిగారి లోపలికిఁబోయి శాస్త్రియొక్కయు వారియాడువాండ్ర యొక్కయు సన్నానమువడసియాపూటనచ్చట నత్తెసరుపెట్టికొనిభోజనముచేసెను. భోజనానంతరమున మాతాపుత్రులు తమ భవిష్యజ్జీవనమునుగూర్చి గట్టిగా నాలోచింపఁ దొడఁగిరి. ఏనుఁగులమహాలులో నున్నపక్షమున మేనమామ తప్పకచంపివేయునని భయముపుట్టెను. మఱియొకచోట బోయినపక్షమున నక్కడజీవనోపాధి యెట్లని సంశయము పొడమెను ఆపూట వారికా యాలోచనలు తెగలేదు. నాటి రాత్రియు మరు

నాడును గూడ వారావిషయమై యాలోచించిరి. గాని యిదమిద్ధ మని నిర్ణయించుకొనలేక పోయిరి.

నా లు గ వ ప్రి క ర ణ ము.

గణపతి మేనమామకూఁతు నెత్తుకొనిపోయి దొంగపెండ్లి చేసికొనుటచేత నతఁడు నీచుఁడని చదువరులు తలంచుచున్నారేమో యని భయమగుచున్నది. ఇతరచారిత్రమునుబట్టి యతఁడు నీచుఁడో ఘనుఁడో చదువరులు నిర్ణయింపనగును గాని యీవివాహముచేతనే నీచుండని నిర్ణయింపరాదు. ఏలయన దమకుఁ గూర్చునట్టి కన్యల దొంగిలించుకొనిపోయి పెండ్లియాడిన వారిలో గణపతియే ప్రిప్రథ ముఁడుగాఁడు. ఈతనికంటెఁ బూర్వు లనేకులు గలరు. కలరని చెప్పినంత మాత్రిముననే కథకునిపై గౌరవము కలిగి యాతని వాక్యంబులు పరమప్రిమాణంబు లని విశ్వసించునట్టి మంచి కాలము గతించుటచేతను దగినదృష్టాంతములు, నుదాహరణంబులు చూపినంగాని యెట్టివారి మాటలనైనఁ జిన్నపిల్లవాఁడు సైతము నమ్మనిపాడుదినములు వచ్చియుండుటచేతను నట్టివారు పూర్వులనే కులు గలరని రుజువుచేయుటకుఁ గొన్ని యుదాహరణము లిచ్చుట మంచిది. ధర్మసంస్థాపనంబు జేసి శిష్టజనుల ననుగ్రిహించి దుష్టజనుల నిగ్రహించి భూభారమడంచుతలంపున శ్రీమన్నారాయణాంశమున మహీమండలమున యదుకులమునసవతరించి, కంస శిశుపాల దంతవ క్త్రి జరాసంధప్రిముఖులైనదుష్టులఁబరిమార్చి బ్రిహ్మర్షి రాజర్షి దే వర్షి గణములచేతను, భీష్మాదులచేతను గొనియాడఁబడినవాసుదేవుఁడు విదర్భరాజు శిశుపాలున కియ్యఁ దలంచినరుక్మిణి నెత్తుకొనిపోయివివా

హము జేసికొనుట జగత్ప్రసిద్ధమేకదా ! మహేంద్రుఁడు పుష్కలా వర్త మేఘములతో వచ్చినను వాని నొక పూరికైనఁగొనక ఖాండవ వన మగ్నిహోత్రున కర్పించిన ధైర్యసాగరుఁడును, నివాతకాలకేయాది దానవులను నిర్జించిన మహాధనుర్ధరుఁడును, ముక్కంటినిగెలిచి పాశుపతమహాస్త్రమును గైకొన్న బాహుశాలియు, గాండీవమను తెప్ప చేతఁ గౌరవసేనాసముద్రమునీఁదిన మేటిజోదును, తాను మూర్ధాభిషిక్తుఁడు గాకున్నను దేవేంద్రునియనుగ్రహమునఁ గిరీటంబుసంపాదించి కిరీటి యనుసార్థకనామము బడసిన విఖ్యాతుఁడును నగుపాండవ మధ్యముఁ డర్జునుఁడు వాసుదేవునిచెలియలగు సుభద్ర నెట్లు వివాహమాడె? శ్రీకృష్ణబలరాములుం దక్కినయాదవులు నింటలేనిసమయంబున సుభద్రను దొంగతనముగాఁ దీసికొనిపోవలేదా ? తనమార్గము నవరోధించిన యాదవులను దండింపలేదా ? కురుకులశిఖామణి యని చెప్పందగిన దుష్యంతుఁడు కణ్వమహాముని యాశ్రమము జేరి మాయలుమర్మము లెఱుఁగని శకుంతలను మచ్చికచేసి, యిచ్చకములాడి మనసు మెత్తపఱిచి పెంపుమతండ్రి యింటలేనితఱి నామెను జేపట్టలేదే? అవి యెవ్వరెఱుంగని రహస్యములు? ఈపురాణపురుషుల మాట యటుండనిచ్చి సామాన్యులవిషయ మించుక విచారింతము. వత్సదేశముల కధీశ్వరుండై యుదయనమహారాజొకానొకకారణంబున నుజ్జయనీపురాధీశ్వరుండైన ప్రద్యోతమహారాజునింటఁ గొంతకాలముండియాతనికూఁతురగువాసవదత్తకుగానము నేర్పుటకై యామె తండ్రిచేనియుక్తుఁడై, రాగములు నేర్పుటకుమాటుగా ననురాగంబులు నేర్పి యెట్టకేలకు నామెను దనవశము జేసికొని యర్ధరాత్రమునఁగోట గోడలు వాటించి తీసికొనిపోయి పరిణయము జేసికొనెను. నరనారాయణాంశసంభూతు లగుపార్థవాసుదేవులును, నుత్తమక్షత్రియుఁడైనవత్సరాజును, వివాహమునిమిత్తము కక్కుర్తిపడి దొంగపనులు చేయఁ

గాఁ దనకుఁబెండ్లికాదనుభయమున గణపతివంటివాఁడు కక్కుర్తిపడి పిల్లనెత్తికొనిపోవుట తప్పా? కృష్ణార్జునులు రాక్షసవివాహముచేసి కొనిరనియు, దుష్యంతుఁడు గాంధర్వవివాహము చేసికొనె ననియు శాస్త్రము లావివాహము లంగీకరించుచున్న వనియు మీరనవచ్చును. మహాపురుషులు చేసినయపరాధములకు మహర్షులేదో గతి కల్పించిరి గాని, మాగణపతిచేసినపనియే చేసిరి. వారికార్యములు దోషములైన పక్షమున వీనికార్యములు దోషములగును. వారివివాహములునిర్దుష్టములైనపక్షమున వీనివివాహము నిర్దుష్టమగును.

ఇది యటులుండనిండు. గణపతియొక్క భవిష్యజ్జీవితమును గూర్చి విచారింతము. మాతాపుత్రులు మూఁడుదినములహోరాత్రములు విచారించి, పౌర్వాపర్యములు బరీక్షించి, యాఁగాములనరసి మంచిచెడ్డలు మదిలోఁ దర్కించి, మహాదేవశాస్త్రియొక్క యాలోచనంగూడఁ గైకొని యేమఁగులుమహాలువిడిచి వానపల్లిగ్రామమున నివాసముచేయుటకు నిర్ధారణము చేసిరి.

తరువాత వానపల్లిలో జీవనమెటులుచేయవలె నని ప్రశ్నవచ్చెను. వచ్చుటయుఁ దల్లి కుమారునిజూచి "నాయనా! యాయవారముజేసికొని బ్రతుకవచ్చును. అక్కడమాత్రమిప్పుడంచలమెక్కుచున్నామాయేమిటి? రెండుపొట్టలు గడవకపోవునా? బతికితే బలుసాకేరుకొని తినవచ్చును. ఆదుర్మార్గునిచేతిలోఁబడకుండ మరెక్కడనున్నను మంచిదే. దుష్టులకు దూరముగా నుండుమన్నారు పెద్దలు" అని చెప్పెను. చెప్పుటయు గణపతి చివాలున లేచి "నేను యాయవారము చేయను. ఎల్లకాలము యాయవారమేనా? నేను వట్టిపనికిమాలిన వెధవననుకొన్నావా యేమిటి యాయవారము చేయుటకు? ఈయూరిలోఁ బడిలేదు. ఇక్కడబడిపెట్టి చదువుచెప్పుదును. నాలుగు రోజులనుండి నేనుచూచున్నాను. పిల్లలందఱు గాడిదలులాగున

దిరిగి చెడిపోవుచున్నారు. వాళ్ళందఱిని బాగుచేయవలెననియున్నది. చెంబు మూలఁబడవైచి బెత్తము చేతితోఁబుచ్చికోవలెను. ఇదేనావృత్తి. ఈయూరువారుకూడ బడిపెట్టుమనినన్ను బలవంతపెట్టుచున్నారు. మహాదేవశాస్త్రిగారు కూడ ఆమాటే అన్నారు. ఆయన నాకు వివాహవిషయములో మెంతో యుపకారం చేసినారుగనుక వారిగ్రామమునకు నేనీయుపకారము చేయక తప్పదు. గనుక నీవు మనయూరువెళ్ళి సామానుతెప్పించు. ఆనాగన్నగాఁడన్న గ్రామంలో మనముండఁగూడదు. వాఁడు వట్టిదుర్మార్గుఁడు. ఆతనిమొగంచూచినవారి కన్నము దొరకదు. ఈగ్రామములో మనము హాయిగా నుండవచ్చును." అనవుడు నామె "సరే మంచిది. ఆలాగే చేయవచ్చు" నని నాఁటిమధ్యాహ్నము బయలుదేరి యేనుగులమహాలు వెళ్ళెను.

వెళ్ళి పుల్లయ్యను గలిసికొని యతనిసహాయమున నొకబండి దెప్పించి దానిమీఁద తనసామాను లన్నియుఁ బడవైచెను. ఆసామానులెవ్వియో చదువరులు తప్పక యెఱుఁగఁ గోరుదురు. కాననందు ముఖ్యమైనవి పేర్కొనుట సమంజసము. పాత్రిసామానులు చెప్పఁదగిన వెవ్వియు లేవు. వరతంతుమహామునిశిష్యుఁడైన కౌత్సుఁడనుమునికుమారుఁడు యాచించవచ్చినప్పుడు రఘుమహారాజు వేనిలో నర్ఘ్యపాద్యములుపెట్టికొని సంభావించెనో యాపాత్రిలె వంటకు నీళ్ళకు వారియింట నుపయోగపడుచుండుటచే నవి పొరుగూరునకుఁదీసికొని పోఁదగినవి కావని యింటివారికిఁ గొన్ని చుట్టుప్రక్కలవారికిఁగొన్ని దానము చేసి తక్కినసామానులుమాత్రమె యామె బండిలోఁబెట్టెను. అవి యెవ్వియన చాలచోట్ల తోలూడిపోయి రెండుమూఁడు చిల్లులు గలబోనముపెట్టె యొకటి. మూతలేని తాటియాకులపెట్టె యొకటి. చెవులువిఱిగిన ప్రాతఱాతిచిప్పలు రెండు. చిల్లు లుండుటచే గూటిమైనముమెత్తిన యిత్తడిచెంబులు రెండు. అక్షయపాత్రిచెం

బొకటి. ఉప్పుపోసికొనుకఱ్ఱతొట్టె యొకటి. అంచుజవ యూడి మూలల చిల్లులుపడినచేఁటలు రెండు. కఱ్ఱసోల యొకటి. ప్రాతజల్లెడ యొకటి. జల్లెడవలె తూట్లుపడినప్రాతకంబళి యొకటి. ఒకకోడు విఱిగిపోయిన నులకమంచముకుక్కె యొకటి. కాడ సగమువిఱిగిపోయిన యినుపగరిటె యొకటి. గ్రంథియూడిపోయినపీట యొకటి. బల్లచెక్క యొకటి. ఒక సన్నెకల్లు, పొన్నూడిపోయిలరోఁకలి యొకటి. మఱియు నాలుగుమూఁడు త్రాటియాకుబుట్టలు రెండుమూఁడు వెదురుపేళ్ళబుట్టలు గూడ నుండవచ్చును. ఈసరకులు బండిమీఁద వేయించుకొని యామె తానుసోదరునిగృహముచెడలివచ్చినతరువాత తనకుఁ గుమారునకుఁ దలదాఁచుకొనుట కిల్లిచ్చి సాయముచేసినయా యిల్లాలినిపలు తెఱంగుల గొనియాడి యామెను వీడ్కొని పుల్లయ్య చేసినమేలునకు వానిని గూడ కొంతతడవు ప్రశంసించి వానికడసెలవుగైకొని పుట్టినింటివారిఁ దలఁచి వాండ్రు నాయుసురుగొట్టి పోకపోదురా! ఆఁడుపడుచు నేడిపించినవాళ్ళవంశములు నాశనము గాకమానవు. దానిపుట్టిల్లు గూడ బుగ్గియైపోవలె. నాయాశలాగె దానియాశలుగూడ అడుగంటిపోవలె దానికడుపు కాలిపోవలె. దానివాళ్ళందఱు వల్లకాటిపాలైపోవలె." అని తోఁచినన్ని తిట్లు తిట్టి, "పుల్లయ్య తండ్రీ! యేనుగులమహాలుకు నాకు ఋణము నేఁటితోఁ దీఱిపోయినది. ఈపాటిమీఁదనె చావవలె ననుకొన్నాను. ఈపాటిమీఁదనె మట్టి కావలెననుకొన్నాను. మావెధవనాగన్న మూలమున, ఊరికి దూరమై దేశాలపాలై దిక్కుమాలినపక్షినై పోవలసి వచ్చినది. మాసంగతి కొంచెము కనుక్కొనాయనా? అన్నిఁటికి నీవే మాకని యేడ్చి బండి యెక్కిపోయెను. గణపతి వానపల్లి పొలిమేరవద్ద కెదురుగ వచ్చిబండి తోలించుకొని మహాదేవశాస్త్రిగారియింటికరిగి సామాను దింపించి వారిపడమటింటివెనుకపంచపాళిలోఁ బెట్టించెను. మహాదేవశాస్త్రివెను

కపంచపాళి వారికి బసగ నిచ్చెను. సన్యాసిపెండ్లికి జుట్టుదగ్గఅనుంచి యెరువన్నట్లు గణపతియొక్క సంసారమునకువండికొనుకుండదగ్గఅనుంచి యెరువె. వంటకు రెండుమూఁడుకుండలు దాఁకలు మూఁకుళ్ళు కొనుట కైన వారిదగ్గఱ డబ్బులు లేవు. బండి కిరాయి పుల్లయ్య యిచ్చినం దున వారు సామాను తెచ్చికోఁగలిగిరి. మహాదేవశాస్త్రి వారిపేద స్థితి నెఱిఁగి రెండుమూఁడుకుండలు తెప్పించి వారి కిచ్చి మరునాఁడుద యమున తనకు మిత్రులైనబ్రాహ్మణులను గాపులను జేరబిలిచి యిట్లు నియె. "ఈగణపతిగారు మనగ్రామములో బడిపెట్టఁదలఁచికొన్నారు. ఆలాగున పెట్టుమని నేనే బలవంతపెట్టినాను. మనగ్రామములో బడి లేకపోవుటచేత మనపిల్లలు చెడిపోవుచున్నారు. ఈయన చాలపేద వాఁడు. అందుచేత మన మందఱము ముందుగగణపతిగారికిఁ గావలసి నధాన్య మీయవలెను. నామట్టుకు నేను రెండుకుంచాలధాన్య మి చ్చెదను. మీరందఱు తలకొకకుంచెడు రెండుకుంచములు నిచ్చిపాప మాపేదబ్రాహ్మణుని మనగ్రామములో నిలుపండి. ఈలాగిచ్చినం దుకు రెండువిశేషము లున్నవి. ముందుగా బ్రాహ్మణునకు సహాయ ము చేసెడువల్ల గలిగెడుపుణ్య మొకటి; మనపిల్లలకు విద్యవచ్చుట యొకటి. అందుచేత స్వలాభ మాలోచించికొని గాని పుణ్యము వచ్చునని కాని మన మీసాయము చేయవచ్చును. బ్రాహ్మణున కిచ్చుట యనఁగా మనము ముందుజన్మమునకు దాఁచికొనుట" అని యుపదేశించుటయు నచ్చటఁ జేరినవా రందఱు యథాశక్తిగ ధాన్య మిచ్చిరి. మహాదేవశాస్త్రిమాత్రము తన రెండుకుంచముల ధాన్యమీ యలేదు. కాని మాటసాయముచేసి యిప్పించినందుకు మనము సంత సింపవలెను. మాతాపుత్రులయొక్క భోజనప్రమాణము వారియాకా రములకు వయస్సునకుఁ దగని దగుటచే బదికుంచముల ధాన్యముదంపి కోగా వచ్చినబియ్యమైదుకుంచములు పదిపన్నెండుదినములలోనే యై

పోయెను. భోజనమునిమిత్తమేగాక వారికిఁ గావలసినసమస్తవస్తువులు గొనుటకు బియ్యమే యుపయోగపడుచుండును. ఉప్పు మెఱపకాయ చింతపండు మొదలగునవియెల్ల బియ్యమిచ్చియేకొనవలసి యుండెను. అదిగాక చిఱుతిండితినుటలో గణపతియుఁ దల్లియు నొకరికొకరుతీసి పోరు. ఈఁతపండ్లు రేఁగుపండ్లు చెఱుకుముక్కలునే రేడుపండ్లుమామిడి తాండ్ర తాటిచాప కొబ్బరికురిడీలు మొదలగున వేవి వీథిలోనికి వచ్చినను తల్లి యరసోలెడుబియ్యము బోసికొని తిని తీరవలయును. ఈ విధముగ సంసారము చేయుచుండుటచే వారికిచ్చినధాన్య మాటుట కష్టమయ్యెను. ఏఁడాదికి గ్రామవాసులు పుట్టెడుధాన్య మిచ్చునట్లు మహాదేవశాస్త్రి యేర్పాటు చేసి మూడుమాసముల కొకయేడుము ధాన్యముచొప్పున నిచ్చుటకు నిర్ణయముచేసి ముందుగ నొకయేడు ము వారికిప్పించి తమయరుగుమీఁదనే బడి పెట్టించెను.

అయిదవ ప్రకరణము.

బడి పెట్టకమునుపె గణపతి కాలువయొడ్డునకుఁ బోయి మంచి యీఁతబెత్తములు రెండుమూఁడు విఱిచి యాకులూడఁదీసి నున్నగాఁ జేసి యొకటి చేతఁ బట్టుకొని బడికి వచ్చి కొబ్బరియాకులచాఁపమీద గూర్చుండెను. ఉపాధ్యాయునిరూపురేఖావిలాసములుచూచినతోడనే బెత్తపుదెబ్బ లక్కఱ లేకయె బాలకుల కడలు జనించెను. ఈబెత్తము చేతఁబూని కూర్చుండినగణపతి బాలురకు సాక్షాద్దండ ధరుఁ డట్లుతోఁచెను. పంతులు దండధరుఁడైనపుడు పాఠశాల యమ లోకము నరకలోకము నగుట యొకయాశ్చర్యములోనిది కాదు. అక్షరములు రానిపిల్లల కక్షరములు బూడిదలో వ్రాసి యివ్వవలసిన

దనియు వ్రాసినయక్షరములు దిద్దించి నోటఁ బలికించవలసిన దనియు, పుస్తకములు పట్టినపిల్లలకు గణపతి యాజ్ఞాపించెను. బాలబోధ చదువువారికి రెండవపాఠపుస్తకము చదువువారిని గురువులుగఁ జేసెను. ఇంటిదగ్గఱ తల్లిదండ్రుల యొద్ద రుక్మిణీకళ్యాణము దాశరథిశతకము మొదలైనవి చదువుకొని వచ్చినవారిని వారికంటెఁ గ్రిందివారికొజ్జలుగ నేర్పఱచెను. తాను కలముఁ గాగితము బుచ్చుకొనిగాని యాకుగంటము బుచ్చుకొనిగాని యెన్నఁడు వ్రాసి యెఱుఁగఁడు. వ్రాత వ్రాయవలసివచ్చినపుడు పెద్దపిల్లలచేతఁ జిన్నపిల్లలకు వరవళ్ళు పెట్టించును. ప్రధానోపాధ్యాయుఁడు పాఠశాలలోఁ బాఠములు చెప్పకుండ దానొక యుపదర్శియై సర్వము జక్కఁగా జరుగు చున్నదో లేదో కనుఁగొనవలసిన దనినేఁటికాలమునబయలువెడలినక్రొత్తసిద్ధాంతమును మొట్టమొదట కనిపెట్టినమహాత్ముఁడు గణపతియే యని మీరు నిశ్చయముగ నమ్మవలయును. గణపతి బడికిఁ బోయినదిమొదలుకొని గోడకుఁ జేరఁబడి దాడలు నొప్పు లెత్తువఱకుఁ బొగచుట్టలుకాల్చును. దాడలు నొప్పు లెత్తినతరువాత గోడకుఁ జేరఁబడి కొంతసేపు చాప మీఁదఁ బండుకొని నిద్రపోవును. పిల్లలయల్లరివల్ల గాని దానంతటది గాని నిదుర మెలఁకువవచ్చినతరువాత రామరావణమహాసంగ్రామమునబలాత్కారముగా నిద్రనుండిమేల్కొలుపఁబడిన కుంభకర్ణుఁడు వలె నల్లరి చేసినవారిని జేయనివారిని గలిపి దూదేఁకిన తెఱఁగుననేకి విడిచి పెట్టును. బడి కాలస్యముగ వచ్చినవారిని "నీ వింతజా గేలచేసితి" వని బాదును. ముందుగ వచ్చి కూర్చుండినవారిని "వెధవ, నీ కేమి పని పాటలు లేవటరాలుంటిదగ్గఱ" యని మోదును. పాఠము తిన్నగఁ జదువని వానిని చదువనందుకు శిక్షించును. గబగబ పాఠ మప్పగించినవారిని "వెధవ! వెనుకనుంచి నిన్నెవరైనఁ దఱుము చున్నారా యేమిటి. అంతతొంద రెందు" కని దండించును. పాఠము మెల్లఁగా

నప్పగించినవారిని "గాడిద, నీవన్నము తిన లేదా లంఘనాలు చేసినావా మాట హీనస్వరముగ వచ్చుచున్న దేమి" యని తన్నును. పాఠము బిగ్గఱఁగఁ జదివినవారిని మొండివెధవ నేను చెవిటివాఁడ ననుఁ "న్నా వా యేమిటి? దాలిపిడతలాగున నోరు తెఱచి దయ్యాపుగొంతుతో ఆలాగున నఱచెదవెందు" కని దండప్రయోగముచేయును. ఇన్ని మాట లెందుకు! బడిలోనున్నంత సేపు ప్రతిపిల్లవాఁడు తనవీపుమీఁద నిప్పు డప్పుడనక యిందు కందుకనక బ్రతికుణము దెబ్బ పడుచున్నదని తలంపనలసినదె. పంతులవారు చాపమీదనుంచి లేచినారనఁగానె పిల్లలగుండెలు పీచుపీచు మను చుండును. దినమునకు నాలుగై దీఁత బెత్తములు విరుగ చుండును. బెత్తములు విరిగి నప్పుడు కలములతో నెత్తురువచ్చునట్లు పొడుచును. కలములు లేనప్పుడు గంటముమొనలు గూడ నాయుధము లగును. బందులపలకలు బోడిపలకలు తాటి యాకుపుస్తకములు, పుస్తకములనుగట్టెడి తాళ్ళు, చీపురుకట్టలు మొద లగునవన్నియు, ధనుర్వేదపారంగతునకు గడ్డిపఱకలు మొదలైనవి యస్త్రము లైనట్లు వానికి బరికరము లగుచు వచ్చెను. అవి దొరక నప్పుడు చేతితోఁ జఱచును. పిడిగుద్దులు గుద్దును. తొడపాశములు పెట్టును. చెవులు పెనివేయును. స్తంభమునకుఁ గట్టిపెట్టి చింతబరికెలు తెప్పించి వెన్ను నెత్తురుగ్రమ్మునట్లుకొట్టును. కోదండము తీయించును. ఎండలో నిలువఁబెట్టి మీఁద రాళ్లెత్తును. గోడకుర్చీలు వేయించి వారిపై బాలకులఁ గూర్చుండఁ బెట్టును. కొందఱను వంగబెట్టి కాలికి మెడకు లంకె వేయును. వేయ్యేల! పాపకర్మల నిమిత్త మని ధర్మరాజెన్ని నరకముల నిర్మించెనో గణపతి తనశిష్యులనిమిత్తమన్ని దండనలు సృజించెను. తమ బిడ్డలయందు మితిలేని ప్రేమగలగ్రామ వాసు లప్పుడప్పుడు పాఠశాలకుఁ బోయి "యేమండీ పంతులుగారూ! మాపిల్లవాని నంతదారుణముగఁ గొట్టినా రేమి. పిల్లవానివల్ల తప్పు

లుండవచ్చును. ఉన్నంతమాత్రముచేత నింతచేటు కొట్టుదురా? శరీర మంతట వాతలు బెట్టినట్టు దద్దురులు తేలినవి. అంతమోటతనమా? పసిబిడ్డలు నోరులేని వాళ్ళు చచ్చిపోఁగలరని మందలింప గణపతి యుగ్రుఁడై తారాజువ్వవలె లేచి కోపావేశమున మాటలు తడఁబడ "మీ పిల్లవాఁడు వట్టివెధవ. ఆవెధవను నే నేలాగైన బాగుచేయవలె నని భయభక్తులు చెప్పుచున్నాను. ఈలాగున వానిని మీరు వెనక వేసికొనివచ్చి నాతో దెబ్బ లాడితే యావెధవకు భయ ముండునా ? ఛీ పుణ్యమునకుఁ బోతే పాప మెదురుగ వచ్చినది. ఉపకారమున కివి రోజులు కావు. పిల్లవానిని బాగుచేసినా నని విశ్వాసము లేదు సరి గదా మీఁదుమిక్కిలి దెబ్బలాడుటకువచ్చినారా నామీఁదికి! మీపిల్ల వాఁడు నాబడిలోనికి రానేవద్దు. తీసుకొనిపొండి. పో రావెధవా" యని లేవగొట్టెను. ఒకపిల్లవాఁడు రెండుదినములు బడికిరాక మూఁడవదిన మున వచ్చినందున గణపతి వానికి బుద్ధివచ్చుటకై జుట్టుకు త్రాడు వోసి వానిని దూలమునకు గట్టెను. అది ప్రాతచేఁదత్రాడగుటచే వెంటనే తెగిపోయెను. పిల్లవాఁడు క్రిందఁ బడెను. ఆపాటున నొడలెల్ల గాయము లయ్యెను. దెబ్బ తగులకపోయినను దగిలినటులేడ్చుచున్నా వా దొంగవెధవా యని పైగా బెత్తముతో రెండు వడ్డించెను. వాఁడు గోలుపెట్టి పెద్దపెట్టున నేడువసాగెను. పదుగురు బడిచుట్టు జేరిరి. దయాదాక్షిణ్యములు లేక పశువును గొట్టినట్లీవిధమున గొట్ట వచ్చునటయ్యా యని కొంద ఱయ్యలు గణపతిని బ్రశ్నింప గణపతి యాక్షేపణపూర్వకముగ వారికిట్లనియె. "కుండలోఁగూఁడు కుండలో నుండవలె; పిల్లవాఁడు దుండుముక్కవలె నుండవలె నన్నారఁట వెనకటికి. మీమాట లాలాగుననున్నాయి. బెత్తము దాచినానా పిల్ల వాఁడు చెడిపోయినాఁ డన్నమాటే. ఈలాగున చిత్రవధ చేయుచున్న పుడే యీవెధవ లింతపొగరెక్కినారు. నేనూరకుంటినంటే వీళ్ళముం

దర లోకాలాగుతాయా? అతికాయుఁడు మహాకాయుఁడువంటివాళ్లీ వెధవలు. ఈమాత్రమునకే మీరీలాగున భయపడుచున్నారు. నా చిన్నతనములో మాగురువుగారు చేసినశిక్షలలో నిది యెన్నోవంతు! ఒకనాఁడు మాగురువుగారు గరిటెకాల్చి వాతలు పెట్టినారు. ఒకనాఁడు ముంతపొగ పెట్టినారు. గోడదగ్గఱ నేనుకూర్చుండఁగా నాతల గోడకు పెట్టికొట్టినారు. ఒక నియోగులకుఱ్ఱవానిని జునపములు పట్టుకుకొట్టఁగా జునపము లూడి చేతిలోనికి వచ్చినవి. ఒక కుఱ్ఱవానికి పాఠము రాకపోతే చమురుకాల్చిపోసినారు. ఒకపిల్లవాఁడుచదువకపోతేకాల్చే కాల్చేచుట్టతో చంటిపిల్లలకు దెబ్బవేసినట్టువేసినారు. ఇంతచేసినప్పటికి మేమేడ్వవలనుగాదు. నోట్లో గుడ్డలు కుక్కేవారు. పోనీచంటి పిల్లలేడ్చిపోదురని జాలిచేత నే నట్టిపద్ధతుల నవలంబించనే లేదు. పిల్లలంటే నాపిల్లలే. పూర్వపువాళ్లవలె నంత కఠినపద్ధతులు మన మవలంబించలేము. నేనంతదయతోఁ జూచుకొనుచున్నప్పటికి మీకు విశ్వాసము లేక నన్నడ్డమైనమాట లనుచున్నారు. ఒకమాటు పాఠము చదువకపోతే కంట్లో కారపుపొడి మిరపకాయపొడి వేసేవారు. ఒకపరియాయము నేను బడికి రాక యాగడముసేయ జుట్టుకుత్రాడు పోసి నూతిలో దింపినారు. అంతంత శిక్షలు చేసి యాయన నాలుగు ముక్కలు చెప్పబట్టి నేనింతబాగుపడి యక్కఱకు వచ్చినాను. ఆమహారాజుపెట్టినదీపమిది. ఈవృద్ధంతా యాయనదే. ఆయనకెదీపముపెట్టి మొక్కవలె. ఈగ్రామములో పిల్లలనందఱను నాయంత వాళ్లను చేయవలె నని తలంచుకోగా మీరాపని సాగనియ్యక బాధపెట్టుచున్నారు. పోనీ, నాదేమిపోయినది. చదువుకొన్నారో యింతన్నము దిని బాగుపడ్డారో; లేకపోతే చెడిపోవుదురు. నాకేమి."

అని తానొక మహావిద్వాంసుఁ డైనట్లు తా నావిద్యలు బహుపరిశ్రమచేసి గురువు పెట్టెడు బాధలు పడి నేర్చికొన్నట్లుకొన్నికోతలు

కోసెను. ఆతని పాండిత్య ప్రభావ మెఱింగినవారు వానిదంభము విని ముసిముసి నవ్వులు నవ్వుకొని పోయిరి. ఒకనాఁ డొక గ్రామ వాసి వచ్చి "పంతులుగారూ! ఏమండీ యిది. మాపిల్లవాఁడు మీబడి లో ప్రవేశించి యాఱుమాసములైనది. ప్రవేశించినపు డెంతచదువు వచ్చునో యిప్పుడంతె వచ్చును. మీరు బొత్తిగాపాఠములు చెప్పుట లేదా యేమిటి" యని యడిగెను. అట్టిప్రశ్నలకుత్తరము గణపతియొ క్క జిహ్వాగ్రమందు సిద్ధముగానె యుండునుగదా. "అయ్యా! మీ వాఁడు మిక్కిలి యల్లరిపిల్లవాఁడు. ఆపిల్లవానికి నేను చదువు చెప్పుట కంటె భయము చెప్పుట మంచిదని యాలోచించి చదువు చెప్పుట మాని ముందుగా భయము చెప్పినాను. వెధవచదువు. చదువెంతసేపు వచ్చును. భయమువచ్చుట చాలకష్టము. చదువనఁగా మీయభిప్రా య మెంతో యున్నదనుకొను చున్నారు కాఁబోలు. అంతచదువు నేను నెలదినములలో చెప్పివేయఁగలను. అదిగాక చదువు మఱియొక పంతులైనఁ జెప్పఁగలఁడు. మీపిల్లవానికి నావలె భయము చెప్పఁగల వారు మఱొకరులేరు. మీపుణ్యముచేత నేనీయూరు రాబట్టి మీపిల్ల వాఁడు బాగుపడినాఁడు. లేకపోతే వాఁ డెందుకు పనికిరాకపోను. ఇప్పుడు వాని కెంతభయము వచ్చిన దనుకొన్నారు. నాపేరువింటే వానికి గడగడ వణకు. నేను నడచుచున్న వీధిలో నడవఁడు. మొన్న రాత్రిమీయమ్మగారు చెప్పినారు. అన్నమెక్కువయైనది. నేను తిన లేదనన్నాఁడట మీవాఁడు. పంతులుగారిని పిలవనా తింటావా యని మీయమ్మగా రడిగినారఁట. ఆమాటనఁగానే చచ్చినట్టు కంచములో నున్న యన్నమంతయు కిక్కురుడామనకుండతిన్నాఁడట. భయమనఁ గా నాలా గుండవలె. ఏఁడీ పిల్లలకు నావలెభయము చెప్పఁగల పంతులును వేలుమడిచి మరొకని చెప్పండి. వెధవచదువు. కూర్చున్న గుడ్డిముండ చెప్పగలదు. చదువుచెప్పుట కష్టమనుకొన్నారాయేమిటి?

దాశరథీ యని రెండుకూనిరాగాలు తీసి చెప్పగానే సరా యేమిటి. భయము చెప్పాలి. అది ప్రజ్ఞ. అదిసొగసు. పంతులును చూడఁగానె గజగజ వణకి మూర్ఛపోవాలి పిల్లవాఁడు, వాఁడె పంతులు. తక్కినవాఁడు పంతులుమెంతులు పాపుశేరుమెంతులు ఎగరేసికొడితె యేమి మెంతులు. అలాటిపంతుళ్లు పనికిరారు. పంతులంటేనేనేపంతులను." అని ప్రత్యుత్తరము చెప్ప నాతఁడు తెల్లపోయి మాటుమాటాడక తనపిల్లవానినిబండి గంపుటమూనెను.

గణపతి బడిలో గూర్చుండునప్పుడు కునికిపాట్లు పడుచుబాలు రకడ పాఠము లప్పగించుకొనును. కునికిపాట్లు పడుచునే చెప్ప దలఁచుకొన్నముక్కలు చెప్పును. ఒకప్పుడు కునికిపాట్లు పడుచునేఁ చుట్ట కాల్చును. ఒకనాఁడు కునికిపాట్లలో నోటనున్నపొగచుట్ట కట్టుకొన్న బట్టపైఁబడి బట్ట కాలఁజొచ్చెను. పంతులుగారు బ్రతికియుండఁగానే శరీరము దగ్ధమగు ననుభయమున బాలురు కళవళపాటు నొంది పంతులుగారు! బట్ట కాలుచున్న దని కేకలువయిచి మేలుకొలిపిరి. ఆ కేకలు విని గణపతి మేల్కొని చేతులతో నలిపి బట్ట యార్చి లేచి బెత్తముపుచ్చుకొని పాడుముండకొడుకులారా, బట్టంటుకోగానె కాలి చచ్చిపోదు ననుకొన్నారా యేమిటి? మెల్లగా లేపలేకపోయినారా? అంతంత కేక లెందుకు? నిక్షేపమంటినిద్ర చెడగొట్టినారు. వెధవలని వరుసగా నొక్కొక్కరినె వీపు బ్రద్దలుకొట్టెను. మఱియొకనాఁ డావిధముగానె గణపతి నోటిచుట్ట కునికిపాట్లలో నుత్తరీయముపైఁబడ నది కాలఁజొచ్చెను. లేపినపక్షమున పంతులుగారు చావగొట్టుదు రని పిల్ల లూరకుండిరి. వీఁధిని వెళ్ళువా రెవరో యది చూచి గణపతిని మేలుకొలిపిరి. ఆతఁడు మెలకువ తెచ్చుకొని బాలకులఁజూచి "యోరి దరిద్రగొట్టు వెధవలారా! నేను కాలి చచ్చిపోతే సుఖముగ నుండవలె ననుకొన్నారా? ఇంతంత దుర్బుద్ధులామీ"కని బెత్తము విఱుగు

వఱకు తాషాలువాయించినట్లు వీపులమీఁద వాయించెను. ఒక నాఁడు లెక్కలు చెప్పుదును రమ్మని బాలకులం దనచుట్టుఁ గూర్చుం డఁబెట్టుకొని యంతలోఁగన్నులుమూఁతపడ కునుకుచు ముప్పదిరూపాయల పందొమ్మిదణాల యిరువదిపైసలు. దీనిని పదకొండు పెట్టి హెచ్చవేయుం డని చెప్పెను. అప్పు డొక పిల్లవాఁడు లేచి "పంతులు గారండి! పందొమ్మిదణా లుండవండి, ఇరువదిపైస లుందవండి" యని చెప్పెను. అది విని గణపతి కన్నులు తెఱచి యాపిల్లవానివంక తేఱిపాఱఁజూచి "యోరితుంటరివెధవా! ఉండవేమి? ఎందుకుండవు నాకన్న నీ కెక్కువ తెలుసునా నాలుగుముక్కలు వచ్చినవో లేదో యప్పుడే పంతులుగారికే పంగనామాలుపెట్టఁదలచుకొన్నావా? ఈలాటి వెధవవు నీ వక్కఱకు వత్తువటరా?" యని యాదినమున బెత్తమది వఱకె విఱిగిపోవుటచే జుట్టు వంగదీసి చాకలివాఁడు బట్ట లుదికిన తెఱంగున చరుపుమీఁద చరుపు పడునట్లుగా దనచేయి నొచ్చువఱకు గొట్టి యిటువంటివెధవలకు లెక్కలే చెప్ప"ననియూరకుండెను. మఱి యొకనాఁడు కునికిపాట్లుపడుచు ముప్పదియాఱురూపాయల డెబ్బది యా ఱణాల యఱువదియాఱు పైసలు కలపండి" యని చెప్పెను. "ఒకకచ్చమే చెప్పినారుపంతులుగారూ! రెండవకచ్చము చెప్పలేదు. ఏలాగున కలపమండి" యని పిల్ల లడిగిరి. అడుగుటయు నతఁడు కోపోద్దీపితుఁడై ఈలాటి వెధవప్రశ్నలు వేయకుండ చెంపలు పగులఁగొట్టెద చూడం"డని యొక్కొక్కని నాలుగేసిచెంపకాయలుకొట్టి వారి పలకలు వీథిలో గిరవాటు వైచెను. చాలమంది పలకలు పగిలిపోయెను. పిల్లలతలిదండ్రులు సంరక్షకులు వచ్చి పలక లేల పగలఁగొట్టినా రని గట్టిగా నడుగ గణపతి మీపిల్ల లే పగులఁగొట్టినారుకాని నేను పగులఁగొట్టలే దని యబద్ధమాడి యొట్టుపెట్టుకొని ప్రమాణము చేసి యాయాపద తప్పించుకొనియెను. ఒట్లు ప్రమాణములు గణ

పతికి లెక్కలోనివికావు. అతని దృష్టిచేత నన్నియు గాలికిపోవుమా టలె కావున వాని కనృతభయ మనునది లేదు.

గణపతియొక్క పాండిత్యప్రభావము బోధనాశక్తి యెట్లు న్నదో తెలిసికొని యానందింపవలె ననిచదువరులు కుతూహల పడు చుందురు. కావున నట్టి విశేషములు కొన్ని యుదాహరించుట సమం జసము. ఆబడిలోఁ జదువుకొననిక్రొత్త బాలుఁ డొకనాఁడు పాఠశాల కు వచ్చి గణపతియొక్క వికారరూపమును వికృతచేష్టలను విపరీతపు బ్రసంగమును విని యాతనిచేత మాట లాడించి యానందింపవలయు నని నిశ్చయించి దాశరథిశతకములోని "శ్రీరఘురామ చారుతులసీ దళధామ" యనుపద్యము చదివి "పంతులుగారూ! దీని యర్థము మీ ముఖతఃవినవలయుననియున్నది. మీరు బహుసరసముగఁ జెప్పఁ గలరని విన్నాను. కావున సెలవియ్యవలయు" నని యడిగెను. అటు వంటిప్రశ్న పాఠశాలలోనిబాలుఁ డడిగినపక్షమున వానిపీపు ఫుల్లమ జ్జగపోసి కాల్చినరొట్టెవలె దెబ్బలతో నుబికి యుండును. అడిగిన వాఁడు పాఠశాలావిద్యార్థిగాక పైవాఁ డగుటచే గణపతియేమియుఁ దోఁచక పచ్చివెలగకాయ గొంతుపడినటు లేమాటయు రాక క్రిందు చూచి మీదుచూచి నలుప్రక్కలుజూచి తన బుద్ధి నుపయోగించి యర్థము చెప్పవలయు నని నిశ్చయించి పద్య మాపిల్లవానిచేతనె చదివించి యీవిధముగ నర్థము చెప్పెను. శ్రీరఘురామ=శ్రీరాముల వారు, చారు=ఒకనాడు పైత్యముగానుండి చారుకాపించుకొన్నారు. తులసీదళదామ=ఆ దేశములో కరివేపాకు లేదుగనుక తులసిదళములే యందులో వేసి పొగిచినారు. శమక్షమాదిశృంగారగుణాభిరామ=శ్రీ మయావత్తు పోగొట్టగలిగి బహుశృంగారముగా నున్నదట ఆచారు. త్రిజగన్నుతశౌర్యరమాలలామ=ఆచారు త్రాగినతరువాత ఆరాముల వారికి కావలసినంతశౌర్యము కలిగిందట రాక్షసులను చంపుటకు.

దుర్వారకబంధరాక్షసవిలోమ=వారి కందఱకు కష్టము పుట్టకుండ పోయినదఁట. జగజ్జన కల్మషార్ణవోత్తారకనామ=ఆచారు తారకమంత్రములాగు త్రాగినజనులందఱకు గల్మషము కొట్టివేసినది. భద్రిగిరి=వారి కెంతో భద్రము కలిగినది. అంతవఱ కర్థము చెప్పునప్పటికె ప్రశ్న మడిగినపిల్లవాఁడు నవ్వుపట్టలేక నవ్వుచునే "వహావా పంతులుగారూ! వహావా ఈపద్యార్థము నే నెందఱుపండితులనో యడిగితిని. కాని మీవలె నింత రసవంతముగాఁ జెప్పినవా రొక్కరు లేకపోయినారండి. రాయలవారివంటి మహారాజొకఁ డిప్పుడున్నపక్షమున మీవంటివారి కెన్నో యగ్రహారము లిచ్చు"నని యాతనిప్రజ్ఞా విశేషము నగ్గడించెను. గణపతి యాప్రశంస యంతయు నిక్కముగాఁదలంచి మిక్కిలి వినయముతో "అయ్యా! నేనంతవాఁడను. తమ దయచేత నాలాగనుచున్నారు. కాని నే నంతపండితుఁడను కానండి. ఆసరస్వతీదేవిదయవల్ల నాకు నాలుగుముక్కలు వచ్చినవి కాని నేను పట్టుమని శాస్త్రములు చదువుకో లేదండి." యని బదులు చెప్పెను. పైపద్యముయొక్క యర్థమునుబట్టి గణపతి యెంతప్రజ్ఞాశాలియో వానికడ నెటువంటివిచిత్రభావములున్నవో యెంతసమయస్ఫూర్తియున్నదో సరసులు నిష్పక్షపాతమనస్కులు నగువారందఱు గ్రహింపవచ్చును. వ్యాకరణశాస్త్రమొ తర్కశాస్త్రమొ చదువుకొని శబ్దము నకపార్థము కల్పించి నిజ మబద్ధ మని యబద్ధము నిజ మని కల్లవాదములు సేయుపండితులను జూచి జనులు జోహారులు చేసి వారిచెవులకు సువర్ణకుండలములు తగిలించి శాలువలు కప్పి యఖండసన్మానము చేయుదురు. కాని గణపతి శ్రీరఘురామ యన్నపద్యమునకు స్వకపోలకల్పితముగ నత్యంతరమణీయ మైనయర్థము చెప్పినపుడాగౌరవము జూపుట లేదు. సరి గదా మీఁదుమిక్కిలి యపహాస్యము జేయుదురు. ఇది మెత్తనివారికి దినములుకావుగదా.

పూర్వోదాహృతపదార్థమును బట్టి యతనియాంధ్రసాహిత్య ప్రభావము తేటపడినది. సాహిత్యమునందేకాక యతనికి శారీరశాస్త్రమునందును మఱికొన్ని యితరవిషయములందును గలప్రవేశము దెలుపుటకై కొన్నిమాట లవస్యకర్తవ్యములు. ఎవఁడో పిల్లవాఁడు జ్వరముచేత బాధపడుచున్నాఁడని తెలిసినప్పుడు జ్వరమునుగూర్చి యతఁడు చేసిన చిన్నయుపన్యాస మెల్లవారు వినఁదగియున్నది. జ్వర మెందుకువచ్చునన్నఁగా మనకడుపులో బొడ్డుదగ్గఱ దీప ముండును. ఆదీప మొకప్పుడు భగ్గున మండి పెద్దదగును. అప్పుడు లోపల వేఁడి చాల పుట్టును. లోపలవేఁడిచేత పైచర్మముగూడ వెచ్చబడును. లోపల దీపము మండుచుండుటచేతనే జబ్బుగా నున్నవానికి కడుపులో మంటలు బయలు దేఱును. ఆదీపము తగ్గి యథాప్రకారమైతే జ్వరము తగ్గిపోవును. ఆదీపమాఱిపోయినప్పుడు మనము చచ్చిపోవుదుము. ఆదీపము వెలుగుటకై మన మన్నములో నెయ్యి చమురు వేసికొనవలెను. చమురు లేకపోతె దీపాలు వెలుగవుకాదా?

ఉఱుములు వర్షములు పిడుగులు మొదలగువానింగూర్చి గణపతి యీవిధముగఁ జెప్పుచుండును. "దేవుఁడు బండి యెక్కి యాకాశముమీఁద తిరుగుచుండును. ఆబండిచప్పుడె యుఱుము. అప్పుడప్పు డాబండిసీల లూడికిందబడు చుండును. అవియె పిడుగులు దేవునిబండికిఁ గట్టినగుఱ్ఱాలడెక్కలు రాళ్లమీఁద తగులుటవల్లనిప్పులు మంటలు బయలుదేఱును. అవె మెఱుపులు. వాన నన్నఁగా తిరిగి తిరిగి వచ్చిన మీఁదట దేవునివంటిమీఁద పట్టినచెమట. గాలి వేసినప్పుడు వాన రాకపోవుటకుఁ గారణమేమో తెలుసునా? గాలివిసరినప్పుడు చెమట యారిపోవును. సూర్యుఁడనఁగా దేవుఁడుగారియింట బెట్టికొన్నకుంపటి. చంద్రుఁడంటే దేవుఁడుగారియింట్లోయి త్తడిసిబ్బె ఈవిధముగ గణపతి యనేకశాస్త్రములలోఁ బ్రవేశముగలిగి తాను

నేర్చినవిద్య యొరులకునేర్పనివాఁడు ముందుటఁజన్మమునమునిణిచెట్టై పుట్టు నని పెద్దలనోటినుండి వెడలువాక్యములు పలుమాఱు విని యుండుటచే నట్టివిషపుచెట్టై పుట్టుట కిష్టవము లేక తనకడుపులోనున్న జ్ఞాన మంతయు నిప్పుడప్పు డనక ప్రసంగము వచ్చినపుడు తనవిద్యార్థులకు గ్రామవాసులకు జెప్పు చుండును. సర్పములను గురించియు సర్పస్వభావచేష్టితములను గురించియు నాతనికిదెలిసినజ్ఞానములోకోపకారముగ నుండును. కావున గ్రంథవిస్తరిత కైనను నొడంబడినవిషయమందలిముఖ్యాంశము లిందుఁ బొందుపఱుపఁబడుచున్నవి.

"పాము దీర్ఘ క్రోధము గలజంతువు. దానిజోలికిఁ బోయిన మనుష్యునిపై నదికసిపట్టి పగపూని యుండును. పాముకసి పాముపగ యని మీరు విన లేదా! తనజోలికి వచ్చినవాఁడు వెంటనే దొరికిన యెడ వానిని వెంటనే కఱచి చంపును. వాఁడు దొరకనప్పుడె దాని సొగసు, దానితమాషా. వాఁడు దొరకనప్పుడు పగబట్టి వాఁడెన్ని మేడలమీఁదఁ బండుకొన్నప్పటికి యెన్ని మిద్దెలమీఁదదాఁగొన్నప్పటికి ఎంతమందిలో నిద్రిపోయినప్పటికి రాత్రివేళ వెళ్ళి వానినిపట్టి కఱచి చంపును. ఎలాగో తెలుసునా? ఎవరి మీఁద పాము పగ పట్టునో వానియడుగు లనుఁగా వాఁడునడచిన చోటు తియ్యగానుండును. తక్కినవానియడుగులు చప్పగా నుండును. ఆ యడుగుల తీపినిబట్టి వాఁ డున్నచోటికిఁ బోయి మెల్లగ కాటువేయును. అందుచేత పాముపగ గలవాఁడు తిన్నగా నడువకవంకరటింకరగ నడువవలెను. అప్పుడు పాముగూడ వంకరటింకరగ నడచును. ఆలాగున నడచినయెడల దానియెముకలు పటపట విఱిగిపోవును. ఒకప్పుడు పాముపగ గలవాఁడు నడవక బండెక్కి గాని మనుష్యులభుజమెక్కి గాని వచ్చుట మంచిది. అడుగులజాడ లేదు గావున నప్పుడు వాఁ డున్నచోటికి పాము రాఁ జాలదు."

ఈ తెఱంగున నతఁ డెల్లవిషయములఁ దనకుఁగలజ్ఞానము లోక హితార్థముగ వెలిబుచ్చు చుండును. ఆతని కేవిషయమున నెంతజ్ఞాన మున్నదో యది యెంతవఱకు యర్థ మైనజ్ఞానమొ తమబిడ్డలకతఁ డు విద్య జెప్పుచున్నాఁడో లేదో యితనిపాఠశాలకు బోయినందున తమబిడ్డ లెంతబాగుపడు చున్నారో తెలిసికొనువారు గ్రామస్థులలో ననేకులు లేరు. అట్టివాఁడు నూటి కొకఁ డుండ వచ్చును. తనపిల్ల వానిని మిక్కిలికఠినముగ శిక్షించినాఁడని యిద్దఱు ముగ్గురు గణపతి తో వివాదపడిరే గాని చదువువిషయములో వివాదపడువా రరుదు. పంతులుగారు మాకు సరిగా పాఠములు చెప్పుట లేదని కొందఱు పిల్లలు తల్లిదండ్రులతో మొఱవెట్టుగొనిరి. కాని యామొఱలు తల్లి దండ్రుల మనస్సున కెక్కలేదు. పంతులుగారినిఁ గట్టక బిడ్డలు లేనిపోనినేరములు వానిమీఁద చెప్పుచున్నారని తలిదండ్రు లూహిం చిరే కాని దాని యాథార్థము జక్కగా నఱసికనుఁగొనవలయునని వారికి తోఁచ లేదు. పంతులుగా రతికూరశిక్ష జేయు చున్నారని బిడ్డలు గోల పెట్టినప్పుడుసయితము తమబిడ్డలను మిక్కిలిగారాబమున బెంచుకొనుచున్నవా రిద్దఱుముగ్గురు దక్క దక్కినవా రామొఱ చెవినిడక పిల్లవాళ్ళేదోదుండగము చేయఁబట్టి పంతులు కొట్టుచున్నా డే కాని యూరక కొట్టునా? పిల్లలమాటలు పట్టుకొని పంతులు గారితోవివాదపడుట మంచిది కాదు." అని యావిషయమై వారెంత మాత్రము విచారింపరైరి. అభిమన్యుఁడు పద్మవ్యూహమందుఁబ్రవే శించుటయె గాని దానినుండి వెలికివచ్చుట యెఱుఁగనట్లు గణపతి శ్రుతపాండిత్యప్రభావముచేత నేవో కొన్ని లెక్కలు చెప్పుటయె యెఱుఁగును కాని పిల్లలు లెక్కలు చేసిన తరువాతనవిసరిగనున్నవో లేదో దిద్దుట యెఱుఁగఁడు. ఎవరిదితప్పో నిర్ణయింపఁజాలఁడు. ఉన్న పిల్లలలోఁ బెద్దవాఁడు చేసినదే సరి యని దానింబట్టి తక్కినవారి

లెక్కలు నిర్ణయించును. అందుచేత నతనిప్రజ్ఞాసారము బాలకులెల్ల రు గ్రహించిరి. చదువురాకపోవుటయు దెబ్బలు ప్రతిదినమువర్షధార వలె పడుచుండుటయు సంరక్షకులుఁ దలిదండ్రులు తమ మొఱలు వినకపోవుటయుఁ జూచి బుద్ధిమంతులైనకొందఱుపిల్లలుపంతులుగారికి మెల్లమెల్లఁగ లంచములు మప్పిరి. తిరుపతివెంకటేశ్వరు మొదల గుదేవతలే ధనము పండు మొదలగు లంచములు మరిగి భక్తజనుల కుపకారమ్ములు చేయుచుండఁగాఁ బల్లెటూరిపంతు లొకఁడులంచముల కాశపడి విద్యార్థులయెడ నిగ్రహానుగ్రహములు చూపుట యాశ్చ ర్యమా. ఒకనాఁడొకపిల్లవాఁడు నాలుగరఁటిపండ్లు తెచ్చి పంతులుగా రికి సమర్పించెను. అవి తిని గణపతి యాదినమున వానినొకదెబ్బయైన నఁ గొట్టలేదు. ఆపరమరహస్యము వెంటనే బాలకులందఱు గ్రహిం చి గురువు దైవసమానుఁడు గనుక దైవమున కర్పించినట్లె మరునాఁ టినుండి గురువుగారికిఁ గట్నములు కానుకలు ముడుపులుసమర్పణమ్లు సేయఁజొచ్చిరి. వైశ్యబాలకులు బెల్లము పటికిబెల్లము పంచదార వ క్కలు లవంగములు మొదలయినవి సమర్పింపఁ జొచ్చిరి. పంటకాపు లబిడ్డలు పొగచుట్టలు, వీలైనప్పుడు శనగలు కందులు కూరలుమొ దలగునవి తెచ్చి యియ్యఁ దొడఁగిరి, బ్రాహ్మణబాలకులు తలిదం డ్రులనడిగియు వారీయనప్పుడు గూళ్ళలోను దూలములమీఁదగదుల పెట్టెలలోను దాఁచికొన్నవి దొంగలించియు డబ్బులు తెచ్చి యియ్య దొడఁగిరి. ఏదేనివస్తువు నివేదింపఁబడిననాఁడు విద్యార్థులకు దెబ్బలు తప్పిపోవుటచే, బాలకులు బదులు తెచ్చియో దొంగలించియో తలిదం డ్రుల నడిగి తెచ్చియొ యేదోయొకటి పంతులుగారికి సమర్పించిదం డనము తప్పించుకొనుచు వచ్చిరి. ఈపద్ధతి నవలంబించిన తరువాత గ్రామస్థులయిండ్లలో పెద్దవాండ్రు దాచికొనిన పొగచుట్టలు డబ్బు లు కనఁబడకపోయెను. ఎవరో దొంగలు వచ్చినారని గోల బయలు

దేతెను. ఇంటిదొంగ నీశ్వరుఁడైనఁ బట్టుకొనలేఁడు కదా! ఇట్లనుట చేత బెత్తమునకు బొత్తిగా పని తప్పిపోయిన దని మీరనుకొనవద్దు. ముదుసలులు తెచ్చుటకు శక్తిలేని నిర్భాగ్య లగుబాలకులమీఁదదండము ద్విగుణముగఁ బ్రయోగింపఁబడుచు వచ్చెను. కార్తవీర్యార్జునుఁడు మొదలగుమహావీరులు బాహులతీట తీరుటకై లేనిపోనికయ్యములు కల్పించిన విధమున గణపతి తనచేతులతీట తీరుటకుఁ గొట్టవలయు ననుముచ్చట తీరుటకు నెన్నోవంకలు కల్పించి కానుకలు తేఁజాలని పేదబాలకులను చిత్రవధ చేయనారంభించెను. ఆపీడ తప్పించికొనుటకై వారుగూడ బహువిధోపాయముల నన్వేషించి గురుప్రీత్యర్థము కానుకలు తెచ్చుటకై చిన్నచిన్న దొంగతనములు చేయనారంభించిరి. వీధిలో నెండబోసిన వడ్లు దొంగిలించినవారు కొందఱు, దుకాణములలో గూర్చుండినట్లె కూర్చుండి డబ్బులో సరకులో దొంగిలించెడు బాలురు కొందఱు, అప్పుడప్పు డీబాలకు లలవాటు లేని దొంగతనమునఁ బట్టువడి పంతులవారిచేతినుండి తప్పించుకొనఁదలఁచిన శిక్ష వస్తుయజమానులచేత పడఁ జొచ్చిరి.

గణపతియొక్క చిత్రచేష్టలునిని యింతకుమున్ను చదువుకొనుట కిష్టములేనివా రయ్యు విద్యాభ్యాసమునం దెక్కడ లేనితమకము గలవారై మొట్టమొదట వినయవినమితగాత్రులై తమ్ము శిష్యులుగఁ బరిగ్రహింపవలసిదదనిగణపతిని వేఁడి యతనియనుగ్రహపాత్రులై యతనిశిష్యగణములోఁ జేరిరి. చేరి వీరైనప్పుడు తామల్లరిచేయుచు వీలుకానప్పు డేదోచెరుపు చేయు మని తమకంటెఁ జిన్నవాండ్రిఁ బురికొల్పుచు వారుచేయునట్టియల్లరిఁజూచిమహానందమునొందుచుండిరి. పెద్దపిల్లలు చేరినతరువాత చిన్నపిల్లలకు మునుపటికన్న ధైర్యసాహసములు హెచ్చెను. ఒకనాఁడు గణపతిశిష్యులకు తాను చిన్నప్పుడు నేర్చిన 'ఎవరయామీరు చక్కనిరాజులిద్ద' అనుపద్యముక్తలేఖనముజెప్ప

దొడఁగెను. పదుగురు బాలకులదివ్రియుచుండిరి. నేనన్నమాటమీరు మరల ననవద్దని గణపతి వారి కాజ్ఞయొసఁగెను. ఆయాజ్ఞ చెవి నిడక మొదటనున్న బాలకులు ఎవరయామీరనిగణపతిచెప్పఁగా యెవరయా మీరని మరల ననఁజొచ్చిరి. గణపతి కోపావిష్టుఁడై యాబాలకుల తలలు గోడనుబెట్టి దండించుచుండఁగాఁ జిట్టచివరనున్న బాలకులుమ రల నెవరయామీ రని పలికిరి. మొదటివారిని వదలి గణపతి చివర వారిని దండించుటకై రాఁగామధ్యబాలకు లావిధముగ నరవజొచ్చిరి. తాడనము చేయుటకై వారికడ కతఁడు పోఁగా మొదటిపిల్లలు జివరపిల్లలుగూడ నొక్కపెట్టుననఱచిరి. అప్పుడుగణపతికోపావేశమున నిజముగ నొడలుమఱచిపోయి యాబాలకులలో నొక్క బక్కవానిని బట్టికొని చేయినొచ్చువఱకు చఱుపులు చఱచి క్రిందఁబడవైచి కాలి తోఁ ద్రొక్కి నాబడిలోనుండి లేచిపో వెధవా యని యరుఁగుమీద నుండి రెండుకాళ్ళు పట్టికొని క్రిందికిలాగెను. ఆపిల్లవాఁడుసహజముగ దుర్బలుఁ డయ్యుఁ జిరకాలమునుండి దెబ్బల కలవాటు పడియుండుట చే నాఁటిదినమున నాదెబ్బలకంతక్రుక్కకపోయినను గణపతి నేడిపింప వలయునని సంకల్పించి గోలపెట్టి యేడ్చి చచ్చిపోవువానివలె వగ ర్చుచు నాయాసపడఁజొచ్చెను. ఆకొంటెతన మెఱిఁగియు గణపతిని వంచింపఁదలఁచి తక్కినబాలురు 'అయ్యో! అయ్యో! మనమంద య్యను పంతులుగారు చంపివేసినారోయి చచ్చినాఁడోయి చచ్చినాఁ డోయి' యని పెద్దపెట్టున నేడ్చి కేకలు వేయఁజొచ్చిరి. అందులో నొకఁడు చెవులు మూసెను. రెండవవాడు మొగమున చన్నీళ్ళు గొట్టెను. మూఁడవవాఁడు ముక్కుదగ్గఱ వేలుపెట్టి చూడఁజొచ్చెను. చుట్టుప్రక్కలనున్నమనుష్యులు పరుగుపరుగున రాఁజొచ్చిరి. పశుల వాఁడు కదుపులను గొట్టినట్లు గణపతి యుపాధ్యాయుఁ డైన నాట గోలె నిచ్చవచ్చినటుల బాలకుల దండించెను. అటువంటి దురవస్థ

యెన్నడుఁగలుగలేదు. ఆపిల్లవాని యవస్థ జూడఁగానె గణపతి కమిత భయము కలిగెను. మేనెల్ల చెమటలు గ్రమ్మెను. కాళ్ళు గుడ్డపేలికల ట్లయి శరీరమును భరింపజాలకపోయెను. గ్రామస్థులువచ్చి తన్నుముక్క ముక్కలుగ నఱికివేయుదురనియు లేనియెడ నరహత్య చేసినందుకు దొరతనమువా రురితీయుదురనియు నతనికిదోఁచెను. ఆయాపదదప్పిం చికొనుట కప్పుడు వాని కేయుపాయము దోఁచలేదు. ఎందుకైనను మంచిదని యాతం డటనుండి మెల్లమెల్లన నెవ్వరికిఁ గనఁబడకుండ బాఱిపోయెను. అక్కడచేరినవారందఱు బాలునకు భయము లేదని చెప్పి కొంచెము మంచినీళ్ళు త్రావనిచ్చి మెల్లగా నింటికి బంపిరి. ఆ బాలునితండ్రి మహాదేవశాస్త్రిగారియింటికి వచ్చి గణపతితో మాట లాడగోరెను. కాని యెక్కడవెదకినను గణపతి కానఁబడఁడయ్యెను. గణపతి పొరబాటుచేత నట్లు చేసియుండవచ్చును. కాని మఱియొక క్రోధముచేత నతఁడు కొట్టియుండడని మహాదేవశాస్త్రి యతనికి జెప్పి యొడంబఱచి పంపెను. అతిభయముచేత గణపతి నూతిలోనో గోతిలోనో దిగి యాత్మహత్య జేసికొన్నాఁడేమో యని మహాదేవ శాస్త్రియు వానియింటియాఁడువాండ్రును శంకించిరి. సాయంకాలము వఱకు గణపతి కనఁబడనేలేదు. ఆతనితల్లి కొడు , కెందులోనో దిగి చచ్చియుండునని నిశ్చయించి ‘అయ్యో! కొడుకా! అయ్యోకొడుకా! యీదిక్కుమాలినయీరికి నిన్ను బలియిచ్చినానురా నాయనా! నా వరహాలచెట్టు కూలిపోయినదోయి దేవుఁడా! నాచిట్టిబాబును చూపిం చండి నాయనా!” యని వినువారిగుండె లవియునట్లు రోదనము చేయఁ జొచ్చెను. రాత్రి నాలుగుగడియలప్రొద్దు పోయినప్పటికి గణపతిరా లేదు. మహాదేవశాస్త్రిగారిభార్య యాసమయమున నావకాయ తీసి కొనుటకై యటుక యెక్కి కుండదగ్గఱ చేయిబెట్టెను. చేతికి మెత్త నియొడలు తగిలెను. దీపము దీసికొనకయె వెళ్ళుటచేత నదియేమో

యెఱుంగక యాగ్రామములో మర్కటబాధ యెక్కువగ నుండుటచే తనచేతికి తగిలిన దేదో యాజాతిజంతువనుకొని 'కొండముచ్చునాయనోయి కొండముచ్చు' చ్చని గట్టిగా నఱచి యాకళవళపాటులో నిచ్చెన యొకచోట నుండఁగా మఱియొకచోట దిగఁబోయి గుభాలున నేలఁబడెను. ఇంటిల్లిపాది పఱుగెత్తుకొనివచ్చిరి. దైవవశమున నామెకాలు మాత్రమె బెణికెను. కాని దెబ్బ మాత్రము విశేషముగఁ దగులలేదు. ఆగొడవవిని యిరుగుపొరుగువా రందఱుఁ జేరిరి. ఏమిటేమిటని యెల్లవా రడిగిరి. కొండముచ్చటుకమీఁదఁ గూర్చుండినదని యామె చెప్పెను. అప్పు డందులో ధైర్యవంతుఁ డొకఁడు దీపము వెలిఁగించుకొని యటుకమీఁద కెక్కెను, ఎక్కి చూచునప్పటి కది కోఁతిగాదు కొండముచ్చుగాదు. కాని యాకారచేష్టలయందు నిజముగ కొండముచ్చని చెప్పఁదగిన మనగణపతియే.

ఆతఁ డావకాయగూనకుఁ జేరఁబడి గుఱ్ఱుపట్టి నిద్రపోయెను. ఇంతగొడవ జరుగుచున్ననతనికి మెలఁకువయె రాలేదు. అటుకయెక్కిన యతఁడు మొదట నది కొండముచ్చే యనుకొని మీఁదబడి పీకునో కఱచునో యనుభయమున జాగ్రత్తగ సమీపించెను. కాని దీపపు వెలుఁగున గణపతిమూర్తి కనఁబడఁగానె "భయపడకండి భయపడకండి కొఁడముచ్చు గాదు, కోఁతిగాదు, మనవంతులుగా"రని క్రిందనిలిచి యున్నవారికందఱకు వినఁబడునట్లు బిగ్గఱగ నఱచెను. అచ్చటనె యున్న గణపతితల్లి యప్పలుకులు చెవినిబడఁగానె "యేఁడీయేఁడి నా నాయన ! యేఁడీ నాబంగారుతండ్రి యేఁడీ, బ్రతికియున్నాఁడు ! నా యనా మూఁడుతవ్వ లావునేతితో వెంకటేశ్వర్లువారికి దీపారాధన చేసుకుంటాను. క్రిందకి రమ్మనునాయనా" యని సంతోషించి యిష్టదైవతమునకు మ్రొక్కికొనెను. కుండలదగ్గఱ గణపతి కూర్చుండినాఁడని వినినతోడనే మహాదేవశాస్త్రితల్లి మిక్కిలి కనలి "అయ్యో

అయ్యో! మనయావకాయ తగులబడిపోయినదిరా నాయనా! వీఁ డమ్మకడుపుకాలా కుండలు మైల పఱచినాఁడు. ఆపాడుగుడ్డలతో ముట్టుకొన్నాఁడు కాఁబోలు. ఈదిక్కుమాలినపంతులుకు బసయియ్య వద్దని నేను మొత్తుకొన్నాను. కాని మావాఁడు నామాట విన్నాఁడు కాఁడు. ఈయేఁ డావకాయ లేకుండా గొడ్డన్నము తినవలసివచ్చినది. వాఁడి మొగముమండా అవకాయగూనదగ్గఱ కూర్చుండవలె నని యెలా తోచిందమ్మా వీడికి. ఇంకానయము. మాతిలోఁ గూర్చుండి నాఁడు కాడు. నూతెడునీళ్ళు మైలపడిపోను. ఈపాటికి దింపండి. చచ్చుపీనుఁగును." అని కేకలువేయఁ జొచ్చెను. ఆకఠినోక్తులు తల్లి కెంతో మనస్సంకటము కలిగింప నామె యిట్లనియె. "అమ్మా నా కొడుకు కనఁబడక నేనెంతో దుఃఖపడు చుండఁగా నాపుణ్యముచేత కనఁబడినాఁ డని సంతోషపడు చున్నాను. అలాటిత్రిట్లు తిట్టకమ్మ. ఒక్కబిడ్డ. వాని నాధారము చేసికొని బ్రతుకదలఁచుకున్నాను. మీ దిక్కుమాలినకొంపలో నుండఁబట్టి నాకిన్ని పాట్లు కలిగినవి." అనవుడు మహాదేవశాస్త్రితల్లి "కొడుకా వరసని కుండలుమైలపఱచినాడు. తల్లి దిక్కుమాలినకొంప యని తిట్టుచున్నది. ఇద్దఱిద్దరే. వీళ్ళ కేమివినాశ కాలమొ కాని పొండి మాయింటోనుంచి లేచిపొండి" యనిపలికెను.

ఆ ఱ వ ప్ర క ర ణ ము

నిద్ర పరమసుఖప్రద మనియు నారోగ్యప్రదాయిని యనియు సర్వావస్థలయందు నపేక్షణీయ మనియు మనమందఱ మెఱుఁగుదుము. మఱియు నిద్ర వచ్చినప్పు డీస్థల మాస్థల మనక మెట్ట యనక పల్లమనక పానుపనక ఫట్టినేల యనక తలగడలుమొదలగునవి యున్న

వనక లేవనక మనుష్యుఁడు మైమఱచి గాఢ సుప్తికొందు ననియు మన మెఱుఁగుదుము. కాని వ్యాధియు మనోవ్యాధియు భయము మున్నగునవి పీడించునప్పుడు మనుష్యునకు సాధారణముగా నిద్దుర రాదు. మానవుఁ డట్టివానికి లోనగునప్పుడునిశాసమయ మతిదీర్ఘమై చటుల్రితివలెఁ గదలనట్టులుండి నిద్రను మనుజునిసన్నిధికి రానీయక త్రోసివేయును. ప్రకృతిధర్మ మిట్లుండఁగా బడిలోనిపిల్లవానిని జావఁ గొట్టినందుకుఁ దన్నా బాలునితండ్రి చంపివేయు నని యతి భయ భ్రాంతుఁడై విహ్వలచిత్తుఁడై యటకమీఁద నెక్కినగణపతికి నావ కాయగూనకుఁ జేరఁబడి కూరుచున్న యవస్థలోనే తన్నుగూర్చిజరు గుచున్నగొడవ వినఁబడకుండ నంతగాఢనిద్ర యెట్లువచ్చెనని మీకు దోచవచ్చును? గణపతియొక్క నిద్రాసుఖముంగూర్చి మీరుసంపూ ర్ణముగ నెఱుఁగరు. కాన మీకిట్టిశంకలు పొడముచుండును.నిద్రా విషయమున గణపతికిఁగల యసాధారణశక్తి వర్ణనాతీతమైయుండును. అతఁడు నడచుచు నిద్రపోఁగలఁ డనుట యతిశయోక్తి కాదు. కూ రుచుండి నిద్రింపఁ గలఁ డనుట కవి చాతుర్యము గాదు. భోజనము సేయుచు సుషుప్త్యవస్థయం దుండఁగలఁ డనుట వర్ణనాచమత్కృతి గాదు. లక్షలు కోట్లు నల్లులు గల మంచముమీఁద నేవిధమయిన పరుపుగాని దుప్పటిగాని లేకుండ నతనిం బండుకొనఁబెట్టుఁడు. ఆనల్లు లన్నియు నతనిశరీరమం దంతట సముద్రముమీఁద దెప్పునఁ దేలి చెరలాడుచేఁపలవలె నట్టిటు బరుగులెత్తుచు నతని గఱచుచు నెత్తురు పీల్చుచున్నను నతఁడు కదలఁడు మెదలఁ డొత్తిగిలఁడు. ఇట్టి నిద్రా సుఖము ప్రపంచమునం దెవరికిఁగలదు? ఒక్కనల్లి మంచము మీఁద నున్నంతమాత్రమున నిద్రపట్టదని దీపము జేతపుచ్చుకొని యానల్లిం బొడిచి కడతేర్చినదాక మంచముపై మరలఁ బండుకొనని మహాత్ము లనేకులు గలరు. నల్లులేకాదు. జుమ్మని దోమలు ముసరి తమ విష

రీతగానముచేత నిద్రాదేవతకు భయము గల్పించి యాగదిలోని కామెను రాకుండఁ జేసినప్పుడు సయితము గణపతికి నిద్రాదేవికి నెట్టి మైత్రికలదో గాని యతనికిమాత్రి మామె ప్రసన్నురా లగును. దోమలసేనయుఁ నల్లులసేనయుఁ గలసి యాతనిశరీరముపైఁ బడినను మూసినకన్ను దెఱువకుండ నతఁడు నిద్రింపఁగలఁడు. మహాకవియైన వాల్మీకి రామాయణమహాకావ్యమునందు రావణానుజుఁ డయినకుంభకర్ణుఁడు నిరంతరము నిద్రాసక్తుడై యుండి యాఱునెలల కొక్కసారి లేచుననియు లేచినప్పుడు వానిని వేల్పులయిన గెలువలే రనియు మానసషట్కములోపల నతనిని మేల్కొలుపవలసివచ్చెనేని మనలఁగాగిగినచమురు మీఁదఁబోయుట ధాన్యము తనువుపై బోయించి యేనుఁగులచేతఁ ద్రొక్కించుట మొదలగు భయంకరసాధనములుప్రయోగింపవలె ననియు వ్రాసియున్నాఁడు. ఈకలియుగములోనే గణపతివంటి దుర్వారనిద్రాపరాయణుఁడు జనించినప్పుడు మహాద్భుతములకెల్ల నిలయమైన త్రేతాయుగమునఁ గుంభకర్ణునివంటి నిరంతరనిద్రాపియుఁడు పుట్టియుండుట యాశ్చర్యము కా దని హేతువాదము సలుపునట్టి యీనాటినవనాగరికులు నమ్మఁటకవకాశ మున్నది. కాని కుంభకర్ణునకు మనగణపతికి నొకభేదము కలదు. కుంభకర్ణుఁడు బ్రహ్మదత్తవరప్రసాదమున షణ్మాసపరిమిత మయిననిద్రం జెందఁగలిగె. గణపతి యే దేవతాప్రసాదములేకయె నిద్రావిషయమున నింతప్రజ్ఞావంతుఁ డయ్యె. కావున నిరువురలో గణపతియె యొకవాసిగొప్పవాఁ డని మనము నిశ్చయింపవచ్చును. నిద్రానుభవమున గణపతి కెంత నిరుపమానప్రజ్ఞ గలదో లోకమునకుఁ దెలియుటకు స్థాళీపులాకన్యాయముగా రెండుదాహరణము లిచ్చుటమంచిది. ఆయుదాహరణములంబట్టి యతని నిద్రావైపుల్యమును మీరు కొంతవఱకు గ్రహింపవచ్చును. గణపతి వేసవికాలములో రాత్రులు విశేషమైన

యుక్కయుండుటచే నింటిలోఁ బండుకొనక మహాదేవశాస్త్రిగారి వీధియఱుగులమీఁద బండుకొనుచుండును. దీపములు పెట్టినతరువాత నతఁ డొంటిగాఁ బండుకొనలేడు. కదలలేడన్నమాట చదువరుల కేవఱకె విశదము. అందుచేఁదనకు విధేయులై వివిధోపచారములం జేయునట్టి పెద్దశిష్యులను నలుగు రైదుగురను బ్రతిదినము రావించి యిరువుర నీప్రక్కను నిరువుర నాప్రక్కను బండుకొనఁబెట్టి నడుమఁ దాఁ బండుకొనుచుండును. అట్లు పండుకొనుచుండ నొక నాఁడు గణపతి నిద్రించినపిదప నలువురుశిష్యులు రెండనయఱుగు మీఁద కరిగి యారాత్రి యేదయినచమత్కారము చేయవలె నని సంకల్పించిరి. ఆచమత్కృతికిఁ దమపంతులుగారినే విషయముగాఁ జేయఁదలఁచుకొనిరి. ఆచమత్కృతి యేరూపముగ నుండవలయు నని ప్రశ్నరాఁగా గడుసుదనంబునకుఁ దానకం బైనయొకశిష్యుఁడు తక్కినవారి కిట్లనియె. "ఓరీ! అన్నిఁటికన్న మిక్కిలి యందమైన విధము నేను చెప్పెదవినండి. ఏడుకట్లసవారి కట్టి పంతులవారిని దానిమీఁద బంబడుకొనఁబెట్టి వల్లకాళ్ళదగ్గఱకుఁ దీసికొనిపోయి పెట్టెదము. పంతులవారి నిద్రసంగతి మీకుఁ దెలియునుగదా? అయనకుమెలకువ రాదు. ఉదయమున దారింబోవువా రందఱుఁ జూచి మహానందభరితు లగుదురు. ఈవృత్తాంతము విన్నవారందఱుఁ గడుపు చెక్కలగునట్లు నవ్వి వహవ్వా! యీపని నెవరు చేసినారో గాని మిక్కిలి చమత్కారముగాఁ జేసినారు రాయని మెచ్చుకొందురు మేమేయీ పనిచేసినామని మనమొప్పుకొని యామెప్పును బొందుటకు వీలు లేకపోయినను గ్రామవాసుల కింతటియానందము గల్పించితిమి గదా యని మనమనంబులో మనమే గర్వింపవచ్చును. ఇది రహస్యముగ గట్టవలయునుగదా? ఎక్కడగట్టుదమనిమీరడుగుదురేమో! ఆవిషయ మై విచారింప నక్కఱ లేదు. మాదొడ్డిలో వెదుళ్ళున్నవి. వెదు

రుబద్దలున్నవి. మాదొడ్డిగోడ యొకమూల పడిపోయినది. ఆదారిని వెళ్ళి మనము రెండువెదుళ్లు రెండుబద్దలు దెచ్చి యీప్రక్క నున్న బోడిగోడలదొడ్డిలో కటుకు కట్టవచ్చును. తాటినారకూడ మాదొడ్డిలోనే యున్నది తీసుకవచ్చెదను. ఆయనకు మన మేమియు హానిచేయవద్దు. ఇది మీకు సమ్మతముగా నున్నదా! లేనిపక్షము న మీకుఁ దోచినవిధము లెఱింగింపుఁడు." అతనిపలుకులు తక్కిన ముప్వురకు శ్రవణానందకరములై మనఃప్రమోదావహములై యుండినందున వారు భళీ యని యాతని యుపాయమునకు మెచ్చి తక్షణమే ప్రయత్నము జేయు మనిరి. వెంటనే యతఁడు తనదొడ్డిలోనుండి వెదుళ్ళు నార మొదలైనవి దెచ్చెను. నలుగురుఁ గలిసి కష్టపడి పొట్టికటుకు నొకదానిం గట్టిరి. అనంతర మాశిష్యచతుష్టయము గురువు పండుకొన్నచోటికి వచ్చి కాళ్ళిద్దరు చేతు లిద్దరు పట్టుకొని యాదొడ్డిలోనికిఁ దీసికొనిపోయి యక్కటుకుమీఁదఁబండుకొనఁ బెట్టి యతనియుత్తరీయమె మేనిమీఁదఁ గప్పి జారిపడిపోకుండ నారతోఁ గట్టి యాదారుణకర్మమున కపరిచితులయ్యు నలుగురు నాల్గుకొమ్ము లెత్తి భుజములపైఁ బెట్టుకొని మోసికొని స్మశానభూమి కరిగిరి. అరిగినతరువాత నేమి చేయవలెనో వారికిఁ దోఁచలేదు. నిద్రి మేల్కొలుపుద మని యొకఁడు, కాదుకాదు మరల నీవిధముగానే గృహమునకుఁ దీసికొనిపోవుద మని యొకఁడు చెప్పిరి. వారి యాలోచనలు ద్రోసిపుచ్చి మొట్టమొదట నీ చమత్కృతి సలుపు మని యుపదేశించినయతఁ డిట్లనియె—"ఓరీ! మనము మొట్టమొద టేమనుకొన్నాము. తెల్ల వారినదాక నిచ్చట నునిచి యీదారిని బోవుజనులకు వేడుక గలిగింపవలయు ననిగదా మనసంకల్పము! దానికి భిన్నముగా మన మిప్పు డేల యాచరింపవలయు? గావున నిది యీ విధముగనే యిక్కడనుంచి మనమిండ్లకు వెళ్ళుదము. కాని పంతులు

గారికి మిక్కిలి భయముగదా! మెలకువ వచ్చినప్పుడువల్లకాదు చూచి భయపడి చచ్చిపోవునేమో యని మీకు సందేహము కలుగవచ్చును. కాని యట్టిసందేహమున కవకాశములేదు. ఏలయన మనపంతుల వారికి సూర్యోదయ మగువఱకు మెలకువ రాదు. ప్రతిదినము చూచుట లేదా? ఇంటిలోఁ బండుకొన్నపుడు తల్లియు మహాదేవ శాస్త్రిగారు ప్రొద్దెక్కినది లే లెమ్మని పెద్దపెట్టున నఱచి చేతులతోఁ జఱచి లేపినఁగాని లేచెడివాఁడుగాఁడు. వీధిలోఁ బండుకొన్నపుడు సూర్యకిరణములు మొగముమీఁదఁ బడి కన్నులలో దూరి, తాళముచేతులు తలుపులు దెఱచినట్లు, ఱెప్పలు విప్పినఁగాని లేచుట లేదు. మన మిక్కడగొంతసే పుండి తెల్లవారుజామున నింటికి వెళ్ళుదము." అనవుడు నతనిమాటలు తమప్రారంభమున కనుకూలముగా నున్నవని వా రందఱు నిశ్చయించి పంతులవారియాకారము చక్కదనము నాకారమునకుఁ దగినప్రజ్ఞలు గుణగణములు చెప్పుకొని కడుపులు పగులునట్లు నవ్వి కాలక్షేపము జేసిరి. అటకమీఁద గూనకుఁ జేరఁబడి పండుకొన్నప్పుడు గణపతి కెంతసుఖముగ నిద్రపట్టెనో కటుకమీఁదఁ బండుకొన్నప్పుడు నంతసుఖముగానె నిద్రపట్టెను. నిద్రపోయినవారును జచ్చినవారును సమాన మన్నసామెత యొకటి యున్నదిగదా! ఆసామెత గణపతికడ నిజ మయ్యెను. ఎన్నడో చచ్చినయట్లతఁడు మై మఱచియుండెను. కడపటిజాముకోడి కూయువఱకు శిష్యులు గురువుం గనిపెట్టుకొనియుండి కాపులు మొదలగువారు పొలముల కాదారిఁ దెల్లవారుజామునఁ బోవుదురు గనుక దా మచ్చట నిఁక యుండఁగూడ దని లేచి గ్రామమునకుం బోయి యెవరి యింటికి వా రరిగిరి. కాకులు గూసెను. తూర్పుదెస తెల్లబాఱెను. ఆడవాండ్రు ముందుగ లేచి ముంగిలివాకిళ్ళు వీధియఱుగులు గుమ్మములు తుడుచుకొనఁ జొచ్చిరి. కనుచీఁకటి యుండఁగానే యొకకాపు

వాఁడు వల్లకాటిమీఁదుగాఁ దనపొలమున కరుగుచు నచ్చట కటుకు పైనున్న శవముం జూచి "హా! యేమిది చిత్రముగ నున్నది. శవము కనఁబడుచున్నది. చుట్టుప్రక్కలఁ జుట్టములు పక్కములు లేరు. నరసంచారమే లేదు. నిప్పులేదు. కుండలు లేవు. మోసినవారు లేరు. కాడుపేర్చలేదు. పుల్లలు లేవు. పిడకలు లేవు. కూనీయైనశవమేమో యనుకొందమన్న నట్టిశవమును నేతుంగలోనో త్రొక్కి పాఱవేయుదురుగాని యింతజాగ్రత్తగా నొకకటుకుఁ గట్టి మోసికొని తీసికొని వత్తురా! ఇదియేమో మాయగా నున్నది. ఈవిషయమై నేను పోయి మునసబుకరణాలతోఁ జెప్పి తీసికొనివచ్చెదను." అని పరుగుపరుగునఁ బోయి మునసబుకరణాలను లేపెను. ఈలోపున మఱికొంద ఱామార్గమునం బోవుచు నప్పటికి మొగమానవాలుపట్టుటకుఁ దగినంత వెలుతురు వచ్చినందున దగ్గరకుఁబోయి కటుకుమీఁదనున్న విగ్రహముం జూచి పంతులుగారి నెవరో చంపిపడవైచి రని కలఁత జెందినమనస్సులతో వెనుకకుఁ బోయి గ్రామవాసులతోఁ జెప్పిరి! ఆవార్త గ్రామమంతయు గుప్పుమనెను. స్త్రీలు మిక్కిలి యక్కజముతో జాలిపెంపున గన్నీరు విడుచుచు "అయ్యో! తల్లికొక్కబిడ్డమ్మ ఆముసలిముండముప్పు గడపకుండఁ బోయినాఁడమ్మ. ఇంతపనిచేయుటకు వాళ్లకు చేతు లేలాగొచ్చెనోయమ్మ అయ్యో! బెత్తముపుచ్చుకొని పిల్లలను కొట్టుచున్నటే నాకన్నులముందఱ మెలఁగుచున్నాఁడే అమ్మా" యని చెప్పుకొనఁజొచ్చిరి. పురుషులందఱు నీవార్త చెవినిబడఁగానే యితరకృత్యములు విడచి స్మశానభూమికే పరుగిడిరి. ఎవరో మహాదేవశాస్త్రిగారి గుమ్మముముందరకు బోయిఁశాస్త్రులుగారు! పంతులుగారి నెవరో చంపి వల్లకాళ్లలోవైచి పోయినారయా, యని కేకవేసి పోయిరి.

ఆమాట సింగమ్మచెవినిబడగానే చేతిలో నున్నపనిని విడిచి

పెట్టి "అయ్యో! కొడుకా, అయ్యో కొడుకా! నీవును రెవరు పోసుకొన్నారురా కొడుకా! అయ్యో! శాస్త్రిల్లుగారు! నావర హాలుచెట్టు నెవరో పడఁగొట్టినారఁట! రండి నాయనా రండి" అని గుండె బాదుకొనుచు మొత్తుకొనుచు వీథిలోఁబడెను. "అయ్యయో! ఎంతపని ఎంతపని! యింతపాపమున కెవరు వడిగట్టినారయా?" యని మహాదేవశాస్త్రిగారు, స్త్రీలుజాలిపడిరి. శాస్త్రి యామెందోడ్కొని రుద్రభూమి కరిగెను. సింగమ్మ తోర్రివలో దుఃఖావేశముచేతఁ దనకుమారుని గుణగణములు మెచ్చుచు గ్రామవాసులం దిట్టుచు శపించుచు నరిగెను. వారిరువురు వెళ్లకముందే గ్రామవాసు లనేకు లచ్చటఁ జేరి గణపతి చచ్చిపోయినాఁ డని యొకరు, చావలేదు ప్రాణము గుడుగుడులాడుచున్న దని యొకరు ముక్కుదగ్గఱ వ్రేలు పెట్టి శ్వాస యాడుచున్నదో లేదో యని చూచువా రొకరు, శ్వాసయున్నది కాని యది కొనయూపిరి యని యొకరు చచ్చిపో లేదు నిద్రపోవుచున్నాఁడు అదిగో గుఱ్ఱని యొకరు గుఱ్ఱుకాదయా గుఱక, గొంతుపిసికి చంపినారు అనియొకరు, గొంతుపిసికితే కంఠము వాచి యుండదా గొంతు పిసకలేదు కత్తితోఁ బొడిచి చంపినారేమో, యని యొకరు, పొడిచినపక్షమున నెత్తురు గాయము కనఁబడవా యని యొకరు, పలుతెఱంగుల నెవరికిదోచినట్లు వారు పలవించిరి. మొత్తముమీఁద గణపతి సంపూర్ణముగఁ జావలేదనియు నవసానలక్షణమయినగురక బైలుదేరినదనియు క్షణములోనో నరక్షణములోనో కడతేరుననియు నచ్చటివారు నిశ్చయించిరి. అంతలో మహాదేవశాస్త్రితో సింగమ్మ వచ్చెను. వచ్చి కొడుకుపైఁ బడి "నాతండ్రి! నాకొడుకా! నన్నొంటిదాన్ని జేసి లేచిపోయినావు రా! నాకింక దిక్కెవరురా నాయనా? నన్నుఁగూడ నీతోఁదీసికొని పోరాతండ్రి! నావరహాలచెట్టూ! నాకాసులపేరూ! నిన్నరాత్రి

కడసారి నీకుఁ గడుపునిండా అన్నము పెట్టినానురా నాయనా! తె ల్లవా రేపాడుమొగంచూచినానో గాని యింతదుర్వార్త వినవలసి వచ్చిందిరా నాయనా! నాముప్పు కడతేర్చి నన్నింతమట్టి చేసిపోదు వని అనుకున్నానుగాని యింతపని జరుగునని కలలోనూ నే ననుకోలేదు నాయనా! నిన్నింతపని చేయుట కెవరికిచేతులు వచ్చినవి రానాయనా! వాళ్ళచేతులు పడిపోనూ, వాళ్లవంశము నాశనంగానూ నాలాగే వాళ్లతల్లులుగూడ కొడుకాకొడుకా అని యెప్పుడేడ్చి మొ త్తుకొందురో నాయనా! నానోట్లో మట్టిపోసిపోయినావురా నాయనా! నాకడుపులో చిచ్చు పెట్టిపోయినావురా నాయనా! నాకొంప తీసి నావురానాయనా! ఈచావు దేవుఁడు నా కెందుకుపెట్టినాడుకాదు రానాయనా? నీకు పెండ్లిచేసి నీవొకయింటి వాఁడవై యుండగా నాకన్నులు చల్లగా చూడవలె ననుకొన్నానురానాయనా! బ్రహ్మ చారివై చచ్చిపో వలసివచ్చిందిరాతండ్రీ! నీపేరుగా చూచుకొనెం దుకు నీకడుపున నొకపిల్లవాఁడైన లేకపోయెరా నాయనా! నీవెవరి జోలికి వెళ్ళనివాఁడవురా నాయనా! నీమీఁ దింతకోప మెవరికి వచ్చిందిరా నాయనా! ప్రాణము పోయ్యేటప్పుడు నన్ను దలఁచు కొని యెంతదుఃఖపడ్డావో తండ్రీ? నీప్రాణ మెంతకొట్టుకొన్నదో నాయనా! దిక్కుమాలినముండను. నేను లోపల పడుకొన్నానుగాని వీధిలో పడుకున్నానుకానురానాయనా! నీకిన్నిపాట్లుండగా భగ వంతుఁడు నా కటువంటిపాడుబుద్ధులు తోపించాడురా నాయనా! ఆనాగన్నవెధవ ఆగంగమ్మముండ యీవార్తవిని సంతోషముతో పరమాన్నము వండుకొని తింటారురా నాయనా! నే నేలాగున బ్రత కనురా బాబూ! నిన్ను రాజులాగు పెంచుకొన్నానురా బాబు! అవతారమూర్తి అనుకున్నానురా నాయనా! ఎవరిదగ్గ రుంటే నీదగ్గరనున్నట్టుందిరా నాయనా! దాహంతాగితే మానెడు తరవాణి

త్రాగేవాఁడవురా నాయనా ! నీవు చద్దిఅన్నము తినేవేళైంది లేరా నాయనా ! " అని పరిపరివిధముల దుఃఖించెను. తల్లి పెద్ద గొంతుకతో నెల్లవారిగుండెలు నీరగున ఏడ్చుచున్నను, గ్రామ వాసులు చేరి కంఠములెత్తి మాటలాడుచున్నను గణపతికి మెలఁకువ రాలేదు. అంతలో సూర్యోదయ మయ్యెను. గణపతిమొగము మీఁద సూర్యకిరణముల వెలుఁగు పడెను. అప్పుడు గణపతికి నించుక మెలకువ రాఁగా నతఁడు " ఉండవే లేస్తాను. ఏమి తొం దర వచ్చినది" అని కనులు తెఱవకయే చేతితోఁ దల్లిని గెంటెను. అప్పు డందఱు "పంతులుగారు బ్రతికి యున్నారు బ్రతికియున్నారు చావలే" దని కేకలువేసి చప్పటులు కొట్టిరి. సింగమ్మ "నాతం డ్రీ! బ్రతికున్నావురా నాయనా! ఈగండము గడిచినది గనుక నిన్ను దీసికొని తిరుపతి వెళ్ళెదనురా నాయనా ! వెంకటేశ్వర్లు వారికి కుంచె డావునేతితో దీపారాధన చేసెదనురా నాయనా!' యని మనస్సులో వేంకటేశ్వర్లువారిని దలఁచుకొని చేతులుజోడించి నమస్కరించి " నాయనా ! దెబ్బ లెక్కడ తగిలినవి నిన్నెవరు చంపవచ్చిరో యెఱుఁగుదువా" యని గట్టిగా నడిగెను. అంతలో మొగము మీఁదికి నెండ బాగుగా వచ్చుటచేతను గ్రామవాసుల చప్పటులచేతను మొగము, చేతులు, తల్లి మాటిమాటికిఁ బట్టు కొని కదుపుటచేతను గణపతికి మెలఁకువ సంపూర్తిగ వచ్చెను. అంతలో గ్రామవాసులలో నొకఁడు వచ్చి కట్లు విప్పెను. అంత గణపతి కన్నులుదెఱచి చీకుచాపలు, కుండపెంకులు, కచ్చికలు, సంచయనము చేసినచోటులు, వెదురుముక్కలు మొదలగు వానిం జూచి గుంపులు గుంపులుగానుండు జనముం జూచి గుభాలున కటుకు మీఁదనుండి లేచి భయమునకు నాశ్చర్యమునకు లోనై "ఇదే మిటి! మహాదేవశాస్త్రిగారియరుగుమీఁద పడుకున్నవాఁడను నేని

క్కడకేలవచ్చితిని. నారాయణ! నారాయణ! నన్నీకటుకుమీఁద పండుకోఁబెట్టినవా రెవరు? ఇదేమిటి! నన్ను వల్లకాటికిఁ దీసికొనివచ్చినారు. ఏరీ! రాత్రినాప్రక్కను బండుకొన్న పిల్లవెధవలు! నన్నెవరో యీలాగున తీసుకవచ్చుచుండఁగా నాప్రక్కను పండుకొన్న కుఱ్ఱవెధవలు భయపడి పారిపోయినారు గాఁబోలు!" అని లేచి నిలిచెను. పంతులుగారి నెవ్వరు చంపఁ దలఁచుకోలే దనియు నెవ్వరో కోపముచేతనో కొంటెతనముచేతనో నీవిధముగాఁ జేసినారనియు నచ్చటఁ జేరినగ్రామవాసు లందఱు నిశ్చయించిరి. పదిమంది పెద్దమనుష్యులను బ్రోగుచేసి పోలీసువారికి వర్తమాన మంపించి భోజనములు లేకుండ మూడుజాముల దాక గూర్చుండి పంచాయితీ చేయనక్కఱలేకుండ వ్యవహారము చులకనగానే తేలినదని మునసబుకరణములు సంతోషించుచు నింటికిఁ బోయిరి. "తమమరణానంతరము బంధువులు తమనిమిత్త మెట్లు విలపింతురో చెవులార వినియెడిభాగ్య మెవ్వరికబ్బదు. గణపతి కట్టిమహోత్సవము తీరినదని నవ్వుకొనుచు గ్రామవాసుల నందఱ నచ్చటికిఁ జేర్పఁగలిగిన యీపన్నాగము పన్నినవారిబుద్ధికుశలత మెచ్చుకొనుచు గ్రామీణులు "వహహ్వా! ఏమిపంతులయ్యా! ఎందరనో పంతుళ్ళను చూచినాముగాని యింత విపరీతపుపంతులును చూచినాము కాము. మన యదృష్టముకొద్ది దొఱికినాఁడుగాని" యని పరిహాసాస్పదమగుపలుకులు పలుకుకొనుచుఁ బోయిరి. అప్పుడు సింగమ్మ కొందఱు పెద్దమనుష్యులం గనుంగొని "చూచినారా! నాయనా! కిట్టకపోతే కిట్టన ట్లుండవలెను గాని యింత దుర్మార్గపుపని చేయవచ్చునా? పోనీ! కొంటెతనముకోసము చేసినారంటారా వేళాకోళపు మాట లాడుకోవచ్చును. హాస్యములుచేసికోవచ్చును. సరసా లాడుకోవచ్చును గాని యింతకొంటెతన మున్నదా?

ఒక్కబిడ్డనాకు. నా కెంతవాగాయిత్యముగానున్నది. ఈలాటిమో టసరసాలా ! ఈపనిజేసిన దెవరో తెలిసినపక్షమున దుమ్మెత్తి పోసెదను. మునసబుగారితోఁ జెప్పి బొండ నేయించెదను. వాళ్ళమ్మ కడుపుగాలా. యీలాటిపనిచేసినవాళ్ళవంశా లుండువురా నాయనా. మీకు తెలిసెనా వాళ్ళమొఖాలు చీకితాటాకులతో తగలఁబెట్టి నోట్లోగడ్డిపెట్టండి. అర్ధాయుస్సు ముండాకొడుకులకుఁ గాని యిట్టిబుద్ధు లు పుట్టవు. నామన స్సెంతక్షోభపడిందో వాళ్ళతల్లులుగూడా యింతక్షోభపడవలెను. చూడు నే నన్నాను. ఉత్తమయిల్లాలుబిడ్డను' అని తాఁ జెప్పవలసిన దంతయుఁ జెప్పి "రా నాయనా! యింటికి. యీకటుకమీఁద నిన్ను మోసికొని వచ్చినవాళ్ళనే మోసికొని పోవుదువులే. నీవు చిరంజీవివై నూరేళ్ళు బ్రతుకఁ గలవు. ఆదుర్మా ర్గపుముండకొడుకులే రాళ్ళు పగిలిపోయినట్లు తలలు పగిలి చచ్చిపోఁ గలరు" అని కుమారునిచేయి బట్టుకొని యింటికిఁ దీసికొనిపోయి దృష్టిఁ దీసి వేఁడినీళ్ళతో స్నానము చేయించెను. శ్మశానవాసదోష ము తొలఁగి పోవునట్లు పిశాచాదిపీడాపరిహార మగునట్లు మహాదేవ శాస్త్రి విభూతి మంత్రించి గణపతిమొగమునిండ బొజ్జనిండ భుజము లనిండఁ బెట్టి శతగాయత్రీజపము జేసికొ మ్మనెను. గణపతికి గాయ త్రీమంత్రము రా దన్నమాట మహాదేవశాస్త్రి యెఱుఁగఁడు. అయి నను గణపతి యాజపము చేసినట్లె యభినయించెను. ఆనాఁడు మహాదేశశాస్త్రిగారియిల్లు కోటిపల్లెతీర్థమువలె నుండెను. స్మశాన భూమికి గ్రామమునం గల మగవారే వెళ్ళిరి గాని స్త్రీలు శిశు వులు మొదలగువారు వెళ్ళకపోవుటంజేసి వారందఱు గణపతిం జూడవచ్చిరి. విభూతిపెండెకట్లుపెట్టుకొని జంగముదేవరవలెఁ గూర్చు న్నగణపతిం జూచి వారందఱు నవ్వి "అదృష్టవంతురాలవమ్మా" యని యతనితల్లిని బరామర్శ చేసి వెళ్ళిరి. నాటిరేయిమొదలు

గణపతికి స్వప్నములో స్మశానము కాష్టములు కటుకులు కుండ పెంకులు గుడ్డపేలికలు చాపలు మొదలైనవి కనబడఁ జొచ్చెను. స్వప్నదృష్టములైన యావస్తువులం జూచి యతఁడు పెద్దపెట్టున నేడ్చుచుండును. "నేచావలేదు. నన్ను దహనము చేయకండోయి" యని కేకలు వేయుచుండును. తల్లి యతనిం గట్టిగఁ గౌఁగిలించుకొని పండుకొనవలసి వచ్చెను. ఆపని యెవరు చేసి రని గణపతి తనప్రక్కను రాత్రి పండుకొన్న బడిపిల్లలను బిలిచి యడిగెను. ఆశిష్యు లిట్లనిరి.— "పంతులుగారు! రెండుజాముల రాత్రివేళ కాగడాలతో నెవరో కొందఱు వచ్చిరి. ఎవరో మనుష్యులనుకొని మేము లేచి యెవరు వా రని యడిగితిమి. వారు మాకు త్తరము చెప్పలేదు. వాళ్ళనోళ్ళు చిన్నవి. కడుపులు బానకడుపులు. మడమలు ముందఱికి పాదములు వెనుకకు నున్నవి. చిన్నప్పుడు మాతాత మానాయనమ్మ దయ్యము లాలాగుండు నని చెప్పినమాటలు జ్ఞప్తికి వచ్చెను. అవి కొఱవిదయ్యము లని మే మప్పు డనుకొంటిమి. కేకలు వేసినపక్షమున నోళ్ళు నొక్కునని మేము కిక్కురు మనకుండ మాప్రాణము లఱచేతిలోఁ బెట్టికొని పాఱిపోయితిమి. మిమ్ము లేపుటకైన వ్యవధానము లేకపోయినది. ఆకొఱవిదయ్యములే యింతపని చేసినవి." గణపతి కామాటలు సత్యము లని తోఁచెను. ఎవరో కొంటెపిల్లవాం డ్రాపనిచేసియుందు రని చూడవచ్చిన గ్రామవాసు లందఱు నేకగ్రీవముగాఁ జెప్పినను గణపతి వారిమాటయందు లేశమైన విశ్వాస ముంచక తన విద్యార్థులమాటయందె నిండునమ్మిక యుంచి పిశాచమాంత్రికునికడకుఁ బోయి వానికిఁ గొంతద్రవ్య మిచ్చి మంత్రించినవిభూతి పుచ్చుకొని మేనఁ బాము కొని రెండురక్షరేకులు పుచ్చుకొని రెండుభుజములకుఁ గట్టికొనివీధులలో నెన్నఁడు బండుకొనఁగూడ దని లోపలనె బండుకొనుచుండె

ను. శిష్యుల కొంటెతన మెఱుఁగడు గనుక వారినే నమ్మి తన ప్రక్కను వారిని బండుకోపెట్టుకొనుచుండెను. ఒకనాఁ డొక శిష్యుఁడు చేతత్రాడుదెచ్చి వానిజుట్టుకు ముడివైచి యాత్రాడు దూలమునకుం గట్టెను. ఆనాఁడు గణపతికి నిద్రలో దాహముమి శేషముగ నైనందున రెండుజాములరాత్రివేళ నతనికి మెలఁకువవచ్చి దాహముత్రాగుటకై లేవఁ బోఁగాఁ దనజుట్టు పట్టుకొని యెవరో లాగిన ట్లయ్యెను. అప్పుడతఁడు మహాభయభ్రాంతుఁడై "చచ్చిపోయినానోయి నాయనా! దయ్యములు నాజుట్టుపట్టుకొని లాగుచున్నవిరోయి! ఓ అమ్మా! ఓ శాస్త్రిగారు! చచ్చిపోయినాను చచ్చిపోయినాను రండోయి రండోయి రండో" యని యుచ్చైస్వరముతో నఱచెను. కొంటెతనము చేసినవిద్యార్థియు వానితోఁ బాటు "దయ్యాలు బాబో! దయ్యాలు" అని యేడువఁజొచ్చెను. తక్కినవిద్యార్థులుగూడ నాఁటికుట్రిలోఁ జేరినవారె యగుటంజేసి చకితస్వాంతు లైన ట్లభినయించి గోలపెట్టి యేడ్చిరి. "అయ్యకొడుకో కొడుకో" యని సింగమ్మ లోపలనుండి వచ్చెను. ఇంటిలో దీపము లారిపోయిన సింగమ్మ నిద్రలోనుంచి యకస్మాత్తుగ లేచి గుమ్మ మెక్కడున్నదో యెఱుఁగక గోడమీఁదఁబడి మొగమునకు దెబ్బతగిలించుకొని దయ్యములే పడవేయుచున్న వని కొడుకుగతి యేమైనదో యని యేడ్వఁజొచ్చెను. ఇంతలో మహాదేవశాస్త్రి తనయడపసంచితీసి చెకుముకి రాతితో నిప్పుచేసి దీపము వెలిగించి చూచునప్పటికి గణపతి జుట్టుకుఁ దాడుపోసి దూలమునకుఁ గట్టియుండుట కనఁబడెను. అపు డాయన నిజస్థితి చెప్పి గణపతిభయ ముడిపి యది యాశిష్యులలో నెవ్వరో చేసినకొంటెతన మని గట్టిగాఁ జెప్పెను. అది దయ్యములు చేసినపనిగాని మేము చేసినపని గాదని విద్యార్థులు గురువుగారిమీఁద నొట్టుపెట్టుకొని చెప్పిరి. గణపతి కామాటలే విశ్వాస

పాత్రము లైనను మహాదేవశాస్త్రి నాటంగోలె విద్యార్థులనులోప లికి రానియ్యఁ గూడదని నొక్కి వక్కాణించెను. మఱియొకనాఁడు మహాదేవశాస్త్రి సకుటుంబముగా బంధుగృహమున జరుగు వివాహ మునిమిత్తము పలివెల వెళ్లెను. ఇంటిలో గణపతియుం దల్లియు మాత్ర ముండిరి. తల్పు లన్నియు వైచుకొని రాత్రి తల్లికొడుకులు నిద్రపోవుచుండఁగా దొడ్డిలోనున్న తాటియాకులపాకయంటుకొనెను చుట్టుప్రక్కలనున్న జనులందఱు లేచి కుండలతోను బిందెలతోను నీళ్ళు తెచ్చి యదియార్పఁ బ్రయత్నించిరి. పెద్దగోల యయ్యెను. తలుపులు తీయుమని సింహద్వారమునొద్ద దొడ్డిగుమ్మమునొద్ద నా కాశము మాఱుమ్రోయునట్లు గ్రామవాసులు పెద్దపెట్టున నఱచిరి. గాని గణపతికిఁ గాని తల్లికిఁగాని మెలఁకువ రాలేదు. గ్రామీణుల లోఁ గొందఱు గోడ దూకియు దొడ్డిగోడదూకియు గొందఱు నిచ్చెనలు వైచికొని లోపలికి దిగియు దొడ్డితలుపులు దీసికొని యం టుకొన్న పాక చల్లార్చిరి. కాని గణపతికి మెలకువ రానందునసాహ సులు కొంద ఱుతకలెత్తి తలుపులు తీసి గణపతిని లేపఁబూనిరిగాని యంతకు నతనికి మెలకువ రానందున నతనిచెవిలోఁ జల్లనినీరు పోసిరి. అప్పు డతఁడు మేల్కొనియెను. మఱియొకసారి గణపతి మహాదేవశాస్త్రిగారితోఁ గలిసి రాత్రిబండిమీఁదఁబయనమై వెళ్ళు చుండెను. అది చీఁకటిరాత్రి. బండి పొలములోనుండి వెళ్ళుచు నొకచో బోల్తపడెను. అదివఱకు బండిలోఁ బండుకొని నిద్రపోవు చున్న గణపతి బండి బోల్తపడినప్పుడెగిరి దూరముగాఁ బడెను. కునికి పాట్లుపడుచున్న మహాదేవశాస్త్రిమఱియొక వైపునఁగూలఁబడియెను. శాస్త్రిగారికిఁ జేయి మడతబడి నొప్పిపట్టెను. బండివాఁడు గుమ్మడి కాయవలె నేలఁబడ వానిచట్ట విఱిగెను. చట్టవిఱిగినది బాబోయ్ యని వాఁ డేడ్వఁ జొచ్చెను. నాచేయి విఱిగినదిరా యని శాస్త్రి

హీనస్వరముతోఁ బలికెను: గణపతి యేమయినాఁడో యని శాస్త్రి బెంగగొని గణపతీ గణపతీ యని పదిసారులు పిలిచెను. అతఁడు పలుకలేదు. ఎద్దులు త్రొక్కి చంపినవో బండిచక్రము క్రిందఁ బడి చచ్చెనో యని శాస్త్రి "భగవంతుఁడా! యీప్రయాణ మెందుకు దెచ్చిపెట్టితివి పాపమీకుఱ్ఱవాని జంపుటకా" యని ఖేదపడుచుండ నంతలో నెవరో మార్గస్థులు చిన్నలాంతరు పుచ్చుకొని యాదారిని వెళ్ళుచుండిరి. మహాదేవశాస్త్రి దూరమునఁబోవుచున్న యాబాటసారు లను గేకవైచి పిలచెను. వా రాకూయి విని రాగా శాస్త్రి వారిం డగ్గరి "మాబండి బోల్తపడినది. నిద్రించుచున్న పిల్లవాఁడెక్కడనో బడిపోయినాఁడు. చచ్చిపోయినాఁడేమో యని భయపడుచున్నాము. కొంచెము వెదకండిరా నాయనా!" యనిచెప్పెను. వారు నలుదెసలు కలయం గనుఁగొనఁగా గణపతి యొకచోఁ బడియుండెను. ఆపిల్ల వాఁడు స్మారకములేక పడియున్నాడండి యని శాస్త్రితోఁ జెప్పిరి. బ్రతికి యున్నాఁడో లేదో నాడి చూచి ముక్కుదగ్గర వేళ్ళుపెట్టి చూడండియని ప్రత్యుత్తరమిచ్చి చేతినొప్పితో మెల్లఁగా నచ్చటి కరిగెను. వారట్లుచూచి బ్రతికియున్నాఁడు. తలకు మోపైన దెబ్బ తగిలియుండఁ బట్టి తల దిమ్మెత్తి పడియుండఁ బోలు' నని చెప్పి చేతితో నిట్టటు గదిలించి చెవిదగ్గఱ గణపతీ గణపతీ యని గట్టిగా నఱచిరి. అప్పు డతఁడు ఆఁ యని పలికెను. మఱియు నట్టివిధముగా నె యిద్దఱు రెండుచెవులదగ్గరఁ జేరి కంఠము లెత్తి పిలువ నతఁడు మేల్కొని బండియాపిరేమియని యడిగెను. అపుడు జరిగిన వృత్తాంత మంతయు శాస్త్రి వానితోఁజెప్పెను. క్రొత్తబాటసారులు గణపతియొక్క యఖండనిద్రనుదెలిసికొని కలియుగకుంభకర్ణుఁడురా యీగణపతి యని మహాశ్చర్యమనస్కులై తమదారిం జనిరి. మనకథానాయకుని నిద్రాతిశయమునుగూర్చి వ్రాయఁదలఁచుకొన్న

పక్షమున నింకను ననేకోదాహరణము లున్నవి గాని గ్రంథవిస్తర భీతిచేత నింతటితో విరమింపవలసివచ్చె.

ఏడవ ప్రకరణము.

గణపతియొక్క బ్రతు కంతయు నల్లరిబ్రతు కగుటచేతను నతని తెలివితేటలు బాలకులతలిదండ్రులకేగాక బాలకులకుఁగూడ విస్పష్టముగఁ దెలియుటచేతను బడి క్రమక్రమముగ క్షీణించెను. గణపతిచేష్టలు జూచి నవ్వఁ దలఁచినవారును వినోదముగఁ గాలక్షేపము సేయఁ దలఁచినవారు మాత్రమే యతనిచుట్టుఁ జేరఁజొచ్చిరి. బాలకులసంఖ్య క్షీణించినను బెద్దవా రనేకులుసయితము తమ కేదియుం దోఁచనప్పుడు బనిలేనప్పుడు నతనిబడికిఁ బోయి కూర్చుండి యాతనిమర్కటచేష్టలు నసందర్భప్రలాపములువిని యానందించుచు వచ్చిరి. బడి నిండుగా నున్నప్పుడు జీతములక్రింద బాలకులతలిదండ్రులు ధాన్యము కందులు కూరలు మొదలగువస్తువులు పంపుచుండుటచేత నతనియింట నిబ్బంది యంతవిశేషముగ లేకపోయెను. అంతియెగాక దెబ్బలుతినలేక బాలకులు తెచ్చి యిచ్చులంచముల చేత గూడ కొంతకాల మతనికి దారిద్ర్యము లేకపోయెను. కాని ముగ్ధభావమును దాచిపెట్టిన దాగునదిగాదు. కనుక క్రమముగ బయలుపడి యాతనిస్థితుం దించుకేనియు గౌరవము లేకుండునట్లు చేసెను. గ్రామవాసులలోఁ గొందరు తమబిడ్డలకు విద్యాభ్యాసము జేయించునట్టి మంచియుపాధ్యాయుఁడు లేనందున విచారించి క్రొత్తపేటవెళ్ళి యచ్చటినుండి యొకయుపాధ్యాయునిఁ దీసికొనివచ్చి మఱియొకయఱుగుమీఁద బడి పెట్టించి తమబిడ్డల నచ్చటికిఁబంపఁదొడంగిరి. గణపతి

యం దేకారణముచేతనో యభిమానమున్నవారు కొందఱు మాత్రము తమపిల్లల నితనిబడికే యెప్పటియట్ల బంపుచుండిరి. క్రొత్తగావచ్చిన పంతులు యుక్తాయుక్తవివేచనాజ్ఞానము గలవాఁడగుటచేతను వికృత చేష్టలు గాని విపరీతలక్షణములు గాని యతనికడ లేకపోవుటచేతను మంచిబోధనశక్తి గలవాఁడగుటచేతను విశేషించి వినయాది సద్గుణములు గలవాఁడగుటచేతను గ్రామవాసుల కతనియెడఁ గ్రమక్రమముగ నభిమాన మువయించెను. తమబిడ్డల నతనిపాఠశాల కంపి వారాయభిమానము స్థిరము జేసిరి. కాలక్రమమున గణపతిబడి వట్టిదయ్యెను. అందుచేత నతఁడు జీవనాధారము లేక మఱియొకవృత్తి నేదైన స్వీకరింప వలెనని యాలోచించుచుండఁగా శివరాత్రి కాయూరికి భాగవతులువచ్చి భాగవత మాడిరి. పలివెలనుండి యెండమూరి గరుడాచల మనువేశ్యాంగన యాభాగవతములో సత్యభామవేషము గట్టెను. ఆభాగవతము గణపతి చూచి మిక్కిలి సంతసించి మఱునాఁడు వేశ్య లున్నబసకుఁ బోయెను. అతఁ డచ్చటఁ గూర్చున్నసమయమున మేళ నాయకురాలైన గరుడాచలము దానితల్లియగు పాపాచలము మద్దెలవాఁడు సారంగువాయించువాఁడు హాస్యగాఁడు మున్నగువారు డ్రిందఱు గృష్ణవేషగాఁడు తగినవాఁడు దొఱకలే దనియు స్థిరముగాఁ దమ వద్ద నుండునట్టివేషగాఁడు దొరకినపక్షమునఁ దమమేళము మిక్కిలి బాగుండు ననియుఁ జెప్పుకొనిరి. అదివిని గణపతి గరుడాచలమువంటి సరసురాలు సత్యభామవేషము వే[illegible]తన వంటివాఁడు కృష్ణవేషము వేసినపక్షమున[illegible]జన్మము ధన్యమగు ననియు జన్మము ధన్య మగుటయేగాక [illegible] ములు గూడ జరితార్థము లగుననియుఁ [illegible] దక్షిణగాఁడు దొరకినపక్షమున మీరేమిజీత మిత్తు" [illegible] యుఁ [illegible] "ఆట్లగు

NARLA MEMORIAL LIBRARY V.R. NARLA D.P.R.I. Acc. No.

రెండురూపాయలుచొప్పున నిత్తు" మని గరుడాచల ముత్తరము చె ప్పెను. "నెలకెన్ని యాటలుండు"నని యతండు మరలనడిగెను. "అది మనయదృష్టమునుబట్టి యుండును. ఒకప్పుడు నెలకు నాలుగాట లుండును. ఒకప్పుడు రెండాటలుండును. ఇన్నని వక్కాణించి చెప్ప జాల"నని యావెలయాలు బదులు చెప్పెను. "నీకు శూద్రుఁడు కావలెనా బ్రాహ్మణుఁడు కావలెనా" యని గణపతి వెఁడియుం బ్రశ్నింప "ఏ మింత తఱచితఱచి యడుగుచున్నారు. మీ కావని గావలె ననియున్నదా" యని వేశ్యమాత యైనవృద్ధాంగన యడి గెను. "ఔను! మీ కంగీకార మైనపక్షమున నేనే కృష్ణవేషము వేయవలె నని యున్నది." యని యతఁ డుత్తరము జెప్పెను. అతని వాలకము మాటలతీరు చూచి యతఁ డాపని కక్కఱకు రాఁ డని పాపాచలము తలంచెనుగాని తమమేళములో నతఁ డుండుట వినోద కరముగా నుండి తమకుఁ బ్రాద్దుపుచ్చునని యు నవసర మైనప్పుడు నతనిచేఁ గృష్ణవేషముఁగూడ వేయింప వచ్చు ననియు గరుడాచల మాలోచించి "సరే! మీరు మామేళములో నుండ వచ్చును. మీ బట్టలు మూఁటగట్టి తెచ్చిమాతో రండి!" యని చెప్పెను. ఆపలు కులు నిజముగా నతని మనస్సుమీఁద నమృతవర్షము గురిసిన ట్లయ్యె ను. తాను కృష్ణవేషము ధరియించుట గరుడాచము సత్యభామ వేషము ధరించుటఁ దలంచుకొని గణపతి నిజముగాఁ దానామేళ నాయకురాలికిఁ బ్రాణనాయకుఁడె యనుకొని యపారమైన సంతో షము నొందెను. సత్యభామ తన్ను వరించు నని తెలిసినప్పుడు శ్రీ కృష్ణుఁ డరత యానందము నొందెనో లేదో మనము చెప్పఁజాలము. ఆదినమున నతనిమనంబునం గలిగినగర్వము వర్ణనాతీతమై యుండెను గరుడాచలము బసనుండి యింటికివచ్చి ప్రీతశిష్యులను గొందఱిని గ్రామవాసులలోఁ గొందఱిని గలిసికొని మీసముమీఁదఁ జేయి

వైచి రెండుమూఁడుసారులు సకిలించి కోఅచూపులు చూచుచు నిట్లనియె. "చూడుఁడి నాతమాషా! మీయూరివారు నా తెలివి, నా తేట, నామంచితనము, నాయోగ్యత విచారించకుండఁ దమపిల్లలను నేను విద్యాబుద్ధులు చెప్పి బాగుచేసినందుకు విశ్వాసమైన లేకుండ నిష్కారణముగా మఱియొకపంతులును బిలుచుకొని వచ్చి పోటీగా బడి పెట్టించినారు. వెధవబడి వెధవబడి నాబడిపోతే యెంత, ఉంటే యెంత? ఇంతకంటె నెక్కువపని సంపాదించినాను. గరుడాచలము తనభాగవతములలో శ్రీకృష్ణవేషము వేయుమని నన్ను బతిమాలి నది. దానిమాట తీసివేయలేక నేను సరె యని వప్పుకొంటిని. చూడఁడి! యెటువంటిగౌరవమైనపని సంపాదించినానో, గరుడాచల మంటే యేమనుకొన్నారు? దేశదేశాల పేరుమోగినయాటకత్తె. అది భామవేషం కట్టితే చూచినవారు మూర్ఛపోవలెను. అది పాడితె ఆదిశేషు వాలకించవలెను. దానిభాగవతంలో కృష్ణవేషం కట్టడమంటె తాహసిల్ దారీపని చేయుడ మన్నమాట. ఈబడి పోఁ గానే మరేపని సంపాదించుకొనలేకుండ నే నంతవెధవననుకొన్నారా? మీకు గణపతంటె సామాన్యుఁడు గాఁడు, వీఁడు మైరావణుఁడని యిప్పుడైనా తెలిసిందా ? దాని భాగవతములో కృష్ణవేషము వేయఁగల యదృష్ట మెంతవానికిఁ బట్టును. వేదంజదువుకొన్న వెఱ్ఱి నాన్నలకు శాస్త్రిలు నేర్చుకొన్న సన్యాసులకు పెద్దవాళ్ళ మని తెగనీల్గే పెద్దన్నయ్యలకు ఈ యోగము పట్టునా? నాయదృష్టము చేత నాకుపట్టినది. అనిత్రైలోక్య సామ్రాజ్యపదవి తనకుఁ జేకురి నట్లు సంతసిలుచు నతఁడు పలికిన యావెంగలి పలుకులు విని వారు ముసిముసినవ్వులు నవ్వుకొని "నిజముగా నీయదృష్టముచేతనే దాని సేవ లభించినది. ఈ గ్రామములో నింతమంది యున్నారు. వారి కెవరికైన లభించినదా? అందొక్కొకరి పూర్వజన్మ పుణ్యమువల్ల

వచ్చుచుండును. "ముఖే ముఖే సరస్వతి" అన్నారు. నీముఖము చూడఁగానే గరుడాచలము మీచేత శ్రీకృష్ణమూర్తివేషము వేయించి తాను భామవేషము కట్టి "రారా నందకుమార రారా నవనీత చోర!" యని నీబుగ్గమీఁద చేయివైచి ధన్యురాలు కాఁదలఁచు కొన్నది. ఇంతకు దానియదృష్టము మంచిది. కాసియెడల నీవంటిబ్రాహ్మణోత్తముఁడు దానికి వేయిజన్మములు తపస్సు చేసిననుదొరకునా? మమ్మది చేర్చుకొన్నపక్షమున నాల్గువరాలుసొమ్ము దాని కిచ్చుకొందుము. లంచ మిచ్చినను మమ్ములను జేర నియ్యదు. నీముఖార విందము చూడఁగానే యది నీవలలోఁ బడినది" యని వా రెగతాళి చేయుచుఁ బలికిరి. వారు తన్ను బరిహసము చేయుచున్నవా రైనను నాబాలిశుఁడు గ్రహింపలేక దేశమందందఱు తన్ను గౌరవించునట్టి మహాపదవిలోనికి వచ్చినట్లు సంతసించి యావార్త తల్లికిం జెప్పెను. అది విని యామె తనకొడు కేనుఁగునెక్కినట్లు సంతసించి "నాయనా మంచిపని సంపాదించినావు. నీ కింత గొప్పతనము పట్టినందుకు ఈయూరివారందరు కన్నులలో నిప్పులు పోసికొంటారు. దిక్కుమాలినబడి పోతేపోయిందిలే! దానితాతవంటిపని వచ్చినది. నేనిక్కడనే సోలెడు బియ్యము కాచుకొని కాలక్షేపము చేయుచుండెదను నీవు వెళ్ళిరా" యని యన్నముపెట్టిపంపెను. గణపతి తనగుడ్డలు నాలుగు మూటగట్టికొని తనస్నేహితులంబిలిచి "యీచుట్టుప్రక్కల గరుడాచలం భాగవతం కట్టిందంటె నేనుకృష్ణవేషము వేసినానన్నమాటె. మీరందరు నాకోసమైనా భాగవతం చూచుటకురండి! నావేషమెంత దర్జాగా మెంతఠీవిగా నుంటుందో మీరు చూతురుగాని. అల్లరి చిల్లరి వెధవలు వేషముకట్టినట్లుకడతా ననుకున్నారా యేమి? ఎంత చమత్కారముగా నుంటుందో నావేషము చూచినతరువాత మీకే తెలియఁగలదు. తప్పకరండి, యనిప్రత్యేకముగ నొక్కరొక్కరితోఁ

జెప్పి గరుడాచలముతో బయలుదేఱి పలివెల వెళ్ళెను.

ఆయూరు వెళ్ళినతరువాత గణపతిగర్వము మేఱమీఱెను. మీ రెవ్వ రండీ యని యతని నెవ్వరైనక్రొత్తవా రడిగినప్పుడు గరుడాచలముమగఁడ నని యుత్తరము చెప్పుచుండును. ఆపణ్యాంగన బామవేషము కట్టినప్పుడు తాను కృష్ణమూర్తివేషము కట్టఁదలఁచుకొనుటచే నది యొక్కసారియైనను గట్టకమునుపే తా నామెమగఁడైనట్లుభావించుకొని యటులేలోకమున జెప్పఁదొడంగెను. వెలవెలందుల నిజముగ నుంచుకొన్నవారునయిత మావిధముగనెన్నఁడు జెప్పుకొన రని మనమందఱి మెఱుఁగుదుము. అయినను గణపతి సంబంధ మారోపించుకొని యది తనకు గొప్పతనము గలిగించునని తా నట్టి యుత్తరము చెప్పుట కవకాశము గలిగినందుకు మిక్కిలి సంతసించుచుండును. గణపతి బ్రాహ్మలయింట భోజనము జేసి తక్కినకాలమంతయు గరుడాచలముయొక్క గృహమందె గడపుచుండును. అంతఁగొన్నాళ్ళకు గొత్తపేట డిప్యూటితహసిలుదారుగారుగరుడాచలమును పిలిపించి భామవేషమును గట్టు మని యాజ్ఞాపించిరి. ఆతహసిలుదారు వారియాజ్ఞ తిరస్కరించుట కొంచెము గొప్పస్థితిలో నున్నవారికె యపాయకరమై యుండ నాదినములలో వెలయాలునకు గొఱవితో టలగోకికొనుట యని వేర చెప్పనక్కఱ లేదు అందుచేత నామె యచ్చటకు వెళ్ళి భాగవతము గట్టెను. హాస్యగాఁడు మద్దూరి మహాదేవుఁ డనుబ్రాహ్మణుఁడు. అతఁడు హాస్యమున మిక్కిలి గట్టివాఁడని పేరువడసెను. అతని హాస్యప్రసంగములు విని సభాసదులు కడుపులు చెక్కలగునట్లు నవ్విరి. సత్యభామ తెరమీఁద జడవైచిదానిని మిక్కిలి సొగసుగా వర్ణించుచుండ తహసిలుదారుగారు జరుగుచున్న యాలస్యము నోర్వక యేమిటది గేదెతోఁక లాగున జెడ తెరమీఁద వైచి లోపల కూర్చుండి యేదో గింజుకొనుచున్న దేమిటి? ఎవరోయి

బంట్రోతు. జెడపుచ్చుకొనిలాగి యీవల కీడ్చుకొనిరావోయి యని కేకవైచెను. గరుడాచలము సహజముగ గర్వోన్మత్తురాలు. ప్రశస్తమైనకంఠమును భామవేషధారణప్రవీణతయు గర్వమును హెచ్చించెను. తహసిలుదారుగా రాడినపలుకు లామెకు దుస్సహములై ప్రత్యుత్తర మీదలచినను నటువంటిమహాధికారిని యెదిరించుటస్వనాశనమునకుదారిచేసికొనుటయని గుర్తెఱిఁగి బంట్రో తీడ్చికొని రానక్కఱలేకయె జడవర్ణనము ముగించి తెర వెడలి వచ్చెను. గరుడాచలము తన్నుంచుకొన్నరసికులప్రేరణముననో వారికిఁ గుతూహలముగల్పింపవలె ననుసంతసముచేతనో చిన్ననాఁడు తల్లి చేసినయలవాటుచేతనో మనస్సున కుత్సాహము గలుగు ననుతలంపుచేతనో వేసవికాలమందు కల్లును తక్కినకాలములందు సారాయియుఁ ద్రాఁగుచుండును. భామవేషము కట్టినప్పుడు చాకచక్యము హెచ్చుటకై యామె తప్పక కొంచెము పుచ్చుకొనివచ్చును. ఆనాఁడు మోతాదు కొంచెమెక్కువయ్యెను. సగముకలాపమువినిపించునప్పటికి మత్తుసంపూర్ణముగ నెక్కుటచే నామె తప్పతప్పమాట లాడుచు నేలమీఁదబడెను. హాస్యగాఁడు మద్దెలగాఁడు శ్రుతిగాఁడు గరుడాచలము నేలఁబడుటకుఁగారణ మెఱుఁగుదురు. కాని గుట్టుబయటబెట్టుట వారి కిష్టములేదు. కావున హాస్యగాఁడు ముందుకువచ్చి గుండెబాదుకొని "మహాప్రభూ! దుర్మార్గులెంతపని జేసినారో చిత్తగించండి. గరుడాచలము యొక్క చక్కదనము సంగీతము భామవేషములోని ప్రజ్ఞ చూచి యోర్వలేక యెవఁడో పాపాత్ముఁడు ప్రయోగముచేసినాఁడు. నేలఁబడిపోయినది. మేము దేశద్రిమ్మరులము గనుక మాదగ్గఱ వీనికిఁ బ్రతికియలున్నవి. ఇంతమాత్రముచేత భయము లేదు. కాని యిఁక నీరాత్రికి భాగవతము సమాప్తము. పాప మది రేపుమధ్యాహ్నమువఱకు లేవలేదు. మహాప్రభూ, ఈవేళకు సెలవిప్పించండి. రేపురాత్రి యిటువంటి దొంగదె

బ్బలు తీయునట్టి దుర్మార్గులకు దొరకకుండ జాగ్రత్తపడితిరిగి భాగవతము గట్టెదము" అని వేఁడుకొని గరుడాచలమును దీసికొనిపోయెను. వానిపలుకులు సత్యంబులుగావగచి యెవఁడో నిజముగఁబ్రయోగము చేసినాఁడని నమ్మి ప్రేక్షకులు వానిని నోటికివచ్చినట్లు తిట్టిపోయిరి. మరునాఁడుమరలభాగవతముజరిగెను. కొత్తపేటలోజరుగబోవుభాగవతమునకు రమ్మని యదివఱకె గణపతి తనస్నేహితులకు వర్తమానమంపెను. అందుచే హాయిగా భాగవతము జూచుటకును గణపతి యొక్కకోర్కె నెఱవేర్చుటకును మందపల్లివాసులలోఁ బనిపాటులులేనివడుచువాండ్రు పదిమంది వెళ్ళిరి. చదువురాని యాడువాండ్రు పాటలుచెప్పుకొన్నట్లు గణపతి తనకలాపభాగము నొకరిచేతఁ జెప్పించుకొని వల్లించెను. ఇప్పుడు కొన్నిరాగము లతఁడు నేర్చుకొనెను. కాని చిన్ననాఁడు తల్లి కొట్టినప్పుడు పంతులు బాదినప్పుడు పెట్టురాగాలకు నీరాగాలకు నంతగా భేదము కనఁబడలేదు. ఆనాఁడుసత్యభామ నిర్విఘ్నముగాఁదనకలాపము వినిపించెను. హాస్యగాని వేషముకంటె కృష్ణవేషమె సభ్యుల కెక్కువయానందము గలిగించెను. అనఁగా నతఁడు చక్కగా కథాకలాపము వినిపించుటవలన నని తలంపవలదు. వామనావతారమును దలపించునతనిమూర్తియె మొదట నానందకారణ మయ్యెను. తరువాతనానందకారణ మిది. తాను జగద్రంజకముగఁ దనకథాభాగము వినిపింపఁగల నని గంపంతయాసతో నుండఁగా సభాసదులం జూడఁగానే యతనికి మేన ముచ్చెమటలుబోసెను. నోట మాట వెడలలేదు. తనస్నేహితులయెదుర తన కవమానముగలుగునని యాతఁడెంతో వగచి జ్ఞాపకము జేసికోవలెనని కడుప్రయత్నము చేసెను. కాని తాళముపోయినపెట్టెలో నున్న వస్తువువలెనే కథాభాగము దుర్లభ మయ్యెను. సభాసదు లందఱు జప్పటలు గొట్టినవ్విరి. అంతలోహాస్యగాఁడు కృష్ణవేషగానిని కొంచెముకదిపిమాట

లాడించవలెనని మాధవా మన దేయూరని యడిగెను. కృష్ణవేష ములో నుండుటచే ద్వారక కాపురమని గణపతి యుత్తరము జెప్పుటకు మారుగా మనది మందపల్లి గాదట్రా ఎఱుఁగనివానివలె నడిగెదవేమని ప్రత్యుత్తరము చెప్పెను. అప్పుడు సభాసదుల యానంద మేమి చెప్పుదును. చప్పట్లతో దెసలు మారుమ్రోగెను. హాస్యగాఁడు కడచిన రాత్రి పన్నినపన్నుగడయె మరల పన్నదలఁచి యెవరో మరల దెబ్బగొట్టినారు మహాప్రభూ యని చెప్పెను. కాని యీ పలు కనేకులకు నమ్మఁదగి యుండలేదు. నిష్కారణముగ భాగవతము చెడిపోయిన దని సభాసదులు విచారించిరి. గరుడాచలము సిగ్గుపడియెను. అందఱుగృహములకరిగిరి. గరుడాచలమునకు గణపతియొక్క వేషభాషలు కొంతకాలమునుండి యేవగలిగించుచు వచ్చినను గథాకలాపము వినిపించుటలో నతనికేమైనప్రజ్ఞ యుండునేమో యని యామె యాసపడెను. కాని యదిగూడ వట్టిదైనతోడనే తన కొలువులోనుండి లేచిపొమ్మని గణపతితోఁ జెప్పెను. ఇఁకమీఁద మిక్కిలి జాగ్రత్తతోఁ బనిచేయుదునని గణపతి యామెను బహువిధముల బతిమాలెను. కాని వానికోరిక నిరాకరించెను. అటమీఁద నే వృత్తి యవలంబింపవలయు నని గణపతి తనమిత్రులతో నాలోచింపనెక్కడనైనను వంటబ్రాహ్మణుఁడుగఁ గుదిరినపక్షమున చక్కగా జీవనము జరుగు నని కొందరుమిత్రు లుపదేశించిరి. ఆవృత్తి యతనికంతగా నిష్టము లేకపోయినను విధిలేక యతఁ డొడంబడవలసి వచ్చెను. గరుడాచలముదగ్గర నున్నపుడు తల కగరునూనె సంపెగనూనె రాచికొనుచు నదితీసి పాఱవైచిన పూలదండలు చేతులకుమెడకుదగిలించుకొని యానందించుచు దానిమగఁడ నని చెప్పుకొనుచుఁ గడపిన దినములే తనజన్మమధ్యమున శ్రేష్ఠమైన దినములుగఁ దలంచి పూర్వజన్మదుష్కృతవిశేషమున నట్టి యఖండయోగము తనకుఁ దప్పిపో

యిన దని విచారించుచు నొకలోకలుఫండు యిన స్పెక్టరుగారియింట వంటబ్రాహ్మణుఁడుగ గుదిరెను. అన్నముపెట్టి నెలకు నాలుగురూపాయ లిచ్చుటకు వారొడంబడిరి. కాని పదునైదుదినములు ముందుగా దన యాతువాండ్రిదగ్గఱ వంటనేర్చికొమ్మని యాయధికారి గణపతితోఁ జెప్పెను. అట్లె యని గణపతి యాయన తల్లియు భార్యయు వంటచేయునపుడు దగ్గఱ కూర్చుండి వంటచేయువిధము కనిపెట్టఁజొచ్చెను. ఇట్లొకమాసము గతించినతరువాత యజమానుఁడు గణపతిని దీసికొని యొకగ్రామము వెళ్ళి యుద్యోగస్థుల నిమిత్తమేర్పడినయొకబంగాళాలో దిగెను. వంట కుపయోగించుపాత్రములను దెచ్చికొమ్మని యజమానుఁడు పలుమాఱు చెప్పెను. కాని మందమతులలో నగ్రగణ్యుఁడైనగణపతి గరిటెలు మఱిచిపోయెను. ఒక్కొక్కమనుష్యున కెన్నిబియ్యము పోయవలెనో యతఁ డెఱుఁగఁడు. ఏగిన్నె యెంతయుడుకునో తెలియక మూనెడుబియ్యము ముడుకుగిన్నెలో భోజనము చేయవలసినవారు తమరిద్ద ఱైనప్పటికి నడ్డెడుబియ్యము బోసి పాక నారంభించెను. అన్నము గిన్నెలో నొక్కటేముద్దయై పోయెను. కలియఁబెట్టుటకు గరిటె లేకపోవుటచే గణపతి చుట్టుప్రక్కలకరిగి యొకపుల్ల దెచ్చి దానితోఁ గలియబెట్టెను. దైవవశమున నది వేపపుల్ల యయ్యెను. పప్పులో నుప్పెక్కువ యయ్యెను. పైగా నది యెనుపకపోవుటచే బద్దలుబద్దలుగా నుండెను. చారుకాచెను. కాని యది కంసాలులు వెండివస్తువులు మొదలగువానికి వన్నె దెచ్చుటకై యుడుకపెట్టెడు చింతపండుపులుసువలె రుచిలేక చూడ నసహ్యమై యుండెను. యజమానుఁడు స్నానముచేసి వడ్డించుమని కూర్చుండి గణపతి గిన్నె దెచ్చి యావేపపుల్లతోనె వడ్డించుటకు బ్రయత్నము చేసెను. కాని విస్తరిలో నన్న మూడిపడ దయ్యెను. గిన్నెనే బెట్టి కొట్టి వేపపుల్లతోఁ బొడిచిపొడిచి నానాబాధలు పడు

నప్పటికిఁ బారణపుముద్దలవలె రెండుండ లూడిపడెను. ఆతరువాతగణపతి పప్పు వడ్డించెను. అన్నముచిదుపుట యజమానునితరము గాకపోయెను. చేయివైచునప్పటికి నిప్పుమీఁద చేయివైచిన ట్లంటుకొనెను. విసనికఱ్ఱఁ దెచ్చి కొంతసేపు విసరినతరువాత నన్నము చల్లఁబడెను. కాని యజమానుఁడు ప్రాణాహుతులుపుచ్చుకొనునప్పటికె యన్నము యొక్కరుచి తెలిసెను. వేఁపగింజలు వండిపెట్టిన ట్లుండెను కాని యన్నము వండిపెట్టినట్లు లేదు. తరువాత యజమానుఁడు పప్పు నోటఁబెట్టెను. ఉప్పులో నాలుగుపప్పుబద్ద లడ్డముపేసి యతఁడు వండెనో పప్పులోఁజెరిసగ ముప్పువేసియుండెనో కనిపెట్టుట బ్రహ్మదేవుని తరము కాదు. అన్నము సూపము రుచి చూచినతరువాత యజమానునకు దుఃఖము కోపము నొక్కసారిగ రాఁగా నిట్లనియెను. "హా! హా! హా! నీవంట యమృతమువలె నున్నదిరా. నలపాకభీమపాకము లన యీావఱకు లోకమున నున్నవి. కాని మాకర్మపరిపాకముచేతనో దైవదుర్విపాకముచేతనో గణపతిపాకమని మూఁడవపాకము వచ్చినది. విరోధముచేత నెవఁడైన మఱియొకని జంపఁదలఁచుకొన్నపుడు నాభి, పాషాణము మొదలైనవిషములు పెట్టనక్కఱలేదు. నీచేత నొక్కసారి యన్నము వండి పెట్టించినఁ జాలు. ఏఁబదిసంవత్సరములు బ్రతుకఁదలంచినవాఁ డాపూటఁ జచ్చును. ఉదయమున నేనేమియుఁ దినకుండ గుఱ్ఱ మెక్కి యెంతోదూరము తిరిగి బడలి మిక్కిలి యాకఁలిగొని యింతమృష్టాన్నము నీవు వండి సిద్ధముగానుంచుదు వని గంపంత యాసతో వచ్చితిని. అన్నముపెట్టుటకు మారు నీవు సున్నము పెట్టితివి. నీవంట మండిపోనూ. ఇఁక చాలు. నన్ను చంపక నీదారిని నీవువెళ్ళు నాయనా. మీపెద్దలకు వేయినమస్కారములు" అనవుడు గణపతి చిన్నవోయి వంటెందుకు బాగులేదో నేనెఱుఁగను. ఇది మీవాళ్ళు నేర్పినవంటే. నావల్ల వచ్చినలోప

మొక్కటి, గరిటె మఱిచిపోయినాను. అన్న మీాపుల్లతో గలి యం బెట్టినాను. ఇది వేపపుల్లయేమో తెలియదు. అయితేమా త్రమేమి వేపపుల్లతో మొగము కడిగికొనవా? వేపపువ్వు తినవా? అన్నము చేదైనమాత్రమున నింతయల్లరి చేయవలెనా? మీాయాడవాళ్ళు చేసినప్పుడుమాత్రము వంట యెప్పుడైన చెడిపోదా. మీాకింతయోపిక లేదన్నమాట మొదటే తెలిసినపక్షమున మీావద్దకు నేను రాకపోదును. పోనియ్యండి, యేలుట కూళ్ళు లేవు గాని యెత్తుకొనితినుట కూళ్ళు లేవా? మీావంటివారు నాకు వేయమంది. నావంటివాళ్ళుమీాకు వేయిమంది. నేను మీావద్దఱ నెలదినములు పని చేసినాను. నాజీతమీాయండి. మీావద్దరపనిచేయడము నాకేయప్రతిష్ట' యని చివాలున లేచి తనగుడ్డలు నాలుగు మూటగట్టుకొని పయన మయ్యెను. ఆయజమానుఁడు వానిమాటల కలుగక వాఁ డొక యున్మత్తుఁ డనుకొని రెండురూపాయలు వానిచేతిలో బెట్టి నీకు నెలకు నాలుగురూపాయ లియ్యఁదలఁచుకొన్నాను. కాని నీ తెలివికి రెండురూపాయలు చాలును. పోయని చెప్పెను. "పోనీయండి! నాసొమ్మెంతమంది తినలేదు. అందులో మీారొకరు." అని యారెండు రూపాయలు బుచ్చుకొని విసవిస నడచిపోయెను. ఆయుద్యోగస్థుఁ డాపూట భోజనము లభింపమి యనఁటిపండ్లు తెప్పించుకొనితిని యొక విధముగా క్షుద్బాధ తీర్చికొని సాయంకాల మాయూరుకరణము గారియింటికిఁ బోయి తనయవస్థఁ జెప్పుకొని యక్కడ భోజనము చేసెను.

ఎనిమిదవ ప్రకరణము.

వాసపల్లెలో గణపతి స్థానమందుఁ బ్రవేశించినయుపాధ్యాయుఁడు కాలవశమున విశూచిబాడ్యముచేత మృతినొందెను. అందుచేత నాయూరిలో బడిచెప్పువారు లేకపోయిరి. అంతలో గణపతి కృష్ణవేషధారణమును పాచకత్వము ననురెండుద్యోగములు మాని యాగ్రామముబోవఁ దటస్థించెను. గణపతిచర్య లెన్నఁటికి మఱపురానివైనను గొంద ఱాచార్యులు మఱచి బడిపెట్టు మని యతని నడిగిరి. కొందఱు గణపతి యెంతమాత్ర మాపనికిఁ బనికిరాఁ డని వాదించిరి. అభిమాన మున్నవారియాదరణముచేత నతఁడు మునుపటిచోట గాక మఱియొకచోట పాఠశాల స్థాపించెను. బసయు మునుపటిచోట చేయక యాయూరివారొకరు స్వగృహము విడిచి బిడ్డలకింగ్లీషు చెప్పించుకొనుట కమలాపురము వెళ్ళుచుండఁగా వారి నడిగి యాయిల్లు తనకాపురమునిమిత్తము గణపతి పుచ్చుకొని యందుఁ బ్రవేశించెను. ఇల్లు పెద్దదగుటచేత పిశాచములు వచ్చి పీడించు నని యాతఁడు విద్యార్థుల నెప్పటి యట్ల కొందఱిని దనకుసాయముగఁ బిలుచుచుండును. ఆయింటిదొడ్డిలో నాలుగైదు కొబ్బరిచెట్లుండెను. ఎలుక లప్పుడప్పుడు చెట్లెక్కి లేతపుచ్చెలు కొట్టి క్రిందపాఱవేయఁజొచ్చెను. ఎలుకల రాయిడి తొలఁగించుటకై గణపతి యనేకోపాయములఁ బన్నెను. ఆయుపాయములలో నొకటియు నతనికి నచ్చలేదు. ఎట్టకేల కతనికి గొప్పయాలోచనయొకటి పొడగట్టెను. అది యమోఘ మని యతఁడు తలంచెను. ఒకనాఁడు సకలగృహవర్తి యగు మార్జాలచక్రవర్తిని బట్టుకొని దాని నొకబుట్టలోఁ బెట్టి శిష్యు నొకనిం బిలిచి చెట్టెక్కించి మఱియొకశిష్యునిచేతఁ బైనున్నవాని కాపిల్లినంది మ్మని చెప్పెను. అతఁడ ట్లందిచ్చెను.

పైవాఁడు పిల్లి నందుకొనినతరువాత దానిమెడ కొకత్రాడు బోసి యాత్రాడు కొమ్మకుఁ గట్టివేయు మని గణపతి చెప్పెను. శిష్యుఁడు గురునియాజ్ఞాప్రకారము గావించి క్రిందికి దిగెను. అప్పుడు గణపతి శిష్యులతో నిట్లనియె. "ఈసారి యెలుకలు చచ్చిపోయినవి. వీటిమొగం మండ. కొబ్బరికాయ యొక్కటైన దక్కకుండ వాటిపొట్టం బెట్టుకొనుచున్నవి. ఈగ్రామములోనివారందరు నావలెనే యెలుకలబాధ పడుచున్నారు. కాని మందమతిముండకొడుకులు నావలె నొక్కఁడైన యాలోచన చేయలేకపోయినాఁడు. తెలివి తేటలుండవలెను. కాని యేళ్ళుండఁగానె సరా! డబ్బుండఁగానే సరా" ఆకోతలు విని శిష్యు లానందించిరి. అప్పటికి సాయంకాలమయ్యెను. గణపతి భోజనముచేసి నిద్రించెను. తన బిడాల మెన్ని యెలుకలను బట్టి రాత్రి చంపెనో చూడఁగోరి గణపతి చెట్టుదగ్గఱకుఁ బోయి మెడయెత్తి చూచునప్పటికిఁ బిల్లిమెడ కాత్రాడు యురివడఁజచ్చి యురిస్తంభమున వ్రేలాడు నేరస్తునివలె వ్రేలుచుండెను. అది యేమైనదో చూచుటకై శిష్యులు చేరి యాబిడాలము యొక్క దుర్దశ జూచి జాలినొందిరి. ఆవార్త యప్పుడే గ్రామమునఁబొక్కెను. సూర్యోదయ మగునప్పటికె గ్రామమునందలి పిన్నపెద్దలు నా వింతఁ జూచుటకై యచ్చోటికిం జనిరి. నవ్వినవారు నవ్విరి. వెక్కిరించినవారు వెక్కిరించిరి. పరిహాసగర్భముగ నతనిబుద్ధి మెచ్చినవారు మెచ్చిరి. అంద ఱన్నివిధముల ననుచుండ మహాదేవశాస్త్రి గణపతితల్లితో నిట్లనియెను. "సింగమ్మప్పా! నీకొడుకు పిల్లిబ్రహ్మహత్య చేసినాఁడు. కుక్కను చంపినపాపము గుడికట్టినప్పటికిఁ బోదు. పిల్లినిచంపినపాపము బంగారుపిల్లిని జేసి బ్రాహ్మణునకు దానమిచ్చినగాని పోదు. అట్లు చేయకపోతే వంశనాశనమని పెద్దలుచెప్పుచున్నారు. ఆనక నీయిష్టము. నీమేలు కోరినవాఁడను. గనుక నిజ

స్థితి జెప్పినాను" అనవుడు సింగమ్మ గుండె బాదుకొని "అయ్యో! నాయనా ఎంతపని జరిగిందిరా. నీకొబ్బరిచెట్లు కూలిపోను. మీకాయలు గంగపాలు గాను. ఈమాయపిల్లలు మావాడిమతి విఱిచి యీపని చేయించినారమ్మా. అయ్యకొడుకా! నీవు బ్రతుకవు కాబోలునురా నాయనా" యనికొడుకును గౌఁగిలించుకొని యేడ్చెను. అందులోఁ గొందఱు "అవ్వగారూ! భయపడకండి, మేమందఱమూ చందావేసికొని బంగారుపిల్లి చేయించి మీయబ్బాయిచేత దానముచేయించెద"మని ధైర్యము జెప్పిరి. అంతటితో గణపతిమనస్సు తల్లిమనస్సు స్థిమితపడెను. మహాదేవశాస్త్రి యారాత్రి మరల గణపతిగృహమున కరిగి తల్లికొడుకులతో నిట్లనియెను. "బంగారుపిల్లిని చేయించుటకు గ్రామస్థులు చందా లిచ్చెద మని చెప్పినారు కదా. ఆచందాలు మీరుపుచ్చుకొన్నపక్షమున నెప్పటికప్పుడె పులులోఁ బడిపోవును. అవిపోగుచేసి నాచేతికివ్వండి. శాస్త్రప్రకారము చచ్చిపోయినపిల్లి యెంతయున్నదో అంతపిల్లిని చేయించి దాన మీయవలెను. మన మంతవఱకుశక్తులము గాము గనుక చందాల సొమ్ము పెద్దకాసువఱకుఁ జేరినతోడనే శాస్త్రసంతృప్తికొఱ కేదో విధముగా నొకచిన్నపిల్లిని జేయించి యొకబ్రాహ్మణుని చేతిలోఁ బెట్టుదము. పిల్లిదానము తిలదానముకంటె చెడ్డది. అది యెవరుఁ బట్టరు. ఏదోవిధముగ నేనేర్పాటు చేయుదునులెండి. మీకు భయపడకండి" అని చెప్పిపోయెను.

మహాదేవశాస్త్రి యుదయమున జేసిన ప్రథమోపన్యాసము నుబట్టియు రాత్రి గావించిన ద్వితీయోపన్యాసమునుబట్టియు నతఁడేలాగై గణపతిని దోషవిముక్తునిజేసి పిల్లిదాన మెవరు బట్టకపోయినను దానైన యాదానము బట్టి యాతని నొకదరికిఁ జేర్పవలయునని సంకల్పించినటులు స్పష్టముగఁ దెలియుచున్నదికదా! ప్రాణ

భయముచేత గణపతి ప్రతిదినము నిద్ర మేల్కొనఁగానె నలుగురనో యైదుగురనో గృహస్థులను జూచి చందా నడిగి తనచుట్టముక్కల కందులోఁ గొంత మిగుల్చుకొని తక్కినవి మహాదేవశాస్త్రిగారిచేతి కిచ్చుచుండును. అట్లొకమాసములో నొకకాసు పోగుచేసి యతఁడు శాస్త్రికిచ్చి పైఁడిపిల్లిం జేయించు మని కోరెను. కాని కాసాగ్రామమున దొరకలేదని కొంతకాలము, కంసాలి చేయలేదని కొంతకాలము, తూనిక వేయించలేదని కొంతకాలము జరిపి గణపతి యాగ్రామమున నుండఁగా సువర్ణమార్జాలము నతనికిఁజూపలేదు. గణపతి చందావలన దెచ్చినరాగిడబ్బులు వెండిబేడకాసులు పావులాకాసులు చేతఁబడవైచినప్పుడె యవియె రాగిపిల్లులు వెండిపిల్లులు నని మహాదేవశాస్త్రి మనస్సులో దలంచుకొని యాపిల్లులనెప్పటికప్పుడె భక్షించుచువచ్చెను. కాని బంగారుపిల్లిని జేయించఁదలఁచుకొననే లేదు.

బంగారుపిల్లిగొడవతో నిట్లు కొంతకాలము గడచినపిమ్మట నొకనాఁడు గణపతియు నతనియింటికి రాత్రులు పండుకొనవచ్చు పెద్దవిద్యార్థులు కొందఱును గలిసి కాలువదగ్గఱకు షికారుబోయి యయ్యది వేసవికాల మగుటచేఁ దెల్లవాఱుజామున లేచి ప్రతిదినము స్నానముచేయ వలయునని నిశ్చయించుకొనిరి. కాని దీని కొక్కచిక్కు కనఁబడెను. గణపతికి మెలకువ వచ్చుట యసంభవము. ప్రతిదినము జాము ప్రొద్దెక్కినతరువాత లేచు గణపతి జాము తెల్లవారగట్లలేచుట యర్ధరాత్రిమున సూర్యోదయ మగుటయె. శిష్యులు ముందె మేల్కని పిదప గురువును లేపవచ్చునని వారిలో నొక్కఁ డాలోచన చెప్పెను. తెల్లవారుజామున శిష్యులకు ముందు మెలకువ వచ్చుట యెట్లని వారిలోనొకనికి సందేహము తోఁచెను. గురువుగారి

దగ్గఱ నున్నప్రజ్ఞలన్నియు శిష్యులకు లేకపోయినను నిద్రావిషయ మునమాత్ర మతనిశిష్యులే యనిపించుకొనుటచేత నట్టి సందేహ మున కవకాశము గలిగెను. పట్టణములో గొప్పవారియిండ్లనుం డునట్టిగడియారము యొక్కటి యున్నపక్షమున ముందుగాఁ దక్కిన వారికి మెలఁకువ వచ్చుటకు వీలుగానుండునని యొకఁడు చెప్పెను. అది విని కాపులకుఱ్ఱవాఁ డొకఁ డిట్లనియె. "గడియారములు మన దేశములో లేవు. నూటనోట నొకటి యున్నదో లేదో. అదిగాక గడియారము త్రిప్పుట మనకు దెలియదు. మనము చూడనులేదు. గడియారము లేకపోయిననేమి? మంచికోడిపెట్ట నొకదానిని మనము పెంచుకొన్నపక్షమున నది నాలుగుజాములకు నాలుగుసారులు కూ యును. కడపటిసారి కూసినతోడనే ముందుగా మనకు మెలఁకువ వచ్చును. ఆతరువాత మనము గురువుగారిమీఁద నెక్కి త్రొక్కి యొ రక్కియొ గిల్లియొ కఱచియొ లేపవచ్చును. ఇదిగాక కోడిని పెంచుటవల్ల గురుపుగారికి మఱి రెండులాభము లుండును. కోడిగుడ్లమ్మినందువలన కొంతడబ్బు చేరును. పైగా దానికడుపున రెండు మూడుపుంజులు మంచివి పుట్టినయెడల మనయమ్మవారితీర్థములోను మఱియితరతీర్థములలోను వాటిచేత పందెములు గట్టించి కావలసి నంతడబ్బు సంపాదింపవచ్చును. కాఁబట్టి నాయుపాయము విని యొక కోడిని పెంచుట మంచిది" అనవుడు వెఱ్ఱివాలకముగా నున్న యొక బ్రాహ్మణబాలుఁడు చీ చీ కాలమానము దెలియుటకు బ్రాహ్మ ణు లెవరైన కోడినిపెంచుదురా? ఇది చాలతప్పు. అది మనము చే యవలసినదికాదని హితోపదేశము చేసెను. ఆయుపదేశము తక్కి నబ్రాహ్మణబాలకులకు సహేతుకమై సమ్మతమై తోఁచినను నది వఱకె హాస్యాస్పదముగ నున్నగురువుగారిచరిత్రము మఱింతపరిహాస పాత్రముగఁ జేయఁదలఁచి యాశూద్రకుమారుని యాలోచనము

మిక్కిలి బాగున్నదని ప్రశంసించి యతనిమాట కడ్డముచెప్పినబ్రా హ్మణబాలుని వారు చీవాట్లు పెట్టిరి. పందెములవలనను గుర్రవల నను విశేషలాభము గలుగునని వినినతోడనే గణపతి కుక్కుటస్వీ కారమునకు సమ్మతించి యొకకోడిని దనకుఁదెమ్మని కాపులకుఱ్ఱవాని నడిగెను. వాఁడు తనయింట నున్న యొకపెట్టను దెచ్చి మరునాఁ డుదయమున గురువుగారికి గొప్పకానుకగా సమర్పించెను. ఆయులు పా గ్రహించి గణపతి పరమసంతోషభరితుఁడై దాని కొక గది యేర్పఱచి కన్నబిడ్డవలె దాని నాదరింపఁ జొచ్చెను. బడిలో. జదు వుకొనుపిల్లలందఱు వంతులప్రకారము దినమున కొక్కపిల్లవాఁడు దానినిమిత్తమై తౌడు తేవలెనని యతఁ డాజ్ఞాపించెను. ఆప్రకార మందఱుఁ దేఁ దొడఁగిరి. తౌడుతేలేనివారు గురువుగారియొక్క బెత్త ముదెబ్బలకు గురి కావలసినదే. దానికూఁతవలన శిష్యులకును గు రువునకును మెలఁకువ వచ్చుటయుఁ దెల్లవారుజామున వారు కాలు వకు స్నానమునకుఁ బోవుటయు మూఁడునాళ్ళముచ్చట యయ్యెను. పిన్ననాఁటినుండియుఁ బెంచినబద్ధకము వారిశ్రద్ధను కబలింప వారా ప్రయత్నము మానుకొనిరి. కోడిమాత్రమె యింట మిగిలెను. గణ పతి బడిపిల్లలందఱుఁ జూచుచుండగను వారు లేనప్పుడును దమకోడిని యొడిలోఁ బెట్టుకొని చేతితో జోకొట్టుచు నాబుల్లికోడి రావే నాబు చ్చికోడి రావే నావెఱ్ఱికోడి రావే యని ముద్దులాడుచుండును. తల్లి సింగమ్మ కుమారుఁడు చేయు కుక్కుటసంరక్షణ మెంతమాత్రము సహింపక కొంప మాలపల్లి చేసినావురా నాయనా. నీకోడి మండి పోను. దీనియీకెలు రెట్టలు యెత్తిపోయలేక చచ్చిపోవుచున్నాను. బ్రాహ్మణులకు కోడి యెందుకురా? నీముద్దు ముక్కలైపోనూ" యని పలుమారు మందలించుచుండెను. అవి యెంతమాత్రము వా నితల కెక్కలేదు. మహారాజుల యంతఃపురాంగనలు చిలుకలను

రాయంచలను మిక్కిలి గారాబమునంబెంచుచు నెత్తికొని ముద్దాడుచు నానందించునట్లె గణపతియు నెందఱు చెప్పినను వినక యాకోడి తన కారవప్రాణ మనియు దనపాలిటి లక్ష్మి యనియు నమ్మి దాని కేవెలితి రాకుండ వేవిధములఁ గనిపెట్టుచుండును. గ్రామవాసుల లో ననేకు లతఁడు కోడినెత్తికొని ముద్దాడునమయమున నక్కడకుఁ బోయి వానిమాటలు ముఖవైఖరులును బరీక్షించి వినోదముతోఁ బ్రొద్దుపుచ్చుచుందురు. అప్పుడప్పు డాకోడిగుడ్లు పోవుచుండును. దొంగిలించినబాలుని గనుఁగొనలేక గణపతి బడిపిల్లలందఱిపీఁపుల మీఁద నీఁతబెత్తములతో బాజాలువాయించుచుండును. రామాయణ భారత భాగవతాదులలోని కథలు చెప్పుకొనినట్లు యాగ్రామవాసులును సమీపగ్రామవాసులును వానిచరిత్రము జెప్పుకొని కడుపులు పగులునట్లు నవ్వుచుందురు. ఎప్పటిగుడ్లప్పుడు గణపతి ఖర్చు నిమిత్త మమ్మివేయుచుండును. కాని కోడి పొదిగే వాటిని పిల్లలు జేయువఱకు నోపిక పట్టలేకపోయెను. అట్లుండఁగా నొకనాఁ డా కుక్కుటము మిక్కుటమైన సంతోషముతో దొడ్డిలో దిరుగుచు నక్కడక్కడ రాలినగింజలు చెదపురుగులు మొదలైవాని నేరుకొని తినుచుఁ దిరుగుచుండఁగా నేమూలనుండియొ నొకగండుబిల్లివచ్చి దానింబట్టుకొని గొంతుకొఱికిచంపెను. చంపినతరువాత లోపలినుండి గణపతియు బడిపిల్లలు వచ్చిరి. కార్యము మించిపోయిన తరువాత వచ్చి యేమిచేయగలరు? అప్పుడు గణపతి పడినదుఃఖము వర్ణనాదుస్సాధ్యమైనను గొన్నిమాటలైన వ్రాయకపోవుట చరిత్రమునకు వెలితి యగును. కావున నించుక చెప్పఁదలంచితిమి. "అయ్యో! నాకోడి నాన్నల్లకోడి నాపాలిటిబంగారుగని వనుకొన్నానే నిన్ను. నీ కడుపున బుట్టిన పుంజులచేత పందెములు వేయించి నాలుగైదువందలు సంపాదించి పెండ్లిచేసుకుందామనుకున్నానే, నీవంటిబంగారుబొజ్జ

గలకోడి నావంటినిర్భాగ్యులకు దక్కునటే. నీకెంతముద్దుగా తౌడు పెట్టుకొన్నానే. భుజముమీఁద నెక్కించుకొని త్రిప్పినానే. రాత్రి లు నాప్రక్కలో పండుకొనేదానవే. ఇఁక నేనొక్కఁడ నేలాగున పడుకోఁగలనే? ఈమాయపిల్లెక్కడవచ్చిందే నీప్రాణమునకు?" అని దుఃఖించుచుండ సింగమ్మ యతనికడకుఁ బోయి "యయ్యో నా యనా అది చుట్టమా పక్కమా. కోడికోస మల్లా యేడువవచ్చు నట్రా" యని మందలించెను. ఆపలుకులు వినఁగానే యతఁ డాగ్ర హావిష్టుఁడై త్రాటియాకులమంటవలె లేచి "దిక్కుమాలినముండా నాకోడికి నీదృష్టి తగిలిందే ముండా. దానిని చూచినప్పుడెల్ల నీ కన్నులలో నిప్పులు పోసికొన్నావు. నీమూలమున నిక్షేపమువంటి కోడిపెట్ట పోయినదే ముండా. నాయిల్లు చిన్నబోయి వల్లకాడులా గున్నదే ముండా. నీకన్ను లిప్పుడు చల్లగా నున్నాయటే ముండా" యని కోప మాపుకొనలేక యామెకడకుఁ బోయి బుఱ్ఱ వంగదీసి పదిచఱుపులు వైచెను. "నీకేమిచేటుకాలము వచ్చినదిరా. నేనేమి జేసినాననిరా నన్ను కొట్టుచున్నా" వని యామె యేడ్చుచు లోనికిఁ బోయెను. ఆరాత్రి యతఁడు దుఃఖముచేత సరిగానన్నమే తినలేదు. జన్మమధ్యమున నతనికి సరిగా నిద్రపట్టనిరాత్రి యదియె. తెల్లవా రుజామున నెన్నఁడులేని దతనికి మెలఁకువ రాఁగా "యీపాటికి లేచి కూసేదానవే. నీకూఁతలు నాకు సంగీతముబాగుండేవే. నేనెం తదిక్కుమాలినవాఁడనైతినే. నీవు లేకపోవుటచేత యిల్లు బారుమ నిపోయిందె. నీవు చచ్చిపోయినావుకాని మాతల్లిముండైనా చచ్చి పోయినదికాదే" అని పరిపరివిధముల దుఃఖించెను. ఆమరునాడునుండి యు మఱియొకకోడికొఱకు ప్రయత్నము చేయఁదొడఁగెను. కాని యది లభించినది కాదు.

తొమ్మిదవ ప్రకరణము.

తనకు వివాహము కాలేదని యందువలన సాటివారిలోఁ దనకు చిన్నతనము గలుగుచున్నదని, కష్టపడి చేసికొన్న పెండ్లి చెడిపోయినదని కొంతకాలమునుండి గణపతి మనస్సులో విచారించుచుండెను. అత్తఁడు కట్టినపుస్తె త్రెంపివైచి బుచ్చమ్మకుఁ దండ్రి మరల పెండ్లి చేసెను ఆవార్త విన్నది మొదలుకొని మరల కష్టపడి తానెట్లైన వివాహము జేసికొని మేనమామయొద్దకు మేనమామ కూఁతును వివాహమాడినవానియొద్దకుఁ బోయి "యీపాడుపిల్లనాకుఁ దప్పిపోయినంతమాత్రమున నాకు వివాహము కా దనుకొన్నారా? దీనబ్బవంటిపిల్లను చేసికొన్నాను. చూడండి" యని వారిని దెప్పవలె నని గణపతి మనస్సులో నిశ్చయించుకొని పెండ్లికూఁతురు నిమిత్తమై వెదకఁజొచ్చెను. తల్లి సింగమ్మయుఁ దనకొడుకు ఘోటకబ్రహ్మచారియై యుండినాఁ డనియుఁ బ్రసిద్ధమైన పప్పుభొట్లవారివంశము వానితో నంత మొందునని యుఁ దనమగనికి మామగారికి వారిపూర్వులకు సద్గతులుండవని యు మిక్కిలివిచారించి యిరుగుపొరుగు స్త్రీలు కనఁబడినపుడెల్ల నిట్లనుచుండును. "అమ్మా! మీరందఱభిమానించుకొని మాగణపతి నొకయింటివానిని జేయరుగద. వానిమెడలో నాలుగుపోగులు పడేదారిచూతురమ్మా. మీకుబహుపుణ్య ముంటుంది ఎంతమందో వంటబ్రాహ్మణులకు నీళ్ళబ్రాహ్మణులకుఁ దెలివి తేటలు లేనివాళ్ళకు యిట్టిపెండ్లిండ్లగుచున్నవి. నాకర్మ మేమో కాని మావాడికి పిల్లనిచ్చుట కెవ్వరు రారు. కులము తక్కువా, గోత్రి ముతక్కువా? మేమేమి కుక్కను దిన్నామా? నాబిడ్డ పదిమందిలో తిరుగలేనివాఁడా. డబ్బు తెచ్చుకోలేనివాఁడా. మీరందఱు తలోపది రూపాయలు చందావేసి మావాడికి పెండ్లి చేయండమ్మా. మాకిన్ని

యేండ్లపిల్ల కావలెను అన్ని యేండ్లపిల్ల కావలెను అని పట్టింపు లేదు. ఎన్ని యేండ్లపిల్లయినను సరే. చివరకు రెండుమూడునెలల పిల్లయిననుసరే. అమ్మా వానికి పాతికేండ్లకంటె నెక్కువలేవు. ఇదొకవయస్సా. మావాఁడిప్పటికి కట్టుతప్పి పోలేదు." అని చెప్పుచుండ నామెపుత్రిస్నేహమునకు వెంగలితనమునకు వారు మిక్కిలి విస్మితులై నవ్వుచు "సింగమ్మవ్వా! అలాగే పెండ్లికుదుర్చండి. మాకుతోచినసహాయము మేము చేయుదు మని యుత్తరము చెప్పుచువచ్చిరి. ఆమె కొడుకుం గలిసికొన్నను చుట్టములఁ జూచినను చుట్టుప్రక్కలసుదతులఁ గనుఁగొనినను బెండ్లిమాటయె కాని మఱియొక ప్రసంగము చేయుట మానెను. అన్యప్రసంగములు వచ్చినను నామె యెట్టకేల కీప్రసంగముననే దింపును. బడిపిల్లలతోను బాటసారులతోను బంధువులతోను గ్రామవాసులైన కరణములతోను కాపులతోను గణపతి తనవివాహప్రసంగమే చేయఁజొచ్చెను. తనశాఖలో నెవనియొద్ద నవివాహిత యైనబాలికయున్న దని విన్నను దన కామె నిచ్చిపెండ్లిసేయు మని స్వయముగానైన మాతాపితల నతఁడడుగును. లేక యెవరిచేతనైన వర్తమాన మంపును. నీకెంతయాస్తి యున్నదని యెవరైన నడిగినపక్షమున నతని కెంతోకోపము వచ్చి యిట్లనును. "ఆస్తి ఆస్తి. ఆస్తి లేకపోతే బ్రతకలేరా యేమి. ఆస్తి యున్నవారు బంగారము దినుచున్నారా? లేనివారు మన్ను దినుచున్నారా. ఎందుకాస్తి. చచ్చినప్పుడు కూడ తగులవేయుదురా యేమిటి. నేను భార్య కన్నము పెట్టఁగనా లేనా యని యొక్కమాట విచారింపవలెను. మీయందరికంటె బాగానే భార్యకన్నము పెట్టగలను. ఆస్తికావాలట. ఆస్తిపాస్తి. చాలుచాలు నోరుమూయండి అధికప్రసంగములు చేయక." ఆపలుకులు విని పిల్లతల్లిదండ్రులు మధ్యవర్తులు వానిబేలతనమునకు ముసిముసినవ్వులు

నవ్వుచుందురు. ఒకనాఁడు తల్లి గణపతి కన్నము పెట్టుచు వివాహ ప్రసంగము రాఁగా కొడుకుతో నిట్లనియె. నాయనా! మనపుల్లయ్యమా మభార్యకు నెలతప్పినదఁట. ఆమాట విన్నప్పటినుండి నా కెంతో సంతోషముఁగానున్నది. అయితే మన కేమిలాభమేయని యతఁడు బదులుచెప్పెను. దానికడుపున ఆడపిల్లపుట్టినట్లైతే వాఁడుగూడ నీకు మేనమామే గనుక ఆపిల్లను నీ కియ్యగూడదా యని నాయాశ యని యామె బదులుచెప్పెను. ఆమాట వినఁబడఁగానె గణ పతి మిక్కిలికోపించి "ఓసి భ్రష్టాకారిముండా, అంతచిన్నముండను నేను పెండ్లి చేసుకుంటానుటే. అది యెన్నడెదుగును. ఎన్నడుకాపు రమునకు వచ్చును. ఈలాటివెధవమాట లాడకు" మని యెడమ చేతితో రెంపమొట్టికాయలు మొట్టెను. పాప మామునలియవ్వ యారెండు మొట్టికాయలతో నెంతోసేపు తల తడుముకొనుచు నేడ్చి నీ కిదేమివినాశకాలమురా. నీ పెండ్లి పెడాకులు చేయవలె నని నేను మంచియాలోచన చెప్పితే నీవు నన్ను కొట్టినావు. నీపెళ్ళి మండి పోనూ నాకెందుకు అని దూషణపూర్వకముగా విలపించుచుండ "ఓసి దొంగముండా, నన్ను తిట్టుచున్నావా యని తనచెంబులోనున్న నీళ్ళామెనెత్తిమీఁద పోసి యన్నము విడిచిపెట్టి లేచిపోయెను. అది యైనమఱినాలుగుదినముల కొకనాఁటిరేయి గణపతి భోజనముచేయు చుండ మరల సింగమ్మ యిట్లనియెను. "నాయనా! మనరామావ ధానులకూఁతురుకు సంబంధము దొరకలేదుట. తగినవరుఁడు దొర కితె యివ్వవలె నని యున్నాఁడుట. నీ వెవ్వరిచేతనైనా పిల్లను నీకి మ్మని వర్తమాన మంపించరాదూ? నాయనా నేఁజతికియుండఁగా నొకయింటివాఁడ వైతే చూడవలె నని యున్నది." అనుటయు గణపతి "వా రెందుకు పీరెందుకే. నీవే వెళ్ళి మాపిల్లవానికి మీ పిల్ల నిమ్మని యడుగు. రామావధానులు మన సంబధముకంటె

యెక్కువసంబంధము తేగలఁడాయేమిటి యని యుత్తరము చెప్పెను. అందు కామె వెండియు నిట్లనియె. అదికాదునాయనా ! నేను వెళ్ళియడిగినానంటే నీ కిల్లున్నదా వాకిలి యున్నదా యని ప్రశ్నలు మొదలు పెట్టుదురు. ఆప్రశ్నలకు నేను జబాబు చెప్పలేను. తనయాస్తిసంగతి యెవఁడైన నెత్తినపక్షమున నతని కమితాగ్రహము వచ్చు నని యిదివఱకే వ్రాసియుంటిమి. తల్లిపలుకులు వినఁగానే నతఁ డతికోపము జెంది "శకునపక్షిముండా ! పెండ్లిమాటలకు వెళ్ళి రావే యంటే యిల్లున్నదా వాకిలి యున్నదా యని వారడుగుతా.రని లేనిపోనిశంకలు పెట్టి పాడుమాట లాడుచున్నావు. బోడిముండ! నీ మూలముననె నాకు పెండ్లి కాలేదు. ఇళ్లు వాకిళ్ళు పుట్టగానే లోకులందఱు పట్టుకువచ్చారా యేమిటి? నీవే నా కేమియు లేదని ముందుగా ప్రేలుచుంటే పిల్లనిచ్చేవా రనరా యేమిటి పిశాచపుముండా? కోడలురానీ నిన్ను వీధులోనికి కుక్కనీడిపించిన ట్లీడిపించకపోతానేమో చూతువుగాని యని కోప మాపుకొనలేక యావిస్తరి రెండుచేతులతో నెత్తి తల్లినెత్తిమీఁద పెట్టి రుద్ది వీపు మీఁద రెండుచరుపులు చఱచి లేచిపోయెను. అయ్యో ! నే నేమన్నానురా నేనేమన్నానురా. నీ పెండ్లి పేలాలువేగిపోను. నాజోలికి రాకురా. ఇఁకమీద నీపెండ్లిమాట నే నెత్తనురాబాబూ" యని తన తల యంటుపడెను గావున నూతికడకుఁ బోయి యామె స్నానము చేసెను. సింగమ్మకు మంచిపాటలుగాని పద్యములు గాని రావు. కాని యప్పుడప్పుడు యేదోకూనిరాగములు తీయుచుండును. ఆమెకు రామదాసుచరిత్రము మిక్కిలి యిష్టము. అప్పుడప్పుడు బైరాగులు భిక్షాటనమునకు వచ్చి రామదాసుచరిత్రము బాడినపుడు చేరెడు బియ్యము వారికిఁ బెట్టి రెండుమూఁడుకీర్తనలు వినుచుండును. ఆకీర్తనలలో యెందుకైనా యుంచినావు బందెఖానాలో నను

నట్టి దామెకు మిక్కిలి యిష్టము. విద్యావిహీను లైన బైరాగులు శబ్దములు స్వచ్ఛముగ నుచ్చరింపలేక వెంధుకైనా వుంచినావూ బ్రింధిఖానాలో అని పాడుచుందురు. సింగమ్మ వారిదగ్గ ఆపాట నేర్చికొని వారివలెనే వెంధుకైనా వుంచినా వని తప్పుగా పాడుకొనుచుండును. ఒకనాఁ డామె తన ప్రాత నులకమంచము మీఁద వెన్నెలలో బండుకొని యాపాట పాడుకొనుచుండఁగా గణపతి వచ్చి "ఓసి నీపాట తగలెయ్య! అదేమి పాటే? బ్రాహ్మణముండవు కావటే. పాడదలఁచుకుంటే ఎందుకైనా వుంచినావు బంధిఖానాలో నని స్వచ్ఛముగ పాడు. లేదా నోరు మూసికొని యూరుకో యని పలికెను. "నా పాటజోలి నీకెందుకురా. నాకు వచ్చినట్లు పాడుకొనుచున్నాను. నీకిష్టమైతె విను. లేకపోతే యావలకు లేచిపో" యని యామె బదులుచెప్పెను. "అపస్వరములుపాడి పాట తగులఁబెట్టి నేను దిద్దితే పైగా నామీఁద కోపపడతావా. ఓసి కోపిష్టిముండా. అపస్వరాలపాట యెప్పుడు పాడవుగదా పాడవుగదా" యని నాలుగు చెంపకాయలు కొట్టెను. ఆమె కుమారుని మనసులో దూషించుచు గోలుగోలున మనసులో నేడ్చెను. ఒకనాఁడు కొట్టినాఁడుగదా మరల వానియొద్ద నిట్టిపాటలు పాడఁగూడదని యామె యూరకుండదు. ఆడది, పెద్దది. విశేషించి తల్లి యామె యెట్లు పాడుకొనిన మనకెందు కని గణపతి యూరకుండఁడు. ఈవిధముగ నామె పాడుచుండుట నామెకు బుత్రిదండనము జరుగుచుండుట ప్రాయిక మయ్యెను. శంకరుని కుమారుఁ డైన గణపతియొక్క పురాణము జనులు వినాయక చతుర్థినాఁడెవిందురుగాని యీగణపతిపురాణ మనుదినము వినుచుండిరి. దినమున కొక క్రొత్త వింత బయలుదేఱుచుండెను. రాత్రి భోజనములైనతరువాత గ్రామవాసు లరుగులమీఁదఁ గూర్చున్నప్పుడు ప్రాతఃకాలమున దంతధావ

నార్థము నలుగురు చెరువుగట్టునఁ జేరినపుడు యెమిటోయి గణపతి విశేషము లని యొండొరుల నడుగుచుందురు. ఎవరో కొన్ని క్రొత్తవింతలు చెప్పుచుందురు. అక్కడచేరినవా రందఱు మితి మీఱ నవ్వి మనయదృష్టముచేత గణపతి మనగ్రామమున నివసించెనని పలుకుచుందురు. వివాహముమాట తలపెట్టినపుడు పాట పాడుకొన్నప్పుడు కొడు కేదోపంకఁబెట్టి తన్నఁ గొట్టుచుండుటచేత సింగమ్మ కొడుకున కెవరైన చేతబడిచేసెనో లేక పిచ్చియెత్తెనో యని యిరుగుపొరుగు కాంతలతో నాలోచింపఁబోయెను. కొందఱు దయ్యమనిరి. కొందరు పిచ్చియనిరి. గణపతి తల్లితోనే గాక తనవివాహముమాట యెత్తి తనకాస్తి లేదన్న వారందరితోను తగవులాడుచుండుటచే గ్రామవాసులలోఁ గొందరుకూడ యితనికిఁ బెండ్లిపిచ్చి యెత్తిన దని తలంచిరి. ఈతని వికృతచేష్టలు చూచి గడుసువాం డగు ప్రాతవిద్యార్థులు కొందఱు గణపతిని తమ వినోదమునిమిత్త ముపయోగించుకొనవలెనని యాలోచించి తమలో తా రొక పన్నుగడ పన్నుకొని యొకనాఁడతనితో నిట్లనిరి. "పంతులుగారూ! మీకు వివాహముచేయవలె ననిమాకందఱకు గట్టిగా మనసులోనున్నది. కాని కొందరు గణపతిగారికి పిచ్చియెత్తిన దనియు మీరు తిన్నఁగా పల్లకిలోఁ గూర్చుండలే రనియు మీకు బుద్ధి నిలకడలే దనియు మీమీఁద లేనిపోని వాడుకలు వెచినారు. అందుచేత మేమీరాత్రి పల్లకి భజంత్రీమేళము రెండుమూఁడుకాగడాలు తెప్పించెదము. మీరు పల్లకిలోఁ గూర్చుండి పెండ్లికొడుకుతీవి కనబరచవలెను. ఆలాగున మీరు చేసినపక్షమున మీరు వివాహమునకుఁ దగినవారే యని మీకు వెఱ్ఱిలే దని గ్రామవాసులు నమ్మి చందాలువేసి మీకు వివాహముఁ జేయుదురు. మీరుమాకు చదువు చెప్పి మమ్మెంతో బాగుచేసినారు గనుక విశ్వాసముచేత మిమ్మొక

యింటివారిని జేయవలెనని మాకందఱకుఁ దోచినది. పల్లకిలోఁ గూర్చుండుట మీకిష్టమేనా? పల్లకిపేరు చెప్పఁగానే గణపతి పరవశుఁ డయ్యెను. వెనుక బుచ్చెమ్మపెండ్లి మిక్కిలి రహస్యముగ జరుగుటచే బహిరంగముగాఁ బల్లకినెక్కి యూరేగుట కతని కవకాశము లేకపోయెను. వివాహ మైనప్పుడు తీరవలసినముచ్చట వివాహము కానప్పుడు తీరుట తనకు శుభసూచక మని తప్పక యటమీఁద నిఁక వివాహ మగు నని యతఁడు నిశ్చయించి యిట్లనియె. "ఒరే అబ్బాయిలారా! నేను కష్టపడి చదువు చెప్పినందుకు మీ కున్నది విశ్వాసము. తక్కినవాళ్ళలో నొక్కముండాకొడుకైన నున్నదా? ఒక్కడికి లేదుసుమా. ఈకలియుగంలో విశ్వాసముంటుందిటా? ఒక లవ్‌డీకొడుకైన లేదురా విశ్వాసము. యెంతకష్టపడి చదువు చెప్పినానురా మీకు. నామూలమునను నెగాదటా? మీ రింతింతవాళ్ళైనారు. మీవిశ్వాసమునకు నేను సంతోషించినానురా. మీయాలోచన బాగున్నది. ముత్యాలకుచ్చు లున్నపల్లకి తెప్పించండి. బోయలు వోం వోం వోం వోం మ్మని బాగా కేకలువేయాలి. కాగడాలు రెండు చాలవు. నాలుగై దుండవలెను. డోలు వీరణము సన్నాయితోనే కడతేర్చక రమడోలుమేళము తాషామరపాలు బాకాలజోడుకూడ తెప్పించండి. చూడు వోరే వెంకటప్పా! మీబాబయ్యచుట్టుకునే యెఱ్ఱతలగుడ్డ జరీది తీసికొనివచ్చి జరీపట్టీలు పైకి బాగాకనుబడునట్లుగా చుట్టి నాతలమీఁద పెట్టండి. పట్టుకోటెక్కడైనా తెచ్చిపెట్టండి. జరీపంచ జరీకండవా కావలెను. అవి యింకొకరు తీసుకొని రండి: లేకపోతే చాకలి సర్విగాడికి నాలుగుడబ్బులిచ్చి తీసుకొనిరండి. ఇవి తెచ్చి సింగారంచ్చేసి యాపైని నన్ను చూడండి. పల్లకిలో మహారాజుకొడుకులాగ ఎంతతీవిగా యెంతదర్జాగా కూర్చుందునో. కాగడాలవెలుతురున నామొగమెంత ధగధగ మెఱ

యునో నేనేలాటినవ్వులు నవ్వుదునో యేలాటిచూపులు చూతునో చూడండి తమాషా! నేనేమి వెఱ్ఱివెంకటాయ ననుకొన్నారా యేమిటి? ఇదివర కిన్ని పెళ్ళిళ్లైనవిగాని యీగ్రామములో పల్లకిలో యింతడాబుగా కూర్చువ్వ పెండ్లికొడుకు లేడురా వీడికడుపుకాలా వీఁ డసాధ్యుఁడురా యని లోకులందఱు చెప్పుకొనునట్లుకూర్చుండఁ గలనో లేదో చూడండి. వెళ్ళండి. మీపనిమీఁద మీ రుండండి." అని బడి కాదినము సెల విచ్చెను. విద్యార్థులు వానికడ సెలవు గైకొని తిన్నఁగా చాకలిపేటకుఁబోయి యొకపల్లకిగుదిర్చి రాత్రి యెనిమిదిగంటలకు రమ్మని చాకలివాండ్రతోఁ జెప్పిరి. తాషాజోడు రమణోలుమేళము గుదిర్చి తక్కినభజంత్రీల నేర్పరచిరి. ఒక డెఱ్ఱజరీతలగుడ్డ తెచ్చి పట్టీలు పైకుండునట్లు చుట్టి యతనితలపై బెట్టి యది సరిపోవునో లేదో యని నాలుగైదుసారులు చూచెను. గణపతి పెద్దయద్దమొకటి తెప్పించుకొని తనమొగ మందులోచూచుకొని సంతోషించెను. నాలుగైదుపట్టుకోట్లు తెచ్చిరి. గాని యవి యన్నియు వానిబొజ్జకు సరిపోవయ్యెను. ఎన్నికోకలుచుట్టిననుహాను మంతునితోఁక మిగిలియున్నట్లె యెంతెంత పెద్దకోట్లు తెచ్చినను గణపతిబొజ్జమాత్రము మిగిలియేయుండెను. చిన్న పొణకకో యామదపుసిద్దెకో కోటుతొడిగినట్లుండెను. కాని మనుష్యునకు తొడిగినట్లులేదు. సరివిగానిదయవల్ల జరీపంచయు నుత్తరీయము లభించెను. ఆపంచ గట్టుకొని యాకోటుమీఁద నాయుత్తరీయము వైచికొని తలపాగదాల్చి పల్లికి యెప్పుడువచ్చు నెప్పుడువచ్చునని యూరేగింపుటుత్సవమున కుబలాటపడుచుండఁగా నొకవిద్యార్థి మొగమునఁ గళ్యాణముబొట్టు కన్నులకుగాటుక, కాళ్ళకు పసపు పారాణి లేకపోయినపక్షమున పెండ్లికొడుకున కుండవలసినలక్షణము లుండపుగనుక తప్పక నవి యన్నియు నుండవలెనని చెప్పెను. అది గణ

పతికిసహేతుకముగాఁదోఁచినందున బాదములకుఁబారాణియు, నేత్రం బులకుగజ్జలంబును బెట్టుమనితల్లినడిగెను. ఇంతమాత్రిపుముచ్చటయైన దాను బ్రీతికియుండఁగా దనకన్నులఁ బడిన దని సంతోషించియతఁడు మరచిపోయిన బుగ్గచుక్కగూడ బెట్టెను. ఈ రేగిం పైనతరు వాతే భోజనము జేయుదు నని గణపతి యాపూట భోజనమే చేయ లేదు. గణపతి యాదినమున నూరేగు ననువార్త పొక్కుటచే గ్రా మవాసులంద ఱాయుత్సవముఁ గన్నులారఁ జూచి యానందింపవలె నని తమతమపనులెల్ల పెందలకడ ముగించి దీపములు పెట్టినతోడనే భోజనములు చేసిరి. చిన్నపిల్లలుసైతము నిద్రపోవరైరి. మగవాం డ్రిందఱు గణపతియింటిముందఱ రాత్రి నాలుగుగడియల ప్రొద్దుపో వునప్పటికిఁ దీర్థప్రజవలెఁ జేరిరి. ఆడువాం డ్రిందఱు గృహకృత్య ములు పెందలకడ నిర్వర్తించుకొని యూరేగింపు చూచుటకు వీధు లలోఁ గూర్చుండిరి. రాత్రిజా మగునప్పటికి యూరేగింపు ప్రారంభ మయ్యెను. గణపతికి రెండువిచారములు మాత్రము పట్టుకొనియెను. భోగముమేళము లేకపోవుటయొకటి. బాణసంచా లేకపోవుటయొకటి. ఆ విచారము పూర్వవిద్యార్థులకుఁ దెలుపఁగా నిజమైన వివాహ మున కారెంపువెల్తులు బూర్తిచేయుదు మని చెప్పి గురువు గారి దుఃఖోపశమనము చేసిరి. ఆరాత్రి వానపల్లి గ్రామవాసు లను భవించిన యానంద మేమని వర్ణింతును. ఉత్సవముతో నెంత తిరిగినను వారికి విసుగు జనింపలేదు. కాళ్ళు నొప్పులుపెట్టలేదు. ఆయాస మనిపించలేదు. ఎందుచేత ననగా మనగణపతి తనచేష్టల చేత నాసనములచేత చూపులచేత మఱియితరచిహ్నములచేత క్షు ణక్షణము వారికిక్రొత్త యానందము గల్పించుచువచ్చెను. ఒకమూఱు వెనుకనున్న బాలీసుకుఁ జేరబడును. ఒకమూఱు పండుకొనును. ఒకసారి ముందఱికి వంగును. ఒకతూరి బాసెనపట్టువేసికొనును. ఒకపరికాళ్ళు

జాపుకొనును. ఒకసారి రెడ్డికము వైచికొనును. ఒకసారి కన్నులు మూసికొనును. ఒకసారి పెద్దగుర్రిక్లు చేయును. మఱియొకతూరి యోర చూపులఁ జూచును. ఒకసారి చప్పట్లువాయించి తానే గానము చేయును. కాగడాలు పల్లకికి దూరమైనప్పుడు కాగడాలుపట్టువారిని గట్టిగాతిట్టి దగ్గఱకు రమ్మనును. ఇంటింటిదగ్గఱ పల్లకి యాపించును. వా రేకారణచేతనైన నాగకపోయినపక్షమున బిగ్గఱగ నఱచి యాపించును. ఒకసారి భజంత్రీలు సరిగా మేళము చేయకపోగా మేళము చేయింపు మని యతఁ డొకరిద్దఱితోఁ జెప్పెను. వా రామా టవినిపించుకొననందున గుభాలున తానే పల్లకిలోనుండి క్రింది కురికి భజంత్రీలను నాలుగు చెంపకాయలు కొట్టి మరల పల్లకి యెక్కెను. కూడనున్న జనులలో నవ్వనివారు లేరు. దేవతోత్సవములకు గాని జమ్మినవారికిగాని గురుస్వాములవారు వచ్చినప్పుడు కాని దేశోద్ధార కులైనమహానుభావులు వచ్చినప్పుడు గాని యంతజన మెన్నఁడును బయలు దేఱియుండరు. తనస్నేహితులయిండ్లముందరికిబల్లకివెళ్ళినప్పు డు గణపతి చేసన్న చేసి పిలిచి "ఓరీ! యుత్సవ మేలాగున్నది. నేను జమాయించిగూర్చున్నానా? పెండ్లికొడుకులాగున్నానా"యనియడుగు చుండును. పెండ్లికొడుకుబాబులాగున్నావురా.నీలాటిపెండ్లికొడుకులేరి రా లోకములో నని హాస్యాస్పదముగ వారు ప్రత్యుత్తర మీయ నతఁడు దానిభావము గ్రహింపలేక తనవంటి పెండ్లికొడుకులు లోక మున లే రని యానందించెను. తనయుత్సవ మగుటచేత గణపతి యా రాత్రి నిదుర పోవలేదు. ఏమియు దోఁచనపుడు చుట్టవెలిగించి యీ ప్రక్క నాప్రక్కనున్న కాగడావాండ్రిమీఁదను స్నేహితులమీఁద ను నుమియజొచ్చెను. ఆమహోత్సవపారవశ్యమున వా రాయవమా నము సరకుగొనరైరి. ఆసమయమున నతనితిట్లు దీవన లయ్యెను. ఉమ్మలు పుష్పవర్షము లయ్యెను. జాము తెల్లవారునప్పటికి యుత్సవ

ము సమాప్త మయ్యెను. గణపతి పల్లకి దిగి యింటిగుమ్మములో నడుగుపెట్టగానే సింగమ్మ గుప్పెడుమిరపకాయలు దిగదుడిచి తన్ని మిత్త మారిపోకుండజాగ్రత్త పెట్టినపొయినిప్పులో పడవైచి కుమారునకు దృష్టిదోషపరిహారము చేసెను. పల్లకి దిగి గణపతి పండుకొని మరునాడు పగలంతయు నిద్రిపోయి సంధ్యాకాలమున మేల్కొనియ పుడు దంతధావనము చేసి భుజించి కడచినరాత్రి జరిగినయూరేగింపునుగూర్చి విద్యార్థులతో గొంతప్రసంగించి మరల పండుకొని మరునాడు జాముప్రొద్దెక్కినతరువాత లేచెను. అదిమొదలుకొని పదిదినములవరకు నెవరుకనబడినను వారితో తన యూరేగింపుటుత్సవమును గూర్చి మాటాలాడుచు బాగున్నదని యెల్లవారును బ్రశంసింప నమితానందమునొందుచు తన్మయత్వము జెంది సుఖించుచుండెను. కాని తల్లి కుమారుఁడు భోజనముచేయునప్పుడు వానివివాహప్రసంగము తలపెట్టుట మానలేదు. ఏదోతప్పుపట్టి గణపతియామెను మొట్టుట కొట్టుటకూడ లేదు. ఆబాధపడలేక యామె యురుగుపొరుగునున్నమగవాండ్రితో మొఱ్ఱపెట్టుకొనగా వారు గణపతికి పిచ్చిపట్టిన దనియు దలమీఁదఁ గత్తినాటులు వేయించి నిమ్మపండ్లపులుసుతో రుద్ది వంద బిందెలనీళ్ళు పోసినగాని యాపిచ్చి కుదరదనియుఁ జెప్పిరి. బాధపడలేకపోవుచున్నాను నాయనా యలాగే చేయండని యామె బదులు చెప్పెను. మరునాడుదయమున గణపతి నిద్ర మేల్కొనకమునుపే వానిపూర్వవిద్యార్థులు మెఱియలవంటివాం డ్రెనమండ్రి వచ్చి తల్లితో మాటలాడి గణపతి మేల్కొనువఱకు నక్కడ కూర్చుండియూ తఁడు మేల్కొన్నపిదప "పంతులుగారూ! కాలువకువెళ్ళి స్నానము చేయుదము రండి" యని యడిగిరి. సరే యని యతఁడు బయలుదేఱెను. వారొకమంగలివానినిగూడ వెంటదీసికొనిపోయిరి. అక్కడకు వెళ్ళినతరువాత "పంతులుగారూ! మీరు పనిచేయించుకొం"డనియం

దొకఁడు చెప్పెను. తల మాయలేదు. నేను పని చేయించుకొన నని యతఁ డుత్తరము చెప్పెను. అప్పు డిద్దరుశిష్యులు చెరియొకచేయి బట్టుకొనిరి. ఇద్దఱు కాళ్ళుత్రొక్కిపెట్టి పట్టుకొని మంగలివానిని పని చేయుమని చెప్పిరి. అంతట మంగలివాఁడు క్షురకర్మ నారంభించెను. గణపతి మంగలివానిని విద్యార్థులనుదిట్టుచు దక్షిణదేశపుగాయకుఁడు త్రిప్పినట్లు తల యిట్టటుఁ బలుమాఱు త్రిప్పెను. మంగలివాఁడు ప్రయత్నపూర్వకముగ నాటులు వేయకపోయినను గణపతిశిరము వేమాఱు త్రిప్పుటచే నాలుగైదునాటులు పడెను. అంతలో మఱినలుగురు విద్యార్థులు నాలుగుబిందెలు తీసికొనివచ్చిరి. సింగమ్మకూడ వారితో వచ్చెను. ఆవార్త గ్రామమున బ్రకాశిత మగుటచేత బనిపాటలు లేనివాండ్రు వినోదము చూచుటకై కాలువయొడ్డున జేరిరి. నిమ్మపళ్ళ పులుసుతో మంగలివానిచేత తలరుద్దించి విద్యార్థులు గురుభక్తితత్పరులై వందలకొలఁదిబిందెలనీరు వానితలపై బోసి యాదెబ్బతో మీపిచ్చవదలును లెండి యనుచు నించుమించుగ సహస్రఘట్టాభిషేకము జేసిరి. నడుమనడుమసింగమ్మ "నాయనాపిచ్చి పూర్తిగవదిలిన దాక నీళ్ళుపోయండి"యని వారిని హెచ్చరించుచువచ్చెను. "నాకు పిచ్చలేదురోయి వదలండిరోయి" యని గణపతి కేకలువేయజొచ్చెను. "అదేపిచ్చమాట నాయనా పిచ్చ లేదన్నమాటే పిచ్చ" యని సింగమ్మ విద్యార్థులతో బలికెను. గణపతి తల్లిని బూర్వవిద్యార్థులను మహోత్సవసందర్శనార్థ మరుదెంచినగ్రామీణులను నోటికివచ్చినట్లెల్ల దిట్టి కాలుచేతులు స్వాధీనము గాకపోవుటచే గొందఱం గఱచి కొందఱం దలతో గుద్దిమ్మి గ్రామమునుండి యుత్సవముజూచుటకై కాలువవఱకు నడచివచ్చినవారిశ్రమ వృథా గాకుండ గావలసినంత వినోదము గలిగించెను. పూర్వవిద్యార్థులట్లుతన్ను బాధించుచుండదన కాపీడ దొలఁగింపు మని గణపతి తత్కాలపువిద్యార్థులలో వెన్న

ముదిరినవాండ్రిను గొందఱను బిలిచి చెప్పెను. కాని వారేమియుఁ జేయలేకపోయిరి. ఈయభిషేక మైనతరువాత వారు గణపతిని మెల్లగా నిల్లు జేర్చిరి. ఈపనితల్లియె చేయించిన దని యతఁడు తెలిసికొని యామె తనకంటికి కనఁబడకూడదని చెప్పెను. అతఁ డేదైనదుష్కార్యము చేయునే మోయని యామెను మహాదేవశాస్త్రిలుగారి యింటికి పంపిరి. గురువుగారికి శిష్యులే తమతమయిండ్లనుండి పూటకొక్కరుగ వంతులు వేసికొని యన్నము దెచ్చిపెట్టుచుండిరి. తల్లి తనకు గావించినపరాభవము తాను తల్లికి గావింపవలె నని యతనికి దృఢసంకల్పము కలిగెను. కలుగుటయు దనకాప్తులైనపదుగురువిద్యార్థులనుబిలిచి యొకనాడిట్లనియె. "ఓరీ నాకొక్కపెద్దచిక్కుసంభవించినదిరా! మాతల్లి వట్టిపిచ్చిముండై పోయినది. దానిపిచ్చికుదురు తేనే గాని నాకు సుఖము లేదు. చూడు తమాషా. అది పిచ్చిముండయై యెదురు నాకేపిచ్చి యని లోకమున వెల్లడిచేసి యినపగుండ్లవంటి బండకుంకలను బదిమందిని పోగుచేసి కాలువ రేవున నాబుట్టగొరిగించి నిమ్మపండ్లపులుసుతో నాతలగుద్దించి నీళ్ళు పోయించినది. ముందు దానిపిచ్చిమనము కుదుర్చవలెను. అది యిక్కడకు వచ్చుట లేదు. ఓరె చిదంబరం! నీవువెళ్ళి మాయమ్మను సమాధానపరచి కోపము దీర్చి మనయింటికి తీసుకొనిరా. వచ్చిన తరువాత నాలుగురోజులు చూచి దానిపిచ్చి మనము కుదిర్చివేతుము." అని చెప్ప వెంటనే చిదంబరము తల్లికడకుబోయి సామవాక్యములతో నామెయలుక దీర్చి యింటికి దోడ్కొని వచ్చెను. నాలుగురోజులు జరిగిన తరువాత నొకనాడు తెల్లవారుజామునను మంగలిని గణపతి పిలుచుకొనివచ్చి నిద్దురలేవకమునుపే తల్లికి క్షౌరము చేయు మని చెప్పెను. మంగలి మొదట సందేహించెను. కాని మాయమ్మపిచ్చిది. మే మిప్పు డామెకు నీళ్ళు పోయవలెను గనుక సందేహింపక పనిచేయరా యని

యతఁడు హెచ్చరింప క్షురకుఁడు వపన మారంభించెను. కత్తి తలకు తగలగానే యామె మేలుకొని కన్నులు తెఱచిచూచి నీకిదేమి వినాశకాలమురా యని మంగలినిదిట్టి వానిచేయి బట్టుకొనబోవుచుండగా నంతలో గణపతి విద్యార్థులు డగ్గరి కాలుసేతులు నొక్కి పెట్టిరి. ఆనడుమ మంగలిముండనము సమాప్తముచేసెను. ఆమెయునిట్టటు గింజుకొనుటచే రెండుమూడుగంటులు పడెను. తరువాత గణపతియు శిష్యులును గలిసి శవమును దీసికొనిపోయిన ట్లామెను వీథిలోనున్న పెద్దనూతికడకు దీసికొనిపోయి బిందెలతో నీళ్లుతోడి పోసిరి. ఆమెయు దనకు బిచ్చి లేదని పలుమాఱులు మొఱ్ఱపెట్టుకొన్నను నవియెల్ల పిచ్చిమాటలే యని గణపతి సరకుసేయక పోయండి నీళ్ళుపోయండి యని మాత్రాణముదీర్చికొనెను. అంతలోగణపతికిదల్లి పైనున్నయక్కసుతీరిపోయెను. నాటంగోలె సింగమ్మ తనయునిగృహమువిడిచి గ్రామమున వారింటను వీరింట నేవోపనిపాటలు చేయుచు గాలక్షేపము సేయజొచ్చెను. కొడుకు నలుగురను పోగుచేసి తనకు పిచ్చి యని నీళ్ళు పోయించు నని తల్లియు దల్లి పదుగురునుబోగుచేసి తన కున్మాద మని చెప్పి కాలువకడ స్నానములు చేయించు నని కొడుకును నొండొరులకు భయపడ జొచ్చిరి. పిమ్మట మాతాపుత్రులెన్నడుగలుసుకొనలేదు. మహాదేవశాస్త్రిగారితల్లియుమఱికొందఱు బ్రాహ్మణవితంతువులు రామేశ్వరయాత్ర వెళ్ళ దలఁచి తమకేవైన పనిపాటులుచేయు చుండు నని సింగమ్మను వెంట రమ్మనిరి. ఆమె భోజనము గడచుటయే గాక యాత్రఫలముగూడ దక్కు నని వారి వెంట బయలుదేరెను. ఆమె తిరుపతి శ్రీరంగము మధుర రామేశ్వరము మొదలైన మహాక్షేత్రములు చూచి తిరిగివచ్చునపుడు మార్గమధ్యమున శ్రీకుంభకోణ క్షేత్రమునందు విశూచిజాడ్యముచేమృతినొందెను. ఆమె గోదావరీతీరమునందె మృతినొందవలెనని మొదటి

నుండియు దలంచెను. కాని భగవంతుఁడు కావేరీతీరమె యామెనిమిత్తము విధించి యుండెను. ఇప్పటివలె నాకాలమున రైలుబండి లేక పోవుటచే రామేశ్వరయాత్రి నేటివలె సులభముగాక మిక్కిలి కష్టసాధ్యమై యుండుటచే సింగమ్మ మరణవార్త గణపతికి తెలియనే లేదు. మహాదేవశాస్త్రిలుగారితల్లి వచ్చి యావార్త చెప్పునప్పటికి గణపతి వానపల్లి విడిచిపోయెను. అందుచేత నతఁడు తల్లినిమిత్తము కన్నీరు గాని నువ్వులనీరుగాని విడువవలసినయవసరము లేకపోయెను బ్రతికియుండఁగా బెట్టినపిండమేగాని చచ్చినతరువాత పిండముపెట్టనవసరము లేకపోయెను. మాతాపుత్రులు వియోగ మైనదిమొదలుకొని గణపతి కొంతకాలమువిద్యార్థులయిండ్లలో వారములు చేసికొనియు గొన్నినాళ్ళు వంటచేసికొనియు బ్రాహ్మణార్థములకుబోయియు సంతర్పణముల కరిగియు గాలక్షేపము సేయజొచ్చెను. గాని వివాహము కాలేదను గొప్పవిషాద మతనిమనస్సును విడిచిపెట్టలేదు. అంతకుముందు చేసినప్రయత్నములవలన శుల్కము గ్రహింపకుండఁదనకు కన్యాదానము చేయువా రెవ్వరు లేరని యతఁడు తెలిసికొని కొన్నివందలరూపాయ లోలి దానిచ్చియైన వివాహమాడవలయునని నిశ్చయించుకొనెను. కాని ద్రవ్యములేదు. అందునిమిత్తమైచందాలు వేయుమని గ్రామవాసులను బేడింపఁ జొచ్చెను. ఆగ్రామవాసులనే గాక చుట్టుప్రక్కల నున్న గ్రామముల కరిగి తద్గ్రామీణులనుగూడ యాచింపఁజొచ్చెను. యాచించి తెచ్చినసొమ్ము తనదగ్గఱ నుంచుకొనక తనకునమ్మకగలయొక బ్రాహ్మణునిచేతి కిచ్చి దాఁచెను. రమారమి నూటయేబదిరూపాయలు పోగుపడెను. ఏడెనిమిదివందలరూపాయ లుండినగాని యతనికివివాహము కాదు. ఎట్లయిన నంతసొమ్ము పోగుచేసి యతఁడు కృతకృత్యుఁడు కావలె నని యత్నము చేయజొచ్చెను.

ఇట్లుండ నొకనాఁడు మహాదేవశాస్త్రి వర్తమానమంపి గణపతిని పిలిపించి తనయెదుటగడ్డము పెంచుకొనియున్న యొకానొక బ్రాహ్మణుని జూపి యిట్లనియె. "అబ్బాయి గణపతీ! యీ బ్రాహ్మణుఁడు నీకు పిల్లనీయవలె నని వచ్చినాఁడు. ఈయన కాపుర మంతర్వేది. వీరింటిపేరు చింతావారు. ఈయనపేరు భైరవ దీక్షితులుగారు. ఈయన స్వాధ్యాయమందుగొప్పయధికారి. ఈయన యే కాదు. ఈయనతండ్రిగారు తాతగారుగూడ నెనుబది రెండుపన్నములు గట్టిగావర్ణించి ఘనపాఠులైనారు. వారు నీవంటివానితో సంబంధము చేయుటే కష్టము. ఆలాటిది నీపూర్వపుణ్యముచేత నీకు వారితో సంబంధము గలుగుచున్నది. ఈయన వందలు వేలు పుచ్చుకొనేవాఁడుకాఁడు. నలువదివరహాలు మాత్రము నీవిచ్చేపక్షమున పిల్ల నీయధీన మగును. పిల్లను నేను చూచినాను. గజ్జెల గుఱ్ఱములాగున్నది. ఆఱుమాసములలోనె కాపురమునకు రాఁగలదు. కాఁబట్టి నీ వా సొమ్మిచ్చి వీరిపిల్లను చేసికో. పైగా వారు తమపిల్ల నిక్కడికి తీసికొనివచ్చి మీయింట్లోనే వివాహము చేయుదురు. వారు పూర్వముగొప్పసంసారులెకాని వారిపెద్దలుచేసిన క్రతువులవల్ల దానధర్మములవల్ల సంసారము చితికిపోయినది. అందుచేతనే నలువదివరాల సొమ్ము నీదగ్గఱ పుచ్చుకొని మీయింటికేవచ్చి పెండ్లి చేయవలసి వచ్చినది. కాని లేకపోతే వీధులుకట్టి విస్తళ్లువేసి సంతర్పణచేసి కలియుగవైకుంఠముగ వారువివాహము చేయఁగలవారె. సరె. ఆమాట లెందుకు. ఇప్పుడు పెద్దమనుష్యుల నెవ్వరినైన తీసికొనిరా తాంబూలములు పుచ్చుకుందాము. ఏమండి దీక్షితులుగారు! పిల్లవానినిమీరు చూచుకొన్నారుగదా. మీకిష్టమేనా" అనవుడు సగము తెల్లవెంట్రుకలు సగమునల్లవెంట్రుకలు గలతనగడ్డము చేతితో నొకసారి దువ్వి గోవింద గోవింద యని రెండుసారులు భగవన్నామస్మరణము

చేసి దీక్షితు లిట్లనియె మాపరువుప్రతిష్ఠలు మాతండ్రి తాతతోనే పోయినవి. నే నిప్పుడు మాపెద్దలపేరు చెప్పుకొనక జీవచ్ఛవమునై యున్నాను. మాయాడుపిల్లలనందఱను నిడివరకు నేను కన్యాదానమే చేసినాను. ఇది కడగొట్టుపిల్ల. దీనినిగూడ నొకయయ్యచేతిలోఁ బెట్టి నాభార్యను దీసికొని నేను కాశీవెళ్ళి యక్కడ నివాసము జేయఁ దలఁచుకొన్నాను. ఆయాత్రిబత్తెకర్చుల కేయీనలువదివరాలుపుచ్చు కొనుచున్నాను. అంతేకాని పిల్లనమ్ముకొని సుఖించుటకు గాదు. అమ్ముకోదలఁచుకొంటే నలువదివరాలు పుచ్చుకోవలసిన కర్మమేమి ఏడువందలు పుచ్చుకో, ఎనిమిదివందలు పుచ్చుకో, వేయిరూపాయ లు పుచ్చుకో, యని నాయింటిచుట్టు కుక్కలువలె పెండ్లికొడుకులు తిరుగుచున్నారు. వారికివ్వపోయినా కుఱ్ఱవాఁడు సాంప్రదాయ కుఁడు బుద్ధిమంతుఁడు నైనవారిని జూచి కాశీయాత్రి కెంతసొమ్ము కావలెనో యంతేసొమ్ము పుచ్చుకొని యిచ్చివేయవలెననియేర్పాటు చేసికొన్నాను. ఈపిల్లవాఁడు నాకన్నివిధముల నచ్చినాఁడు. కాఁబట్టి తాంబూలము లిప్పించండి. ఐదాఱుదినములలో నేనువెళ్ళి మావా ళ్ళను దీసుకొనివచ్చి యిక్కడే వివాహము చేయఁగలను.

వారిరువురిమాటలు గణపతి కమితానందముగలిగింప నతఁడు మహాదేవశాస్త్రిగారూ నే నిప్పుడే వెళ్లి అచ్చంబొట్లుగారిని పాపన్న సోమయాజులుగారిని దీసికొని వచ్చెదనని లేచివెళ్ళి పూర్వోదాహృ తు లగువారిని దీసికొని వెళ్ళెను. మహాదేవశాస్త్రి వారిద్దఱిని గౌర వించికూర్చుండఁబెట్టి వారిని రావించినపని తెలియఁజేసి తాంబూలము లిప్పించి పంచాంగము చూచి తాను ముహూర్తమునిర్ణయముచేసెను భైరవదీక్షితులుగారు సకుటుంబముగ వచ్చినతరువాత వారి కియ్య వలసిన నలువదివరహాలు నియ్య నిర్ణయము.

అనంతరము భైరవదీక్షితులు స్వగ్రామమున కరిగి తనకుటుం

బమును దీసికొని వచ్చెను. కుటుంబ మనఁగా దాను భార్యయుఁ బెండ్లి కూఁతురు. తక్కినకూఁతుళ్ళను జామాతలు వారామునకు పంపనం దున తాము ముప్పురుమాత్రమె రావలసివచ్చినదని యతఁడుగ్రామము లోఁ జెప్పెను. బ్రాహ్మణునకు వివాహకార్యము వచ్చినపుడు పీటల మీఁదిపెండ్లి చెడగొట్టఁగూడదని గ్రామవాసు లదివఱ కిచ్చినచందా గాక మఱికొంతద్రవ్యము సరకులు మొదలైనవి గణపతికిచ్చిరి. ఒక వైశ్యుఁడు బియ్య మిచ్చెను. మఱియొకఁడు నెయ్యి యిచ్చెను. ఒక ప్రాతవిద్యార్థి పల్లకికర్చు పెట్టెను. ఒకఁడు భజంత్రీకర్చు పెట్టెను. వివాహము రేపనఁగా గణపతి నలువదిరాలసొమ్ము భైరవశాస్త్రి చేతిలోఁబోసెను. గణపతిపక్షమున రావలసినచుట్టము లెవ్వరు లేనం దున మహాదేవశాస్త్రియె మేటిచుట్టమైనగ పెండ్లివారిపక్షమునఁ జేయ వలసినపని యంతయుఁ జేసెను. సుముహూర్తమున గణపతికి యథా విధిగ వివాహ మయ్యెను. కన్నులారఁ జూచి సంతోషించుటకుఁ దల్లి సమయమునకు లేక రామేశ్వరము వెళ్ళినదనిచూడవచ్చినవారందఱు విచారించిరి. పసుపులు నలుచుటకు గౌరికళ్యాణముపాటలు పాడుటకు తగవులు నడపుటకు మహాదేవశాస్త్రి భార్య మున్నగు పేరటాండ్రు వచ్చి కార్యము కొనసాగించిరి. ఊరేగింపుటుత్సవ మిదివఱకె వర్ణిం పఁబడినది గావున నిప్పుడు వేరుగ వర్ణింపనక్కఱ లేదు. ఐదుదినము లు సలక్షణముగ జరిగెను. అప్పగింతలు దంపాఠింపులు మొదలైనవి జరిగెను. గణపతి మహానందగరితుఁడయ్యెను. పిల్ల పూర్వజన్మమున నిప్పులు పూజచేసిన దని కొందఱు జిల్లెడుపువ్వులు పూజించిన దని కొందఱు దాని కేమి యిది మహాలక్ష్మిలా గున్నదియని కొందరు బలు తెఱంగుల భాషింపఁ జొచ్చిరి. ఇట్లు వివాహానంతరమున నాలుగుదినములు గడచినతరువాత నొకనాఁడు ముప్పదిసంవత్సరముల వయసు గలయొకపడుచుబ్రాహ్మణుఁడు పోలీసుకనిస్టేబునొకనిని వెంట

బెట్టుకొని గణపతియింటికి వచ్చి "అతఁడే ముద్దాయి" యని భైరవ దీక్షితులును జూపెను. కనిస్టేబులు భైరవదీక్షితులును బట్టుకొని "అయ్యా! నిన్నెరక్షుచేసినా"నని చెప్పెను. పోలీసుజవానుపల్లెటూరు వచ్చినప్పుడు వానివెంట పదుగురుబడి యతఁడు చేయఁదలఁచినకార్యము చూడఁబోదురు. అందుచేత నదివఱకు కొందఱు జనులక్కడ మూగిరి. వారినిజూచిమఱికొందఱు జేరిరి. "నన్నెందులకుపట్టుకొన్నా" వని దీక్షితులు రాజభటునడిగెను. భటుఁడేమో చెప్పఁబోవుచుండఁగా వానినూరకుండు మని నతనితోవచ్చినపడుచుబ్రాహ్మణుఁ డిట్లనియె "అతఁడు కాదు. నేను చెప్పెదున్నాను విను. అయ్యా పెద్దమనుష్యులు మీరందఱుగూడ చిత్తగించండి. ఈయన బ్రాహ్మణుఁడండి. కాపురమేయూరో తెలియదు. ఇప్పుడు పెండ్లియైన యీపిల్ల తన కుమార్తె యని చెప్పి నాదగ్గఱయైదువందలరూపాయలు పుచ్చుకొని యంతర్వేదిలో శ్రీనృసింహస్వామివారియాలయములో నాపిల్లనునాకిచ్చి పెండ్లిచేసినాఁడు. వివాహమై యేడాది కాలేదు. ఇప్పుడాపిల్లనే తిరిగి యీపిల్లవానికి వివాహముచేసినాఁడు. ఇంతేకాదీయనప్రభావము వినండి. ఈపిల్ల యీయనకూఁతురు గాదు. ఆవిడ యీయన భార్య కాదు. ఆవిడ సాతానిది. అమెది వెంకటేశ్వర్లువారి వాడపల్లె కాపురము. సాతానితిరువెంగళయ్యభార్య. ఈవిడపేరు నాంచారమ్మ. ఈదుర్మార్గుఁ డామెను పుత్రికాసహితముగా లేవతీసికొనివచ్చి యది తనభార్య యని యీపిల్ల తనకూఁతు రని చెప్పి మొదట నన్ను మోసపుచ్చి పిమ్మట మిమ్మును వంచించినాఁడు. అందుచేత నితని మీఁదను నితనికొత్తయల్లునిమీఁదను నేనుడిప్యూటీతహసిలుదారుగారివద్ద కొత్తపేటలో చార్జీయిచ్చినాను. కొత్తయల్లునికి మామకు వారంటు తెచ్చినాను." వారం టనుశబ్దమును వినఁగానె గణపతిదొడ్డి దారిని నెక్కడకోపాఱిపోయెను. నాఁటికి నేఁటికి మరలకనఁబడలేదు.

భైరవదీక్షితులున కాఱుమాసములు కాఱాగృహశిక్షవిధింపఁబడెను. తిరువెంగళయ్య తనభార్యనుబిడ్డనుదీసికొనిపోయెను. శూద్రసంపర్క దోషమునకై వానపల్లిగ్రామవాసులు ప్రాయశ్చిత్తములు చేయించు కొనిరి.

చదువరులారా! మీయదృష్ట మింతవఱకె యున్నది. తనకథ యింతవఱకుమాత్రమె చెప్పి యదృశ్యుఁ డయ్యెను. అతఁడు మరల నగుపడి యనంతరచరిత్రము చెప్పినపక్షమున నదిగూడ నిట్లె లిఖించి మీకానందము గలిగించెదను. ప్రస్తుత మింతటితోఁ దనివినొందుఁడు. అతఁడు కనబడకపోయినపక్షమున నింతకంటె నొకయక్షర మైన లేదనినమ్ముఁడు.

సమాప్తము.

రామచంద్రవిజయము

మొదటి ప్రకరణము.

శ్రీమంతంబై సమస్తసంపదలకునిలయమైనయీభరతఖండము నందలి దేశములందుఫలవంతంబై, యతిపురాతనంబై, యనేకపావన రాజవంశసమేతంబై యొప్పుదేశముదనరుచుండును. ఆ దేశమునందు సమస్తజనసేవితమై బహుపుణ్యక్షేత్రశోభితమైగోదావరీనది ప్రవహించుచుండును. ఈగోదావరీనది ప్రవహించుచున్న మండలములయందన్నిటిలోజన్మమెత్తినందులకుఫలముఘనులకునల్వురకుఁగూడసహజముగ నందవలయునని యెంచియోయన్నట్లు గెలలభారముచేతభూమికిఁ దగులునట్లువంగి యతిమనోహరమైనఫలములచే నాఁకొన్నయాపన్నజనంబుల కెల్ల నవ్యవధానముగ నాఁకలి దీర్చుచు, శృంగారమైన పువ్వులచేత నేత్రముల కపూర్వమొనర్చుచు, సమస్తపుష్పజాలముల నుండి వీతెంచు వాయువులచేత ఘ్రాణేంద్రియమునకుఁ దృప్తి గావించుచు, దూరప్రయాణములచేత నలసిసొలసివచ్చు పాంథజనంబులకుఁ జల్లనినీడనిచ్చుచు,సర్వావయవములకును నేకకాలముననే మహానందము గల్గించుచు, ధరణీరమణికిఁజేసిన యపూర్వాలంకారములోయన చెలయు తియ్యమామిళ్ళు,పనసలు, నరంటులు, కొబ్బరులు, పోఁకలు మొదలగు ఫలవృక్షములకుఁ గన్నతల్లియై కోనసీమభాసిల్లుచుండును. ఆకోనసీమయందెల్ల సౌందర్యసీమయు సుఖములకుదాపురంబునునమలాపురముగదా ! ఆగ్రామము మొదటఁ జిన్నదైనను పుణ్యపురుషు

లనేకులు తమకీర్తి యాచంద్రతారార్కముగ భూమండలమున వెల యుచున్నట్లు బ్రాహ్మణోత్తములకు సుక్షేత్రములయినభూములనిచ్చి వారినివాసార్థమై కట్టించిన యగ్రహారములచేతఁ జుట్టుప్రక్కలనున్న గ్రామములకంటెఁ బెద్దదై, లౌక్యులు మిక్కిలి నివసించుటచేత నొకపట్టణము వలె నుండును. కోనసీమయం దంతటను, ముఖ్యముగా నాగ్రామము నందును, భూలోకకల్పవృక్షములని ప్రసిద్ధికెక్కి సార్థకనామమును ధరించిన కొబ్బరితోఁటలనేకములుగలవు. ఎంతధన్యమైనజన్మమో కాని కొబ్బరిచెట్టును జక్కగాఁ బరీక్షించినయెడల వేరు మొదలు మొవ్వువ అకును జనుల కుపయోగించునుగాని యొకతృణమాత్రమైనను వ్యర్థముగాఁ బోదు. మహాత్ములజన్మముప్రపంచోపకారార్థమేకదా? అట్టి కొబ్బరితోఁటయందుఁ దోఁట కొకయిల్లుండును. అం దాతోఁటయజమానుఁడు నివసించును. వేఱే కొబ్బరితోఁటలమాహాత్మ్యము వర్ణింపనేల? పదివరహాలుగలవానికంటెఁ బదికొబ్బరిచెట్లుగలవాఁడు ధన్యుఁడనుమాట సత్యమేయగు. అమలాపురమునం దుత్తరమునందొకచెఱువును దక్షిణమునం దొకచెఱువును గలవు. మొదటిచెఱువునకుఁజుట్టును రెండుప్రక్కల నూరుండును. చెఱువులో దిగుటకు రెండుప్రక్కల మెట్లుగలవు. రాజవీథియొక్కటే పెద్దదియున్నది. వీథికి రెండుప్రక్కలను గుమ్మములముందఱకొబ్బరిచెట్లుండును. ఆగ్రామమునకుఁబడమటకూచిమంచివారి యగ్రహారమున్నది. ఆగ్రామమునకుఁ జేరియే యొకమామిడితోఁటకలదు. విఱుగఁగాసిన యామామిడిచెట్ల కాయలెవ్వరైన దొంగిలించుకొనిపోదురేమో యనుభయముచేతఁ జెట్లకునిలువెత్తున ముండ్లకంచెవేసి, పండుట కర్హమైనకాయలు దోరఁబాఱగనెబుట్టలు గట్టి, చిలుకలు మొదలగు పక్షులు కొఱికివేయకుండఁ జేతిలో నొక యుండ విల్లుబద్ద పుచ్చుకొని మధ్యమధ్య పచ్చని మామిడాకులసందునఁ గూర్చుండి తనరంగు తెలియకుండ మోసముచేయుచున్న చిలుక

వైపుననొకయుండవేయుచునొకకాఁపువాఁడు కాఁపుకాయుచుండును. ఆవల కోరడిమీఁద మార్గస్థుల దృష్టిదోషమునఁ దోఁటకు భంగమేమియుఁ గలుగకుండఁ గాఁపుదలగాఁ గాఁపువాఁడు తనశిల్పశాస్త్రచమత్కారము నంతను వినియోగించి చేసిన వికృతాకారముగలయొకదృష్టిబొమ్మగలదు. అది వేసవికాలమగుటచే నతిమనోహరమైన యావసంతఋతుఫునందు శృంగారలక్ష్మికిఁ బుట్టినింటివలెనున్న యాతోఁటలోనికి వచ్చి విశ్రమింపకుండ మార్గస్థులను బెదరించుచుండును. కలసిమెలసి దట్టముగా గుమిగూడుకొన్నవారినిసహస్రకరములుగలవాఁడైన భేదింపఁజాలఁడని యైకమత్యోపయోగములను జనుల కుపదేశించుచున్నవో యన గుజ్జుమాడిగున్నల యాకులు దట్టమై సూర్యకిరణదుర్గమంబుగా నుండెను. ప్రభాకరుఁడు తన సహస్రకిరణములను జగమునందు వ్యాపింపఁజేయుచు సర్వభూతభయంకరుఁడై భూమండలమెల్ల దహించుచుండెను. మృగవారంబులు మృగతృష్ణల జలాశయంబులుగ భావించి దాహనివారణార్థము పరుగెత్తుచుండెను. చల్లని పందిళ్ళవలెనున్న క్రొమ్మావిగున్నలును, మావిగున్నలవ్రేలాడుచున్నయలరుజొంపముల మెక్కి మెక్కి కూయు గండుకోయిలలును, కోయిలకూతల నాలకించుచు మార్గాయాసనివారణ మొనర్చుకొనుచున్నపాంథజనసమూహములును వేసవికాలలక్షణంబులవెలిసేయుచుండెను. భూమిమీఁద రాలి యెండినయాకులన్నియు గలగలధ్వనిచేయుచుగాలికి గదలుచుండెను. అగ్నివర్షముగురిసినచాడ్పునగాడ్పులు వెచ్చగవీచుచుండెను. అట్టిసమయమునఁ బ్రభవసంవత్సర వైశాఖశుద్ధచతుర్థినాఁడొకమార్గస్థుఁడు మార్గాయాస నివారణార్థ మొకమామిడిచెట్టునీడకువచ్చిమూఁటను గ్రిందవైచి దానిమీఁదఁగుడిచెయ్యణఁచుకొని భుజముమీఁద యంగవస్త్రముతో మొగమున స్నానము జేసినట్లు పట్టినచెమటను దుడుచుకొనుచుఁ దలకుఁజుట్టిన సెలగపువ్వంచు జరీయుత్త

రీయముచెంగుతో విసరుకొనుచు నేదియో దీర్ఘాలోచన సేయుచు గూర్చుండెను. పచ్చని నిమ్మపండువంటి దేహచ్ఛాయయు, గుండ్రని మొగమును, సొగసైన కాటుకకన్నులును, సౌష్ఠవమైన యవయవములును గలిగి, సహజమైన లావణ్యముగల యాతనిశరీరముకు రాగి కడ్డీలమీఁద నమర్చిన బంగారుమురుగులును, ఫుష్యరాగములు వేసి తాపిన తమ్మంట్లును నొకవింతయందమును గలిగించుచుండెను. అప్పుడప్పుడే నూతనముగ నంకురించుచున్న నూనూగుమీసములు చెప్పనక్కఱలేకయే యతఁడు పదునెనిమిది వత్సరముల ప్రాయముగల బాలుఁడని తెలియఁజేయును. ఆకుమారుఁడు తనలోఁ దానేదోవితర్కించుకొనుచుండఁగా నప్పుడొకముప్పదియయిదువత్సరముల చామనచాయగల బక్కపలుచని పొడుగుబ్రాహ్మణుఁ డామార్గమునఁ బోవుచు దూరమున నతనిఁజూచి, కొంచెము నిదానించి, యెవరాయని యాలోచించి, క్రొత్తమొగమని తెలిసికొని, కిఱ్ఱుకిఱ్ఱుమని చెప్పులజోడుధ్వనులుసేయ, నీబాలకుఁడున్న వైపునకు వచ్చియెదుట నిలువఁబడి యిట్లు పలుకరించెను.

బ్రాహ్మ—అబ్బాయీ! మన దేయూరు?

బాలు—మాది తాటిపాక కాపురము.

బ్రాహ్మ—మీరెవ్వరు ? మీయింటిపేరేమి?

బాలు—మేమాఱువేలనియోగులము. మాయింటిపేరుమాచిరాజువారు.

బ్రాహ్మ—నీపేరెవరు? నీతలిదండ్రులు బాగున్నారా?

బాలు—నాపేరు రామచంద్రుఁడందురు. నాకుఁ దల్లి,దండ్రి కూడలేరు. తండ్రిగారుచనిపోయి నాలుగు సంవత్సరము లయినది. తల్లిగారుపోయి యీవేళ కిరువదిదినములైనది.

బ్రాహ్మ—పాపము! చిన్నతనమునం దేతల్లిదండ్రులులోకాం

తరగతులయినారా? పూర్వజన్మకృతము. అయితే మీతండ్రిగారి నామధేయము?

బాలు—మా తండ్రిగారు శ్రీరాములుగారు.

బ్రాహ్మ—ఓహోహో! శ్రీరాములుగారికుమారుఁడ వఁట య్యా? సరే. అయితే మీ అన్నదమ్ము లెందఱు?

బాలు—అన్నదమ్ములును లేరు. అక్కచెల్లెండ్రును లేరు. నే నొక్కఁడనే. మాబాబయ్యగారిని మీరేమైన నెఱుఁగుదురాయేమి?

బ్రాహ్మ—ఎఱుఁగుదురా యని యడుగుచున్నావా? సరిసరి. మాకూచిమంచివారికి మీరుమిక్కిలియత్యాశ్చర్యకరమైనబంధుకోటి లోవారే. బాంధవ్యమటుండఁగా మాతాతగారికిని శ్రీరాములుగారి తండ్రిగారికిని బ్రాణస్నేహ మని మాతండ్రిగారు చెప్పుచుండఁగా నే ననేక పర్యాయములు విన్నాను. మాముత్తాతగారి తమ్ముని కిచ్చినది మీయూరిలో నున్న సత్యరాజువారి యాఁడుపడుచే.

బాలు—మాగ్రామములో సత్యరాజువారు లేరే!

బ్రాహ్మ—నీ కేమి తెలుసును? నిన్నగాక మొన్న కన్నుఁ దెఱచినవాఁడవు. నక్క "నేనుపుట్టిమూఁడువారములుకాలేదు. ఇంత గాలివాన యెన్నఁడు నెఱుఁగ" దన్నదఁట! సత్యరాజువా రిప్పుడు గన్నవరములో నున్నారు. మీగ్రామములో లేరు.

బాలు—నామధేయము?

బ్రాహ్మ—నాపేరు శోభనాచలము. మాసంగతి నీవు కుఱ్ఱ వాఁడ వగుటచే నెఱుఁగవుకాని మీపెద్ద లందఱు నెఱుఁగుదురు. పెద్దాపురమునందు మహారాజుగారియొద్దమంత్రులుగానున్న యనపపిండి వారు మాకు దగ్గఱ బంధువులు. రాజమహేంద్రవరములో మాడభూషివారు మామాతామహులు. మాతండ్రిగారికి మాడభూషివారు పిల్లనిచ్చునపుడు వెయ్యినూటపదార్లు కట్నమిచ్చినారు.

అనిశోభనాచలము చెప్పఁగానే రామచంద్రుఁడు గొప్పవారితో మాటలాడుట తటస్థమైనదని సగౌరవమున మాటలాడఁడలంచి "తమ దర్శన మెన్నఁడును జేయలేదు" అనెను.

శోభ.—అవును. దూరమునందున్నపు డెవరికివారే. సియోగములో బీరకాయపీచు సంబంధము. కడిపినఁగాని యెవరికి తెలియును? కుఱ్ఱవాఁడవయినను బుద్ధిమంతుఁడవు. అయితే నీవీగ్రామ మెందుకు వచ్చినావు? ఇక్కడ బంధువులెవరు ?

రామ.—నాకందఱు బంధువులే. నే నీగ్రామమున కుపాధ్యాయుల విశ్వనాథశాస్త్రిలవారు వచ్చియున్నారని విని యాయనదగ్గఱ చదువుకొనవలెనని వచ్చినాను. లక్ష్మీసహస్రము చదువుకొనవలెనని యున్నది. ఆయన చక్కఁగాఁ బాఠములు చెప్పఁగలరా ?

శోభ.—లక్ష్మీసహస్రమా ? ఆలక్ష్మీసహస్రములు విశ్వనాథశాస్త్రిలవారికి రావు. ఆయనకుఁ గావ్యపరిశ్రమమేకాని వైదికమునందుఁ బ్రవేశము లేదు. లక్ష్మీసహస్రనామములు, విష్ణుసహస్రనామములు మాగ్రామపురోహితుఁడైన సోమావధానులకు వచ్చును.

రామ.—ఆపుస్తకము గూడ నొక కావ్యమే. సహస్రనామములు గావు.

శోభ.—ఏమో ! చిన్నప్పుడు కావ్యపంచకమువఱకుఁ జదువుకొన్నాను. వ్యవహారములోఁ బ్రవేశించినతరువాత తిరిగి యావిషయమైపనిచేయలేదు. అందుచేతజ్ఞాపకములేదు. ఆయనపాఠములు చక్కగాజెప్పఁగలరుగాని నీవుబస యెక్కడచేయవలెననియాలోచించినావు?

రామ.—వంటపూఁటియింటనుండిచదువుకొనవలెననియున్నది.

శోభ.—ఏమియు సదుపాయముగానుండదు. అందులో మాగ్రామములో నున్నపూఁటకూళ్ళముండ దిక్కుమాలినముండ. డబ్బుచేతిలో వేసుకొని కడుపుగాల్చును. ఉన్నయిల్లదియొకటే. అబ్బాయీ!

నీవు మాకుఁ గావలసినవాఁడవు. రెండుమూఁడుదినములు మాయింట నుండి తరువాత పూటకూళ్ళయింటఁ బ్రవేశించు. గ్రామములోనికి వెళ్ళుదము రా. ప్రొద్దువోయినది.

రామ—మీయింటనెందుకు? వంటపూఁటియింట నేనీదినమే ప్రవేశించి చదువుకొనవలెనని యున్నది.

శోభ—నీకు మొగమోట ముండఁబనిలేదు. మాయిల్లు నీ కత్యావశ్యకమైనచోటుగాని మరొకటికాదు. మనమందఱము నొక కంచములో భోజనము చేయవలసినవాళ్ళము-లే-మూట-పుచ్చుకో-

బంధువులు బలవంతము చేయుచున్నపుడు వారియింటికిఁబోకుండుట బాగుండ దనియాలోచించినను రామచంద్రుఁ డెన్నఁడును బరగృహనివాసము జేయనందున మిక్కిలి యనిష్టముతోనే లేచి శోభనాచలముతోఁగూడఁ బోవుచు మార్గమధ్యమందుఁ దానీగ్రామము వచ్చినవెంటనే గొప్పవారిస్నేహము దొరకినదనియుఁ దన కిది శుభసూచక మనియు సంతోషించుచుండెను. శుష్కప్రియములయందుఁ దనకుఁ గలయావత్తుసామర్థ్యమునుపయోగపఱచి, తనజన్మమధ్యమం దెప్పుడు లక్ష్మీసహస్రి మనుకావ్యము పేరయిన వినకపోయినను, పంచకావ్యములవఱకుఁ జదువుకొన్నను దానుగూడచదువుకొన్నవాఁడే యని రామచంద్రుని మనస్సునకుఁ దోఁచునట్లు బలికెను. రామచంద్రునకుఁ దల్లిదండ్రులు లేరని విన్నప్పటినుండియు నీతనికి వంటపూటింటికి ధన మెట్లువచ్చునని పెద్దసందేహము శోభనాచలమును బట్టిబాధించుటచేత శంకానివృత్తిచేసికొనఁదలఁచి మెల్లగానిట్లు ముచ్చటించెను.

శోభ—అబ్బాయి! వంటపూఁటిముండకు నెలకు నాలుగురూపాయిలు దర్శించవలెనే. పాపము! నీకుఁ దలిదండ్రులుకూడ లేరు. ఏలాగున చదువుకొందువోయని సందేహముగా నున్నది.

రామ—అయ్యా! చేతులనున్నమురుగు లేబదిరూపాయిలు విలువగలిగియున్నవి. తమ్మంట్లు పాతికరూపాయిలు. ఆరెండును విక్రయించిన యెడల నొక సంవత్సరమువఱకుఁ జదువవచ్చును. "నందో రాజాభవిష్యతి" తరువాత దైవమున్నాఁడు ; నేనున్నాను, అప్పుడు దోయ్యగస్థులపిల్లలకుఁ బాఠములు చెప్పి యేమాత్రమైన సొమ్ము సంపాదింపఁగలనని నాకు ధైర్యమున్నది.

శోభ.—సరే. చక్కనియాలోచన చేసినావు. చదువు కావలసినవాఁడు సొమ్మేపావనముగాఁజూచుకొనఁడు. చదువునందాసక్తిగలవాని నిన్నొక్కనినేచూచినాను. కాని యీగ్రామమునందుకోమట్లు చెడ్డవాళ్ళు. మోసముచేసి వరహావస్తువు దమ్మిడికిఁగొనఁగల సామర్థ్యము వారిదగ్గఱనున్నది. పెద్దకోమట్లతో నాకు బెక్కువ్యవహారములున్నవి. నేను వారిని మనయింటికిఁ బిలిపించి చక్కఁగా బేరము చేసి నష్టములేకుండ నీసొమ్మునీకు వచ్చునట్లుమఁగలను. నీవు తొందరపడి సొంతముగా వ్యవహరింపఁబోకు. ఇక్కడ తలలుదీసి తలలు బెట్టువారలున్నారు.

అని చెప్పఁగానే రామచంద్రునకు శోభనాచలముమీఁద మునుపటికంటె నెక్కువనమ్మకముకుదరఁగా నాతనిసాహాయ్యముచేత నెట్లయిన నాగ్రామమునందుండి సుఖముగాఁ జదువుకొనఁదలఁచెను. ఇట్లు వారిద్దఱు మాటలాడుచు గ్రామములోనికి వచ్చిరి. గ్రామమునకు వచ్చి రాజవీథిలోఁ గొంతవఱకుఁబోయి కుడిచేతిమీఁదుగానున్న సందులో రెండుగుమ్మములుదాటిమూఁడవగుమ్మముదగ్గఱకుఁబోయి కొంచెము వెనుకగా వచ్చుచున్న రామచంద్రుఁడు వచ్చువఱకు నిలుచుండి "ఇదే మనలోగిలి" అని చిన్నవీథియరుగులు కొబ్బరియాకుల దడియును గలయొకపాత పెంకుటింటిలోనికిఁ దీసికొనిపోయి చావడిమీఁదనున్న తాటియాకులచాపమీఁదఁ గూర్చుండు మనిచెప్పి తా

ను లోపలికిఁబోయి "అమ్మా! యని పిలిచి మెల్లఁగా నామెతో నిట్లని చెప్పెను.

శోభ.—అమ్మా! నీవేమియు విసుగుకొనవద్దు. ఈవేళ మన యింటికి బంధువుఁ డొకఁడువచ్చియున్నాఁడు. త్వరగావంటకావలెను.

తల్లి—నీవేదో తెచ్చిపెట్టి నన్ను జంపుదువని నేనిదివఱ కేయనుకొనుచున్నాను. నీకుఁ బ్రతిదినము నెవఁడో యొక బంధువు వచ్చుచునేయుండును. నీయుద్యోగమునకు నీసంపాదనకుఁ దోడు చుట్టాలను గూడ దాఁపురముచేయవలెనఁటరా? నాయనా!

శోభ—అబ్బా! ఊరకుండవమ్మా. అవతల పెద్దమనుష్యుఁడు కూర్చున్నాఁడు. పెద్దలేదు పిన్నలేదు. నీగోల యెప్పుడిలాగేయున్నది.

తల్లి—ఏమి యూరకుండను? ఎన్నాళ్ళు? ఒకనాఁడా యొక కథా. ఎల్లకాలము నాకథయీలాగే యున్నది. కాటికి కాళ్లుజాఁచుకొన్న ముండను. చాకిరీ చేయలేక నానాహింసలు పడుచు నేలాగైన గంజికాచి పోయుదమని యనుకుంటే నీవు పేల్చుకొని తినుచున్నావు. ఎముకలు చిట్లకట్టి పోవుచున్నవి. రామ రామ! దిక్కుమాలిన దేవుఁడు నాకు చావుపెట్టఁడు. అఱువదియేండ్లు వచ్చినందుకు సుఖము లేదు, వల్లకాడులేదు. తల్లికడుపునఁ బుట్టినది మొదలు చచ్చువఱకు నొక్కటే మచ్చుగదా! ఇప్పు డత్తెసరు పెట్టవలెను. నీకేమి? మాట చెప్పఁగలవు.

అని తన్నుఁదాను దిట్టుకొనుచు శోభనాచలమును దిట్టుచు, మరల బియ్యము కడిగి పొయ్యిఁమీఁద బెట్టుటకుఁ బ్రయత్నము చేయుచుండెను. శోభనాచలమును దనతల్లియన్న మాటలను, రామచంద్రుఁడు విన్నాఁడేమో యని భయముతో నీవలకు వచ్చెను. చావడిముందున్న కొబ్బరియాకుల పందిరివలనఁ జల్లగా నుండుటచే తను, పందిరి కావలివాకిటనున్న కొబ్బరిచెట్లమీఁదనుండి వచ్చెడిగాలి

చేతను, మార్గాయాసనివారణము కాఁగా నేదో యోచన చేయుచు రామచంద్రుఁడు పీఠికిజరిగిన కలహము పూర్తిగ వినలేదుకాని కేకలు మాత్రము వినెను. శోభనాచలము రాఁగానే వారిద్దఱిట్లు మాటాడిరి.

రామ—అయ్యా! లోపల యెవరు కేకలు వేయుచున్నారు?

శోభ—ఏమిటో మాయమ్మ నల్లమందు పిచ్చిచేత నామీఁద నెప్పుడైనఁ గేకలు వేయుచుండును. అంతేకాని నీనామాటేదియులేదే

రామ—ఏదో వంటసంగతి యనుకొన్నానులెండి. అందుచేత నడిగినాను.

శోభ—ఆబిడ పెద్దది. పుట్టిబుద్ధియెఱిఁగిన తరువాత నత్తెసర యినఁబెట్టి యెఱుఁగదు. మాయాఁడువాండ్రు పుట్టినింటికి వెళ్ళినారు. వంటబ్రాహ్మణుఁ డిదివఱకుండి వెళ్ళిపోయినాఁడు. తిరిగి యెవ్వరినైన నేర్పఱచవలెననుకొన్నాను. ఎవరును కుదురరు. వాళ్ళకు బాగుగ నన్నము గలిగియున్నది.

రామ—అవును? వంటబ్రాహ్మణులు దొరకుట కష్టమే.

ఇట్లు వారిద్దఱుఁ గొంతసేపు మాటాడుచుండిరి. తరువాత వంటయినదని తల్లి కేకవేయఁగా నిద్దఱును లేచి చెఱువునకు వెళ్ళిస్నానము జేసి యిష్టగోష్ఠిని మాటాడుచు భోజనముచేసిరి.

రెండవ ప్రకరణము.

భోజనములు కాఁగానే చేతులు గడుగుకొని చావడిమీఁద వారిద్దఱు కూర్చున్నప్పుడు శోభనాచలము తాంబూలముమాటజ్ఞప్తికి రాఁగా తమలపాకులును జెక్కలును లేకపోవుటచేతను గొప్పవారి యింటఁ దమలపాకు లుండకపోవునా యనియు నవి తనయింట లేనం

ందునఁ దాను దక్షుఁడవవాఁడనియు రామచంద్రుఁ డాలోచించునేమో యనుభయములును సందేహమును బొంది శోభనాచలము తాను నిరంతరము తాంబూలము వేసుకొనునట్టి మహానరసుఁ డేయని బంధువునకు ధృవముగాఁ దెలియఁజేయుటకై యిట్లని చెప్పెను. "తమలపాకు ఫలియింపోయినవి. చాకలివాఁడు వారము దినములకిందట సెలవుదీసికొనివెళ్ళి తిరిగి రాకపోవుటచేత సంతకుఁబోయి యాకులు తెచ్చువారు లేకపోయిరి. అడికాక మాయింటిది గ్రామమున నుండకపోవుటవలనఁ దమలపాకులమీఁది శ్రద్ధకూడ తప్పినది. అది యున్నప్పు డాకులు చెక్కలు మాయింటినిండ దొర్లుచుండును. ఉదయాస్తమయములు వచ్చినవారందఱు నమలుచుండెడివారు." అని చెప్పఁగా రామచంద్రుఁడు తమలపాకు లలవాటు లేదని చెప్పి విశ్వనాథశాస్త్రిలవారి దర్శనము త్వరితముగాఁ జేయవలయునని యుత్సాహముతో శాస్త్రిలవారి యిరటికిఁ బ్రోవఁ జూపుమనియుఁ, బూఁటకూళ్ళ యిల్లు గ్రామమున కేప్రక్కనున్నదనియుఁ, దన దగ్గఱనున్న వస్తువుల నమ్మివేయుటకుఁ గోమటిని బిలిపింపుఁడనియు రామచంద్రుఁడు శోభనాచలమును దొంద దరమెట్టెను. శోభనాచలమునకు వస్తువుల నమ్మివేయుటయందు రామచంద్రునికంటె నెక్కువయాత్రము కలిగియున్నది కనుక శాస్త్రిలవారియింటికి మఱునాఁడు వెళ్ళవచ్చునని యుఁ బూఁటకూటియిల్లు సాయంకాలము చూచుదుననియుఁ జెప్పి కోమటిసిమాత్రమప్పుడే పిలిపించుటకు నిశ్చయించి యెవరిచేతనయినను మద్దుల్ల కనకరత్నము దగ్గఱకు వర్తమానమంపవలె ననుకొనుచుండఁగా నిరువదియేండ్ల వయస్సు గల యొకకమ్మవారిచిన్నవాఁడు వచ్చెను. అతఁడు శోభనాచలమునకు గుండెకాయ. ఇతనిపేరు వేంకటస్వామి. మార్గాయాసముచేత నీలోఁగా రామచంద్రునకుఁ గొంచెమునిద్రపట్టెను. అతఁడునిద్రించుచుండఁగా వేంకటస్వామిని వీధిలోనికిఁ దీసికొనిపోయి యరఁగుమీఁద

గూర్చుండఁబెట్టికొని శోభనాచల మతనితో నేదో గుసగుసలాడి పంపెను. యజమానుని కార్యనిర్వాహకమునందు హనుమంతునితో సాటియని చెప్పఁదగినయాకుఱ్ఱవాఁ డతివేగముగఁబోయి కోమటితోఁ గూడ నక్కడనున్నట్లు మరలివచ్చెను.

కనకరత్న మెప్పుడు వచ్చునాయని యెదురు చూచుచున్న శోభనాచల మతఁడు రాఁగానే తటుక్కునలేచి వీధిగుమ్మము వద్ద కెదురుపోయి కమ్మకుఱ్ఱవాని దగ్గఱనుండు కోమటిని జెయ్యిపట్టుకొని దూరముగాఁ దీసికొనిపోయి చెప్పవలసిన సంగతులన్నియుఁ జెప్పి యాతని వెంటఁబెట్టుకొని రామచంద్రుని యొద్దకువచ్చి యాతని నిద్రలేపెను. లేచి తనయెదుట నల్లని లావుశరీరమును భూలోకమున నవతరించిన ప్రత్యక్షవిఘ్నేశ్వరుఁడేమో యను భ్రాంతి కలుగఁజేయు పెద్దపొట్టయు, నుదుట పట్టినామములును జేతులను మురుగులును నెడమచంకక్రింద వస్తువులున్న చారల సంచియుఁ, గుడిచేతిలోఁ జిన్నత్రాసును గల కోమటినిజూచి రామచంద్రుఁడు కూర్చుండుమనిచెప్పెను. అప్పుడువారందఱీ ప్రకారముగా మాటాడిరి.

శోభ—కనకరత్నము! ఈపిల్లవాఁడు మురుగులను విక్రయించవలెనని నాతోఁ జెప్పినాఁడు. నీవు నాకు నమ్మకముగలవాఁడ వౌటచేతను, మాకు మీకుఁ జాలవ్యవహారము లుండుటచేతను నేను నీకు వర్తమానము నంపినాను. ఒకడబ్బు సొమ్మెక్కువ కమ్మవలెనుగాని తక్కువ కమ్మవద్దు. మాకితఁడుకావలసినవాఁడు; బంధువులతోఁబని. హెచ్చుతగ్గేమైన వచ్చిన పక్షమున నాకు మాటదక్కదు. ఇది నీవ్యవహారముగాఁ జూచుకొనవలెను. వేఱే నేఁ జెప్ప నక్కఱలేదు.

కన—సరిసరి! మీరు నాతో సెలవియ్యవలెనా? ఇంతకాలము నుండి మీకు నేను వస్తువులు నమ్మకముగా నిచ్చుచున్నాను. ఎన్నఁడయిన దమ్మిడి దగ్గఱనైనఁ దేడావచ్చినదా? మనుష్యునకు మాట

నమ్మక ముండవలెఁగాని ధనమా పావనము? భోగముది గణింపఁ గలదు. తమవంటివారి దగ్గఱ మర్యాద కావలెనుగాని యొకడబ్బిట యితే నేమి ? అటయితేనేమి. ఏవి? మురుగులు తీయండి.

అని కనకరత్నము చెప్పఁగానే శోభనాచలము రామచంద్రుని దగ్గఱగా జరగివచ్చి 'అబ్బాయీ! మురుగులు తీయనా' యనియడుగ నతఁడు తీయుమని తలయూఁచి యూరకుండెను. చేతిని మురుగులు చిన్నతనములోఁ జక్కగా నొక్కించుటచేతఁ జేతులతో లాగినపుడు మురుగులు రాలేదు. తరువాత ప్రొద్దుబోసి వారు లాగుచుండఁగాఁ దల్లి దండ్రులు చిన్ననాఁడు తనకావస్తువు చేయించి పెట్టినన్నాఁటికి నిప్పటికిఁ దనయవస్థలో నెంత తారతమ్యము గల్గినదో తలంచుకొని, మురుగుల నమ్ముకొనుటచేతఁగాని తనకు భోజనంబు జరుగకున్నదని కొంచెమువిచారించి రామచంద్రుఁ డాదుఃఖమును బైకిరానీకుండ దిగమ్రింగి బేరమును జూచుచుండెను. కనకరత్నము మురుగులు దీసినతరువాత కొన్ని రాళ్లు త్రాసులోవేసి మురుగులు తూఁచి కొంచెము నోరు చప్పరించెను. అప్పుడు వారిట్లు మాటాడిరి.

రామ.—ఏమోయి! అలా గనుచున్నావు? యెన్నితులముల యెత్తున్నవి?

కన—ఏమని మనవి చేయనండి? పాతగుల్లలు. చూడఁగానే నేనేమాత్రమో యుండవనుకొన్నాను. అబ్బే! మాయవస్తువులండి. ఏకంసాలి చేసినాఁడండి? లాభము బాగుగాఁ గొట్టినాఁడు. ఇవి రెండు తులములున్నవి. తులము పదునెన్మిదిరూపాయల ధర.

రామ—మానాన్నగారు నమ్మకమయిన కంసాలిచేతఁ జేయించినారు. అదిగాక యిది మేలిమిబంగారము. తులము పాతికరూపాయ ధర. గీటురాయి యేది?

—పిచ్చిమాట. ఎంత నమ్మకమున్నను కంసాలి తిన్నగాఁ

జేయునా? అదిగాక యిది వరహావన్నెకాని మేలిమికాదు. కావ్వలసిన మెడల నింక నెవ్వరికైనఁ జూపించుకొనుఁడు. నేను గీటురాయిమఱచి పోయినాను.

శోభ—గీటురాయి యెందుకయ్యా? అతఁడు నాణెము కట్టునట్లు మాగ్రామమునం దెవ్వరుఁ గట్టలేరు. ఒకవేళ పొరపాటు వచ్చినను నతఁడు పారిపోవునా? నీవు పారిపోవుదువా? ఇచ్చినమట్టుకు సొమ్ము పుచ్చుకో. నిలకడమీఁదఁ జూచుకొనవచ్చును. పుష్యరాగములు కూడ విక్రయించవలెనని యున్నదా?

రామ—అవి యిపుడు విక్రయింపను. ఈరూపాయలయినతరువాతగాని చూడను. అయితే కనకరత్నము! నీవిపుడు తొక్కమీఁటుగల్లవా?

కన—తత్క్షణము పుచ్చుకొంటి. ముప్పదియైదురూపాయలునాదగ్గరనున్నవి. తక్కిడస్థరూపాయలు చేకుదయమునఁబరీక్షించెదఁ. అనిచెప్పి పొమ్మన్నాను. రామచంద్రుఁడు సొమ్ము పుచ్చుకొనిబొడ్డుకొంగునఁ గట్టుకొనెను. అంతటఁ గోమటియు నింటికి వెళ్ళిపోయెను.

అప్పుడు రామచంద్రుఁడును శోభనాచలమును లోకాభిరామాయణమును జెప్పుకొనుచుండఁగాఁ బాతికసంవత్సరముల వయస్సుగలయొక కుఱ్ఱవాఁడు, రెండు భుజములమీఁదఁ గాయలు—స్పష్టముగఁ గనుపడుచుండఁ, జుట్టును జుల్పములును నున్నగందువ్వి, చేరిలోచేడెకపేపబెత్తము బట్టుకొని, తలకు నుత్తరీయము కుచ్చువచ్చునట్లు చుట్టి, నోట నొక చుట్టనుబెట్టుకొని, కాల్చి గుప్పుగుప్పునఁ బొగలువదలిచున్నట్లు మేఘములను గల్పించుచు, జేబులోనుండి గుప్పెడాకులను జెక్కలను బట్టుకొని, నాగరకతయంతయుఁ దనమొగమునఁ దాండవనర్తనమాడునట్లుండ లోపలికి వచ్చెను. లోపలికి వచ్చిన యామనుష్యుని జూడఁగానే శోభనాచలమున కొకవిధమయిన భయంబు కలిగెను. వచ్చిన కొత్త

[illegible] తనచుంకకిరుంద గుడ్డతో [illegible] బట్టీలచేతను దీసి చావడిమీద వేయఁగానే, శోభనాచలమునకుఁదోడరదిర [illegible] మొగము వెలవెలఁబాఱి, రామచరదూతుఁడు తనతో బ్రసరగవ్రేమునఁ జెప్పుచున్న మాటలు వినఁబడకుండెను. అతఁడు [illegible] చుట్ట కాల్చుకొనుచుఁ దమలపాకులతో జిమలు దియుచు శోభనాద్రిపతి మనకు లేశమయిన నిష్టము లేకపోయినను నాతఁడు చేసిన కనుసంజ్ఞయే నఁ జూడక మాటలాడ నారంభించెను. ఈతని పేరు నరసయ్య.

నర—ఓరి! శోభనాచలము! మనవాండ్రెవ్వరు రాలేదా? నీవు కూడ మొదలాగునఁ గూరుచుంటివేమి? దాడిలోఁ జంతచెప్పుక్రిందు జాపలు [illegible] చినావా? నీపదతిచూడఁగా నీవెళ్ళి నిక్కడనే యాడుటకు నిశ్చయించినటున్నది. [illegible] బెలముగోటిన తాయిలాగున [illegible] మాటాడవేమిరా?

ధ—[illegible] అని క్రొత్తమనుష్యుఁడటు మాటలాడు చుండఁగా పంగనామములు బెట్టుకొని యింకొక బ్రాహ్మణుఁడు వచ్చి కూర్చుండెను. శోభనాచలుఁడు [illegible] నాచల మాతనిఁ జూడఁగనే "దయచేయండి. వెంకటరత్నముగారు [illegible] అని పలుకరింపఁగా వెంకటరత్నము మిక్కిలి తెలివిగలవాఁడును [illegible] పరిపంచవ్యవహారములం దారితేఱినవాఁడును గావున కడుమర్యాదగా [illegible] గూర్చుండెనుగాని తమలపాకులలో వేసికొనుచు మొదటవచ్చిన బ్రాహ్మణుఁడు వెంకటరత్నముఁ జూచి యిట్లనియె—

[illegible] !వర్ [illegible] !వీరు [illegible] చేసినారేమి? [illegible]

ధ—[illegible]

వేంక—ఈవేళ భోజనము ప్రొద్దువోయినది. [illegible] చేసినాము. [illegible]

[illegible]

వేంక—ఏడ్చినావులే. నీవూరుకో. నీకేమియుఁ దెలియదుగదా [illegible]

నర—మీయింట వైశాఖపూజ జరిగిన శరభరాజుగారునాకు వర్తమానము బంపరూ? మీయింట నేను రెండు కావిళ్ళ మంచినీళ్ళను మాత్రము బోసి వెళ్ళిపోయినాను.

వీ రీప్రకారము మాటలాడుకొనుచుండఁగా మఱి నలువురు మనుష్యులు తటాలునఁ దలుపు దీసికొని వచ్చిరి. అందులో నొకఁడు శోభనాచలమును జూచి "ఓరీ! పిల్లకుదిరినదఁట. సోమావధానులు చూచివచ్చినాఁడు" అని చెప్పెను. అపుడు వేంకటరత్నము మొగము చిట్లించుకొని యాక్రొత్తమనుష్యునివైపు తిరిగి పండ్లుకొఱికి మాటాడవద్దని సంజ్ఞచేసి "మన మండపము దొడ్డిలోనికిఁ బోదమురండి"యని వారినందఱిని వెంటఁబెట్టుకొని యదివఱకే చింతక్రిందకమ్మకుఱ్ఱవాఁడు పఱచిన చాపలమీఁదఁ గూరుచుండి చీట్లపేకనాడనిశ్చయించిరి. శోభనాచల మాదినమున రామచంద్రుఁడు వచ్చుటచేత నాటకు వెళ్ళక కూరుచుండెను. మెడలోఁ బిడికెడు యజ్ఞోపవీతములుండుటచేత శోభనాచలమునకు వివాహమైనదని నమ్మియున్న రామచంద్రునకునొకఁడు వచ్చి పిల్లకుదిరినదని చెప్పఁగానే శోభనాచలము చెప్పిన మాటలయందును, వాని పెండ్లివిషయమందును గొంచెము సందేహము కలుగుటయేకాక యతని యింటికి వచ్చి సంభాషించినవారి మాటలనుబట్టి వీరందఱు వంటబ్రాహ్మణులు, నీళ్లబ్రాహ్మణులు మఱియితరమైన నీచులనికూడ నాలోచనతోఁచి శోభనాచలము నడిగిచూడవలెనని బుద్ధిపుట్టెను. వారిట్లు మాటాడిరి.

రామ—ఏమండీ! ఆమొదటవచ్చిన బ్రాహ్మణుఁ డెవరు?

శోభ—(విని వినుపించుకొననట్లు మనస్సులో నేదో యాలోచించుచుండెను.)

రామ—ఏమండీ! ఆమనుష్యుఁ డెవరండి?

శోభ—ఈ గ్రామమునందు నీళ్ళబ్రాహ్మణుఁడు. (అని మెల్లగాఁజెప్పెను.)

రామ.—అతఁడు పరువు మర్యాద లెఱుఁగకుండ మాటలాడి నాఁడేమి?

శోభ.—ఏమిటో, చిన్నతనమునందు మేమిద్దఱమునొకబడిలో నే చదువుకొన్నాము. అప్పటి చనువుచేత నిప్పటికిని సన్నాలాగున నాతఁడు పిల్చుచుండును. స్నేహితులయెడ నాకంత పట్టింపులేదు.

రామ.—పిల్లకుదిరినదని యొక మనుష్యుఁ డన్నాఁడు. ఆ పెండ్లియెవరికి?

శోభ.—నాకు వివాహ మనుకొన్నావా యేమి? మాపినతండ్రి కుమారునికి వివాహము కాలేదు. అతని విషయమై పిల్లను వెదుకఁ బంపినాను.

రామ.—ఇప్పుడు వారందఱు దొడ్డిలో నేమి చేయుచున్నారు?

శోభ.—చీట్లపేక నాడుచున్నారు. నీవుగూడ నాడఁగలవా?

రామ.—నాకుఁ జేతగాదు. నే నాడఁదలంచుకొనను లేదు.

శోభ.—ఆడిన తప్పులేదు. చేతగాకున్న నేర్చుకొనవచ్చును. డబ్బుపెట్టి యాడరు. ఒకవేళ సంతోషము నిమిత్త మాడినను దిరిగి యెవరిడబ్బు వారికే యిచ్చివేయుదురు.

రామ.—అటువంటి యాటను నేను నేర్చుకొనను.

అని యిద్దఱుఁ బ్రసంగము చేయునపుడు లోపల చీట్లపేక నాడుచుఁ గొంచెముధనము ఋణము కావలసి యొకస్నేహితుఁడు శోభనాచలము నావలకుఁ బిలిచి ప్రస్తుత మాడుకొనుట కభ్యంతరము గల్గినదనియు దానింటిదగ్గఱనుండి తెచ్చినయిఱువదియైదురూపాయలు నోడిపోవుటచేతఁ బదిరూపాయ లప్పు కావలెననియుఁ జెప్పఁగా, శోభనాచలము రామచంద్రునియొద్ద కాతనిఁ దీసికొనివచ్చి యాతఁడు మహాధనికుండనియు సంవత్సరమున కీతనికి వేయిరూయలుభూములమీఁదవచ్చుననియుఁ జెప్పి తన నమ్మకముమీఁదఁ బదిరూపాయలు ఋణ

[illegible] గాకపోయినను, జూదరియు, నిర్భాగ్యుఁడు నైనను, శోభనాచల [illegible] మనుభవించుచు [illegible] మైయుండి యంతచక్కఁ [illegible] జెప్పునట్లు [illegible] శోభనాచలమును [illegible] మచం [illegible] నెలుగ [illegible] నుఁగట్టిన [illegible] పిల్లకుచుమముల [illegible] బడిపూకలరాలెక్క పెట్టి చేతిలోఁ బెట్టెను. రూపాయకు దినమున కొకయణా [illegible] నిమ్మనుచు [illegible] కామ [illegible] తిరిగి [illegible] నిమ్మనియడిగి [illegible] యెను. ఇప్పటికి రామచంద్రునియొద్ద నిరువది రూపాయలు [illegible] శోభనాచ [illegible] జరుగుచున్న [illegible] ద్యోత [illegible] డబ్బులు [illegible] అన్నవస్త్రములు లేక [illegible] నేకాదశులును [illegible] పలుపుచు [illegible] పెట్టక [illegible] వేదాంతులవలె బంగారమును జల్లిపెంకులుగ [illegible] వినోద [illegible] సముద్రమునదు [illegible] మునిఁగి తేలుచున్న [illegible] ధర్మరాజులును నా [illegible] పెట్టకిం [illegible] యుండుదురు.

[illegible] తోషరద్ధ [illegible] మంట్లవిచ్ఛిన్నము [illegible] సమ [illegible] వాకిటనూగుచున్న [illegible] చలద్రథ శోభనాచలమునకొక [illegible] శోభనాచలము [illegible] నేనే శోభనాచలము [illegible] నిమ్మనుచు [illegible] తిరుగుచు [illegible] పెంకులు [illegible] పెక్కి [illegible] పెక్కి [illegible] ముడుచుకొనుచున్న [illegible] క

పిల్లవాఁడువచ్చెను. అతనిఁజూచి రామచంద్రుఁడుకూడ లేచి పిల్లవాని యెదుటకుఁబోయెను. అప్పుడాపిల్లవాఁ డిట్లు చెప్పనారంభించెను.

"అయ్యా! ఈసంగతి మీరు వినుఁడి. నేను వీధిలోనుండి మా యింటికిఁ బోవుచుండఁగా నీకమ్మకుఱ్ఱవాఁడు నను లోనికిఁదీసికొనిపో యెను. వేంకటరత్నముగారు నన్నుఁగూడ జీట్లాడుమనిబలవంతపెట్టిరి. ఒకటిరెండు పందెములయందు నన్ను గెలిపించి తరువాత నాచేతి నున్న బంగారపు ముద్దుటుంగరమును బందెము పెట్టించిరి. పైమీఁద నున్న జరీయుత్తరీయమును గూడ లాగుకొని నేనిమ్మని గట్టిగా నడ గినప్పుడు నన్నువీరందఱుఁ దిట్టికొట్టినారు. ఇవిగో చఱుపులుచూడండి. దెబ్బలేలాగున నట్టలు కట్టియున్నవో. నేనిప్పుడు శరభరాజుగారియొ ద్దకుఁబోయి యీసంగతిఁ జెప్పెదను." అని చెప్పుచున్న కుఱ్ఱవాని మాట కడ్డము వచ్చి నరసయ్య మహాకోపముతో నిట్లనియె:

నర—కాఱుకూఁతలు కుయ్యకు. చెప్పుదెబ్బలుతినఁగలవు. శ రభరాజుగారితోఁ జెప్పి తలఁగొట్టి మొలవేయింపఁ గలవా యేమి? నీదిక్కున్నచోట చెప్పుకో. అని శోభనాచలమువంక జూచి "యీతఁ డుంగరమును బెట్టుకొని రాలేదు. ఉత్తరీయము నేను పుచ్చుకొన్న మాట సత్యమే. నాదగ్గఱ రెండురూపాయ లప్పుదీసుకొని నాలుగు నెలలయినది. ఇంకను నీయలేదు. అందుచేత బట్ట లాగుకొన్నాను. ఇతఁడు రానులేదు. ఆడనులేదు. అంతయు నబద్ధమే.

ఇట్టిదఱు చెప్పఁగనే విని శోభనాచలము తనస్నేహితులశక్తి యు, సాహసమును నెఱిఁగినవాఁడు గావున తప్పక వారాయుంగరము నపహరించియుందు రని నిశ్చయించి శరభరాజుగారీసంగతివిన్నపక్షు మునఁ దనకు మాటవచ్చునని యేలాగైన నతనిసొమ్మతని కిప్పింపవలె నని నిశ్చయించుకొని బలవంతముగా రానికోపమును దెచ్చుకొని యీ ప్రకారముగాఁ జెప్పెను.

శోభ—పుణ్యమునకుఁ బోఁగాఁ బాప మెదురైనదఁట! స్నేహితులుకదా యని యాడుకొనుటకు స్థలమిచ్చినందుకు దెబ్బలాటలును, దుదకు నిష్ఠురములునా? నాయనా! నీసొమ్ము నాయింటఁ బోయినందులకు నేనాదండుగ నిచ్చుకొందును. తెచ్చికొన్నందుకుఁ జచ్చినట్లనుభవింపవలెను. నాసొమ్మెందఱు తినుచుండుటలేదు? అందులోనీ వొకఁడవు. ఇంతమాత్రముతో నేను జెడిపోను. అని రామచంద్రుని వంకఁ దిరిగి అబ్బాయి! నీదగ్గఱనున్న యిరువదిరూపాయిలు నాకు బదులియ్యఁగలవా? సాయంకాలము తిరిగి నీకిచ్చివేయుదును.

రామ—చిత్తము. పుచ్చుకొనుఁడు. అనిచెప్పి యాసొమ్మునంతను నిచ్చెను. ముప్పదియైదురూపాయిలు బదుళ్ళక్రిందనే యిచ్చివేయుటచేత రామచంద్రునకు భారమంతయుఁదగ్గి దేహము చులకనయ్యెను. ఆరూపాయలు పుచ్చుకొని యాపిల్లవాఁ డుత్తరీయముగూడ మరల నరసయ్యయొద్దనుండి తీసికొని యింటికిఁబోయెను. అప్పుడు సాయంకాల మగుటచే రామచంద్రుఁడు సంధ్యావందనమును జేసికొనుటకుఁ జెఱువునకుఁబోఁగా వేంకటరత్నమును శోభనాచలమునువానిని వెంబడించిరి. వేంకటరత్నము చెఱువుగట్టుననున్న యొకయింటఁ బ్రవేశించెను. శోభనాచలము మాత్రము చుట్టఁగాల్చుకొనుచు గట్టుమీఁదఁ గూరుచుండ రామచంద్రుఁడు సాంధ్యకృత్యములయినతరువాత నతనితోఁ గలిసి ప్రదోషకాలమున శివాలయమునకరిగి, యాలయముచుట్టును మూఁడు బ్రదక్షిణములుచేసి, నందీశ్వరుని చెవుల సందులనుండి ముందుగా నీశ్వరదర్శనముచేసి, గర్భగుడిఁ బ్రవేశించి తనకందకుండ నున్నగంట నెగిరికొట్టి, శివుని దర్శించి "వందేశంభుముమాపతి" మ్మనుశ్లోకమును బఠించి, పూజారియిచ్చిన రుద్రపాదముల నందుకొని, మారేడుపత్రి నందితలనంచి, విభూతిమొగమునఁ దాల్చి కనుబొమ్మలసందున నమ్మవారి కుంకుమను బొట్టుపెట్టుకొని

యీశ్వరప్రసాదమును దినఁగూడదుగనుక కొబ్బరిముక్కల నక్కడ నుంచి, కొంతసే పచటఁ గూరుచుండి యింటికి శోభనాచలముతోఁ గలిసి వచ్చునప్పటికి భోజనపువేళ యయ్యెను.

తనయదృష్టము పుచ్చి రామచంద్రుఁడువచ్చుటచేతఁ దన కుమారునివలనఁ దగిలెడు దెబ్బలు తప్పినందులకు సంతోషించుచు, నల్లమందు లేకపోవుటచేతఁ గాళ్ళులాగుచున్నందున వంటమాత్రము చేసికొని శోభనాచలముతల్లిపరుండెను. శోభనాచలము వచ్చి తానే యన్నమువడ్డించి రామచంద్రునితోఁ గలిసి సుఖముగా బోజనముచేసెను. భోజన మగువఱకు వేంకటస్వామి వచ్చి సిద్ధముగానున్నందున శోభనాచలము వానినక్కడనే పండుకొనుమని సహాయార్థముంచుకొనెను. రాత్రి జా మయినతరువాత రామచంద్రునకు నిద్రపట్టెను. కొంతసేపటికందఱు బుసకొట్టి నిద్రపోవుచుండిరి. కాని వేంకటస్వామికిమాత్ర మేకారణముననో నిద్రపట్టదయ్యెను. తరువాత రెండుజాములవేళ నేలఁ గొట్టినట్లు చప్పుడయ్యెను. ఏదోస్వప్నమువచ్చి మెలఁకువ గల్గిన రామచంద్రుఁ డాచప్పుడు విని, యెవరువారు? అని కేకవేసెను- ఆ కేక వేయఁగనే యాచప్పుడాగిపోయి మరల నొకటిరెండు గడియలయ్యెను. అప్పటికి రామచంద్రుఁడు గాఢముగ నిద్రించుచుండెను. అప్పుడొకదొంగ చప్పుడుగాకుండ మెల్లమెల్లఁగా నడుగులబెట్టుచు రామచంద్రుని యొద్దకువచ్చి, తలవైపునఁగూర్చుండి తమ్మంట్లుదీసికొని దురాశచేత, శోభనాచలమిదివఱకే రూపాయ లన్నియు క్షౌరము చేసినాఁడన్నమాట నెఱుఁగక, తలక్రిందిమూఁటలో నేమోయున్నదనుకొని మెల్లఁగా మూఁటలాగెను. మూఁటలాగఁగనే తల భూమిమీఁదఁబడిటక్కునదగుటవలన మెలఁకువవచ్చి రామచంద్రుఁడు తలయెత్తిచూచి 'దొంగదొంగ' యని కేకవేసెను. వెంటనేదొంగ మూటబారవైచి యేమూలకోపారిపోయెను. రెండుమూఁడుపిలుపులు

పిలిచినతరువాత శోభనాచలము లేచి దొంగలుపడినందున కార్పర్య పడి దీపము వెలిఁగించి కట్టపుచ్చుకొని యిల్లునాల్గుమూలలు వెదకెను. కాని వాని కెక్కడను దొంగ కనఁబడఁడయ్యె.

కమ్మకుఱ్ఱవాఁడుమాత్ర మీ కేకలు వినఁబడక కాఁబోలు, చెమట పోయుచున్నను ముసుఁగుబెట్టుకొని పండుకొనెను. రామచంద్రుఁడొక్కఁడుపండుకొనుటకుభయపడునేమోయని, కాఁదలఁచినపని కొంచెమైనది కనుక శోభనాచలము రామచంద్రునిమీఁదనతిదయగలిగి దగ్గఱగాఁబండుకొనెను. రూపాయలు శోభనాచలము దగ్గఱ నుండుటచేతను, తమ్మింట్లు దొంగలెత్తుకొనిపోవుటచేతను, రామచంద్రునకు భయపడవలసినయావశ్యక మంతయుఁ బోయి సుఖముగా నిద్ర పట్టెను. కాని మధ్యమధ్యస్వప్నములు, పలవరింతలు, నాతనినిద్రకు నంతరాయములు గల్పించుచుండెను. మురుగుల నమ్ముకొనుటచేత వచ్చినసొమ్ముతోఁ గొంతకాలక్షేపము చేయవచ్చు ననుధైర్యమునఁ దమ్మింట్లుపోయినవిచార మంతగా రామచంద్రున కగుపడలేదు. వయస్సునందుబాలుఁడయ్యుఁ, దెలివితేటలందసమానుఁడైన యాకమ్మకుఱ్ఱవాఁడే రామచంద్రునితమ్మింట్లబాధవదలించినసాహసవిక్రమార్కుఁడని చెప్పనక్కఱలేకయే మీరు తెలిసికొనవచ్చును. జూదరియు, వంచకుఁడును, ద్రోహియు నగునీశోభనాచలము రామచంద్రునితండ్రియగు శ్రీరాములుగారి నెఱుఁగకపోయినను నెఱిఁగినట్లుచెప్పి, నిరక్షరకుక్షియయ్యుఁ గావ్యపంచకమువఱకుఁ జదువుకొన్నట్లుచెప్పి పరమనీచుఁడయ్యు గొప్పవాఁడకిఁ బంధువుఁడననిచెప్పి, బ్రహ్మచారియయ్యు గృహస్థుండననిచెప్పి, మోసముచేసి, రామచంద్రునిదనయింటికిరప్పించుకొని చేయఁదలఁచిన పనినంతయుఁ జేసి సఫలమనోరథుండై యారాత్రి కమ్మవానిచేత దొంగతనముచేయించి, తమ్మింట్లు తానే యపహరించి మిగిలినరాత్రియంతయు సుఖముగా నిద్రించెను. మద్దుల కనక

రత్నమును శోభనాచలమున కేవిషయమునను దీసిపోనివాఁడే కనుక యేఁబది రూపాయల విలువగల మురుగులను ముప్పదియాఱురూపాయల కేతీసికొని యందులో నొకరూపాయ నరువుపెట్టి తనచేతనయినంతవఱకుఁ దానును రామచంద్రుని వంచించెను. అందఱు నుదయమునందు లేచి కాల్యకృత్యములు నిర్వర్తించుకొనిరి.

మూఁడవ ప్రకరణము.

ప్రాతఃకాలమందుఁ గాల్యకృత్యములు నిర్వర్తించుకొని విశ్వనాథశాస్త్రిలవారిదర్శనము చేయుటకుఁబోవలయు నని రామచంద్రుఁడు శోభనాచలమును గూడ రమ్మనియడుగ నతఁడు వచ్చుటకు వీలులేదనియు, శాస్త్రిలవారు మిక్కిలి మంచివారనియు, స్వయముగానే వెళ్ళవచ్చుననియుఁ జెప్పి వారియింటికిమార్గమును జూపుటకుమాత్రము వెంకటస్వామిని జతయిచ్చెను. ఆతఁడునురామచంద్రునివెంటఁబెట్టుకొని శాస్త్రిలవారి యిల్లు చూపి పోయెను. విశ్వనాథశాస్త్రిల వారియిల్లు రాజవీథిలో నున్నది. విశాలముగానున్న రెండు వీథియరగులమీఁదఁ దాటియాకుల చాపలు వేయఁబడి యున్నవి. ఆచాపల మీఁద విశ్వనాథశాస్త్రిలవారి విద్యార్థులందఱుఁ గూరుచుండియుండిరి. అందులోఁ గొందఱు తామిదివఱకుఁ జదువుకొన్న పాఠములఁజింతనచేసికొనుచుండిరి. కొందఱు ముందు చెప్పుకొనవలసిన పాఠములను జూచుకొనుచుండిరి. కొంద ఱాకును గంటమును బుచ్చుకొని క్రొత్తపుస్తకములఁ జూచి వ్రాయుచుండిరి. ఉదయమునందే స్నానముచేసి, విభూతిపెండెకట్లు బెట్టుకొని, మొగలితుఱ్ఱు సంస్థానమునం దష్టావధానము జేసినపుడు మహారాజుగారిచ్చిన పట్టుసాలువు

మీఁదఁ గప్పుకొని బరువైన బంగరుకుండలములు చెవులను గ్రిందకు దిగలాగుచుండ విశ్వనాథశాస్త్రిలవారు గోడకుఁ జేరగిలఁబడి కొంచెము తలవంచి కన్నులకు సులోచనములు బెట్టుకొని ప్రీతదగుట చేత నక్షరములగుపడ కున్నందున శిష్యుఁడొకఁడు మధ్యమధ్య పత్రిములకుఁ గాకరాకు పసరు రాయుచుండఁ దాటియాకుల పుస్తకమొకటి చదువుచుండెను. శాస్త్రిలవారి కిప్పటికి రమారమియేఁబదిసంవత్సరములున్నందున దల కొంచెము నెరసియుండెను. ముసలితనమైనను సుందరముగా దార్ఢ్యముగానున్న యాయన శరీరమును జూచిన వారందఱుఁ బడుచుఁదనమందాయన స్ఫురద్రూపియై యుండునని యనుకొనకమానరు. రామచంద్రుఁ డక్కడకుఁబోఁగానే శిష్యులందఱునితని నెగాదిగఁజూచి తమలోఁ దాము ముసిముసి నవ్వులు నవ్వుకొనుచుండిరి. రామచంద్రుఁడు వచ్చి శాస్త్రిలవారికి నమస్కారముచేయ నాయన యాతని దీవించి కూరుచుండుమని చెప్పెను. కూరుచున్న తరువాత రామచంద్రుని సంగతులన్నియు నడిగి యాతఁడుతమదగ్గఱ చదువుకొనుటకు వచ్చినాఁడని తెలిసికొని శాస్త్రిలవారుసంతోషించిరి. అంతట నొకశిష్యుఁడు రామచంద్రునితో ముచ్చటింపఁదలఁచి యిట్లు సంభాషించెను.

శిష్యు—అయ్యా! తమరెంతవఱకుఁ జదువుకొన్నారు?

రామ.—కావ్యపంచకమువఱకుఁ జదువుకొన్నాను.

శిష్యు—ఎంతకాలమైనది కావ్య మారంభించి?

రామ—మూఁడుసంవత్సరములైనది. ఇంక నేమాత్రిమో కొన్ని నెలలు తక్కువే.

శిష్యు—ఏమి బడాయిలయ్యా! ఎన్నఁడుఁ గావ్యముల ముఖమెఱుఁగనివారిదగ్గఱ చెప్పినట్లె చెప్పుచున్నావు. నీవెంత తెలివిగలవాఁడవైన నేఁడాది కొకకావ్యముకంటె నెక్కువచదువఁగలవటయ్యా?

నీవే చదువుకొన్నావా? ఇంకెవరు చదువుకొనలేదా! మేము నీవలెఁ దెలివిగలవారము కాకపోయినను కొద్దిగొప్ప జదువుకొన్నవారమే!

రామ—నేనబద్ధములు చెప్పుచున్నాననియా మీయభిప్రాయము? మూఁడువత్సరములలోఁ గావ్యములు చదువుకొనుట యొకవింతటండీ! నేనీలాగునఁ జదివినాను.

శిష్య—మీరు కాదుగదా బ్రహ్మరుద్రులైనను సరే యేఁడాదికొక్కటి చదువునప్పటికిఁ జచ్చిచెడి చేయంగలవిన్నపములగును. మాటలండీ! మాగ్రామమునందు బ్రాహ్మణుఁడొకఁడు నవద్వీపమువెళ్ళి యిరువదినాలుగు సంవత్సరములు వ్యాకరణశాస్త్రము చదివినాఁడు. ఇంకను గ్రంథముతరువాయి. నీవాకాశమువీఁదనుండి యూడిపడినావా యేమిటి? అయితే దినమున కెన్నిశ్లోకములు చదివెదువాఁడవు

రామ—పది, యెనిమిది యీప్రకారముగాఁ జదివెదువాఁడను

శిష్య-(గుండె చేతితో బాఁదుకొని) ఁఅబ్బా! లోకములోలేనివింత. నీతలవీఁదదాఁటి కొమ్ములు దిరిగినవాఁడైనను రెండుమూడు శ్లోకముల కంటె నెక్కువచదువలేదు.' అనిశాస్త్రిలవారివంకఁ జూచి యేమండీ శాస్త్రిలవారు! ఇతనిమాటలు చిత్తగించినారా?

విశ్వ—ఆశ్చర్యమేమున్నది? కుశాగ్రబుద్ధు లున్నపక్షమున నట్లెచదువఁగలరు. ఇట్లు వారు సంభాషించునప్పటికి జాముప్రొద్దెక్కఁగాఁ గొందఱు శిష్యులు మాధుకరమునకును గొందఱువారములకును గొందఱు పూఁటకూళ్ళయిండ్లకును బోయిరి. రామచంద్రుఁడు శాస్త్రిలవారిదగ్గఱ సెలవుపుచ్చుకొని శోభనాచలమునుదీసికొని పూఁటకూళ్ళయింటికిఁ బోయెను. ఆపూఁటకూటియింటియరుఁగువీఁదభోజనార్థమువచ్చిన కొందఱు రాజులును బ్రాహ్మణులును గూరుచుండిరి. లోపల నడవలో నున్న దండెమునకుఁ బట్టుబట్టలు వరుసగాఁజుట్టఁబడియుండెను. ఉదయాస్తమయములు తడికాళ్ళతో మనుష్యులు తిరుగు

చుండుటచేత నిల్లంతయుఁ దేమగలిగి కొంచెముజారుగానుండెను. చేతులను బోచీలును, మురుగులును, బంగారుతీఁగెలును వేసిన రాగిపట్టెలును మెడలోఁ బలకసరులు, పట్టెడ, నానుఁ గలిగి చలునచేసినజరీపంచ శరీరమంతయుఁగనుపడునట్లు గట్టి జుట్టు సిగముడివేసి, యింటఁ గొందఱికిని వాకిటఁ గొందఱికిని వడ్డించుచు, భోజనముచేసినవారిచ్చుచున్న డబ్బుల నెడమచేతఁ బుచ్చుకొనుచు, మిక్కిలి పనితొందరచే నూపిరి యాడక తిరుగుచున్న యొకతలవెండ్రుకలవిధవనుజూచి, శోభనాచలము "రాజమ్మా! బాగున్నావా? ముసలాయనయేమైన దార్ఢ్యముగాఁ దిరుగుచున్నాఁడా?" యని పలుకరించెను.

రాజ—తమదయవల్ల బాగున్నాము. మానాన్న మునుపటివలెనే తిరుచున్నాఁడుగాని దగ్గుమాత్రము వదలలేదండి! ఏమి యీ వేళ మామీఁదఁ గటాక్షము వచ్చినది?

శోభ—మఱేమి లేదు. తాటిపాకనుండి మనమాచిరాజువారి చిన్నవాఁడు వచ్చినాఁడు. అతనికి మీయింట నుండవలెననియున్నది. అతని నిక్కడ నప్పగించుటకు వచ్చినాను. పిల్లవాఁడు మిక్కిలి బుద్ధిమంతుఁడు. ఈకాలపుఁబిల్లలవలె నల్లర చిల్లరివాఁడుకాఁడు. నీవందఱి నొకయెత్తు, నీపిల్లవాని నొకయెత్తుగాను జూడవలెను. ఇతఁడొకరిజోలికి సొంటికిఁబోవువాఁడు గాఁడు. తన చదువేమో, తానేమో.

రాజ—దాని కభ్యంతర మేమి? తమరింతదూరముశ్రమపడి రావలెనా? ఆపిల్లవానికి మఱొక లోపము రాకుండ జాగ్రత్తపెట్టు భారము నాది.

శోభ—రూపాయ లతని నడుగవద్దు. నెలకాఁగానే నేనిచ్చివేయుదును. ఇంక వంట యెంత యాలస్యముగా నగును? నాలుగు గడియలకు రావచ్చునా?

అక్కఱలేదు. రెండుగడియలలోగారావచ్చును. స్నానముచేసిరా నాయనా.

అప్పుడు శోభనాచలమును, రామచంద్రుఁడును వెళ్ళిపోయిరి.

రాజమ్మది పూర్వము పలివెల నివాసస్థలము. ఆమె పెనిమిటి వివాహమైన రెండుమాసములకే కాలధర్మము నొందుటచేతను బుట్టినింటివారి సంసారము చితికిపోవుట చేతను రాజమ్మ తల్లిని, దండ్రిని, దమ్ముని దీసికొని యమలాపురము వచ్చి యచట పూఁటకూళ్ళను బెట్టుచు నహోరాత్రములు వేసెడువిస్తరి వేయుచుఁ దీసెడువిస్తరిఁ దీయుచు, వంటలు చేయించుచు వచ్చినవారికి వడ్డించుచుఁ గాశిలోనున్న యన్నపూర్ణసత్రము నందువలె నిరంతరాన్నదానము చేయుచు నమలాపురమునందేకాక కోనసీమయం దంతటను మహాప్రసిద్ధి కెక్కి విస్తారధనము నార్జించెను. పూఁటకూళ్ళను బెట్టుటకారంభించి మూఁడుసంవత్సరములైనను బండ్రెండువందలరూపాయల నార్జించెను. ఆమె మొదట నాగ్రామము వచ్చినపుడు వంటకుఁ బాత్రసామగ్రియైన లేనియిల్లు గంగాళములు మొదలయినవానితో నిండియుండఁగా మొదట కేవలము రాగిపట్టెలయిన లేని రాజమ్మశరీరము బంగారపు నగలతో నిండియుండుట యొక యాశ్చర్యముగాదు.

పాపము! దైవ మోర్వఁజాలక యామెకు వైధవ్యమును దెచ్చిపెట్టి మనసువచ్చినన్ని నగలు పెట్టుకొనుట కభ్యంతరము గల్పించినాఁడు గాని లేనిపక్షమునఁ బుణ్యస్త్రీలు పెట్టుకొను నగ లన్నియుఁ బెట్టుకొనుట కామె దగ్గిఱ సామర్థ్యమున్నది. ధనము హెచ్చినకొలఁది సుకుమారముకూడ హెచ్చినందున రాజమ్మ వంటచేయుట కష్టమనితోఁచి యొక వంటబ్రాహ్మణునిఁ బెట్టెను. మొదటవచ్చినపుడు రాజమ్మ తండ్రి పెసరట్ల నమ్ముటచేతనుఁ దల్లి నీళ్ళబిందెలు మోయుటచేతను, దమ్ముఁడుచలిపందిరిలో దాహమునకు నీళ్ళిచ్చుటచేతను, దానుబూఁటకూళ్ళు పెట్టుటచేతను సంపాదించిన ద్రవ్యముతో రాజమ్మ యిపుడు వడ్డీవ్యాపారము చేయుచుండెను. మొదట నందఱిని బ్రతిమాలికాలక్షే

పముచేయుచుఁ గొంతధనము చేతఁజిక్కఁగనే గర్వించి మనుష్యులను రాజమ్మ నిరాకరింపఁ బ్రారంభించె. ఇంటికి రాజమ్మ పెద్దాఁడుపడు చగుటచేతఁ దలిదండ్రులును దమ్ముఁడును నామెయడుగు దాటకయా మె పేరుచెప్పిన గడగడవణఁకుచుందురు. తనయొంటినినాలుగయిదువం దల రూపాయలు నగలఁబెట్టుకొని, తమ్మునకై దువందలిచ్చి పెండ్లిచేసి తామున్నయింటివారికి నూరురూపాయ లింటిమీఁదబదులిచ్చితరువా తనింకొకమా ఱేఁబదిరూపాయలు వారిచేతిలోఁబెట్టి యాయిల్లుకొనె ను. రాజమ్మసంగతి యటుండనిచ్చి యింకఁగథారంభముచేయుదము. తరువాత రామచంద్రుడు స్నానముజేసి మడిగట్టుకొనఁగా భోజనము లారంభమాయెను. ఆసమయమునందు రాజమ్మ వడ్డనచేయుచు రామ చంద్రుని వృత్తాంతమును దెలిసికొని యతఁడు నియోగియని చెప్పినత రువాత నిట్లుమాటలాడ నారంభించెను.

రాజ—మొగమోటపడకు నాయనా! నియోగపు బిడ్డవు. కొంచెము పరువుప్రతిష్టలకు దేవులాడువారు మనని యోగులే. మేము గూడ నియోగులమే యనిచెప్పుటకు నీవంటివారిదగ్గఱ సిగ్గుగానుండు ను. సగముచచ్చినుఁడీ యీపనిఁ జేయుచున్నది!

రామ—అవును. కాలముతప్పివచ్చినపు డేమిచేయఁగలము?

రాజ—నీవుచెప్పిన నమ్ముదువో లేదోకాని మాసంసారస్థితి, యేఁబదియావులపాడి. కావలసినంత ధాన్యపుబంట. ఏవస్తువుకైననో కరియింటికి వెళ్ళనక్కరలేకుండఁ గాలిమీఁదఁ గాలువేసికొని కూర్చు న్నవాళ్ళము. ఇవతలచెం బవతల బెట్టి యెఱుఁగనుసుమీ. ఆలాటిదా నిని, మాయశక్తి యెక్కడనుండివచ్చినదో బిందెలకు బిందెలు దించు చున్నాను. నేఁటికాలమున కింతకర్మమును దెచ్చిపెట్టినావా దైవమా! యని పొట్టకోసర మీపనిఁ జేయుచుఁ దగుదునమ్మాయని తిరుగుచు న్నాను. ఎంత సుకుమారముగఁ బెరిగినానో యంతకష్టము వచ్చినది.

రామ—నియోగు లిటువంటిపనిఁ జేయవలసినపక్షమున కష్టముగానే యుండును.

రాజ—కూచిమంచివారు, మాచిరాజువారు, మంత్రిప్రగడవారు మాకుబంధువులే. వారెవ్వరైనఁ గంటఁబడినప్పుడు ప్రాణముచచ్చినట్లుగానుండును. ఇప్పుడయిన నొకడబ్బుసొమ్ముమిగిలించుకొన వలెనని లేదు. వాళ్ళడబ్బు వాళ్ళకుఁబెట్టి యేలాగునైన మాట దక్కించుకొనవలెనని యుద్దేశము.

ఇట్లువారు మాటాడుకొనునప్పటికి భోజనమునకు మఱికొంద ఱువచ్చి చిరకాలముక్రిందటఁ దడిపినపట్టుబట్టలఁ గట్టుకొని యన్నముఁ దినుచుండిరి.

ఒకమనుష్యుఁడు—రాజమ్మగారూ! కొంతయన్నము చల్లగాను గొంతయన్నము వెచ్చగానున్న దేమండీ? పొడియన్న మేమయినఁగలసినవాయేమి?

రాజ—ఊరుకోవయ్యా! ఎవరయినను మీమాటలకు నవ్వుదురు. అన్నము చల్లారిన దేమో.

రెండ—పప్పులో గంజివాసన వేయుచున్నట్లుకనఁబడుచున్నదేమి?

రాజ—మీకుఁ గొంచెము రొంపపట్టిన దేమో. పప్పులోగంజివాసన యేమిటండీ.

మూఁడవ—ఏమిటండీ! అవతల రాజులకువడ్డించఁగా మిగిలిన యన్నము మాకు వడ్డించినారేమండీ! అంత బొత్తిగా మాలకూడా! కొంచెము కుడి యెడమ వద్దటండీ!

రాజ—చాలు లేవయ్యా! నేర్చుకొనిపోయినావు. నీమాటలు నీవు సరే. నీవే యాచారవంతుఁడవా? ఇవతలివాళ్ళే యంతమాలకూ

డుతినువాళ్ళా? నేనింటనుండి పళ్ళెముదెచ్చి వడ్డన జేయుచున్నందుకా యీలాటిమాటలు.

నాల్గవ—అన్నట్లు జ్ఞాపకమువచ్చినది. రాజమ్మగారూ! మీరు అందిభార్య ప్రసవమైనదట. పురుడు వెళ్ళలేదుగదా! మీరు మడిగట్టుకొన్నారేమి?

రాజ.—అయ్యో! మాకు వారికిఁ దరములు తప్పిపోయినవండీ.

నాల్గవ—మఱందికి మీకుఁ దరము లేలాగున విడిపోవునండీ! జ్ఞాతులు గనుకనా?

రాజ—పురిటిదినములు వెళ్ళిపోయినవి.

నాల్గవ—ఈవేళకుఁ దొమ్మిది. శుద్ధిస్నానము కాలేదు. రామ రామ. పురిటికూడు దినినందుకు రేపందఱము స్నానముచేయవలెను. మీరెప్పుడు నీలాగే వెనుక చద్దియన్నముఁ బెట్టుమన్నపుడు మైలబట్టతోనే పెట్టినారు. ఈయాచార మెక్కడను జూడలేదు.

మొదట—పచ్చడిలో మెతుకులు కనఁబడుచున్న వేమండీ?

రెండవ—ఇందాఁక నెవరో దిగఁబెట్టినపచ్చడి వేరేతీసి దాచుచుండఁగా నేను జూచినాను! అదిపొరబాటుచేత నీకుఁ బడినదేమో.

మొదట—నారాయణ! నారాయణ! ఎంగిలికూడు నెక్కడ తినఁగలమమ్మా! చీ! నాకీయన్నముపద్దు. (అని యాపోసనముపట్టి లేచిపోయినాఁడు.)

రాజ.—(కోపముతో) వెళ్ళవయ్యా! గడియగడియకు బెదిరించి యెంతకాలముండఁగలవు? పాపము! పొరుగూరినుండి వచ్చినారు. తల్లి దండ్రి లెవరు దగ్గఱలేరుగదా యని సమస్తసదుపాయములుచేసి సొంతయింటికంటె నెక్కువ యాదరణ చేయుచున్నందుకా మీరీలాగునఁ జెవులుపట్టుకొని యాడించుట? పైపైనున్నది. మనమాటలు పడుననిమీరనుకొనుచున్నారుకాఁబోలు! నేనాలాగున మాటలు పడుదా

ననుగాను. మీయిష్టమయిన నుండుడి, కష్టమయినపక్షమున వెళ్ళండి నావంటివారు లక్షమంది మీకున్నారు. మీవంటివారు లక్షమంది మాకున్నారు. మాఱెక్కలు చల్లగా నున్నంతసేపు భయములేదు. ఇప్పటికయినది లెక్కచూచి యిచ్చి మఱి వెళ్ళండి. అందాఁకఁ బట్టు పంచ పట్టుకొని వెళ్ళవద్దు.

నాల్గవ—సరే! ఉంచుకొనుఁడి పట్టుపంచె. నాకుభయములేదు.

రాజ—అవతలవీధి నున్నముండ డబ్బులు పుచ్చుకొని కడుపు గాల్చెడిది. అదేమంచిది. పరమార్థమాలోచించెడు మావంటి పరువు గలవారలకుఁ గాలముగాదు.వాండ్రిదగ్గఱ నోరేయెత్తరు. ఆమాయ ముండ కేలాగున డబ్బు దక్కునో తెలియదమ్మా.

అనియనఁగానే పట్టుపంచ వదలి యతఁడుపోయెను. రామచం ద్రుఁడు భోజనానంతరము పాఠశాలకుఁ బోయెను. శిష్టాచారసంప త్తి గల సాంప్రదాయమునందుఁబుట్టిన రామచంద్రుఁడు పూఁటకూటి యింట బొట్టుఁబెట్టుకొనక, కాళ్ళుఁ గడుగుకొనక మడిబట్టలఁ గట్టుకొ నక భోజనము చేయువారలను జూచి పట్టణవాసములయందుఁ గల వై చిత్ర్యముల కాశ్చర్యము నొందెను. అంతలో నతని యాశ్చర్యము స మాప్తముకొందక రాజమ్మ చర్యలు, భోజనమునకు వచ్చినవారి సం భాషణలువిన్నపిదప నధికమాయెను. రామచంద్రుఁ డాదినము మొ దలు విశ్వనాథశాస్త్రిలవారి యింటనే పండుకొనుచు నచటి సహా ధ్యాయులతో సుఖముగాఁ గాలముగడుపుచుండెను. ప్రతిదినము మ ధ్యాహ్నము భోజనమైనతరువాత శాస్త్రిలవారు గేదెకు గడ్డినిమిత్త ముపొలమునకుఁ బోయినప్పుడు గురుశుశ్రూషయందొకరికంటె నొక రుమించవలెనని పనిఁ జేయుచున్న శిష్యులతోఁగలసి, శాస్త్రిలవారికిఁ దనచేతఁబనిచేయించుటకిష్టములేకున్నను,దానుగూడ శక్తిలోపములేక శుశ్రూష చేయుచుండెను. విశ్వనాథశాస్త్రిలవారికి రామచంద్రుని

మీఁదఁ గల మంచియభిప్రాయ మంతకంతకు హెచ్చెను. మనోహర మయిన యాకారమును, నాకారమునకుఁ దగినబుద్ధిసంపదయు, బుద్ధి సంపద కనుగుణ మయిన విద్యాసక్తియు, విద్యాసక్తి కలంకారముఁ బెట్టుచున్న వినయసంపత్తియు నర్జునునియందుద్రోణాచార్యునకువలెనే రామచంద్రునియందు విశ్వనాథశాస్త్రిలవారికి మంచిప్రేమను గలిగించెను. శాస్త్రిలవారి యింటియెదుటనే గ్రామమునందెల్లఁ దగుపెద్ద మనుష్యులును సంపన్నగృహస్థులునయిన మంత్రిప్రగడ శరభరాజు గారియిల్లుగలదు. ఆయనకుమారుఁడు రామచంద్రుని యీడుగలవాఁడు శాస్త్రివారిదగ్గఱ జదువుకొనుచు రామచంద్రుని సత్ప్రవర్తనమునకు, బుద్ధికిని సంతోషించి యతనితోస్నేహముచేసియతఁ డెక్కడనుండిన దానక్కడనుండుచు, నీతనికేలోపము తటస్థమయినను సహాయము జేయుటకుఁ దానుసిద్ధముగానుండి యతని నతిగౌరవముతోఁ జూచుచుండెను. వారిద్దఱును గృష్ణార్జునులవలె నతిశయస్నేహముచేతఁ బ్రసిద్ధికెక్కిరి. సహజముగా మంచిశారీరముగల రామచంద్రునకు రాగజ్ఞానమువన్నెతేఁ బుస్తకము నతిశ్రద్ధముగాఁ జదువఁగలుగుటచేత శరభరాజుగారప్పు డప్పు డతనిని బిలిపించి పుస్తకముఁ జదివించుచుందురు. పుష్పసౌరభ్యమువలెనే వ్యాపించిన రామచంద్రునికీర్తివలనన తనియందు మంచియభిప్రాయముగలశరభరాజుగారిమనస్సునకు, విశ్వనాథశాస్త్రిలవారును, గుమారుఁడును జేయు న్యాయమైన స్తుతులు చక్కగా నాటి పిల్లవానియం దొకవిధమైన యనురాగమును గలిగించెను. ఇది యట్లుండఁగా రామచంద్రుఁడు పూఁటకూటియింటఁ బ్రవేశించి రెండుమాసము లయినది. ఒకపర్యాయము రాజమ్మ లెక్కకుఁ దొందర పెట్టగా శోభనాచలము రెండు రూపాయిల నిచ్చెను కాని తరువాత నొక దమ్మిడీయయిన నియ్యలేదు. తరువాత రామచంద్రుఁడు తన సహాధ్యాయునియొద్ద రెండురూపాయలు బదులుచేసి రాజమ్మకి

చ్చెను. ఇట్లు రాజమ్మ కొకమాసపుసొమ్ము మాత్రము ముట్టినది గాని రెండవమాసపుసొమ్ము ముట్టనందున నామె రామచంద్రుని నిలువనీయక బాధపెట్టనారంభించెను. శోభనాచలమే సొమ్మునిత్తునని మొదట నొప్పుకొని, తరువాతనీయవలసినయవసరము లేదనియు, రామచంద్రునే యడుగుమనియు, రాజమ్మకు రహస్యముగా వర్తమానమునంపెను. శోభనాచలము తనస్నేహితునకుఁ బదునైదు రూపాయలు బదులుపుచ్చుకొని స్నేహితునిచేత సొమ్మిప్పించనులేదు. తానీయను లేదు. ధనముపుచ్చుకొన్నపుడున్న చొరవయు, ధైర్యమును మరల సొమ్మునిచ్చునపు డాతనియందుఁ గనబడవయ్యెను. తనస్నేహితుఁ డీయవలసిన ఋణమునకుఁ దానుత్తరవాదినిగాననియుఁ దనసొమ్మేతానీయఁగలననియుఁజెప్పి శోభనాచలము రామచంద్రుఁడు తనయింటికిఁ దడిమన్ను పొడిమన్నగునట్లుతిరిగిననునొకడబ్బయిననీయక వచ్చినపుడెల్ల సాయంకాలము రమ్మని యొకమాఱును, నుదయమురమ్మని యొకమాఱును, సొమ్మందలేదనియింకొకమాఱును మనసులో నేమియనుకొనవద్దని యొకమాఱును దనకుఁ జాల మొగమోటముగానున్నదని మఱొకమాఱును జెప్పినమాటచెప్పక వానినిద్రిప్పుచుండెను. రామచంద్రుఁ డేవేళప్పుడు సొమ్మిచ్చెనోకాని శోభనాచలమునకు సొమ్మెన్నఁడు నందనేలేదు. అవసర మెక్కువై తనయింటికతఁడు వచ్చినకొలఁది శోభనాచలమునకు సొమ్మియవలెనను నభిప్రాయము తగ్గి పలుమాఱతఁడు వచ్చినందులకు విసుగుహెచ్చెను. రామచంద్రుఁ డింటికివెళ్ళినపుడు శోభనాచల మగుపడక యింటనుండక యొకవేళ నింటనుండిన లేడనిపించుచు, వీధిలో నెదురైనప్పుడు ప్రక్కసందులోని కైనను దగ్గఱయింటికైనను బోవుచు, నట్లుచేయ వీలుగానపుడు ముసుఁగువేసికొని స్నేహితులమధ్యదాగుచుమొగమునకేదైన నడ్డము పెట్టుకొనుచుఁ, గాలము గడపుచు వచ్చెను. అతిస్వల్పకాల

సంపాదితమైన వారిస్నేహము, క్రమక్రమముగా మొగమోటమై, లజ్జయై మనస్పర్థయై నిష్ఠురమై యాగ్రహమై తుదకు రానురాను కలహముగాఁ బరిణమించెను. తుదకు రాజమ్మగారియొక్క బాధ పడజాలక నొకనాఁ డుదయాస్తమయములు వాకిటఁగూర్చుండి వేంకటరత్నముతోఁగూడ వచ్చుచున్న శోభనాచలమును బట్టుకొని రామచంద్రుఁడు విధిలేక యీప్రకారముగా మాటలాడనారంభించెను.

రామ—అయ్యా శోభనాచలముగారూ! ఎంతకాలము తమ యింటిచుట్టు నేనుదిరిగినను నామీఁద ననుగ్రహ మింకను రాలేదు గదా? రాజమ్మగారు నన్ను నిలువనిచ్చుటలేదు. ఱేపోమాపో యింటనుండి నన్నామె వెడలఁగొట్టును. నామనవి చిత్తగించి లెక్కదయ చేయుదురూ! తమ రుచితముగా నిచ్చినట్లు సంతోషించెదను. పుచ్చుకొన్న సొమ్ముగాని మఱొకటిగాదు.

శోభ—(ఆగ్రహముతోఁ గన్ను లెఱ్ఱఁజేసి) నీకేమయినఁ గొంచెముబుద్ధియున్నదా లేదా? పెద్దపిన్నలున్నారనుసందేహ మేమియు నక్కఱలేదా? అందఱునీవలెఁదుచ్ఛులే యనుకొన్నావా? నీవుబ్రతికిన బ్రతుకుకొద్ది నీపరువుకొద్ది యడిగినావు. నీసంప్రదాయ మెటువంటిది? నీసంగతి నేనాదినముననే గ్రహించినాను.

రామ—అయ్యా! తమకంతకోపమెందుకు? నేనేమన్నాను? నావల్లఁ దప్పున్న క్షమింపుఁడు.

శోభ—మేము నిన్ను క్షమింపఁదగ్గ వారమా! నీవే నన్ను క్షమించవలెను. చచ్చిచెడి యేలాగో రెండుగుల్లలు తెగనమ్ముకొని నీవుకాగా సొమ్ముసంపాదించినావు. నీదగ్గఱ బదులుపుచ్చుకొనుట నాదే బుద్ధితక్కువ. నీవీస్వల్పమునకు మొగముచిందుకొనుచున్నావు. గాని యీలాటివి లక్షలు సంపాదించినాము. లక్షలు వ్యయము చేసినాము. నావంటివాని కిది యొక లెక్కకాదు.

రామ—అందు చేతనే త్వరగా దయచేయించండి, నేరమంత యు నాదే.

శోభ—ఇయ్యక మానుదుమా యేమిటి? ఇచ్చినదాఁకఁ జచ్చినట్లుండు. అ ప్పదునుకురాదు. నీసొమ్మెంతచేయును? నీవెంతచేయుదువు? నీనైజము కనఁబఱచుకొన్నావు. నీసొమ్ము వారమునాఁటికి గిరగిరఁద్రిప్పి పాఱవేసెదను. నీకంటె నిర్భాగ్యుఁడుగాని నీసొమ్ము నపహరింపఁడు. నీకు గతిలేదు గాని మాకు లేకపోలేదు. ఉపకారమునకుఁ బోగా నపకార మెదురయినదఁట! వచ్చిననాఁడు మా యింట నుంచుకొని బంధువుఁడు గదాయని సమస్తవిధముల నాదరించినందుకాయీ మాటలు. సాటి నియోగపువాఁడవని నీకింత నిర్వాహకముచేయవలెనని యనుకొన్నాను. అయ్యా వేంకటరత్నముగారు! ఆరాత్రి దొంగలుపడినప్పుడు దానుగుఱ్ఱవాఁడు భయపడునని దగ్గఱగా మీఁదఁ జెయ్యివేసికొని పండుకొన్నాను. ఆవిశ్వాసమయినలేదు. ఈకాలములో నెవరికి నుపకారము చేయఁగూడదండి, నాయనా! ఱేపు నీసొమ్ము నీకుఁ బంపెదను. ఇప్పటికి వెళ్లు.

వేంక—ఇంత మంచివారు, మీతోనే పడినదికాదు. ఇంక నీ గ్రామమునం దెవరితో సరిపడును? బాగానే సాగ్లాపడఁగలదు. సరసముగానే యున్నది.

రామ—మీచిత్తము. ఇఁక నే నడుగను. ఆమాట మీరె దక్కించుకోవలెను.

శోభ—అమలాపురమునీ ళ్లొంటఁబట్టినవి. పెంకెతనము ముదిరినది. మాట దక్కించుకోవలెనుగాదూ? ఇది జ్ఞాపక ముంచుకో.

రామ—మీరాచంద్రార్కము నాకు జ్ఞాపక ముండునట్లు చక్కనిపనిఁ జేసినారు.

అని మెల్లగా ననుకొని మాటలతోఁ దెమల్చి తన్ను శిక్షింపక

దయదలఁచి పోనిచ్చినందులకు మనసులో సంతోషించుచు దేవున కనేక వందనములు చేయుచుఁ బూఁటకూటిదాని కేమిప్రత్యుత్తరము చెప్పుదునాయని యాలోచించుకొనుచు రామచంద్రుఁడు వచ్చెను. రాఁగానే రాజమ్మ వానిని జూచి యిట్లనియె.

రాజ—లెక్క తెచ్చినావయ్యా?

రామ—శోభనాచలముగారు—

రాజ—(మాటకడ్డమువచ్చి) శోభనాచలములేదు గీభనాచల ములేదు. నాయింటఁదిన్న వాఁడవు నీవా శోభనాచలమా? నాకతనితో నేమి? ఒడ లెఱుఁగవు? ఎవరియబ్బ సొమ్మని తిన్నావు? డబ్బుపు చ్చుకోకుండ నీకు మూఁడుపూఁటలు వండి కుంభము తోడుట కెవరు నీకచ్చియున్నారు. పోపో! నాయింటనుండి లేచిపో. చెంబు, పట్టుపంచె నేనియ్యను నడువుడు.

అంతకఠినముగా రాజమ్మ మాటలాడినపు డిఁక నచట నుండ రాదని చివాలున లేచి రామచంద్రుఁడు వెళ్ళుచుండెను. అంతట నా తని మార్గమధ్యమందు వెనుక తనకు రెండురూపాయలు నప్పిచ్చిన సహాధ్యాయుఁ డగుపడి రామచంద్రుని నిలువఁబెట్టి తనసొమ్ము తన కిమ్మని యడిగెను. వాల్లురి మాటాడిరి.

సహా—ఏమోయి! అప్పుపుచ్చుకొని తిరిగి యిచ్చినావుకావు? ఒకనాఁడా రెన్నాళ్ళా? అంత గతిలేనివాఁడ వెందుకుపుచ్చుకొన్నావు? పోనీ యెగవేయి. దీనితో నీవు పెద్దకాపురము చేయవు; నేను జెడిపో ను. మర్యాదగాదు. నేనేలాటి యవసరములో నీకిచ్చినానో నీవు నా కాలాగు రెండవకంటివాఁ డెఱుఁగకుండ నీయవద్దా? ఱేపు నీ వీయక పోతివా నీకునాకు బాగుగాజరుగదు. అనిచెప్పి వెళ్ళిపోయెను.

అతని యదృష్ట మేమో కాని రామచంద్రునకు బదులిచ్చిన వారును నతనియొద్ద బదులు పుచ్చుకొన్నవారునుగూడ నతనినినిందిం

చుచుండిరి. శోభనాచలము సొమ్మిచ్చుననునాశ వానికి లవమును లేదు. గ్రామమందుఁ దన్నెవరు నెఱుఁగరు. రాజమ్మ లేవఁగొట్టినది. మద్దుల కనకరత్న మియ్యవలసిన యాయాపాయికూడఁ దానీయనక్క అలేదని చెప్పెను. అందుచేత మహావిచారము గలిగి నిర్విణ్ణుఁడై సాయంకాలమువఱకు భోజనములేనందునఁ గడుపులోమలమలమాడు చుండఁగాఁ బ్రదోషకాలమున నెప్పటియ ట్లాలయమునకుఁ బోయి దేవదర్శనము జేసి తరువాత మంటపముమీఁద నుత్తరీయముఁబఱచు కొని గ్రుడ్లనీళ్లు గ్రుక్కుకొనుచుఁ, దల్లిదండ్రులు చనిపోవుటయుఁ,బిన తండ్రి యన్యాయముగ సొత్తపహరించుటయు ద్రవ్యనష్టమును బ్రతి స్థలమునఁ దిట్లును దలఁచితలఁచి విచారించుచు వెల్లకిలఁబండుకొనెను. రామచంద్రుని సంగతి యంతయు నెవరివలననో విని శరభరాజుగారి కుమారుఁడు గోపాలము గ్రామమంతయు వెదకి దేవాలయమునకు వచ్చి మంటపముమీఁదనున్న రామచంద్రునిగనుఁగొని, మొగమాట ముచేత నతఁడేమియుఁ జెప్పకున్నను భోజనముచేయనట్లు గ్రహించి "రామచంద్రుఁడూ! మాబాబయ్యగారు నిన్నొకసారి రమ్మన్నారు." అనిచెప్పి తీసికొని వెళ్లెను.

నాల్గవ ప్రకరణము.

అమలాపురమునందుఁ గల యాండ్లన్నిటిలో మంత్రిప్రగడశర భరాజుగారి యిల్లేపెద్దది. రెండు వీథియరఁగులకు గచ్చుచేయఁబడియు న్నది. ఇటికలతోఁ గట్టిన స్తంభములు రెండరఁగుల మీఁదనుగలవు. తాతిమెట్లతో నిండిన గుమ్మముదాఁటి లోపలికిఁ బోఁగా నెడమచేతివై పునఁ బెద్దకచేరిచావడి యడుగువేసిన జారునట్లు నున్ననయి తెల్లనిపా

లగచ్చుతో నిండియుండును. చావడికి రెండుప్రక్కల రెండుగదులుండు ను. అందులో నొకగదిలో శరభరాజుగారి జ్యేష్ఠకుమారుఁడైన రాజ గోపాలము చదువుకొనుచుండును. చావడికెదురుగానున్న వాకిట వేస వికాలము గనుక నొకకొబ్బరియాకుల పందిరిగలదు. చావడిమీఁదఁ గూర్చుండుటకు వెదురుపేళ్ళ చాపయు దానిమీఁదఁ దివాసులునుగల వు. గోడదగ్గఱ మూఁడుమూళ్ళపొడుగున నొకపెద్దదిండుచేరఁగిలఁబడు టకు వేయఁబడి యున్నది. ఇనుపజాలకట్టుగల యొక గవాక్షము దిండుపై నుండుటయేకాక చావడిలోనుండిదొడ్డిలోనికిఁబోవుటకుఁగిటి కికి రెండుప్రక్కల రెండు గుమ్మములును, వానికిఱెక్కలతలుపులును గలవు. వీధిగుమ్మమునకు నెదురుగాఁ లోగిలియొక్క లోపలిభాగము న్నది. అందు మండువాయును, దానికిరుప్రక్కలను రెండుగదులును వానికిఁ జేరి పడమటియిల్లుగలదున్నవి. దొడ్డిలో నొకయుప్పునీళ్ళనుయ్యి త్రివ్వఁబడియున్నది. నూతికిఁగొంచెముప్రక్కగాఁ దులసికోట వేయఁ బడియున్నది. ఇంటికిదక్షిణభాగమందుఁ బశువులసాల యొకటికలదు. ఈయింటియందుశరభరాజుగారు దండ్రితాతలనాఁటనుండియుఁగాపుర మున్నవారు. శరభరాజుగారికిప్పటికినలువదిసంవత్సరములుండును. మొ లకు బంగారపు గోవత్రాడును, జేతులకు నకిషీచెక్కిన గుల్లమురుగులు ను వ్రేళ్ళకు బటువులును, శరభరాజుగా రెప్పుడును దీయక ధరించు చుందురు. ఆయన పచ్చనైన కొంచెము స్థూలశరీరము, బట్టతలయు గలిగియుందురు. శరభరాజుగారికిఁదొలిచూలు మగపిల్లవాఁడుపుట్టుట చేత సంతోషించి రాజగోపాలమని తమతండ్రిగారి పేరుఁబెట్టుకొనిరి. రాజగోపాలము తరువాతఁ దొమ్మిదిసంవత్సరములవఱకు శరభరాజు గారికి బిడ్డలు లేరుగాని పిమ్మట నొకకుమార్తెగలుగనేడవపురిటినాఁ టికి నాలుగుమాసములక్రిందట జనిపోయిన శరభరాజుగారి చెల్లెలు స్వప్నములోఁ గృష్ణవేణమ్మకుఁ గనఁబడి పేరు పెట్టు మనినందున నీ

కొమార్తెకుఁ బార్వతియనుపేరుబెట్టిరి. ఆమెవెనుక మరలనొకకుమారుఁడు గలిగెను. ఆతని పేరు నరసింహము. కృష వేణమ్మతనశరీరమున ధరించిన యాభరణంబులకాంతిని వెలవెలఁబాఱఁజేయు చాయయు, నాకర్ణాంతములైననేత్రములును, దానిమ్మగింజలవంటిపండును, సన్ననినడమును గలిగి లావణ్యమందేగాక సత్ప్రవర్తనమందును స్త్రీలలో శిరోభూషణమై మగనిమాటజవదాఁటక సత్కార్యములయందు శరభరాజుగారికిఁదగినప్రోత్సాహమునిచ్చుచు ననుకూలదాంపత్యమునకు నిదర్శనము వీరేయని జనులుస్తోత్రముచేయునట్లు మహాకీర్తినిగాంచెను. శరభరాజుగారికి సంవత్సరమునకుఁ గొబ్బరితోఁటలమీఁదను, భూములమీఁదను, మూఁడువేలరూపాయిలువచ్చును. గ్రామమునందాయన తగుపెద్దమనుష్యులగుటచే వివాదలుగలవారందఱు శరభరాజుగారియెదుటకువచ్చి తగువులు పరిష్కరించుకొందురు. వేంకటరత్నము శరభరాజుగారి కొకవేలువిడిచినపినతండ్రికొడుకు. బాంధవ్యమునందేకాక గుణములయందుఁగూడ వేంకటరత్నము శరభరాజుగారికి దూరమేకనుక నతనిఁదనయింటనుంచుకొనుటకు నిష్టములేకపోయినను దల్లిప్రోద్బలముచేతఁ నతఁడింటనుండుట కాయనసమ్మతించెను. చిన్నతనమునందే తలిదండ్రులార్జించిన రొక్కమంతయువిచ్చలవిడిగా వ్యయముచేసి యన్నవస్త్రములకులోపముగాఁగానే వేంకటరత్నము వీరియింటఁ బ్రవేశించెను. వివాహము కాకపోయినను, నతనికిసంసారికంటె నెక్కువతాపత్రయము గలదు. ధనమువచ్చుబడి లేకపోయినను, ద్రవ్యముతో నావశ్యక మెక్కువగన్లుండెను. రామచంద్రుఁడమలాపురము వచ్చిననాఁటిరాత్రి వేంకటరత్నము చెఱువుగట్టునఁ బ్రవేశించిన యిల్లు వానిభోగస్త్రీయైన చంద్రముఖి యిల్లే. లావణ్యమునం దామెకుఁ జంద్రునితో సమానమైనకాంతి లేశమునులేదు సరికదా చంద్రునివలె గుండ్రని ముఖముగల్గి చంద్రముఖినామముసార్థ

కము జేసికొనునేమో యనుకొన్నను మొగము కొంచెమించుమించు గామూరెడు పొడుగుండును. కొమార్తెకు సార్థకనామము లేకపోయి నను దనచిన్నతనమునుండియు నింటికివచ్చిన యనేకసరులప్రాణముల హరించిహరించి యప్పటికి జవసత్వములుడిగియున్నదాని తల్లికి నర హరియనునామము సార్థకమైయుండెను. చంద్రముఖికిఁ జప్పిదవుడ లుండుటచేతఁ దమలపాకుల యావశ్యక మెక్కువగ నుండెను. అటు రామచంద్రుఁడు రాజగోపాలముతో రాఁగానే శరభరాజుగారతనిని దమయింటనుండుమని బలవంతపెట్టిరి. నియోగకుటుంబమునందుఁబుట్టి న రామచంద్రునకుఁ బరగృహవాసము చేయుట యభిమానమనితోఁ చినను కాలముతప్పివచ్చినందున శరభరాజుగారి యింట నుండి రాజ గోపాలముతోఁ గలిసి చదువుకొనుచుండెను. వచ్చినప్పటి నుండియు రామచంద్రునకును వేంకటరత్నమునకును గొంచెము సరిపడకుండెను. శోభనాచలమునకు స్నేహితుఁ డగుటచేత వేంకటరత్నమునకును రామచంద్రునిమీఁదఁ గొంచెము కోపముండుట సహజమే? అదియ టుండఁగా వేంకటరత్నము నిలువుబొట్టువాఁ డగుటచేత రామచం ద్రుఁ డాబొట్టుఁబెట్టుకొననందుకు నాతనిమీఁదఁ గోపము వచ్చెను. తరువాతఁ గొన్నిదినములకు శరభరాజుగా రొకనాఁడు రామచం ద్రునితో నేదో రహస్యమును జెప్పిరి. ఆరహస్యముఁ దనకుఁజెప్పు మని వేంకటరత్నము రామచంద్రు నెంత బలవంతపెట్టినను, నతఁడు చెప్పనందున వానిపైఁ గోపము ద్విగుణ మయ్యెను. అందుచే త వేంకటరత్నము రామచంద్రుఁడొంటరిగాఁ దనకంటఁబడినప్పుడెల్లఁ బొట్టకూటికిఁ జేరినవాఁడనియు, సర్వజ్ఞత్వము మెండనియు, నిఁక నిటువంటి యెత్తిపొడుపు మాటల ననుటయే కాక రామచంద్రునిగు రించి తానెవరితోఁ బ్రసంగించినను దనశక్తివంచన లేకుండ నతడు మంచివాఁడు కాడని వారి మనస్సులయందు నాటునట్లుగాఁ జెప్పుచు

వచ్చెను. శరభరాజుగారును, గృష్ణవేణమ్మయు రామచంద్రుని దమ కుమారునితో సమానముగాఁ జూచుకొనుచున్నను వేంకటరత్నము తనయెడలఁ జూపుచున్న యసహ్యతవలన రామచంద్రునకు మనస్స్థిమితము లేకపోయెను గాని సద్గుణ సంపన్నుఁడగుటచే రామచంద్రుఁడు శరభరాజుగారితో నైనను లేక తన ప్రాణసమానముగాఁ జూచుకొనుచున్న రాజగోపాలముతో నైనను, నీసంగతి జెప్పఁడయ్యె. రామచంద్రునకుఁ దనయిల్లు వెడలిన తర్వాత పూర్వము తనకిష్టము లేని వస్తువులెల్ల నిప్పు డిష్టమయ్యెను. అతఁడమలాపురమునఁ జదువుకొనుచున్నకొలఁదివిశ్వనాథశాస్త్రిలవారికి వాత్సల్యమునుసహాధ్యాయులకు గౌరవమును, శరభరాజుగారికిఁ బ్రేమయు, రాజగోపాలమునకు మైత్రియు, గ్రామస్థులకు మంచి యభిప్రాయమును గలుగఁజొచ్చెనుగాని వేంకటరత్నమునకు మాత్రము ప్రేమాదులు చచ్చి యసహ్యత హెచ్చనారంభించెను. ఇప్పటికి రామచంద్రుఁడు శరభరాజుగారియింటికి వచ్చి పదిమాసములయ్యెను. అమలాపురమునందు గొబ్బరివేళ్ళనీళ్ళుపడక దేహమునందు రామచంద్రునకుఁ గొంచెమప్పుడప్పు డజీర్ణముగాను ననారోగ్యముగా నుండుచు వచ్చెను. ఆ సంవత్సరమునందు జ్యేష్ఠమాసమున నతనికిఁ దీవ్రమైనజ్వరమువచ్చినది. జ్వరము తగులఁగానే శరభరాజుగారు దమదగ్గఱనున్న శీతాంశురసము మాత్రలనిచ్చిరి. విశ్వనాథశాస్త్రిలవారు గొంచెము జలము మాత్రము మంత్రించి త్రాగుమని యిచ్చిరి. అంతలోనే యెక్కడనుండియో రెండుపొట్లములు దెచ్చి రాజగోపాలము తేనెతోఁగలిపి దగ్గఱనుండి మ్రింగించెను. కాని వెంటనే గుణము గనఁబడనందున సాయంకాల మతఁడు కషాయము నిప్పించెను. శరభరాజుగారి తల్లి యొకపూఁట కంటిలో మిరియముల కలికము వేసెను. ఎన్నిచేసినను రోగమెక్కువేకాని తక్కువ కానందున శరభరాజుగారు దమయింటి

వైద్యుఁడు గ్లానిమందు లేఁడని తెలిసికొని, పూర్వమునవృత్తియే దియు దొరకక వైద్యమారంభించి యనేకజనుల కకాలమరణపూర్వకముగ స్వర్గలోకసుఖముఁ గలుగఁ జేసి ప్రాణము విసిగి వైద్యము చాలించి సంచి మూలఁబడవైచిన యొక ముసలివైద్యుని బిలిపించి కుఱ్ఱవానినిజూపి చేయిచూపుమని చెప్పిరి. అంతట వైద్యుఁ డిట్లు బలికెను.

వైద్య—చేయిచూడనక్కఱలేదు. లంకణములగట్టుడీ,ఎన్ని లంకణములు గట్టిన నంతమంచిది.

రామ—అయ్యా! చిన్నతనమున నుండియు నాకులంకణములు పడవు. అన్నము దినవలయును.

వైద్య—ఎందుకు పడవు? కమ్మనిరోగములు దియ్యని మందులు సరిపడఁగలవా? ఉండలేకపోతే జాడ్యములొంగునా? కన్నులు మూసికొని పరుండు!

శర—అయ్యా! ఎన్ని లంకణములు పడవచ్చును?

వైద్య—ఇదిపురాణజ్వరము. శరీరమునజీర్ణించెను. పదిలంకణముల మీఁదిమాట!

రామ—అయ్యయో! నేనుండలేనండి. శరభరాజుగారు! నాతత్వమునకది సరిపడదు.

శర—పథ్యముత్వరగానే పెట్టింతునులేనాయనాయని వైద్యునితో నయ్యా! ఏమిమందు వేయఁదలంచుకొన్నారు? ఆనందభైరవి వేయవచ్చునా?

వైద్య—ఆనందభైరవి యేమిపనిఁ జేయఁగలదు? ఇది భడవజాతి జ్వరము. రాకడ వేఱుగానున్నది.

శర—ఏదోయొకటి వేయించండి.

అని చెప్పఁగానే వైద్యుఁ డొకమాత్రనిచ్చివెళ్ళిపోయెను. జ్వ

రము కొద్దిదైనను నదియెక్కువ జ్వరమనిచెప్పి యెక్కువ ధనముగ్రహింప వలెనని దురుద్దేశము గలిగి రోగమెక్కువగుటకు వైద్యుఁడు మందిచ్చెను. తరువాతఁ దాను లొంగదీయవలె ననుకొన్నను, రోగము త్వరగా లొంగలేదు. ఉష్ణము నిశ్శేషముగాఁ దగ్గినను లంకణము లింకను గట్టించి వైద్యుఁడు పథ్యము బెట్టించుట మానిపించెను. ఆమహానీరసముచేత నొకనాఁడర్ధరాత్రి రామచంద్రునకు నిస్తాణవచ్చి మాటరాక కాలుసేతులు చల్లఁబడెను. ఆసంగతి నెఱుఁగక యీగుణములు మఱొకవిధముగా భావించి వేంకటరత్నము శరభరాజుగారి చెవిలో మెల్లగా "రామచంద్రునివని బొత్తుగా నపస్మారముగానున్నది. మనకు దక్కఁడని తోఁచుచున్నది." అనిచెప్పెను. ఆమాటవినఁగానే శరభరాజుగా రదిరిపడి లేచిరి. ఇంట నందఱుఁ దొట్రుపాటుతో లేచిరి. వేంకటరత్నము చాకలివానిచేత వీధిలోగోడదగ్గఱ రెండువెదుళ్ళు పాతించి రెండువెదుళ్ళడ్డము వేయించి నాలుగు చాపలడ్డము గట్టించెను. శరభరాజుగారితల్లి చప్పుచప్పున రెండుచేఁదల నీళ్ళు మీఁదబోసికొని దడిగుడ్డలతో నటకమీఁదికెక్కియూరుగాయ కుండల దింపుచుండెను. శరభరాజుగారు వైద్యునికొఱకు వర్తమానమంపిరి. కాని జరుగుచున్నసంగతి యంతయు విని వైద్యుఁడు తన యౌషధప్రభావముఁ దానెఱుఁగును గనుక మరణమేకాని మఱొకటి జరుగదని నిశ్చయించుకొని రాక, తుదకు వర్తమానము లెక్కువకాఁగా శరభరాజుగారికిఁ గోపము వచ్చునని యచటికి వచ్చి చూచి "చేతిలోఁ జాలజబ్బుగానున్నది. ఇది విషమజాతి—నెగ్గదని నేను మొదటనే యనుకొన్నాను. మందు లియ్యఁ గలముగానియాయుర్దాయము పోయఁగలమా" యనిచెప్పియొకచోటగుమిగాఁగూడికొనియున్న రాజగోపాల శరభరాజ వేంకటరత్నముగార్ల దగ్గఱఁ గూర్చుండెను. అప్పుడు శరభరాజుగారితల్లి యన్నపూర్ణమ్మవచ్చి యిట్లుపలికెను.

అన్న—ఏలాగున్నదిరా నాయనా!

వేంక—ఏమిచెప్పను? ఘడియలమీఁద నున్నది. ఇప్పుడో యిఁకనో.

అన్న—ఆమంచము దీసి వీథిలోఁ బారవేయండిరా? ఇంకా యింట్లో యెందుకు?

శర—తొందర యేమిటమ్మా? ఇంకఁ గొంచెము సేపుండు.

అన్న—కొంచెము సేపేమిటి? ప్రాణముగుటగుటలాడుచున్నది

శర—నాకాపిల్లవానిఁజూడఁ గడుపులో జాలిగానున్నది. అవతలఁబెట్టింపలేను.

అన్న—సామానంతా తగులఁబడిపోతుంది. ఎక్కడోదిక్కుమాలిన ముండాకొడుకు కోసము నిక్షేపమువంటి యిల్లు తగులఁబెట్టుట కాలోచిస్తావేమి? చెప్పినమాట వినరు. ఏగంగలో దిగేదమ్మా మాయసంతవచ్చింది. ఈనిర్భాగ్యపుఁ జచ్చినవాఁడు యింటికోసమే దాఁపరించినాఁడు.

రాజ—తిట్టకమ్మా యేమియులేదు, ముందుగాఁ జావుమాట లెందుకు?

అన్న—చావకయీవెధవబ్రతుకుతాఁడు? మీరుకూఁడావానితోఁగట్టగట్టుకొని గంగలో దిగండి. ఒక్కయేడు పేడిచి నోరుమూసికొని యూరకుంటాము.

వేంక—అన్నయ్యా! వాఁడత్రిపాది నక్షత్రమఁట. ఇల్లాఱు మానములు వదలిపెట్టవలెను. పశువులసాలలో నైనఁ బెట్టించండి పోవునప్పు డెక్కడయిన నొక్కటే.

వైద్య—అయుర్దాయ మున్నపక్షమునఁ జంపినను జావఁడు. వెనుక నాకొక పర్యాయ మీలాగే ప్రాణముమీఁదికి వచ్చినపుడు మావారందఱు నన్ను గ్రిందఁ బడవేసుకొని కూర్చున్నారు. అంతట

నాప్రాణముపోయినది. నలుగురు యమదూతలు నల్లలాగులు తోడుగుకొని రోకళ్ళతో వచ్చి నన్నుఁ దీసికొని మాలకాకివలె నల్లని దేహముగలిగి యొక సింహాసనముమీఁదఁ గూర్చున్న యొక రాజునకెదుట నిలువఁ బెట్టిరి. అతఁడు యమధర్మరాజు. నరకములోఁబడి యేడ్చు వారి కేకలను విన్నాను. అప్పుడు యముఁడు నన్నుఁజూచి దూతలతో "ఓరీ మూర్ఖులారా! మీరొకనిఁ దీసికొనిరమ్మనిపంపినవీనిని దీసికొని వచ్చినారేమి?" యని చెప్పి నన్ను గ్రిందికిఁ బఁడద్రోసెను. అప్పుడు మావాండ్రు నాశరీరము దీసికొని వెళ్ళుటకు సిద్ధముగా నుండఁగా నే బ్రతికినాను. ఏమో యాలాగున నీతఁడును బ్రతికిన బ్రతుక వచ్చును.

రాజ—ఏమివింతలండీ! ఎవరయిన నమ్మవద్దా?

వేంక—ఆశ్చర్య మేమున్నది? ఈపిల్లవాఁడు బ్రతుకఁడండి. రాత్రినాకలలో యమదూతలు మట్టిలాగులుదొడుగుకొని దుడ్డుకఱ్ఱలతోవచ్చిగుమ్మములో నిలుచుండి యెవరినో రమ్మనిపిలుచుచున్నారు. దూతదర్శనమైన నింక బ్రతుకుట యబద్ధము. నేననేకపర్యాయములు చూచినాను.

అని చెప్పినంత లోన విశ్వనాథశాస్త్రిలవా రీకలవరపాటంతయువిని లేచి రామచంద్రునకుఁ దటస్థమయిన యామహావిపత్తుకు విచారించి శరభరాజుగారితో నిట్లనిచెప్పెను.

విశ్వ—అయ్యా! రామచంద్రుఁడు మిక్కిలి బుద్ధిమంతుఁడు. ఆతని కీలాగున కాలము తప్పివచ్చినది. ఇన్నాళ్ళనుండియు మీరేతండ్రివలె సంరక్షణఁ జేయుచున్నారు. అతఁడు పిల్లవాఁ డయినను యోగ్యుఁడు. అవతలఁ బెట్టించుట భావ్యముగాదు.

వేంక—ఏమిటయ్యా! అంత జాలిగానున్నపక్షమున మీయింటఁబెట్టుకొండి. శ్రీరంగనీతు లెన్నియైనఁ జెప్పవచ్చును. మీయిల్లు కాకపోయినసరి.

అని పలుకుచున్న సమయమునందు శరభరాజుగారితల్లి వచ్చి వేంకటరత్నమును బిలిచి యతఁడును దానును దోడుపట్టి రామచంద్రుని మంచము పశువులపాకలోఁ బెట్టిరి. మిక్కిలి పరిశుద్ధమయినవాయువుగల శుభ్రమయిన చోట నుండవలసినరోగిని దీసికొనిపోయి, చుట్టును రొచ్చును దోమలు మొదలగు కీటకముల ధ్వనులును గడుపులోఁ బ్రేగులు తెగునట్లు వమనము గలుగఁజేయు పేడకంపునుగలయా పాకలోఁ బెట్టుచుండఁగా శరభరాజుగారు చూచియు స్త్రీలమాటకడ్డముచెప్పలేక, స్నేహితునికొఱకు విచారించుచున్న రాజగోపాలము నూరడించుచు విశ్వనాథ శాస్త్రులవారితో మాటలాడుచుండిరి. తరువాతఁ గృష్ణవేణమ్మ రామచంద్రుని యొద్దకుఁబోయి యాతనిస్థితిని జూచి విచారించి యాతనిసంగతిబట్టి యవి నిస్త్రాణలక్షణములు గాని మరణ చిహ్నములు గావని గ్రహించి, కొంచెము చిట్టుడుకునీళ్ళుపోసి నచో నది కుదురుననుకొని తనయభిప్రాయమును శరభరాజుగారితోఁ జెప్పెను. ఆయన దానికిష్టపడఁగాఁ దరువాతఁ జిట్టుడుకునీళ్ళు గిద్దెడు రామచంద్రున కామె లోపలఁబోసెను. అవిత్రాగిన నాలుగుగడియలకు రామచంద్రుఁడు కొంచెము తెల్విఁదెచ్చుకొని యొత్తిగిలిపండుకొనెను. తక్కినరాత్రియంతయు రామచంద్రునియొద్ద రాజగోపాలము పరుండవలెననుకొని యది తండ్రితోఁ జెప్పుచుండఁగా వినిముసలమ్మ యిట్లని చెప్పెను.

అన్న—ఓరీ! కుఱ్ఱవాఁడా! నీవక్కడ పడుకోకు. ఆసక జడుసుకొన్న పక్షమున దేవుళ్ళాడలేము. నీవు సావిట్లో పరుండు.

రాజ—అక్కడ పరున్న మాత్రముననే జడిసికొందునా? అంతభయము లేదు.

అన్న—చెప్పినమాట వినవేమి రా? వాఁడెవరు? నీవెవరవు? నీయమ్మవంక చుట్టమా? అబ్బవంకచుట్టమా?

రాజ—నీవు వెయ్యిచెప్పినను నేనువినను. నేనిక్కడనే పడుకొనెదను.

అని రాజగోపాలము చెప్పినమాటలకు మనసులో సణుగుకొనుచు నామెవెళ్లెను. అమిగిలిన రాత్రియంతయు వేంకటరత్నమును రాజగోపాలమును రామచంద్రునియొద్ద పశువులపాకలోఁ బరుండిరి. కాని దుర్వాసనచేతఁ గొంతసేపటికి రాజగోపాల మావలకు వెళ్లెను. అదివఱకు రామచంద్రుఁడుజబ్బుపడకమునుపు రాజగోపాలముయొక్క యుంగరమును దనవ్రేలను బెట్టుకొనెను. అది తీయకముందే రోగపీడితుఁడగుటచే నాయుంగర మతనిచేతనే యుండెను. రామచంద్రుఁడు గొంచెము కనుమూసి నీరసముచేఁ బరున్నపుడు పంగనామములఁ బెట్టుకొన్న యొకబ్రాహ్మణుఁ డాయుంగరమును మెల్లమెల్లఁగా లాగుచుండెను. రామచంద్రుఁ డులికిపడిలేచి నీరసముచేత మాటలు తిన్నగారానందున నక్షరములుస్పష్టముగాఁ దెలియకున్నను, హీనస్వరముతో నొకకేక వేసెను. పంచప్రాణములను స్నేహితునిమీఁదనె పెట్టుకొనియున్న గోపాల మామాటలు విని పరుగెత్తుకొనివచ్చి యేమని రామచంద్రు నడుగఁగా నతఁ డేదో గోపాలముయొక్క చెవిలోఁ జెప్పెను. ఆమాట నాలకించి గోపాలము మహాకోపముతో "ఏమయ్యా! వేంకటరత్నము! ఆతనిచేతి యుంగరము నీవెందుకు లాగినావు?" అనియడిగెను. వేంకటరత్నము మిక్కిలి కోపముతో నిట్లని చెప్పెను.

వేంక—ఏమిటయ్యా! జబ్బుచేత సంధించి చావునకు సిద్ధముగానున్నవానిమాటలు నమ్మి నన్నీ లాగున ననఁదగినమాట యనరాని మాట తెలియకుండ నిందించెదవా? ఆతఁడు చెప్పను నీవునమ్మనునా? బాగున్నది యెంతమాట.

రాజ—పంగనామములఁ బెట్టుకొన్న మనుష్యుఁడు లాగినాఁడఁట. నీవుగాక యింకెవరు?

వేంక—ఆ! ఈమాట బాగున్నది.కనులుమూసికొని మత్తుగా నతఁడు పరున్నప్పుడేమో యతనికి వేంకటేశ్వర్లువచ్చి ప్రత్యక్షమై యుంగరము లాగినట్లు భ్రమకలిగినది. వేంకటేశ్వరులు నిలువుబొట్టు దైవమేకదా! ఈతని కేదో మ్రొక్కున్నది. త్వరగా నాయుంగరము మీఁదుకట్టు. ఇది వేంకటాచలపతి మాహాత్మ్యమే

రాజగోపాల మామాటలు నమ్మి, వేంకటరత్నమునందు నిం దారోపణఁ జేసినందులకు నొచ్చుకొనుచు, రాత్రి యంతయుఁ గడపె నుగాని, యాపనిఁ జేసినవాఁడు మన వేంకటరత్న మేతప్ప మఱొకరు కారు. గోపాల ముంగరమును మీఁదుకట్టి జ్యోతిష్కులు వచ్చినపుడె ల్ల రామచంద్రుని నక్షత్రమును జెప్పి యతని కాదినముల యందు మరణ మున్నదేమో యని యడుగుచు, నిది నీచ మిదిఘనమనియెం చక సమస్తవిధములైన యుపచారములను జేయుచుండెను. ఆహాహా! స్నేహమెట్టిదో యోచింపుఁడు. ఇది జరిగిన నాలుగుదినములకు రామ చంద్రుని పినతండ్రి జగన్నాథ మమలాపురమున కేదో పనిమీఁద వచ్చి వేంకట రత్నముతో మాటలాడుచుఁ, దనయన్నకుమారుఁడు శరభరాజుగారియింట నున్నాఁ డనియుఁ, బ్రాణముమీఁదికి వచ్చిన దనియు విని యిట్లనియెను. "వేంకటరత్నముగారూ! వాఁడు మా యన్నకొడుకని చెప్పుకొనుటకు సిగ్గుగా నున్నది. నియోగులయింటఁ బుట్టి సాటివారి యింటఁ బొట్టకూటికుండి మాకవమానముఁదెచ్చినాఁ డు. వీఁడు పుట్టకపోయినను బ్రతికిపోదుము." అనిచెప్పి వెళ్ళిపోవు చుండఁగా వేంకటరత్న మతఁడుకూడ రామచంద్రుని ప్రవర్తనాదుల లోఁ దనయభిప్రాయముతో నెక్కీభవించినందులకు సంతసించుచు "మీ పిల్లవానికి జబ్బుగానున్నది. చూచిపొండి"యని చెప్పెను. జగన్నా థముగా రామాటవిని "వానికేమి భయములేదు. వాఁడు మనవంటి వారి నెందఱనో కడతేర్చికాని పోఁడు." అనిచెప్పి పశువులసాలలోని

కిఁబోయి రామచంద్రుని యెదుట నిలిచెను. అతనినిజూడఁగానే రామచంద్రుఁడు కన్నులనుండి గిఱ్ఱున నీళ్ళుతిరుగ మాటరాక, పక్కమీఁదఁ బినతండ్రిని గూర్చుండుమని సంజ్ఞఁజేసి యతఁడుకూర్చున్న పిమ్మట నాతని మెడమీఁదఁ జేతులువేసికొని కౌఁగిలించుకొని యిట్లనియెను.

రామ—"బాబూ! వచ్చినావా? నిన్నుఁజూడఁగనే మాబాబయ్యను మాయమ్మను జూచినట్లు పంచప్రాణములు లేచివచ్చినవి. నాకు రోగము గుదిరినదాఁక నాలుగుదినములు నీవిక్కడనుండు. నిన్నుజూడఁగనే నారోగము సగము కుదిరినది." అని చెప్పిన రామచంద్రునిమాట లతని ఆతిగుండెను భేదింపలేకున్నను సమీపమునను నున్న వారందఱికి జాలిబుట్టించెను. అంతట జగన్నాథమిట్లు చెప్పెను.

జగ—"నాకుండుటకుఁ దీరుబడిలేదు. ఇంకొకమాఱు వచ్చియుండెదను. నీకు వారే తల్లి. తండ్రి. నేను బోవుచున్నాను." అని చెప్పివెళ్ళిపోయెను. రోగముకొంచెము తిరుగుమొగమునకు రాఁగానేశరభరాజుగారు రామచంద్రుని మంచమును లోపలఁబెట్టించిరి. రామచంద్రునకుఁ గ్రమక్రమముగా నన్నియు హితమై, నల్లరక్తము పట్టి బలముచేర నారంభించెను. అతఁడు పూర్ణదార్ఢ్యవంతుఁ డగునప్పటికి రెండుమాసము లయ్యెను. ఆరోగ్యస్నానముఁ జేసిన తరువాత రామచంద్రుఁడు యథాప్రకారముగాఁ బాఠశాలకుఁ బోయి చదువుకొన నారంభించెను. ఇప్పటికి లక్ష్మీసహస్రమును, నైషధమును ముగించి యలంకారశాస్త్రము జదువఁదలంచి కువలయానంద మారంభించెను. కావ్యములయందేకాక వేదమునందుఁగూడఁ బరిశ్రమ చేయఁదలంచి విశ్వనాథశాస్త్రిలవారుచతుర్వేదవేత్తలుగనుక రామచంద్రుఁడాయన దగ్గఱ నమకచమకము లారంభించెను. ఈసంగతి వేంకటరత్నమునకుఁ

దెలిసి యొకనాఁడు ప్రసంగవశమున నతఁడీ ప్రకారముగా మాటలాడ నారంభించెను.

వేం—ఏమోయి! నీవుకూడ నమక చమకములు చెప్పుకొను చున్నావా యేమి?

రామ—ఆ! మొన్నవిదియనాఁ డారంభముచేసినాను.

వేంక—సరిసరి బాగుగాఁ జేసినావు. కొంచెము పెద్దవాండ్ర మున్నాముగదా! మాతో నాలోచనఁజేయఁగూడదా? మన కేమిటి, వేదమేమిటి? అదిబ్రాహ్మణులకుఁ జెల్లినది. మనని యోగులకుఁదగదు

రామ—నియోగులుమాత్రముబ్రాహ్మణులుగారా? మనము వేదములు చదువుకొనఁగూడదని యెక్కడనున్నది? అందఱము బ్రాహ్మణులమే.

వేంక—నీకుఁ దెలియను దెలియదు. ఒకరుచెప్పిన వినవువినవు. పొత్తరలుపట్టి సంభావనకు వెళ్లువారు బ్రాహ్మణులు. మనము కరణాలము. బ్రాహ్మణుల మగుదుమా? కుఱ్ఱవాఁడవు. నీవిటువంటి తెలివితక్కువమాట లాడఁబోకు. మనవాండ్రువిన్న తప్పుపట్టుకొందురు.

రామ—నియోగులకు వైదికులకు వేదోక్తకర్మ సమానమే కదా. ఆచారభేదములేకాని శాస్త్రభేద మేమున్నది?

వేంక—మీసములను బెంచుకొని లౌకికవ్యవహారములుచేయుచు వ్రాఁతకోఁతలు చేతనైనవారు నియోగులు. మన కేమి మహారాజులము. మనయిండ్లలోఁబురోహితులుగానుండి ప్రొద్దునస్నానము జేసి బిళ్ళగోచులను బెట్టుకొనవలసిన వాండ్రును నిత్యకర్మలు చేయవలసినవాండ్రును బ్రాహ్మణులు. వారి మంత్రములు మనమునేర్చుకొనఁగూడదు. ఇంతేకాక నియోగులకు స్వరముగాదు. అపస్వరము నెత్తినణఁచును.

రామ—వైదికులనియా బ్రాహ్మణుల కర్థము. వేదమును జదువుకొన్నమాత్రమున మన నియోగమునకు భంగములేదు. మీ సము లెవ్వరును బెంపఁగూడదు. మనము పెంచవచ్చునని ధర్మ శాస్త్రములో లేదు.

వేంక.—నీదగ్గఱ నేనీసంగతిఁ జెప్పినపక్షమున నీవు నమ్మవు. నీకు మనవాళ్ళసాంప్రదాయములు దెలియవు. మఱియెవరినైన నడుగు. తద్దినపుమంత్రము చదువుకొనవలెనని దిక్కుమాలినబుద్ధిపుట్టిన దేమి? ఇంక దేవతార్చనమంత్రములుకూడ నేర్చుకో. మనచేతికిందబ్రతుకు వైదికులకును, మనకును సహపత్యమా? నీయిష్టము; వింటే విను! లేక పోయిన మాను. నీక్షేమముకొఱకే చెప్పినాను.

అని బ్రాహ్మణులకర్థము వేదాదివిద్యాభ్యాసము జేయువారని యు, నియోగులను బ్రాహ్మణు లనఁగూడదనియు, మూర్ఖమైనయభి ప్రాయముతో నన్ను వేంకటరత్నముయొక్క మనస్సునకు వాదమూ లమున యథార్థస్థితినిఁ దెలుపవలెనని రామచంద్రుఁడు ప్రయత్నము చేసినాఁడుగాని, బుద్ధిహీనులలోఁ జక్రవర్తియగు వేంకటరత్నముముం దట నితని వాదము పనికిరాదయ్యెను. ఇప్పటికిని ననేకనియోగులుత మ్మెవ్వరైన బ్రాహ్మణులన్నప్పుడు, కరణమువలన నందుకుఁగోపించి యది నిందాస్పదమనియెంచి, వారితోఁ గయ్యమునకు డీకొందురు. అంతేకాక యాచారసంపత్తి లేని నియోగులవిషయమైమాటలాడుచు వైదికులు "వారికేమి నియోగప్రభువులు. ఈమంత్రములు వారికెం దుకు?" అని చెప్పుచుందురు. సాహిత్యమునకుఁ దోడు సంగీతమును దానికిఁదోడు వేదమునురామచంద్రుఁడు నేర్చుకొనుచుండెను. ఇట్లుండఁ గొన్నాళ్ళకు శరభరాజుగారి రెండవకుమారుఁడగు నరసింహమునకున క్షరాభ్యాసముఁ జేసిచదువవేసిరి. ఆదినమునగ్రామమునందందఱినిభో జనమునకుఁ బిలిపించిరి. నాఁడు వేంకటరత్నముగాని సొంతమేళమేను

క్కడగానవినోదమును జరిగించినది. కనుక నాయనయానందముమిత మునెఱుఁగదు. అక్షరాభ్యాసమైనవెనుక నాగ్రామమందున్న తెనుఁగు బడికతనిఁబంపి యలవాటైనదాఁకఁ బిల్లవానితోఁగూడ రామచంద్రుని వెళ్లుమని శరభరాజుగారుపంపుచువచ్చిరి. ఆగ్రామమునందిదితప్ప వేఱు పాఠశాలలు లేవు. రమారమి డెబ్బదిసంవత్సరములు వయసుగలయాబడిపంతులు పూర్వముపెద్దాపురపుసత్రమునందుఁ బద్దులువ్రాయుటకుఁ గుదిరి, యక్కడ దొంగలెక్కలు వ్రాసినందునఁదరుమఁబడి, పిమ్మట ముక్తేశ్వరగ్రామమునం దొకరియింట దేవతార్చనబ్రాహ్మణుఁడుగా బ్రవేశించి యక్కడ నొక ముండనుంచుకొన్నందులకై వారు పొమ్మనగాఁ బిమ్మట పలివెలగ్రామమువెళ్ళి యక్కడ పరులకుపకారము జేయుటకు వైద్యమునారంభించెను. ఆయూరిప్రజలట్టిమహానుభావుండు వైద్యముఁ జేయుచుండఁగానది వియోగపఱచుకొనఁజాలక యెవరు నతనియొద్ద మందుపుచ్చుకొననందుననారందఱిమీఁదఁ గోపమువచ్చి చెప్పకుండ నాగ్రామమువదలి యమలాపురమువచ్చి వృత్తులన్నిటిలో సౌఖ్యకరమయినదియుపాధ్యాయత్వమేయని బాలురను బాగుచేయుట కతఁడు బడియొక్కటిపెట్టెను. అమలాపురమునం దాబడికరణముగారి వీధియరఁగులమీఁద నుంచఁబడెను. బడిస్థాపింపఁబడినపు డందుఁజేరిన వారు మఱిసంవత్సరమునకుఁగూడ నాపుస్తకమే చదువుచుండిరి. చదువుచెప్పెడుదినములు తక్కువయు సెలవుదినము లెక్కువయుగ నుండెను. పిల్లలాటవిడుపుడబ్బు లెన్నిపర్యాయములు తెత్తురోయన్ని సెలవులుండును గనుక సెలవుల నిర్ణయము డబ్బులనుబట్టిగాని పంఁగులను బట్టికాదు. రామచంద్రుఁ డొకనాఁడు నరసింహమును దీసికొనిబడికిఁ బోయెను. ఆపాఠశాల యమలోకమును, జదువవచ్చిన బాలురు నరకమనుభవింపవచ్చిన పాపకర్ములును బంతు లొకయమధర్మరాజునుగా నుండెను. రామచంద్రుఁడునరసింహమునుదీసికొనివెళ్ళికూర్చుండఁగా

నేకొందఱు బాలురు వీఁపులమీఁదఁ జదరలు వేసికొని, కట్టుపలకలను జొన్నకలములను, దాటియాకుపుస్తకములను, గంటములను బట్టుకొని కొందఱు గోణములను గట్టుకొనియుఁ గొందఱులాగులఁదొడుగుకొని యుఁ, గొందఱుమీఁద రుమాళ్లు వేసికొనియుబడికివచ్చి చదరలుక్రింద పఱచుకొని కూర్చుండిరి. ఏడెనిమిదిచింతబరికెలను రెండుప్రక్కలఁబెట్టుకొని యొక నున్నని బొబ్బిలిపొడుముకాయ నెడమచేత నుంచుకొని వార్ధకదశచేతరక్తమాంసహీనమగు తనశరీర మెముకలప్రోగువలెఁజూచినవారికి భయముగలుగఁజేయుచుండఁ గేక నేదైనవిన్నపుడులికిపడి లేచుచుఁ బంతులొకస్తంభమునకుఁజేరగిలఁబడి యొకచిరుఁగుగోనెగుడ్డమీఁదఁగూర్చుండికునికిపాట్లుపడుచుండెను. కొందఱునేలమీఁదఁద్రవ్వినగుంటయోనమాలను దిద్దుచుండిరి. పంతులు బాలరామాయణమునందొకశ్లోకమునుజెప్పఁగా నదిబాలురకునోటఁబట్టనందున మహాకోపముపచ్చి యతఁడు శ్లోకములోనున్న యక్షరమునకొకదెబ్బచొప్పునఁ గొట్టిపిల్లలవీపుమీఁదఁజింతాకంతయెడమైనను లేకుండ దెబ్బలతోనింపి, దానితోఁదృప్తినొందకకొందఱినిగోడకుర్చీలువేయించిమఱికొందఱాటవిడుపుడబ్బులఁ దేనందున మొట్టికాయలతోను, జెంపకాయలతోను, దొడపాశములతోను, వారినిజేతనైనంతశిక్షచేసి, చెయ్యినొప్పిపెట్టినతరువాత నెండలోనిలువఁబెట్టి, కొంతసేపుకొందఱినినూఱుగుంజీలు దీయించి విసిగి యూరకుండెను. ఇంతలోనొకపెద్దధ్వనివారందఱకువినఁబడెను. అపుడు నలుగురుపిల్లలొకపిల్లవానినిగాళ్ళిద్దఱును జేతులిద్దఱునుబట్టి తీసికొనివచ్చుచుండిరి. ఆబాలుఁడు గాళ్ళతోఁదన్నుచుఁ జేతులకందినవాని రక్కుచు, నోటికిదొరికినవానినిగఱచుచు, మధ్యమధ్య "ఆమ్మో! నాయనో! చచ్చినానురో వద్దురో" యని యెలుఁగెత్తియేడ్చుచు దండములుపెట్టుచుఁజూచినవారి కందఱకును మహావిస్మయమును గలిగించుచుండెను. అతఁడు బడికిరానందునఁబంతులవారు పం

పినపిల్లలతనిని మోసికొనివచ్చుచుండిరి. గ్రామదేవతగుడికిఁ దీసికొని పోఁబడుమేఁకపిల్లవలెనే యాబాలుఁడు యమకింకరులవంటియానలుగు రుపిల్లలచేతఁ బంతులవారియెదుట నిలువఁబెట్టఁబడఁగానతఁడుకోదండ ము దీయించుమని యాజ్ఞాపించెను. వెంటనే యానలువురునిదివఱకే యొకదూలమునకు వేయఁబడినజనుపనారత్రాళ్లనుదగ్గఱ కతనినిదీసికొని పోయి నరహత్యఁ జేసిన వారిని నురిస్తంభమునెక్కించునట్లుత్రాడును బట్టుకొనునట్లుజేసి, క్రింద గంటములఁ బాతిపెట్టి తాటియాకుల మం టవేసి కాళ్ళుక్రిందఁ బెట్టకుండఁ జేసిరి. ఆలోపుగాఁ బంతులవారుబె త్తమును బుచ్చుకొని చేయవలసిన పనినంతనుజేసి, నరసింహావతార మువలె శాంతినొందక బడిలోనున్న బాలుర నందఱినిబక్షింపతములే కుండఁజావఁగొట్టెను. అందులో నొకపిల్లవాఁడు "అయ్యా! నేనల్లరిఁ జేయకుండఁగూర్చున్నాను. నన్నెందుకుఁ గొట్టినారండి" యని య డుగఁగాఁ బంతులు "వెధవా! ఆనక నీవుమాత్ర మల్లరిచేయవా? అప్పుడు నీకోసర మింకొకపర్యాయము పని చెఱచుకొని యెవరు రాఁగలరు? అందుకని పనిలోఁబని యిప్పుడే కొట్టినాను." అని మరలఁ గొట్టెను. ఈచిత్రవధ జరుగుటచే బాలురందఱొకమా రింటి మీఁదిపెంకు లెగిరిపోవునట్లు గొల్లున గోలెత్తిరి. వెయ్యేల! దొం గతనము మొదలయిన క్రూరకృత్యములను జేయుమహాద్రోహులను గూడఁజెఱసాలకంపక యీబడికిఁబంపిన నేరములు వారెన్నఁడును జేయరు. ఈబడికివచ్చిన తరువాత నేపిల్లవాఁడును బుస్తకము పట్టి యెఱుఁగఁడు కనుక పంతులవారి కావిధమైన పంచెలచా పెన్నఁడును జన్మమధ్యమున దొరకనేలేదు. ఈవిధముగానున్న యాపాఠశాల వైఖరియంతయుఁజూచి రామచంద్రుఁ డాశ్చర్యమునొందెను. నరసిం హమును నోటివెంట మాటలేక నిశ్చేష్టుఁడయ్యెను. కోదండమెక్కిన యాపిల్లవాఁడును, గొంతసేపటికి దేహము తెలియక క్రిందఁబడఁగాఁ

జప్పున పంతులు చల్లనినీరు తెచ్చి మొగమునఁగొట్టి, చెవులుమూసి, మంచితీర్థము దాహమిచ్చి చావఁగొట్టి చెవులుమూసె ననుసామెతను సార్థకముచేసెను. తలిదండ్రుల కీసంగతిఁ దెలియనీయవద్దని పంతులవా రధికారమంతయు మాని బాలుని బ్రతిమాల నారంభించిరి. ఆపిల్లవానిని శిక్షించునప్పటి కోపముకంటెఁ బదిరె ట్లెక్కువగాను న్న యాముసలిబ్రాహ్మణునితోందర చూచితీరవలెను. చెప్ప నలవికాదు. పంతులుగారికిఁ బొగాకును, బండ్లును, మజ్జిగ దాహ మును దెచ్చిపెట్టు బాలులందఱు దెబ్బలు తక్కువదినుచు నాయన దయకుఁ బాత్రులగుదురు. రామచంద్రుఁ డింటికి వెళ్లినతరువాత మన నరసింహము నీపాఠశాల కంపుటవలన నుపయోగము లేదని చెప్పెనుగాని శరభరాజుగా రామాటను వినుపించుకొనలేదు. ఈదారుణమైన శిక్షలఁజూచి నరసింహము బడికి వెళ్ళవలసినప్పుడు కడుపు నొప్పివచ్చిన దనిచెప్పి బడిమానుచు, నాలాగునఁజేయుటకు వీలులేనపుడు చల్లియద్నిముతిని బడికిఁబోవుదుననిచెప్పి యెక్కడికోపోయి, యీ సంగతి తెలిసినపక్షమున తమవారుగోపింతురని యింటికిరాక, యన్న వస్త్రములులేక యెండలపాలై తిరుగుచుఁ, దల్లిదండ్రులు వెదకునపుడేదొడ్డిలోనో తోఁటలోనోకనఁబడుచుఁదనప్రాణమునకుఁగూడభయము కల్గునేమోయని తలిదండ్రులకుఁ దోఁచునట్లునడచుచుండెను. ఒకానొకదినమున రామచంద్రుఁడు పంతులవారితో నిట్లు ప్రశంసించెను.

రామ—అయ్యా! పంతులుగారూ! మీరీలాగునఁగొట్టినపక్షమున పిల్లలు రారండి. పిల్లలమీఁద నింతకంటెఁ గొంచెముదయగా నుండవలెను.

పంతు—నాకంటెఁ బిల్లలమీఁద నింకాదయగా నెవ్వ రుండఁగలరయ్యా? నేనెప్పుడైనఁ గొంచెము బెత్తముతో బెదిరించి యొక ముక్క చెప్పుతానుగాని గట్టిగాఁగొట్టను. అయినను "దండందశగుణం

భవేత్" అని శాస్త్రమున్నది. ఎంతకొడితే యంత మంచిది. దెబ్బ దేవేంద్రలోకము.

రామ.—అంతచేటు కొట్టఁగూడదు? చక్కఁగా బోధించి పాఠములు చెప్పవలయును.

పం.—ఏమి బోధించనండి! ఉత్తబండముండాకొడుకులు. ఎన్ని పర్యాయములు చెప్పినను ముక్క రాదు. మాచిన్నతనములో మేము చదువుకొన్న సంగతులు కథలు విన్నపక్షమున మీరేమందురో. పంతులుపేరు చెప్పిన గడగడవణఁకి లోపలికిఁ బారిపోయేవారము. నేను కొట్టుదెబ్బ లొకదెబ్బలా?

రామ.—మా నరసింహ మేమయినఁ జదువుకొనుచున్నాఁడా?

పంతు.—నరసింహమున కేమి? మహారాజు. అతనికిఁ జదువెందుకు? పిల్లవాఁడు మిక్కిలి బుద్ధిమంతుఁడు. ఆటవిడుపుడబ్బు లెప్పటి వప్పు డిచ్చివేయును. ఎన్నఁడు నాలస్యము సేయఁడు.

రామ.—అతనికి నాలుగు నెలలక్రిందట నక్షరాభ్యాసమయినదికదా? ఇప్పటి కోనమాలయిన రాలేదేమి?

పంతు.—తొందరేమిటి! చదువురాకపోతే మిగిలిపోయిన దేమిటి? అన్నమునకు లోపమా? వస్త్రమునకులోపమా? ఎవ్వఁడో కూడుగుడ్డలేని నిర్భాగ్యునకుఁగాని హాయిగా జరుగువానికిఁజదువెందుకు?

రామ.—చదు వందఱికిని గావలయును? విద్యలేనివాఁ డెంత ద్రవ్యవంతుఁ డయినను గౌరవింపఁబడఁడు. విద్యవంటి దొకటిలేదు.

విద్యావిహీనులగు మూర్ఖులు విద్యాభ్యాసమువలన మహోపయోగము లెఱుఁగక భాగ్యవంతులు చదువుకొన నక్కఱలేదనియు, నుద్యోగములఁ జేయఁదలఁచినవారే చదువుకొనవలెననియుఁ జెప్పుచుందురు. ఆబడికిఁ బోవుటవలన నరసింహమున కభివృద్ధి కనఁబడ

నందున రామచంద్రుఁ డింటివద్ద గూడఁ దగుశ్రద్ధతోఁ బాఠములను జెప్పుచుండెను.

ఐదవ ప్రకరణము.

ఈప్రకారముగ రామచంద్రుఁడు శరభరాజుగారి జ్యేష్ఠకుమారునకు సహాధ్యాయుఁడై రెండవకుమారునకు గురువై యందఱకును దలలో నాలుకవలె మెలఁగుచుండెను. శరభరాజుగారికుమార్తెయగు పార్వతి కిప్పటికిఁ దొమ్మిది సంవత్సరములు దాఁటి పదవయేఁడు ప్రవేశించెను. వివాహము చేయవలయునని శరభరాజుగారు సంబంధములనిమిత్తము వెదకుచుండిరి కాని తగిన సంబంధము దొరకదయ్యెను. అదివఱకు వచ్చిన సంబంధములలోఁ బిల్లవానికి భూస్వాస్థ్యము ద్రవ్యసంపత్తియుఁ గలిగియున్నయెడల విద్యాగంధములేదు. విద్యగలవారికి ద్రవ్యములేదు. శరభరాజుగారితల్లికి విద్యలేకపోయినను ద్రవ్యవంతున కీయవలెనని యున్నది. కృష్ణవేణమ్మకు విద్యాధనసంపత్తులు రెండునుగలవాఁడే కావలెననియున్నది. శరభరాజుగారి యాలోచనయు రాజగోపాలముయొక్క యాలోచనయు నీవిధముగా లేదు. ద్రవ్యవంతుఁడుగాకున్నను విద్యయుసౌందర్యమునుగలవానికీయవలెనని వారి కభిప్రాయమున్నట్లు వా రప్పుడప్పుడుమాట్లాడుచున్న మాటలనుబట్టి కృష్ణవేణమ్మ దెలిసికొనెను. రాజగోపాలము, పార్వతి కింటివద్ద చదువుఁ జెప్పుచుండుటచేత నానాఁటికి బాలిక చదువను వ్రాయనునేర్చి శుక్లపక్షచంద్రునివలె వృద్ధినొందుచున్నందున విద్యావిశారదుఁ డగువానికిచ్చి పెండ్లిచేయుట యావశ్యకమయ్యెను. ఇట్లుండ రామచంద్రుఁ డొకనాఁడు రాజగోపాలముతోఁ గూడ సా

యంకాలమున దేవాలయమునుండి యింటికి వచ్చుచుండఁగా నొక బ్రాహ్మణుఁడు కనఁబడి రామచంద్రునిజూచి "నాయనా! రామచంద్రుఁడవు నీవేనా?" అని యడిగెను.

రామ—అవును నేనే. ఏమండీ మీదేయూరు?

బ్రాహ్మ—మాది రాజవోలు. మీరింక నిక్కడనే యున్నారా?

రామ—(భయముతో) ఆలాగనుచున్నారేమి? రాజవోలులో మామామయ్య పిల్లలు బాగున్నారా?

బ్రాహ్మ—ఇంకను నీకుఁ దెలియదా? మీ మేనమామగారు మొన్న రాత్రి తెల్లవారుజామున లోకాంతరగతులయినారు. ఆదుఃఖముఁ బట్టఁజాలక మీమేనత్త కూడ నూతిలో దిగినదికాని వెంటనే దగ్గఉనున్నవారు దిగి యామెను దీసినారు. అకస్మికమరణ మగుట చేత నెక్కడ నేమేమియాస్తియున్నదో చెప్పలేదు. మరిడిజాడ్యము వచ్చిపోయెను.

రాజ—అయ్యో! మేనమామగారే! మొన్నమధ్యాహ్నము రాజవోలునుండి వచ్చినరాజు మీమామనుజూచి వచ్చినానని చెప్పలేదఁటోయి రామచంద్రుఁడు!

బ్రాహ్మ—రాత్రి పాముగఱచి చచ్చిపోయినాఁడు. అన్నట్లు మఱచిపోయినాను మరిడిజాడ్యము వచ్చిందండో.

రామచంద్రుఁ డామాట వినఁగానే నేలఁజదికిలఁబడి మాటరాక చెప్పరాని దుఃఖముతో వాపోవుచుండెను.

రాజ—మీపేరేమండీ! మీకాపురము రాజవోలేనా?

బ్రాహ్మ—నాపేరు కర్రి రామయ్య. ఇందులో మీకను మానమెందుకు? మాది రాజవోలే కాపురము. నేను దహనమైన

దాఁక దగ్గఱనుండి వచ్చినాను. నేను ముక్తేశ్వర మీరాత్రి వెళ్ళవలెను. అనిచెప్పి వెళ్ళిపోయెను.

నడచుటకైన సత్వము లేకయున్న రామచంద్రునిచేయిఁ బట్టుకొని మధ్యమధ్య నూరడించుచు రాజగోపాల మింటికిఁ దీసికొనిపోయి తలిదండ్రుల కావార్త నెఱింగించెను. వారందఱుఁగూడ రామచంద్రునిస్థితికి విచారించిరి. రామచంద్రుఁడు సావడి మీఁద బోరగిలఁ బండుకొని కంటికి నేలకు నేకధారగా నేడ్చుచు మధ్య మధ్య మేనమామ గుణములను రాజగోపాలమునకు శరభరాజుగారికి నీప్రకారముగాఁ జెప్పుచు వచ్చెను. "అయ్యా! నాచిన్నతనమునందే మాతండ్రి చనిపోయెను. ఆయన పోయినతరువాత మాపినతండ్రి నాయావదాస్తిఁ దన స్వాధీనము జేసికొని యింటికిఁ దాళమువేసి మాతల్లిని నన్ను లేవఁగొట్టెను. అప్పటినుండియు మామేనమామ దనకుమారునివలెనే నన్నాదరించుచు నాతల్లిని నన్ను సంరక్షించెను. ఆయన నేనడిగిన దెల్ల నిచ్చి మాతండ్రి పోయినలోపము లేకుండఁ జేసెను. మాతల్లి యింతలోఁ జనిపోయినది. మంచివాఁడగుటచే మామామకు ఋణముకూడ హెచ్చినందున నాయనకు భారము కలుగఁజేయఁగూడదని నేనిటు వచ్చినాను. నాకర్మమెప్పుడు నీలాగుననే యున్నది. తల్లిని దండ్రిని జిన్నతనమునందే దిగమింగినందుకు నాక్షేమముగోరు బంధువుఁడు మామేనమామ యొక్కఁడే యనుకొన్నాను. అతనికినాకుఁగూడ ఋణశాసము నేఁటితోఁదీరిపోయినది." అనిచెప్పియేడ్చుచుండఁగాశరభరాజుగారు రామచంద్రునితో "నాయనా నీవిప్పుడు రాజవోలు వెళ్ళవలెనా? ఆలాగైన పక్షమున రేపుదయమున మనుష్యుని సహాయమిచ్చి పంపుతాను వెళ్ళవచ్చును." అని చెప్పఁగానే రామచంద్రుఁడు వెళ్ళుట కిష్టపడెను. ఇంతలో వేంకటరత్నము వచ్చి సంగతి యంతయు విని మైలవాఁడవు చావడిలోఁ

గూర్చున్నా వేమని యతనినిగూకలువేసి యావలఁగూర్చుండఁబెట్టెను. అప్పుడు శరభరాజుగారితల్లి వచ్చి మైలవార్తవినఁగానే స్నానముఁజేయవలెను గనుక రెండుబిందెలు చల్లనినీరు దెచ్చి దుఃఖభారముచేత శరీరమెఱుఁగక యున్న రామచంద్రునిమీఁదఁబోసి స్నానముచేయించెను. భోజనముఁజేయుమని యింటనున్నవారందఱు బలవంతపెట్టినందున పక్షిణికనుక వాకిట విస్తరి వేయించుకొని కొంచె మెంగిలిపడి యతఁడు లేచిపోయెను.

తెల్ల వాఱినదాఁకఁ గంటిమీఁద నొక్కమాఱయినను గునుకులేక విలపించుచు రామచంద్రుఁడు కోడిగూయఁగానే రాజగోపాలమునులేపి తనకు మనుష్యుఁ డక్కఱలేదనియుఁ దాను మార్గమంతయు నెఱుఁగుదు ననియుఁ జెప్పి యతనియొద్ద కొంచెము లెక్కపుచ్చుకొని దొడ్డవరము వెళ్ళి మధ్యాహ్న మక్కడ భోజనముచేసి కొంచెము చల్లబడిన తరువాత గోదావరిని దాఁటుటకు వెళ్ళెను. అప్పుడు గోదావరి జ్యేష్ఠమాసమగుటచే విస్తారభాగ మెండిపోయి తాను ధవిలేశ్వరము దగ్గఱ నీప్రకారముగనే పాయలయితినని తెలియఁజేయుటకో యనునట్లు చిన్న చిన్న చీలికలయ్యెను. కాలము మాఱిపోయినప్పుడు గొప్పవానికి నైనఁ దిప్పలు గలుగుట సత్యమని తెలుపుటకుఁ గాఁబోలు నడుమ నిసుకతిప్పలు గలవు. ఈపాయలన్నిటి యందును జివరపాయ మిక్కిలి వెడల్పు గలదై యున్నది కాని తక్కిన వన్నియుఁ బేరునకు మాత్రము నీరుగల్గి మనుష్యులు చులకనగా నడచి పోవుటకుఁ బాటిరేవులు పడియుండెను. మెత్తని మనస్సుగలవారి నేమన్నను నీప్రకారముగనే నాటునని తెలియఁజేయుటకోయనున ట్లగులువేయఁగానే దించుకొనిపోవుచున్న యిసుకతిప్పలనుండి మూటలు దలమీఁదఁ బెట్టుకొని పాటిరేవులదాఁటి చివరపాయదాటవలెనని రేవుపడవనెక్కుట కనేకమార్గస్థులు బోవుచుండిరి.

వారితోఁగూడ రామచంద్రుఁడు పోవుచుఁ బూర్వకాలమునందు వఱదలువచ్చి యిద్దరద్దరులకు నీరు దాసినపుడు దేరిచూడనైనఁజాలని బాలకులుగూడ నేఁడు సునాయాసముగ దాఁటుచున్న యామహానది యొక్క శుష్కస్థితినిజూచి తనతండ్రిగారు సజీవులగునపుడు దన్ననిగౌరవముతో నాదరించినవారును, దనతో మాటలాడుట కనర్హమైనవారును నేఁడు తన్నవమానపఱచుచున్నందునఁ దన దీనావస్థ జ్ఞాపకము వచ్చి కొంచెము విచారించి యూరకుండెను. ఆవచ్చిన జనులలో ముక్తేశ్వరగ్రామవాస్తవ్యుఁడగు నొకబ్రాహ్మణుఁడుండెను. అతఁడులక్షాధికారియని చుట్టుప్రక్కలనున్న యాజనులందఱుఁ జెప్పిరి కాని యతఁడు కట్టుకొన్న జేవురుపంచెను, మీఁదనున్న మాసినచిరుఁగుల యుత్తరీయముఁ జేతిలోనున్న పెద్దమూటనుజూచి రామచంద్రుఁడు భిక్షాధికారిగనుండఁదగిన యామహాలోభియొక్క సంపద కాశ్చర్యపడెను. మూట దెచ్చిపెట్టుట కొక్క చాకలినైన నతఁడు దెచ్చుకొనలేదు. వారందఱు నీటియొడ్డుననుండఁగా నింతలోఁ బడవ యద్దరినుండి రాగాఁ బడవవాండ్రదివఱ కచ్చట గుట్ట వేయఁబడియున్న చింతపండుకంట్లములను బడవ పడిచెక్కవఱకును మునుఁగునట్లు వేసిరి. పడవ పూటము కాఁగానే తెఱచాపఁ ద్రోక్కి పడవవాండ్రు దానిని నడపఁ జొచ్చిరి. పడవ నడచినకొలఁది దానితోఁ గదలి నడచి వచ్చుచున్నట్లున్న గట్టుమీఁది వృక్షములును లంకలో మేసి గోదావరియందు నీరు త్రాగుచున్న పశువులును లంకలయందుఁ గాఁపులువెట్టిన పుచ్చ, దోస, గుమ్మడి మొదలగు పచ్చని పాదులును "అత్యుచ్ఛ్రయః పతనహేతు" వను నీతిని దెలియఁజేయుటకో యన మొదట నుత్తుంగముగా లేచి తుదకు పడిపోవుచున్న కెరటములును నదిమీఁదనుండి వచ్చుచున్న మలయమారుతమును రామచంద్రునిదుఃఖమును గొంత పోఁగొట్టెను. తప్పత్రాగి స్మారకముఁ దెలియకుండ నున్న యాముగ్గురు పడవవాండ్రిలో

నొకఁడు గూర్చుండి కునుకుపాట్లుపడుచుఁ జుక్కాని బట్టుచుండెను. తక్కిన యిద్దఱును బడవలో మర్యాదగలస్త్రీలు గూర్చున్నను,సందే హములేక నోట నుచ్చరింపరాని బండబూతులుగల కీర్తనలను బాడు చుండిరి. కొంతదూరము పడవ నడవగానే సరంగు డబ్బులునుబుచ్చు కొనుటకువచ్చెను. పాప మొకకాపువానిదగ్గఱ మొదట నాల్గుడబ్బు లను బుచ్చుకొనుటకు నొప్పుకొని సగమునదిని దాఁటిన తరువాత నా ఱుడబ్బులను బుచ్చుకొందుననియు, నట్లియ్యని యెడల మధ్యనొక తి ప్పమీఁద దిగుమనియు నతఁడు బాధపెట్ట నారంభించెను. ఆతనిదగ్గఱ సొమ్ముపుచ్చుకొని సరంగురెండవవాని దగ్గఱకుఁబోయి యడిగెను. ఆతఁడు "నేను రేవుదగ్గఱ పడవయజమానుని కిచ్చినాను. అతఁడు నీ తోఁ జెప్పలేదా"? అని యడుగగానే సరంగు కోపముతో "నాకీసం గతి పనికిరాదు.డబ్బులియ్యఁగలిగిన నియ్యి,లేనిచో దిగిపో." అని చె ప్పి మొదట పడవయజమానుఁడు డబ్బులు పుచ్చుకొన్న సంగతిఁదా నెఱిఁగియుఁ దిరిగి సొమ్ముపుచ్చుకొనెను. ఇట్లుపడిచెక్కవఱకును బూ టమైన పడవ దైవవశముచేత సుడిగాలికి వశమయ్యెను. రామచం ద్రుఁడు దనకు దాహమగుటచే ముక్తేశ్వరగ్రామనివాసుని దగ్గఱను న్నచెం బొకమారడిగెను. అతఁడు మహాకోపముతో "మైలవాఁడవు. నీకు బ్రాహ్మణులమీ చెంబేలాగున నియ్యగలము." అని చెప్పెను. తరువాత నెండబాధచే రామచంద్రుఁడాబ్రాహ్మణునియొద్ద కూర్చుం డుటకు రాగా నతఁడు కోపముతో "ముట్టుకొంటావుకళ్ళు కనఁబడవూ! యెవరనుకొన్నావు." అనికోపపడి వానిని లేవఁగొట్టెను. అప్పుడు సు డిగాలితో గాలిదుమారమువచ్చి భూమ్యాకాశమధ్య మంతయు నొక యిసుక తెరలోనింపి పడవ కషాయమును గలుగఁజేయునట్లు చేసెను. ఆసమయ మిట్లుండెను.

మ. నటదుత్తుంగతరంగసంఘ మలరన్ బాత్రౌఘమై రంగ ము
ద్భట గోదావరి గాఁగ; భూగగనమధ్యవ్యాప్తధూళివ్రజం
బట నేపథ్యముగాఁగ; రౌద్రరసదృశ్యద్గ్రంథ మాడించెడున్
బటుజంఝూనిలసూత్రధారుఁడు మహాపాండిత్య మేపారఁగన్.

కెరటములు మహోత్తుంగముగ లేచి పడవ పగులునట్లు కొట్టుచుం డెను. దోనె యిటునటు నొరఁగుచుఁ గొంచెము కొంచెము నీరువోసి కొననారంభించెను. పడవలో స్త్రీలు, బాలురు, వృద్ధులు, నల్లకల్లోలముగా ధ్వనిఁ జేయుచు సరంగును దెఱచాప దింపుమని ప్రార్థించిరి కాని, యతఁడు భయము లేదనియుఁ ద్వరగా దింపుదుననియుఁజెప్పెను. ఒకపర్యాయము నదికి వంగివంగి నమస్కారము చేయుచున్నదో యనునట్లుదోనె మిక్కిలి యొరుగఁగా నందఱునుబెద్దపెట్టున గోలపెట్టి యేడ్చిరి. పడవమునుఁగక మానదని యందఱకును దోఁచెను. ఆ సమయమందుఁ దల్లులను గౌఁగిలించుకొని యేడ్చుబిడ్డలును బిడ్డలను జూచియేడ్చుతల్లులును, బడవవాండ్రనుగట్టిగాఁదిట్టికొట్టఁబోవువారును, నారాయణ నారాయణయని ధ్యానముసేయువారును, గంగాస్తవము బఠించువారును, గొజ్జరికాయలు, పసుపు, కుంకుమ, చీరెలు,గంగకు సమర్పించువారును, దేవతలకు మ్రొక్కువారును జేయుధ్వనులునుప్రతిధ్వనులిచ్చుచుండెను. అసమయమందుము క్తేశ్వరబ్రాహ్మణుఁడు రామచంద్రునియొద్దకువచ్చి యతని కేమైనఁగొంచెమీఁతవచ్చునేమోయని యడిగెను. రామచంద్రుఁ డూరకుండెనుగాని యతనిశాంతమునుమనస్థిమితమునుజూచి యీఁతవచ్చుననియూహించియాబ్రాహ్మణుఁడు రామచంద్రుని గడ్డమునుగాళ్ళును, జేతులును బట్టుకొనితనప్రాణమునెట్లయిన రక్షింపుమని బ్రతిమాలనారంభించెను. ఇప్పటికి దోనెదాదాపుగా నొడ్డున కేఁబదిగజములదూరములో నుండెను. పడవమునుఁగుటకు సిద్ధముగనుండినపుడు రామచంద్రుఁడు జందెము మెడకుఁ జుట్టి నడు

మునకు బట్ట గట్టిగాఁగట్టి ముందుగా నదిలోనికి దుమికిపడలోనున్న యిద్దఱుపిల్లలను దనమీఁదనెక్కించుకొని యీఁది యొడ్డునదింపెను. అదిచూచియందఱును "మమ్మురక్షింపుమమ్మురక్షింపు" మని వేఁడుకొనిరి. ఈలోపుగా నొకపెద్దగాలిరాగాఁ బడవ దలకిందై మునిఁగిపోయెను. త్వరగా దింపుదునని వాగ్దానముచేసిన సరంగు తనమాట దప్పకుండ వారినిద్వరగా గంగలో దింపెను. ముక్తేశ్వరబ్రాహ్మణుఁడు రెండుమునుఁగులు మునిగి నాలుగుగుక్కలునీళ్లు త్రాగిమూడవమాఱు తేలినతోడనే, పిల్లలనుదింపి తిరిగి యెవరికైనసహాయముఁజేయుటకుఁ బడవదగ్గఱకు వచ్చుచున్న రామచంద్రునిగొంతుక గట్టిగాఁబట్టుకొనెను రామచంద్రుఁడు వదలుమని ప్రార్థించెనుగాని వదలుమనుకొలఁది మఱింతగట్టిగాబ్రాహ్మణుఁడుపట్టుకొననారంభించెను. రామచంద్రుఁడును బ్రాహ్మణుఁడునుగూడఁ జచ్చిపోవునట్టిసమయము వచ్చినట్లు కనఁబడెనుగాని రామచంద్రుఁ డుపాయశాలిగనుక బ్రాహ్మణుఁడెంతకును వదలనప్పుడు వానిని గట్టిగాఁగఱచెను. తోడనే బ్రాహ్మణుఁడు పట్టువదలెను. రామచంద్రుఁడు భూతదయాళుఁడు కాఁబట్టి యాబ్రాహ్మణునియందుమహాదయగల్గి వెనుకకువచ్చి రెండుమూఁడు తన్నులతో నొడ్డునకుఁబంపెను. పిమ్మట రామచంద్రుఁడు బ్రాహ్మణుని గట్టున కెత్తుకొనిపోయి నీరుత్రాగుటచే నెత్తుగా నుబ్బియున్న పొట్టమీఁద నడుగువేసి త్రొక్కి నీటినివెలికిఁదీసివానినిబ్రతికించెను. ఇంతలో నొకపడవవచ్చి యాజనులను రక్షించుటకుఁ బ్రయత్నముచేసెనుగాని సగముకంటె నెక్కువజనులాదుర్దినమునందుమృతినొందిరి. రామంచంద్రుఁడుసహాయ మియ్యనియెడలముక్తేశ్వరబ్రాహ్మణుఁడు పడవవచ్చునప్పటికిస్వర్గంబునఁ బ్రాఁతకాపై యుండును. అంతట బ్రాహ్మణుఁడు రామచంద్రునితో "అయ్యా! మీఋణము నేనెన్నటికైనను దీర్పలేను. నాయావదాస్తిని మీకిచ్చినను మీఋణము దీరదు.

మీకుఁ దగినబహుమాన మేదైన నియ్యవలెననియున్నది. మీరునా తోఁగూడ ముక్తేశ్వరము దయచేయవలెను. నాప్రార్థన మంగీకరింప వలసినది." అని చెప్పఁగా రామచంద్రుఁడు "సరి సరి యీమాత్రపు బనికి బహుమాన మీయవలెనా? నాచేతనైన సహాయమును నేను జేసినాను. మీరేమియు నియ్యనక్కఱలేదు. దయమాత్రముంచండి. తమరుపెద్దలు" అని ప్రత్యుత్తరముచెప్పి యొక్కతృణమైనఁ బుచ్చు కొనకయే రామచంద్రుఁడు రాజవోలునకుఁబోయెను. ఆబ్రాహ్మణుఁడు గూడ శివకోడుగ్రామమునుజేరెను. రామచంద్రుఁడు రాజవోలువెళ్ళు నప్పటికి సాయంకాలమైనందున మేనమామకుమారుఁడు వీధియరఁగు మీఁదఁ గూర్చుండెను. ఆపిల్లవానిని జూడఁగానే రామచంద్రుఁడు 'నాయనా! ఎంతకష్టమువచ్చిన'దని యతనినిగౌఁగిలించుకొని యేడువ నారంభించెను. ఈతఁ డెందు కేడ్చుచున్నాఁడో తెలియకుండఁ గుఱ్ఱ వాఁడుకూడఁ బెద్దపెట్టున నేడువసాగెను. ఇద్దఱును లోపలికిఁబోగానే వారినిజూచి మహావిపత్తు తటస్థమైనదనుకొని మేనత్తగూడ నేడువనా రంభించెను. చుట్టుప్రక్కలనున్న మనుష్యులందఱును జేరి "యేమియే మి?" అని యడిగిరి కాని, వారు ప్రత్యుత్తరమును జెప్పకయే వెక్కి వెక్కి యొకరిసంగతి నొక రెఱుఁగకుండవారందఱును దుఃఖపడుచుం డిరి. ఆవినోదమును జూడవచ్చినవారును, గష్టమేమోకలిగినదనియూర డింప వచ్చినవారును సంగతిఁ దెలిసికొనవలెననువారును గుమిగూడి యింటిచుట్టును జేరిరికాని యొకరికినిదుఃఖకారణమేమో తెలియదయ్యె ను. అప్పుడు రామచంద్రునివలెనేయున్న యొకనలువదియేండ్లబ్రాహ్మ ణుఁడు గుంపుగూడినజనుల నందఱిని జేతులతోఁదోసికొనియతిత్వరిత ముగావచ్చి గుండెబాదుకొనుచు "ఏమినాయనా! ఏమి నాయనా" యని రొజుచు లోనికివెళ్లెను. అతనిజూచి రామచంద్రుఁడు మిక్కిలి యాశ్చర్యపడి నోటివెంట మాటరాక నిశ్చేష్టుఁడై తెలివిదెచ్చుకొని

లేచి యావచ్చినమనుష్యుని గౌఁగిలించుకొని "మామయ్యా! నీవుబ్రతికియున్నావా? ఎవరోదుర్మార్గులు నీవు చచ్చిపోయినావనిచెప్పినారు. అందుకు నేనిక్కడకువచ్చినాను." అనిచెప్పినయావిపరీతవృత్తాంతము నంతను మేనమామవిని యెవరోవిరోధులాపనిఁజేసినారనినిశ్చయించి యింటనందఱిని నూరకుండుఁడనిచెప్పితరువాత రామచంద్రుఁడును దానును గష్టసుఖములఁ జెప్పుకొనుచుండిరి. మేనల్లుఁడు మేనమామతోఁ దాను రాజవోలునుండి బయలుదేఱివెళ్ళినది మొదలుకొనియానాఁటి వఱకు జరిగినయావదవృత్తాంతమును బూసగుచ్చినట్లుచెప్పఁగా మేనమామయు, శోభనాచలము మొదలైనవారిచరిత్రవిన్నపుడాశ్చర్యమున్ను, గష్టములువిన్నప్పుడువిచారమును, గష్టనివారణమగునపుడుసంతోషమును, గనఁబఱచుచు, శరభరాజుగారియుదారగుణముల స్తోత్రము చేయుచు, రామచంద్రునితో మాటాడుచుండెను. అతఁడక్కడనొక వారముదినములుండెను. ఆలోపుగానాగ్రామనివాసుఁడొకఁడుమంత్రి ప్రగడవేంకటరత్నమునకుఁ దమపిల్లనియ్యవలెనని యాతనిగుణాదులనుగూర్చి రామచంద్రునడుగఁగానతఁడు వేంకటరత్నముయొక్కదుర్గుణాదులనుగుఱించి తనకుఁ దెలిసినంతమట్టుకు నిజముచెప్పెనుగానికల్లలాడి యిల్లునిలుపుమనుశాస్త్రమునతఁడనుసరింపలేదు. వారముదినములక్కడనిలిచినతరువాత మేనమామదగ్గఱ సెలవుదీసికొనిప్రయాణమై సుఖముగా రామచంద్రుఁ డమలాపురముజేరి యక్కడివారందఱితో నీఘోరమైనవృత్తాంతమును జెప్పివారందఱినాశ్చర్యమగ్నులఁజేసెను. రాజవోలులో రామచంద్రుఁడు వేంకటరత్నముయొక్కవివాహమును గుఱించి మాటలాడినమాటలతనికి నేలాగుననో తెలిసినందున రామచంద్రుఁడు తనకుఁజేసిన మహాపకారమునకు మిక్కిలి గోపించియతఁడొకనాఁడు రామచంద్రునితో నిట్లుమాటాడనారంభించెను.

వేంక.—ఏమోయి! రాజవోలువిశేషములు. మీమామగారు బాగున్నారా?

రామ—ఆఁ బాగున్నారు. విశేషము లేమియు లేవు.

వేంక—రాజవోలులో నాకు వివాహవిషయమై సహాయము నీవు చక్కఁగాఁ జేసినావు.

రామ—నేను జేసిన దేమున్నది. వారునన్ను వచ్చియడిగినారు.

వేంక—అడిగితే నన్నుగుఱించి నీవేమిచెప్పినావు? నీకు నా మీఁదనున్న కసియంతయుఁ దీర్చుకొన్నావుకాఁబోలును!

రామ—నాకు మీమీఁద గసి యేమున్నది? నా పెద్దలను మీరు చంపినారా మీపెద్దలను నేను చంపినానా. నాకు మీమీఁదఁ గోపముండుటకు నే నెంతవాఁడను?

వేంక—ఎంతవాఁడవు గాకేమి? ఎంతవాఁడవు గాకుండ మా యమలాపురము వచ్చినావు? నీవు పొట్టకూటికి మాయింటియొద్ద నున్నను నీకున్నగీర్వాణ మెవరికినిలేదు. నీకుఁ గన్నులు నెత్తికివచ్చినవి. నీముందఱ మే మెంతవాళ్లము? పీటలమీఁదిపెండ్లి చెడఁగొట్టి యేమి బావుకొన్నావు? నీకు సిగ్గుబిడియములు లేవేమి?

రామ—అయ్యా! తమకంతకోప మెందుకు? నాకుఁదోఁచిన యభిప్రాయమును నేను దైవముఖమును జూచి నిశ్చయముగాఁ జెప్పినాను.

వేంక—నీకు నాసంగతి యేమి తెలుసును! నేను ముండనుంచుకొంటే నీకేమి? నాయంతవాఁడను నేను నీయంతవాఁడవు నీవు. ఒకరి దగ్గఱ నాప్రచారము నీవెందుకెత్తవలెను? నీవు మంచివాఁడవాయేమిటి? గురివెందగింజ తనక్రిందినలుపెఱుఁగదఁట! నీయిష్టమువచ్చినట్లుప్రేలుటకు నేనెవరనుకొన్నావు? పెండ్లివచ్చినప్పుడు వేయి యబద్ధములాడియైన నొకకొంపనిలువబెట్టవలెనన్నమాట యయిననునీవు వినలేదు. నీ చదువెందుకు తగులఁబెట్టనా? ఒకరుపచ్చగానున్నపక్షమున నీవింత

యోర్వలేవేమి? ఆహాహా! ఎంత బుద్ధిమంతుఁడవయ్యా! సత్రములో రాళ్ళు వేయునట్టి మచ్చులాగున నున్నది.

రామ—నేను మీయందుఁగల మొగమోటముచేత నబద్ధము చెప్పినపక్షమున నాప్రాణమున కుసూరుమని యాపిల్ల యేడ్చును. నూఱేండ్లు బ్రతుకవలసిన బ్రతుకు.

వేంక.—సత్యవాదివి నీవు బయలుదేఱినావు. భూలోక హరిశ్చంద్రుఁడవు. తిన్నయింటివాసములు లెక్కవెట్టుటలోఁ దెలివిగలవాఁడవు. తల్లిపాలుత్రాగి రొమ్ముగుద్దినాఁడన్న సామ్యము నీదగ్గఱనె నిజమైనది. ఇందులకే నియోగపువానిని జేరఁదీయఁగూడదని శాస్త్రము చెప్పినవాఁడు వెఱ్ఱివాఁడా?

అని యిట్లు వేంకటరత్నము తానుగూడ శరభరాజుగారియింటఁ బొటకూటికి జేరినవాఁడే యనుమాట మఱచిపోయి రామచంద్రుఁడు దనయింటనే యుండినట్లును, వానినిదానే సంరక్షించుచున్నట్లును దలఁచి తలవాఁచిపోవునట్లు వానిని జీవాట్లుపెట్టి మాటలతోఁ దనవాదమును ముగింపక చేతులుకూడఁ గలుపుటకు సిద్ధముగానుండెను. కాని, రామచంద్రుని యదృష్టము బాగుండి యింతలో లోపలినుండి వచ్చిన శరభరాజుగారు వేంకటరత్నమును రామచంద్రుని గూకలు వేసి వారి వివాద నివారింపఁజేసిరి. రామచంద్రుని సత్యవాద మతనిని మహాపదలపాలు చేసెను. ఒకనాఁడు వేంకటరత్నము మనస్సులో నేదో తలంచుకొని రెండుగ్రేళ్ళుచాచి యిందులో నొక వ్రేలుపట్టుకొమ్మని నరసింహమునడిగెను. అతఁడు రెంటిలోఁ బొడుగు వ్రేలు పట్టుకొనఁగా నది యతని మనస్సులోనున్న యభిప్రాయమునకు సరిపడనందునను, నశుభసూచకముగా నున్నందునను వేంకటరత్నము కోపమువచ్చి "శకునపక్షి వెధవా! ఎప్పుడింతే; చవటచేతుల పెద్దమ్మ" యని టంగున నొక మొట్టికాయ మొట్టెను. దా

నితోఁ గుఱ్ఱవాఁడుగెవ్వున గుక్కదిరుగకుండ నేడ్వఁగా లోపలనుండి కృష్ణవేణమ్మగారువచ్చి యెవరుకొట్టినారని యడుగఁగా రామచంద్రుడు సంగతి యంతయుఁ జెప్పెను. కృష్ణవేణమ్మ వేంకటరత్నమును గొంచెము చీవాట్లు పెట్టెను. ఇట్లొకదానికంటె నొకటి బలమైన కారణములచే వేంకటరత్నమునకును రామచంద్రునకును మనస్పర్థ హెచ్చగుటచేత వేంకటరత్నము దనకసిదీర్చుకొనుటకు రామచంద్రుఁడు చదువుకొనుచున్నప్పు డతని కేదైన పనిఁ జెప్పి యతఁడు సేయుటకు వీలులేదనఁగానే యావార్త శరభరాజుగారితోను, వారితల్లితోను జెప్పి "తిండికి సిద్ధముగా నుండును గాని పని వల్లగాదు. మాయింట నున్నవారికి మాకంటె నెక్కువ రాజసము." అని చెప్పుచుఁ దనచేతనైన యిబ్బందులఁ బెట్టుచుండెను. దేవుఁడువరమిచ్చినను బూజారివరమియ్యఁడన్నట్లు శరభరాజుగారికి దయయున్నను వేంకటరత్నమునకు గటాక్షము లేకుండుట యొక పెద్దచిక్కుగానే యుండెను. ఒకనాఁడు రాత్రి భోజనములయినతరువాత శరభరాజుగారు లోపలచావడిలోఁ బచారుసేయుచుండఁగా రామచంద్రుఁడు దీపము వెలుఁగునఁ జదువుకొనుచుండెను. అప్పుడు వేంకటరత్నము రామచంద్రుని మెల్లగాఁ బిలిచి యిట్లని చెప్పెను.

వేంక—అబ్బాయీ! ఆమధ్య నిన్ను నేననిన మాటలు మనస్సులో నుంచుకొనవద్దు సుమీ! నా మనస్సులోఁ గల్మషములేదు. అప్పటికప్పుడు గోపమువచ్చినప్పుడు పిచ్చిముండాకొడుకువలె నాలుగు కేకలు వేయడమేకాని దీర్ఘక్రోధముంచుకొనను. మనమందఱముఁ గూడి యొక యింటనుండువారము. ఈవేళ నాలుగనుకొన్నను రేపు తిరిగి కలిసేవాళ్ళము మనమే. నన్ను నీవన్నను నిన్ను నే నన్నను నది లెక్కలోనిది కాదు. నేను బయి కీలాగునఁ గోపముతో గనఁబడుటే కాని నీవిషయమైన సంగతి నేదయిన శరభరాజుగారితోఁ బ్ర

సంగించవలసినపుడు నేనెంత కట్టుదిట్టముగఁ జెప్పుచుందునో పరమాత్మునకుఁ దెలియును.

రామ.—చిత్తము. మీదయయున్నపక్షమున నాకేకొఱఁత యు నుండదు. నేను మిమ్ము నందఱను నమ్ముకొన్నవాఁడనే కనుక నాభారమే మీది.

వేంక.—ఒకపర్యాయము వీధిలోనికిరా. అనివీధిలోనికిఁ దీసికొనివెళ్లి, సూర్యనారాయణగారూ! దయచేయండి.

అని యతఁడు పిలువఁగానే తెల్లనితలపాగాను బెట్టుకొని నిలువుటంగీ దొడిగికొని మంచిజరీపంచెఁ గట్టి, చేతిలో నొక వెండిపొన్నవేసిన కఱ్ఱఁ బట్టుకొనియున్న యొక బ్రాహ్మణుఁడు వచ్చెను. ఆతనిని జూచి రామచంద్రుఁడు "తివాసిపట్టుకొని రానా?" యని యడిగెనుగాని వేంకటరత్నమును బ్రాహ్మణుఁడును, వద్దని చెప్పఁగా వారందఱు వీధియరఁగుమీఁద మూలఁ గూర్చుండిరి.

వేంక.—రామచంద్రుఁడూ! నీవొక్కసహాయముఁ జేయవలయును. ఈయన దేశిరాజు సూర్యనారాయణగారు. వీరు దేశపాండ్యాలు. కోటిపల్లికాపురము. తాతముత్తాతలనాఁటినుండియు శ్రీవిజయనగర మహారాజుగారిదగ్గఱ పెద్దయుద్యోగములను జేయుచున్నవారే. వారిది నూఱుపుట్ల భూమి. వెనుకటిసంవత్సర దుర్భిక్షమునకు వీరు చేసినయన్నదాన మింతింతయని చెప్పనలవికాదు. మూఁడేండ్లుజనులు గుటుంబములతో వచ్చి వీరిగ్రామములోఁ గాపురమున్నారు. నీవువిని యుందువు. జగత్ప్రసిద్ధులు.

రామ.—నేనెన్నఁడు నెఱుఁగను. మహానుభావులు మీరు.

సూర్య.—అవి యన్నియు నెందుకు? ఆదినములువేరు. ఆకథలువేఱు. చావలేక యీలాగున బ్రతుకుచున్నాము. ఈస్థితి యీవేషము వేఱు.

వేంక.—అందుచేత నప్పులు విస్తారముకాఁగా భూములుతాకట్టులోనున్నవి. ఇంటనున్న జవాహిరీ యంతయువిక్రయించి వీరుకాలక్షేపముఁ జేయుచున్నారు. అయితే యానగలను గోటిపల్లిలోను జుట్టుపట్లను మాత్రిమమ్మరు. పూవులమ్మినచోటనే కట్టె లమ్మవలసి వచ్చెను. ఆనగలను మాగ్రామము దెచ్చి యమ్ముచుందురు.

రామ—నే నిప్పుడే సహాయముఁ జేయవలెను? పాపము నాకు విచారముగనే యున్నది.

వేంక—మఱేమి గొప్పసహాయముగాదు. నీయందుఁ కోమట్లకు మహాగౌరవము కలదు. నీ వమ్మినపక్షమున మోసము చేయరు. నీకు బంగారము నాణెము తెలుసును. ఈ వస్తువులు నీ వమ్మిపెట్టి యతని మర్యాదఁ గాపాడవలెను.

రామ—ఈమాత్రిపుఁబని కింతమనవి కావలెనా? నాచేతనైన దానిలో మీకుఁ దగినంత సహాయముఁ జేయఁగలవాఁడను.

సూర్య—అయ్యా! ఇది రెండవవానికిఁ దెలియనియ్యవద్దు. నాకుఁ సిగ్గుగానున్నది. అందుచేతనే యీవస్తువుల నంతదూరమునుండి యింతదూరము తెచ్చి యమ్ముచున్నాను. అక్కడ ధర రాకపోలేదు.

రామ—మీరు చెప్పిన తరువాత నెవరికైనఁ దెలియనిత్తునా? నాకు బంగారమునాణెము చక్కగాఁ దెలియదు.

వేంక—తెలిసినంతమట్టుకు చాలు. రాజగోపాలమునకైనఁ దెలియనీయకు. ఇవిగో వస్తువులు. కంటె నూఱురూపాయల ధర. ఉంగర మేఁబదిరూపాయలు. ఈయన తిరిగి రేపురాత్రి మనదగ్గఱకు వచ్చి యీసొమ్ముఁ బుచ్చుకొందురు. రేపుపగలు పీనిని విక్రయించు!

రామ—ఆయన రాత్రి రావడ మెందుకు? పగలు రారాదూ?

వేంక—పగలు వచ్చినపక్షమున శరభరాజుగారు బలవంతపెట్టి

భోజనమునకు రమ్మనుమని నిష్ఠురము లాడఁగలరు. ఎందుకు? రాత్రి యే మంచిది.

ఈ సంభాషణ ముగిసిన తరువాత సూర్యనారాయణగారు వెళ్ళి పోయిరి. రామచంద్రుఁ డావస్తువులను రాత్రిజాగ్రత్తపెట్టిమఱునాఁ డుదయమునఁ గోమట్లకుఁ జూపించి వారు చెప్పిన ధర ప్రకారముగా రెండువస్తువులను నూటయేఁబది రూపాయిల కొకబ్రాహ్మణునకువిక్ర యించి యాసొమ్ము మఱునాఁడు రాత్రి సూర్యనారాయణ రాఁగా నతనిచేతికిచ్చెను. ఆపని యైన తరువాత వేంకటరత్నము రామచం ద్రుని బిలిచి "నాయనా! ఇంకొక పనియున్నది. గంటము, నాకు నొక్కపర్యాయము పుచ్చుకొనుము. పెద్దాపురమునుండి జగన్నాథ రాజుగారువచ్చినారు. ఆయనతోఁగూడ మామేనల్లుఁడు వచ్చినాఁడు. అతని కక్కడ ముప్పది రూపాయిలు పని. వాఁడొక్కమారు నాకు మోముఁ జూపించి తిరిగి కనఁబడలేదు. ఒక్కయుత్తరము వ్రాసి పంపెదను. నీవు వ్రాసిపెట్టవలెను. అనఁగానే రామచంద్రుఁడు గంటమును దాటియాకును బుచ్చుకొని సిద్ధముగా నుండఁగా వేంకట రత్న మీప్రకారముగ వ్రాయించెను. "నీవు నాకీవేళ నొక్కమా ఱు మొగముఁ జూపించి తిరిగి లోపలికి వెళ్ళినావు. నీతో మాట్లా డవలెననియున్నది. నీకు వీలెప్పుడో తెలియఁ జేసిన పక్షమున నేను దప్పక వచ్చెదను. నీతో మాట్లాడకుండ నే నుండలేను." ఆ యుత్త రమువ్రాసి రామచంద్రుఁడు "వ్రాలు చెయ్యండి వేంకటరత్నముగా రు." అని యడుగఁగా "వ్రాలెందుకు? ఈమాత్రపుఁ జీటిముక్కకు వ్రాలును బై పేరునుగూడఁ గావలెనా" అని చెప్పి చీటిని బుచ్చుకొనె ను. ఇదియైన నాల్గుదినములకు నరసింహముపుట్టినదినము వచ్చెను. అతఁడాశ్వయుజబహుళత్రయోదశినాఁడు జన్మించినందున నాదినము పిల్లవాని నభ్యంగనముఁ జేయించి గ్రామముననున్ననలుగురు నియో

గులను శరభరాజుగారు భోజనమునకుఁ బిలిచిరి. మధ్యాహ్నము నరసింహమునకు సంపెంగ నూనెతోఁ గృష్ణవేణమ్మ తల దువ్వి బంగారుకుప్పెలుగల నల్లపట్టు జడబొందుతో జడవేసి జడమీఁదఁ జిన్న చేమంతిపువ్వును, దానికిఁ బై భాగమున నడినెత్తిమీఁద మొగలి రేకును నమర్చి, మొగమునఁ జక్కని యగరుచుక్కను బెట్టి రావి రేకవేసి పచ్చని పట్టుచొక్కా తొడిగి దానిమీఁద జందెమువలె వరహాల పేరువేసి మెడలో మిరియాల పేరును, జంద్రహారములును వేసి దానిమీఁద బంగారు కడ్డీకంటె పెట్టి కుడిచేతిమీఁద బంగారపు బుజబొందుకట్టి రెండుదండలమీఁద వంకీలు పెట్టి, చెవులకు వజ్రపుఁ బొడులు వేసిన తమ్మంట్లనుంచి కుడిచేతి యైదువేళ్ళకు బటువులుంచి మణికట్టుదగ్గఱనుంచిన బంగారు కడ్డి మురుగులును, మురిడీ గొలుసులును, ధగధగలాడుచుండ నెఱుపట్టు లాగుదొడిగి బంగారపుబిళ్లల మొలత్రాడు లాగుమీఁదికిఁ దీసి కాళ్ళకు వెండి యందెలును, గజ్జెలును, గడియములును, గీలించి మెడకుఁ దెల్లచారలుగల యెఱుపట్టు రుమాలు ముడివేసి శృంగారించి కుమారుని బడికిఁ బంపెను. పిల్లవాని మీఁద వైచిన వెండి బంగారము లంతకంటె బరువుగా నున్నందున వస్తువులను మోయలేక వగర్చుచుఁ బుస్తకములు మోయలేనందున జాకలివాఁడు వెనుక పుస్తకముల దెచ్చుచుండెను. తమలపాకులవంటి చెక్కిళ్లును, తాంబూలము వేయనక్కఱలేకయే దొండపండువలె నెఱ్ఱగానున్న క్రిందిపెదవియుఁ బూర్ణచంద్ర సమానమైన గుండ్రని ముఖమున కందము నొసంగఁ గాలియందియలు ఘల్లుఘల్లుమని మెఱయ దుర్మార్గుల కనులుకుట్టునట్లును, విరోధుల కసూయకలుగునట్లును, బిడ్డలులేని స్త్రీలు ముచ్చటవడునట్లును, ముద్దుల మూటగట్టుచు బాలుఁడు బడికిఁబోయెను. బడిలోనెన్నఁడును జదువులేదుకనుక పంతులవారు గాఢముగా గుఱ్ఱుపట్టి నిద్రపోవుచున్నందున బిల్లలందఱును

దాహమున కనియు నింకఁ గొన్ని పనులకును నానాముఖములై పాఱి పోయిరి. నరసింహముగూడ నొకమూలకుఁబోగా నెవరో యొక బ్రాహ్మణుఁడు చేతిలోనొక పటికబెల్లపుగెడ్డయు, నొక పంచదార చిలుకయు, నాలుగు చక్కెరకేళిపండ్లును బట్టుకొని నరసింహమును రమ్మను మని చేతితో సంజ్ఞ చేసెను. ఎఱకొఱకుఁబోయిన చేఁపవలెనే నరసింహముగూడ నాబ్రాహ్మణునియొద్దకుఁబోయి యతఁడు పెట్టినపంచదారచిలుకను దినుచుండఁగానాబ్రాహ్మణుఁ డతని నెత్తుకొని ముద్దాడితన యింటికిఁ దీసికొనిపోయెను. పాపము ముద్దుచేత వదలలేకయే కాఁబోలును బిల్లవానిని బ్రాహ్మణుఁడు వదలనేలేదు. అతనితోఁగూడ వెళ్ళిన చాకలివాఁడు నరసింహము పుట్టినదినముగనుక శరభరాజుగారు బహుమతిగానిచ్చిన నాలుగుడబ్బులతోఁ గల్లుసీళ్లుత్రాఁగి బాలకునిసంగతి స్మరణకురాక యెక్కడనో దొర్లుచుండెను. పిల్లవాఁ డెంతసేపటికి నింటికి రాలేదనికృష్ణవేణమ్మ విచారించుచుండఁగాఁ జాకలివాఁడక్కడికి వచ్చెను. నరసింహ మెక్కడ నున్నాఁడురాయని చాకలివానినామె యడుగఁగా వాఁడేదో కొంపమునిఁగినదనుకొని "నే నిందాకఁ దీసికొనివచ్చి యింటిదగ్గఱ దిగఁబెట్టినానండి" యని చెప్పెను. కాని, వానిమాటయందు నమ్మకము చాలక శరభరాజుగారితో నీసంగతిఁ గృష్ణవేణమ్మ సెప్పెను. ఆమాట వినఁగానే యింటనందఱుఁ గలవరపడ నారంభించిరి. నగలు శరీరము నిండ నుండుటచేత నెవరో గొంతు పిసికి చంపి నగలను దీసికొనిరని కృష్ణవేణమ్మ యేడ్చుచుండెను. శరభరాజుగారు కదలుటకుఁ గాళ్ళాడక దిగులు మొగముతో నుండిరి. శరభరాజుగారితల్లి కృష్ణవేణమ్మను నగలుపెట్టి పిల్లవానిని బడికిఁ బంపినందునకుఁ దిట్టసాగెను. వేంకటరత్న మొక ప్రక్కకును జాకలివాఁ డింకొక ప్రక్కకును, నిరుగుపొరుగు వారందఱుఁ దలొక ప్రక్కకునుబోయి సందులు, గొందులు, బాడుదొడ్లుఁ, బ్రాతయిండ్లు

బోడిగోడలుఁ, దోఁటలు మొదలయిన రహస్యస్థలములన్నియు వెదకిరి కాని యెందును బాలుఁ డగుపడలేదు. నగలు బోయిననుసరే జీవముతో మనకుమారుఁడు గనఁబడినఁ జాలునని తల్లియూరడించుటకు వచ్చినస్త్రీలతోఁజెప్పి చెప్పి విలపించుచుండెను. రాజగోపాలమును రామచంద్రుఁడునుగూడ నమలాపురమంతయు వెదకిరి కాని పిల్లవాఁడు కనఁబడలేదు. తుదకారాత్రి జామయినతరువాత రామచంద్రునకొక్క యీడిగవాఁడగుపడినాలుగుగడియలప్రొద్దువేళఁ దానుదాటిచెట్టునెక్కి కల్లుదీసికొనుచుండఁగా నొక నగలపిల్లవానిని, మఱియిద్దఱుమనుష్యులను దాటితోఁటలోఁ జూచినానని చెప్పిపోయెను. ఆతోఁటలోపలికి రామచంద్రుఁ డొక్కఁడునుబోయి నాలుగుమూలలు వెదకి తుదకొక ముండ్లకంచెదగ్గఱనోటిలోగుడ్డలుగుక్కఁబడియున్నందునమాటరాక దిగంబరియై నిలిచిన యొక బాలకునిజూచి చీఁకటిచేత మొదటతాటి మొక్కయేమో యనుకొని సందేహ నివారణార్థము దగ్గఱకుఁబోయి చూచి పిల్లవాఁడె యని తెలిసికొని "నరసింహము" అని పిలిచెను. మాటలాడుటకు వీలులేక యతఁడు గన్నీళ్లతోఁ బ్రత్యుత్తరమిచ్చి యెత్తుకొన చేతులఁ జాచెను. రామచంద్రుఁడు నరసింహము నెత్తుకొమ్మనినోటిలోగుడ్డలుదీసివేసి నగలింతపనిఁ జేసినవిగదా యని పిల్లవానిస్థితికిఁ గొంచెము కన్నీళ్ళుదెచ్చుకొని దొరకినందున సంతోషించుచు నింటికిఁ దీసికొనిపోయెను. పిల్లవాఁడు కొంతదూరమున నుండఁగానే యీసంగతి తెలిసి యింట నందఱువచ్చి పిల్లవానినెత్తుకొని ముద్దాడిరి. కృష్ణవేణమ్మయుఁ దొట్రుపాటుతోవచ్చి బాలునిజూచి దుఃఖము పొరలి పొరలి బాఁగా నెత్తుకొని కంటఁబడి సుఖముగా నున్నందుకు మహాసంతోషముతో లోపలికిఁ దీసికొనిపోయి కొంచెమన్నము దిగఁదుడిచివైచి గుప్పెడు మిరపకాయలను లోపలనున్న వారందఱు గొంతులు బ్రద్దలగులాగున దగ్గునట్లుప్రొయిలోఁబోసిపిల్ల

వానిని జరిగినసంగతి నడుగుచు మధ్యమధ్య నేడ్చుచు వచ్చినస్త్రీలకు వానిని జూపుచుండెను. తరువాత మగవారందఱుఁ గాగడాలు వేయించుకొని యాతాఁటితోఁటకు బోయిరి కాని దొంగవాఁడును బుద్ధిమంతుఁడుగనుక పొరపాటుచేనైన నొక్కనగనైన దిగఁబెట్టకుండ నన్నిటిని దీసికొనిపోయెను. గాని నరసింహముయొక్క చొక్కాను, లాగును, రుమాలును విడిచిపోయెను. ఆతొందరలో దొంగలు తమ చేతి తెల్లరుమాలుకూడ విడిచిపోయిరి. అది రామచంద్రునికంటఁ బడఁగా నతఁ డదరిపడి శోధించి చూచి యొక కొంగున జీడితో వేసిన పేరుయొక్క పొడియక్షరములు చా. జ. యని చదివి యాపే రెవరిదో యెఱుఁగక యందఱును ద్వరితముగా నింటికి వచ్చిరి. ఆమఱునాఁడు నరకచతుర్దశియు దానితరువాత దీపావళియునై యుండెను. నగలుదొరకక పిల్లవాఁడుమాత్రమే దొరకినందుకు శరభరాజుగారితల్లికి విచారముగా నున్నందున నాసంవత్సరము పండుగఁ జెయ్యవద్దని చెప్పినదికాని శరభరాజుగారును గృష్ణవేణమ్మయుఁ బిల్లవాఁడు దొరకుటయేచాలునని మునుపటికంటెఁ బండుగ ఘనముగాఁ జేసికొనుటకుఁ బూనిరి. వారందఱుఁ దమకుమారుని వెదకి తీసికొనివచ్చినందులకు రామచంద్రున కనేకవందనములుఁ జేసి వేయివిధములవానిని స్తోత్రముఁజేసి యతని ఋణముఁ దీర్చుకొనలేమని చెప్పిరి. నరకచతుర్దశినాఁడు తెల్లవారుజామునే లేచి యెంతమందికిఁ దలంటినన్ పుణ్యము గనుక తనస్నేహితులను బంధువులను బిలిచి శరభరాజుగారు కొందఱికిని గోపాలము కొందఱికిని స్వయముగాఁ దలలనంటిరి. కొందఱికి మంగళ్ళచేతఁ దల లంటింపించిరి. అభ్యంగన సమయమందు శరభరాజుగారికిఁ బార్వతి మంగళహారతిఁ బట్టఁగా నాయన పాతికరూపాయలు పళ్ళెములో వేసిరి. రామచంద్రుఁడును రాజగోపాలమును బాణసంచుకాల్చి దొడ్డినంతను వెలిఁగించిరి. ఆమఱునాఁడు

దీపావళియమావాస్య యయ్యెను. అమావాస్య యింక నొకనెలకు వచ్చుననఁగాఁ బనిపాటలనుమానుకొని గంధకమును, సూరేకారముఁ గొనిబొగ్గు తెచ్చిపాళ్ళు వేసిటపాకాయలను దక్కినయితర బాణసంచును గట్టువారును, మందులను మండిగలలోఁబోసి నూరువారును, మందు కూరువారును, దాము గట్టినవస్తువులు చక్కఁగాఁ గాలునో లేదో యని పట్టపగలు చీఁకటిగదిలోనికిఁ బోయి తలుపులు మూసి యా వస్తువుల నక్కడ గాల్చి వాని సార మెఱుఁగువారును దప్పు పాళ్ళు పడుటచేఁ బాడైన మందులను గుఱించి వగచువారును జెలరేఁగి యుండిరి. పట్టణమందుఁ బ్రతిగృహమున గంధకపువాసన గొట్టు చుండెను. అమావాస్యనాఁ డుదయమునఁ గొంచెము మబ్బువేసినం దున వర్తకు లందఱికిఁ దమసొమ్ము నమ్ముకొనుటకు వీలుండదని గుం డెలలో ఱాయివడిన ట్లుండుటయేకాక బాలురందఱును సంతోషభం గమగునేమోయని మేఘునిదిట్టుచుండిరి. కాని,కొంతసేపటికి వర్తకుల పాలిటి యదృష్టదేవతయో యనునట్లు ఫెళ్ళుమని యెండరాఁగావర్త కులు దుకాణములను దెఱచి సరకు లమ్మనారంభించిరి. భాగ్యవం తులు దమబిడ్డలకు విస్తారధనము వ్యయపఱచి వస్తువులను గొనిపెట్టు చుండుటఁ జూచి బీదలబిడ్డలు దమ తల్లిదండ్రుల బాధ పెట్టఁగా వారు బిడ్డలకుఁ దగిన యుత్సాహము దీర్పలేకపోయినందులకు విచా రించుచు స్వల్పముగాఁగొని యిచ్చుచుండిరి. గొప్పయుద్యోగస్థులయ నుగ్రహము సంపాదింపవలెనని చిన్నయుద్యోగస్థులు దమపిల్లలకులేక పోయినను బహుమతుల పేరు పెట్టి వారి యిండ్లకుఁ బెద్దపెద్ద బాణ సంచుబుట్టలను బంపుచుండిరి. అంతకంటె మహాభిమానముగల పౌరు షవంతులు తమరు సేవించుచున్న ప్రత్యక్షదేవత లగు వేశ్యకాంత లేమనుకొందురో యనియు మంచివస్తువులఁ బంపనియెడల మఱు నాఁడు వారిమొగమెట్లు చూతుమనియుఁ దలంచి పదిమందిలోనగు

బాటు రాకుండఁ బరువు నిలువఁబెట్టుకొనుటకు ధనములేకున్నను ఋణముఁ జేసియో, యింటనున్నవస్తువులను దెగనమ్మియో బాణసంచుకొని యొక రసికునికంటె నొక రసికుఁ డెక్కువగా నుండవలె నని వర్తకులదగ్గఱ బదులు పుచ్చుకొని పెద్దపెద్ద బుట్టలను వారి యిండ్లకంపిరి. తాటిచిదుగులను సంపాదించి కాల్చిపొడుముచేసి గుడ్డలువేసి తాటికమ్మచీరి యందులో నీగుడ్డపెట్టి పొట్లముగాఁ జుట్టి కట్టి పైఁ బేడఁబూసి బాలు రెండఁబెట్టుకొనుచుండిరి. వృద్ధులగువారు దాటియాకులయూనెలఁదీసి చిత్రముగాఁ గత్తిరించి యడ్డముగా నొకయాకును నిలువుగా నొకయాకును వేసిగుమ్మడిపండ్లఁగట్టివ్రేలాడఁదీయుచుండిరి. పురుషులందఱుఁ దమతమగుమ్మముల ముందఱ నరఁటిచెట్లు తెగఁగొట్టించియు బొప్పాయిచెట్లు నఱకించియుఁ బాతించి వానికి వెదురుకఱ్ఱముక్కలను దిగఁగొట్టించి వానిమీఁద బ్రిమిదలను రాగిడిమట్టిగురుజులను బెట్టించియు నంతతోఁ దృప్తినొందక రెండువీధియరఁగుల క్రిందను గడలనుబాతించి వానికడ్డముగ వెదురుకఱ్ఱలను నాలుగైదంతస్తులుగఁ గట్టించి వానిమీఁదఁగుమ్మరివాండ్రి దెచ్చియిచ్చినక్రొత్త ప్రిమిదలనుఁ బెట్టించుచుండిరి. అప్పుడు సాయంకాలము కాఁగా నా రాత్రి పెట్టఁబడుదీపములకాంతి ముందు దనకాంతి వెలవెలఁ బోవునను సిగ్గుచేతనో యన సూర్యుఁ డపరసముద్రముఁబ్రవేశించెను. స్త్రీలందఱును మడిగట్టుకొని దీపములు పెట్టిరి, ఆకాశమండలముననున్న నక్షత్రములెల్ల భూమండలమునఁ బ్రతిఫలించుచున్నట్లు దీపములు గోల్లకొలఁది వీధుల కిరుప్రక్కలను వెలయుచుఁ దనమధ్యమున సువర్ణభూషణములతో నున్న స్త్రీలయవయవముల కపూర్వమైనలావణ్యము గలిగించుచుఁ బట్టపగటియందువలె సమస్తవస్తువులను గాన్పింపఁ జేయుచు సొగసు మిగిలియుండెను. మహారాష్ట్రదేశ వర్తకులు దమ కొల్లనలంకరించి పళ్లెములయందు వెండిబంగారు నాణెములనుంచి ధ

నపూజఁ జేయుచుండ బ్రాహ్మణోత్తములు బూజఁజేయించి సంభావనల గ్రహించి బొజ్జలనాడించుకొనుచు నిండ్లకుఁబోవుచుండిరి. ఈదీపికాసమూహమునకు వెఱచి యంధకారమంతయు వానివెనుకశరణార్థముదాగియున్నదన్నట్లు క్రీనీడ దీపముల వెనుక నుండెను. ఎక్కడ జూచిన దీపముల వెలుతురు నెక్కడఁజూచినరంగుంరగుల మహాతాబులకాంతియు నెచ్చోటఁగాంచిన నానందమును నేచాయఁగనుగొన్న మహాధ్వనియు గ్రామమున నిండియుండెను. బాలకులుగాల్చుట కసమర్థులగుటచే నగ్నిబాణములు వెదురుకఱ్ఱలకుఁగట్టించి కాల్పించుతండ్రులును, జమత్కారముగాఁ గాల్చుచిన్నబిడ్డలనుజూచి సంతోషించు తల్లులును, వస్తువు లయిపోయినవనిరోదనముఁ జేయు బాలకులును, భార్యలయొద్దను, దమరుంచిన వేశ్యకాంతలయొద్దను దమ చమత్కారమంతయుఁ జూపదలఁచి చిత్రముగా నగ్నిబాణములఁ గాల్చి వారి మెప్పు నొందుచున్న మహారసికులును, మార్గమునఁ పోవుచున్న జనులకాళ్ళనడుమఁ దూటాలను సిసింద్రీలనుఁవేసి వారుతత్తరపడి పరుగెత్తుచుండఁ జూచి యానందించు కొంటెవాండ్రును, సంభావనలకు బోయివచ్చుచు దూరమం దెక్కడనో కాలుచున్నయగ్నిబాణములఁ జూచి, తమయొద్దకు వచ్చుచున్నవని పరుగెత్తుపిఱికిబ్రాహ్మణులును, జిన్నబట్టలఁగట్టుకొని దుప్పటులఁగప్పుకొని వినోదముజూడవచ్చిన శృంగారపురుషులును నడివీధులయందు ఘూర్తులగ్నిబాణములఁగాల్చుట చేతఁ దమగృహములు పరశురామప్రీతి యగునని భయపడి కేకలువేయు నాతజనంబును, జనుల కుపకారము జేయదలంచి చేతులయందు నవనీతముంచుకొని శరీరములఁ గాల్చుకొనువారి కిచ్చునట్టి పుణ్యజనులును, గ్రామమందంతటను, బిక్కటిలి యుండిరి. ఊరునకుత్తరపుదిక్కుననున్న మందబయలుమీఁదిబోయి, మహావీరులందఱు నొకరి దేహములనొకరు తగులఁబెట్టుకొనుటకు రెండుకక్షులయిరి. మెడను గ

ట్టుకొన్న సంచిలోనుండి దూటాలను దీసి కత్తితోఁ బోరనుదెగఁగోసి, జానకిత్రాటనున్న నిప్పుతో నంటించి రెండుచేతులను రెంటి నుంచుకొని నోటనొకటి పెట్టుకొని చిత్రవిచిత్రముగాఁ ద్రిప్పుచుఁగూర్చుండియు, వంగియుఁ జేతనయిన కసరతులఁ జేయుచు వానినికొందఱుకాల్చుచుండిరి. తోలుచేతులు దొడిగికొని లాగులను గట్టుకొని. తలలకు టోపీలుదాల్చి, తమకెన్నఁడపకారము చేయక యాదినమునమాత్రి మెదుటికక్షలోనిల్చిన జనులమీఁద వెలగకాయలు, గారకాయలుఁ, దూటాలును, విసరి వారిదేహములను గాల్చుచు వారు తమమీఁద వైచిన వానిని మరల నందిపుచ్చుకొని యుపయోగించుచు, మధ్యమధ్య నంటుకొన్న సంచులను దెగఁగొట్టి పాఱవైచుచు, దేహములను గాల్చుకొన్న తమమిత్రుల నిండ్లకుఁ బంపుచుఁ దమవగ్గఱ సరకుమిగిసినవెరుక స్నేహితులయొద్ద పుచ్చుకొనుచుఁ,జంకలక్రిందనున్నపొట్టి కఱ్ఱలతో నెదుటివారు ప్రయోగించినవాని నాఁపుకొనుచు, మీఁదికి బాణము వచ్చునప్పుడు పరుగెత్తుచు గోయుటకు వ్యవధి చాలక తూటాలను నోటితో గీఱుచుఁ, జూచుటకువచ్చిన జనసమూహమును బరుగెత్తించుచు గొందఱు వినోదసముద్రమగ్నులైరి. ఆసమయమునం దాభూమి కేవల మగ్నిహోత్రమయమై నిప్పులుగ్రక్కు మనుష్యులతోఁగూడి యాగ్నేయాది మహాస్త్రసమేతమగు రామరావణమహాభారతయుద్ధభూమివలెఁ దేజోవంతమై యతిభయంకరమై ప్రజ్వరిల్లుచుండెను. అప్పుడు రామచంద్రుఁడును, వేంకటరత్నమును, రాజగోపాలమును, జూచుటకువచ్చిదూరముగా నిలుచుండిరి. కానియొకగారకాయమహావేగముతో రాజగోపాలముమీఁదికివచ్చెను. అదిచూచి రామచంద్రుఁడు దనప్రాణమునకువెఱవక స్నేహితునిమీఁదికివచ్చుచున్నయాకాయ కెదురుగాఁబోయి చేతికఱ్ఱతో దానిని గొట్టెను. అది వెంటనే పగుల రామచంద్రుఁడుశరీరమునిండ నగ్నిహోత్రపుముద్ద

లుపడెను. వెంటనే బట్టయంటుకొన్నంచున రామచంద్రుఁడు పరుగెత్తగా గాలితగిలి మఱికొంచె మంటుకొనెను. అప్పుడు రాజగోపాల మతని నాఁపి చేతితో నలిపివైచెనుగాని శరీరమం దక్కడక్కడగాలెను. వేంకటరత్నము మంచియుద్దేశముచేతనే త్వరగా బాధనివారణ కావలెనని కొంచెము నీళ్ళు మీఁదబోసెను. అంతట బాధ పోవుటకు బదులుగాఁ గాలినచోట వెంటనేపొక్కులెక్కి ద్విగుణమయ్యెను. తరువాతవారందఱు నింటికిఁబోఁగా శరభరాజుగారు నవనీతమును దెప్పించి శరీరమంతటఁ గాలినచోట్ల పట్టించి వారినాఘోరసమయమునందు నిర్భయముగా వీధులయందుఁ ద్రిప్పిన పడుచుఁదనపుగర్వమును నిందించుచుఁదనకుమారుని రక్షించిన రామచంద్రునిధైర్యసాహసాదుల కాశ్చర్యపడెను. రామచంద్రునిశరీరమున బాధ నెలనాఁటికిఁగుదిరెను.

ఆ అ వ ప్రి క ర ణ ము.

పార్వతి వివాహవిషయమై శరభరాజుగారు బెంగపెట్టుకొనిరి. పిల్లకు దాదాపు పదిసంవత్సరములు వెళ్ళవచ్చినను దగినసంబంధ మెక్కడను దొరకకపోవుటయేకాక, యింట నొకరియభిప్రాయముతో నొకరి యభిప్రాయ మేకీభవించుటలేదు. భాగ్యవంతులగు నియోగులందఱుఁ దమకుమారులు గురూపులై, విద్యావిహీనులై యేవిషయమునందును బార్వతితోఁ బోలకున్నను రెండువేలరూపాయిలు, వెయ్యినూటపదార్లు కట్నమిచ్చినఁగాని, శరభరాజుగారిపిల్లను జేసికొనమని చెప్పుచుండిరి. సత్సంప్రదాయమునఁబుట్టి ప్రస్తుతము కొంచెము నీరసస్థితిలోనున్న నియోగులు, శరభరాజుగారితో వియ్యమంద

వలెననుకొన్నను దమస్థితికిని వారిస్థితికిని గల తారతమ్యమును బట్టి తమకు వారు పిల్ల నియ్యరని యడుగుటకు సందేహించి యూరకుం డిరి. శరభరాజుగారితల్లి "పిల్ల కట్టుతప్పిపోవుచున్నది. మనమందఱము గంగాప్రవేశముఁ జేయవలసివచ్చును. త్వరగా ముడిపెట్టు" మని తొం దరచేయుచుఁ గట్న మెంతయిచ్చిననుసరే కొంచె మన్నవస్త్రములకు లోపములేనివారి కియ్యవలెనని చెప్పుచుండెను. రాజగోపాలము రా మచంద్రునకుఁ దన చెల్లెల నిప్పింపవలెనని తల్లిదండ్రులతో నప్పుడ ప్పు డామాట చూచాయగాఁ జెప్పుచువచ్చెను. శరభరాజుగారు విశ్వ నాథశాస్త్రిలవారితోఁ గుమార్తె వివాహవిషయమై ప్రసంగించినపు డు శాస్త్రిలవారును, రామచంద్రుని గుణముల శ్లాఘించి యతనిని దమమనసులోనుంచుకొని యన్యాపదేశముగ "భాగ్యవంతులను బ్రతి మాలులుటకంటె బీదవాని కిచ్చుటేమంచిది" యని చెప్పుచు వచ్చిరి. శరభరాజుగారును బిల్లను ధనమునుగూడ గ్రహించి తెగనీల్గి సకల హింసలు బెట్టునట్టి భాగ్యవంతులనురాక్షసులతో వేఁగుట కష్ట మని యెంచి కుమార్తె యొక్కతే కనుక, తమకు లోకువయైనవాని కెవ్వ నికైననిచ్చి పెండ్లిచేసి యల్లు నిల్లఱిక ముంచఁదలఁచుకొను భాగ్యము తప్ప తక్కినశుభలక్షణములన్నియు రామచంద్రునియం దుండుటచేత నతనికిఁ బార్వతి నీయఁదలంచి యావార్తఁ దల్లి కెఱుఁగఁజేయఁగానా మె ప్రతిదినమును గలహమాడుచుఁ గొడుకును గోసిపెట్టుచు, రామ చంద్రునిఁ దిట్టుచుఁ, దన వార్ధకలక్షణములన్నియుఁ జూపుచుండెను. వేంకటరత్నము వివాహ మెట్లయినఁ గానీయకుండవలెనని మనసులో సంకల్పించుకొని సహజముగ వీనియం దయిష్టముగల శరభరాజుగారి తల్లిచెవిలో విషపుమాటలు చెప్పి యామె కసహ్య మెక్కువ చేయ సాగెను. చుట్టుప్రక్కలనున్న యమ్మలక్కలందఱుఁ, బార్వతి కనఁ బడినపుడెల్ల "ఓహోహో! రామచంద్రునిగారిభార్యా గాఁబోలు!

మాచిరాజువారికోడలా!" యని పరిహాసముచేయ నారంభించిరి. వార లట్లనుకొనుటమొద లదివఱకు రామచంద్రునితో స్వేచ్ఛగా మాట లాడుచున్న పార్వతి కెక్కడినుండియో మిక్కిలిసిగ్గువచ్చిమాటలా డుట మానెను. మాటలుపోఁగానే చూపులుగూడఁ దప్పెను. తనస్నే హితు లెవరైనఁ దన్నాలాగు నన్నప్పుడు వారితోఁ గలహమాడుచు బెద్దలన్నపుడు సిగ్గునఁ దలవంచుకొనుచుఁ, దల్లిదండ్రులదగ్గఱనెవరైన హాస్యమాడునపుడు వారిచాటునకుఁ బోవుచుఁ బార్వతి లజ్జాచి హ్నములఁ గనఁబఱచుచుండెను. అదిగాక త్రోవలో రామచంద్రుఁడు దారసిలునపుడు తలుపుచాటునకైనను, గోడమూలకైన నొదుగుచు వచ్చెను. రామచంద్రుఁడు దనస్నేహితులు దన్నుఁబార్వతిమగఁడ నుటచేతఁ గొంచెము సిగ్గుగల్గి తానేవస్తువైనఁ బార్వతినడుగవలసివచ్చి నపుడు ముఖావముగ నడుగుచువచ్చెను. ఆమెయు గోడచాటుననుండి ముసిముసినవ్వులు నవ్వుచు ముఖావముగానే ప్రత్యుత్తరముఁజెప్పుచు వచ్చెను. అదియట్లుండ శరభరాజుగారొకనాఁడు మధ్యాహ్నము ని ద్రలేచి గదిలోమంచముమీఁదఁ గూర్చుండఁగాఁగృష్ణవేణమ్మతలుపు నకుఁ జేరగిలఁబడి నిలుచుండెను. వేంకటరత్నము గూడ నక్కడ నొక బల్లమీఁదఁ గూర్చుండెను. వారిట్లు మాటాడిరి.

శర—ఏమిరా వేంకటరత్నము! జ్యేష్ఠమాసమునందుఁ దప్ప కుండఁ బార్వతికి వివాహముఁ జేయవలెను. రామచంద్రున కియ్య ఁదము నీకిష్టమేనా?

వేంక—నాయిష్టము చెల్లఁగలదా! అదిగో మావదినయున్న దిగదా. ఆమె నడగండి.

కృష్ణ—నామాట పాటికిరాదు. మీయన్నగారు మీరునాలో చించండి. మీకిష్టమైన సంబంధమే నాకిష్టమైనసంబంధము.

శర—అయ్యో! మనమందఱముఁ గూడబలుకుకొనవద్దా.

వాఁడు సద్గుణములు గలవాడు, బుద్ధిమంతుఁడులాగే కనుపడుతాఁడు

వేంక—అగపడుటమాత్రమే. నామనమున కతని కియ్యడము మంచిదికాదని తోఁచుచున్నది. ఏమిటండీ! కూడు గుడ్డలేక యిల్లువాకిలి లేక పొట్టకూటికిఁ జేరిన నిర్భాగ్యునకు మాణిక్యమువంటి పిల్లను గట్టిపెడుతామంటారు? ఎవరైన నవ్వరఁటయ్యా? యావజ్జీవ మాపిల్ల మనజీవమున కుసూరుమనిపోదా?

శర—అదృష్ట మున్నపక్షమున వాఁడే బాగుపడుతాఁడు. లక్షరూపాయల యాస్తి యున్నవానికిచ్చిన, నదృష్టము చాలకపోతే ముష్టిచెంబు చేతికి రాకమానదు.

వేంక—ఆలాగని ముష్టిముండకొడుకునకుఁ గట్టిపెట్టవచ్చునఁటయ్యా?

కృష్ణ—ఏలా గాలోచన చేసినను సరే, పిల్లయరిపేదది. కష్టమున కోర్వలేదు. పనిపాటలు చేయనక్కఱలేకుండనుండే యిల్లు చూచి యియ్యండి.

ఇంతలో రాజగోపాలము వచ్చి "బాబయ్యా! నాగరాజు మామగారు వచ్చినారు" అని చెప్పెను. తోడనే శరభరాజుగారు కృష్ణవేణమ్మను లోపలికివెళ్ళుమని తానెదురుగాఁబోయి మూలనున్న తివాసి వేంకటరత్నముచేతఁ జావడిలో వేయించి నాగరాజుగారిని జూచి "బావగారు! దయచేయండి" అని తివాసిమీఁదఁ గూర్చుండఁ బెట్టెను. వారికి క్రింది సంభాషణ జరిగెను.

శర—బావగారు! అక్కయ్యపిల్లలుసంతోషముగానున్నారా?

నాగ—మీదయవల్ల బాగున్నారు. మీకు శరీరములో సుఖముగా నున్నదా?

శర—సుఖముగానేయున్నది. మీరేపనిమీఁదదయచేసినారు?

నాగ—పనియేమున్నది మీలోపల కార్య మీయేఁడు చేయ

వలెనుగదా. మీకు మాకు మూఁడుతరములనుండి సంబంధములు విడిపోకుండఁ గలసి వచ్చుచున్నవి. మాకంటె మీకత్యావశ్యములు వేఱే లేరు. మీయిష్టమువచ్చిన యంత వరదక్షిణ యిచ్చి మీపిల్లను మా పిల్లవాని కియ్యండి.

వేంక—ఔను! వీరిపిల్లవానిని నేను జూచినాను. మనపార్వతి కంటె నాలుగేండ్లు పెద్దకాని; పిల్లవాఁడు కొంచెము పొట్టికుఱ్ఱవాఁడు తెలివిగలవాఁడు.

శర—ఏమి చదువు కొనుచున్నాఁడు? ఆంధ్రిమాగీర్వాణమా?

నా—చదువునకేమి నాలుగేండ్లయినది. రఘువంశ మారంభించినాఁడు. కాని మధ్యమధ్య నభ్యంతరములు వచ్చి మానుటచేత విస్తారము చదువలేదు. అయినను వానియీడునకుఁదగినచదువున్నది.

శర—ఈయేఁడు వివాహముచేయుట తప్పదు? ఒక నెలలోపుగా మీకు వర్తమానము నంపుతాను.

నాగ—మీయమ్మగారెక్కడ నున్నారు?

వేంక—"ఆమె పరున్నది. నేనువెళ్ళి లేపుతానుండండి" అని వెళ్ళి వేంకటరత్న మన్నపూర్ణమ్మను లేపినాగరాజుగారువచ్చినారని చెప్పఁగానే యామెలేచి యొక గదిలోనికి వెళ్లి రెండురెక్కతలుపుల లోనొకతలుపుదీసి రెండవతలుపుచాటునఁ గూర్చుండెను. అంతలో నాగరాజువచ్చి గదియవతలగోడదగ్గఱఁగూర్చెండెను. తోడనేయన్నపూర్ణమ్మ యెలుఁగెత్తి "అయ్యో! కూఁతురా! ఎంతపనిఁ జేస్తివే యమ్మా నాకడుపులోఁ జిచ్చు వెట్టిపోతివే యమ్మా" యని రోదన మారంభించెను.

నాగ—అత్తా! ఊరుకో. ఇదియొకనాఁటితోఁ బోయేదికాదు. నీవున్నన్నాళ్ళు నీలాగున నుండేదే. పెద్దదాన వైనందుకు వాళ్ళచేతి మీఁదుగా నీముప్పు దాఁటలేదు.

అన్న—నాగరాజు తండ్రి! చెట్టంతబిడ్డను దిగమ్రింగి సిగ్గు లేక తిరుగుచున్నాను.

నాగ—నీవు కడుదుఃఖింపకు. ఆపిల్లను బెట్టుకొని కాలక్షేపము చేయవలయునుగాని దుఃఖపడితే కార్యమేమున్నది? చచ్చినవాళ్ళు లేచిరారు గదా?

అని నాగరాజు చెప్పఁగా విని దుఃఖమును జాలించి గద్గదస్వరముతో నన్నపూర్ణమ్మ—నాయనా! కుఱ్ఱవానికిఁ బెండ్లయినదా నాకేసంగతి దెలియడములేదు.

నాగ—కాలేదు. శరభరాజుగారితోఁ జెప్పి మీపార్వతిని మాపిల్లవాని కిప్పింపు. కలసిన సంబంధము విడఁగొట్టఁగూడదు.

అన్న—శరభరాజు పెండ్లాము నున్నారు. వాళ్ళయిష్టమేగాని నాపెత్తన మేమున్నది? సగముచచ్చి నేనున్నాను. మునుపటియన్నపూర్ణమ్మనుగాను. నామాట వింటారానాయనా! లోపములేకుండఁ జెపుతాను.

నాగ—సరే! యోగమున్నపక్షమునఁ గాకమానదు. నేను వెళ్ళతాను. అనిచెప్పి శరభరాజుగారియొద్ద సెలవుదీసికొని వెళ్ళిపోయెను. అన్నపూర్ణమ్మ యేడ్చినకారణమిది. అప్పటికి రమారమిపదునొకండు సంవత్సరముల క్రిందట నన్నపూర్ణమ్మ కుమార్తె పార్వతి చనిపోయినది. అప్పటినుండి నాగరాఁ జెన్నఁడు నామెనుజూచి పరామర్శచేయలేదు. కుమార్తెవోయినతరువాత నాగరా జామెను జూచుట కదే ప్రథమము గావున దనకుమార్తె యాదినముననే చచ్చినట్లు రానిదుఃఖమును దెచ్చుకొని యొకవిధముగా నన్నపూర్ణ సంప్రదాయమును నిలిపెను. తరువాత జాముప్రొద్దుండఁగాఁ జుట్టు ప్రక్కల నున్నస్త్రీలందఱు శరభరాజుగారి యింటి కెప్పటివలెనే వచ్చుచుండిరి. అన్నపూర్ణమ్మ తులసికోట దగ్గఱ తాటియాకుల వత్తులపెట్టె

ముందుంచుకొని వత్తులు చేసికొనుచుండెను. కృష్ణవేణమ్మ ముక్కలి పీటమీఁదఁ గూర్చుండి నరసింహమునకు జడవేయుచుండెను. అప్పుడు రంగమ్మవచ్చి యిట్లనెను.

రంగ—అన్నపూర్ణమ్మత్తా! నీమనుమరాలికిఁ బెండ్లివారు వచ్చినారఁట. చెప్పనే చెప్పవయితివి?

అన్న—ఏమి గడుసుదానవే యమ్మా! ఇంకను వచ్చి కూర్చోనయినలేదు. ఇంతలోనే యెప్పుడు చెప్పను.

రంగ—అయినా మనుమరాలి పెండ్లి ముందఱ నీకుఁగనబడత్తామా యేమిటి?

అన్న—మరే, పెండ్లంతా నామొగముమీఁదనే నడుస్తుంది. మధ్యనాకుగర్వమెందుకు? ఆవు దూడయుండఁగా గుం జార్చినదఁట.

రంగ—ఆలా గనకత్తా పెద్దదానవు. ఈచలవంతా నీది. నీతరువాతనే యెవరైనా. అయితే యేమినగలు పెడుతామన్నారు.

అన్న—నాకుఁదెలియదు. ఆసంబంధము వీరికి సరిపడదమ్మా! మాయింటనున్న రామచంద్రునకిస్తారఁట. ఈలాటిసంబంధము దొరకదని కోరితెచ్చినారు!

ఇంతలో మంగమ్మ వచ్చెను.

రంగ—మంగమ్మా! విన్నావటమ్మా! వీళ్ళ పార్వతిని రామచంద్రుఁడన్న పిల్లవాని కిస్తారఁట.

మంగ—(బుగ్గను జేయిబెట్టుకొని) ఆయెట్టిపిల్లవానికా! ముష్టిసంబంధ మదేమిసంబంధమమ్మా! కొంచె మైనయింటివానికిఁ బిల్లనియ్యవలెనుగాని వీని కేమిటి పిల్లయేమిటి?

అప్పుడు పాపమ్మ వచ్చి కూర్చుండి యిట్లు మాటాడ నారంభించెను.

పాప—కృష్ణవేణమ్మా! నీకూఁతుని రామచంద్రున కియ్యడము నిజమేనా?

కృష్ణ—నాకేమి తెలుసును? మాయత్తగారున్నారు. తల్లికొడుకులు యోజించి యెవరి కిచ్చుచుంటారో. నాకెందుకమ్మా! నామాట వినేవారెవరు?

అన్న—పైకినాపెత్తనము. మగఁడు పెండ్లాము కూడఁబలుకుకొని చేస్తారమ్మా. నామాట లక్ష్యమెవరికి? నేనింత పిడచదాననే.

రంగ—నీకేమి యదృష్టవంతురాలవు. మనుమలు, మనుమరాండ్రు నీకేమమ్మా!

ఇంతలో శరభరాజుగారు వచ్చి "అమ్మా" యని పిలువఁగానే తల్లి వెళ్ళిపోయెను. అప్పుడు కుడిపైఁటను వేసికొని జానికమ్మవచ్చి కృష్ణవేణమ్మా! నీకుమాత్రెకుఁ బెండ్లిచేస్తారష! మీవారిబొట్టు కరఁగుతుంది.

కృష్ణ—నాబ్రతు కేలాగున్నదో వివాహ మాలాగున్నది.

రంగ—ఓబిడా కృష్ణవేణమ్మ! మీయింటి కెవరమ్మా వచ్చినారు? అప్పు డేడ్చినవా రెవరు?

కృష్ణ—మాయింటికి బంధువులు వచ్చినారు. మాయత్తగారికుమాత్రె పోయినతరువాత నామెను బరామర్శ చేయలేదు. అందుచేత నాబిడ దుఃఖపడినది. జానకమ్మా! యేమైన పాటలు పాడుదు! నీకంఠము బాగా సన్నముగా నుంటుంది.

రంగ—లంకాయాగము పాడవో.

మంగ—గోవిందనామములుపాడవమ్మా. నీకుబాగావచ్చును.

పాప—సీతసమేత పాడవమ్మా. కొంతసే పదిపాడి తరువాత దత్తునియజ్ఞము పాడవచ్చును.

జాన—మీరు పడుచువాళ్ళు. పడుచుపాటలుపాడుమంటారు. కృష్ణా రామా యని రెండుముక్క లనుకోనియ్యరుగదా. తరుణోపా

యము చూచుకొనవద్దఁటమ్మా? గోవిందనామములు పాడుతాను. మొన్న పాడి వదలిపెట్టినదగ్గఱనుండి పాడుతాను.

"ఉగ్రుఁడై శత్రుఘ్నుఁడు గోవిందారామ
కండ్లెఱ్ఱఁజేస్తేను గోవిందా
కండ్లు తెఱవని పసిబాల గోవిందారామ
శ్రుతకీర్తి కడుపగులునేమో గోవిందా

అంతట పాటలు వినకుండనే పాపమ్మ యిట్లు మాటాడ నారంభించెను.

పాప—మంగమ్మా! నీకూఁతునకు నెలదప్పినదఁట. నిజమేనఁటో!

మంగ—అప్పుడే యేలాగు తెలిసినదమ్మా? ఎంతదాఁచవలె నన్నను దాఁగదు. మాకర్మము నీకు వీరమ్మచెప్పినదాయేమి? పెద్దది గదా యని వీరమ్మతోఁ జెప్పినాను.

రంగ—వింటేనేమమ్మ? ఇంతలో తప్పా? విని సంతోషించే వాళ్లముగాని విచారింపము. పోని నాకెందుకమ్మా జానకమ్మా! పాట పాడవమ్మా. ఈగొడవ లెప్పుడు నీలాగుండేవే.

పాప—నీకు మనుమరాలు పుట్టినపక్షమున నాకొడుకునకిప్పించవమ్మా. కలసినవాళ్ళము.

మంగ—నీకొడుకు పాతికేండ్లవాఁడు. ఏలాగున నియ్యఁగలమమ్మా?

పాప—అదొకపెద్దఁటమ్మా! నామగనికి నాకు ముప్పదేండ్లు హెచ్చుతగ్గు. నేనాఱునెలల పిల్లనై యుండఁగా మాతల్లి నన్ను జేతిలోఁబెట్టుకొని పెండ్లిచేసినది.

మంగ—మాపిల్లను మేమియ్యము. మీకున్న భాగ్యమునకుఁ దోడు పిల్లకూడానా?

పాప—(కోపముతో) నీపిల్ల యెంత నీవెంత? ముష్టిపిల్ల యెవరి

కిఁగావలెను. నీభాగ్యము నీది నా భాగ్యమునాది. నా కొడుకు పెండ్లి గాకపోతే బ్రహ్మచారి యయియుంటాఁడు.

మంగ—బ్రహ్మచారికాకపోతే సన్యాసమిప్పించుకో నా కేమి?

పాప—ఆట్టిమాటలు రానీకు. కావలిస్తే నీకొడుకుకు సన్యాసమిప్పించుకో. (కృష్ణవేణమ్మవైపు దిరిగి)చూచినారమ్మా! నేనన్నమాటలలో తప్పేమున్నది. లోపముంటే నానోట గడ్డిపెట్టండి.

మంగ—కృష్ణవేణమ్మగారు! దీనికివచ్చినయేండ్లెవరికి వచ్చినవమ్మా? ఆవిడన్నమాటలు పిన్నారా?

కృష్ణ—ఆలులేదు చూలులేదు. కొడుకుపేరు సోమలింగ మన్నట్లు, మొదలు పిల్లపుట్టనైనాలేదు. దెబ్బలాట లెందుకు? ఊరకొండమ్మా. అవతలచావడిలో మావారున్నారు. ఆనక నాగొంతుఁబిసికి చంపుతారు.

రంగ—నేవెళ్ళిపోతానమ్మా సాయంకాలమయినది. సందెగుమ్మము లూడ్చుకోవలెను.

ఇట్లు మూర్ఖురాండ్రగు స్త్రీలు వృథా ప్రసంగములతోడను, వ్యర్థకలహములతోడను, నసంబద్ధప్రలాపములతోడను గాలముగడపి యిండ్లకుఁబోయిరి. అన్నపూర్ణమ్మకు రామచంద్రునియందుఁగోపము నిర్హేతుకముగానేవచ్చినది. రామచంద్రునియందేమియు లోపములేకున్నను, వేంకటరత్నముతోడ సహవాసముచేత నతనికిఁ గొన్నికొత్త కష్టములుకూడ వచ్చెను. ఒకనాఁడు జాముప్రొద్దెక్కినతరువాత,శరభరాజుగారు సావడిలోఁ గూర్చున్నప్పుడు బ్రాహ్మణుఁడొకఁడువిరిగిన కంటెను జేతఁబట్టుకొని, తాయి నూడఁదీసిన యొకయుంగరమును బుచ్చుకొని యతిత్వరితముగా వచ్చి శరభరాజుగారి యెదుట నిలిచి యీప్రకారముగాఁ జెప్పనారంభించెను.

బ్రాహ్మ—అయ్యా! శరభరాజుగారు! చూచినారా, మీ యింటనున్న పిల్లవాఁడు చేసినపని.

శర—ఎవరు? మారామచంద్రుఁడా? ఏమిపనిఁ జేసినాఁడు?

బ్రాహ్మ—రెండునెలలక్రిందటనాకొకకంటెను, తాయిచెక్కిన యుంగరమును దెచ్చి యమ్మినాఁడు. ఆపిల్లవాఁడు మీయింటిదగ్గఱను న్నవాఁడేకదాయని నేను సందేహింపక యావస్తువులను గొన్నాను. ఇది కరఁగించ నిత్తడివస్తువై పోయినది. ఇత్తడికంటె నాకమ్మినాఁడు. ఇది వజ్రమని యుంగరములో తాయిచూపించినాఁడు. ఇదేదోగాజు తాయి. నాకొంపత్రవ్వినాఁడు. యాయవారముఁ జేసిచేసి యాచించిన సొమ్ముపెట్టి యీనగలు కొనుక్కొన్నాను.

ఈమాటలువినఁగానే శరభరాజుగా రాశ్చర్యపడి రాజగోపాల మును బిలిచి యతని కేమయిన నీసంగతి దెలియునేమోయని యడిగె ను. కాని యతఁడును మహాశ్చర్యనిమగ్నుఁడై తానెఱుఁగనని చెప్పఁగా రామచంద్రుని బిలువుమని యాతనికి శరభరాజుగా రాజ్ఞనిచ్చిరి. రా మచంద్రుఁడు స్వచ్ఛమైనమనస్సుతోను, భయముతో వెలవెలబాఱు మొగముతోను వచ్చి శరభరాజుగారియెదుటఁ గూర్చుండెను. ఆతనిఁ జూడఁగానే బ్రాహ్మణుఁడు గుర్తుపట్టుకొని "ఎంతవాఁడవురానాయ నా! నాకొంపత్రివ్వినావురా"యని యఱచెను. శరభరాజుగారావస్తు వును జేతఁబట్టుకొని యతనిమీఁద వచ్చిన యీనేరమునంతను జెప్పి యిట్లని మాటలాడ నారంభించెను.

శర—రామచంద్రుఁడూ! ఈ విషయములో నిజముచెప్పు. ఈ వస్తువుల నీబ్రాహ్మణున కమ్మినావా లేదా?

రామ—ఆవస్తువులను నే నీబ్రాహ్మణునకు విక్రయించినాను.

బ్రాహ్మ—చిత్తగించండి. నే నబద్ధ మాడలేదు. అయ్యో! అయ్యో! చంపినావురా.

రామ—వేంకటరత్నముగారిని బిలిపించండి. రాజగోపాలము! వేంకటరత్నముగారిని తీసికొనిరావయ్యా.

అని రామచంద్రుఁడు చెప్పఁగా రాజగోపాలము వేంకటరత్నమును దీసికొనివచ్చెను.

రామ—అయ్యా! నేను దీనిరహస్యమంతయు మీకుఁ దెలియఁజెప్పెదను వినండి. రెండునెలలక్రిందట నొకనాఁటిరాత్రినేనుదీపమువెలుఁగునఁగూర్చుంటిచదువుకొనుచుండఁగా, వేంకటరత్నముగారు నన్నుఁబిలిచి సూర్యనారాయణగారి చేతిలోనుండి యీవస్తువులనుబుచ్చుకొని నన్నమ్మిపెట్టుమన్నారు—

వేంక—ఛీ! నోరుముయ్యి. నామీఁద—

శర—(మాటకడ్డమువచ్చి) అతఁడు చెప్పఁదలఁచుకొన్నదంతయుఁ జెప్పనిమ్ము. ఆసూర్యనారాయణ యెవరు? అతని దేగ్రామము? వారి యింటిపేరెవరు?

రామ—ఆయన యింటిపేరు నేనెఱుఁగను. ఆయనకోటిపల్లికాపురస్థుఁడనియు, మిక్కిలి గొప్పవాఁడనియు నాతో వేంకటరత్నముగారు చెప్పి నాచేత నీవస్తువుల నమ్మించిరి.

శర—వేంకటరత్నము! నీ వేమెఱుఁగుదువు?

వేంక—అన్నయ్యా!వస్తువులనుగొన్నవాఁడుదగ్గఱనున్నాఁడుగదా? నేనమ్మినానో బేరముజేసినానో యందులో నాజోక్యమున్నదేమోకనుఁగొనుఁడి. నేనిందులో నాప్రమాణముగా నేపాపము నెఱుఁగను. ఆసూర్యనారాయణ యెవరో యిప్పుడు విన్నాను.

రామ—నాప్రమాణముగ నేనింతకంటె నేమియునెఱుఁగను. ఆవస్తువులు నావికావు.నన్ను మీచిత్తమువచ్చినట్లుశిక్షచేయవచ్చును. కాని న్యాయముఁగనుఁగొనండి.

బ్రాహ్మ—అయ్యో! ఈపనియంతయురామచంద్రునిదేకాని

మఱికయొకరిదికాదు. వేంకటరత్నముగారు దీనిలో నేమియునెఱుఁగరు

రాజ—బాబయ్యా! ఈవిషయము పూర్తిగా విచారించినఁ గాని యేపనిఁ జేయవద్దు?

శర—విచారించుట కేమున్నది? వస్తువులమ్మినవాఁడు రామచంద్రుఁడే? ఇటువంటి దొంగపిల్లవానిని మనయింటఁ బెట్టుకొనుట మనకుముప్పే.

వేంక—మహారాజులాగు మీరింతయన్నము బట్టబెట్టిసంరక్షణఁజేయుచున్నందుకుఁ దినియుండలేక దొంగపని జేయమొదలుపెట్టినాఁడు. తినఁగాఁదినఁగా గారెలు చేదైనవఁట. ఓరీరామచంద్రుఁడు! నీ కంతడబ్బు కావలసినపక్షమున వారినడిగితే వారేయిత్తురుగదా. దొంగగడ్డిదిని నామీఁదఁగూడ నేరము పెట్టవలెనని యనుకొన్నావు నేను లేచినవేళ మంచిదే.

బ్రాహ్మ—ఓరీ దిక్కుమాలిన ముండకొడుకా! నాకు నీవు డబ్బెక్కడనుండి తెచ్చియియ్యఁగలవు? శరభరాజుగారూ! మీ రింటిలోనుండి యీనిర్భాగ్యుని లేవఁగొట్టివేసెదరు సరే, నాడబ్బుమాట యేమిటి? నేనిఁక నీళ్ళు వదలుకొనవలసినదేనా?

శర—నేనేమిచేయను?

బ్రాహ్మ—అయ్యో! అయ్యో! నూటయేబదిరూపాయలు నీ పిండాకూడుమీఁదఁ బెట్టినాను. నీజీవమున కుసూరున నేడ్చుచున్నాను? (అని యేడ్వఁజొచ్చెను.)

ఇంతలో నొకదాసి చేతితోఁ జీటి బట్టుకొనివచ్చి "రామచంద్రుఁడుగారెక్కడనున్నారండి" యని యడిగెను.

శర—ఎందుకు? ఆచేతిలోనిచీటి యేమిటి?

దాసి—మాయమ్మగారు రుత్తరమిచ్చినారు. అయనకేకాని నే నియ్యను.

శర—మీయమ్మగారెవరు? నీ వెవరిదాసివి?

దాసి—చంద్రముఖమ్మగారిచ్చినారు. ఆయన యెక్కడండీ?

శర—ఆచీటి నీలాగియ్యి. (అనిలాగికొని చదువుచున్నాఁడు.)

"ప్రాణేశ్వరా! మీరువ్రాసినయుత్తర మందినది. ఈవేళసాయంకాలముమీరును రాజగోపాలముగారును రావచ్చును. వేంకటరత్నముగారపు డింటివద్దనుండరు." అని చదివి యిదేమిటి? భోగముదానికుత్తరములువ్రాసి తెప్పించుకొనుటఁగూడ సాగించినావు? విధవా! రాజగోపాలము! అతఁడు నీవు జేసిన స్నేహమిందుకా? ఓరి దౌర్భాగ్యుఁడా! ఆవిధవనుగూడి చెడిపోయినావా?

రామ—అయ్యా! నేనెన్నఁడు దానికుత్తరమువ్రాయలేదు. ఇదియంతయు వేంకటరత్నముగారి మాయోపాయము. నేనేమియు నెఱుఁగను.

శర—వేంకటరత్నము! ఇతఁడువ్రాసిన యుత్తరముతోఁగూడ జంద్రముఖిని తీసికొనిరా.

తోడనే వేంకటరత్నము రామచంద్రునికి జరిగిన మహాపరాభవమునకు సంతోషించుచుఁ దన ప్రియురాలిని బిలిచుకొనివచ్చి వారియెదుట నిలువఁబెట్టెను.

శర—ఏమే చంద్రముఖీ! నీకితఁ డుత్తరమును వ్రాసినాఁడా?

చంద్ర—తలవంచి వ్రాసినారండి. ఇదిగో—

శర—(చీటి బుచ్చుకొని యిట్లు చదివెను.)

"నీవునా కీవేళ నొక్కమాఱు మొగముజూపించి తిరిగి లోపలకువెళ్ళినావు. నీతో మాట్లాడవలెననియున్నది. నీకువీలెప్పుడో తెలియఁజేసినపక్షమున నేను దప్పక వచ్చెదను. నీతోమాట్లాడకుండ నేనుండలేను." ఈవెరుకటియుత్తరమును జదువఁగానే శరభరాజుగారు రామచంద్రునితో నిట్లనెను.

శర—రామచంద్రుడూ! నీవాఁత యవునా కాదా?

రామ—వాఁతఁనాదేకాని, వేంకటరత్నముగారు దనమేనల్లునకునాచేవాఁయించినారు. పై పేరును,గిందవాఁలునక్కఉలేదన్నారు

చంద్ర—ఈయుత్తరము నాకీదాసి పట్టుకొనివచ్చినదండి!

శర—ఏమే! దాసిదానా, నీకీయుత్తరమెవరిచ్చినారు?

దాసి—ఆబాపనయ్య నాచేతికిచ్చి మాయమ్మగారి కిమ్మన్నాఁడండి.

శర—ఏగుణములున్నను దొంగతనము, లంజతనము, లేకపోతే భరింపవచ్చును. కాని, యవియున్న వానిని భరింపలేము. రామచంద్రుఁడూ! ఈదినము మొదలు నీవు మాయింట నుండవద్దు. నీదారి నీవు చూచుకో.

ఆమాట వినఁగానే రామచంద్రుఁడు దనమీఁదఁబిడుగుపడినట్లు దేహమెల్ల ఝల్లుమన దుఃఖముఁ బట్టజాలక వీథిలోనికి లేచిపోయెను. ఇంతలో విశ్వనాథశాస్త్రిలవారిసంగతి యంతయువిని వచ్చికోపావేశముతో నోటమాటరాకయున్న శరభరాజుగారినిజూచి మాటలాడుట కది సమయముగాదని కొంచెముసే పూరకుండెను.

శర—ఎంతపనిజేసినాఁడండి! ఏమోమంచివాఁడనుకొన్నాను.

వేంక—నేను మొదటినుండి యాలాగే యనుకొన్నాను. వాని నాలిముచ్చుగుణములు, నంగినంగిమాటలు, దొంగదొంగచూపులు, నక్కవినయములుఁ జూచి వీఁడుత్తతుంటరియని నేనిదివఱకేయనుకొన్నాను. మీరే పొరపాటుపడినారు.

విశ్వ—ఇంతపనిఁ జేసేవాఁడు కాఁడు. చిన్నతనముచేఁ బొరపడ వచ్చును.

వేంక—చిన్నతనమా? వాఁడెక్కడిచిన్నవాఁడు? టంకంధరణ మేండ్లున్నవి. సిద్ధాన్నముబోర్లఁదోసికొన్నాఁడు. మీఁదుమిక్కిలిరాజ

గోపాలమునుగూడఁ జెఱచుచున్నాఁడు. ఇంటఁదిని యింటివాసములు లెక్కవెట్టినాఁడు. ఎంతబాగుచేయఁదలఁచుకొన్నాము. వానికి యోగ ములేదు.

శర—మాపార్వతి గొంతుకఁ గోసినానుగాను నయమే. నా మెత్తఁదనము లోకువగట్టి యిష్టమువచ్చినయాట లాడినాఁడు. దొంగ తనము దాఁగదండి. చిత్రిము!

వేంక—ఎప్పటికయినఁ బాపము బ్రిద్దలవక మానదు.

బ్రాహ్మ—అయ్యా! నే సెలవుదీసికొని వెళ్ళనా? శరభరాజు గారు! నాకర్మమింతే. ఈముండకొడుకు నాకొఱకు దాఁపరించినాఁడు. అని వెళ్ళెను.

అందఱును రెండుజాము లయినందున భోజనములకు లేచిరి. వేంకటరత్నము మాయోపాయమునందుఁ దనకుఁగలప్రజ్ఞనుజూపించి యిత్తడివస్తువును, గాజుఱాయివేసిన యుంగమును రామచంద్రుని చేత నమ్మించి రామచంద్రుఁ డాదినమున వ్రాసిన యుత్తరమును దాఁచి తుద కాలాగునఁ జంద్రముఖి కతఁడు వ్రాసినాఁడనిచెప్పి విప త్సముద్రము త్రిప్పి యందులోఁ గుఱ్ఱవానిని బడవైచికృతకృత్యుఁడై సఫలమనోరథుఁడై సుఖముగా నుండెను. రాజగోపాలము మాత్రము కంటెను రామచంద్రుఁ డమ్ముటచేతను, జీటిలో నున్నవ్రాఁతయతని దేయగుటచేతను, రామచంద్రునిమీఁదఁ గొంచె మనుమానపడుచు నతఁడట్టివాఁడు కాఁడని దృఢపఱచుకొనుచుఁ దండ్రిగారు దగిన విచా రణచేయక తొందరపడినారని నొచ్చుకొనుచు స్నేహితుని కొఱకు విచారించుచుఁ దనమీఁదఁ గూడ నిందవచ్చినందులకు సిగ్గుపడుచుఁ దండ్రిగారు భోజనానంతరముననిద్రించునపుడువిశ్వనాథశాస్త్రిలవారి వీధియరఁగుమీఁదఁ గూర్చున్న రామచంద్రునియొద్దకుమెల్లమెల్లగాఁ బోయి యతనియొద్దఁ గూరుచుండెను. రామచంద్రుఁడును సిగ్గుచే

వంచినతలయెత్తక నేత్రములనుండి బాష్పములు రాల గోడకుఁ జేరగిలఁ బడియుండెను. రాజగోపాలముకూడ మిక్కిలి విచారించుచుఁదుదకు దానే ముందుగాఁ బలుకరించెను.

రాజ—రామచంద్రుఁడూ! ఎందుకు విచారించెదవు? కాలవశముగాని నీలోపము లేదు. ఇందులో జరిగినసంగతి నీవామూలాగ్రముగ నాకుఁ దెలియఁజెప్పు. స్నేహితులదగ్గఱ దాఁచవలసినసంగతు లుండవుగదా!

రామ—రాజగోపాలమూ! నీకుఁగూడ నామీఁద ననుమానమున్నదిగదా. ఈవిషయమునం దేదోషము నాయందులేదు. అని రామచంద్రుఁడు యావద్వృత్తాంతమును రాజగోపాలమునకుఁ దెలియఁజెప్పెను. అదివిని రాజగోపాల మిట్లనియెను.

రాజ—మాబాబయ్య తొందరపడినాఁడు. చక్కగా నాలోచింపలేదు.

రామ—నన్ను మీరింటనుండి పొమ్మనుటలో నాకన్నవస్త్రములకు లోపము వచ్చినదని విచారములేదు. లోకములో నామీఁద వచ్చిన యీనింద యాచంద్రతారార్కమును బోదుగదా! యనియు నన్నందఱు దుర్మార్గుఁ డనుకొందురనియు నాకు విచారముగానున్నది దాదాపుగా రెండు సంవత్సరములు మీయింట నున్నను శరభరాజుగారు నాగుణమంతమాత్రము తెలిసికొనలేకపోయిరి. పయిగానిన్నుఁ గూడఁ బాడుచేయుచున్నానని యన్నారు. ఈవిషయమయి నేనేమియునెఱుఁగను. వేంకటరత్నముచేయుచున్నమాయలెఱుఁగక యందులోఁబడిపోయినారు. ఏమొగముపెట్టుకొని యీగ్రామమందుందును? నన్నెవ్వరు గుమ్మములోనికి రానియ్యరు. నాకర్మగతి యింతమట్టుకు వచ్చినది. ఈయవమానమును నే భరింపఁజాలను. ఈగ్రామమునుండి యీవేళనే వెళ్ళిపోయెద. అని కన్నీళ్ళు దెచ్చుకొని నాకుఁ దమ్ముని

వలెనున్న నిన్నువిడిచి యేలాగునఁ బోఁగలను? నేఁటికి నే నమలాపురమునకు దొంగనయినాను నాకు నేఁటితో ఋణము దీరినది. నేను జేసిన తప్పులన్నియు క్షమించి నామీఁదఁ గటాక్షముంచు.

రాజు—(కన్నీళ్ళతో) రామచంద్రుఁడూ! నీవు నన్నేలాగున వదలఁజాలకున్నావో నేను నిన్నాలాగునే వదలలేకున్నాను. మనల నిద్దఱిని దైవమింతక్రూరముగా నెడఁబాపి సందులకు నాదుఃఖమునకు బరిమితిలేదు. నీసద్గుణములు, నీప్రవర్తన నేను మఱువఁగలనా? నేను నిన్ను క్షమించుటకు నీవు నాకెన్నఁడు నేయపరాధముఁ జేయలేదు. నిజము నిలకడమీఁద దెలియును. గ్రామమున నింకెవ్వరికి ననుమానములేదు. నీవీదినమున విశ్వనాథశాస్త్రిలవారి యింట భోజనముచెయ్యి. నాతోఁ జెప్పకుండ నీవీగ్రామము వదలఁబోకు. సాయంకాలము నీకు నేసంగతియు వర్తమానము నంపెదను. మాబాబయ్య లెచేవేళయయినది. నేను వెళ్ళవలెను. అని వెళ్ళెను.

రామచంద్రునకు జరిగిన మహావమానమునకు నాతని స్నేహితులు జాలిపడుచుండఁగా శోభనాచల వేంకటరత్నములు నిర్విచారముగా నుండుటయేకాక తమ కతఁ డదివఱకుఁ జేసినయపకారమునకు వాని నొకమాఱు కొట్టవలెనని నిశ్చయించిరిగాని శరభరాజుగారి యింట నున్నంత కాలము వారికి వీలయినదికాదు. నేఁడు రామచంద్రుఁడు శరభరాజుగారి యింటనుండి వెళ్ళిపోవుటచేత వారిస్వాధీనమయ్యెను.

రామచంద్రుని సంగతి యంతయు విని కొందఱువచ్చియాతని జూచి పరామర్శ చేసిరి. కొందఱుతనస్థితికి విచారించిరి. విశ్వనాథశాస్త్రిలవారు రామచంద్రుని గొంచెము బ్రతిమాలి లోపలికిఁ దీసికొనిపోయి యన్నముఁబెట్టించిరి. శరభరాజుగారియింట రామచంద్రుఁడున్నప్పుడతనియొద్దకువచ్చి యిచ్చకములాడువారందఱును దనకుఁబ్రా

ణస్నేహితు లనినవాఱందఱును లేశమునువానికి సహాయమునుచేయ రైరి. రామచంద్రుఁడు సద్గుణుఁడనియు సత్ప్రవర్తనగలవాఁడనియు స్తోత్రముఁ జేసినవారిప్పు డితఁడు మహాదుర్మార్గుఁడని నిందించిరి. అప్పుడు సాయంకాలముకాఁగా దేవదర్శనముచేసి రామచంద్రుఁడు శాస్త్రులవారి వీధియరఁగుమీఁదఁ గూర్చుండఁగా నతనిసహాధ్యాయుఁ డొకఁడు వచ్చి రామచంద్రునితో నిట్లుమాట్లాడెను.

సహా—రామచంద్రుఁడూ! నీకుఁ దటస్థమయిన మహాపదను గుఱించి నాకు విచారముగానున్నది. నీ వమలాపురములోనేయుందువా? ఎక్కడి కయినను బోఁదలఁచుకొంటివా?

రామ—నేనీరాత్రి ముక్తేశ్వరము వెళ్ళిపోతాను. ఈయవమానమును నేను భరింపలేను.

సహా—నిజమే! నామాట విని నాలుగుగడియల రాత్రి యయినతరువాత బయలుదేఱి ముక్తేశ్వరమువెళ్ళు. ఇఁక నీవీగ్రామమునం దుండఁగూడదు. నీకు నే నొకయుపాయముఁ జెప్పఁదలఁచుకొన్నాను. నీక్షేమముకొఱకే. నీకిష్టమైనపక్షమున విను.

రామ—అయ్యో! వినకేమి యీసమయమునందు నామేలు గోరువారు రాజగోపాలము నీవు గాక యింకెవ్వరు?

సహా—నాతోఁగూడరా. అనిచెప్పి యతఁడు రామచంద్రుని జెఱువుగట్టునకుఁ దీసికొనిపోయి యొకచెట్టుక్రిందఁ గూర్చుండఁబెట్టెను. సందెచీఁకటి కనుక మొగమున మసిబూసికొని యిద్దఱు మనుష్యులు కఱ్ఱలుబుచ్చుకొని తప్పత్రాగినకంపే ముందుగా వారి రాకను దెలియఁజేయ, వచ్చి గట్టుక్రిందఁ గూర్చున్న సహాధ్యాయుని బట్టుకొని తలమీఁద దయాదాక్షిణ్యములులేక కొట్టుచుండిరి. అప్పుడుసహాధ్యాయుఁడు "నేనురో నేనురో కొట్టకండి" యని కేకలు వేయుచున్నను స్మారకము దెలియదు గనుక వారి కామాటలు తెలియక

తమపని మానరైరి. అట్లు వారు తమపనిఁ గడతేర్చిపోయిన వెనుక రామచంద్రుఁడు దనకు సహాయముఁ జేయవచ్చిన వాని కింత మహాపద గలిగినదని విచారించుచు నితనితల పగిలిరక్తము వచ్చుచున్నందున దానిఁమీఁదఁ దడిగుడ్డ వేయఁదలఁచి గుడ్డతడుపుటకయి చెఱువు గట్టునకు వచ్చెను. నీళ్ళలోదిగి గుడ్డతడిపి మరల గట్టెక్కుచుండఁగా నొకచాకలివాఁడు పరుగెత్తుకొనివచ్చి రామచంద్రుని జూచి యిట్లనియె.

చాకలి—అయ్యా! రాజగోపాలముగారు తమ కీచీటిని నీమూటనిమ్మని చెప్పినారు. అని రహస్యముగాఁ జెప్పి వెళ్ళిపోయెను.

రాజగోపాల మిచ్చిన యుత్తరమును జెఱువుగట్టున నెవరోదృష్టిదీయుటకుఁ బెట్టిన యొకమూఁకుడులోనున్న దీపముముందఱ చదువుకొనుచు బాధపడుచున్న సహాధ్యాయుని మొగముఁజూడక తిరిగి యక్కడకురాక వెళ్ళిపోయెను.

ఏడవ ప్రకరణము.

శోభనాచలమును, వేంకటరత్నమును, వారిమిత్రిమండలమును రామచంద్రునిమీఁదఁ గసిదీరక, యతఁడారాత్రి ముక్తేశ్వరము వెళ్ళుననుకొని, వారుగూడ వెంబడింపవలెనని నిర్ధారణచేసికొనిరి. రామచంద్రుఁడారాత్రి విశ్వనాథశాస్త్రులవారి యింటికి భోజనమునకుఁ గాని, పరుండుటకుఁగాని రాలేదు. శాస్త్రులవారి శిష్యులు గ్రామమునందంతటను వెదకిరిగాని రామచంద్రుఁడు మాత్రము వారికగుపడలేదు. శాస్త్రులవారు రామచంద్రుఁ డెందులోనో దిగి చచ్చినాఁడని

మోచించిరి. రామచంద్రుని బట్టుకొనుట కిద్దఱు మనుష్యులను వెంటఁబెట్టుకొని శోభనాచల మారాత్రిజామయిన తరువాత బయలుదేఱెను. ఎంతదూరము వెళ్ళినను రామచంద్రుఁడు వారికగపడలేదుగాని చీఁకటిలో వచ్చుచున్న వారి కొకవిధమయిన యాపద తటస్థమైనది. ఒక పుంతమార్గమునుండి కొంతదూరము వోయినతరువాత మార్గమున కిరుప్రక్కలను గ్రిక్కఱసి, యొక దాసియగ్రము నొకటి స్పృశించిపొదరిల్లువలె నల్లుకొనియున్న దట్టమైన చెట్లక్రిందనుండి వారునడచుచుండఁగా దైవవశమున శోభనాచలమునకుఁ బాముగఱచెను. కఱచినతోడనే యతఁడు తనతోఁగూఁడ వచ్చుచున్న వారికాసంగతిఁ దెలియఁజెప్పి, యొక యడుగైననుఁబెట్టఁజాలక, యొక చెట్టుక్రిందఁ బయిమీఁదఁ బట్టను బఱచుకొని పరుండెను. అక్కడ నౌషధము లేవియు లేవు. అతని చెలికాండ్రిద్దఱును శోభనాచలమునకై విచారించుచు మార్గమున నెవ్వరైన వత్తురేమో వారి సాహాయ్యము బుచ్చుకొందమని రెండువైపులఁ జూచుచుండిరి. అప్పు డిఱువదిసంవత్సరములువయస్సుగల యొక వైష్ణవుఁడామార్గమునఁ బోవుచు మాటిమాటికి వెనుకకుఁదిరిగిచూచుచుఁ జీమచిటుక్కుమన్న నక్కడఁ గొంతసేపు నిలిచి యా ధ్వనికారణమును దెలిసికొనుచు ధ్వనియైనప్పుడెల్ల నులికిపడుచు, సన్నమైన పట్టెనామములు బెట్టుకొని, శరీరమున ద్వాదశోర్ధ్వపుండ్రములు లేకయే దక్షిణదేశపుపంచెనొకటి గట్టుకొని రెండవపంచెను దలమీఁదకు ముసుగువచ్చునట్లు శరీరమునిండఁ గప్పుకొని యా మార్గమునఁ బోవుచుండెను. ఆతని జూడఁగనే శోభనాచలముయొక్క స్నేహితులిద్దఱును, సంతోషించి యతని సమీపమునకుఁ బోఁగా వైష్ణవుఁడు భయముతో వడవడ వణఁక నారంభించెను. అంతట వారిట్లు మాటలాడ నారంభించిరి.

ఒకఁడు—అయ్యా! మేముదొంగలముగాము. మీరు భయపడ

నక్కఱలేదు. మేము మిక్కిలి యవసరమైన పనిమీఁద ముక్తేశ్వర మునుండియమలాపురమునకుఁ బోవుచున్నారము. దైవవశముచేత మా యజమానునిఁ బురుగు ముట్టుకొన్నది. తమకేమైన మంత్రిమువచ్చిన పక్షమున నాయనను బ్రతికింపవేఁడెదము.

వైష్ణ—అయ్యయ్యో! నాకు మంత్రిమేదియు రాదు. నాద గ్గఱ మందున్నది. ఆమనుష్యుని నన్నుఁ జూడనియ్యండి. అమందు నూరిపోస్తాను.

రెండ—తమపే రెవరండి ఆచార్యులువారు.

వైష్ణ—రామానుజాచార్యులు. నన్నుమీ రేమయిన నెఱుఁ గుదురా?

రెండ—ఎఱుఁగను. కాని, మొగముచూచినట్లున్నది. అమ లాపుర మెప్పుడైన వచ్చినారా?

వైష్ణ—అమలాపురంలో నన్నుమీరు చూడలేదు. మాది తాటిపాక కాపురము. నీవు నన్నెఱుఁగవు. మాది యమలాపురము గాదు.

ఒకఁడు—అయ్యా! ఈలాగు దయచెయ్యండి. ఇదిగో పాము గఱచిన మనుష్యుఁడిక్కడఁ బరున్నాఁడు. బొటనవ్రేలిమీఁదఁ గఱచి నది. దేహమంతా చెమటలు పట్టినది. కాలు వాఁచినది. నోటినుండి నురుగులు గ్రక్కుచున్నాఁడు.

వైష్ణ—స్మారకము దెలియనట్లున్నది. అని దగ్గఱకుఁ బోయి చూచెను.

సర్పదష్టుఁడైన శోభనాచలమును జూడఁగనె వైష్ణవునకు మొ గమున వికాసము దప్పిపోయెను. శోభనాచలమునకు స్మారకముదెలి యకపోవుట వైష్ణవున కావహించెను. ఆసేవకు లిద్దఱును శోభనాచ లమున కెట్లున్నదనియు, మందువేయుమనియు వారనుచున్నమాట

లతనికి వినఁబడవయ్యెను. కాని కొంతసేపాలోచించి ధైర్యముఁ దెచ్చుకొని, మూటనున్న కుప్పె నొకదానిని తాతిమీఁద నరుగఁదీసి మందుపోసి, మొదటి మోతాదు కొంచెము పని చేయువఱకును వైష్ణవుఁడక్కడనుండి, తానతిత్వరితముగా ముక్తేశ్వరము పోవలయునని వారితోఁజెప్పి మఱిరెండు మోతాదులయౌషధము వారికిచ్చి రెండు గడియల కొకమారు మందిమ్మనిచెప్పి తాను వెళ్ళిపోయెను. అతఁడు వోకముందే శోభనాచలమునకుఁ గొంచెము నెమ్మదిగానుండెను. పొరపాటుచేత నావైష్ణవుఁ డచటఁ దన తాటియాకులపుస్తక మొకదానిని వదలిపోయెను. కొంతసేపటికి శోభనాచలమునకుఁ జలివేసినందున స్నేహితులిద్దఱును దాటియాకులఁ బోగుచేసి చలిమంట వేయుచు, దాని వెలుతురున నాపుస్తకమును జూచి యందులో దోపఁబడినయొక తాటియాకు చీటిని దీసి వారిలోనొకఁ డిట్లుచదువ నారంభించెను.

"ఓ రామచంద్రుఁడూ! నీవీరాత్రి యమలాపురమున నున్న పక్షమున బ్రతుకలేవు. నీవొక సహాధ్యాయునితోఁ దిరుగుచున్నావఁట. వాఁడు నీస్నేహితుఁడుకాఁడు. శోభనాచలము మొదలగువారు నిన్నుఁ గొట్టవలెనని యోచించి నిన్నుఁ జెఱువుగట్టునకుఁ దీసికొని రమ్మని వానిని బంపినారు. నీవీరాత్రి యెకాయెకీని ముక్తేశ్వరము వెళ్ళవలసినది. నేను బంపిన మూటలోఁ దిరుచూర్ణముఁ, దిరుమణి, దక్షిణదేశపుబట్టలుఁ దేలు, పాములవలని భయము రాకుండఁ గొన్నిమందులు నున్నవి. వైష్ణవ వేషమును వేసికొన్నపక్షమున వారు నిన్నాశవాలు పట్టలేరు. నిన్ను నేను ద్వారలోనే చూడఁగలను." అని యామనుష్యుఁడు చదువఁగానె రెండవవాఁడు నాలుక గఱచుకొని, చేయి జాడించుకొని విచారసూచముగా నిట్లు మాటాడెను.

రెండ—అయ్యయ్యో! తెలివితక్కువ నిర్భాగ్యులము. ఇప్పుడు మనకు మందిచ్చిన యీవైష్ణవకుఱవాఁడే రామచంద్రుఁడు.

మన మెంత యదృష్టహీనులము. ఆకుట్టువాఁడు మంచి యదృష్టవంతుఁడు. వాఁడు చెఱువుగట్టునఁ గూర్చున్నప్పుడు మనము పంపిన మనుష్యులు త్రాగి రామచంద్రుఁడనుకొని మన మనుష్యునే కొట్టినారు. వాఁడు సెప్పినది నిజమే. వీఁడు ముక్తేశ్వరమే వెళ్ళుచున్నాఁడు. వీనిని దిరిగి తరుముకొని వెళ్ళుదమా ?

ఒకఁడు—వద్దు వద్దు. ఈవల శోభనాచలముయొక్క స్థితి బాగుండలేదు. ఆవైష్ణవుఁడు దప్పకుండా రామచంద్రుఁడే. ఆహాహా ! ఎంత మంచివాఁడో చూడు! శోభనాచల మతనికిఁ బరమశత్రువైనను వాని కెంత మంచిమందు లిచ్చి వానిప్రాణము నిలిపినాఁడో చూడు. అతఁ డూరకున్నపక్షమున శోభనాచలము చచ్చును.

రెండ—వాఁడు వీనికి విరోధి. చావవలెనని మందులిచ్చినాఁడేమో! ఆమందు వేయవద్దు. ఆనక ప్రాణభీతి రాఁగలదు. వాఁడు దొంగముండకొడుకు.

ఒకఁడు—రాజగోపాలము కొన్నిమందులఁ బంపినట్లు తాను జాబువ్రాసినాఁడు. అవి మంచిమందులు. అవే రామచంద్రుఁడు మనకిచ్చినాఁడు. ఆతఁడు మహానుభావుఁడు. అతనికి మనము నమస్కరించవలెను.

రెండ—శోభనాచలమూ! ఇప్పుడేమి చేయుచున్నావు ?

శోభ—మాయింటికిఁ దీసికొనిపోయి మాయమ్మను జూపించండి. నేను బ్రతుకను.

అంతట వారిద్దఱును శోభనాచలము నెట్లయినఁ దీసికొని పోవలెనని యాలోచించుచుండఁగా నొకబండియామార్గమునఁబోవుచుండెను. ఆబండివాని కర్థరూపాయ నిత్తుమని చెప్పి శోభనాచలము నాబండిమీఁద వేసి తీసికొనిపోయిరి.

అట్లు శోభనాచలము మొదలగువారిచేతఁ దెలియఁబడకుండ

దాఁటి రామచంద్రుఁడు ముక్తేశ్వరమునకుఁ బోవుచుండెను. ఆదినము కృష్ణపక్ష నవమిగనుక పదునెనిమిదిగడియల రాత్రివేళకు, శత్రువులఁ దప్పించుకొని వచ్చినందులకు రామచంద్రున కుదయించిన యల్పసంతోషమువలెనే చంద్రోదయ మయ్యెను. కాని రామచంద్రునిముఖ వికాసమువలెనే చంద్రికాంతియు వికాసహీనముగా గ్రుడ్డివెన్నెల వచ్చెను. గ్రుడ్డిలో మెల్ల యన్నట్లు లాస్వల్పకాంతికే రామచంద్రుఁడు సంతోషించుచుండఁగా నప్పుడుత్తరభాగమందుఁ జేటంతమబ్బు పట్టి, యాగ్రుడ్డివెన్నెలను దిగమ్రింగుటయేకాక, వృద్ధియై, మునుపటి కంటెఁ బదిరెట్లెక్కువ చీఁకటిఁదెచ్చెను. శోభనాచలాదుల యపకీర్తివలెనే యంతకంత కాచీఁకటి యెక్కువకాఁగా, రామచంద్రుఁడు గోదావరియొడ్డునకుఁ బోయి రేపు పడవ వీల్లైనపక్షమున దాఁటి యారాత్రి కోటిపల్లెపోవలెనని యోచించుచు, దారితప్పి రేవుస్థలమునఁగాక మఱియొకచోటఁ గూర్చుండెను. ఆకాశమునందలి నక్షత్రగణంబులన్నియుఁ దమస్వల్పకాంతులను గూడ నిచ్చుటమాని రామచంద్రుని స్నేహితులవలెనే క్రమక్రమముగాఁ గనఁబడుట మానెను. అంధకార మంతకంతకు మిక్కుటమై, త్రోవనేకాక, యెదుటనున్న వస్తువునుగూడఁ గనఁబడనిచ్చుట లేదు. నల్లని మబ్బులును, మబ్బుల లోనుండి మధ్యమధ్య గుండెలు వ్రిక్కలు సేయునట్లు బయలువెడలుచున్న యుఱుములును, మొగమునెత్తకుండ వీచుచున్న జంఝామారుతములును, రామచంద్రుని మనస్సును గలఁచ నారంభించెను. తన్నుఁగప్పుచున్న యిసుకచే నది యిసుకతిన్నెయనియు, మహావాయువుచేతఁ గదల్పఁబడుచున్న తరంగములధ్వనిచేఁ దనయెదుట నున్నది గోదావరియనియు, రామచంద్రుఁడు దెలిసికొనెను. అతఁ డక్కడఁ గూర్చుండి కొంచెము కాలుజాపఁగాఁ గాలికేదో మెత్తమెత్తగాఁదగిలెను, అది యేదో పరీక్షించి చూచునప్పటి కది కచ్చిక యయ్యె

ను. తన ముందున్న స్థల మతఁడు బాగుచేసి కొనుచుండఁగాఁ జేతికొక చిన్న యెముకముక్క గుర్చుకొనెను. అంతటితోఁ బోక కట్టెతో నతఁడు తడవి యవతలఁగొట్టఁగా నాదెబ్బ యొకకుండమీఁదఁదగుల నది ఫడాలునఁ బగిలెను. దానితో నాతని కాస్థలము శ్మశానమై యుండునని యనుమానముతోఁచెను. భయపడి పరధ్యానముగా యోజించుచున్న యాబాలునివెనుక చెవులు గింగురుమన నొకనక్క గూసెను. అది కూయఁగానే యతనియనుమానము నిజమయ్యెను. అది శ్మశానమను నమ్మకము గలిగినతోడనే రామచంద్రునికి ముచ్చెమటలు వోసెను. గుండె ఝల్లుమనెను. ధైర్యము చెదరిపోయెను. లేచి పాఱిపోవుటకైనఁ గాళ్ళలో సత్తువలేక యుండెను. చేతులాడవయ్యెను. ఏపనిఁ జేయుటకును దోఁచదయ్యెను. అతఁడు దీపములేదని విచారించుచుండెను గాని, మధ్యమధ్య వచ్చిన మెఱుపులు వానిభయమును దగ్గించి ధైర్యమును హెచ్చించుటకు మాఱుగా నారుద్రభూములయందున్న సగముసగము కాలిన కొఱవులను, శవములను గాల్చిన స్థలములను, గట్టుత్రాళ్ళను గపాలములను రామచంద్రుని కగుపఱచి భయమును వెయ్యిరెట్లధికము చేసెను. ఆయర్ధరాత్రిమునం దాభయంకరమైన శ్మశానమందు గాఢాంధకారమునం దొంటరిగాఁ గూర్చున్న యాకుమారునకు. భయంకరముగాఁ జచ్చినవారి చరిత్రములును, ముసలమ్మలు సెప్పిన దయ్యములకథలును నప్పుడప్పుడు దానువిన్న దయ్యముల రూపములును, జ్ఞాపకమువచ్చి భయోద్రేకముచేతఁ దన కక్కడనే మరణము గల్గునని రామచంద్రుఁడు నిశ్చయించుకొనెను. నడుమనడుమ మబ్బులనుండి మెఱుపులువచ్చి, క్రొత్త వస్తువులను జూపించినటులే పరవశముజెందిన యతని కప్పుడప్పుడు దెలివివచ్చి క్రొత్తసంగతులు జ్ఞాపకమై భయ మధికమగుచుండెను.

ఇంతలో రామచంద్రునికన్నులనుండి వచ్చిననీళ్ళవలెనే యా-

కాశమునుండి వర్షబిందువు పడ నారంభించెను. చిరుకులంతకంత కెక్కువై యాకాశము చిల్లివడినట్లు కుంభవృష్టిగా నేనుఁగుతొండ ములావుధారలతో వర్షము సురిసెను. ఆవర్షమున భూమినంతను దేజో వంతముగాఁ జేసిన యొకమెఱుపువచ్చి రామచంద్రునికన్నులు మిఱు మిట్లుగొలిపెను. దానితోడనే దిక్కులు ప్రతిధ్వనులుసేయ బ్రహ్మాం డము బ్రద్దలగునట్లు పెద్దపిడుగు పడెను. అప్పుడు రామచంద్రుఁడు దెలివిగా నుండుటచేత "అర్జునః ఫల్గునః పార్థః కిరీటీ శ్వేతవాహనః" అనుశ్లోకమును బఠించి పిడుగు దనమీఁదకు రాకుండఁ జేసికొనెను గాని, యామెఱుపుచేతఁ గన్నులకుఁ జూచునట్టిశక్తియుఁజెవులకు విను నట్టిశక్తియుఁ దప్పి, నాల్గునిమిషములవఱకును దిరిగిరాలేదు. కీడులో మేలన్నట్లు ప్రకాశమానమైన యామెఱుపువలన, నొక దిబ్బమీఁద వేయఁబడిన యొకతాటియాకులపాక వాని కగుపడఁగా, వర్షములోఁ గూర్చుండుట కష్టమని, గుడ్డలన్నియుఁ దడిసినందున గజగజ చలిచేత వణఁకుచుఁ బ్రాణ మన్నిటికంటెను నెక్కువ తీపిగనుక నాబాధ పడఁజాలక యాపాకమఱుఁగునఁ దలదాఁచుకొనవలెనని నిశ్చయించి లేచి మెల్లగాఁ బోయెను. అక్కడయినను వానికి మనస్థిమితము కలుగమిఁ బెద్దబానలవంటి కడుపులును, జిన్ననోళ్ళును, వంకరకాళ్ళు నుగల పిశాచములును, గామినులును, బ్రహ్మరాక్షసులును గన్ను లకుఁ గట్టినట్టు లాతనికి మానసవీథిని గనఁబడఁజొచ్చెను.

అప్పు డొకనల్లని బ్రాహ్మణుఁ డంగవస్త్రమును గట్టుకొని యొకయంగవస్త్రమును మీఁదవేసికొని "నారాయణ నారాయణ" యనుచుఁ బాకవైపునకువచ్చుచుండెను. వానినిజూచి రామచంద్రుఁడు చేతిలోఁ గొఱవిలేనందునఁ గొఱవిదయ్యముగాదని నిశ్చయించి, యా బ్రాహ్మణుఁడు దిన్నఁగా నడచుచున్నను దనభయముచేత నతఁడు వంకరగా నడచుచున్నట్లు కనఁబడినందున నేదోదయ్యమనుకొని

తరువాత మనుష్యుఁడని యెఱిఁగి, శోభనాచలమో, వానిమిత్రులో తన్నుఁ జంపుటకు వచ్చుచున్నారని భయపడుచు, నిశ్చేష్టుఁడై యుండెను. ఆబ్రాహ్మణుఁడు పాకలోనికి వచ్చి దుఃఖముతో "ఎంతపని జరగినది. దైవమా!" అనివిలపించుటచేతఁదనశత్రుఁడుగాఁడని రామచంద్రుఁడు హీనస్వరముతో నిట్లు పలుకరించెను.

రామ.—అయ్యా! మీరెవరు బ్రాహ్మణులేనా?

బ్రాహ్మ—బ్రాహ్మణులమే. నీ వెవరవు? ఇక్కడెందుకున్నావు?

రామ—నేనాత్రేలనియోగులచిన్నవాఁడను. అమలాపురము నుండి వచ్చుచున్నాను.

బ్రాహ్మ—అయ్యా! మేము వైదికులము. నేనుమిక్కిలి బీదవాఁడను. నాభార్య యీవేళకుఁ దొమ్మిది దినములక్రిందటఁ బ్రసవమైనది. మగపిల్లవాఁడు కలిగినాఁడు. లేక లేక కలిగిన యామగపిల్లవాఁడీదినమున సంధిగొట్టి చనిపోయినాఁడు. నాభార్యకుఁ బ్రాణము మీఁదికి వచ్చినది. చచ్చినపిల్లవానిని దీసికొనిపోవుట కయినను, మా జాతివారును, మాబంధువులును రాలేదు. కడుపుదుఃఖముతో నేనే యీపసికూనను బాతిపెట్టవలసి వచ్చెను. అని యేడ్చుచుండెను.

రామ.—అయ్యా! దుఃఖపడకండి. మీరుపెద్దలు. అన్నియుఁ దెలిసినవారు. నావలెనె మీరును దురదృష్టవంతులు.

బ్రాహ్మ—నాయనా! నీకేమి కష్టములు గలిగినవి? ఇక్కడికెందుకువచ్చినావు?

అని బ్రాహ్మణుఁ డడుగఁగా రామచంద్రుఁడు దనవృత్తాంతమంతయుఁ జెప్పి తనమీఁదికి వచ్చిన యాయపనిందయు, శరభరాజుగారు దన్ను లేవఁగొట్టుటయు, శోభనాచలాదుల వైరమును దెలియఁజేయ బ్రాహ్మణుఁ డాశ్చర్యపడి యితనికొఱకు విచారింప నారంభించెను. తరువాత వారిట్లు మాట్లాడిరి.

బ్రాహ్మ—పూర్వజన్మకృత మెవరు తప్పింపఁగలరు ? నీవు మాయింటికివచ్చి రేపుమాయింటనుండి వెళ్ళుము. నీకుఁ బొడిగుడ్డల నిచ్చి యీపూఁట కొంచెము చలిమంట వేస్తాను రా.

రామ.—అయ్యా! నాకొఱకు నాశత్రువులు వచ్చుచుందురు. ముందుమీరునడువుఁడి. మీవెనుకనే నేనువచ్చెదను. ఎవరయినవచ్చి నాజాడ లడిగినపక్షమున వెనుకనున్నానని చెప్పవద్దు. నాకేదోసంజ్ఞ చేయండి ‘రామానుజాచార్యులు’ అనినన్ను బిలచిన నేనుపారిపోఁగలను.

బ్రాహ్మ—నాప్రాణము నీప్రాణమునకడ్డము వేసి రక్షించెదను.

ఇట్లిద్దఱును బోవుచు గోదావరిగట్టుమీఁది కెక్కునప్పటికి జాముప్రొద్దుమాత్రమేయున్నది. అప్పుడుదాటియాకులగొడుగు వేసికొని యొకపురుషుఁడు వెండిమురుగులుఁ బెట్టికొనియున్న చాకలివానినివెంటఁబెట్టుకొని వచ్చుచుఁ దనయెదుటవచ్చుచున్న బ్రాహ్మణునిజూడక చీఁకటిచేత నాముసలిబ్రాహ్మణున కెదురుగాఁబోయినందున గొడుగు కామ గుర్తించుకొనెను. బ్రాహ్మణుఁడును దెబ్బతగిలినందున ‘అబ్బా యెవరురానీవు? చంపివేసినావు, కన్నులుకనఁబడవా?’ యనియఱచెను. రామచంద్రుఁ డదివిని యెవరో వచ్చినారని దిగఁబడి రాఁ డయ్యెను.

పురు—అయ్యా! చూడలేదు. క్షమింపవలెను.

బ్రాహ్మ—నీదేయూరు ? నీవెవరవు ?

పురు—మాదమలాపురము, మీకిరువదేండ్ల కుఱ్ఱవాఁ డగుపడినాఁడా ?

బ్రాహ్మ—నేనెఱుఁగను. మీపిల్లవాఁడెవరో నీవెవరో నాకుఁ దెలియదు. చేతిలోకఱ్ఱలు. మీ రెవరికొంపఁ ద్రివ్వుటకు వచ్చినారు? బుఱ్ఱలు పగులఁగొట్టుటకు వచ్చినారా? దిక్కుమాల్లాళ్లారా?

పురు—అయ్యా! తిట్టకండి. మే మెవనిని గొట్టుటకు రాలేదు. వేరేపనియుండి వచ్చినాము. మీ రాపిల్లవానిఁ జూచినపక్షమునఁ జెప్పండి.

బ్రాహ్మ—నేను జెప్పను. ఇప్పుడు మాగ్రామమునందు మా తల్లిదగ్గిఉనున్నవాళ్ళను గేకవేసి మీకుఁ దగినట్టు బుద్ధిచెప్పిస్తాను.

చాక—(కోపముతో)నోరుముయ్యి బాపనయ్యా! తెగనీలు గుతావేమి ?

పురు—ఓరీ! ఆయనజోలికిఁ బోకురా. మనకుఁ గావలసిన మనుష్యుఁడు దొరకలేదు. మధ్య నాముసలిబ్రాహ్మణునిజోలికి వెళ్ళఁడమెందుకు ?

బ్రాహ్మ—అయ్యో! దుర్మార్గుఁడా! నీకుఁ గావలసినవాఁడు దొరకలేదూ? దొరికితే చంపివేస్తావా? నీకింతపొయ్యేకాలమేమిరా ? అని మాటాడుచున్న బ్రాహ్మణునిదాఁటి యాక్రొత్తపురుషులిద్దరును ముందుకుఁ బోవుచుండఁగాఁజూచి బ్రాహ్మణుఁడు "ఆలాగువెళ్ళఁడమెందుకు? అక్కడవాఁడులేఁడు.అలావెళ్ళవద్దు. వద్దంటేమానవేమయ్యా" అనిచెప్పెను. అతనియాటంకమును జూచియాపురుషులు రామచంద్రుఁడక్కడనున్నాఁడనినిశ్చయించియటువోవుచుండఁగా రామచంద్రుఁడు వారిబారిఁబడకుండగబగబఁబరుగెత్తసాగెను. ఈపురుషుని,వెంటఁదరుముచు, రామచంద్రునిగా నిశ్చయించియెట్లయిన వానినిబట్టఁదలఁచిరి. కొంతదూరము పరుగెత్తి యాక్రొత్తవారిలో నొకఁడు "రామచంద్రుఁడూ! నేనురాజగోపాలమును.బరుగెత్తకు. నీవీలాగురా.భయములేదు" అని పురుషుఁడు సెప్పఁగా రామచంద్రుఁడు ధైర్యమును విడిచి తన శత్రువులు రాజగోపాలముయొక్క పేరుఁబెట్టుకొనినా రనుకొని రాకమరల నాతని కేకను విని దగ్గఱకువచ్చి రాజగోపాలముచుజూచి సంతోషించి యిట్లుపలికెను.

రామ—రాజగోపాలము! నీవెందు కీరాత్రివేళ వచ్చినావు ? నాకు సహాయము జేసినందులకు మీబాబయ్యగారు నిన్నుగూఁడ లేవఁగొట్టినారా యేమి ?

రాజ—లేదు. చాకలివానిచేత మూటనీకుఁ బంపినపుడు నీకు లెక్కయేమైనఁబంపడము మఱచిపోయినాను. పెట్టెలోనుండి నాలుగు రూపాయలుతీసి యివతలఁబెట్టి చాకలివానిచేతి కిచ్చుట మఱచినాను. ఇవిగో నాలుగురూపాయలుపుచ్చుకో. నీవుసురక్షితముగవచ్చినావా ?

రామ—ఏమిసురక్షితము! చావుదప్పి కన్ను లొట్టవోయినట్లున్నది. నేను నీయుత్తరమునుజూడఁగానే కొంతసేపు జెఱువుగట్టుమీఁద నాగి కపటియయిన యాసహాధ్యాయునిజోలికిఁ బోక మఱినాలుగు జాములకు బయలుదేఱినాను. అప్పటికి శోభనాచలము ముందుగానే బయలుదేరి త్రోవలో—

రాజ—(మాటకడ్డమువచ్చి) ఆసోదిచెప్పకు. నాకుఁబ్రొద్దువోతుంది. మాయింటనందఱు నిద్రవోవుటగనిపెట్టి నేనిపుడుబయలుదేరినాను. నాపరుపుమీఁద నేను బరున్నట్టుగానే యొకదిండుపెట్టి మీఁద బట్టకప్పి యింటి దొడ్డితలుపు దీసియుంచివచ్చినాను. మాబాబయ్య లేవకమునుపే వెళ్ళవలెను.

రామ—అయ్యో! నాకొఱకు నీవిట్లు శ్రమపడవలసి వచ్చినదికదా ?

అని రామచంద్రుఁడు వోకముందే రాజగోపాలమును జాకలివాఁడునుబయలుదేరిరి. రామచంద్రుఁడు రాజగోపాలముయొక్కసద్గుణములనుస్తోత్రముజేసి బ్రాహ్మణునితోఁ జెప్పుచు బ్రాహ్మణునియింటికిఁబోయి పొడిబట్టలుగట్టుకొని సుఖముగానిద్రవోయెను. మఱునాఁడు రామచంద్రుఁ డుదయమున గోదావరిలో స్నానముజేసి ముక్తేశ్వరస్వామివారిదర్శముజేసి యాదినమాబ్రాహ్మణునియింటవండుకొనిభోజనముఁజేసి కోటిపల్లివోవుటకు సిద్ధముగనుండఁగా బ్రాహ్మణునిభార్యకు బాలింతరోగమువచ్చి మరణమునకు సిద్ధముగనుండెను. వరహాయిచ్చినఁగాని వైద్యుఁడామెకొక్క మాత్రనైన వేయకుండుటఁ జూచి

నవనీతమువంటిహృదయముగల రామచంద్రుఁడు కనికరించితనకు రాజగోపాలమిచ్చిన నాలుగురూపాయలను వైద్యునకిచ్చి యాబ్రాహ్మణునిభార్యకు మందువేయించెను. రామచంద్రునిచేత ధనమువదలఁగానే బ్రాహ్మణునిభార్యకు రోగముకూడవదలెను. బ్రాహ్మణుఁడు రామచంద్రుని సహాయమువలనఁ దనయాపదయను నదిని దాఁటెను. గాని రామచంద్రునకు గోదావరీనది దాఁటుట కెట్టనియేగాని యైన లేదు. ధనము లేక యోజించుచున్న రామచంద్రున కొకమంచి యాలోచనదోఁచెను. పూర్వమొకనాఁడు తానురాజవోలు వెళ్ళుచుండఁగాఁ బడవ మునిఁగిపోయినపుడు ముక్తేశ్వరబ్రాహ్మణుని దాను రక్షించెను. అతఁ డనేకబహుమానములు దన కప్పుడిత్తు ననియును, ముక్తేశ్వర మొక్కపర్యాయమురమ్మని తన్ను బ్రతిమాలిన సంగతియుఁ రామచంద్రునకు జ్ఞాపకమువచ్చి యాబ్రాహ్మణునిపేరు లింగరాజని తెలిసికొని యట్టిస్నేహితుఁడుండఁగాఁ దన కిఁక భయమక్కఱలేదనుకొని లింగరాజుదగ్గఱకుఁ బోయెను. లింగరాజు రామచంద్రునిజూచి యప్పటికి రమారమి యెనిమిది మాసము లయినందున వెంటనే యతని నానవాలుపట్టఁజాలక కాఁబోలు లింగరా జతనిఁ బలుకరింపఁడయ్యెను. అవసరము రామచంద్రునిదే గనుక తుదకతఁడు మౌనమువిడిచి మాటాడెను.

రామ—లింగరాజుగారూ! నన్నెక్కడనైనఁజూచినట్లు జ్ఞాపకమున్నదా?

లింగ—మొగముజూచినట్లుఁ జ్ఞాపకమున్నది కాని యెవరో చెప్పఁజాలను. మీదేయూరు?

రామ—మాదమలాపురముకాపురము. నాఁడు పడవమునిగిపోయినపుడు—

లింగ—(మాటకడ్డమువచ్చి) ఓహోహో! నీవటయ్యా!

నాఁడుపడవమునిఁగిపోయినపుడు నీవుకూడఁ బడవలోనున్నావుకావూ! నాకాసంగతి జ్ఞాపకమా. అదియేమాత్రపు గొప్పసంగతి! నూరువ్యవహారములలో మాకదిజ్ఞాపకముగాదు. అయితే నీవిప్పు డీగ్రామమమెందుకు వచ్చినావు ?

రామ.—నిన్ననొక బ్రాహ్మణునియింట వంటజేసికొని భోజనముజేసినాను. మీదర్శనముఁ జేయవలెనని వచ్చినాను. మీరొక సహాయము జేయవలయును.

లింగ.—ఏమిపనిమీఁద వచ్చినావు? అదియేదో చెప్పు. నా సాధ్యమయిన పక్షమునఁ జూచెదను.

రామ.—నేను గార్యాంతరమునఁ గోటిపల్లి వెళ్ళుచున్నాను. నాకు మీరు నాలుగురూపాయలు బదు లిప్పింపవలయును. నాలుగు మాసములలోఁ దిరిగి యిచ్చివేయఁగలను.

లింగ.—అయ్యో! ఇప్పుడే మీరు రాకముందు నూరురూపాయిలుండఁగా నొకపెద్దమనుష్యున కిచ్చినాను. ఒకగడియక్రిందవచ్చిన పక్షమునఁ గావలసినన్ని రూపాయలిచ్చియుందును. నాలుగు గాకపోతే మఱినాల్గుపుచ్చుకొననచ్చును. మీరెక్కడికిఁ బోతారు. నేనెక్కడికిఁబోతాను. అయ్యయ్యో! రాకరాక మీరువచ్చి యడుగడము నాదగ్గఱ సమయమునకు లేకపోవడము సిగ్గుగనున్నది.

రామ.—సరిసరి. మీకు సిగ్గెందుకు ? అది నాయదృష్టము. మీరేమి చేయఁగలరు? పోనీ, రేపయిన పర్దేదనంటె నీగ్రామములో నుంటాను.

లింగ.—ఉండు! ఏమయిన లెక్కదొరకిన పక్షమునఁ జూచి యిస్తాను.

ఈప్రకారము లింగరాజుదగ్గఱ నాలుగువేల రూపాయలున్నను దనకు మహోపకారము జేసిన రామచంద్రునకునాలుగురూపాయి

లుబదులిచ్చుటకుఁగూడ నతనిమనసు సమ్మతింపదయ్యెను. ధనమీ యకున్నను మర్యాదనిమిత్తము రామచంద్రుని భోజనమున కుండు మనియైనఁ జెప్పఁడయ్యెను. ఆమఱునాఁడు శరభరాజుగారి యింట నుండి రామచంద్రుఁడు వచ్చుటకుఁ గారణ మేమని లింగరాజడు గఁగా రామచంద్రుఁడు సత్యకాలపుమనిషి గనుక యున్నదున్నట్లు మాయామర్మములు లేకుండఁ జెప్పెను. మూఁడవనాఁడు రామచం ద్రుఁడేదోయొకటి నిశ్చయముగఁ దెలిసికొని లింగరాజుదగ్గఱ సెలవు దీసికొని పోవలెనని యింటికివచ్చునప్పటికి లింగరాజొకసంచి రూపా యల ముందువేసికొని పేరూరునుండి భూమి తాకట్టుబెట్టుటకు వచ్చి నయొక యరవబ్రాహ్మణునితో వడ్డీనిగుఱించి ముచ్చటించుచుండెను. రామచంద్రుని జూడఁగానే యతఁ డాధనమును జూచుటచేత నడుగు నేమో యని భయపడి మహాకోపమువచ్చి దగ్గఱనున్న కుమారుని జూచి విధవా! తలుపువేయుమని యెన్నిమాఱులు చెప్పినను వేయ వుగదా అని వానినొఁచఱుపు జఱచి లోపల నణుగుకొనుచుండెను. అప్పుడు రామచంద్రుఁడు వానిని బలుకరింపఁగా వా రిట్లు మాటాడిరి.

రామ—అయ్యా లింగరాజుగారు! తమకీవేళ సొమ్మందినది కాఁబోలును. నేను నాలుగుదినములనుండి తమకొఱకు నిరీక్షించియు న్నాను. ఏదైన దయచేయించిన పక్షమున సెలవుదీసికొని వెళ్ళిపో యెదను.

లింగ—(అసూయతో) నానిమిత్తమెవరునిన్ను నిరీక్షింపుమ న్నారు. నీపనిమీఁద నీవుండి నాకొఱకున్నాననియెదవేమి! నీకు రూపాయిలెవరు పోగుబోసుకొని కూర్చున్నారు? ఈరూపాయి లెవరి సొమ్మని నీ కియ్యను? ఊళ్ళోవాళ్ళసొమ్మిచ్చినపక్షమున వా ళ్ళూర కుంటారా?

రామ—తమవగ్గఱ లేకపోయిన పక్షమున మఱెక్కడనైన బదులిప్పించండి. మీరు చెప్పినయెడల నా కెవరుపడితే వారే యిస్తారు. రెండు నెలలలోఁ దీర్చఁగలను.

లింగ—నాకెవరిస్తారు? నీవేలాటివాఁడవో నేను నాలాటి వాఁడనే. మేలినాఁటి శనిలాగునఁ బట్టుకొని వదలకుండ నున్నావేమి? దీనికి వేళాపాళా లేదూ? వీయవసరమే నీదా?

రామ—ఆదినము పడవమునిఁగినపుడు మిమ్ము నే బ్రతికింపఁగా నాకు బహుమానము జేయుదునని ముక్తేశ్వరము రమ్మనినారు గదా? నాలుగుమాపాయలు బదులయిన నియ్యలేరంటి?

లింగ—నీవు నన్ను బ్రతికించినావా? శరీరమంత కాట్లకుక్కవలెఁదెగఁగఱచి వదలిపెట్టినావు. ఆపుండ్లు నాలుగుమాసములవఱకు మానలేదు. ఒకనినొకఁడు బ్రతికింపఁగలఁడా? చంపఁగలఁడా? దైవానుగ్రహమున్నదిగనుక నేను బ్రతికినాను. నీకు బహుమాన మియ్యడము నాకు విధిగాదు. దయాధర్మభిక్షము. ఇస్తే యిస్తాను లేకపోతే లేదు.

రామ—ఆసంగతి నిదివఱకే చెప్పినపక్షమున నేను వెళ్ళిపోదునే. ఇన్ని దినములు నన్ను ఱేపుమాపని త్రిప్పుట యెందుకు?

లింగ—నోటికి శుద్ధిబద్ధములేదేమి? నేను నిన్నుండమన్నానా? సొమ్మంద దని మొదటే చెప్పినాను. అమలాపురములో దొంగ వస్తువులమ్మ మాయూరు పాడుచెయ్యవలెనని వచ్చినావా? నిన్ను గుమ్మములోనికి రానియ్యఁగూడదు. ఇంతంత బుద్ధులు నీకుండుఁచేతనే ధర్మరాజువంటి శరభరాజుగారు నిన్ను లేవఁగొట్టినారు. నేనొక దమ్మడివైన నియ్యను. నాయింటికి నీవు రావలసినపనిలేదు. నడునడు.

అని లింగరాజుగారు చెప్పఁగానే గంపంతయాసఁ బెట్టుకొన్న రామచంద్రునకుఁ గోపవిచారములొక్క సమయమునందే పుట్టెను;

కాని కోపమును గనఁబఱచుటకది సమయముగాదుగనుక తనస్వాధీనములోనున్న విచారమును మఱియొకమాఱు తెచ్చుకొనెను. లింగరాజునంటి పరమవిశ్వాసఘాతకుఁ డెక్కడనైననుండునా? పడవమునుగుటకు సిద్ధముగానున్నప్పుడు దాను రామచంద్రు నెన్నివిధములఁ గాళ్లుగడుపులు బట్టుకొని వేడుకొనెనో నేఁ డన్నివిధముల దయాదాక్షిణ్యములు లేక కసరి కొట్టెను. ఆతని కేప్రకారముగ మనసుతాళెనో తెలియదు. రామచంద్రుఁడు దన కగుపడఁగానే యతనిని జ్ఞాపకము దెచ్చుకొనియు, లింగరాజెఱుఁగని వానివలెను జ్ఞాపకములేనివానివలెను నటింపనారంభించెను. తన ప్రాణమును రక్షించిన రామచంద్రునకుఁ దాను బహుమానము లిత్తుననియుఁ దన యావదాస్తి నిచ్చినను ఋణము దీఱదనియుఁ జెప్పి వానిని ముక్తేశ్వరము రమ్మని చెప్పిరి. లింగరాజు నాలుగురూపాయ లతనికి బదులైన నియ్యలేక యతిదీనముగనున్న యాపిల్లవాని నన రానిమాటలని దరికిఁ జేరకుండఁ గొట్టెను. లోకములో నిట్టిలింగరాజు లనేకులున్నారు. ఆశ్చర్యమేల?

ఇట్లు నిర్విణ్ణమనస్కుఁడై యాశాభంగముచేత నాకస్మికదుఃఖముగడఁగి పడవదాఁట నొకడబ్బైనలేక గోదావరిదగ్గఱఁ గూర్చుండి రామచంద్రుఁ డిట్లు విచారించెను.

హా! దైవమా! మాచిరాజు శ్రీరాములుగారిగర్భమునఁ బుట్టి యాగర్భశ్రీమంతుఁడనైన నాకు రేవుపడవదాటుట కొక కానియైనలేకుండఁజేసితివి. నేనెక్కడపాదముఁబెట్టినక్కడనిర్ధామధామమగుచున్నది. నాకు మరణమైన నేల కలుగఁజేయవు? ఎన్నిదినములన్నవస్త్రములులేకుండ బాధపడఁగలను? మాతండ్రిగారు వోయినదిమొదలుకొని యీనాఁటివఱకుఁ గష్టమేకాని సుఖమెఱుఁగను. నావంటిదిక్కుమాలినవాఁడు ప్రపంచమునం దెవ్వఁడు లేఁడు. కడుపులోనున్న దుఃఖమునంతను జెప్పుకొందమన్న నిరుపార్శ్వముల బంధువు లన్నమాట లే

రుగద. ఈశ్వరా! ఇప్పటికైన నీకు నామీఁదఁ గసిదీరలేదు కాఁబో లు" అని కనీళ్ళు కాలువలుకట్ట నేడ్చుచుఁ దుద కింత పాడుబ్రతుకు బ్రతుకుటకంటెఁ బ్రాణత్యాగముఁ జేసికొనుట మంచిదని తనకష్ట ము లంతముచేసికొనఁ దలఁచి, దుఃఖతాపముచేతఁ గల్గినబాధ చల్లని యానదీగర్భమునందుఁ బ్రవేశించి తీర్చుకొననిశ్చయించెను. అప్పుడు ప్రదోషకాలమగుటచేత ముక్తేశ్వరస్వామివారి యాలయమునకుఁబో యి, యీశ్వరదర్శనముఁ జేసి కడపటిసారి యాదేవునకు మనస్సుదీర మ్రొక్కి తనకువచ్చిన స్తవములన్నియుఁ బఠించి దేవున కెదురుగాఁ గూర్చుండి తాను గవిత్వము చెప్పఁ గలవాఁడే కనుక తనదీనావస్థను దెలుపుకొనుచు నీ క్రిందిపద్యములతో నీశ్వరుని స్తుతించెను.

చ. కడపితి నింతకాలమును గష్టచయంబుల నొందుచుంటి నీ
పుడమిని మాతృగర్భమునఁ బుట్టినదాది సుఖింపలేదు నీ
యడుగులనాశ్రయించి యిఁక నైన సుఖింపఁగఁగోరుచుంటి నా
యెడఁ గరుణించి వేగముగ నీయవె మోక్షసుఖంబు నీశ్వరా.

చ. జనకుఁడు దీఱె నాకు నతి శైశవమందె గతించెఁ దల్లియున్
మనమున నన్నుగూర్చి యణుమాత్రము పొక్కెడువారులేరు నే
ననయముఁ జేయిజాపుకొని యన్యులపంచల నుండఁజాల నో
యనఘ ! కటాక్షముంచి వడి నంతము జేయవె కష్టజాలమున్.

ఆ॥ వె॥ అడుగరానివారి నడిగితి ద్రవ్యంబు
చేయరానిపనులఁ జేసినాఁడ
నన్నవస్త్రములకు, ననఘ నన్ను క్షమించి
ముక్తినీయవయ్య! భక్తవరద.

ఈశ్వరా! నేనిదివఱ కనేకపాపములను జేసినాను. నన్నేగతి కంపినను భారము నీదే. ఈదిక్కుమాలిన ప్రాణసంరక్షణకొఱకనేకుల కు బాధనిచ్చినాను. నేఁటితోనాకష్టములన్నియు గట్టెక్కఁగలవు. కరు

ణించినీసాన్నిధ్యమునుమాత్రము చేర్పుము. ఇదిగో నాచివరనమస్కారమందుకొను మని చేతులుజోడించి మొక్కి మరల "నాకష్టములన్నియుసత్ప్రవర్తనమువల్ల గలిగిననునాకెన్నిజన్మములకైనసత్ప్రవర్తనమే దయచేయుము. నాకనేకోపకారములను జేసిన రాజగోపాలమును రక్షింపుము" అని గుడివదలి గౌతమీనదియొడ్డునకుఁబోయి, బలవన్మరణము పాపహేతువని యెఱిఁగియు దుఃఖముచేత నామాట మఱచిపోయి వంశమునకుఁదానొక్కఁడేకనుకతలిదండ్రులకుఁ గడసారితర్పణము వదలి బట్ట బిగియఁగట్టుకొని నడుమున కుత్తరీయమునుజుట్టి జందెము మెడకుఁజుట్టి నమస్కారముచేసి కంఠములోఁతు నీళ్ళవఱకును బోయెను. పోయి యక్కడనిలుచుండి యెక్కడనో తాటిపాకలోఁబుట్టి యతిసుకుమారముగాఁ బెఱిగి రాజవోలు మేనమామయండను గొన్నాళ్ళుండి, యమలాపురమునకుఁ జదువుకొనుటకువచ్చి యపనిందపాలై ముక్తేశ్వరమువచ్చి గోదావరిలో బలవంతముగాఁ జచ్చుచున్న తన్నుగురించి విచారించి రాజగోపాలమును దలఁచుకొని యొకమాఱు మేనమామను దలఁచుకొని యొకమాఱునేడ్చి చూచిచూచి యింత నిండుప్రాణము నెట్లుపోఁగొట్టుకొందునాయని భయపడి నాలుగడుగులు వెనుకకువచ్చి, చచ్చెడివానికి భయమెందుకని మరలలోఁతునకుఁబోయి, యెవరును లేరుగదాయని నాలుగుమూలలు బారఁజూచి, కన్నులు మూసికొని "హా దేవా" యని గుభాలునలోతు నీళ్ళలోఁ జేతులుజోడించుకొని మునిఁగిపోయెను.

అతఁ డొకమాఱు మునిఁగి యీఁతవచ్చినవాఁడుగనుక వెంటనే ళ్లుదాఁగక తేలెను. అపు డొకమనుష్యుఁడు తడిగోచితో వచ్చి రామచంద్రుని జుట్టుపట్టుకొని మొలలోఁతునీళ్ళవఱకును దీసికొనివచ్చి యక్కడ వానిని నిలువఁబెట్టి తానును నిలుచుండెను. అతనిని జూచి రామచంద్రుఁడు నిశ్చాంతపడికొఁత సేపటికి "నీవెవ్వఁడ" వనియడుగఁగా

నామనుష్యుఁ డిట్లుచెప్పెను. "అయ్యా! నేనుపల్లెవాళ్ళ చిన్నవాఁడను. నేనును మావాళ్లుకొందఱును భద్రాచలమునుండి కలప తెప్పలుగట్టి నీలపల్లి తీసికొనిపోవుచున్నాము. గడియప్రొద్దువేళ మా పిల్లవాఁడు రేవులో నీఁతలాడుచుఁ జేతినున్న వెండియుంగరమును బాఱవేసినాఁడు. రెండుగడియలక్రిందటనేను నీళ్ళలో మునిఁగి యావస్తువునిమిత్తమడుగునఁ గూర్చుండి వెదుకుచున్నాను. ఇదిగో వస్తువు దొరకినది. నేను నీటిలోనుండి బయటికివచ్చినప్పటికి మీరు తేలి మునుఁగుచున్నారు. తక్షణమే నేనువచ్చిజుట్టుపట్టుకొన్నాను. నావస్తువుదొరకుటకుకాకుండ బ్రాహ్మణుని బ్రతికించినపుణ్యముకూడ దక్కినది. బాబూ! నేను సెలవుదీసికొని తెప్పమీఁదికు వెళ్ళుతాను."

అని పల్లెవాఁడు చెప్పఁగాఁ దాను బలవంతముగాదిగినట్లు వాని తోఁ జెప్పక నీవు మంచివాఁడవు. నాప్రాణ మీదినమునరక్షించినావు. అని వానిని బంపి తానును మెల్లమెల్లఁగా బట్టలారవేసికొని బ్రాహ్మణునియింటికిఁ బోవుచు నిట్లాలోచించుకొనెను. "నేను జచ్చిపోవుట దేవున కిష్టము లేదు. నేనేదో గొప్ప యదృష్టమునకే బ్రతికినాను. నేనిఁకఁజావను. నామీఁద దైవమునకు సంపూర్ణముగా ననుగ్రహము గలదు." అని వితర్కించుకొని, బ్రాహ్మణుని యింటికిఁబోయి పురుడు వెళ్ళిపోయినది గనుక వానితోఁగలసి భోజనముచేసి రేవుదాఁటుటకు సొమ్ములేదని యాతనితోఁ జెప్పి కొంచెముసొమ్ము గలదేమో యని సిగ్గుపడుచు నడిగెను. భూలోకమునం దవతరించిన కుచేలుఁడగు నా బ్రాహ్మణుఁడు గర్భదరిద్రుఁ డగుటచేత సొమ్ములేక ప్రాఁతబిందెనొక కోమటివద్దఁ దాకట్టుబెట్టి పదునాలుగణాలు దెచ్చి రామచంద్రునకిచ్చి క్షమింపుమని వేఁడుకొనెను. ఉదయమునలేచి రామచంద్రుఁడు రేవు దాఁటి కోటిపల్లి వెళ్లెను. గోదావరిలోఁబడి తేలుటచేతఁ దనకష్టముల నుండి తానును దేలినట్లు రామచంద్రునకుఁ దోఁచెను. కోటిపల్లి వెళ్ళి

రామచంద్రుఁడు మహారాజుగారియొద్ద నేదైనను ద్యోగమును దెచ్చుకొనవలెనని యోచించెను. కోటిపల్లి శ్రీమద్విజయనగరపు మహారాజుగారిది. మహారాజుగారు రాజధానియగువిజయనగరమునందుండి యుద్యోగస్థుల మూలమునఁ గోటిపల్లి సంగతియంతయుఁ దెలిసికొనుచు నప్పుడప్పుడు డాగ్రామము వత్తురు.

ఎనిమిదవ ప్రకరణము.

రామచంద్రుఁడు కోటిపల్లివెళ్ళినపూఁట గుణములయందు రాజమ్మ కప్పగారుగా నుండఁదగిన యొకపూఁటకూటిపెద్దమ్మయింట భోజనముఁ జేసెను. ఏలాగైన నొకచిన్న యుద్యోగమును సంపాదించుకొనవలెనని యతనికిష్టముగల్గియున్నది. కాని, తనకుద్యోగమునిచ్చువారును నిప్పించువారును లేరు. కోటిపల్లిపరగణాకు శ్రీవిజయనగరపు మహారాజుగారధికారులు గనుక వారాపరగణాకు వల్లూరి శంకరరావుగారిని బ్రధానోద్యోగస్తునిగా నేర్పఱచిరి. ఆయన సద్గుణసంపన్నుఁడును, ధర్మకార్యనిరతుఁడును, బహుజనోపకారియునై మిక్కిలి కీర్తిగాంచెను. విజయనగరరాజ్యవిస్తారకులు ప్రస్తుతపు విజయనగరపుకోటగట్టించినధన్యులు నగు శ్రీవిజయరామ గజపతిమహారాజుగారాకాలమున దేశమును బరిపాలించుచుండిరి. శంకరరావుగారి యధికారముక్రింద నున్నప్పుడు కోటిపల్లి పరగణా మిక్కిలియభివృద్ధి నొందుచువచ్చెను. రామచంద్రుఁడాశంకరరావుగారి దర్శనముఁ జేయింపుమని చేతిలోనున్న యుద్యోగస్థులలోఁ గొందఱి నాశ్రయించి ప్రతిదినమును వారివీథియరుగులమీఁద సర్వకాలములయందుఁ గూర్చుండుచుండెనుగాని, వారుమాటలలోనేకాని క్రియలతో నాతనినిసంతో

షపెట్టరైరి. తుదకుఁ బ్రాణమువిసిగి రామచంద్రుఁడు తానేస్వయము గా శంకరరావుగారిని జూడవలయునని యాలోచించి గుమ్మముదగ్గఱ కువచ్చి లోపలికిఁ బోవుటకుఁ బ్రయత్నించెనుగాని గుమ్మముముందఱ వెండిబిళ్ళలను వేసికొని పులితోలు ధరించి పూర్ణాధికారమును జరపు చున్న రాజభటు లానిరుపేదపిల్లవానిని లోనికిఁ బోనీయరైరి. రాజ భటుఁడొకఁడు శంకరరావుగారు నిద్రించుచున్నారనియు, మఱియొకఁ డు క్రొత్తమనుష్యుని రానిచ్చినపక్షమునఁ బంతులవారు కోపింతురని యు, వేఱొకఁడు పంతులవారువ్యవహారమును జూచుచున్నారనియుఁ జెప్పి యందఱు వాని నభ్యంతరపెట్టిరి. ఒకభటుఁడు రూపాయ దన కిచ్చినచో రామచంద్రుని లోపలికిఁ దీసికొని పోదుననియు మఱొకఁ డర్ధరూపాయ నిచ్చినఁ దీసికొని పోదుననియు వారందఱు బేరముల నాడ నారంభించిరి. లంచములనిచ్చి రామచంద్రుఁడు శంకరరావుగారి దర్శనముచేయుట కిష్టములేక గుమ్మముముందఱ నాల్గుదినములు పడి యుండియుఁ దుద కతఁడు పంతులవారి దర్శనము దొరకనందున విచారాక్రాంతుఁడై యుండెను. పూఁటకూటి యింట నుండుట చేతఁ దాను దెచ్చిన పదునాల్గణాలును వ్యయమయ్యెను. రామచం ద్రుఁడు కోటిపల్లె గ్రామముఁ బ్రవేశించిన యయిదవదినము సాయం కాలమునందు శంకరరావుగారు కుడిభుజముమీఁద నెఱ్ఱని రుమాలు నెడమభుజముమీఁద నుప్పాడలోఁ బురమాయించి నేయించి చలువ చేసిన సన్ననిజరీయుత్తరీయమును వైచికొని చేతిలో వెండిపొన్నుగల యొకనున్నని సన్నపేపబెత్తమునుబట్టుకొని, టిక్కుటిక్కుమని తొడు గుకొన్నముచ్చెలు ధ్వనిఁజేయ రాజభటుఁడొకఁడుముందుగానడచియె దుటవచ్చుచున్న మార్గస్థులనందఱి నొత్తిగించుచుండ, నెవరితోడనో మాటలాడుచు, గోదావరియొడ్డునకుఁ జల్లగాలి నిమిత్తము వచ్చిరి. సమయమును నిరీక్షించి రామచంద్రుఁడు పంతులుగారి వెంటనే

వచ్చి యాయన దనవైపుఁ దిరిగినపుడు నమస్కరించెను. శంకరరావుగారును దిరిగి నమస్కరించి రామచంద్రుని వృత్తాంత మడుగ నతఁ డామూలాగ్రముగాఁ దన చరిత్రమును వినిపించెను. దానినిశంకరరావుగా రొక చిత్రమైన కథవలె విని యాశ్చర్యపడి రూపలేఖా విలాసములనుబట్టి యాతఁడొకగొప్పయింటివాఁడనియు హృదయ మిచ్చి మాటాడుటచేత నతఁడు నిర్దోషియనియుఁ, జూపులనుబట్టిచాకచక్యముగలవాఁడనియుఁ దెలిసికొని తమకచ్చేరియం దిరువదిరూపాయలపనియుండఁగాదానినతనికిచ్చిరి. ముత్యాలకోవవలెనున్నయతనివ్రాఁతయుఁ, బనియందుఁగల శ్రద్ధయుఁ బైయధికారులయందుఁ గలిగిన విధేయతయును శంకరరావుగారికి రామచంద్రునియందు దయగలిగించెను. తనపని నతివేగముగా ముగించుకొని రామచంద్రుఁడు కచ్చేరీలోనున్న మందమతులయొక్కయు, సోమరిపోతులయొక్కయుఁ బనులుగూడఁ జేసిపెట్టసాగెను. శంకరరావుగారుతప్ప కచ్చేరీలోనున్నయుద్యోగస్థులందఱును లంచగొండులయి ప్రజలను గ్రహములవలెఁ బీకుకొని తినుటచేత రామచంద్రుని కాకార్యమయిష్టమగుటచే లంచములగ్రహించువారిని మందలించుచు, బాధపడుచున్న బీదకాఁపులకు సహాయముఁజేయుచు, నాతఁడు జనసమ్మతమైన పురుషుఁడయ్యెను. శంకరరావుగారికిఁ దరువాత నుద్యోగస్థుఁడు దామరాజు పద్మనాభముగారు. శంకరరావుగారికి నెలకు రెండువందలయేఁబదిరూపాయలజీతము. పద్మనాభముగారికి నెలకు నూటయేఁబదిరూపాయల జీత మున్నను నతఁడు లంచగొండులకెల్ల నగ్రగణ్యుఁడై, తనకుఁగావలసినన్ని లంచములను గ్రహించుచుఁ, గ్రిందియుద్యోగస్థులకిప్పించుచు, భార్యమెడలో నగలుదిగవేసి లక్ష్మితోఁదులఁదూఁగుచున్నందున, రామచంద్రుఁడు లంచములపేరయిన వినఁడుగనుక వారికందఱకుఁ బరమశత్రువైయుండెను. దేశముననున్న కాఁపులందఱును, దమయిండ్లకర్తాదులఁ జేయించి

యాచించు బ్రాహ్మణులనెట్లో స్వల్పదానములచేతఁ దృప్తిపఱచుచుం డిరికాని, తమయిండ్ల కెన్నఁడును రాక మాటిమాటికిఁ బాదపూజలుదె మ్మని పత్రికలనంపుచుఁ దమకుపవాసవ్రతమునేర్పుచుఁ గచ్చేరీలోను న్న యీబ్రాహ్మణోత్తములనెంతో ధనమిచ్చిపూజించియు, వారియను గ్రహపాత్రులుగాకయేయుండిరి. ఈకారణములచేత రామచంద్రుఁడు చిన్నయుద్యోగస్థుఁడయ్యుఁ దనకంటె ననేకరెట్లెక్కువ జీతముగల గొప్పయుద్యోగస్థులకుఁగూడఁ బక్కలోబల్లెమై, తనపేరు చెప్పిన మాత్రమున వారు భయపడునట్లు ప్రవర్తించుచుండును. తక్కువ వాఁడైనను సన్మార్గుఁడు, గొప్పవాఁడైనదుష్టునకు భయహేతువేకదా! రామచంద్రుఁ డాయుద్యోగములోఁ బ్రవేశించిన యాఱుమాసముల కే శంకరరావుగారతనికి ముప్పది రూపాయలపని నిచ్చిరి. రామచం ద్రుఁడెప్పుడునుదురదృష్టవంతుఁడెకనుక నింతలో మహారాజుగారుశం కరరావుగారిని నాలుగువందల రూపాయల జీతముమీఁద విజయనగ రమునకు రమ్మని యుత్తరువు జేసిరి. శంకరరావుగారు వెంటనే ప్ర యాణమై శ్రీమహారాజుగారితోఁ రామచంద్రుని సత్ప్రవర్తనాదులఁ గూర్చి విన్నవింతుమనియుఁ ద్వరలోనీతని నభివృద్ధికిఁ దెత్తుమనియు, వాగ్దానముఁ జేసి వెళ్ళిరి. ప్రాపకులు వెళ్లిపోవుచున్నందునను మిగిలిన వారు దనకు శత్రువులగుటను రామచంద్రునకు శంకరరావుగారి పో క విచారముగా నుండెను. లంచగొండుల కంకుశమువలెనున్న శంకర రావుగారు వెళ్లిపోయినందులకు సంతోషించుచున్న చిన్న యుద్యో గస్థుల యదృష్టముననో రామచంద్రుని దురదృష్టముననోశంకరరావు గారి యుద్యోగము పద్మనాభముగారి కయ్యెను. పద్మనాభముగారు క్రొత్తయధికారమును వహింపఁగానే, రామచంద్రునియందు, గ్రోధ మునుగూడ వహించి యతఁడు చక్కగాఁ బనిచేయుచున్నను, సోమరి యనియు, నవిధేయుఁడనియుఁ, బెంకెవాఁడనియు, వ్రాసినదెల్లఁ దప్ప

నియుఁడిట్టుచు, మహారాజుగారి కీసంగతిఁ దెలియఁజేతునని బెదరించుచు, జీతములో సగము గునహాలక్రిందనే తగ్గించుచు నానాక్షోభలఁ బెట్టసాగెను. రామచంద్రుఁడును దైవముమీఁద భారమువేసి ధర్మమే జయించునని శాంతించి యూరకుండెను.

అక్కడ నమలాపురములో రామచంద్రుఁ డెందులోనోదిగి ప్రాణహత్యఁ జేసికొనినాఁడని యందఱు ననుకొనిరి. కృష్ణవేణమ్మ దనకుమారుని నిమిత్తమే విచారించినట్లు విచారించెను. శరభరాజుగారును దనమూలమున నిష్కారణముగ బ్రాహ్మణహత్య తటస్థమయిన దని విచారించి సోమావధానులనడిగి కొన్ని జపములుచేయించి దోషశాంతిని జేసికొనుచుండెను. రాజగోపాల మారహస్య మెఱిఁగినవాఁడేకనుక తానుగూడ విచారించినట్లు నటించెనేకాని నిజముగా దుఃఖింపలేదు. తల్లిదండ్రుల కావర్తమానము నెఱుఁగఁజేయను లేదు. వేంకటరత్నము బ్రహ్మానందభరితుఁడయి తన కిందాధిపత్యము వచ్చినట్లుండెను. పార్వతికి వేఱుసంబంధములు వచ్చెను. పార్వతి వివాహపు మాట జ్ఞాపకమైనపుడెల్ల శరభరాజుగారు రామచంద్రుని మరణమునకుఁ దానె కారణుండని విచారించుచుండెను. గ్రామములోనివారందఱు శరభరాజుగారితో నప్పుడప్పుడు రామచంద్రుని విషయమై మాటలాడుచు నతఁడు మహాసద్గుణుఁడనియు, వానిని వెళ్ళఁగొట్టినందున వారికిఁ బాపము గలదనియుఁ జెప్పుచువచ్చినందున శరభరాజుగారికి రామచంద్రుని వెడలఁగొట్టినందులకుఁ గొంచెమువిచారము కలుగుచుండెనుగాని యాయన కనుమానము సంపూర్ణముగా నివారణకాలేదు. ఒకనాఁడు శరభరాజుగారును, జాకలివాఁడును గలిసి రాత్రి జామైనతరువాత దొడ్డవర మత్యావశ్యకమైన పనిమీఁదఁ బోవుచుండఁ దోవలో నొక నూఱుగజములదూరమున నొకవివాద వినఁబడెను. ఆరాత్రివేళ చీఁకటిలోఁ గలహమాడు చున్నవారెవరో తెలి

సికొనవలెనని శరభరాజుగారు కొంచెమాగిరి. వివాదపడుచున్నయా మనుష్యులిద్దఱును శరభరాజుగారిని చాకలివానిని గాని చూడక తమకదివఱకు జరగుచున్న కలహమును మానరైరి. శరభరాజుగారు వెళ్ళి యక్కడ నిలుచున్నతరువాత నాపురుషుల కిట్లు వివాదము జరిగెను.

ప్రథముఁడు—అంతకోపము గలవాఁడవైనపక్షమున నాభాగము నాకుఁబారవేయరాదా? ఎంతన్యాయమో యంత నాకిచ్చివేయి.

రెండవవాఁడు—నీకియ్యవలసినదేమోనేనిదివఱకేయిచ్చినాను నాదగ్గఱనిప్పుడేమియులేదు. నేనిప్పుడు వీథిలోనికివెళ్లుటలేదు. నాకాలు తెగవాఁచినది. అడుగుదీసి యడుగుఁబెట్టలేక యలోలక్షణాయనినే నేడ్చుచున్నాను.

ప్రథమ—అవసరములు దీరినవికదా? ఏరుదాఁటితెప్పదగులఁబెట్టినావు. కావలసినదంత నీచేతఁజిక్కినదికదా. నీవెన్నియాటలనైన నాడెదవు. నాజుట్టు నీచేతిలోనున్నదిగనుక నీవీలాగునఁ జేసినావు.

రెం—(కోపముతో) నీవు నాకుఁ జేసిన సహాయము లేమిటి? నేనుజేసిన ద్రోహములేమిటి? ఆవేళ వస్తువులమ్మఁగా వచ్చిన సొమ్ములోఁ బాతికరుపాయలు పుచ్చుకొంటివి. అంతకంటె నీకెక్కువ యేలాగున రాఁగలదు?

ప్రథ—ఛీ. నోరుముయ్యి! అమ్మినవాని కేఁబది నీకేబది నాకేఁబది యనికాదా మొదటనేర్పఱచుకొన్నది. తక్కినపాతికనాకియ్యనక్కఱలేదా? కష్టపడియమ్మి నానాబాధలుపడ్డవాళ్లము మేమును,బయిటనుండికట్టుపెత్తనముఁజేసి యెక్కువలాభమునుగొట్టేవాఁడవు నీవునా?

రెండ—తెగనీల్గుతారేమి! పొట్టకూటికిఁ జేరిన వెధవవు. నీకియ్యను. నీయబ్బతోఁ జెప్పుకో. మెత్తమెత్తగా నూరకొన్నందుకా వేషములు వేస్తావు. నీవేషములు నాదగ్గఱ తీసిపెట్టు.

ప్రథ—నీబెదరింపులు నాదగ్గఱకావు. బ్రహ్మచారివిధవవు. నీ వీలాగే గొంతుక గోస్తావని నేనప్పుడే యనుకొన్నాను. నీమాటలు నమ్మి నిష్కారణముగ నేను రామచంద్రునితో విరోధము దెచ్చుకొని యేమియెఱుఁగని పిల్లవానిని నానాహింసలుపెట్టినాను. తమ్మంట్లు నీవే తీసికొన్నావు. నీవు నేను బోగయి వానికొంపఁ ద్రివ్వినాము. ఇంత దిక్కుమాలినబుద్ధులున్నవిగనుకనే పాముగఱచినది.

రెండ—నీవుమాత్ర మెన్నిపాములు గఱవకుండదాఁటగలవు? ఇల్లలుకఁగానె పండుగకాలేదు. నీవు నన్నాక్షేపింప నక్కఱలేదు. నాకంటె నీవు రెండాకులెక్కువచదివినావు. మంత్రిప్రగడవారి వంశమునఁ జెడఁబుట్టినావు. నీమూలమున శరభరాజుగారు తలయెత్తికొని తిరుగడములేదు.

ప్రథ—నీయంత దుర్మార్గుఁడను గానులే. ఇంట జూదమొకటి పెట్టి యందఱి నింటికిఁబిలిచి కొంపలుతీయడములేదు. కూచిమంచివారంతా యగ్రహారములుగట్టించి కీర్తిసంపాదించుచున్నారు. నీవు బ్రహ్మచారివై లోకము తగులఁబెట్టుచున్నావు. సిగ్గులేక యింకమాటాడవలెనా ?

రెండ—బ్రహ్మచారినైనను నీవలె ముండనుంచుకొని దాని చేతికూడు దినుటలేదు. అబ్రాహ్మణముండాకొడుకా! నోరుముయ్యి. సిగ్గులేదేమి ?

ప్రథ—నాముండజోలి నీకెందుకు? దానిసంగతి నీవెత్తకు. ఏమయిన నన్నను. రామచంద్రుని యుసురుకొట్టి చచ్చిపోతావు.

రెండ—నేను తమ్మంట్లు దీసికొన్నాను. నీవు దొంగవస్తువు లమ్మించినావు.

ప్రథ—వానిమేనమామ చచ్చినాఁడని దొంగవర్తమానము దెప్పించినమహానుభావుఁడవు నీవేకాదూ? నేనాలాటిపనులుచేయలేదు.

రెండ.—ఛీ, విధవవు. చెప్పుదీసికొనిచెంపలుపగులగొట్టుతాను.

ప్రథ—కొట్టకపోతే నీవు బ్రాహ్మణుఁడవుగావు. ఏదికొట్టు.

రెండ—పాము గఱచినప్పటినుండి నాకాలువాఁచి కదలనీయ డములేదు. అందుచేత లేవలేనుగాని లేకపోతే నిన్నీ వేళ చంపివేతును విధవా.

ప్రథ—ఆపని నేనే చేస్తాను చూడు. అని (కఱ్ఱతోఁగొట్టెను.)

రెండ—ఆఁఆఁ—కొట్టుకొట్టు. అని చేతులడ్డము పెట్టుకొను చు నీలాగు దొళ్ళుదోవవచ్చిన దేమిరా. నీసంకటము కుదర్పఁగలనులే.

ఇట్లాపురుషులిద్దఱునొకరిరహస్యములొకరుబయటఁ బెట్టుకొను చుఁ గలహమాడుచుండఁగా శరభరాజుగా రామాటలువిని యందు లో నొకఁడు వేంకటరత్నమనియు, రెండవవాఁడు శోభనాచలమని యుఁ గంఠధ్వనినిబట్టి యానవాలుపట్టి చాకలివానితోఁగూడవారియె దుటకుఁబోయి నిలచిరి. ఎదుటనిలిచిన శరభరాజుగారినిజూచి వేంకట రత్నమును శోభనాచలమును భయవిస్మయములతోఁ గదలలేకపో యిరి. అప్పుడు శరభరాజుగారు వారితో నిట్లుమాటాడిరి.

శర—ఏమిరా వేంకటరత్నము! ఈవివాదమేమిటి? నీకు శోభనాచల మెందుకు సొమ్మియ్యవలెను? నీకును శోభనాచలమున కునుగల వ్యవహార మేమిటి?

వేంక—తలవంచి యూరకొన్నాఁడు.

శర—ఓరీ! దుర్మార్గుఁడా, నీవేమో నమ్మకము గలవాఁడవని యు నాకుఁ బ్రతిష్ఠదెత్తువనియు నేననుకొన్నాను. సత్పురుషుఁడయి న రామచంద్రునికూటిలో దుమ్ముబోసిన మహానుభావుఁడవు నీవే నా? మామంత్రిప్రగడవారి వంశమునఁ దప్పఁబుట్టినావురా! నీమా టలను నమ్మి నిష్కారణముగా రామచంద్రుని లేవఁగొట్టినాను. అత నిమనస్సెంత క్షోభపడినదో! మేనమామ చచ్చినాఁడని దొంగవత్త

మాన మతనికిఁ జెప్పి వానిచే దొంగవస్తువుల నమ్మించి యాసొమ్ము మీరు పంచుకొన్నారా? అవురా! ఎంతవాఁడవురా! ఛండాలుఁడా!

(శోభనాచలముతో) "ఏమయ్యా, నీకు బుద్ధిలేదు. అభము శుభము నెఱుఁగని కుఱ్ఱవానితమ్మంట్ల నపహరించుటకు నీకుఁ జేతు లేలాగు వచ్చినవయ్యా! పాముగఱచి బాధపడుచున్నావు. నీకిప్పటి కైన సిగ్గురాలేదూ? మీరిద్దఱు మేఁకతోలును గప్పుకొన్న పెద్దపు లులుగదా!"

శోభ—(శరభరాజుగారికాళ్ళమీఁదఁబడి) అయ్యా! రామచం ద్రుని సమస్తవిధముల భంగపఱచినాము. ఈవేంకటరత్నమును నేనును గలసి చేయరాని పాపములన్నియుఁ జేసినాము. తమరుక్షమించినట్ల యిన నింకొక్కసంగతినిగూడఁ జెప్పెదను. తమపిల్లవాని వస్తువులు."

శర—(ఆశ్చర్యముతో మాటకడ్డమువచ్చి) అవితీసి కుఱ్ఱవాని నోట గుడ్డలు కుక్కినవారు మీరే? అయ్యో! ఇఁక మిమ్ము బ్రతుక నీయఁగూడదు. మీరు లోకములను మ్రింగివేయఁగలరు. ఎంతవాళ్ళ యిన నవుదురురా మీరు. అన్నా! వేంకటరత్నము! మాయింటనుండి మాకుఱ్ఱవానినే చంపఁదలఁచుకొన్నావా? ఛీ! నాయెదుటనుండి లేచిపో. నీమొగమును జూడఁగూడదు.

వేంక—(ఏడ్చుచు) "అందులో నేనేమియెఱుఁగనండీ. మీ పాదములసాక్షి."

శోభ—అయ్యా! మీనరసింహాముయొక్క వస్తువులు నేను ను మఱియొక్కఁడును గలసి తీసినాము. వేంకటరత్నమందులో నేమి యునెఱుఁగఁడు. నావంటి మహాపాతకుఁ డొక్కఁడునులేఁడు. నేను రా మచంద్రుని గొట్టుటకు వెళ్ళుచుండఁగా ముక్తేశ్వరము త్రోవలో నన్నుఁ బాముగఱచినది. నేను రోగముచేతఁ దీసుకొనుచున్నాను. నాకు

బుద్ధివచ్చినది. ఇఁక నేబ్రతుకను. నన్ను క్షమించండి! నా కభయ మిచ్చినదాఁక మీకాళ్ళు వదలను.

శర—ఓరీ! వేంకటరత్నము? మాయింటనుండి లేచిపో. రామచంద్రుఁడు చచ్చిపోయినాఁడుగదా. నీమూలమున నాకు బ్రహ్మణహత్యకూడ వచ్చినది.

వేంక—అతఁడు కోటిపల్లెలో నున్నాఁడఁట. చచ్చిపోలేదు.

శర—ఇఁక నాతో మీరు మాటాడవద్దు పొండి.

అని శరభరాజుగారు ప్రయాణమును మానికొని గ్రామము నకుఁదిరిగివచ్చి యింట నందఱితో నాసంగతిఁజెప్పఁగా వారందఱును నిజమునేఁటికిఁ దెలిసినదికదాయని సంతోషించిరి. రాజగోపాలము పరవశత్వమునుజెందెను. శరభరాజుగారు బ్రాహ్మణులను క్షోభపెట్టుట సంపన్నగృహస్థులకు క్షేమముగాదని యోజించి శోభనాచలమును వేంకటరత్నమును క్షమించిరికాని తిన్నఁగావిచారింపకుండ రామచంద్రుని క్షోభపెట్టినందులకుఁ బరిపరివిధముల నొచ్చుకొనుచుఁబశ్చాత్తాపమును జెందిరి. మఱునాఁ డుదయమున లేచి సోమావధానులను బిలిపించి, పార్వతిని రామచంద్రునకిచ్చి వివాహముఁ జేతుననియు, ముహూర్తమును బెట్టుమనియుఁ జెప్పి మంచిలగ్నమును బెట్టించి, రాజగోపాలము శరభరాజుగారు సోమావధానులును గలసి రామచంద్రునితో నీసంగతిఁ జెప్పుకొనుటకు మధ్యాహ్నముబయలుదేరి కోటిపల్లెవెళ్ళిరి.

శంకరరావుగారు విజయనగరమునకుఁ బోవుటవలన నేఁబదిరూపాయలపని కచ్చేరీలోనూరకయున్నందుననాపని రామచంద్రునకు నియ్యఁగూడదని పద్మనాభముగారు వ్రాసినను, శంకరరావుగారి సాహాయ్యముచేత నది రామచంద్రునకేయయ్యెను. ఆపని యాతనికైన నెలదినములకుఁ గోటిపల్లిపరగణాయందుఁగొన్నితొందరలుగలిగినందునఁ దన్నివారణార్థముమహారాజుగారు శంకరరావుగారినక్కడకంపిరి.

ఆయనవచ్చినతోడనే వ్యవహారములన్నియుఁ జక్కఁబడెను. ఆయన నాల్గుమాసము లక్కడనుండిరి. క్రమక్రమముగా శంకరరావుగారికిని రామచంద్రునకును బరస్పరానురాగ మభివృద్ధిజెందెను. శరభరాజు గారును రాజగోపాలమును సోమావధానులునువచ్చి రామచంద్రుని యిల్లు తెలిసికొని యతని యెదుటికిరాఁగా వారిని జూడఁగానే రామ చంద్రుఁడాశ్చర్యపడెను. తరువాత వారినందఱను రామచంద్రుఁడు మర్యాదచేసెను. ఒకరి యోగక్షేమముల నొక రడిగినవెనుక వారిట్లు మాటాడిరి.

శర—రామచంద్రుఁడూ! నీకు నేను మహోపకారమును జేసి నాను. నీవెట్లు మాయలోఁ బడినావో నేనును నటులే పడినాను. నన్ను నీవు క్షమింపవలెను.

రామ—మీరంతమాట సెలవియ్యవద్దు. మీరు పొరపడి నారు. మీరదివఱకుఁ జేసిన యుపకారమును నేను మఱవను. ఇది యెల్ల మీచలవేకదా.

శర—నేను మాపార్వతిని నీకిచ్చి వివాహముఁజేసెదను. వివా హమీవేళకుసరిగా నెలయున్నది. ఉభయులకుఁ గావలసిన సొమ్మంత యు నేనే వ్యయముచేసెదను. మీబంధువుల నందఱి నీలోఁగాఁ బిలిచి మాబంధువులకు శుభలేఖలు వ్రాసిపంపెదను. అప్పటికి నీవు సెలవు బుచ్చుకొని రావలెను. పాలకిగూడ నక్కడనే కుదిర్చియుంచుతాను. మేమింకఁ బ్రయత్నములు చేసికొంటాము.

రామ—మాపినతండ్రిని మామేనమామను బిలువవలసినది. అంతకంటె నాకు బంధువులు లేరు.

రాజ—రామచంద్రుఁడు! శోభనాచలమును వేంకటరత్న మును దమలోఁదాము కలహమాడి యొకరిరహస్యముల నొకరు బ యలు పెట్టుకొనిరి. అది మాబాబయ్యవిన్నాఁడు. నిజము నేఁటికిఁదెలి సినది. వేంకటరత్నమును లేవఁగొట్టినారు.

రామ.—దైవానుగ్రహమున్నది కనుక నిట్లయినది.

ఇట్లు వివాహమునిశ్చయించి యారాత్రి వారందఱు నక్కడ నుండిరి. రామచంద్రుఁడు శరభరాజుగారిని శంకరరావుగారియొద్దకుఁ దీసికొనిపోయి దర్శనము చేయించి యాకాలపువిశ్వాసఘాతకులవలెఁ గాక తానుద్యోగముచేయుచున్నను బూర్వము శరభరాజుగారియింటఁ దానున్నను జెప్పుకొనుట కభిమానములేక యాయన తనకుఁజేసిన మహోపకారములనెల్ల నుగ్గడించి శరభరాజుగారి గుణములను దగునట్లు శ్లాఘించెను. వారందఱును మఱునాఁడు ప్రయాణమైపోయిరి. రామచంద్రుఁడు వివాహనిత్తమొకమాసము సెలవిమ్మనియడిగెను. పద్మనాభముగారు వీలులేదని యుత్తరువుజేసిరి. ఈవర్తమానము రామచంద్రుఁడు శంకరరావుగారితోఁజెప్పఁగా నాయన పద్మనాభముగారిని జీవాట్లుపెట్టి సెలవునిప్పించిరి. వివాహమొక వారమున్నదనఁగా రామచంద్రుఁడొకనాఁడు వీధియరఁగుమీఁద గూర్చుండఁగా నతని పినతండ్రి జగన్నాథమువచ్చికూర్చుండి రామచంద్రునితో నిట్లుచెప్పెను. "నాయనా! విన్నావాజరిగినసంగతి. శరభరాజుగారు నీకుఁదనకొమార్తెనిత్తునని మహూర్తముఁబెట్టించి మమ్ములనందఱినిబిలిచి తిరిగినాలుగుదినములక్రిందట వేఱేకొత్తసంబంధము నిశ్చయించుకొన్నారఁట. మనసంబంధముకంటెగొప్పది తెచ్చుకొన్నారు. వెయ్యిరూపాయలువరదక్షిణకూడనిచ్చినారఁట. గొప్పవారుగనుక చెల్లినది. మనమీలాటిపనిఁజేసినపక్షమున సాటివాళ్ళు తాటియాకులు గట్టుదురు. వారినెవరు నోరెత్తి మాటలనలేకపోయినారు. గొప్పవాళ్ళందఱికి వినాశకాలమీలాగే యుండును. చూడు! వారుచేసిన నగుబాటుపని.

రామ.—(విస్మయముతో) శరభరాజుగారలాటిపని జేయుదురా?

జగ.—చేయకేమి! ఆయన పైకాలా గగపడునేకాని లోపల విషము. నీవునీచుఁడవఁట. ఆశరభరాజుగారికినీకియ్యవలెననియున్నది

కాని, నీచపుసంబంధమని బంధువులందఱు నాక్షేపించినారఁట. అందుచేత నీకు వేఱొకసంబంధము గుదిర్చినాను. నీకిష్టమున్నపక్షమునఁ జేసికొనవచ్చును.

రామ—నీవే పెద్దవాఁడవు. నీకిష్టమైనసంబంధముదీసికొని రా.

జగ—కపిలేశ్వరములో మనవారున్నారు. వారు శరభరాజుగారికన్న గొప్పవాళ్లు. సంవత్సరమునకునాలుగువేలరూపాయలు వారికి భూములమీఁద వచ్చును. పిల్ల మకరమువంటిది. పెమ్మరాజు ప్రసాదరాయఁడుగారికుమార్తె. నీమంచియోగ్యతను జూచి నీకుఁ బిల్లనియ్యవలెనని వారికున్నది. ఆయన మిక్కిలి మంచివారు. ఆయన వారముదినములలో నిక్కడికివచ్చి నిన్నుఁజూచి ముహూర్తము నిశ్చయించుకొందురు.

రామ—గొప్పవారిని నమ్మఁగూడదు. చెప్పెడుమాట యొకటి, చేసెడి దొకటి.

జగన్నాథ మీవర్తమానమంతయు రామచంద్రునితోఁ జెప్పి మఱునాఁడు వెళ్ళిపోయెను. శరభరాజుగారు వేఱుసంబంధము గుదుర్చుకొనుటచేత రామచంద్రుఁడు మునుపటి ముహూర్తమునకు నమలాపురము వెళ్ళలేదు. జగన్నాథముగారు వెళ్లిన పదిదినముల కొకనాఁటిరాత్రి పండ్రెండుగురుబోయీల పాలకినెక్కి యొకకాగడా వేయించుకొని మంచిబట్టలు ధరించుకొని పెమ్మరాజు ప్రసాదరాయఁడుగారువచ్చిరి. రామచంద్రుఁ డాయన కెదురుగాఁబోయి తీసికొనివచ్చి మర్యాదజేసెను. ఆయనతోఁగూడ నొకబ్రాహ్మణుఁడు పసుపు కుంకుమ, పండ్లు చాకలివానిచేతఁ దెప్పించి యచటఁబెట్టెను.

ప్రసా—అబ్బాయీ! మీపినతండ్రిగారు వచ్చి నీతోమాటలాడినారా?

రామ—సంగతులన్నియుఁ దెలిసినవి. ఆయన వచ్చినారు.

ప్రిసా—వివాహమిప్పటి కాఱున్నొక్కదినమున్నది. సిద్ధముగానుండు. మాపిల్ల చిన్నతనమందు జబ్బుపడినపుడు మేము వెంకటేశ్వరసాన్నిధ్యమందువివాహముచేయుదుమని మ్రొక్కుకొన్నాము. అందుచేత వాడపల్లెలో నీకార్యము జేయఁదలఁచుకొన్నాను. ఒక్కనాఁటి పెండ్లియని సందేహింపకుమని చెప్పి బ్రాహ్మణుఁడుదెచ్చిన పసుపుకుంకుమ రామచంద్రిన కిప్పించెను. బోయీలుసవారిఁదీసికొని వెళ్లిపోయిరి. బ్రాహ్మణుఁడును వారితో వెళ్ళెను. ప్రిసాదరాయఁడుగారక్కడ మఱునాఁడుండిరి. ఆదినమున నాలుగుగడియలప్రొద్దెక్కిన తరువాత రామచంద్రిఁడును బ్రిసాదరాయఁడును మాటలాడుచుండఁగా రాజగోపాలము వచ్చి రామచంద్రినితో నీప్రకారము కఠినముగ మాటాడెను.

రాజ—ఏమోయి! రామచంద్రిఁడు! పరువైన నియోగుల యింటఁ బుట్టినావుగదా! నీవీలాటిబుద్ధి లెక్కడ నేర్చుకొన్నావు? నీకు మాసంబంధమిష్టమున్నయెడల రావలెను. ఇష్టము లేనిపక్షమున రామని స్పష్టముగాఁ జెప్పవలెను. నీమాత్రిపు బెండ్లికొడుకు మాకుఁ గుదురకపోడు. మొదట వస్తానని చెప్పి ముహూర్తముబెట్టించి రాక మోసము చేయఁ దలఁచుకొన్నావా? నలుగురుబంధువులలో నగుబాటువచ్చి తలయెత్తుకొనలేక పోయినాము. ముహూర్తముదాఁటినతరువాత నీవురావనిమీఁపినతండ్రిగారు చెప్పినారు. ఆమాట మొదట మాతోఁ జెప్పకపోయినారా?

ఆమాటలకు రామచంద్రిఁ డాశ్చర్య పడుచుండఁగాఁ బ్రిసాదరాయఁడుగారు తొందరపడ నారంభించిరి. ఇంతలో శంకరరావుగారుగుమ్మముముందఱికివచ్చి "కామయ్యా! ఇక్కడేనా" యనియడిగెను.

కామ—"ఇక్కడేనండి. అదుగో దిక్కుమాలిన ముండాకొడుకు. నాకొంపఁ దీసినాఁడు." అని యఱచెను.

శంక—కామయ్యా! తొందరపడకు! సంగతియంతయుఁ జెప్పు.

కామ—అయ్యా! ఆకూర్చున్నవాఁడు నాకొమార్తె నెత్తుకొనిపోయి రామచంద్రునికిచ్చి దొంగతనముగా వాడపల్లెలోఁ బెండ్లిచేయఁదలఁచుకొన్నాఁడు. ఈదుర్మార్గుఁడు దినమున కొకవేషము వేసికొని లోకమును మోసము చేయుచుండెను.

శంక.—ఆతని చెవులనున్న తమ్మంట్లు మాతమ్ముని చెవులనుండెడివని తోఁచుచున్నది.

రాజ—ఓరీ ప్రసాదరాయఁడా! నీసంగతి యంతయుఁ జెప్పు. నిన్ను తక్కువశిక్షతోఁ బోనిత్తుము. లేనిపక్షమున నీపాట్లు నీవనుభవింపఁ గలవు.

ప్రసా—అయ్యా! నన్ను క్షమింపవలెను నేఁటికి నేను దొరకినాను. మాది నిడదవోలు కాపురము. నాపేరు చామర్తి జనార్దనము.

రామ—అయ్యా! ఇతని పేరుయొక్క పొడియక్షరములున్న రుమాలు మాకు దొరికినది. దానిమీఁద "చా. జ' యనియున్నది.

శంక.—అతనివృత్తాంతము నంతను జెప్పనిండు.

ప్రసా—నేను జిన్నతనమునందెప్రత్రార్జితమగు ద్రవ్యమంతయు జూదమునందు వ్యయపెట్టి జోగినై యమలాపురము బ్రవేశించి కూచిమంచి శోభనాచలమునకు స్నేహితుఁడనై యనేక పాపములను జేసినాను. శోభనాచలముయొక్కయు, వేంకటరత్నముయొక్కయుఁ బ్రోత్సాహముచేతఁ గత్రారామయ్యయను పేరుబెట్టుకొని, యీ రామచంద్రుని మేనమామచచ్చినాఁడని దొంగవర్తమానమును జెప్పినాను. దేశిరాజు సూర్యనారాయణ యను పేరుబెట్టుకొనియిత్తడికంటెను, గాజురాయివేసిన యిత్తడి యుంగరమును రామచంద్రునికిచ్చి బంగారపువస్తువులని యమ్మించినాను. శరభరాజుగారి రెండవకుమారుని నగలన్నియు నేను శోభనాచలమును దీసికొనిపిల్లవానినోటగుడ్డ

లుకుక్కినాము. తరువాత నాకునువారికిని వివాదమువచ్చినది. ఇప్పుడు రామచంద్రుని పినతండ్రి జగన్నాథమునాయొద్దకువచ్చి రామచంద్రునకు శరభరాజుగారి సంబంధము వచ్చుట కోర్వఁజాలక యాపెండ్లిఁ జెడఁగొట్టి బీదపిల్లలనుజేయుమని నన్ను వేఁడుకొన్నాఁడు. కాఁబట్టినేనీ విధముగా నీబ్రాహ్మణునికుమార్తెను దొంగిలించుకొని రామచంద్రునకుఁ బెండ్లిచేయఁ దలఁచుకొన్నాను. నేఁటికి మీచేతఁజిక్కినాను.

శంక—నిన్ను వదలరాదు. ఏమోయి వీరాస్వామి! ఈతనిని బట్టుకొని సంకెళ్ళువేయండి.

అని సంకెళ్ళువేయించి చామర్తి జనార్దనమును విజయనగరమంపించెను. అక్కడ మహారాజుగారతనికి నాలుగు సంవత్సరములు చెఱసాలలో నుండునట్లు శిక్షవిధించిరి.

అందఱునాదినమునసింహాద్రికుఁబోయిరి. మఱునాఁడుశంకరరావుగారువచ్చి రామచంద్రునితో నిట్లనిరి. "అబ్బాయి! నీకు నాకూమార్తెనిచ్చి వివాహముఁ జేయవలెనని యున్నది. నీకుఁ జేసికొనుటకేమైన నభ్యంతరమున్నదా? మాపిల్లను జేసికొన్నయెడల నీవుమిగుల నభివృద్ధిని జెందఁగలవునుమీ" యని చెప్పఁగానే రామచంద్రుఁడు "మీరునన్ను క్షమింపవలెను. నేనిదివఱకే శరభరాజుగారికూమార్తెను జేసికొనుటకు నిశ్చయించుకొన్నాను. మధ్య నీజనార్దనమువచ్చి యంతరాయమును గల్పించినాఁడుకానియీపాటికివివాహమయియుండును. కాని మన నియోగులలోనెల్ల మంత్రిప్రగడవారు మిక్కిలి గొప్పవారు. శరభరాజుగారికి సంవత్సరమునకు మూఁడువేల రూపాయలువచ్చును. ఆయన జ్యేష్ఠకుమారుఁడు. రాజగోపాలమిప్పుడుమాయింటనున్నాఁడు. అతనికి మీకూమార్తెనిచ్చి వివాహముఁ జేయవలసినది. అన్నివిధముల నాకంటె గొప్పసంబంధము" అనిచెప్పఁగాశంకరరావుగారు "నీవు వారిపిల్లను జేసికొనవలసినది. మాట తప్పఁగూడ

దు. నీపెండ్లియైన తరువాత చూచుకొందము. నీవువెళ్ళుము" అని చెప్పిరి. రామచంద్రుఁడు శరభరాజుగారి సంబంధముకంటె శంకరరావుగారిసంబంధ మెక్కువదనియు దానివలనఁ దన కనేకలాభములున్నవనియు నెఱిఁగి మాట ముందుగా నిచ్చినందునను జిన్నతనమునందు శరభరాజుగారి యింటనున్న విశ్వాసముచేతను, శంకరరావుగారి సంబంధమును నిరాకరించి శరభరాజుగారి కొమార్తెనే చేసికొనుటకు నిశ్చయించి యమలాపురమునకు రాజగోపాలముతోఁ గూడ బోయెను. త్రోవలో వారిట్లు మాటాడిరి.

రామ—నేను బెండ్లికిరానని మీతో నెవరు చెప్పినారు? ముహూర్తమునాఁడు మీరేమనుకొన్నారు?

రాజ—ముహూర్తమునాఁడు నీవింకనువత్తువని కనిపెట్టుకొని కూర్చున్నాము. ఎంతసేపటికిని నీవు రాకపోఁగా సెలవుదొరకలేదనుకొన్నాము. ఆమఱునాఁడు మాపినతండ్రివచ్చి "మావాఁడు మీసంబంధమును జేసికొనఁడఁట. ఆయన కింతకంటె నెక్కువవారెవరోవచ్చినారు. మీయిష్టమువచ్చినట్లు మీరు చేసికొనండి" అని చెప్పెను.

ఆమాటలువిని రామచంద్రుఁ డాశ్చర్యపడి తనపినతండ్రియొక్కయోర్వలేమికి సిగ్గుపడుచుఁ దనతో నతఁడు సెప్పినమాటలును, బ్రసాదరాయఁడుగారిసంబంధములును జెప్పి రాజగోపాలమును గడుపుబ్రద్దలగునట్లు నవ్వించుచు నమలాపురము జేరి శరభరాజుగారు మొదలగువారికిఁగూడ నీవృత్తాంతమును దెలియఁజేసెను.

శరభరాజుగారిదివఱకే వివాహప్రయత్నములను జేసినందున వైశాఖశుద్ధ నవమినాఁడు రామచంద్రుఁడు పార్వతినిబెండ్లియాడెను. రామచంద్రునిమేనమామయు నాతనికుటుంబము దప్ప మఱియే బంధువులును బెండ్లికొడుకువైపున రాలేదు. పెండ్లివారిని విశ్వనాథశాస్త్రులవారియింట యడిదినేర్పఱచిరి. ఉభయులకును గావలసిన ద్రవ్య

మంతయు శరభరాజుగారే వ్యయముచేసి పెండ్లి సమస్తవైభవముల తోడనుజేసిరి. శ్రావ్యమైన తూర్యారావములతోడను, ముత్తయిదువుల పాటలతోడను, బచ్చని పందిళ్ళతోడను, విప్రాశీర్వాదధ్వానములతోడను వివాహము మనోహరముగాజరిగెను. శరభరాజుగారు తక్కువసంబధమును దెచ్చుకొన్నారని వారిబంధువు లెవ్వరును రాలేదు. అమలాపురమునందే విద్యార్థిగానుండి యచ్చటనే యపనింద పాలయి, మరల నాగ్రామమునందే కడు మర్యాదగా వివాహమాడుచున్న రామచంద్రునిఁజూచి యందఱును సంతోషించిరి. అయిదు దినములును వివాహమైనతరువాత పదునాఱుదినముల పండుగయగువఱకు నమలాపురమునందే యుండి పిమ్మటఁ గోటిపల్లి వెళ్లెను. వివాహమైన రెండుమాసములలోనే శంకరరావుగారు దమకొమార్తెను శరభరాజుగారి జ్యేష్ఠకుమారుఁడగు రాజగోపాలమున కిచ్చి పెండ్లిఁజేసిరి. ఇట్లుశరభరాజుగారును శంకరరావుగారును వియ్యంకులగుటచేత రామచంద్రునియందు శంకరరావుగారు మునుపటికంటె నెక్కువ దయగానుండిరి. తరువాత రాజగోపాలమునకు శంకరరావుగారు విజయనగరమునం దుద్యోగమునిప్పించి యతనినచ్చటికిఁదీసికొనిపోయిరి. వివాహమైన యెనిమిదిమాసములకే పార్వతి వ్యక్తురాలయినందున మఱినాలుగుమాసములకు శరభరాజుగారామెకుఁ దగినసారెబెట్టి కాపురమునకుఁ బంపిరి. పార్వతియు రామచంద్రుఁడును గోటిపల్లెలోఁ గాపురము చేయుచుండిరి.

సమాప్తము.



446

417

రాజరత్నము

రాజరత్నము మిక్కిలిచక్కనిబిడ్డ. ఆమెపుట్టినింటివారి నివాస స్థానము పెనుగొండ. ఇది లంకసీమలోనున్న గ్రామములలో మిక్కిలి ప్రసిద్ధికెక్కెను. ఈగ్రామము నరసాపురపు కాలువయొడ్డున నున్నది. వైశ్యులకెల్లఁ బరమదేవతయై వైశ్యకులము ననుగ్రహించుటకై ధరణీమండలమున నవతరించిన పార్వతీదేవి యని శాలంకాయనమహామునిచేత వర్ణింపఁబడిన కన్యకాపరమేశ్వరి యీగ్రామముననే యవతరించెను. అందుచేత నిది వైశ్యులకెల్ల సేవింపఁదగిన క్షేత్రరాజము. కన్యకాపరమేశ్వరికోవెల యిచ్చట నలరారు చున్నది. ఆదేవతకు నివాస మగుటచే వైశ్యులనేకు లీపట్టణమునఁగలరు. వైశ్యులున్నచోట వాణిజ్యము విరివిగానుండునని చెప్పనేల? విశేషించి గొప్ప కాలువయొడ్డున నుండుటచే వాణిజ్యమునకుఁ దగినయనువు లేర్పడినవి. తృణకాష్ఠజలసమృద్ధిగల గ్రామ మగుటచేఁ బెనుగొండ నివాసయోగ్యములగు గ్రామములలో నగ్రగణ్య మైనదని చెప్పవచ్చును. ఆ గ్రామమున వల్లూరి రామేశ్వరస్వామి యని యొకనియోగిబ్రాహ్మణుఁడుగలఁడు. వీరిపూర్వులు దేశపాండ్యులై మిక్కిలిఖ్యాతిగాంచిరి. ఈయనతండ్రికాశీరామేశ్వరయాత్రకుఁబోవుచు బ్రాహ్మణసంతర్పణలక్రిందను సొమ్ము వెచ్చబెట్టి యప్పులపాలై పిత్రార్జితములైన భూములు చాలవఱ కమ్మివేసెను. అందుచేత వీరికి భూములవల్ల వచ్చుసొమ్ము మిక్కిలి తక్కువ. ఏఁడాదికి రెండుపుట్ల ధాన్యముమాత్రము వచ్చును. భార్యాభర్తలిద్దఱేకకుటుంబమైనకాలమున నీరెండుపుట్లధాన్యమొక

విధముగ సరిపోయెను. కాని పిల్లలు బైలుదేఱినతరువాత నది చాల నందున రామేశ్వరస్వామి పెనుగొండలో నొకకోమటియొద్దగుమాస్తాగాఁ గుదిరి నెలకు పదుకై దురూపాయలు జీతముదెచ్చుకొనుచుండెను. ఆవర్తకుఁడుసజ్జనుఁడగుటచేతను బ్రాహ్మణభక్తిగలవాఁ డగుటచేతను బీదయైన తనగుమస్తా కప్పుడప్పుడు ముఖ్యముగా నేవేని కార్యములు వచ్చినప్పు ఁ ధర్మకాతాను దీసినసొమ్ములోఁగొంత యిచ్చుచు సరకుల మీఁద రుసుమిప్పించుచు సహాయము జేయుచుండెను. రామేశ్వరస్వామి న్యాయవర్తనుఁడై యజమానునెన్నఁడు మోసము జేయక వ్యవహరించుచుండెను. అతని కిద్దఱుబిడ్డలు కలిగిరి. ప్రథమసంతానము కుమారుఁడు. రెండవసంతానము కూఁతురు. కుమారునిపేరు కేశవరాజు. ఇది తండ్రిగారిపేరు. కుమార్తె పేరు రాజరత్నము. కుమారుఁడు ప్రవేశపరీక్షవఱకునరసాపురమునఁజదివిప్రథమశాస్త్రపరీక్షజదువుటకు రాజమహేంద్రవరమువెళ్ళి కళాశాలలోఁజేరియాపరీక్షయందుఁ గృతార్థుఁడై పట్టపరీక్షకుఁ జదువుచుండెను. అతని తెలివితేటలుచూచి శృంగవృక్షనివాసులైన ద్రోణంరాజు సీతాపతిగా రతనికి పిల్లనిచ్చి యుభయవ్యయములు తామే భరించి వివాహముచేసిరి.

రాజరత్నమునకుఁ బదిసంవత్సరములునిండెను. ఆమెయైదేండ్ల నాఁటనుండియుఁదమగ్రామములోనున్న బడికిఁబోయిచదువుకొనుచుండెను. అక్కడున్నంతవఱకు విద్యనేర్చెను. బాలిక సహజముగ మిక్కిలితెలివిగలదగుటచే నేపుస్తకమగపడిన నాపుస్తకము చేతఁబుచ్చుకొనియక్షరములుకూడఁబలికివాచకముకుదుర్చుకొనెను. ఆమెకంఠము మిక్కిలిమధురమైనదగుటచే రాగజ్ఞానము లేకపోయిన నెంతోశ్రావ్యముగఁ బద్యములు చదివి శ్రవణానందముసేయుచుండును. రామేశ్వరస్వామిగారు తీరుబడియైనపుడు రుక్మిణీకళ్యాణము గజేంద్రమోక్షము నంబరీషోపాఖ్యానము నరసింహావతారఘట్టము రాజరత్నముచేతఁజది

వించుకొని విని యానందించుచుండును. ఆగ్రామమున రామనాథ శాస్త్రిగారనియొకసంస్కృత పండితుఁడుకలఁడు. రామేశ్వరస్వామిగారి యజమానుఁడైన వైశ్యునియొద్ద రామనాథశాస్త్రిగారు భూమితనఖా బెట్టి కొంతసొమ్ము బదులు పుచ్చుకున్నందునఁ దరుచుగా నాయనవీరి యింటికి వచ్చుచుఁ బోవుచుండును. ఆసమయము గనిపెట్టి రాజరత్న ము భాగవతములోఁ దనకుఁదెలియని పద్యముల యర్థమాయననడిగి తెలిసికొనుచుండును. ఈశాస్త్రిగారి సహాయముచేతను స్వయంకృషి చేతను నామె భారతభాగవత రామాయణములలోని పద్యములకర్థము చాలవఱకు గ్రహింపుచెను. చాకలిపద్దులు మొదలైనవియె గాక జాబులు గూడ నామె సొగసుగ వ్రాయఁగలిగెను. తండ్రి లెక్కలు వ్రాసికొనునప్పుడు దగ్గఱఁగూర్చుండి చిఠాలువ్రాయుట వడ్డీలెక్కలు కట్టుట మొదలగువానిలోఁ గూడ కొంతప్రవేశము గల్గించుకొనెను. ఆమెకు తొమ్మిదియేండ్లువచ్చినదిమొదలుకొని తండ్రి మంచిసంబంధము కొఱకు విచారించుచుండెను. వల్లూరివారిలోఁ గొందఱింగ్లీషుభాష జదువుకొని గొప్ప యుద్యోగములు చేయుచుండుటచేత తనబిడ్డనింగ్లీ షుజదువుకొన్నవాని కియ్యవలెనని యాయనకభిప్రాయము గలిగెను. మళ్ళు మాన్యములు గలిగి బిడ్డ కెన్నోనగలుపెట్టఁ గలవాని కియ్యవలె నని తల్లి తలంచెను. భార్యాభర్తల కీవిషయమై పలుమాఱు సంవా దము జరిగెను. ఆవాదములలో నభిప్రాయభేదము మిక్కుటమైనపుడు సతీపతులు కఠినోక్తులు పలికికొనుటయు భర్త భార్యనుదూలనాడుట యు మంగమ్మగా రప్పుడప్పుడు కోపించి మూతిముడుచుకొని రెండు మూఁడుదినములుభర్తతో మాటలాడకపోవుటయు నట్టిసమయములో రామేశ్వరస్వామిగారు పిలిచి యేదైన నాలోచనమడిగినప్పుడు "పనికి మాలిన యాఁడుదానను, పశువును. పశు వాలోచన జెప్పఁగలదా?" యని దెప్పుటయుఁగూడ గలదు. మనస్సులో నెత్తుగాఁబెరిగినదుఃఖము

కోపము మొదలగువానిని కాలమె కొద వడగించును. కాన నాలుగు దినములు ప్రాతవడినతరువాత వారికోపము లడఁగుచుండును. రాజమహేంద్రవరకళాశాలలోఁ జదువుచున్న విద్యార్థులలోఁ దెలివితేటలు మంచిసాంప్రదాయముగల పిల్లవాని నెవనినైనఁ జూడవలసిన దని తండ్రి కేశవరాజుతోఁ దరుచుగాఁ జెప్పుచుండుటచే నతఁ డెదాఱు సంబంధములు తండ్రికెఱిఁగించెను. కొంచెమైననుభూమి లేదనియొకటి పిల్లవాఁడు నల్లగానున్నాఁడని యొకటి, వరుఁడు మంచియారోగ్యము కలవాఁడు కాఁడనియొకటి, ప్రతిపరీక్షయందు రెండుమూఁడేండ్లుతప్పి పోయి యెట్లో చచ్చిచెడి తేలుచున్నాఁడను కారణమున నొకటి, చిన్నవాఁడైనను దలవెంట్రుకలునెరసిన కారణమున నందముగా లేఁడనియొకటి సంబంధములు వారికి నచ్చలేదు. తండ్రికొడుకులిద్దఱు నాంగ్లేయవిద్యార్థులకే రాజరత్నము నీయవలయునని తలఁచుటచేత మంగమ్మగారిమాట పాటిసేయక త్రోసివేయఁబడెను. రాజరత్నముయొక్క చక్కఁదన మసాధారణమైనదగుటచే నామెంజూచినవారును, నామెను గూర్చి విన్నవారును, తమకుమారుల కామెనువివాహము జేసికోఁదలఁచిరి కాని కట్నము కానికలు వారిత్రోవ కడ్డమువచ్చెను. కట్నమియ్యకపోయినను సరే యాపిల్ల నట్టింట నిలిచిననేచాలును. అదిమాయింటికోడలని చెప్పుకొనుటయే చాలు మన పిల్లవానికిచ్చి వివాహము సేయుఁడని కొందరాడువాఁడు పట్టుపట్టి భర్తలతోఁ జెప్పిరి. కాని వల్లూరి రామేశ్వరస్వామి పేదవాఁడు. మనదర్జాకుఁదగినసంబంధము కాదని పురుషులు స్త్రీల నోళ్ళు నొక్కిరి. అట్లనుటకు రహస్యకారణ మేమన రామేశ్వరస్వామి కట్నము లియ్యలేకపోవుటయె. మిత్రభావము చేతనప్పుడప్పుడు కేశవరాజుతోఁ గలిసి సెలవుదినములలోఁ బెనుగొండ వచ్చినవిద్యార్థులు బాలికరూపరేఖవిలాసంబులు భాషాపరిచితివినయ వివేకంబులు స్వయముగఁజూచి యామె పాణిగ్రహణము జేసికొనవల

యునని సంకల్పించిరికాని పితృవాక్యపరిపాలకులగుటచే వారిమాటలు సాగినవికావు. కేశవరాజు రామేశ్వరస్వామిగారు పలుగ్రామములు తిరిగిరి. ఎట్టకేల కొక్క సంబంధమువచ్చెను. అతఁడు బంధకవివారి పిల్లవాఁడు. పేరు జగన్నాథరావు. అతనికాపురము భీమడోలుగ్రామము. పరివేశపరీక్ష కేలూరులోఁ జదివి కృతార్థుఁడై రాజమహేంద్రవరములోఁ బ్రథమశాస్త్రపరీక్షతరగతిలోఁ బ్రవేశించి మొదటితరగతి పరీక్షలోను తీర్ణుఁడై రెండవయేటితరగతిలోఁ జేరెను. అతఁడుచక్కని పిల్లవాఁడు. పదునెనిమిదేండ్లు ప్రాయమువాఁడు. క్రొత్తక్రొత్తతలంపులు నూనూగు మీసములు నంకురింపఁదొడఁగెను. రాజరత్నమున కతఁడు చక్కఁదనమున నీడున జోడునఁ దగినవాఁడనిచూచినవారంద అనిరి. కాని యిక్కడకూడ కట్న మడ్డువచ్చెను. బాలునితండ్రియైన శంకరరాజుగారు వెయ్యినూటపదాఱురూపాయలుకట్నము బరంపురము పట్టుపంచెలు వెండిచెంబులు వియ్యపురాలు లాంఛనములక్రింద నైదుదినము లైదుకాసులు విశేషించి యీఁడుపడుచు లాంఛనములు నియ్యఁదలఁచినవారే తనతో మాటలాడవలయుననియుఁ దక్కినవారు తన్నుఁ జూడనక్కరలేదనియు వర్తమాన మంపనక్కరలేదనియుబహిరంగముగఁ జెప్పుచుండెను. ఆకారణముచే రామేశ్వరస్వామిగారుశంకరరాజుగారి కడకుఁబోవ పనిలేదు, కాని జగన్నాథరావు మాటలు వారి కాసలుగొలుపఁజొచ్చెను. జగన్నాథరావొకశుక్రవారమునాఁడు మధ్యాహ్నము కేశవరాజువెంట రహదారీపడవమీఁద పెనుగొండకుఁ బయనమై వెళ్లి శనివారముదయమున నక్కడదిగి రాజరత్నమునుజూచి యేది యెట్లయిననుసరే యీబాలికను వివాహమాడవలయునని దృఢముగా సంకల్పించుకొని మరల రాజమహేంద్రవరమువెళ్ళి తననిశ్చయము తండ్రికివ్రాసెను. ఆజాబుఁ జూడఁగానే తండ్రి మండిపడియెను. కొడుకునకు దుర్బుద్ధులు పుట్టినవని తల్లి విచారించెను. వెంటనే

తండ్రి కానికార్డుపుచ్చుకొని కుమారున కుత్తరము వ్రాసెను. కోపావేశముచేత నతఁడు వ్రాసినమాటయే నాలుగుసారులు వ్రాసెను. కాని యందు సారాంశమిది. "నేఁగోరిన కట్నమిచ్చి లాంఛనము లిచ్చి వారు పెండ్లిచేయఁగలిగినపక్షమున నీ వెవరిపిల్లను జేసికొన్నను సరే మాయాటంకము లేదు. పిల్లయేలాగున్నను సరే, నల్లతోలు తక్కువే మిటి ? ఎఱ్ఱతో లెక్కువేమిటి? బోగమువాళ్ళకుఁగాని సంసారులకు సొగసులు జక్కదనములు నక్కఱలేదు. నామాటకు వ్యతిరేకముగాఁ జేసినావంటే యీజన్మానకు నీమొగము జూడను. నీదారి నీదే. జాగ్రత్త..." ఆజాబు జూచుకొని జగన్నాథరావు భయపడలేదు. ఏదియెట్లయినను రాజరత్నమును వివాహమాడుటయెయతఁడుముఖ్యసంకల్పముగఁ బెట్టుకొనెను. ఆవిషయమైతండ్రికొడుకుల కనేకపరియాయము లుత్తరప్రత్యుత్తరములుజరిగెను. మనముకోరినంతకట్నము వారియ్యలేరు కాని యథాశక్తిగఁ గొంతవరదక్షిణనిచ్చి వారు మనలను గౌరవింతురు. కట్నము ప్రధానముకాదు. సాంప్రదాయము మంచిది. బాలిక యఖండమైన తెలివితేటలు గలది. కాఁబట్టి నాకాసంబంధమే చేయవలయునని యతఁడు తండ్రికి జాబులలో వ్రాయుచుండెను. ఒకటిరెండుసారులు తండ్రి రాజమహేంద్రవరమువెళ్లి తనమిత్రులైన యొకరిద్దఱు న్యాయవాదులచేతఁ గొడుకునకుగట్టిగ జీవాట్లుపెట్టించెను. కాని కార్యము లేకపోయెను. ఒకడిస్తక్కువనసబు జగన్నాథరావునకు రెండువేలరూపాయలు కట్నమిచ్చి పిల్లనిచ్చెదనని వర్తమాన మంపెను. లంచగొండియైన యొకతహసిల్దారుఁడు రెండువేలయేడువందల రూపాయలు కట్నమిచ్చుటకు నన్ని లాంఛనములు జరుపుటకు వేయి రూపాయలు విలువగల బాలతొడుగుతోఁ గూడఁ గన్యాప్రదానము జేయుటకు నొడఁబడెను. ఈసంబంధములో నేదేని యొకదానినొప్పుకొమ్మని తండ్రి కొడుకుపేర గట్టిగ నొకజాబు వ్రాసెను. దానికిఁ బ్రి

త్యుత్తరము రానందున నతఁడు స్వయముగ బయలుదేరి రాజమహేం ద్రవరము వెళ్ళి పట్టువిడువుమని చాటున కొడుకును బ్రతిమాలెను. వేడికోలు వ్యర్థముకాఁగా నోటికివచ్చినట్టు తిట్టెను. చెంపకాయలుకొ ట్టెను. తాను మొత్తుకొనెను. అభోజన ముండెను. జగన్నాథరావు తండ్రి చేసినపనులెల్లఁ జూచుచు నోరెత్తక యూరకుండెను. ప్రాణము విసికి తుదకు శంకరరాజు వెళ్లిపోయెను. రాజరత్నమునకుఁ దప్పమఱి యొకపిల్లకు నేను పుస్తె ముడివేయనని జగన్నాథరాజు తండ్రివెళ్ళిన తరువాత నుత్తరము వ్రాసెను. కట్నమియ్యని సంబంధము వచ్చెనా నేను నీకు పెండ్లిసేయనని తండ్రి బదులువ్రాసెను.

ఆజాబు చేరినపిమ్మట జగన్నాథరావు కేశవరాజును గలిసికొని యదిచూపి దీనికేమి యాలోచన యనియడిగెను. "నేనేమిచెప్పఁగల" నని కేశవరాజుతోఁచక యూరకుండెను. అంతటనొకముహూర్తమా లోచించి జగన్నాథరావు కేశవరాజున కిట్లనియె. "ఈవిషయములో నాసంకల్ప మంతకంతకు ధృఢమగుచున్నది. నేనురాజరత్నమునేవివా హము జేసికొనియెదను. లేదావివాహముమానివేసెదను. ఏమోకా నినామన స్సాపిల్లమీఁదగాఢముగఁదగుల్కొని యున్నది. అందుచేత నాకొక యుపాయము దోఁచినది. ఆప్రకారము నడచుకొనియెదను. బియ్యేతరగతిలో నాకుమిక్కిలి ముఖ్యస్నేహితుఁ డొకఁడున్నాఁడు. అతనిని నీవుగూడ నెఱుఁగుదువు. పునహా పురుషోత్తమరాజు. ఆబ క్కపలుచని పచ్చనిపిల్లవాఁడు, మాధ్వుఁడు. తండ్రిలేఁడు. వ్యవహార ము సొంతగముగఁజక్కఁబెట్టుకొనుచున్నాఁడు. బుద్ధిమంతుఁడు. అతని యొద్ద నేను పదియేనువందలరూపాయ లప్పుదీసికొనివచ్చి మీనాయ నగారిచేతి కిచ్చెదను. ఈసొమ్ము నేనిచ్చినానన్న మాట నెవరికిఁ దెలి యనియ్యకుండ నది నాకట్నముక్రింద నాలాంఛనములక్రిం మీరు వినియోగపఱచవలెను. ఎదో విధముగ నీసొమ్ము నేనుదీర్చికొందును.

వివాహమైన తరువాత మానాయన చచ్చినట్లీఋణము దీర్చివేయును. లేదా నే నుద్యోగములోఁ బ్రవేశించిన తరువాత మెల్లమెల్లఁగాఁదీర్చి వేయుదును" అనిపలుకుచుండఁ గేశవరాజు వానిసలహానంగీకరించినట్లు కనఁబడకపోవుటచే నది తెలిసికొని వెండియుజగన్నాథరా విట్లనియె. "ఓయీ! కేశవరాజూ! ఒక్కమాట విను. ఈవిషయములో నీవుగాని మీనాయనగారు కాని వ్యతిరేకాభిప్రాయపడి వివాహ మంగీకరింప రేని నే నాజన్మాంతము బ్రహ్మచారినై యుండెదను. ఈవేఁడి తాటి యాకులమంటవంటిది కాదు. ఇది స్థిరమైనది. ఇది నానిశ్చయము. మీ రిది చెడగొట్టితిరా నన్ను ఘోటకబ్రహ్మచారినిచేసినవా రగుదు రు. నన్ను సన్యాసిని జేసినవా రగుదురు. రేపుశనివారమునాఁడునీవు వెళ్లి మీనాన్నగారితోఁ జెప్పిరా."

ఆపలుకులు కేశవరాజున కిష్టముగలేవు. లేకపోయినను దాను ప్రత్యుత్తరము జెప్పుట కిష్టములేక "సరే! మానాయనగారితోఁ జెప్పి వత్తునులే" యని బదులుచెప్పి చదువుకొనుటకు వెళ్ళిపోయెను. మరు చటిశనివారమునాఁడు కేశవరాజు పెరుగొండవెళ్లి జగన్నాథరావుయొ క్క యభిప్రాయము తండ్రి కెఱిఁగించెను. ఆమాటలుజాగ్రత్తగావిని కామేశ్వరస్వామి కుమారునితో నిట్లనియెను. "నాయనా! అన్నివిధ ములచేత జగన్నాథరావుసంబంధము మిక్కిలి మంచిది, కాని యతఁ డప్పుచేసి మనకు సొమ్మిచ్చుట ధర్మముకాదు. మనము పరువుగల ని యోగులము. మనపూర్వులు దేశపాండ్యాలై గొప్పగొప్ప బిరుదులు సంపాదించినారు. ఈసంగతి విన్నవా రేమందురో యెఱుఁగుదువా? రామేశ్వరస్వామి పేదవాఁడగుటచేతబిడ్డను పదియేనువందలరూపాయ ల కమ్ముకొన్నాఁడని వాడుక వేయుదురు. అదిగాక తలిదండ్రులకిష్ట ము లేనప్పుడు సంబంధము చేయఁగూడదు. అందుమూలమున జగ న్నాథరావు తండ్రివలనబాధపడును. మనపిల్ల భీమడోలువెళ్ళి యత్త

మామలయొద్దఁ గాపురము సేయవలయునుగదా. దానిపొడే గిట్టనియ త్తయొద్ద మామయొద్ద నెట్లుగాపురము చేయఁగలదు? అందుచేతమన కుఁదగినసంబంధ మేదియొ చూచుకొని కట్నములుకానికలు లేకుండ తదన్నము తడ్రిసముపెట్టి యేలాగో కార్యమయిన దనిపించుకొనవల యును. కాఁబట్టి యతఁడు బదులు తెచ్చి నాకిచ్చి పెండ్లిజేసికొనుటయి ష్టము లేదనిచెప్పు. కాదాయనంటే నాదొకసలహాయున్నది. అప్రి కారము చేయుమనుము. ఆపదియేనువందల రూపాయలు ఉనస్నేహి తునిచేత నాకే తక్కువవడ్డీకి బదు లిప్పించుమనుము. ఏలాగోకష్టపడి నేనాబుణముదీర్చివేసెదను. లేకానీవు బి. యే్యపరీక్షలోఁజేరినతరువా త నుద్యోగములోఁ బ్రవేశించి నీవే మెల్లమెల్లగాఁ దీర్చికొనవచ్చును. అది స్నేహితుఁ డిచ్చినయప్పుగనుకతురకయప్పు వంటిది. మారువాళి యప్పువంటిదికాదు. లేకలేక పుట్టినపిల కనుకను సుకుమారిగనుకను జక్కనిది గనుకను జూచిచూచి పప్పప్ప చొచ్చోయనిపశువులను దోలుకొనుచు నేల దున్నుకొను నిరక్షరకుక్షికికానిగోష్పాదమంతభూ మిలేక కేవలము చదువునే నమ్ముకొన్నవానికిఁగాని యియ్యవలెనని లేదు. నాఅెక్కలకష్టముమీఁద నేను బుణముతీర్చలేకపోయిన కల్ప ములో మనకిప్పుడున్న యిల్లుభూమి విక్రియముచేసి బుణవిముక్తుఁడ నుగావలయునని యున్నది. నీమట్టుకునీవు ముందునాఁటికిబియ్యే ప్యా సై నీఅెక్కలమీఁద నీవు జీవనము జేయఁగలవు. పిల్ల మంచియింటఁబ డిసుఖపడఁగలదు. తరువాత నేనున్నాను. నాఅెక్క లున్నవి. పాటు పడఁగలిగింతకాలము నేను కష్టముపడి జీవనము జేసెదను తరువాత నీ వేయున్నావు. అతనితో నేను చెప్పినట్లుచెప్పి నాకుబుణ మిప్పించు మనుము.

జగన్నాథరావుయొక్కసంబంధమువిడువవలయునని కేశవరాజు నకెంతమాత్రమిష్టము లేకపోవుటచేత జనకునియాలోచన మతనికి న

చ్చెను. ఆదివారమునాఁ డతఁడుబయలు దేఱి సోమవారముదయమున కు రాజమహేంద్రవరము జేరి యాసాయంకాలము జగన్నాథ రావును బిలిచి తనతండ్రిచెప్పినమాటలు చెప్పెను. ఆమాటలతనిమనస్సునకు నచ్చెను. వెంటనే యతఁడు పునహా పురుషోత్తమరావుకొట్టులోనికివె ళ్ళి యతనినిబిలిచిపోతగట్టుమీఁదికిఁదీసికొనిపోయికూర్చుండఁబెట్టి రా జరత్నము చక్కనిచుక్కయు విద్యావతియు గుణవతియు నగుటయు నామెయందుఁ దనమనస్సు దగుల్కొనుటయు నామెతండ్రి యగురా మేశ్వరస్వామి పేదవాఁడై కట్నములు కానికలునియ్యలేకపోవుటయు వరదక్షిణలేని సంబంధము తనతండ్రికిష్టములేకపోవుటయు మొదలగు వృత్తాంతమంతయు సాకల్యముగఁజెప్పి రామేశ్వరస్వామిగారికి షదునై దువందలరూపాయలు బదులిమ్మనియడిగెను. పురుషోత్తమరావు తన మిత్రునిమాటలయందు సముచితాదరముజూపి యిట్లనియె. "అబ్బా యీ! ఇది వ్యవహారము. రామేశ్వరస్వామిగారి కాత్మవిశేషముగలే దు. అయనవల్ల సొమ్ము నాకువచ్చునో రాదోఅంత్యనిష్ఠురముకంటె నాదినిష్ఠురము మేలన్నారు. అప్పుడు వాజ్యములు సాజ్యములు వేయు టమంచిదికాదు. నీవు నోటువ్రాసియిచ్చినపక్షమున నీకు ఋణమి చ్చుటకు నాకేవిధమైన యాటంకములేదు. అట్లు నీవుసమ్మతింపకపో యినపక్షమున మనకేశవరాజు, తండ్రి, కలిసి నోటువ్రాసియిచ్చియా సొమ్ము వారివలన రానిపక్షమున అసలుఫాయిదాలతో నీవాసొమ్మని చ్చెదనని హామీగా నొకయుత్తరము వ్రాసియిచ్చినయెడలనేను వారి కప్పిచ్చెదను. ఇదే నేను చేయఁదగిన సహాయము. ఇష్టమున్నపిల్లనువి వాహమాడక యిష్టములేనిపిల్లను మెడకు గుదిగట్టికట్టుకొనుట నాకు సమ్మతముకాదు. నీవివాహము నాకిష్టమె. నేను చెప్పినమాటలుమీ కిష్టమైనపక్షమున మీమామగారు నీవు మీబావమఱఁది ముందు శనివారమునాఁడు నాతోఁగూడ కాకినాడవచ్చినయెడల మాయింటి దగ్గఱ సొమ్మిచ్చెదను.

అనవుడు జగన్నాధరావతని కిట్లనియె. "నావల్ల హామిగా నీవు వుత్తరముబుచ్చుకొనుట మన కేశవరాజునకుఁగాని యతనితండ్రికిఁగాని తెలియనియ్యవద్దు. నేను హామీయుత్తరము నీకిచ్చెదను. అది వారికిఁ దెలియకుండ నీవగ్గఱ నుంచుకో. అట్లుచేయకపోయినయెడలనష్టము న్నది. "సరే! అట్లె చేయవచ్చు"నని పురుషోత్తమరావుకూడలేచెను జగన్నాధరావు లేచెను. ఎవరికొట్టులోనికివారు వెళ్ళిరి. జగన్నాధరావు కేశవరాజునుబిలిచి యప్పు కుదిరినది. ముందుశుక్రవారమునాఁటికిమీ నాయనగారినిక్కడికిరమ్మనిజాబువ్రాయుము. శుక్రవారము రాత్రిగాని శనివారముదయముగాని మనము కాకినాడ పురుషోత్తమరావుతోఁ గలిసివెళ్ళిసొమ్ముపుచ్చుకొందమనిచెప్పెను. అట్లెవ్రాయుదుననిచెప్పి యతఁడు వెళ్ళిపోయెను. శుక్రవారముమధ్యాహ్నముపడవమీఁదరా మేశ్వరస్వామి రాజమహేంద్రవరమువచ్చెను. ఉదయముమేలుబండి మీఁద వారునలుగురు కాకినాడవెళ్ళిరి. పురుషోత్తమరావుజగన్నాధ రావునకుఁదనకుఁగలస్నేహముచేతదండ్రికొడుకులకునుదనమిత్రునిమఱి యొక బసచేయనీయక తనగృహమందెవిడియించిమిక్కిలిగౌరవించిపది యేను వందలరూపాయలు బదులిచ్చివారిచేతనోటువ్రాయించుకొనితన మిత్రులిద్దఱిచేత సాక్షివాళ్ళుచేయించి జగన్నాధరావునుదనపడకగది లోనికిఁ దీసికొనిపోయిరహస్యముగహామీయుత్తరమువ్రాయించుకొ ని యాయుత్తరము గుండుసూదితో నోటునకుగుచ్చియినుపపెట్టెలోఁ బెట్టితాళమువేసి తరువాత మిత్రులంగలిసి షికారువెళ్లెను రామేశ్వర స్వామిసొమ్ముదీసికొనిరాత్రిబండిమీఁద నేబయలు దేఱిమఱునాఁడుపేను గొండజేరి మంచిదినము చూచుకొని పురోహితునివెంటఁబెట్టుకొని భీ మడోలువెళ్లి బంధకవి శంకరరాజుగారిని గలిసికొని "మాపిల్లదానిని మీపిల్లవాని కీయవలెననియున్నది. ఈసంగతి తమతో మనవిజేయ వలయునని వచ్చినా"నని చెప్పెను. ఆపలుకులువిని శంకరరాజుగారా

యన కిట్లనిరి. "మీతో వియ్యమందుట నాకిష్టమె. ఎందుచేతనంటే మీరు సాంప్రదాయకులు పైగా మీపిల్ల చక్కనిదని నేనువిన్నాను. అది మాపిల్లవానికిఁ గూడ నచ్చినది. కానినేనొక్క నియమము జేసికొన్నాఁడను. ఆప్రకారము ఒరిపింపఁగలవారిపిల్లనె చేసికొనఁ దలఁచుకొన్నాను. వేయ్యినూటపదాఱు రూపాయలు కట్నమీయవలెను. వెండి చెంబులు వెండిపళ్ళెము పట్టుపంచలు పెట్టవలెను. వియ్యపురాలికి కైదు దినము లైదుపెద్దకాసు లిచ్చి యాడపడుచుకు రోజుకరకాసిచ్చి తక్కిన చిల్లరలాంఛనము లుజరుపవలెను. మేమునగారా నౌబతులతోను బోగము మేళముతోను తరలివచ్చి యెంతో శోభస్కరముగ వివాహము జేసికొనఁ దలఁచుకొన్నాము. సరేబత్తెము లీయవలయునని చెప్పనక్కఱలేదుకదా! మాతో వచ్చినచుట్టాలకు వైదికబ్రాహ్మణులకు మాయింటిచాకళ్ళకు మంగళ్ళకు సయితము వారివారిదర్జాకుసరిపడునట్లుబట్టలు పెట్టవలెను. భీమడోలునుండి పెనుగొండకు రానపోను కర్చులుమీరు పెట్టుకొనవలయును. పిల్లవానికి మీరీయఁదలఁచినచాపులు పదిరూపాయలుపెలకు తక్కువగ నుండఁగూడదు. ఇదిమీకిష్టమైతే నేఁటిరోజున నె తాంబూలములుపుచ్చుకొనవచ్చును. వరదక్షిణసొమ్ముమాత్రము మేమక్కడనుంచి వివాహమునకుబయలుదేఱకమునుపెమాకుచేరవలెను. ఒకపైసతక్కువైనను నేను తరలిరాను. మొగమాటమునకు మోక్షమునకు దూరము. ముందనుకొనక తరువాత పేచీలుపడుటనాకిష్టము లేదు. ఏమిటి మీయభిప్రాయము? ఇవిమీకిష్టమేనా? "ఆహా! యివి నాకిష్టమె. మీతో వియ్యము పొందఁదలఁచుకొన్నపుడు మీచిత్తము ప్రకారము నడవవలసినవాఁడనె నేనింటికి వెళ్ళఁగానే ముహూర్తము నిశ్చయముచేసి శుభలేక వ్రాసిపంపెదను. ఆలేఖితోఁ గూడ వెయ్యినూటపదార్లు పంపెదను. సరే నేను సెలవుపుచ్చుకొని వెళ్ళెద నని రామేశ్వరస్వామి లేచి పురోహితునితోఁగలిసి బయలుదేఱిపెనుకొండ

వెళ్ళి పెండ్లిప్రయత్నము జేయ నారంభించెను. ముహూర్తము నిశ్చ యించి శుభలేఖవ్రాసి తనబావమఱఁదిని బురోహితుని కట్నముసొ మ్మిచ్చి పంపెను. సొమ్ముతోఁగూడ వచ్చిన సుముహూర్తమగుటచే నది శంకరరాజుగారికి మిక్కిలి యనుకూలముగనుండెను. అదివేసవి కాలపుసెలవుదినములలోఁబడుటచేజగన్నాథరావునకుఁగూడననువుగా నుండెను. పురుషోత్తమరావుదగ్గఱ బదులు తెచ్చిన సొమ్మంతయువి య్యాలవారి నైవేద్యమునకై సరిపోవును. కావునభోజనవ్యయమునకుఁ దదితరవ్యయములకు రమారమి యేడెనిమిదివందలరూపాయలు రామే శ్వరస్వామి తనషాహుకారునొద్దనుమఱికొందఱియొద్దను బదులుచేసె ను. మగపెండ్లివారు మహావైభవముతోఁదరలివచ్చిరి. రామేశ్వరస్వా మియుఁ గేశవరాజును వారికెదురుసన్నాహము జేసి సగౌరవముగఁ దోడ్కొనివచ్చి విడిదిలోఁ బ్రవేశపెట్టిరి స్నాతకమయ్యెను. ఆనాఁటి రాత్రియె వివాహమయ్యెను. మగపెండ్లివా రడిగినదంతయుసణుగులు గొణుగులులేక కన్యాప్రదాతయిచ్చుచుండుటచేతఁ జిన్నచిన్నపట్టింపు లుతప్ప పెద్దకలహములులేక వివాహము సలక్షణముగ జరిగెను. శే షహోమము నాకబలిదండాడింపులు నప్పగింతలు సముదాచారప్రకా రమునడిచెను. పిల్ల బంగారపుబొమ్మ యనియు నిటువంటి కోడలు దొరకుట యత్తమామలయదృష్టమనియుశంకరరాజుగారియొక్కయు భార్యయొక్కయు నెదుట పెనుగొండగ్రామవాసులనేకులుపలుమాఱు లనిరి. చక్కనికోడలు వచ్చుటయుఁ దాకోరినకట్నమింటఁబడుటయుఁ దనకుమారుని మనస్సుసంతోషమగుటయుసంప్రాప్తించినందునశంకర రాజుగారి యానందమునకు మితిలేదు. తరువాత మనుగుడుపులకుశం కరరాజుగారు రాజరత్నమును భీమఢోలుతీసుకొనివెళ్ళిరి. మనుగుడుపు లుగూడ సలక్షణముగజరిగెను. భీమఢోలుగ్రామవాసులగుస్త్రీపురుషు లుకొందఱుజగన్నాథరావునురాజరత్నము కలియుటబంగారమురత్న

ముగలిసినట్లున్నదనియు రూపమునుబట్టియేగాక గుణమునుబట్టికూడని దియనుకూలదాంపత్యమనియు రాజరత్నముతమయూరికలంకారమని యు మెచ్చిపొగడి సంతసించిరి. అక్కడ మూఁడునిద్రలైనతరువాత జగన్నాథరావు రాజరత్నమునుగలసి మరుగుడుపునకు పెనుగొండవచ్చెను. బావమఱుదులిద్దఱు దమప్రీతనెయ్యముగొత్తవియ్యముతోఁగలిసిదృఢతరమగుటచే వారరిమరికలేకపొరపొచ్చెములులేక వేళాకోళము జేసికొనుచునాడుచుఁబాడుచు హాయిగాఁ గాలక్షేపము చేయఁజొచ్చిరి చూచినవారంద ఱాబావమరుదులను కృష్ణార్జునులనిపలుకఁదొడగిరి. అనురూపగుణసంపన్నుఁడైన వరుని వెదకి తననిమిత్తముతండ్రియు నన్నయుఁదెచ్చినందున రాజరత్నము మిక్కిలిసంతసించి పండ్రెండేండ్లవయస్సు గలిగినబాలికల కనురూపమైనసంతోషము బొందుచుండెను. మనుగుడుపు మూఁడుదినము లేయైననుజగన్నాథరావచ్చుటపదిదినములుండెను. సెలవుదినములు సమాప్తమునకువచ్చుటచేనతఁడత్తమామలకడ స్యాలకునికడ శలవుదీసుకొని భీమడోలునకుఁబోయియచ్చటనుండి రాజమహేంద్రవరము వెళ్ళెను. రెండుమూఁడుదినములైన తరువాత కేశవరాజుగూడ పెనుగొండనుండి రాజమహేంద్రవరమునకుఁబోయెను. మునుపటివలె నిద్దఱుఁ జెరియొకగొట్టుగాక నొకకొట్టుపుచ్చుకొనియొకవంటపూటియింటనె భోజనము సేయుచునొకమారుకళాశాలకుఁబోవుచు నేవిషయమునందైన నిద్దఱదొక్కమాటగ మేనలే రెండుకాని వీరిద్దఱిహృదయ మొక్కటేయని యాప్తమిత్రులనునట్లు కేశవరాజునకుజగన్నాథరావుతోఁకయనియుజగన్నాథరావునకు కేశవరాజుఛాయయనియుఁ బరిచితులు పలుమాఱు పరిహాసము నతిశయానురాగభరితులైయుండిరి. నెలకొకసారి వారిరువురుఁగలసి పెనుగొండవెళ్ళుచుందురు. పడవమీఁదిప్రయాణమన్న జగన్నాథరావునకెంతోయిష్టము. వరదపొడిచి గోదావరి యిద్దరద్దరులకు దాసినపుడు వారిరువురుఁ

గలిసి స్టీమరుమీఁద షికారువెళ్ళుదురు. తక్కినకాలములో నప్పుడప్పుడు నావషికారువెళ్ళుచుందురు! ఒకప్పుడు భీమడోలువెళ్ళి శనివారాదివారములక్కడ గడుపుచుందురు.

ఈస్నేహబంధము వారివిద్యావ్యాసంగమునకాలంకముగలిగింపక మఱింతప్రోత్సాహముగలిగించెను. అనుదినము నియమితపాఠముల నత్యంత శ్రద్ధతోఁజదివి విద్యాభ్యాసముచేయవలసినకాలములోనొక్కనిమేషమైన వ్యర్థముసేయక విద్యార్థులలో ననేకులు పొగచుట్టలు కాల్చుచుఁ దమ్ముకూడ కాల్చుమని బలవంతపెట్టినను కాల్చకపోడుముపీల్చక మృదువుదప్పినమాట నోటరానియక యుపాధ్యాయులయాదరమునకుమిత్రులగౌరవములకు బాత్రములై మెలఁగఁజొచ్చిరి. కేశవరాజుయొక్క సత్ప్రవర్తనముమాటపొందిక పెద్దలయెడవినయముమొదలగు మేలిలక్షణములఁజూచి శంకరరాజుగూడ నతనిని ప్రేమించుచువచ్చెను. కేశవరాజు బి.యే. తరగతిలో రెండవయేటితరగతిలోఁజేరెను. జగన్నాథరావు బ్రథమశాస్త్ర పరీక్షయందుఁ గృతార్థుఁడై బి. యే. మొదటితరగతిలోఁజేరెను.

తరువాతసంవత్సరముగూడ నీవిధముగానేగడచెను. కేశవరాజు పట్టపరీక్షనిమిత్తమై చెన్నపురికిబోవలసివచ్చినందున పురుషోత్తమరావుగలసి బయనముజేసెను. వారిద్దఱుఁ బట్టపరీక్షాసిద్ధులయిరి. జగన్నాథరావు బి.యే. రెండవతరగతిలోఁజేరెను. కేశవరాజు మఱియొకమిత్రునియొద్ద ఋణముచేసి బి.యల్ పరీక్షకుఁజదువనారంభించెను. ప్రాణమిత్రులైనవారిదఱిలో నొకరు రాజమహేంద్రవరమందునొకరుచెన్నపురమందు నుండవలసివచ్చుటచేఁ గేశవరాజుమనస్సు రాజమహేంద్రవరమునందును జగన్నాథరావుమనస్సు చెన్నపురమందునునుండెను అందుచేత వారువియోగమైనక్రొత్తలో సరిగాపుస్తకమువిప్పిచదువఁ

జాలకతిన్నగభోజనముసేయక దిగులుచెందినవారిచందముననేమియుఁ దోఁచక పిచ్చివాండ్రివలె సంచరించిరి. అధిక దుఃఖముల నైననుశమింపఁ జేయుటలో కాలమువంటిచుట్టమింకొకటిలేదు. కాలక్రమమున నవమిత్రసమాగమసందర్భమునవారిననోన్యవిరహదుఃఖముమఱచి యథాపూర్వముగనుండిరి. కానివారియనురాగమటుమీఁదనతురరూపముధరించెను. వారమునకు రెండుజాబులు జగన్నాథరావు కేశవరాజునకువ్రాయును కేశవరాజారెండుజాబులకు వెంటనె బ్రత్యుత్తరములు వ్రాయును. పురుషోత్తమరావుగూడ జెన్నపురమందు బి.యల్ తరగతిలో జేరిచదువుచుండెను. ఇట్లుపదిమాసములు గడచునప్పటికిజగన్నాథరావు బి.యే పరీక్షనిమిత్తము చెన్నపురముఁ జేర్చెను. వారివియోగదుఃఖముపశమించెను. పరీక్షయైనతరువాత ముప్వురునుస్వగ్రామములకుఁజనిరి. వేసవికాలపు సెలవులలో జగన్నాథరావుభీమడోలులో నుండఁగా రాజరత్నము పుట్టినయిల్లువిడిచి యత్తవారియింటనుండవలసిన కాలము ప్రాపించినదని శుభలేఖవచ్చెను. దీపమువలె కోడలువచ్చిగృహమలంకరించుననితలిదండ్రులెంతో సంతసించిరి. నవవధూసమాగమముబ్రతిక్షించుయువజనునిమనంబుననెన్నికోర్కెలుసముత్పన్నములగునొయన్నికోర్కెలతనిమనోలతయందుజిగురించెను. జ్యేష్టమాసమునఁబునస్సంధానము జేయింప వలయునని శంకరరాజుగారు ముహూర్తమునిమిత్తము వెదకెను. కానిరాజరత్నముయొక్కయు జగన్నాథరావుయొక్కయు జన్మనక్షత్రములుపరిశీలింపఁదారాబలచంద్రబలములుసరిపడలేదు. అందుచేత జ్యేష్టమాసమున జరుగవలసిన శుభకార్యమాగిపోయెను. జగన్నాథరావు పెనుగొండవెళ్ళి కేశవరాజుతో సెలవుదినములలోఁ గొంతకాలము హాయిగగడుపఁ దలంపుపుట్టెను. కానిభార్యరజస్వలయైన నక్షత్రముశాంతి గావలసినదగుటచేనతఁడచ్చటకుఁవెళ్ళుటకువీలుగాకపోయినది. రాజరత్నముయొక్క ప్రసన్నవదనసందర్శన

మును కేశవరాజుయొక్క సరససల్లాపసౌఖ్యమును లభింపమిజగన్నాథ రావు స్వగ్రామమునఁ దలిదండ్రులసన్నిధినున్నను జెఱసాలలోనున్న ట్లె శరీరవేదన లేకపోయినను మనోవేదన నొందుచుండెను.

తాను పెనుగొండవెళ్ళుటకు వీలులేకపోయినను కేశవరాజు భీమడోలురావచ్చును. గనుక నతనినొకసారిరమ్మనిజగన్నాథరావుజాబు వ్రాసెను. కాలువకట్టఁబడియున్నందున రహదారిపడవలరాకపోకలకు వీలులేమిఁ గేశవరాజు రాజాలనని జాబువ్రాసెను. నిడదవోలువఱకు బండిమీఁదవచ్చి యచ్చటరైలుబండినెక్కి రావచ్చునని జగన్నాథరావు మరలజాబువ్రాసెను. ఆజాబునకుత్తరముగా కాకినాడనుండి భయంకరమైనవృత్తాంతమొకటి జగన్నాథరావునకుఁదెలిసెను. పురుషోత్తమరావునకుమిక్కిలిజబ్బుగానున్నదని కాకినాడపురవాసుఁడయినయొక మిత్రుఁడు కేశవరాజునకొకజాబునుజగన్నాథ రావునకొకజాబును వ్రాసెను. పరమమిత్రుఁడయిన పురుషోత్తమరావు మిక్కిలిజబ్బుగానున్నాఁడని తెలియఁగానె యతనిజూచుటకుజగన్నాథరావు కాకినాడవెళ్ళఁదలఁచిపయనమయ్యెను. కానిపురుషోత్తమరావు మసూచికముచే పీడింపఁబడు చున్నందునను జగన్నాథరావు మసూచిక మెఱుఁగనికారణమునను శంకరరాజుకుమారునిపయనమాపెను. అధికరోగార్తుఁడైన యాప్తమిత్రుని గన్నులార నొకసారిచూడఁజాలనందుకు జగన్నాథరావు మిక్కిలివగచెను. అటువంటిమిత్రునకు జబ్బుగానున్నప్పుడు చూడకపోయిన నాజన్మమేలయని తండ్రితోనెన్నిసారులో వాదించెనుగాని లోకవృత్తమెఱిఁగినతండ్రి ముందట ననుభవసిద్ధము కానికుమారుని ప్రయత్నము సాగినదికాదు. పురుషోత్తమరావు వ్యాధిపీడితుఁ డగుచున్నాఁడనుజాబు చేరినతోడనే కేశవరాజు పెనుగొండనుండి రెండెడ్లబండిమీఁద బయలుదేఱి నిడదవోలుచేరియచ్చటరైలుబండియెక్కి భీమడోలునకుఁబోయి జగన్నాథరావుతుగలిసికొని మ

రల నతనికి కాకినాడ ప్రయాణోత్సాహము కలిగించెను. కాని యా యుత్సాహాంకురములను శంకరరాజు క్షణములోఁ ద్రుంచివైచెను. శంకరరాజుతోఁ జెప్పకుండ వారిద్దఱు రహస్యముగఁబోవుటకై ప్రయత్నములు చేయుచుండ నంతలో గంగవెఱ్ఱులెత్తి పురుషోత్తమరావు కాలధర్మము నొందె నని జాబు వచ్చెను. ఆపద్బాంధవుఁడై సుగుణవంతుఁడై ప్రాణసమానుఁడైన మిత్రుని గడసారి కన్నులారఁ జూచుటకైనను బ్రాప్తము లేకుండ దారుణమైనవ్యాధి సంభవించినదని వారిరువురు బాష్పాకులితనేత్రులయి వగచిరి. మిత్రవియోగ మతి దుస్తరముగదా!

పునహా పురుషోత్తమరావుయొక్క యకాలమరణము కేశవరాజునకు జగన్నాథరావునకు నెన్నో యాపదలు తెచ్చిపెట్టెను. పురుషోత్తమరావున కిద్దఱుకొడుకులుగలరు. అందుపెద్దవాని కైదవయేఁడు. చిన్నవానికి రెండవయేఁడు. కుమారులు యుక్తవయస్కులుగాకపోవుటచే నతనిభార్య తమ్ముఁడైన మధురమాధవరావు తోఁబుట్టువు యొక్కవ్యవహారముఁజూడఁ దఁచి ద్వాదశాహస్సులుగడిచినతరువాత నినుపపెట్టెఁ దెఱచి కాగితము లన్నియుఁజూచెను. అందులో రామలింగస్వామిగారు కేశవరాజును గలిసివ్రాసియిచ్చిననోటు జగన్నాథరావు వ్రాసియిచ్చిన హామీజాబుకనఁబడెను. ఈబదులుసంగతి పురుషోత్తమరావుయొక్క భార్యయైన సీతాబాయమ్మగాని యామె సోదరుఁడగు మాధవరావుగాని యెఱుఁగరు. ఆవ్యవహార మెఱుఁగకపోవుటయేగాదు. కేశవరాజునుగాని జగన్నాథరావునుగాని వారెఱుఁగరు. అంతియెగాదు. పురుషోత్తమరావునకు వానికిఁ గలదృఢమైత్రియు నెఱుఁగరు. ఆనోటులో సాక్షివ్రాలు చేసినవారినిఁ బిలిపించి బదులు పుచ్చుకొన్నవా రెవ్వరని మాధవరావడుగ వారు పురుషోత్తముని ప్రియమిత్రుఁడని చెప్పిరి. తమకు బొత్తిగా పరిచయము లేనిచోట

సొమ్ముంచఁగూడదని మాధవరావు సోదరితోఁజెప్పెను. "పాపము వారాయన కెంతో స్నేహితులు గాఁబోలు. మనము కొంతకాలమాగి చూడఁగూడదా" యని సీతాబాయమ్మ పలికెను, అనవుడు మాధవరావు కోపించి తోబుట్టువున కిట్లనియె. "అమ్మాయీ! ఆఁడవాండ్రికు వ్యవహారమునకుఁ జాలదూరము. వ్యవహారములో నీవడ్డు రావద్దు. అది నాకు వదలివేయవలసినదే. నామాటకు నీవెదురుచెప్పిన వ్యవహారము చెడును. ఎదురాడితివా నీకాగితములదరికి రాను. నీయిష్టమువచ్చినట్లు చేసికో, వారు మీ యాయనకు స్నేహితులై యుండవచ్చును. కాని వైఖరిఁజూడఁగా బదులుపుచ్చుకొన్నవారు సొమ్ము దీర్చుటకు సామర్థ్యములేనివారుగఁ గనఁబడుచున్నారు. అందుచేతనే హామీజాబు పుచ్చుకొనవలసివచ్చినది. అటువంటిచోట సొమ్ముంచఁగూడదు. వెంటనే వసూలుచేయవలెను. ఏమి నీయభిప్రాయము." అనుటయు నామె మాధవరావు కోపించివిడిచినపక్షమునఁ దనబిడ్డలవిద్యావిషయము గనుఁగొనువారు లేరనియుఁ దనవ్యవహారము జూచువారు లేరనియు భయపడి మనస్సులో నిష్టములేనిదయ్యు నతనిచేతల కియ్యకొనెను. మాధవరావు కాకినాడలో నొకన్యాయవాదికడకుఁబోయి రామలింగస్వామి కొకటియు జగన్నాథరావున కొకటియు రిజిష్టరుజాబులు వ్రాయించెను. ఆజాబుచేరిన వారముదినములలోగా మూలధనము వడ్డీతో నియ్యనిపక్షమున దావాచేయఁబడు నని యాజాబులోనున్నది. ఆజాబు చేరినతోడనే రామలింగస్వామి యధికమనోవ్యథ నొంది కేశవరాజునకుఁ జూపి కర్తవ్యమేమి యనియడిగెను. కేశవరాజునకుఁ గూడ నేమియుఁదోఁచలేదు. ఆదిన మంతయు వారు విషాదభరితమనస్కులై దీర్ఘాలోచనముఁజేయుచుండిరి. సాయంకాల మైనతరువాత తండ్రి కొడుకును బిలిచి యిట్లనియె. "ఇప్పు డేమిచేయుదము మనకున్నభూమి తెగనమ్మియిచ్చి ఋణముదీర్తుమన్న మనభూమి యైదా

రువందలరూపాయలకంటె నెక్కువవిలువచేయదు. అప్పు రమారమి రెండువేలున్నది. మీయమ్మకు నగలేమియులేవు. పిల్లయొంటిమీఁద నగలమ్మి ఋణముదీర్చెదమన్న శంకరరాజు మనల బ్రతుకనీయఁడు అతనిమాట యటుండఁగా బిడ్డకు ముద్దుముచ్చటలు తీరకుండ గర్భాదానమైనఁగాకుండ నగలుతీసికొని విక్రయించి వట్టిమంగళసూత్రముతో నత్తవారియింటికిఁ బంపుటకంటె దారుణకృత్యములేదు. ఆనగలు నాచేతులతో నేను ముట్టఁజాల. పురుషోత్తమరావుయొక్క బావమఱఁది వారముదినమునలో సొమ్మువసూలుకానియెడల మనమీఁద వ్యాజ్యమువైనకమానఁడు. తనహానియు లోకనిందయు నన్నట్లుమన కపకీర్తిష్టకలుగుటయుఁ గర్చులతోఁగలిసి సొమ్ము తడిసిమోపె డగుటయు సంభవించును. ఇంతకు నేను దురదృష్టవంతుఁడను. వీనియన్నిటికంటె మన జగన్నాథరావునకుఁ దండ్రివలన నెన్నిబాధలైనఁగలుగును. జామీనిచ్చినందు కతనికిఁగూడ రిజస్టరుజాబువెళ్ళకపోదు. ఇఁక జగన్నాథరావుపాట్లు చెప్పనలవికాదు. శంకరరాజు కాలరుద్రునివలె మండిపడును. అతఁడు కరోటకుఁడు. అతనికి సొమ్మే ప్రధానము. ఏమేమిఘాతలుసేయునో మనమూహింపఁజాలము. మనదినములుమంచివికావు. ఇందు కేమిచేయవలెనో యాలోచించి నీకు దోఁచిన యుపాయముఁజెప్పుము. జగన్నాథరావుదగ్గఱకు నీవువెళ్ళి మాటలాడుదువా?" అని పలుకఁ గేశవరాజు మెల్లఁగా నిట్లనియె. నే నేమిచెప్పఁగలను. ఎటు చేయుటకు నాబుద్ధికిఁదోఁచుటలేదు. ఈపాటికి జగన్నాథరావునకుఁగూడ రిజస్టరుజాబు వెళ్ళియేయుండును. భీమడోలులో జరుపవలసిన ముచ్చట లీపాటికి జరుగుచునే యుండును. కానున్నదికాకమానదు. కానీ చూతము. విచారించిన ఫలములేదు. దైవముమీఁద భారమువయిచి వచ్చినయిక్కట్లు మన మనుభవింపవలసినదె." అని కుమారుఁడు పలుకఁ దండ్రి సరే యని నాలుగయిదు మాసములలో

సొమ్ముపంపించెదమని మాధవరావుపేర జాబువ్రాయవలసినదని యత నితోఁ జెప్పెను. కేశవరాజు మరునాఁ డుదయమున జా బొకటివ్రాసెను.

మాధవరావు ప్లీడరుచే వ్రాయించిన రెండవరిజిస్టరుజాబు జగన్నాథరావున కందెను. అది చేరునప్పటికి శంకరరాజు గృహమందు లేడు. అందుచేత నప్పటికి జగన్నాథరావున కాపద వచ్చినది. అప్పుడు తప్పిననేమి. ఎప్పుడోయొకప్పుడాయాపద కొండవిఱిగి మీఁదఁబడినట్లుపడి త న్నణచివయుచునని. జగన్నాథరావు భయపడుచునేయుండెను. కాకినాడనుంచి రిజిస్టరుజాబువచ్చినదనియు దానికిగత్యంతరము పొడగట్టుటలేదనియుఁ గేశవరాజు జగన్నాథరావునకు జాబువ్రాసెను. తనకుఁగూడ నట్టిలేఖయొకటి వచ్చినదనియుఁ దనకేయుపాయముఁ దోఁచుటలేదనియు జగన్నాథరావు ప్రత్యుత్తరమువ్రాసి తాను పెనుగొండవచ్చుటకువీలులేదు. కావున కేశవరాజును భీమడోలొకసారిరమ్మనికోరెను. అంతటితో నూరకుండక యతఁడు సొ మ్మైదారుమాసములలోఁ బంపుదుము కావున వేగిరపడవలదని మాధవరావునకు జాబుఁగూడ వ్రాసెను. ఆజాబులు మాధవరావుయొక్క నిశ్చయ మెంతమాత్రమును గదపలేదు. మాధవరావునొద్దనుండి కేశవరాజునకుఁగాని జగన్నాథరావునకుఁగాని యుత్తరమేదియు రాలేదు. అందుచేత నొకవేళ మాధవరావు తమకుపకారము చేయఁదలఁచి తలపెట్టినకార్య ముపసంహరించెనేమోయని వారూహించిరి. అంతలో వేసవికాలపుసెలవు సమాప్తమయినందున జగన్నాథరావు కేశవరాజులు విద్యాభ్యాసము నిమిత్తము చెన్నపురము బోవలసివచ్చెను. కేశవరాజు పెనుగొండనుండి చెన్నపురప్రయాణముమీఁదనె బయలుదేఱి జగన్నాథరావును వెంటఁబెట్టుకొనిపోవుటకై భీమడోలులోబయనము నిలిపి రెండుదినము లాగెను. కాకినాడ వ్యవహారమునుగూర్చి

వారు మిక్కిలి రహస్యముగ నాలోచించిరి. ఇదమిద్ధమని వారికుపాయము పొడగట్టలేదు. కాని మీఁదట్టైవ మున్నాఁడని వారిరువురు బయలుదేఱి చెన్నపురమునకుఁ బోయిరి.

మాధవరావు తలఁచుకొన్నంతపని చేసెను. అసలుఫాయిదాలకుఁ గలపి యత్నించు రామలింగస్వామిని గేశవరాజును జగన్నాథరావును బ్రతివాదులుగఁజేర్చి వ్యాజ్యము వేయించెను. ప్రతివాది సమనులు పెనుగొండకు భీమడోలునకు వెళ్ళెను. రామలింగస్వామికుమారుని సమను తనసమను దానె పుచ్చుకొని తానేవిధమైనవాదముఁ జేయకుండుటకు నిశ్చయించుకొనెను. జగన్నాథరావుయొక్క సమను భీమడోలు వెళ్ళినప్పుడు శంకరరాజు గృహమందెయుండి యా సమను జూచుకొని ప్రళయకాలరుద్రుఁడువలె మండిపడి సమను తెచ్చిన బంఱ్ఱాతును దిట్టి ప్లీడరునకొక కొన్నివందలతిట్లు బహుమానముచేసి రామలింగస్వామిని గేశవరాజును వారిపితామహప్రపితామహులను వారివంశమును బంధుగణమును నోటికివచ్చినట్లెల్ల దూషించి యదియేమి టనియడిగినందుకు భార్యనుకూడ నానావిధదుర్భాషలాడి నిప్పులుత్రొక్కినకోఁతివలె చిందులుత్రొక్కి కేకలువైవఁజొచ్చెను. ఏదోయాపద వచ్చిన దనుకొని చుట్టుప్రక్కలవాండ్రువారింటికివచ్చిరి. బంఱ్ఱాతు సమనుపుచ్చుకొనువారు లేకపోవుటచే నింటిగోడకుఁ గట్టుటకుఁ బ్రయత్నించెను. కాని యతనిప్రయత్నము సాగలేదు. శంకరరాజు సమనుచించి ముక్కలుచేసి యాముక్కలు బంఱ్ఱాతుమొగమునఁ గొట్టెను. బంఱ్ఱాతు మేదకుఁ డగుటచే నాదూషణాస్త్రములకుఁ బ్రతియస్త్రములు ప్రయోగింపలేక పాఱిపోయెను. ఏమి టనియడిగినందుకు నడుమ నిరుగుపొరుగువారికిఁగూడ కొన్నిదగిలినవి. అతని యవ్యక్తప్రలాపములలోఁగూడఁ గొన్నిఁటినిందుదహరించుట సముచితము. అత డిరుగుపొరుగువారితో నిట్లనియె. "మీసహవాసములు

చేసి మావాఁడు చెడిపోయినాఁడు. కాకినాడలో నెవరిదగ్గఱనో యప్పులుచేసినాఁడఁట? మామగారు బావమఱఁదిగలిసి యిచ్చకాలుమచ్చకాలు చెప్పి కుఱ్ఱవెధవను జేసి మావానిచేత నప్పులుచేయించినారు. నాకొంపలుగోడలు భూములుబుట్రిలు దెగనమ్ముకొని యీయూరునుండి లేచిపోవలసినకాలము వచ్చినది. మావాఁడు వట్టిజులాయిముండకొడుకై పోయినాఁడు. వియ్యాలవారు మాకు నోటికి నీళ్ళులేకుండఁజేసి చిప్పలు కఱ్ఱలు చేతికిచ్చినారు. వీళ్ళసంబంధము మండిపోను. నిక్షేపమువంటి సంబంధము లెన్నోవచ్చియుండ మా మాయచచ్చినవాఁడి మూలమునఁ బూటకుటికానలేని దరిద్రగొట్టుసంబంధముఁజేసికొన్నాను. వీళ్ళసంబంధము కాలిపోను. పిల్లయందముగా నున్నదట. దాని యందము కొరుక్కుతినఁదలఁచినాఁడుకాఁబోలు. బోగముతొత్తుకొడుకై మావాఁ డందాలుచందాలువెదకి చివరకు నాకొంపదీసినాఁడు. ఇప్పుడు రెండువేలరూపాయ లెక్కడనుండి తెచ్చి యీయను. కర్చులిక నాలుగువందలగును! ఇటువంటికొడుకులు పుట్టుటకంటె సంతానము లేకపోవుట మంచిది. అత్తవారిలోఁదూఱి యాస్తిపాడుచేసిన పనికిమాలిన వెధవ. పీనుఁగులు మోయుటకైనఁ బనికిరాఁడు. వీనిచదువు చట్టుబండలుగాను. బి. యే ప్యాసయినాఁడట, వీని బియ్యేమీఁదవీనిమీఁద నిప్పులుపొయ్య. ఇప్పుడు మావెధవ కండ్లబడినయెడల తునకావకాయలాగున ముక్కముక్కలుగ నఱికివైవనా? గరిటెకాల్చి యిటువంటిపని యెప్పుడుఁజేయవుకదాయని రెండుచేతులమీఁద వాతలుపెట్టనా? వీసెడు మిరపకాయలు తెచ్చి వెధవకు ముంతపొగబెట్టనా? ఈసారి చెన్నపట్టణమునుండి యింటికిరాడా, గుమ్మములోనికిరాగానే కాలు విరగఁగొట్టెదను. కుంటిపీనుఁగై యిల్లుకదలలేక చావడిలోనే కుక్కకావలి కూర్చుండవచ్చును. ఈలాటివెధవ చదివి యుద్యోగముచేయునా? ఈవెధవకు దమ్మిడి పంపను. చెన్నపట్టణముపీఁధు

లలో ముప్పెత్తుకొనిపోనీ. ముష్టివెధవలపిల్లను చేసుకొన్నతరువాత ముష్టివెధవగాక భాగ్యపువెధవ కాఁగలఁడా!"

అని చిత్రవిచిత్రముగ వన్నెచిన్నెలుపెట్టి తిట్టితిట్టి మూఁడు జాములయినతరువాత భోజనమునకువెళ్ళి తిన్నఁగా నన్నముఁదినక యావృత్తాంతము సవిస్తరముగఁ దెలిసికొనదలఁచి యారాత్రిబయలు దేరి కాకినాడ వెళ్ళెను. వెళ్ళి మాధవరావుతోఁ గలిసి మాటాడఁగా రామలింగస్వామియుఁ గుమారుఁడును గలిసి తనబావయైనపురుషోత్తమరావుకొడ్డఁ గూఁతురు వివాహము నిమిత్తము బయలుపుచ్చుకొని నోటువ్రాసి యిచ్చుటయు జగన్నాథరావు హామీజాబువ్రాసియిచ్చుటయు నతఁడు మృతినొందుటయు సొమ్ము మిక్కిలియవసర మగుటచే మొదట రిజస్టరీజాబువ్రాయుటయు నవ్వల వ్యాజ్యము వేయుటయు లోనుగాఁగలవృత్తాంతమంతయు నతనికి దెలిసెను. అదివినినప్పుడు శంకరరాజు చేష్ట లేమని చెప్పను. గుండెబాదుకొనెను. నెత్తి మొత్తుకొనెను. నోటిమీఁద లబలబ కొట్టుకొనెను. గంతులువైచెను. పండ్లుకొఱికెను. పేళ్లుజప్తికివచ్చినవారి నందఱఁ దిట్టెను. తన్ను దిట్టుకొనినయెను. పిమ్మట గాకినాడ విడిచి మరునాఁడురాత్రి భీమడోలువచ్చి యారాత్రి తనకు భార్యకు నిరుగుపొరుగువారికి నిద్ర లేకుండునట్లుతొమ్మిదవయష్టము పారాయణఁ జేసెను. వావిడిచి యేడ్చుటచేత దుఃఖముపశమించును. కసిదీరఁ దిట్టుటచే నొకకొంతకోపము తగ్గెను. ఆరాత్రికురిపించిన దూషణవర్షముతోఁ గోపాగ్నికొంతచల్లారుటయు శంకరరాజు దేఱినచిత్తముతో నటమీఁది వృత్తాంతము వితర్కింపఁజొచ్చెను. వ్యాజ్యములోఁ దనకొడుకుచేత నేదేనియొక స్టేటుమెంటుదాఖలు చేయించవలె ననినిశ్చయించెను. అది దాఖలుచేయుట కొకవారము మాత్రమే వ్యవధియుండెను. అందుచేత నతఁడు చెన్నపురమువెళ్ళి కొడుకు నొడంబఱచి రావలయునని నాఁటిరాత్రి పయనమై రైలుబం

డియెక్కెను. మరునాఁ డుదయమున నతఁడుచెన్నపురిఁజేరెను. ఆపూట నొక పూటకూళ్లయింట భోజనముచేసి మధ్యాహ్న మెల్ల దిరిగి కుమారుని సాయంకాలము గలిసికొనెను. తండ్రిని జూడఁగానెజగన్నాథరావునకు ముందుగ శరీరము వణకెను. నడచుటకుఁ గాళ్ళుముందుకుసాగవయ్యెను. కేశవరాజు సముద్రపుటొడ్డునకు షికారు వెళ్ళినందున జగన్నాథరావొక్కఁడె గదిలోఁ గూర్చుండెను. తండ్రినిజూచి జగన్నాథరావు మెల్లగా "బాబయ్యా! నీవెందుకువచ్చినావు. అందఱు నెమ్మదిగానున్నారా" యనియడిగెను. "సుపుత్రుఁడవు ప్రయోజకుఁడవు పుట్టినావుగనుక నిన్నుఁజూచుటకైవచ్చితి" ననియంతతో నిలువకయిట్లనియె "నీవునీయత్తవారితోఁగలిసి ఋణములపాలైనసంగతివినిలబ్బునసంతోషించుచున్నాను. నాతరములోనె మనమన్ననస్త్రములు లేకుండపోవలసినయోగముపట్టినది. అత్తవారిలో దూఱినీవింతపనిఁజేయుదువని నేనెప్పుడనుకొనలేదు. ఆపురుషోత్తమరావుభార్యవ్యాజ్యముదాఖలుచేసినది. ఎందుకు తెచ్చినావో నిజముచెప్పు. చెప్పినపక్షమునదానికిఁగావలసినప్రతిక్రియఁజేసికొనవచ్చును." అనవుడుజగన్నాథరావుతలవంచుకొనియిట్లుచెప్పెను. "నిజమే చెప్పుచున్నాను. రామలింగస్వామిగారిపిల్లను జేసికొనవలయుననినాకు గట్టిసంకల్పముగలిగినది. కన్యయేప్రధానమునాకు. కట్నమేప్రధానమునీకు. నీవుకోరినకట్నమువారీయఁజాలరైరి. అందుచేత వారికిసొమ్ము బదులిప్పించితిని. ఆపిల్లను వదలఁజాలకనేనే సొమ్మెక్కడనైనబదులు తెచ్చి మరలవారికి బదులీయవలెననిమొదట సంకల్పించితిని. అందుకురామలింగస్వామిగారుసమ్మతింపలేదు. ఋణప్రదాత నాపూచీమీఁదఁగానివారికి ఋణమిచ్చుటకిష్టపడనందున నేనుహామీజాబువ్రాసియిచ్చితిని. మాదురదృష్టముచేత మాస్నేహితుఁడైనపురుషోత్తమరావు చనిపోయినాఁడు. అతని భార్య మమ్మెఱుఁగదు కాఁబట్టి తమ్మునిచేత వ్యాజ్యము వేయించినదిగాఁబోలు. భాగ్యవంతు

లుకాకపోయినను రామలింగస్వామిగారు పెద్దమనుష్యులు, మాట దప్పనివారు. పరువునిమిత్తము ప్రాకులాడువారు. కేశవరాజుచేతికందిన తరువాతదమ్మిడీ గవ్వలు బాకీలేకుండరామలింగస్వామిగారి ఋణము దీర్చివైవఁగలరు. కాఁబట్టి నీవుతొందరపడకకొంచెము శాంతమువహించియుండుము." అనికొడుకుపలుక శంకరరాజుశాంతమువిడిచి కోపోద్దీపితుఁడయి "నేను శాంతమువహించవలెనా? నే నేమితొందరపడినాను. వ్యాజ్యముదాఖలయినతరువాత డిక్రీకాకపోదు. అయినతరువాత మనదగ్గఱ సొమ్మువసూలుచేయకపోరు. రామలింగస్వామియేమియివ్వగలడు. అతనియింటిమీద తట్టెడు పెంకులైనలేవు. పెద్దమనుష్యుఁడాయతఁడు. తాటిచెట్టంతపొడుగున్నాఁడు. గనుక పెద్దమనుష్యుఁడే. పరువునిమిత్తము ప్రాకులాడునా? పరువేమిటోతండ్రినాడుకాని తాతనాడుకాని వాడెఱుఁగునా? పరువుకోసము దేవులాడువారిటువంటిపనులు చేయఁగలరా? పదియేనువందలరూపాయలు నీచేతదెప్పించిపుచ్చుకొనిపిల్లనమ్ముకొన్నాఁచు. నియోగపుజాతిలోఁ బుట్టినవాడెంతనీచుఁడైనప్పటికి నింతపాడుపనిఁ జేయునా? ఆశపాతకులైన వైదికులు చేయునట్టిపని వీఁడుచేసినాఁడు. వీఁడుపరువుకోసము ప్రాకులాడేవాఁడా? మామగారంటేయెంతప్రేమ పుట్టినదిరానాయనా! ఇంతకునీప్రారబ్ధము. ఎంతోపరువుగలనియోగులు రెండేసివేలరూపాయలకట్నములిచ్చి తమపిల్లలనిచ్చెదమనియెంతో బ్రతిమాలినప్పటికి వారిమాటలువినక, నామాటలువినక యెక్కడోపూటకూళ్ళ ముండకొడుకుసంబంధము పదియేనువందలిచ్చి చేసికొన్నావు. ఇంతకు బాకీతీర్మానముమాటయేలాగు? ఈవ్యాజ్యములోనీవేమి చేయఁదలంచుకొన్నావు? వారుడిక్రీ మనమీఁద నమలుజరుపుదురు; కాని నీమామగారిమీఁద జరుపరు. నీయిల్లువాకి లమ్ముకొని తీర్చెదవో నీమామగారిచేత నిప్పించెదవో చెప్పు."

ఆపలుకులువిని తనతండ్రి మామగారినిదూషించినందుకు మన

స్సునందు మిక్కిలి కటకటంబడియు నోరెత్తుటకువీలులేమి వారిపక్ష మొకమాటయైనను బలుకఁజాలక తండ్రియడిగినప్రశ్న "కీవిషయము లో నేనుచెప్పవలసిన దేమున్న ది.నీయిష్ట మేలాగోనాలాగునఁ జేయవచ్చు' ననియుత్తరముచెప్పెను. "సరేనాయిష్టప్రకారముచేయవచ్చునన్నావు కనుక చెప్పుచున్నాను. విను"మని శంకరరా జీక్రిందివిధమునఁబలికెను "ఈవ్యాజ్యములో నీవు స్టేటుమెంటుదాఖలుచేయవలెను. ఈనోటుప్రతిఫలమునాకెంతమాత్రము ముట్టలేదు గనుక నన్నుప్రతివాదిగఁజేర్చఁ గూడదనియు నామీఁదడిక్రి యియ్యఁగూడఁదనియు నేను మైనరునని యునామామగారు నామనసువిరిచి లేనిపోనిమాటలుచెప్పి యక్రిమముగ నాచేతహామీకాగితము వ్రాయించినాఁడనియు నీవు స్టేటుమెంటు లోవ్రాయించవలెను. నీవిష్టపడితే యిక్కడనే యేచిన్నప్లీడరుచేతనో వ్రాయించిపట్టుకొనిపోయి కాకినాడలో దాఖలుచేయించెదను. ఏమిటి నీయభిప్రాయము. ఆస్తిమాస్తియమ్ముకొని మామగారినిబెట్టుకొనికు లుకఁదలఁచుకొన్నావా? లేక విడీతనుబడి నీదారినీవు త్రొక్కఁదలఁచు కొన్నావా? అప్పులవాండ్రు మనభూములమ్ముకొని పోయినతరువాత మామగారుబావమరదిమనమొగముఁజూడరు.ఏమిటినీయభిప్రాయము ఏదో తేల్చిచెప్పు, రేపుబండిమీఁద నేనువెళ్ళవఁయును."

ఏదోప్రత్యుత్తరముతండ్రికి చెప్పవలసినయవసరమువచ్చినందు నసందిగ్ధములేక స్పష్టముగాఁజెప్పఁదలఁచి జగన్నాథరావు వంచినతల యెత్తకయె మృదువుగ స్పష్టముగనిట్లుచెప్పెను. "నేను మైనరునుకాను పూర్ణజ్ఞానముతో బుద్ధిపూర్వకముగాహామీజాబువ్రాసియిచ్చితిని. ఒకవేళవాదించినను నదిచెల్లదు. కాలేజీలోనావయస్సువ్రాసియుండును. అది వారుసాక్ష్యముగాఁ గోరినపక్షమున మనవాదమువ్యర్థమగును. కాఁబట్టియావిధముగనేను వాదముచేయను. రామలింగస్వామిగారునాకి చ్చకాలుమచ్చకాలుచెప్పి భ్రమపెట్టి మాయోపాయముచేతవ్రాయిం

చలేదు. అట్లంటినా పాపమువచ్చును. కాఁబట్టి యావిధముగ నేను వాదింపను. ప్రతిఫలము నాకుముట్టలేదన్నమాట నిజమే. కాని ముట్ట లేదన్నమాట యెఱిఁగియుండియు వారివలనసొమ్ము రానప్పుడునేనిచ్చు టకొప్పుకొన్నాను. ఒప్పుకొన్నతరువాత లేదనుటకు నాకునాలుక రాదు ఇదియె నానిశ్చయము. నేను స్టేటుమెంటుదాఖలుచేయఁదలచుకొన లేదు." అనుటయు శంకరరాజు పండ్లుపటపటకొరికి "ఛీ!దుర్మార్గుఁడా ఆస్తిధ్వంసముఁజేయుటకై పుట్టినావు. నీకునునాకు నింతె.తండ్రిచచ్చి పోయినాఁడని నీవనుకో. కొడుకు చచ్చిపోయినాఁడనుకొనియొకయేడు పేడ్చియూరకుందును. ఇంక నీవు భీమడోలు రావద్దు. చదువుకో మా నుకోగంగలో దిగు. నాజోలి నీకులేదు. నీజోలి నాకులే"దని చివాలున లేచి వీథిలోనికిఁబోయెను.జగన్నాథరావు తాను బ్రతిమాలిననువినఁడ ని తండ్రివెంట వెళ్ళలేదు. శంకరరాజు పూటకూళ్ళయింటభోజనము చేసి యెక్కడనో పండుకొని మరునాఁడు పగలుసయితము కొడుకుదగ్గ ఱకురాక యిందందు తిరిగి సాయంకాలము బండియెక్కి వెళ్ళెను. జగ న్నాథరావు తండ్రివెడలిపోయినతరువాత గదిలోదీపమైనవెలిగించకుం డమడతమంచముమీఁదఁ బండుకొని విచారాక్రాంతమనస్కుండయి యుండెను.అప్పుడు కేశవరాజువచ్చి "యేమోయిదీపము వెలిగించలేదు? పండుకొన్నావేమి? జబ్బుగానున్నదా?" యని యడిగెను. అనవుడుజగ న్నాథరావు సన్నని యెలుగుతో "జబ్బుగాలేదు. మాబాబయ్యవచ్చి నాఁడు. నానాదుర్భాషలాడినాఁడు మాధవరావుసన్నుగూడకలిపి వ్యా జ్యము వేసినాఁడట. జరిగినగొడవ యావత్తు చెప్పనేల!నాచదువునిమిత్త ముచిల్లివ్వయైనఁబంపనన్నాఁడుతనకునాకునేటితో సరియన్నాఁడు.దా నివిషయమై యాలోచించుచుఁ బండుకొన్నాను. కోపముచేత నాదగ్గఱ బసకూడచేయనని వెళ్ళిపోయినాఁ"డని బదులుచెప్పెను ఆపలుకులు కేశవ రాజు నిలువంబడివిని క్షణముసేపు మారుమాటాడక నిట్టూర్పువిడిచి

యెట్టకేలకిట్లనియె. "అనుకొన్నంతపని జరిగినది. పురుషోత్తమరావె ప్పుడు పోయినాఁడోయప్పుడే మనకాపద సిద్ధమయినది. మాధవరావున కు మనతో మొగమాట మేమున్నది. ఆఁడుదగుటచే సీతాబాయమ్మ యెవరేమన్ననట్లుచేయును. మాబాబయ్య మితిలేనికోపము గలిగియుం డెను. మాబాబయ్య యీదెబ్బతో బెంగపెట్టుకొని మంచమెక్కును. సొమ్మునీచేత తెప్పించి పుచ్చుకొనుటచేత మాకప్రతిష్టకూడసంభవిం చుననిభయపడుచున్నాను. ఏదియెట్లు కాఁదలఁచియున్నదోయట్లుకాక మానదు. కార్యగతిమనస్వాధీనములోనుండఁదలఁచుకొన్నపక్షమునను నపురుషోత్తమరావుబ్రతికియుండును. మనముచిక్కులుపడవలసినకాల ముసంభవించినది. విచారించినఁ గార్యములేదు. లేలెమ్ము. ధైర్యము తెచ్చుకో. మనముచదువుకొన్న యింగ్లీషుగ్రంథములలోనుమనపురా ణాదులలోను న్యాయమార్గప్రవర్తకులకెన్నోకష్టములుసంభవించినట్లు చదివియున్నాము ధైర్యమే తెప్పగాఁజేసికొనిమనమట్టియేళ్ళీఁదవలెను. అయినను మీతండ్రి కోపావేశముచేత నట్లనియుండును. కానినిన్ను వి డిచిపెట్టఁడు ఏకపుత్రవిషయముకదా."

అనుటయు జగన్నాథరావు "కేశవరాజూ! మాతండ్రిస్వభావము నీవెఱుఁగవు. పంతమువచ్చినదంటేమాతండ్రిశరీరమెఱుఁగడు. ముందు వెనుకలుచూడఁడు. అవుగాముల నాలోచింపఁడు. కొందఱికోపము తా టాకుమంటవలె మిక్కిలిమండియారిపోవును. మాబాబయ్యది దీర్ఘక్రో ధము పాముపగ, తల్లిలేదు. తండ్రిలేదు. నేలబెట్టి రాచివైవగలఁడు. నీవుచెప్పినట్లువిచారించినఁ గార్యములేదు. ధైర్యమేయూతకట్ట మనకు. సరే దీపమువెలిగించు" మనిచెప్పిలేచెను. అనంతరమిద్దరుగలిసికొంత సేపీవిషయమై ప్రసంగించి తరువాత పూటకూళ్ళయింటికివెళ్ళి భోజన ము జేసి మరలవచ్చి యారాత్రి పుస్తకములుముట్టుకొనకయీమాటలె ప్రొద్దుపోవువఱకుజెప్పుకొనుచుఁ గ్రిమక్రిమముగఁగన్నులుమూసికొని

పండుకొనిరి. జగన్నాథరావు తదేకధ్యానముతోనుండి నిద్రిపోవుటచే "బాబయ్యా నేనబద్ధమాడను. నీయిష్టమువచ్చినట్లు చేసికోయని పలవరించెను. ఋణబాధపడలేక తండ్రి దేశాంతరము వెళ్ళినట్లు కేశవరాజు కలగని భయపడి మేల్కని యది స్వప్నమేకదాయని ధైర్యముదెచ్చికొనెను.

కాకినాడకోర్టులో వ్యాజ్యము విచారణకువచ్చెను. ప్రతివాదులలో నెవ్వరు రాకపోవుటచేతను స్టేటుమెంటైన దాఖలుచేయకపోవుటచేతను వ్యాజ్యపు మొత్తమునకు డిక్రియయ్యెను. మాధవరావుభీమడోలు వారిని పెనుగొండవారిని గొందఱినికలిసికొని శంకరరాజుయొక్కయు రామలింగస్వామియొక్కయుస్థితిగతులు తెలిసికొనిజగన్నాథరావువలననె మొత్తమంతయు వసూలుచేయుట క్షేమమని శంకరరాజుగారిభూములు గృహము వేలము వేయించుట కుత్తరువుదెచ్చెను. అప్పుడు శంకరరాజు బ్రహ్మాండము పగులునట్లఱచి కోర్టుపంపినయమీనానుకొట్టఁబోయి తల గోడకుకొట్టుకొని కర్చులతోగూడ రమారమి రెండువేల రెండువందలరూపాయిలు నెత్తురుబొట్లు పోసినట్లు పోసెను. ఆసమయమున నతనినోటను, వెడలినతిట్లలెక్క చిత్రిగుప్తుఁడుకాని మరియొకఁడు వ్రాయలేఁడు. ఆతనిమనస్సు కోపాగ్నిచే భగ్గుభగ్గున మండుచుండెను రూపాయలమూటలచేతనది చల్లారవలెనుకానిమాటలచేతనదిచల్లార దనిభార్యమొదలగువారాయన నుపశమింపఁజేయుటకుఁ బ్రయత్నముచేయలేదు. కోప మగ్నివంటిదని పెద్దలుచెప్పుమాట యబద్ధముకాదు. అలుక మునుముందు నిప్పువలె భగ్గునమండి యందుపాటుననున్నవస్తువులపైఁబడి కొంతనాశనము జేయును. ప్రథమతీవ్రత్వమడగినవెనుకనది నిగురుగప్పిననిప్పువలె బయటికి కనఁబడక మానసాంతర్గతమై తన్ను స్పృశియించినవారినిమాత్రమే గాల్చును. కొందఱియందది క్రమక్రమముగ నగ్నివలెచల్లారి నిరపాయముగనుండును. కొందఱి మనస్సుల

యందది రావణాసురునికాష్టమువలెయూరకనిరంతరముష్ణమైయుండు ను. శంకరరాజుకోపాగ్ని మొదట మంటలుమండి క్రమక్రమముగ నంతర్గతమై ప్రజ్వరిల్లుచుండెను. ఆక్రోధాగ్నియొక్కమూఁడుజ్వాలలు వలె నతనిమనంబున మూఁడుకోరికలు జనించెను. కుమారు నెట్టెల్లొంగదీసికొనుట మొదటికోరిక. పోయినధనము మరలసంపాదించుట రెండవకోరిక. వియ్యాలవారికేదైనగొప్పపరాభవము జేయుటమూడవ కోరిక. ఈషణత్రయమువలె భీషణమై యాయభీష్టత్రయము శంకర రాజుమనంబును మిక్కిలిబాధచేయఁజొచ్చెను. ఈమనోరథముల నన్వే షించుకొనుటకై యతఁడెన్నో యుపాయముల నన్వేషింపఁదొడఁగెను. ఉపాయములకొఱకుగాని మఱి వేనికొఱకుగాని వెదకువారికవిదొరకక పోవు. "లంఘనం పరమౌషధం" అనుమాటశంకరరాజు మొదటనుండి యెఱుఁగును. లంఘనము శరీరరోగముల కేగాక పెంకెతనము మొదలగు మనోరోగములకుఁగూడ మందె. మంచిపని జేయునని యతఁడనుకొని కుమారునిమీఁద నాయౌషధముఁ బ్రయోగింపఁదలఁచెను సుఖముగా దిని తిరిగి చెన్నపట్నములోఁ జదువుకొనుచున్న కుమారునకు లంఘ నముఁగట్టుట యెట్టిదనిచదువరులకుసందియములుగలుగవచ్చును. పాఠ శాలలోనీయవలసినజీతముపంపకపోవుటపూటకూళ్ళకీయవలసినసొమ్ము పంపకపోవుట మొదలగుపనులె లంఘనములుకట్టుటయని యతనియభి ప్రాయము. ఆలంఘనములతో బెంకెతనపురోగము చప్పగాఁ గుదురు నని యతనినమ్మకము. ఆనమ్మకచేనతఁడు జగన్నాధరావునకు బడిజీత మంపుటమానెను. పూటకూళ్ళయింటికర్చు పంపుటమానెను. జాబు వ్రాయుటమానెను. జబాబువ్రాయుటమానెను. జగన్నాధరావుమును ముందు మిత్రులయొద్ద గొంతసొమ్ము చేబదులుచేసెను. సొమ్మిచ్చిన వారు మరల నడుగకమానరుగదా. పూటకూళ్ళవాళ్ళు పూటపూట సొమ్మునకై తొందరచేయసాగిరి. అదిగోనని యిదిగోనని రేపని యె

ల్లుండని చంటిబిడ్డలనుమఱపించినట్లుమఱపించిజరుపుటచేవారు నమ్మిక గోల్పోయి తూలుమాటల నాడఁజొచ్చిరి. అభిమానధనుఁడైనజగన్నాథరావామాటలు సహింపఁజాలక చేతనున్న బంగారుమురుగులువెండి గొలుసుతోనున్న జేబుగడియారముమిక్రయించియమ్మకమువలనవచ్చిన ననూటయిరువదిరూపాయలు బదులుతీర్చెను. మరల రెండుమాసము లుపూటకూళ్ళయింట భోజనముచేయుటకువీలుగలిగెను. రెండుమాసములైనతరువాతమాత్రముతనకుసొమ్మెక్కడనుండివచ్చునను నాలోచనములేక నాఁటికొకదైవములేడా యనుధైర్యముమీఁద నతఁడుసాహసించి పనిజేసెను. మూఁడవమాసము ప్రవేసించినతోడనేపూటకూళ్ళవాఁడు మరల నిలవదీసియడిగి వారిమీఁదబెట్టి వీరిమీఁదబెట్టి దెప్పిసామెతలుదెచ్చి సూటిపోటుమాటలని మనస్సు నొవ్వజేసియెట్టకేలకు నాయింటికి భోజనమునకు రావలదని చెప్పెను. ఆమాటపడినసాయంకాలమునజగన్నాథరావు పూటకూళ్ళయింటికివెళ్ళక కొట్టునకుఁబోక యేమియుఁ దోఁచక యిందందుఁ దిరుగుచుండెను. కేశవరాజు వానిజాడ తెలియకభోజనమునకువెళ్ళినప్పుడుమాజగన్నాథమేడియనివానినడిగెను. పూటకూళ్లయింటి యజమానుఁడైన జంబునాథయ్యరు "మీవాడుదుడ్డుయిచ్చేదిలేదు. సాపడేదాన్కిముందువస్తుడు. అప్పావాడురంబదొంగ. అట్టాంటివాండ్లకు నేనుపెట్టెటివాఁడుకాఁడు. నిండామంచిమనిసికే నేనుపెట్టెవాఁడు. సొమ్ము తెచ్చి వాఅయ్యాని తోసివిడిచానప్పా" యని బదులుచెప్పెను. ఆమాటలు కేశవరాజుమనస్సున ముండ్లువలె నాటెను. మిత్రుఁడేమయ్యెనో యని యతఁడుతొట్రుపడి సరిగానన్నముదినక తనకొట్టునకుఁబోయి చూచి యచ్చటనతనింగానక దుఃఖము చెందిన హృదయముతో సముద్రపుటొడ్డునకరిగివెదకెను. కానియతఁడెందును గనఁబడలేదు. కేశవరాజు పిచ్చివానివలె సముద్రపుటొడ్డుననుండి యింటికి నింటినుండి సముద్రపుటొడ్డునకు విసుగులేక యెన్నో

పారులు తిరిగెను. పార్థసారథిస్వామికోవెలకుఁ బోయిచూచెను. రైలు స్టేషనులో వెదకెను. పీపిల్సుపార్కను జనులయారామమున నన్వేషించెను కాని యెందునుగనఁబడలేదు. కేశవరాజుమనస్సు పరిపరివిధములఁ బోయెను "పిక్కలుపడలేక దేశాంతరమరిగి యుండునా? ఆత్మహత్య జేసికొని యుండునా" యని యతఁడు వితర్కించెను. వివేకియగుటచేనటి హీనకృత్యము చేయఁడని తనవాదముతానే పూర్వపక్షముజేసికొని యేమోయేవేళకేబుద్ధి పుట్టునోయని మరల సందిగ్ధమనస్కుఁడై తిరుగుటచేతను నిద్రలేకపోవుటచేతను గలిగినబడలికవలనఁ దనగదికిఁబోయి పరుపునకుఁ జేరబడికూర్చుండిగాఢవిషాదమగ్నమనస్కుఁడై కన్నీరువిడచెను. అట్టియవస్థలో నతనికించుక నిద్రపట్టెను ఆకోడికునుకులోనె జగన్నాథరావుశవము సముద్రములో మరునాఁడుదయమునఁ దేలినట్లు కలవచ్చెను. కలలోనతఁడు వెక్కి వెక్కి యేడ్చెను. అంతలోనతనికిమెలకువవచ్చెను. తెల్లవారుజామునఁ గన్నకల నిజమగునని పెద్దలుచెప్పఁగా నతఁడు పలుమాఱు వినియుండుటచేఁ దనమిత్రుఁడాత్మహత్య జేసికొని యుండునని యతఁడునిశ్చయించుకొని తనచెల్లెలియవస్థం దలఁచుకొని పురపురఁబొక్కెను. అప్పుడు తెల్లవారుచుండెను. కన్నీరుదుడుచుకొని కేశవరాజు వీధివైపు చూచుచుండెను. అప్పుడిద్దఱుయువజనులు కేశవరాజుగదివంకవచ్చుచుండిరి అందొకఁడు గూడకట్టు కొనియెను రెండవవాఁడు తెనుఁగువారివేషముదాల్చెను ఆ తెనుఁగువానిఁ జూడగానె కేశవరాజు తెల్లబోయి "అయ్యో! జగన్నాథరావు నీవు బ్రతికియుంటివా? నీనిమిత్తమునేను తెల్లవార్లు పట్టణమంతయుఁదిరిగితి" నని కౌఁగిలించుకొనియెను. రెండవయతఁడు తెలుఁగుసరిగరానివాఁడగుటచే నింగ్లీషుతో నీకింతకళవళమేలయని యడిగెను. అప్పుడు జగన్నాథరావింగ్లీషుతో నేనుకనఁబడకపోవుటచే నేమైతినోయని యతఁడుకళవళపడియుండునని కేశవరాజునకిట్లనియె "నిన్నమధ్యాహ్నము పూటకూళ్ళ

వాఁడు నన్నవమానపఱచుటచేఖేదపడియేమియుందోఁచకవీధులవెంటఁ దిరుగనారంభించితిని. అప్పుడు మనసంజుండయ్యరు నాకగపడి తనగది లోనికిఁ దీసికొనిపోయెను. రాత్రి నేనమ్మాయమ్మ పూటకూళ్ళయింట భోజనముచేసితిని. ఆమెమన తెనుఁగుది. అక్కడికూరలు పచ్చళ్లుమన కనుకూలముగనుండినవి మనమక్కడ ప్రవేశించిన బాగుండునేమో యని తోఁచెడిని రాత్రి సంజుండయ్యరుకొట్టులోనె పండుకొని నీవు నానిమిత్తముమెదకికొనుచుందువని తెల్లవారకమునుపువచ్చితిని. పాప మునీవు రాత్రియంతయు బెంగపెట్టుకొని నిద్రలేకయుంటివికాఁబోలు చెప్పకుండఁబోవుట నాదేపొరపాటు" అని పలుకుచుండఁగనెసంజుండ య్యరింగ్లీషుతో "మిత్రుఁడా నాకుదయముననె పనియున్నది పోయివ చ్చెద"నని యిరువురను వీడ్కొనిపోయెను అనంతరముజగన్నాధరావు కేశవరాజులు కాల్యకృత్యములుదీర్చికొనిచెన్నపురివెళ్లినతరువాతనైన క్రొత్తయలవాటుచొప్పున గిన్నెడు కాఫీత్రాగిదొప్పెడుపమాతినిమరల గదిలోనికిఁ బోయికూరుచుండిరి. అప్పుడు కేశవరాజు జగన్నాధరావున కిట్లనియె. "ఏమోయిపూటకూళ్ళవాఁడేమోయన్నాడనిఁవిచారగ్రస్థుఁ డవై పిచ్చివానివలెఁదిరుగనగునా? నీవు మఱియొకలాగుననైతివేమో యనినామనస్సు మిక్కిలితపించెను. నిన్నుమరలఁజూతునని నేననుకొన లేదు. ఇప్పుడు నీవిబ్బందిపడవద్దు. నాదగ్గఱ జేబుగడియార మొకటి యున్నది. అది యిరువదిరూపాయలకు తక్కువయుండదు. నేనీపూట నేవిక్రయించి జంబునాధయ్యరున కియ్యవలసినసొమ్మిచ్చివేయుదును. తరువాతమాటచూతము." అదియెల్లవిని జగన్నాధరావిట్లనియె. "కేశ వరాజు నీకు నామీఁదఁగల మహాభిమానమునకు దయకు సంతసించితి. నాస్థితిఁజూడఁగాఁజూడఁగామిక్కిలివిసుగుబుట్టుచున్నది. ఎంతకాలమీ విధముగజీవించుట. నాస్థితినాకే భారముగనున్నది. నాముగులమ్మి తిని .నా జేబుగడియారమమ్మితిని. సరేనేఁడునీ జేబుగడియారమమ్మెద.

తరువాతమాటయేమిటి. ఈవిధముగ క్షణక్షణమిబ్బందిపడుటచే నా మనస్సు సరిగాలేదు. తిన్నన్నము వంటఁబట్టుటలేదు. చదువు తలకెక్కుటలేదు. రాత్రి సరిగా నిద్రపట్టుటలేదు. ఈసంవత్సరము పరీక్షలో నేను సరిగ జయమొందఁజాలను. జీవితమీవిధముగ గెంటుకొనుచువచ్చినపక్షమున సొమ్ముపాడగుటయెకాని లాభములేదు. కాఁబట్టి చదువు మానివైచెదను. దీనికి నీవేమందువు?"

అనవుడు కేశవరాజు "చాలుచాలు! చదువుమానివేయుదువా! ఏపాటోపడి చదువవలెను. బి. ఎల్. చదువులో నీకిది రెండవ యేడుకదా. పరీక్ష నాలుగుమాసములున్నది. ఎట్లైటట్లా తంటాలుపడి చదువు. ఒకవేళ నీవన్న ట్లీసంవత్సరము పరీక్షలో నీవుతప్పిపోయినను క్లాసులోఁజదువవలసిననిర్బంధమైన దీరిపోవును. అందుచేసూ్కలుమానవద్దు. నేనొకయుపాయముచెప్పెదవిను. మనగదిప్రక్కనే యారొమ్మగము మొదలియారుగారని యొకరున్నారు. ఆయనకుమారుఁడైనసింగారువేలుమొదలియారునకు నాకునుమిక్కిలిమైత్రి. అతఁడు తనతమ్ముల కింటిదగ్గఱ పాఠములుచెప్పుటకై తెలివిగలమనుష్యుఁడొక్కఁడు కావలయునని చెప్పుచున్నాఁడు. మంచివాఁడు దొరకినయెడల నెలకిరువదిరూపాయలైన జీతమిచ్చెదరఁట. నీవిందుఁబ్రవేశింపఁదగునని నాయభిప్రాయము. తరువాతనీచిత్తము. ఇందకార్యకరణ మేదియులేదు. కష్టపడిపనిజేసి సంపాదించుకొనుచున్నాము. కానియాచించుటలేదు. ఉచితముగగ్రహించుటలేదు. నీవాలోచించుకొని దీనికుత్తరముజెప్పు.నీవు మాటయిచ్చినపిదప నేనుసింగారువేలుతో మాటలాడి కుదిర్చెదను. ఆ పలుకులువిని జగన్నాథరావు "సరేనేనాలోచించుకొని రేపుదయము చెప్పెద"ననెను. పిమ్మట దుస్తులువైచుకొని కేశవరాజు విద్యార్థులు పలువురున్నచోటికిఁబోయి తనజేబుగడియారమమ్మఁజూపెను.ఒకవిద్యార్థి దానినిరువదిరూపాయలకుఁగొనెను. ఆసొమ్ముదీసికొనిపోయి యతఁ

డు జంబునాథయ్యరునకిచ్చి జగన్నాథరావుయొక్క వ్యవహారముఫయి సలుచేసి తానుగూడ నచ్చట నటమీఁద నుండుటలేదనిచెప్పి తనసొమ్ముకూడ లెక్కచూచియిచ్చి గదికివచ్చియావృత్తాంతమంతయుజగన్నాథరావునకుఁజెప్పెను. అదివిని జగన్నాథరావు తనమూలముననతని జేబుగడియారము పోవలసివచ్చెనని యెంతోనొచ్చుకొని తనకతఁడుచేసినసహాయమున కభినందించెను. ఆదినమున వారిద్ద ఱమ్మాయమ్మయింటఁబ్రవేశించిరి. ఆరాత్రిజగన్నాథరావు తనస్థితిగతులు చక్కగ విమర్శించుకొని మొదలియారిగారిపిల్లల కింటివద్దపాఠములుచెప్పుట తనకిష్టమేయనిమఱునాఁడు కేశవరాజునకు త్తరముచెప్పెను. కేశవరాజు సింగారువేలుతో మాటలాడి యాస్థాన మతనికిప్పించెను. ఆమ్మాయమ్మ చెఱియొకనాలుగురూపాయలు ముందుగానిమ్మని యడిగినందునఁ గేశవరాజు తనవంతుసొమ్మునిచ్చి తక్కినసొమ్ము దగ్గఱలేకపోవుటచే సింగారువేలుతో మాటలాడి తరువాతజీతములోఁ గట్టుకొనవచ్చునని యైదురూపాయలు జగన్నాథరావునకిప్పించెను. ఈవిధముగ వారిరువురుఁగాలక్షేపము జేయఁజొచ్చిరి. జగన్నాథరావుయొక్క యవస్థక్రమక్రమముగ నాంధ్రవిద్యార్థుల కందఱకుఁదెలిసెను. వారివలన శంకరరాజునకుఁగూడ తెలిసెను. వారిదురవస్థవిని తల్లి మిక్కిలివగచెను; కానిశంకరరాజుమాత్రము చలింపక మఱికొన్నినా ళ్ళీవిధముగ నేను బింకముపట్టియుంటినా వీఁడు లొంగకమానఁడని తలంచెను.

కుమారునివిషయమై యతఁడుచేయఁదలఁచినదంతయుఁ జేసెను. వియ్యాలవారినివంచించుట నష్టద్రవ్యము మరలసంపాదించుట యను పనులు రెండుమిగిలెను. శంకరరాజు నీరెంటినొక గుదిక్రిందగుచ్చెను. "ఏకక్రియాద్వ్యర్థకరీ" యనుసామెతజ్ఞప్తికిఁదెచ్చుకొని తనకుమారునకు రెండవవివాహముచేసినపక్షమున కట్నరూపముగ నష్టద్రవ్యము తనచేతఁబడుటయు వల్లూరివారిని వంచించుటయుఁగూడ నగునని య

తఁడు నిశ్చయించుకొనెను. కాని జగన్నాథరావునకు రెండవవివాహము చేయుట సులభసాధ్యమైన పనిగాదని యతఁడెఱుఁగును. ఏమాయోపాయమైనఁబన్ని కుమారునిమెత్తబఱచి పెళ్ళిచేయింపవలెననియ తనికి గట్టిసంకల్పముకలిగెను. కలుగఁగానె యదివెల్లడిచేసెను. వెల్లడియైనతోడనేయెన్నో సంబంధములు రాఁజొచ్చెను. పిల్లమీఁదపిల్లనిచ్చుటయను సందేహములేక జమీందార్లు భాగ్యవంతులు గొప్పయుద్యోగస్థులు పరువుప్రతిష్టలుగలవంశస్తులు తమతమపిల్లల నిచ్చెదమని శంకరరాజునకువర్తమానమంపిరి. తనకూఁతురు సంగీతము పాడఁగలదని యొకఁడు సాహిత్యమునేర్చినదనియొకఁడు,కొంచెమింగ్లీషుమాటాడఁగలదనియొకఁడు పదమూఁడుసంవత్సరములున్నవి వెంటనేపిల్లకాపురమునకువచ్చుననియొకఁడు నానావిధములుగ సందేశము లంపఁజొచ్చిరి. ఒకడిప్యూటీకలక్టరుగారు రెండువేలరూపాయలకట్నమిచ్చిలాంఛనములక్రింద నైదువందలరూపాయలిచ్చెదమనిరి. ఒకడిస్కూలుమునసబుగారు మూఁడువేలరూపాయల నిచ్చెదమనిరి. లక్షాధిపతియయిన యొకగృహస్థుఁడు పిల్లకువేయిరూపాయలు బాలతొడుగుపెట్టి మూఁడువేలకట్నమిచ్చి లాంఛనములక్రిందమూఁడువందలిచ్చి రానుపోను ఖర్చులిచ్చెదనని వర్తమానమంపెను. ఈవర్తమానములు వచ్చుచున్నపుడు దిక్కుమాలినదైవము తనకు నలుగురైదుగురు కుమార్తెలనీయక పెంకెవాఁడైనయొక్కకుమారునిమాత్రమెయిచ్చినందుకుశంకరరాజుమిక్కిలివిచారించి, విచారించినగార్యము లేమికడపటిసంబంధమొప్పుకోదలచి వారీయఁదలఁచుకొన్నదాని కదనముగ నొకపుట్టెడుభూమికూడపిల్లపసుపుకుంకుమనిమిత్తమీయవలసినదని వర్తమానమంపెను. రాయబారులువెళ్ళగావెళ్ళగా వ్యవహారము రాపాడగారాపాడగా నెట్టకేలకాఱెకరములభూమి పసుపుకుంకుమక్రింద నిచ్చుటకు వారంగీకరించితాంబూలములు పుచ్చుకొనుటకురావలయునని వర్తమానమంపిరి.కష్టపడి

యీసంబంధముకుదిర్చి తాంబూలములు పుచ్చుకొన్నతరువాత జగన్నాథరావొడంబడడేమోయనిభయముమాత్రముశంకరరాజుమనసులోఁబుట్టెను. అందుచేత తెగించితాంబూలములు ముందుగాబుచ్చుకొనక నెప్పుడువత్తునిప్పుడువత్తుననిజఱపి తనకుమారునియభిప్రాయ మెఱుఁగఁదలఁచెను. అది తెలిసికొనుటకుఁదానేమొట్టమొదట చెన్నపురివెళ్ళనెంచెను. కాని తానదివఱకు కుమారునిమీఁదఁ గక్షసాధించుచుండుటచేఁ గొడుకుతనమాటపాటిసేయఁడని మఱియొకరినెవ్వనినైనవానికడకుపంపఁదలఁచెను. అట్టివాఁ డెవ్వఁడని రెండుమూఁడుదినము లాలోచింపఁగా నొకపురుషునిపే రతనిమనంబునఁ బొడగట్టెను. ఆపురుషుఁడు కొచ్చర్లకోట గోవిందరాయఁడు. ఈయనకాపురము నిడదవోలుగ్రామము. ఈయన శంకరరాజుభార్యకు సోదరుఁడు. మేనమామ వెళ్ళిబ్రతిమాలి నచ్చఁజెప్పినపక్షమున జగన్నాథరావు తప్పక సమ్మతించునని తలంచి శంకరరాజాయనను బిలిపించి వెనుకటివృత్తాంతమంతయుఁ జెప్పి కట్టకడపట నిట్లనియె.

"గోవిందరాయఁడు! మనబంగారము మంచిదైనయెడలకంసాలియేమిచేయఁగలఁడు. కుఱ్ఱవాఁడునామాటవినక యెదురుతిరుగుటచే నాకు రెండువేలరెండువందలరూపాయలు నష్టమువచ్చినది. జగన్నాథము నేనుచెప్పినసలహావిన్నపక్షమున వల్లూరి రామలింగస్వామిని ముప్పుతిప్పలుబెట్టి మూడుచెఱువులనీళ్ళుత్రాగించకపోదునా? పిల్లవానిని మోసపుచ్చి యీప్రకారముచేసినందుకు తగుమనుష్యులనుబెట్టి యీడ్పించకపోదునా? నాకు మనవాఁడె శత్రువైనాఁడు. ఇంతకు నీవువెళ్ళి యీలాగునఁజెప్పు. అయిపోయిన దేమిటో యైపోయినది. నామాటవినకపోవుటచే నేనుసొమ్ముపంపుటలేదు. ఇప్పుడైననునామాటవిన్నపక్షమున నేనెప్పటివలెజూచి సొమ్ముపంపుదును. నాయెడల వినయవిధేయతలు గలిగియుండుమనుము. తానొక్కఁడే కొడుకుగదానాకు. నేను

సంపాదించిన సొమ్మంతయుఁ దనకేగాని మఱెవ్వరికియ్యనుగదా. తల్లా ప్రగడ రఘుపతిరావుగారు మూడువేలరూపాయలకట్న మిచ్చిరాకపో కలఖర్చులిచ్చి లాంఛనములిచ్చియాఱెకరములభూమినిచ్చి బాలతోడు గుగ వేయిరూపాయలనగలుపిల్లకుపెట్టి పిల్లనిచ్చెదమనివర్తమానమం పినారు. ఈసంబంధము తానొప్పుకొన్నపక్షమునన్నాకువచ్చినధననష్ట ముతిరిగిపూటుపడును. పైగా భూమికలసి వచ్చుచున్నది. మోసముచే సినందుకు వల్లూరివారిపొగ రణఁగిపోవును. నామాటవినుమనుము. పె ద్దవాఁడనైనాను. బ్రతికినంతకాలము బ్రతుకను. రఘుపతిరావుగారి పిల్లను చేసికొనుటకునిశ్చయించి మాటయిచ్చినా ననిచెప్పు. నామాట బోటుపోయెనా సాటివారిలో మరియాదదక్కదనిచెప్పు. ఆయనకుసా లుకు నాలుగువేలరూపాయలు భూములమీఁదవచ్చును. వారి దత్తిలి కాపురము. ఇవియిటుండఁగా మఱియొకవిశేషమున్నది. ఆయనకొ కకుమారుఁడు నొకకుమార్తెయుఁగలరు. కుమారుఁడు రెండుసంవత్స రములనుండి జబ్బుగనున్నాఁడు. వాఁడుబ్రతికినదాక నిశ్చయము లేదు మనయదృష్టము బాగున్నపక్షమున నానోటితోనటువంటిమాటయన నేల? ఆనాలుగువేలరూపాయలభూమి మనకేకలియును. నేనెన్నివిధము లచేతనైనను తనలాభమెచూచుచున్నానుకాని నాలాభము చూచు టలేదు. పూటకుగతిలేని వల్లూరి రామలింగస్వామిగారిని బట్టుకొని ప్రాకులాడినందునవచ్చినలాభమేమి? జోగిజోగి రాచికొన్నపక్షమున బూడిదరాలును. ఇప్పుడు తానంతయిబ్బందిలో నున్నాఁడుకదా తన కొకగ్రుడ్డిగవ్వయైనరామలింగస్వామి సహాయముచేయఁగలిగినాఁడా; న న్ననమ్ముకోవలెనుకాని మామగారినినమ్ముకోవచ్చునా? అత్తవారిని నమ్మినవాఁడు చెడిపోకబాగుపడునా? ఈసంగతులన్నిటినిదనమనస్సు లోసరిగా నాలోచించికొనుమనుము. ఇప్పుడుతాను నామాటవిన్నాఁ డానేనుతండ్రిని, తానుకొడుకు వినకపోయినాఁడా నేనుతండ్రినిగాను.

తాను కొడుకుగాడు. నామాట తిరస్కరించిన పక్షమున నాయాస్థి యావత్తు నేనన్యాక్రాంతము జేసెదననిచెప్పు. నానోట మాటరానే రాదు. వచ్చినజరిగితీరును. ఈయాస్థి నాస్వార్జితము. నాయిష్టమువచ్చినట్లు చేసికొనవచ్చును. ఈదెబ్బతోఁ దనకునాకు సంబంధమువదలిపోవునని చెప్పు. ఇంకొక్కమాట! రామలింగస్వామికొడుకున్నాఁడు కేశవరాజని. వానిదుస్సహవాసముచేత మనవానికిన్ని దుర్బుద్ధులు పుట్టినవి. ఈమాటలు వాఁడువినకుండఁ జెప్పవలెను. వాఁడు మాయలమారి బలుటక్కరి. నీవువెళ్ళినపని వానికిఁదెలిసెనా వాఁడు మనసిట్టె త్రిప్పివయిచును. నేను రెండువందలరూపాయలు నీచేతికిచ్చెదను. వాఁడు మనమాటవిన్నపక్షమున నీసొమ్ము వానికిచ్చిరా, లేనిపక్షమున తిరిగితీసికొనిరా అని కఠినముగఁబలికి ప్రయాణమునకుఖర్చులిచ్చి కుమారుని నిమిత్తము రెండువందలరూపాయలిచ్చి రైలుస్టేషనువఱకువెళ్ళిసాగనంపిబండియెక్కువఱకునుబండియెక్కినతరువాతనుబండిసాగిపోవువఱకును నేదోగొడవచెప్పుచు నెట్లయినఁ గార్యసాధనము జేసికొనిరమ్మనినొక్కిచెప్పి వెడలిపోయెను.

గోవిందరాయఁడు చెన్నపట్టణమువెళ్ళెను. రైలుబండిదిగిస్టేషనుకుసమీపమందున్న యొకపూటకూటింట భోజనముచేసిసాయంకాలము మేనల్లునిగలిసికొనెను. జగన్నాథరావు మేనమామనుగౌరవించివచ్చినపనియేమనియడిగెను హైకోర్టులోనెవరిదో యప్పీలు నాఖలు చేయించుటకై వచ్చితినని యతఁడుబొంకి రెండుదినములుగడచినతరువాతనొకనాఁడు కేశవరాజు లేనిసమయమున నతనిఁగూర్చుండఁబెట్టికొనిసంసారపుగొడవలనెత్తికొంతసేపుముచ్చటించి యిట్లనియె. "అబ్బాయి! ఏమిపనిమీఁదవచ్చితివని నీవునన్నడిగినపుడు కేశవరాజు నీదగ్గఱనుండఁబట్టిహైకోర్టుపనిమీఁద వచ్చితినని చెప్పితిని. కాని నేనువచ్చినది కోర్టుపనికాదు. నీతోమాటలాడవలసినదని మీబాబయ్యనన్ను

బంపినారు. అందునిమిత్తము నేనువచ్చినాను. మీబాబయ్యకు నీకును నస్పర్థలుండుటమంచిదికాదు. లేకలేక వరప్రసాదివలె నొక్కకొడుకు గలుగుటయు వానితో మనస్పర్థలు గలుగుటయునెంతమాత్రము బాగు లేదు. నీవుచదువుకొన్నవాఁడవు. ఒకరిచేత నీవుచెప్పించుకొనఁదగినవాఁడవుకావు ఒకరికినీవు చెప్పఁదగినస్థితిలోనున్నావు నీవువివేకివి గనుక తండ్రిచెప్పినట్లుపినవలెను. మీకిద్దఱకు వివాదమువచ్చినందువలనబంధువులలో మిక్కిలి యపకీర్తిగలుగుచున్నది. అత్తవారిలో దూఱికని పెంచినతలిదండ్రులను చెందనాడి బాధపెట్టుట శ్రేయస్సుగాదు. కాఁబట్టి నీతండ్రియందు భక్తిగలిగి నీవుప్రవర్తింపవలె." అనవుడు జగన్నాథరావు మామా! మొదటినుండియు జరిగినవృత్తాంతము నీవెఱుఁగవు. రామలింగస్వామిగారికుమారుఁడయిన కేశవరాజునకు నాకు మిక్కిలిస్నేహమన్నమాటనిజము. కేశవరాజుచెల్లెలుమిక్కిలి చక్కనిదగుటచేతను తెలివిగలదగుటచేతను నేనాపిల్లనువివాహమాడవలయునని సంకల్పించుకొంటిని. కట్నమీయలేనివారిపిల్లను వివాహమాడగూడదని మాబాబయ్యసంకల్పము. వారిదగ్గఱసొమ్ము లేకపోవుటచే నేను బదులిప్పించితిని ఇదియేనావలనిదోషము, రామలింగస్వామిగారెప్పటికయిన నీసొమ్ముతిరిగి నీకు గూడ నియ్యకమానరు. ఆయనతీర్చలేకపోయినను బి.ఎల్ పరీక్షయందు దేఱినతరువాత కుమారుఁడు కేశవరాజైనను దప్పకతీర్చును. ప్రస్తుతమక్రమముగ సొమ్ముమాబాబయ్యయిచ్చుకొనవలసినందుకు నాకు మిక్కిలివిచారముగనున్నది. రామలింగస్వాగారిచేతను కొడుకుచేతను వారికున్నయాస్థి తనఖావ్రాసియిప్పించెదను పిల్లమీదిమక్కువచేత నేనాసంబంధముజేసికొంటినిగానిమఱియొకకారణముకాదు. అత్తవారిలో దూఱి నేనుమాతండ్రికిఁ జేసిన పరాభవమేమియులేదు ప్రస్తుతము కొంతధననష్టమైనది, ఇంతలోమనకువచ్చినప్రమాదమేదియులేదు ఓపికపట్టినయెడల మనసొమ్ము మన

కుగవ్వలతోవచ్చును, ఈమాత్రముదానికి మాబాబయ్య నామీఁద కక్షవహించి నాకుజీతముపంపక తిండికిపంపక నన్ను బాధలపెట్టిచంపు చున్నాఁడు. నేను చేసినద్రోహములేదు. ఇందులో నన్నేమిచేయుమ నెదవో చెప్పు నీవుచేయుమన్న పనిచేసెద"ననిపలికెను పలుకుటయు గో విందరాయఁడు మేనల్లునిమీఁదఁ జేయివైచి నిమిరి మెల్లగానిట్లనియె "నాయనా! నీవుమిక్కిలిబుద్ధిమంతుఁడవని నేనెఱుఁగుదును అయిన ప్పటికిబాలుఁడవగుటచే నీవావిషయమున గొంచెముపొరబాటుచేసితి వి, అయినను దానివలనవచ్చిన ప్రమాదములేదు. అదినీతండ్రికినచ్చ దు, పెద్దవాఁడగుటచేత మనమే యతనిమాటవినవలెను, తండ్రిమాట వింటేనీకిహపరములు రెండునుగలవు, ప్రపంచములో గొప్పఖ్యాతిగ లుగును, చదువుకొన్నవానియెదుర విద్యాగంధములేనినావంటివాఁ డనేమిచెప్పఁగలను? తండ్రిమాటవిని రాములవారు రాజ్యముపోగొ ట్టుకొనియడవులలోఁదిరిగినాడు. భీష్ములవారుతండ్రికోసముపెండ్లిమా నుకొన్నారు నీవెఱుఁగనిదేమున్నది, అందుచేత నీవుగూడ మీతండ్రి చెప్పినట్లువినవలెను" అన జగన్నాథరావు "మామా! నేనిదివఱకు వి నకపోయినదిలేదు, శక్యమైనంతవర కాయనయిష్టప్రకారమే చేసెద ను, ఏమిచేయుమన్నావో చెప్పు" మని యడిగెను.

అడుగుటయు మేనల్లునకు మేనమామ యిట్లుపదేశించెను. 'అ బ్బాయి! నీవు మీతండ్రి కనుకూలముగ వర్తింపఁదలఁచుకొన్నావు గనుక చెప్పుచున్నానువిను, నామాటలు నీకిష్టమున్నను లేకపోయినను సంపూర్ణముగవిను, నీతండ్రికివల్లూరివారిమీఁదమితిలేని కోపమువచ్చి నది. అంతింతల నాయాగ్రహము తీరునట్లులేదు. ఆకోపముచేత నా యనమనస్సులో నొకక్రొత్తసంకల్పముకలిగినది. దాఁచుటయెందుకు. నేరుస్పష్టముగఁ జెప్పుచున్నానువిను. మీబాబయ్య నీకు రెండవపెండ్లి చేయుటకు నిశ్చయించుకొన్నాఁడు.' ఈకడపటిమాట మేనమామనోట

వెడలఁగానె జగన్నాథరావు "ఆఁ! ఆఁ! రెండవపెండ్లియె. ఎంతమాట" యని పరుపుచుట్టకుఁ జేరపడెను. పడుటయు మేనమామ "నేను మొదటనెచెప్పలేదా. మనస్సులోఁగలఁత జెందకశ్రద్ధగవిను"మని మరలనిట్లు చెప్పఁదొడఁగెను రెండవపెళ్ళిచేయక మానమని మీబాబయ్యప్రతిజ్ఞ జేసినాఁడు. కంఠములోఁ బ్రాణముండఁగఁ బ్రతిజ్ఞ నెవేర్చుకొందునని స్పష్టముగఁజెప్పుచున్నాఁడు. అత్తిలిగ్రామవాసియగు తల్లాప్రగడరఘుపతిరావుగారు తనకుమార్తెనిచ్చి వివాహముచేయుదునని చెప్పినాఁడు ఆరెకరములభూమితోఁగూడమూఁడువేలుకట్నమిచ్చెదనన్నాఁడు.పిల్లకువేయిరూపాయలు బాలతోడుగున్నది.పురుషోత్తమరావుబాకీక్రిందయిచ్చినసొమ్మిదెబ్బతోదీరిపోవును. పిల్ల రంభలాగున్నదఁట. ఇవిగాకయితర లాభములుగూడనున్నవి. నీవు మఱొకలాగున ననుకొనవద్దు ఆరహస్యముగూడ చెప్పివైచెదవిను.అతనికొక్కఁడేకుమారుఁడు. వాఁడు చాలజబ్బుగ నున్నాఁడు. బ్రతుకఁడు. ఏడాదికి నాలుగువేలరూపాయలు వచ్చునట్టిభూములు నీకేకలియును.ఇటువంటిప్రశస్తమైనసంబంధముమనదియోగములో మఱియెక్కడను లేదు. సాంప్రదాయముమంచిది. తల్లాప్రగడవారంటే దేశపాండ్యాలు. ఈపెళ్ళిచేసికొంటివాతండ్రికిష్టుఁడవగుదువు మాకందఱకు సంతోషము గలిగించినవాఁడవగుదువు కుటుంబమునకుగొప్పయాస్తి జేర్చినవాఁడవగుదువు. రెండవపెండ్లియనఁగానె వెలవెలఁబోయెదవేమి. నీభార్య యింకను గాపురమునకు రాలేదు పట్టుమని పదినాళ్ళుగలిసియుండలేదు. ఇంతలోనె యెక్కడనుండివచ్చినదీప్రేమ. ఇంగ్లీషుచదువుల మూలమున నిటువంటి వెఱ్ఱివెఱ్ఱిప్రేమలుబయలుదేఱినవి.మానాఁడిటువంటివెఱుఁగము. పెళ్ళామంటేపై మీఁదబట్ట. ఒకయుత్తరీయముజారిపోతే మఱియొకయుత్తరీయము రాదా? ఆలాగే భార్యపోతే మఱియొకభార్య. ఒకయుత్తరీయముండఁగామఱియొకయుత్తరీయ ముండదా? ఆలాగే భార్యయుండగా మఱియొక

భార్య. నీకొకవేళ వెనుకటిభార్యమీఁదవిశేషప్రేమ యున్నపక్షమున నీవిద్దఱు భార్యలను గూడనేలవచ్చును. గోవిందరాజులగోపాలకృష్ణరావుగారు తండ్రియాజ్ఞప్రకారము మొదటిభార్యయుండఁగా రెండవభార్యను పెళ్ళిచేసుకొన్నారు. తండ్రిపోయినతరువాత నిద్దఱను నేలినాఁడు. మీతండ్రిపెద్దవాఁడు. యెల్లకాల ముట్టిగట్టుకొని యుండఁగఁడు. ఆయనపోయినతరువాత వల్లూరివారిపిల్లనె నీవుపట్టపుదేవిని జేసికొనవచ్చును నీయిష్టమువచ్చినట్లుండవచ్చును. ముందతనిపంతము నెగ్గించు. వివాహముచేయుటకు తాంబూలములుపుచ్చుకొన్నాఁడు. ఇప్పుడు వెనుకదీసి నపక్షమున నతనిశిరచ్ఛేదముచేసినట్లుండును. కాఁబట్టి నీవువప్పుకొనక తప్పదు ఈమాటవినకపోతేమీబాబయ్యకునీకునేఁటితో ఋణానుబంధముతీరినట్లె. నీతండ్రిచండశాసనుఁడు. అతిసాహసుఁడు. గట్టిగాఁగోపము వచ్చెనా యాస్తియన్యాక్రాంతముచేయఁగలఁడు. ఆయనమాటవింటె చదువుసాగును. నీవనుకూలముగనుంటేనీకిమ్మని రెండువందలరూపాయలునాచేతికిచ్చినాఁడు. ప్రతికూలముగనుంటే చిల్లిగవ్వయైననియ్యవద్దనిచెప్పినాఁడు. ఇటువంటియిబ్బందులుపడిచదువేలపాడుచేసుకొనియెదవు? నిష్కారణముగ చెడిపోక నామాటవిను, మీయమ్మకూడ నీతోమఱిమఱిచెప్పుమన్నది. మగనిపక్షముమాటలాడెనాకుమారునకుగష్టముగానుండును. కుమారునిపక్షముమాటలాడెనా మగనికికష్టముగనుండును. ఆవిడకు వెనుకగోయి,ముందుమాయి. నీకోసముబెంగపెట్టుకొనిచిక్కిసగమయినది, నీవుతండ్రిమాటవింటే సమస్తకష్టములుగట్టెక్కును ఇదిగో! గడ్డముపట్టుకొని బ్రతిమాలుచున్నాను. నామాట విను."

ఈమాటలుజగన్నాథరావుమనస్సుమీఁదసూదిపోటులవలెపడెను. అవియతని కెంతమాత్రముఱుచింపలేదు. కొన్నిసందర్భములయందతనికి మితిమీఱినకోపముదయించెను. కానియెంతో యోపికతో నదియడంచుకొని మేనమామపలుకులు వినజొచ్చెను. మేనమామసంభా

షణము ముగిసినతోడనే యతఁడీక్రిందివిధమునఁబ్రత్యుత్తరమిచ్చెను. "మామా! మాబాబయ్య పెద్దవాఁడు నీవు పెద్దవాఁడవె. పెద్దలు చెప్పినట్లు చిన్నలు నడువవలసినదె. కాని ధర్మవిరుద్ధముగఁ జెప్పినప్పుడుమాత్రము వారిమాటలుకొంచెమువిమర్శచేసి పనిచేయవలెను. రెండవపెండ్లినాకుఁ జేయవలయుననిమా బాబయ్యకుసంకల్పముగలిగినందుకునాకుమిక్కిలివిచారముగనున్నది. అటుసూర్యుఁడిటుపొడిచినప్పటికి నేను రెండవపెండ్లిచేసికొనను. అంతకంటెనధర్మములేదు. రామలింగస్వామిగారిమీఁదికోపముచేతనేపాపమెఱుగనియాయనకూతురునుబాధపెట్టుటన్యాయమా? ఆపిల్ల యేమిచేసినది? నేరమెవరివలననున్నదోవారినిశిక్షింపవలయును. కానినిరపరాధులను శిక్షించుటధర్మమా! భార్యపైమీఁది బట్టవంటిదన్నావు! అగ్నిసాక్షిగనివాహమైనదాని నారీతిగననాదరణజేయుటయుక్తముకాదు. నీవు రాములవారిపోలికదెచ్చితివిరాములవారు భార్యవియోగమైనప్పుడు మఱియొక రాజకుమార్తెనువివాహమాడక యేలయంతవిచారమొందవలెను? సముద్రమున కేల వంతెన గట్టవలెను? వానరులతో నేల స్నేహముచేయవలెను? పుత్రమిత్రకళత్రములతో రావణాసురు నేల చంపవలెను? భార్యయుత్తరీయమువంటిదని యాయనయెప్పుడుఁ దలంచలేదు. మగనిజీవితముభార్యతోనెయున్నది. భార్యజీవితము మగనితోనేయున్నది. ధర్మపత్నినివిడిచిపెట్టుమనిచెప్పుట క్రూరము. ఈక్రూరకర్మము నేనుచేయఁజాలను. నీవాడినమాటలలోఁ గొన్నిమిక్కిలిదారుణముగనున్నవి. తల్లాప్రగడ రఘుపతిరావుగారుగొప్పకట్నమిచ్చిపిల్లను మనకిచ్చెదననిచెప్పినందుకు మీ రాయనకుమారునిచావుకోరుచున్నారు. ఇంతకంటెమహాపాతకము లేదు. కోటివరహాలధనమువచ్చిననుసరే సామ్రాజ్యము వచ్చిననుసరే యొకనిచావు నేనుకోరను. ఇదిపరమనీచమైనకోరిక. ఈమాటలు బిడ్డలుగలవాని నోటను సంపన్నగృహస్థునోటను ముఖ్యముగబ్రాహ్మ

ణునినోటను రావలసినమాటలుకావు. చండాలుఁడైననిట్టికోరికకోరఁడని నాయభిప్రాయము. రఘుపతిరావుగారికుమారుఁడుదీర్ఘాయుష్మంతుఁడై వర్ధిల్లవలయునని నేను కోరుచున్నాను. ఆయనవిషయమై నే నొకందుకు విచారించుచున్నాను. నాకిదివఱకు భార్యయుండఁగానది యెంతమాత్రముగణింపకపిల్లమీఁదపిల్లనిచ్చుటకునాకెంతోవిషాదము కలిగించుచున్నది. లోకము మిక్కిలిపాపభూయిష్టమని దీనివలన దేలుచున్నది. ఇద్దఱుభార్యలనేలుకొనవచ్చునంటివి ఇద్దఱుభార్యలుకలవాఁడు రెండుప్రక్కలశూలనొప్పిగల మనుష్యునివంటివాఁడు. రెండవవివాహము ధర్మవిరుద్ధమేగాక పురుషునకు లేశమైనసౌఖ్యముగలిగింపదు. అధర్మమై, యసౌఖ్యమైనకార్యమునేనెన్నఁడుఁ జేయఁజాలను మాబాబయ్యకు నామీఁద మహాగ్రహము కలుగుననియు నతఁడాస్తియంతయు నన్యాక్రాంతము జేయుననియు నీవుచెప్పితివి. ధనముకోసమనినేనధర్మము చేయువాఁడనుకాను. అదృష్టమున్నపక్షమున నెవ్వరుఁ దీసివైవఁజాలరు. అదృష్టహీనున కైశ్వర్యమువచ్చినను నిలువదు. పూటకుగతి లేనివారు భూమండలాధిపతులైరి. జమీందారులు వంశక్రమాగతమైనయైశ్వర్యముఁ గోల్పోయి సన్యాసులైరి. ఈయైశ్వర్యములుశాశ్వతములుకావు. ఆయనస్వార్జితమైన యాస్తిగనుక నిష్టమువచ్చినవారికిచ్చుకొమ్మనిచెప్పు. అందులోనిదొకగడ్డిపఱకయైననేనపేక్షింపను గోవిందరాజులగోపాలకృష్ణరావుగారివలెఁ దండ్రికిష్టమనియధర్మమునేను చేయఁజాలను. కాబట్టి నాతో నిక నటువంటిమాట చెప్పవద్దు. మొఱమోటపడి కానిపని నేనెన్నఁడుఁ జేయను. ఈసంగతులు నీవుస్పష్టముగ మాబాబయ్యతోజెప్పవచ్చును. నాకోసము మాయమ్మ బెంగపెట్టుకొన్నదని చెప్పినావు. ఆమెవిషయమై నాకు మిక్కిలివిచారముగనున్నది కాని యేమిచేయఁగలను ?

మేనల్లునిపలుకులు మేనమామచెవులలోసూదిపోట్లువలెపడెను

వినయవిహీనుఁడైనభాగినేయుని నాలుగుచంపకాయలుకొట్టివానికిబుద్ధి చెప్పవలయునని మేనమామకుఁదోఁచెను. కాని మేనల్లుఁడు బంధుగౌరవము పాటింపకనభియోగము తేవచ్చుననియు విదేశమునఁదానుచిక్కులలోఁదగులొన్నయెడల తనకుసాయముచేయువారెవ్వరునుండరనియు దూరాలోచనముచేసియట్లుచేయుటకు సాహసింపకదిగ్గునలేచిమేనల్లునితోఁజెప్పకుండగదినిడచిపోయెను. జగన్నాథరావుమేనమామను గొంతదూరము సాగనంపెనుగానివారొండొరులతోనోరుమెదిపి మాటలాడుకొనలేదు. మామా! నేనువెళ్ళుచున్నానని కొంతదవ్వరిగినతరువాత మేనల్లుఁడు వీడ్కొనియెను. కాని మేనమామనోరెత్తిమాటాడకతలయూఁచెను. జగన్నాథరావు తనకొట్టుకడకుఁబోయెను. పొగబండియెక్కి యాతనిమేనమామ భీమడోలునకరిగెను. చెన్నపురినుండితనశ్యాలకుఁడెప్పుడువచ్చునో యేమిచెప్పునో కుమారుఁడు తనయాజ్ఞతలఁదాల్చిద్వితీయవివాహమునకొడంబడెనన్నమాట శ్రవణానందకరంబుగా వినఁబడునోలేదో తనకుటుంబమునకు గొప్పయాస్తికలిసెడుయోగమున్నదోలేదోయని తధేకధ్యానముతో శంకరరాజహోరాత్రములు విచారింపఁదొడఁగెను. ఒకజ్యోతిష్కునిరావించికుమారునిజాతక మతనిచేతికిచ్చి 'అయ్యా! మావానిజాతకముఁ బరీక్షింపుఁ'డనియడిగెను. అతఁడు జాతకమునుదీసి పరిశోధించిచూచిజాతకముమిక్కిలిచక్కఁగానున్నది. జాతకుఁడు నన్నివిధములచేతనదృష్టవంతుఁడగు'ననిచెప్పెను. "అంతేనా? అంతేనా? మఱియొకసారిచూడండి" యనిశంకరరాజుభావగర్భితముగానడిగెను. ఆతఁడేదోమనస్సులోఁజెట్టుకొనియడుగుచున్నాఁడనిగ్రహించిసిద్ధాన్తిజాతకముతిరగవైచి బోర్లవైచిమరలమరలఁబరిశీలించెను. ఎన్నిసారులు బరిశీలించిననతనికినూతనాంశమేదియుఁబొడకట్టలేదు. ఎట్టకేలకుశంకరరాజు సిద్ధాన్తిమీఁదవిసిగికొని "అయ్యా! మాపిల్లవానికిద్వితీయకళత్రయోగమున్నదా లేదా? సరిగాఁజూచిచెప్పండి" యనినొ

క్కియడిగెను. ఆవాక్యములోనియర్థముసిద్ధాన్తికిసరిగా బోధపడలేదు. ఏలయన సిద్ధాన్తిభీమడోలుగ్రామవాసి.చిన్ననాఁటనుండియు శంకరరాజునెఱుఁగును. జగన్నాథరావునకువివాహమగుటయు నతనిభార్యయీజేరికాపురమునకుసిద్ధముగనుంటయునతఁడెఱుఁగును. కళ్యాణలక్షణసంపన్నురాలయినకోడలుపుట్టినింట సుఖముగనుండఁగాఁ గుమారునకు ద్వితీయకళత్రయోగములేదాయని శంకరరాజుప్రశ్నించుటసిద్ధాన్తికాశ్చర్యకరముగఁదోఁచెను.అటువంటియోగమేమియులేదనియతఁడుగట్టిగాఁజెప్పి యిట్లనియె. "అయ్యా! మీపిల్లవానిభార్య వ్యక్తురాలయి కాపురమునకువచ్చుటకు సిద్ధముగానున్నదని వినియున్నాను. ద్వితీయకళత్రయోగమున్నదాయనిమీరడుగుచున్నారేమి ?ఇదియమంగళము ఇదిగాక యీవేళమంగళవారము. మీరుసంపన్నగృహస్థులు. నిండినయింటిలోమంగళవారముపూటమీరిటువంటిమాటలాడఁగూడదు" అనవుడు శంకరరాజుమెల్లగా సిద్ధాన్తి కిట్లనియె. "అయ్యా! నేనుదురుద్దేశ్యముతో మిమ్మాసంగతి యడుగలేదు. మొన్ననెవరోపిల్లవానిజాతకమిట్టిచూచి ద్వితీయకళత్రయోగ మున్నదనిచెప్పినారు. అందుచే నేను భయపడి యడిగినాను. అట్టిదిలేదని చెప్పినారు. నాకెంతో ధైర్యముగానున్నది. ఇంకను మీరుదయచేయండి." అనవుడుసిద్ధాన్తి సెలవు తీసికొని స్వగృహమునకు వెడలిపోయెను. తనశ్యాలకుఁడువచ్చువఱకు శంకరరాజీవిధముగానే నిరంతము కుమారునివివాహవిషయమయితలంచుచు ప్రశ్నలుజూచుచు స్వప్నఫలములడుగుచు మితిలేని మనోవ్యథబొందఁజొచ్చెను. తనశ్యాలకుఁడు వచ్చుచున్నాఁడేమోయనిపూటపూటకు రైలుస్టేషనువద్దకరిగిజనముబండిదిగి వెళ్ళిపోవువఱకచ్చటనుండిమరలిగృహమున కరుగుచుండును. అటులుండనొకనాఁడు మరలిబండిదిగివచ్చెను. దిగఁగానేశంకరరాజు వానికడకుఁబోయి తనకార్యసిద్ధియతఁడు జేసికొనివచ్చెనని విశ్వసించి "ఏమోయి! మేనల్లునిజేబులో

వయిచికొని వచ్చితివా" యనియడిగెను. "నా జేబులో బడుటకు నీకు మారు డంతటి తెలివితక్కువవాడు కాడు రండి చెప్పెద"ననియతడు బావగారితో గలిసి స్టేషన్ దాటి గృహాభిముఖుడయినడుచుచు దనకు నుమేనల్లునకును జరిగిన యావదృత్తాంతము పూసగుచ్చినట్లు చెప్పెను ఆవృత్తాంతము విన మెక్కి నట్లతనితలకెక్కి యెన్నో వికారములగలిగించెను. నడివీధిలోనే యతడు కుమారునిదిట్ట మొదలుపెట్ట మరదియెన్నో సారులు వారించెను. గృహము జేరినతరువాత శంకరరాజుంబట్టబగ్గములు లేకపోయెను. ఆగ్రహపీడ గ్రహపీడకంటె మిక్కిలి ప్రబలమైనదికదా? గ్రహపీడ సామర్థ్యముకలమాంత్రికుని తాంత్రికప్రయోగమువలననుపశమింపవచ్చును లేదా ముంతపొగలు మొదలగుక్షుద్రప్రయోగములచేత నివారింపబడవచ్చును. ఆగ్రహబాధ కట్టిమంత్రితంత్రములు లేవు. క్షుద్రప్రయోగములు దీనికింబనికిరావు. ఎంతయాపిననాగక వమనమువలె నాగ్రహము వెలికివచ్చును. రోగచిహ్నములువలె మొగముమీదఁ గన్పడును. కంపజ్వరమువడకించునట్లదిశరీరమునువడకించును కోపిసన్నిపాతరోగివలెఁ బండ్లుకొఱుకును. సన్నిపాతపీడితునట్లేకోపియునెవరినో యొకరిని దిట్టి కొట్టును. అందుచేతఁ గోపమొకానొకవిధమయినమనోరోగమని కొందఱనుచున్నారు. రోగమైనయెడల సులభచికిత్సకుసాధ్యముకానిరోగము మరదిచెప్పినమాటలుచెవినిబడఁగానెశంకరరాజునకు గ్రహముపైఁబడినట్లు మన్యజ్వరమావహించినట్లు మహాగ్రహమావహించెను. ఇంటికివచ్చునప్పటి కాయనకొడలు తెలియదనుటయతిశయోక్తికాదు. కనులెఱ్ఱజేసెను, పండ్లుకొఱికెను. 'ఓరిదుర్మార్గుఁడా! ఓరిదుర్మార్గుఁడా! ఓరిఘాతకుఁడా! ఎంతవాఁడవయితివిరా' యని నాలుగైదుసారులు పెద్దచప్పుడగునటులు చేతితో రొమ్ము మోదికొనెనుకొంతసేపయినతరువాత నీక్రిందివిధముగఁదనకోపమును వాక్యరూపముజేసెను. "కుమారుఁడు కాఁడు వంశనాశకుఁడు. తులసివనములో గం

జాయిమొక్క పుట్టినట్లుబంధకవివారివంశములోనీనిర్భాగ్యుఁడుపుట్టినాడు. నాకువానితో నేటికిసరి. ఘటశ్రార్థముచేసెదను. నాకుఁగొడుకులులేరు. నేను మఱియొకకుమారుని బెంచుకొనియెదను. నాకుఁ గానివాఁడు నాకులేనివాఁడె. అత్తవారిలోఁదూఱి తల్లిదండ్రుల నేడ్పించినకొడుకు బ్రతికియున్నాఁడనుకొనుటకంటెఁజచ్చినాఁడనుకొనియొకస్నానముజేసి యూరకుండుటమంచిది. ఈదౌర్భాగ్యునిచేతిలో నేనుజావనువీఁడునాకుఁ గర్మజేయనక్కఱలేదు. ఒకవేళవీఁడు పిండములువేసినను నేనవితినను. వీఁడిచ్చినతర్పణమునేను త్రాగను. వాఁడునాకుఁగుమారుఁడుకాఁడు నేనువాఁడికిఁ దండ్రినిగాను ఈవెధవచదువు కొన్నాఁడఁట. చదువుకొన్న యీవెధవసన్యాసికంటెఁ బశువులునయము గాడిదలునయము రాక్షసు లింతకంటెమంచివాళ్ళు. తండ్రిని ఘాతజేయునట్టి రాక్షసులులేరు ఇంతపెంకితనమా! ఇంతదౌర్జన్యమా! ఇంతతిరుగుబాటా! ఈపాడువెధవకు ముష్టిచెంబు చేతికిచ్చెదనుగిద్దెడుభూమిలేకుండనఁమిమ్మవేసెదను తలదాచుకొనుటకిల్లయిన లేకుండఁజేసెదను యావజ్జీవముకుళ్ళికుళ్ళియేడ్చునట్లుజేసెదను. వీనికివీనిమామగారికివీనిబావమరిదికిఁగూడబుద్ధివచ్చునట్లు జేసెదను వీఁడమ్మకడుపుకాల! నామనస్సుకువీఁడెంతశోభగలుగఁజేసినాఁడయ్యా!యీవుసురుగొట్టివాఁడెప్పుడయినామామగారితోను బావమరదితోను భార్యతోను దుంపతెగిపోవునా ; వల్లూరి రామలింగస్వామిపుత్రమిత్రకళత్రములతోనాశనమైపోకమానఁడు నాయుసురటువంటిది నన్ననాకుమారులలోనుంచి విడదీసినాఁడుగనుక వాఁడుపుత్రశోకముతోఁ గుళ్ళికుళ్ళి చచ్చిపోవలె. మాతాతలుతండ్రులుమహాతపశ్శాలులు. నానోటివెంటవచ్చినమాటతప్పకజరిగితీరును ఈజగన్నాథరావుగాఁడు పక్షైపోయినప్పుడు రామలింగస్వామిగాఁడేమిసాయముచేయఁగలఁడో యాయనకుమారుఁడు గారేమిసాయముఁజేయఁగలరో నాకన్నులతో నేనేచూడఁగలను నేనుతలఁచుకొన్న

పని సంపూర్ణముగఁజేసెదను ఆస్తియన్యాక్రాంతముజేసెదనుఆమీ దనాకొడుకునుపొడిచినేనుపొడుచుకొని చచ్చిపోవుదును ఇది వంశనాశనముకోసమొచ్చినది నాకులము ధ్వంసమైపోవుటకె వల్లూరివారు మాకుదాపురించినారు అది కోడలుగాదు మమ్మందఱను దిగమ్రింగఁ దలఁచుకొన్న యమ్మవారు."

ఇట్లు గొంతుచించుకొని యఱచుచుండుటచేత నతనికంఠము బొంగురువోయెను. మొదట మాటకీచుగవచ్చెను తరువాత విస్పష్టముగ వినఁబడకపోయెను. మాటతిన్నగరాకపోవుటచే నతఁడూరకుండ వలసినవాఁడయ్యెను. అప్పుడుమఱఁదికోపావేశపరవశుఁడైనబావకిట్లని యె. "నీవుతొందరపడవద్దు వేగిరపాటువలనమనకార్యముచెడిపోవును కాని చక్కఁబడదు. తండ్రికొడుకులు విరోధులైనారని వాడుకలోకములోఁబడకూడదు. నీకొడుకు నీవు చెప్పినట్లువిని రెండవపెండ్లిచేసికొనఁబోవుచున్నాఁడని మనము వాడుకవైవవలయు. అందువలన మనకెన్నోలాభములున్నవి రామలింగస్వామి యావాడుకవినిభయపడి తలతాకట్టుపెట్టియైన మనసొమ్ము మనకిచ్చివైవఁగలఁడు. అతఁడియ్యకపోయినను దీనివలన నెంతోమంచియున్నదికాని చెరుపులేదు. నీవుపిచ్చికోపముచేత దత్తపుత్రస్వీకారము చేసికొందునని గడబిడచేసినంతమాత్రముచేత నమ్మువారెవ్వరు? కుమారుఁడుండఁగా మనధర్మశాస్త్రప్రకారముదత్తతచెల్లదు. ఇల్లువాకిలిపొలముపుట్రికోపముచేత తెగనమ్మి పాఱవయిచినందువల్ల ఫలమేమి? ఆసొమ్మేమి చేయఁదలఁచుకొన్నావు మనకుసొమ్మేకావలయునుకనుక యేలాగోయొకలాగది రాఁబట్టుకొనుటకుఁబ్రయత్నముచేయుదము. కుఱ్ఱవాఁడు చెప్పుకొఱకినాఁడని మనముసిద్ధెకొరకవచ్చునా? వాఁడు శ్రీరంగనీతులుచాలచెప్పినాఁడు. ఆనీతులకేమి అవినిలబడునవికావుఒక్కపరమరహస్యమునేనుచెప్పుచున్నానువిను అత్తవారి మీఁద జగన్నాథరావుకు విస్తారము కోపముదెప్పిం

చుటకుమన మే దైనమంచియుపాయమాలోచింపవలయును.ఆదెబ్బతో జగన్నాథరావునకు మొగముతిరిగిపోవును. ఆలాగున మనమెత్తుకెత్తు వైచికార్యసాధనము జేసికొనవలయును. కాని వెఱ్ఱివానివలెతలవిరియ బోసికొని కేకలువయిచిగంతులువయిచియల్లరిచేసికొన్నందువలనలాభ ములేదు.మనలఁజూచినవ్వువారెకానిసాయముచేయువారెవ్వరులేరుమ నముపన్నినపన్నుగడ సరిగనున్నయెడలనాకీయత్తవారితోసంబంధము క్కఱలేదు. నాకీభార్యవద్దు. మఱియొకపెండ్లిచేయుఁడనివచ్చి మనకా ళ్ళమీఁదఁబడును. అదిమనమిద్దఱు మాలోచించినపక్షమున నటువంటి పన్నాగముమిక్కిలిసులభముగబన్నవచ్చును నిడదవోలువెళ్ళి నేనునా లుగుదినములలో తిరిగివచ్చెదను. ఈలోపుగ నీవువెఱ్ఱిపనులేమియుచే యక కొంచెమోపికపట్టియుండు ఉపాయములచేతసాధ్యములైనట్లుకా ర్యములు ఖడ్గవాదములచేత సాధ్యములుకావు నాతోఁజెప్పకుండనీవే వ్యవహారము జేయవద్దు. మాయప్పయిదివఱకె బెంగపెట్టుకొనియున్న ది. నీగడబిడజూచినపక్షమున నామె యేదైనతొందరపనిచేయునేమో యని భయమగుచున్నది. ఆఁడువాండ్రి సాహసములవారు వాండ్రి కునిదానముతక్కువ. నేను మరలవచ్చువఱకు నీవల్లరిచేయకుండుము. మహాకోపోద్దీపిత మయినయాతనిమనస్సుమీఁద మంటమీఁదఁబడిన నాలుగునీటిచినుకులవలె మరఁదిపలుకులు పనిచేయఁజాలకపోయెను. ఆ బొంగురువోయిన గొంతుకతోనె యాతిన్నగావినఁబడనిస్వరముతోనే యతఁడిట్లనియె. "రామలింగస్వామి తలతాకట్టుపెట్టిసొమ్ము తెచ్చియి చ్చునా! ఇచ్చుటకువానిదగ్గఱనేమున్నది వానిపిండము.వానికిరవంతప రపత్తైనను లేదు.మనదర్జాకుబొత్తిగాఁదగనివాడని తెలిసిననుషాహుకా రుగుమాస్తాతోవియ్యమందిబందలోఁబడితిని. ఆపాడుముండకొడుకు మాట నాతోఁజెప్పవద్దు వాఁడురూపాయలిచ్చినను నేనుపుచ్చుకొనను ఆ పాపాత్మునికూతురు నాయింటికి రావలనుకాదు. నాకొడుకుతో నది

కాపురముచేయ వలనుకాదు. దానిమొగమునాకుఁ గనఁబడఁగూడదు నీవేపన్నుగడ పన్నిననుసరే. ఏమంత్రముప్రయోగించిననుసరే. ఈలాగునజరుగువలెను." అనిగదిలోనికిఁబోయి తలుపులుబిగించుకొనిమంచముమీఁదఁబండుకొనియెను. మఱఁది చెన్నపురిలో జరిగినవృత్తాంతము సోదరితోఁజెప్పి మగనిదురహంకారమునకుగుమాగునిమౌఢ్యమునకుమిక్కిలివిలపించుచున్న సోదరిని సమయోచితములైనశాంతవచనములచేనూరార్చి మరునాఁడు బండిమీఁద నిడదవోలునకరిగెను. శంకరరాజుకోపావేశముజారువఱకుగదిలోఁబండుకొనియారాత్రిభోజనము సేయక మరునాఁడుదయమునగదివెడలివచ్చియొకవిధముగనెప్పటియట్లు వ్యవహారము సేయఁ జొచ్చెను.

అట జగన్నాథరావు మేనమామను సాగనంపితనగదికిఁబోయి పరుపుచుట్టకుఁజేరఁబడి మాతులసందేశమును దలఁచుకొనుచుఁ దనకుఁ దండ్రికిఁగల ప్రేమబంధము ముందుముం దెంతవఱకుఁ దెగిపోవునేమోయని విచారించుచుండెను. అప్పుడు కేశవరాజు వచ్చి "ఏమోయి! మీమామ వెళ్ళినాఁడాయేమి? నీముఖముమీఁద గొంతకాలమునుండి విచార మిల్లుకట్టుకొని కాపురముచేయుచున్నట్లున్నది. దానినిమనము దరికిఁ జేరనియ్యఁగూడదు. మీమామయేమిచెప్పినాఁడో నే నెరుఁగను గాని నీవాలకముచూడనతఁడు నిన్ను తీవ్రపుమాటలచేత నొప్పించినట్లు తోఁచుచున్నది. పట్టపరీక్షయందుఁగృతార్థుఁడవైననీకు ధైర్యకవచము దొడుగుకొమ్మనియు దుఃఖదేవతధాటికి వెరువవలదనియుఁ జెప్పనవసరములేదు. లేపి కారువెళ్ళుదము కందస్వామిసెట్టిసముద్రపుటొడ్డునకు వచ్చిమనసనిమిత్తము కనిపెట్టుకొనియుండును రా" యని పలికెను. అనవుడు జగన్నాథరావు "కేశవరాజు! నాపనియంతకంతకుఁజెడిపోవునేమోయని దోఁచుచున్నది. ఎంతస్తిమితముగానుంచుకొందమన్ననుమనస్సు నిలుచుటలేదు. నామనస్సు ధర్మాధర్మములుపోరాడు యుద్ధరం

గమయినట్లు కనఁబడుచున్నది. యుద్ధరంగ మెంతభయంకరముగానుం డునోనామనస్సిపుడంతభయంకరముగానున్నది. ఈఘడియవఱకు నేను ధైర్యము జిక్కబట్టియున్నాను. నామేనమామ మేమి చెప్పినాఁడోనీకువినఁ గుతూహల మున్నపక్షమునఁ గొంచెము చెప్పెదవిను" మని బదులు చెప్ప నపుడు కేశవరాజు నాకది యెరిగింపఁదగునేని నేను వినఁగో రుచున్నాను. ఎరిఁగింపఁగూడనివిషయమయిననీవుచెప్పనువద్దు. నేను వి ననువద్దు! గృహకృత్యములలో ననేకరహస్యము లుండవచ్చును. ఒకరి రహస్యమొకరు వినఁగూడ"దని ప్రత్యుత్తరమిచ్చెను. అప్పుడుజగన్నా థరావు మెల్లగా నిట్లనియె. "ఓయీ కేశవరాజు! నీకుఁ దెలియకుండ దాచఁదగిన రహస్యమున్నదా నాకు. నీదగ్గరదాచుట నాహృదయము నకు దాచుట, నిన్ను నమ్మకపోవుట నామనస్సును నమ్మకపోవుట నా హృదయములోనున్నయలమటనీకెరిఁగించినచోహృదయము తేలికయ గును.నాకాప్తబంధువుడవై ననుమిత్రుడవై ననునీవేకదా!నామామమా బాబయ్య పంపఁగా వచ్చినాఁడు రాయబారి. ఆతఁడు చెప్పిన మా టలన్నియుఁజెప్పి నిన్నువిసిగించుట నాకిష్టములేదు. అందుల సారాం శముచెప్పెదవినుము. మా బాబయ్యయొద్ద మన పురుషోత్తమరావు వారిబంధువులు రెండువేలరెండువందలరూపాయలువసూలుచేసినారు చిల్లిగవ్వ ఖర్చుచేయవలసినప్పుడు కూడ మాబాబయ్య యెంతకట కటపడునో నీవె యెరుగుదువుగదా. రెండువేల నెత్తుఱుబొట్లయినను మాబాబయ్యనిర్విచారముగనియ్యగలఁడుగాని రెండురూపాయలుచిత ముగ నియ్యసాహసించఁడు రెండురూపాయలిచ్చినచోనతని రెండుప్రా ణములుపోవును.అట్టిస్థితిలో రెండువేల రెండువందలరూపాయలుకష్టార్జి తములయినవి కఱుకులు తీసికొనివచ్చి యతఁడు గుమ్మరించినాఁడు. దానితో నతనిమతిపోయినది. ఇప్పుడు కేవలము పిచ్చివానివలెవ్యవ హరించుచున్నాఁడు. ఇది యొక యాశ్చర్యముకాదు. వెనుక రాబర్టు

క్షైవుముప్పదిలక్షలరూపాయ లిచ్చెదననిచెప్పి నమ్మించియామీ్రాచం దుసు జిట్టచివరకు మోసముచేసినప్పుడు మహాశాపిశాచగ్రస్తుఁడయిన యాకపటవర్తకుఁడు నఱికినచెట్టులాగున మూర్ఛపడి మూర్ఛదెలిసిన తరువాత మతిచెడి యాజన్మాంతము వెఱ్ఱివాఁడయి తిరిగెను.

ఆశ మనుష్యునకొకప్పుడు మహాబలమిచ్చును. అది భగ్నమ యినచోఁగలిగెడుదైన్య మింతింతకాదు. అసలుకథ విను! మనస్సు చెడిపోవుటచేత నతఁడు పిచ్చిపిచ్చిపన్నాగములు పన్నుచున్నాఁడు.నీ మీఁద నతని కఖండకోపమువచ్చినది. అతనికిప్పుడు రెండుసంకల్పము లుకలిగినవి. పోయినసొమ్ము సంపాదించుకొనుటయొకటి వల్లూరు వా రిని వంచించుటయొకటి. ఇందుకొక పన్నుగడ తలపెట్టినాఁడు. నాకు మరల వివాహముచేయఁదలఁచుకొన్నాఁడట. కట్నములరూపముగ సొమ్మునకు సొమ్మువచ్చును ఈరూపకముగ మీపైనున్న కసితీరును అత్తిలిలో నానిమిత్తమొక సంబంధమప్పుడే మాటలాడినాఁడటవారు మిక్కిలి భాగ్యవంతులఁట. ఒకకుఱ్ఱవాఁడున్నాఁడుగానివాఁడుమిక్కిలి జబ్బుగానున్నాఁడఁట. బ్రతుకఁడట. కూఁతు రొక్కతేయఁట వారి యాస్తియంతయుఁ నాకే కలియునట. మాటలు జరిగినవఁటతాంబూ లము పుచ్చుకొనుటే తరువాయియఁట. ఇందుకు నేనంగీకరించనిపక్ష మున మాబాబయ్య భూము లన్యాక్రాంతము జేయునఁట. నాకొక్క గిద్దెడుభూమియయిన నిలుపఁడఁట నామొగము జూడఁడఁట ఈగడ బిడఁజూచి మాయమ్మహోరున నేడ్చుచున్నదఁట ఏలాగైనఁ దండ్రి మాటవిని రెండోవివాహము చేసికొమ్మని మామామనన్ను బహువిధ ముల బ్రతిమాలినాఁడు అదేమిటోయి! నీవు తెల్లపోవుచున్నావేమి! నీమొగము కళావిహీన మగుచున్నదేమి ? పాపము! రాజరత్నముమె ఱుపుతీగవలె నీమనస్సులోఁ బాఱినదికాఁబోలు భయపడకు.నాయం దునీకు విశ్వాసములేదా? నామన స్సయోమయమని నీవెఱుఁగవా?

నీవేమిప్రత్యుత్తర మిచ్చితివని నన్నడుగకయే విచారమునకువిధేయుడ వయ్యెదవేల? ఏది యెటులైననుసరె. భాగ్యముండుఁగాక పోవుఁగాక తండ్రి యనుగ్రహించుఁగాక యాగ్రహించుఁగాక! నేను రెండవవివాహముమాత్రము చేసికొనఁజాలనని స్పష్టముగఁజెప్పితిని. ఆయన నాకెన్నో సాటువలు తెచ్చెను. అనవలసినమాటలన్నియుననెను ఏమన్ననేమి? నామన స్సినుపతునుకవలె నున్నది వంగదు. విఱుగదు అతనికి నామీఁద నెంతకోపమైనను వచ్చినది. దూతగావచ్చినమామకెయింత దురాగ్రహము కలిగినప్పుడు పంపినతండ్రి కెంతకోపమువచ్చునో నీవే యాలోచించుకొనుము నేను మాతాపితృవిరోధినయి మేనమామకుఁ గిట్టనివాఁడనయి బంధువర్జితుఁడనై యాస్తిఁగోల్పోయిభ్రష్టుడను గావలసినకాలమువచ్చినది. ఇందుకునేను విచారించుచున్నానని తలఁపకుము నేను ద్రవ్యహానికి భయపడువాఁడనగాను ఆస్తిపోయినను మరలరావచ్చును. ధర్మమొకసారి నష్టమైన మరలరాదన్నమాట నేనెఱుఁగుదును. ఇంతవఱకు నేనేలతరిమి చెప్పుచున్నా ననుకొందువో నీవన్యథా తలంతువేమోయని శంకించి యింతదూరము చెప్పవలసె ఇది యాత్మస్తుతి కవసరమయినకాలముకాదు. నేనపరాధముచేయనే లేదు. ఒకవేళ నేదియేని యపరాధము చేసియున్నను దండనము నే ననుభవింపవలెనుగాని యేయపరాధమెఱుగని రాజరత్నమనుభవింపనవసరములేదు. కాఁబట్టి నీమనస్సు శంకామలినము చేసికొనకయుండుము. నీవీసంగతి మీనాయనగారికి వ్రాయవద్దు. పదిదినములలో శీతకాలము సెలవులకు నీవింటికి వెళ్ళుచున్నావుకదా. అప్పుడైననువారితోఁ జెప్పకుండుట మంచిది. చెప్పఁదలచుకొన్న నప్పుడు చెప్పవచ్చునని జగన్నాథరావు పల్కుటయుఁ గేశవరాజు విషాదము సూచించుమొగముతో నిట్లనియె. "నీమనోనిశ్చయము నే నెఱుఁగకపోలేదు. నీమనస్సు వజ్రమువలెదు ర్భేద్యమైనట్లు నాకుఁదెలియును. రాజరత్నం

విషయములో నీవధర్మము చేయుదువని కలలోనైతము నే ననుకొనలే దు కాని నేను విచారపడినకారణము చెప్పెదవినుము. నీ తండ్రిగారి యిష్టప్రకారము నీవు మొట్టమొదటనే మఱియొక సంబంధముచేసికొన్న పక్షమున నీకిటువంటి యిడుములు సంభవింపకయుండునుగదాయనియు మాసంబంధము చేసికొనబట్టి విద్యాభంగము బంధువిరోధము మన స్సంతాపము మితిలేక కలుగుచున్నవనియు నేను విచారించుచున్నాను మీతండ్రియేవ్యవహారములో దిగిననునది తెగినదాకలాగి విడుచువాఁడు గాని సామాన్యుఁడుగాఁడు అతఁడు నిశ్చయముగనిన్ను సర్వశూన్యము జేయునేమోయని నేనుభయపడుచున్నాను." అనుచుండ నతనిమాట కడ్డముపోయి జగన్నాథరావు "కేశవరాజు! నామాటవిను ఒక మను ష్యుఁడు మఱియొక మనుష్యుని సర్వశూన్యుఁడుగాఁ జేయఁజాలఁడు. ఈశ్వరేచ్ఛ యెటున్నదో యట్లుజరుగునుగాని యన్యథాజరుగదని నాకు దృఢవిశ్వాసముగలదు నేను సర్వశూన్యుఁడనై వ్యర్థుఁడనై బో వలసినదని పరమేశ్వరుని సంకల్పమైనయెడలమీరు వేయిమందితలక్రిం దుగాగాఢతపస్సుచేసినను నన్నుద్ధరింపఁజాలరు. నేనుచ్ఛదశలోనికిరా వలసినదనిభగవంతునిసంకల్పమైనయెడలఁ బదివేలమందియైనను బహు ప్రయత్నములచేత నది రాకుండఁజేయఁజాలరు. తండ్రికి మహాగ్రహ ము వచ్చినను నెల్లతండ్రులకుఁ దండ్రియైన నీశ్వరునకాగ్రహము రాక పోయినపక్షమున నాకువిచారములేదు. ఆప్తబాంధవుఁ డీశ్వరుఁడెకా వున నాతనికి విరోధినికానిపక్షమున నెంతమందిబంధువులువిరోధులైన ను నేను లెక్కసేయను నేను మాతల్లివిషయమున మాత్రము విచా రించుచున్నాను ఆమె పరమసాధువు. మాతల్లియని నేనుచెప్పుకొనుట కాదుగాని యామె సద్గుణపుంజము. దురహంకారుఁడైననాతండ్రితో నామెకాఁబట్టి యింతకాలము వేఁగుచున్నది మఱియొకయాఁడుదియైన పక్షమున నాత్మహానియైనఁ జేసికొనియుండును కానియెడలనతనినివిడి

చిమైన వెళ్ళియుండును ఇప్పటికామె కేఁబదియేఁడ్లునిండినను దెబ్బలు తిట్లుతప్పలేదు ఇటువంటిభర్తతోఁ జిరకాలమామెసకలబాధలుపడిపడి మేను మనస్సుకూడచివికియున్నది నామీఁదనేయాశపెట్టుకొనియున్నది నేనామెకు దూరమైనపక్షమున నామె యేమిచేయునో యనిమాత్రము భయమగుచున్నది మాబాబయ్య నాయొద్దకామెను బంపఁడు నేనక్కడకుఁబోయినను జూడనియ్యఁడు. ఇదితప్పనాకు రెండవవిచారము లేదని పలికెను మాతృవిషయముననతఁడు పలుకునప్పుడు రెండు కన్నులనుండి రెండుబాష్పబిందువులె జాఱెను. మగవాఁడుకంటఁదడివెట్టుటగాంభీర్యమునకు వెలితియని యతనిమనంబునకుం దట్టుటచే కేశవరాజుచూడకుండనా బాష్పబిందువులనతఁడుగప్పదలఁచిమొగముదుడుచుకొనువంకను జేతిరుమాలులుతో నవి దుడిచివైచెను కాని కేశవరాజు బాష్పబిందువర్గము గనిపెట్టకపోలేదు కనిపెట్టి జగన్నాథరావుయొక్క మాతృభక్తియసాధారణమైనదనియునామె కేమికావలసిననదిచేయునని యుదెలిసికొనెను అటుపిమ్మట మాటలాడినయెడల విషాదముచేగద్గదకంఠమువచ్చునని జగన్నాథరావువిరమించియూరకుండెను అతనిస్థితి యెఱిఁగి యావిషయమై యేమియునెత్తక కేశవరాజు మిన్నకుండెను ఆవిధముగ వారిసంభాషణమప్పటికి సమాప్తమయ్యెను మఱినాలుగుదినములకు క్రిష్టమసు సెలవులు ప్రారంభమయ్యెను కేశవరాజు తప్పక పెనుగొండవెళ్ళవలసియుండెనుగానితనప్రాణమిత్రుఁడు, మరదియునగు జగన్నాథరావుతలిదండ్రులయొద్దకుఁగాని, దమయింటికిగాని, రాకవిదేశమున విషాదపూరితమనస్కుఁడై యుండఁగా తానింటికిబోయితలిదండ్రులయొద్ద సుఖముగఁ గాలక్షేపము సేయుట కెంతమాత్రమిష్టములేక పోయెను వెళ్ళుదునా మానుదునా యని యతఁడు పలుమారుసందేహించెను సెలవులియ్యఁగానె రమ్మని రామలింగస్వామిగారెన్నోజాబులువ్రాసిరి. వెళ్ళకతప్పదని కేశవరాజుజగన్నాథరావుతో నిట్లనియెను

"జగన్నాథరావూ! మాబాబయ్య నన్నురమ్మని యుత్తరము మీద నుత్తముర్రాయుచున్నాఁడు నిన్ను విడిచివెళ్ళుటకు నాకెంత మాత్ర మిష్టములేదు ఇప్పుడు నీమనస్సు విచారములపుట్టయైయున్నది అసహాయుఁడై యొంటిగానున్నవానిని శత్రువులు సులభముగ బాధించునట్లె తోడులేక మనుష్యుడొక్కఁడై యున్నప్పుడు విచారములు వానినివదలక పీడించును. రెండవవాఁడున్నప్పుడువిచారములుదరికిరావు ఈవిదేశములోనీవొక్కఁడవేయుంటివా నీవు మనోవ్యాధిచేఁ జెడిపోదువు కాఁబట్టి నీవు నాతోఁగూడ మాయూరికిరా. శాంతికాలేదు గనుక రాజరత్నమునుజూడఁగూడదుకదా, నేనెట్లు వత్తునందువేమో? అదినీకంటికగపడకుండ నేనుజాగ్రత్త పెట్టెదను నీవువచ్చినయెడలమాతల్లిదండ్రులు మిక్కిలిసంతోషింతురు నిన్ను దీసికొనిపోకుండవెళ్ళితినా మాబాబయ్యనన్ను చీవాట్లుపెట్టును. కాఁబట్టిమారుమాటచెప్పకనీవు రావలయునని నాకోరిక. నీసామానుసరుదుకో. టికెట్టుసొమ్ములేదని నీవనుమానింపనక్కఱలేదు. విశాఖపట్టణపువిద్యార్థులలో నాకిద్దరుముగ్గురు మంచిస్నేహితులున్నారు.వారిలోనెవరిదగ్గఱనయిన నాలుగైదు రూపాయలుచేబదులుపుచ్చుకొందును." అనవుడుజగన్నాథరావు కేశవరాజువంకజూచి "ఓయీ! నీకునామీఁదఁగల యఖండప్రేమకు నేను మిక్కిలిసంతోషించితిని. నాస్థితినీవెఱిఁగియుండియు నన్నిట్లురమ్మనిపిలుచుటన్యాయముకాదు. నాకునునాతండ్రికి ముఖ్యవివాదకారణము మీకుటుంబమేకదా! అట్టియెడనేను భీమడోలువెళ్ళకపెనుగొండవచ్చితి నామాబాబయ్యయొక్కక్రోధాగ్ని మీఁద నేయిపోయుటయే ఇదియాధారముచేసికొనిమాతండ్రి నన్ను మఱింత బాధపెట్టును. బంధువులుగూడనన్ను దూషింతురు కాఁబట్టినన్నిక్కడవిడచి నీవుపొమ్ము. నీవదృష్టవంతుఁడవు. ఈసెలవుదినములలోహాయిగా స్వగ్రామమునకరిగి తలిదండ్రులయొద్దనుండుటకవకాశముకలిగినది. అనుకూలముగానియన్న

ము పూటకూళ్ళయింటఁదిని విసిగియున్న నీకు మిక్కిలి ప్రీతిపూర్వకముగాఁగావలసినపదార్థములెల్ల మీయమ్మజేసిపెట్టఁ గడుపారభుజించి సుఖించుభాగ్యమబ్బును. సాయంకాలమప్పుడు పల్లెటూరిప్రీతస్నేహితులతోఁగలిసి పచ్చనిచేలనడుమషికారుచేసి గట్లమీఁద నించుక సేపుపచ్చగడ్డిచాపలపయిఁగూర్చుండియూచబియ్యముకొట్టుకొని తినునట్టియదృష్టమును శనగరొట్టయు పెసరరొట్టయు కందిరొట్టయుఁ దెచ్చికొనితం పటబెట్టుకొనేనే స్తకాండ్రితోనవ్వుచు వ్రేలుచుతినిసుఖించునట్టియదృష్టమునీకుపట్టినది అటువంటిభాగ్యమునాకుపట్టినదికాదు. ఎంతోదయతో నాదరించఁదలఁచుకొన్నతల్లికి నేనుదూరమైతిని. మరల నటువంటియదృష్టమునాకెన్నడుపట్టెనో తెలియదు కనుక నన్ను బలవంతపెట్టక నీవు వెళ్ళు. నానిమిత్తమునీవాగవద్దు. మనలో నెవఁడో యొకఁడయిన సుఖించుటమంచిది నాకష్టమునీకష్టముగా నెంచుకొనుచున్నావు. నీసుఖము నాసుఖముగా నెంచుకొనుచున్నావు నీవు పయనమైపొమ్ము" అని విచారముగాఁబలికెను. అంతకంటెనెక్కుడుగ బలవంతపెట్టినపక్షమున నతనిమనస్సునొచ్చునని కేశవరాజు మఱినిర్బంధము సేయక పయనమై పోవసమకట్టిజగన్నాధరావువిషయమున మనస్సు శంకించుచుండుటచే విశాఖపట్టణపు విద్యార్థులలోఁదనకు ముఖ్యస్నేహితులైనవారినిద్దరిని బిలిచి వారితోనిట్లుచెప్పెను. "నేనీదినమున మాయూరు పోవుచున్నాను. జగన్నాధరావునకును వానితండ్రికినిమనస్పర్థలుబయలుదేరినవని మీరువినియేయుందురు. అందుచేనతఁడుస్వగ్రామమునకుఁ బోవుటకు వీలులేదు అప్పుడప్పుడతనిమనస్సు గృహాకలహాముతలంచుకొని దీర్ఘవిచారము చెందుచుండును. గాఢవిచారముచేత జయింపఁబడినమనస్సు మనుష్యునిచేతనెట్టిపనియైనఁ జేయింపఁగలదుఅందుచేత నతనిక్షేమము విషయమై నేను భయపడుచున్నాను. అతనిని మీరుకనిపెట్టియుండవలెను. మనమందఱు మొక్కపూటకూళ్ళయింటనే భోజనముచేయు

చున్నాముగనుక నతనికొట్టుయొద్దకుమీరు రెండుపూటలుపోయి యతనిని భోజనమునకు దీసికొనివచ్చి కొట్టుకడకు మరలబంపవలయునని నాకోరిక. తీరికయైనప్పుడు మీరతనికొట్టునకుఁబోయి యేవోమాటలు చెప్పియతనిమనస్సు విచారాక్రాంతము కాకుండఁజేయవలయును వీలయినప్పుడతనికొట్టులోనే పండుకొనుటమంచిది ఆతనితోఁ గలిసిషికారువెళ్లుచుండుఁడు. మీకిది శ్రమయని నేనెఱుఁగుదును ఈసెలవులలో మీరుస్వగ్రామము వెళ్ళఁదలంచుకొనలేదు గనుకను మీరు నాకును, జగన్నాథరావునకును ముఖ్యస్నేహితులు గనుకను నతఁడువికలమనస్కుఁడైనాఁడుగనుకను వానివిషయమై మీకుఁగొంతశ్రమయియ్యవలసివచ్చినది. ఏవేళనెటువంటి బుద్ధిపుట్టునోయని శంకించుకొని మీతో నొక్కచెప్పుచున్నాను. 'మిత్రమాపదనీజాయా' త్తనిమనపెద్దలుచెప్పుదురు ఆపదవచ్చినప్పుడే మిత్రునియోగ్యత తెలిసికొనవలెను. ఇప్పుడతఁడొకవిధమైన యాపదలోనున్నాఁడుగనుక మీరుమిత్రధర్మమునిర్వర్తింపవలసినసమయమిది. మీతో నేను వేరుగాఁ జెప్పనక్కఱలేదు. మీరునాకభయమిచ్చి స్వగ్రామమునకు వెళ్ళిమన్నచో వెళ్ళెదను లేదా నేనిచ్చటనేయుండెదను. కొన్నివ్యవహారములుమిక్కిలితొందరగానుండుటచేతగాఁబోలు మాబాబయ్య త్వరగారమ్మని వ్రాయుచున్నాఁడు. మీరేమనియెదరు? వెళ్ళుదునావద్దా" అనవుడు మిత్రులు సరిసరి! దీనికింతయాలోచనేమిటి. సెలవుదినములుగదా కావలసినంత తీరికగదా మేముజగన్నాథరావువిషయమై కావలసినంత జాగ్రత్తపుచ్చుకొందుము. నీవునిర్భయముగా మీయింటికివెళ్లు" మని యెంతో యొత్తిపలికిరి, కేశవరాజు సంతుష్టమనస్కుఁడయి [illegible] జగన్నాథరావు కేశవరాజుతో స్టేషనువఱకుఁబోయి యతనినిబండెక్కించిబండికదలిపోవుచున్నప్పుడు మీనాయనగారికి [illegible] నమస్కారములుచెప్పుము. ఈవిషయమె వారినిచారపడవద్దనిచెప్పు

NARLA MEMORIAL LIBRARY
V.R. NARLA
D.P.R.I.
ACC. No.

మనిపలికెను. అంతలోబండికదలిపోయెను. జగన్నాథరావు తిన్నగాఁ బూటకూళ్ళయింటికిఁబోయి భోజనముచేసిబసకరిగెను. విశాఖపట్టణపు విద్యార్థులు తరువాత భోజనముచేసి యతనిబసకువచ్చి యతనియోగక్షేమమరసిపోయిరి. అదిమొదలుకొని వారుప్రతిదినము శ్రద్ధతోనొకప్పుడు రెండుపూటలువచ్చియు మఱియొకప్పు డేదోపూటవచ్చియు జగన్నాథరావుతోగొంతసేపుప్రసంగముచేసియుగ్రంథములుచదివియు షికారువెళ్ళియు దమమాటనిలుపుకొనిరి. జగన్నాథరావు వారితో గలిసిమాటలాడుచున్నప్పటికి గ్రంథములుచదువుచున్నప్పటికిషికారు వెళ్ళుచున్నప్పటికి నతనిముఖముమాత్రము దీర్ఘవిచారమును సూచించుచున్నట్లే వారికగుపడుచుండెను. అడిగినమాటలకతఁ డుత్తరముచెప్పునప్పుడుగొప్పసమస్యలకుత్తరముచెప్పినట్టుమిక్కిలియాలోచించి యతఁడుబదులుచెప్పుచుండుటచే నతనిమనస్సుస్థిరముగ లేదని వారుకనిపెట్టిరి. క్రిష్టమసుపండుగులలోఁ జెన్నపట్నమున దర్శనీయములయిన వేడుకలెన్నో జరుగుచుండును. నిరంతరపుస్తకపరాయణుఁడైన విద్యార్థియుసాయంకాలమునందైన నొకటిరెండుగంటలు వేడుకలం గనులపండువుగాఁగని వినోదింపకపోడు. కొందఱువిద్యార్థులావేడుకలు జూచునిమిత్తమే స్వగృహములకుఁబోక నిలిచియుందురు. నెల్లూరుమొదలగుదగ్గఱతావులనుండియేగాక రాజమహేంద్రవరము బెజవాడమొదలగుదూరస్థలములనుండియుఁ గొందఱు కుటుంబములతోనీముచ్చటలు జూడవత్తురు అత్తరినెన్నో నాటకసమాజములు చెన్నపురికివచ్చెను బళ్ళారినుండియు నెల్లూరునుండియు నాంధ్రనాటకసమాజములు తంజావూరు తిరుచునాపల్లినుండి ద్రవిడనాటకసమాజములు బెంగుళూరినుండి కర్ణాటకసమాజములువచ్చి పట్టణమందలి నానాభాగములందు నాటకప్రయోగములు చేయుచుండును. వీనికితోడుగనొకగొప్ప సర్కసుసమాజమువచ్చి కోతులచేత బెబ్బులులచేత సింహములచేత నేనుఁ

గులచేత మిక్కిలి యద్భుతములయినచేష్టలు చేయించుచుండును అ న్నియు నొక్కదినమందే ప్రదర్శనములు చేయుచుండుటచే చేతినిండ ధనముగలపడుచువాండ్రు దేనింజూచుటకుఁ బోవుదమాయని సందిగ్ధ మనస్కులై యన్నిటిం జూచుటకు వీలులేకపోయెఁగదాయని. విచా రించుచు నెట్టకేలకేదో యొకదానికడకుఁ బోవఁజొచ్చిరి కొన్నితావు లయందు మహావక్తలగువారి యుపన్యాసములు జరుగుచుండుటచే వీనులవిందుగా నవివినుటకు గొందఱరుగఁ జొచ్చిరి.

పార్థసారథిస్వామివారి కోవెలలో రాత్రిజరుగు కైంకర్యము లంజూచుటకుఁ గొందఱరుగుచుండిరి. మధ్యాహ్నములయందుజరుగు గుఱ్ఱపుపందెములు మొదలగువానిని సందర్శించిసంతుష్టులైకొందఱూ రకుండిరి. ఎట్లయిననుధనవంతులకును ధనహీనులకును నప్పుడు కావలసి నన్ని వినోదములుండెను. మొత్తముమీఁద దేనికోయొకదానికి పోని వారుమాత్రము సాధారణముగాలేరు. ఆదినములలో నుత్సవపరాఙ్ము ఖమైనజంతు వొక్కటేకలదు. ఆజంతువెవరన్న మందభాగ్యుఁడైన మనజగన్నాథరావు ఆవేడుకలఁ జూచుటకురమ్మని యతనినిమిత్రు లెంతో బలవంతపెట్టిరి ఎంతనిర్బంధనచేసినను నతఁ డయ్యకొనలేదు విమనస్కుఁడైనవానికి వేడుకలపై దృష్టినిలుచునా? ఏవేడుకజూడవల యుననియు, నేగానమువినవలెననియు, నేస్థలమున కరుగవలెననియు నేపదార్థము తినవలెననియు నెవ్వరితోమాటలాడవలెననియు నతనికిఁ గోరికయేలేదు. ధనహీనతయొక్క కారణమేకాని యదియొకటియే కా రణముకాదు. నిష్కారణముగఁ దండ్రితో వైరముసంభవించుట తన మీఁదనే ప్రాణములుపెట్టుకొనియున్న తల్లికి దూరమగుట యెదిగిన భార్య తనమూలమున బుట్టినింటఁబడి వగచుచుండుట ధనములేకపో వుట మొదలగునవన్నియు నతనిని బీడించెను.

కేశవరాజు నిడదవోలుదగ్గఱ రైలుబండిదిగి పడవయెక్కెను

గొండ సురక్షితముగఁజేరెను. తలిదండ్రులు ప్రియపుత్రుని రాకకు మిక్కిలిసంతోషించిరి. రాజరత్నముగూడఁ అన్నయ్యా! వచ్చితివా' యని మెల్లగానడిగెను. చెన్నపురినుండి కేశవరాజుమునుపు సెలవులలోనింటికి వచ్చినప్పుడు రాజరత్నమతనికెదురుగాఁబోయి అన్నయ్యా నాకేమి తెచ్చితివని యడుగుచుండును. ఈసారియట్లడుగలేదు. ఆమెముఖము వెనుకటివలె హెచ్చరికయు సంతోషమును సూచించుటలేదనిప్రథమ సందర్శనమువలననే కేశవరాజు కనిపెట్టికారణమూహించుకొనెను "జగన్నాథరావు నెమ్మదిగనున్నాఁడా నాయనా" యని తల్లియడిగెను ఆ మాటకుత్తరము చెప్పులోపలనే "నీతో నతనినెందుకు దీసికొనివచ్చితివికా" వని తండ్రియడిగెను "అతఁడు సుఖముగానెయున్నాఁడు సెలవు దినములలో నక్కడనేయుండి చదువుకోవలెననియతఁడు నాతో రాలే" దని బదులుచెప్పి సామానుగదిలోఁబెట్టి తాను కాల్యకృత్యములఁదీర్చి కొని తన్నుఁజూడవచ్చినమిత్రులతోనతఁడు మాటలాడఁ జొచ్చెను. చెన్నపట్టణములో బూటకూళ్ళయింటనొక్కనాఁడైనదనకొడుకిష్టమైన వస్తువులతోఁ గడుపునిండఁ దినియుండఁడని యతఁడువచ్చునని తెలిసిన తోడనె యతనికిమిక్కిలి యిష్టములని యప్పడములు బూడిదగుమ్మడివడియములు వట్టిమినుపవడియములు నీరుల్లిపాయవడియములు పిండివడియములు, మొదలైనవి సిద్ధముచేసి యుంచినందున నాఁడామె వేగముగ మడికట్టుకొని రాత్రికుమారునకు భోజనములేనందున నప్పడములువడియములువేయించి వెచి మెంతికాయయునావకాయయు వడించి తాను విస్తరిదగ్గఱకూర్చుండి యదికలుపుకొమ్మనియిదికలుపుకొమ్మని బలవంతముసేయుచు ప్రత్యేకముగ నతనినిమిత్తము గాచియుంచిన కమ్మనినేయి వడ్డించుచుఁ జిట్టచివర మిక్కిలికమ్మగఁ దోడుపెట్టిన గట్టిగేదెపెరుగువడ్డించెను. కేశవరాజు మిక్కిలియభీష్టము లగు పదార్థములతోఁగూడినయన్నమమృతమువలె భుజియించి సంతుష్టుఁడయ్యెను

తండ్రి షాహుకారుకడకరిగి రెండుజాము లైనతరువాతవచ్చి భుజించెను. రాత్రిబండిమీఁద నిద్దురలేకపోవుటచేఁ గేశవరాజుభోజనానంతరమునఁ బండుకొని జాముప్రొద్దువేళలేచెను తండ్రి యప్పటికి మరల షాహుకారుకడకుఁబోయెను నిద్ర మేల్కనునప్పటికి మిత్రులతనిం జూడవచ్చినందున వారితోఁగలిసి ప్రసంగించుచు నతఁడాదినము గడపెను నాఁటిసాయంకాలమతఁడు షికారువెళ్ళలేదు.తండ్రియునాఁటి రేయి పెందలకడ నింటికివచ్చి కొడుకుబంతిని భుజించెను. రాజరత్నము తల్లి కాపనియు నీపనియుఁ జేసి పెందలకడ భోజనముచేసిపండుకొనెను, భోజనములయినతరువాత రామలింగస్వామియుభార్యయుఁగుమారునియొద్ద కూర్చుండిచెన్న పురపువార్తలనడుగఁజొచ్చిరి. అప్పుడుప్రసంగవశమున రాజరత్నముయొక్కమాట రాఁగాఁ గేశవరాజు వారికిట్లనియె "రాజరత్న మేలాగో యున్నదెందుచేత! దానిదగ్గఱమునుపటి హెచ్చరికలేదు చెన్నపురినుండినేను రాగానే యాపట్టణమునుగురించియు నందలి విచిత్రపువస్తువులను గురించియు వందలకొలఁది ప్రశ్నలువైచి నన్ను విసిగించుచుండును ఈసారి నాదగ్గఱకువచ్చి కూర్చుండనేలేదు, క్రొత్తవానితోను బావగారితోనుమాటలాడినట్లునేనడిగినమాటకుమాత్రమే సమాధానము చెప్పుచున్నది. పూర్వమదియెంతో పరిశుభ్రముగానుండునది కట్టినచీరె మాయనీయదు నేఁడేమో మాసినచీరెకట్టినది తలరోజుకు రెండుసారులు దువ్వుచుండును నేఁడు తలదువ్వినట్లేకనఁబడదు పుస్తకము చదివినజాడలేదు ముద్దబంతిపూవులు దానికెంతోప్రియమైనవి. ఆపువ్వులు పూచినంతకాలము తలలోఁబెట్టుకొనకమానునదికాదు ఆపూలకేసి చూచినట్లేకనఁబడదు కుట్టుకుట్టుట దానికెంతో సరదా. వెనుకనేను వచ్చినప్పుడు రాత్రిదీపము వెలుఁగునఁగూడ ప్రొద్దుపోయినదాక నేదోకుట్టుచు నడుమ నేవోపాటలుపాడుచు అన్నయ్యా! ఈపాట విన్నావా ఆపాటవిన్నావాయని నాకాపాటలుపాడి వినిపించుచు సం

తోషమవతరించినట్లుకనఁబడుచుండెడిది. ఇప్పు డా యుత్సాహమే లేదు ఆమెముఖవిలాసమె మాఱిపోయినది. ఏదోసంసారపు గొడవచేత బాధపడుచున్నదానివలె నున్నది. దీని కేమికారణము? నేఁడుదయమున మీరుదానినేమైనచీవాట్లుపెట్టినారాయేమి? పనిచేసినప్పుడుచేసితక్కిన సమయములందు దీర్ఘాలోచనచేయుచుఁ గూర్చుండును ప్రతిదినము వీలాగుననే యున్నదా నేఁడేదియైన నొకకారణముననున్నదా? ఉదయమునుండియు నామనస్సు దానిమీఁదనేయున్నది అదినిద్దురపోయి నతరువాత మిమ్మడుగవచ్చునని యూరకుంటిని అదియిప్పుడునిద్దురపోయినదిగనుక కారణమేమో సాంగముగా నాకుఁజెప్పు"మని యడుగ "నాయనా! మీబాబయ్యగారు దానిసంగతి చెప్పఁగలరు విను. ఇంతకు మనరోజులు మంచివికా"వని తల్లి కంటఁదడివెట్టుకొనెను అప్పుడు రామలింగస్వామి "ఓసి! తెలివితక్కువదాన ఊరక ముందుగ నేడ్చెద వెందుకు? ఏడుపులతోఁ గార్యసాధన మగునాయేమి? ఊరుకోఊరుకో నీయేడుపుమూలముననే పిల్ల బెంగపెట్టుకొన్నది"యని మందలించికొడుకునకు మఱింతదగ్గఱగఁజేరి మెల్లగా నిటులచెప్పెను "నాయనా! యేమని చెప్పుదును శంకరరాజు జగన్నాథరావునకు రెండవపెండ్లిసేయునని యూరంతట పెద్దగోలగ నున్నది మనచుట్టాలెవరు నాకగపడినను ముందు నాకిదేమాట. ఏమయ్యా! మీయల్లుఁడు రెండవపెండ్లిచేసికొనుటకు ప్రయత్నము సేయుచున్నాఁడఁట యని ప్రతివాఁడడుగుచున్నాఁడు. నన్నే కాదు అమ్మలక్కలందఱు మీయమ్మనుగూడనట్లే యడుగుచున్నారు. నాకుఁ దెలియదునాయనా! మాకుఁదెలియదమ్మా యని జవాబుచెప్పలేక నోరునొప్పియెత్తుచున్నది. మమ్మడిగి యూరకుండినబాగుండును. కాలువకువెళ్ళినప్పుడుకుఱ్ఱదానినికూడ నలుగురు ముగ్గుతుపిళ్ళిచి "ఏమే! రాజరత్నము నీమగఁడునిన్ను విడిచిపెట్టి రెండవ పెండ్లిచేసికొనఁదలఁచుకొన్నాఁడఁట నిజమేనా?" యనియడిగినారఁట.

ఆపలుకులువినఁగానె దానికొడలు తెలియలేదఁట ఏలాగోయొకలాగిం టికివచ్చి తల్లితోఁజెప్పుకొని యేడ్చినదఁట అదిమొదలుకొనియీవిధ ముగానున్నది ఎన్నిచెప్పిననువినదు అన్నము సరిగాతినదు పలువరించి నిద్దురలోనెన్నో సారులేడ్చును పూవులక్కఱలేదు పుస్తకము లక్కఱ లేదు పాటలక్కఱలేదు పద్దెములక్కఱలేదు తాను జతకత్తెలిండ్లకు వెళ్ళదు వాండ్రువచ్చినప్పుడు సరిగ మాటాడదు ఎదిగిన పిల్లగనుక బెంగపెట్టుకున్నది ఏవిధమైన విచారములేకుండ బంతిలాగున నుండవ లసినయీడున దానిమీఁద పెద్దబెడదవచ్చిపడినది తెలివితక్కువపిల్ల గాదు అన్నిసంగతులదియెఱుఁగును ఎదుటివారిమొగముఁజూచిసంగతి గ్రహింపఁగలదు. నాయనా! మహాలక్ష్మిబాగున్న పిల్ల. దీని సంగతి యేమగునోయని నాకుఁగూడ బెంగపట్టినది రాత్రి తిన్నగా కునుకుప ట్టదు పిల్ల సౌఖ్యపడదని యొకబెంగ మగఁడువదలినాఁడనఁగానే య ప్రతిష్టవచ్చునని యొకబెంగ. లోకములో నెన్నో వాడుకలున్నవి సం బంధము నిశ్చయమైనదనియొకరు ముహూర్తము నిశ్చయమైనదని కొందఱు, రేపోనేఁడోతరలివెళ్ళుచున్నారనికొందఱు, వివాహమైనదని కొందఱు పరిపరివిధముల నోటికివచ్చినట్లు చెప్పుకొనుచున్నారు ఆ మాట విన్నప్పుడెల్ల గుండెగుభేలుమనుచుండును అత్తిలిలో నేదోసం బంధము కుదిరినదఁట జగన్నాథ రా వెక్కడున్నాఁడు? అతఁడుతండ్రి మాటవిని వివాహముచేసుకొనుటకు సిద్ధముగానున్నాఁడా? ఎవరితండ్రి మాట యెవరువినరు. తండ్రి కలియుగరావణాసురుఁడు. రావణాసురు నికి పదితలలున్నవికాని శంకరరాజున కిరువదితలలున్నవి, రావణాసు రుని కిరువదిచేతులున్నవిగాని యితనికినూరుచేతులున్నవి. అతనితో నెవ్వఁడు బోరాడలేఁడు. చేయఁదలఁచుకొన్నాఁడా యాపనిచేసినాఁడే అతనిందలఁచుకొన్నప్పుడు నాగుండెఝల్లుమనును. నామాటనీవునమ్ము దువోలేదో నాయనా కలలోఁగూడ శంకరరాజే కనఁపడుచున్నాఁడు.

నాయనా! దీని కేమిగతి? జగన్నాథరావు తిరిగివివాహము చేసికొన్న ప క్షమున మీతల్లితోఁగూడ నేను గంగాప్రవేశముకావలసినదే. అతని వైఖరియేలాగున్నది? పెండ్లినిశ్చయమయినదా? దాఁచకనాదగ్గఱ య దార్థముచెప్పు బాబూ?" అని దీనముగాఁ దనసంభాషణముముగించిభా ర్యనుజీవాట్లుపెట్టి పలికిన ధైర్యవాక్యములుమఱచి కన్నులనుండి బాష్ప ములు విడిచెను. అదిచూచి కేశవరాజుతల్లియునట్లేచేసెను. కేశవరా జు తల్లినూరడించి తండ్రిమొగము తనచేతితోఁబైకెత్తి "బాబయ్యా! ఏమిటిది. పిచ్చియెత్తినదానీకుఁగూడ. అమ్మను జీవాట్లుపెట్టిన వాఁడవు నీవు చేయుచున్నపని యేమిటి? ఆడువాండ్రకు ధైర్యముచెప్పుటకుముం దుగా నీవే రాగములు మొదలుపెట్టితివా? ఇందుమనకు వచ్చినభయము లేదు. జగన్నాథరావుసంగతి మీరెఱుఁగరు. అతఁడల్లరిచిల్లరివాఁడు కాఁడు ఆతఁడు మిక్కిలిగంభీరుఁడు. ఆతనిమనస్సు వజ్రపుతునుక. బలవంతములగు బెదరింపులకు ప్రార్థనలకు లొంగునట్టిదికాదు. ప్రపం చము తలక్రిందయినను సరె, రెండవవివాహముచేసికొననని యతఁడు పట్టుపట్టికూర్చున్నాఁడు. అత్తిలిలోశంకరరాజుసంబంధముమాటలాడి నమాటనిజమె. ఆసంబంధ మొప్పుకోవలసినదని తండ్రిజగన్నాథరావు దగ్గఱకు మేనమామను బంపినాఁడు. జగన్నాథరావుకొంచెమైననువం గలేదు. మేనమామను గడ్డిపఱకవలెఁ జూచినాఁడు. ఆస్తినంతయు న న్యాక్రాంతముచేయుదునని తండ్రిబెదరించుచున్నాఁడు. దత్తపుత్రిస్వీ కారముచేసికొందునని భయపెట్టుచున్నాఁడు. ఈబెదిరింపులనుబ్రహ్మ స్త్రములెన్నిప్రయోగించినను జగన్నాథరావు చెక్కుచెదరకపర్వతము లాగున్నాఁడు. ఆవిషయమయి మీరు బెంగపెట్టుకొన నక్కఱలేదు. ఈసంగతి మీరు రాజరత్నముతోఁజెప్పి దానికిధైర్యముకలిగించండి నేనుండఁగాదానికి భయములేదు. జగన్నాథము నామాటదాటిపోఁడు ప్రొద్దుపోయినది. ఇఁకపండుకొందము. వెళ్ళుఁడి" యనినొక్కిచెప్పెను

అతనిసంభాషణము ముగియఁగానె రామలింగస్వామికుమారునిఁగౌఁగిలించుకొని "నాయనా నన్నురక్షించినావు. కొంపనిలువఁబెట్టినావు" అని కొడుకును ముద్దుపెట్టుకొనెను. తల్లియు నట్లేచేసెను. తరువాత వారు నిద్రింపఁబోయిరి.

మఱునాఁడుదయమున రామలింగస్వామియు భార్యయుదుఃఖభారముఁ దొలఁగింపఁబడుటచేఁ దేలికగానున్న హృదయములతో లేచిరి. రాజరత్నము మాత్రమెప్పటియట్లేలేచెను. తల్లి కుమార్తెకుఁ దలదువ్వుచు రాత్రి కేశవరాజుచెప్పినవృత్తాంతమంతయు సవిస్తరముగఁ బుత్రికతోఁజెప్పి యిట్లనియె.

"అమ్మాయి! ఇఁక నీవువిచారింపనక్కఱలేదు. జగన్నాథరావు బుద్ధిమంతుఁడు. మఱియొకలాగునఁ చేయఁదలఁచినవాఁడుకాఁడు. ఎప్పటిలాగున నీవు హెచ్చరికగానుండు. అయినప్పటికి చిన్నపిల్లవునీవు. నీకెందుకే యీగొడవలు. అటువంటిగొడవలు పెద్దవాళ్ళను మేము చూచుకొని సర్దుకోఁగలము. మునుపటిలాగున హెచ్చరికగా లేవని అబ్బాలు యెంతోవిచారించినాఁడు. అన్నయ్యతోనీవుసరిగా మాట్లాడనేలేదఁట "పాటలుపాడదు కుట్టుకుట్టదుమాటలాడదునవ్వదుముఖము ముడిచిపెట్టుకొని యున్నదే" మనిఅబ్బాయియెన్నియోవిధములనన్ను మీనాన్నను అడిగినాఁడు. కాఁబట్టి నీవు సుఖముగానుండు. పరీక్షఅయిపోయినతరువాత జగన్నాథరావిక్కడికి వచ్చును. అన్నయ్యతీసికొని వచ్చి మన సందేహములు పోగొట్టఁగలఁడు."

ఆమాటలు విని రాజరత్న మూరకుండెనుకాని యామెహృదయముదుఃఖభార వివర్జితముకాదయ్యెను. మధ్యాహ్నము మొదలుకొని యామె యన్నగారితోఁ గ్రమక్రమముగ నెప్పటియట్లఁ బలుకఁజొచ్చెను. రాజరత్నమునకు సాధారణముగారానిపాటలు లేవు. మగవాండ్రవలె నామెయర్థజ్ఞానము గలిగిభారతభాగవతములురసములుట్టిపడఁజదువఁగ

లదు. ఆఁడువాండ్రుపాడెడుపాటలన్ని యుఁబాడగలదుచిన్ననాఁటనుండి యుఁగేశవరాజునకు శాంతాకల్యాణము, ధర్మరాజులవారిజూదము, గోవిందనామములు, దక్షునియజ్ఞము, కుశలవకథ, కృష్ణునిచద్దులుమొదలగునవి మిక్కిలియిష్టము. మధ్యాహ్నభోజనమైనతరువాత నతఁడాపాటలు చెల్లెలిచేతపాడించుకొనివిని సంతోషించుచుండును. రాత్రులు గజేంద్రమోక్షము, ప్రహ్లాదచరిత్రము, వామనావతారఘట్టము, కుంతీస్తవము, భీష్మస్తవముఅంబరీషోపాఖ్యానము, ధృవోపాఖ్యానము మొదలగునవిచదివించివిని యానందించుచుండును. తాను పాడినపాటల వినియుఁ దాఁజదివినపురాణకథల నాలించియు సోదరుఁడు సంతుష్టుఁడైన పిదప రాజరత్నము సోదరునితో "అన్నయ్యా! ఇంగ్లీషులో భాగవతము భారతమువంటి పురాణములున్నవా? ఇంగ్లీషులో నున్నచమత్కారకథ లేవయినఁజెప్పఁగలవా" యని యడుగుచుండును. అడుగుటయుఁ గేశవరాజాంగ్లేయభాషలోఁగూడఁగొన్ని మహాకావ్యములు కలవని చెప్పి గాఢదేశాభిమానియు, శూరశిఖామణియునైనరాబర్టుబ్రూసుయొక్కయు, ఫ్రెంచికన్యయు, ఆర్కుపురవాసినియునైనజోనుయొక్క చరిత్రయు, ఆమెరికాఖండముఁ గనిపెట్టిన కొలంబసుయొక్కవృత్తాంతము, సోక్రటీసుయొక్కయుదంతము, యేసుక్రీస్తుమొదలగుదివ్యపురుషులచరిత్రములుఁ జెప్పిచెల్లెలిమనంబున కత్యంతసంతోషముగలిగించుచుండును కేశవరాజుసాయంకాలములయందుఁబ్రాణస్నేహితులనుగూడి యొకసారి కాలువగట్టునకు షికారుబోవును. ఒకసారి కన్యకాపరమేశ్వరీదేవాలయమునకరిగి యాదేవతనుపాసించుటకువచ్చువైశ్యులభక్తిప్రపత్తులజూచిసంతోషించుచుండును ఒకమారుపొలములలోనికిషికారుపోయి యెత్తుగావైవఁబడియున్న ధాన్యపుకుప్పలనునూర్చబడుచున్నకుప్పలనుజూచివినోదించుచుండును. ఒక్కొక్కసారి జొన్నచేలనడుమఁజేలగట్లమీఁదనడుచుచు జగన్నాథరావు మున్ననినట్లుకమ్మగనూచ

బియ్యముగొట్టుకొనితినుచు శనగరొట్ట కందిరొట్టయనపరొట్టమున్నగు నవితంపటవయిచికొనితినుచు నతఁడుతనప్రక్కను లేనందుకువిచారించు చుప్రొద్దుపోయినతరువాతనింటికివచ్చుచుండును. సంక్రాంతినెలయదివ అ కెపట్టబడియుండుటచేనుదయమునపల్లెటూరిపడఁతుకలుమిక్కిలియో పికతోఁ బెట్టురథముపట్టు, వైకుంఠముపట్టు పాముపట్టు మొదలగుముగ్గుప ట్లును మ్రుగ్గుపట్టుకడనుండిమఱియొక మ్రుగ్గుపట్టువరకుఁదీర్చినమ్రుగ్గుపగ్గము లును జిన్నకన్నియలు ముద్దబంతిపువ్వులును రేకబంతిపువ్వులును జేమం తిపువ్వులును గుమ్మడిపువ్వులును గ్రుచ్చిపెట్టెడు పేడగొబ్బిళ్ళును వానిక న్నులకుఁబండువుచేసెను. అదిధనుర్మాసమగుటచే నుదయమున రమార మి యెనిమిదిగంటలు మొదలు మధ్యాహ్న మొంటిగంటవఱకు దేవతో త్సవములుజరుగుచువచ్చెను. గ్రామమందలిపెద్దమనుష్యులు వంతులప్ర కారము దినమునకొక్కొక్కరుగావ్యయముభరించుకొని దేవతోత్సవ ములుజరిపిరి. సంపన్నులయినవారుపెందలకడ ధనుర్మాసభోజనముచేసి బోగము మేళముతోఁగూడ స్వామినూరేగించితానవిలువగలదుస్తులధ రించిముచ్చెలోకిట్టుచెప్పులోతొడిగికొని గుడ్డగొడుగులువైచికొనియిం టింటికడనిల్చి మేళముచేయించుచుగొప్పవారిండ్లకడమఱింతసేపెక్కువ నిలుచుచు మేళమునకువెనుక నిలిచియంగుచేయుచున్న బాలవేశ్యలను వృద్ధవేశ్యలనబిలిచి గజ్జకట్టుమని యాజ్ఞాపించుచు గజ్జకట్టియాఁడుచు న్నదానింబిలిచి "ఆజావళీపాడు ఈజావళీపాడు' మనియాజ్ఞాపించుచుమా ర్గమధ్యమునఁగనఁబడినవారినెల్లరఁదమవెంటరమ్మని చేయిపట్టిలాగుచు దైవభక్తి వెల్లడిసేయఁజొచ్చిరి. ఒకరిద్దఱుషాహుకారులుత్సవములుఁజే సినప్పుడు కేశవరాజునురమ్మనిబలవంతపెట్టిరికానియతఁడు దేవతోత్సవ సమయములందు వేశ్యానృత్యగానము లుండఁగూడదనుసిద్ధాంతమున మ్మినవాఁడగుటచేవారెంతబలవంతపెట్టిననునూరేగింపునకరుగక మేళము లులేనియుత్సవములకే నాలుగుమూఁడుసారులుపోయియాయుత్సవము

లుచేయించినవారిని సంతోషపెట్టెను. తాము చేయించినయుత్సవము లను సందర్శించుటకుఁ గేశవరాజు రానికారణమునసంపన్నులైనయా షాహుకారులు మేళములోనికివచ్చినంతమాత్రముచేతనే మనుష్యులు పాడగుదురుకాఁబోలు? మనమందఱము పాడైనామా? ఈయనమడిక ట్టుకొని కూర్చున్నాఁడుకాఁబోలు! ఈయన బోగమువాళ్ళమొగమైనఁ జూడఁడఁట! ఈయన బోగమువాళ్ళున్న గ్రామములోనేలేకుండవెళ్ళిపో యినబాగుండును. బోగమువాళ్ళున్న లోకములోనేలేకున్న బాగుండును ఈయన చదువుకొన్నాఁడట ఎందుకీయనచదువు తగులఁబెట్టనా? దే వేంద్రునిసభలోకూడ బోగమువాళ్ళున్నారు రంభయెవరు? మేనక యెవరు? చదువుకోఁగానేసరియా. తెలివితేటలుండవలెననిచాటుననినిత్తే పించుచు నెట్టయెదుటఁ గనఁబడినప్పుడు "ఏమండో! నవనాగరికులు ద యచేయండి" యని వేళాకోళమాడఁజొచ్చిరి. కేశవరాజువారిమాటలకు గోపింపక ఓహోవేశ్యాప్రియులాయని పరిహాసముఁ జేయుచుండును.

ఆసెలవుదినములలో జగన్నాథరావునొద్దనుండి రెండుసారులు జాబులువచ్చెను ఆజాబులవలననతఁడు సురక్షితుఁడై యున్నాఁడనివిని రాజరత్నము మిక్కిలిసంతోషించి యెప్పటినిర్మలమనస్సుతోనవయౌ వ్వనోచితముఖలావణ్యముతో వెలయుచుండెను తలిదండ్రులహృదయ ములుప్రమోదభరితములయ్యెను సెలవుదినములయిపోయెను. కేశవరా జుచెన్నపురమువెళ్ళవలసివచ్చెను. కుమారుని తలిదండ్రులు విడువఁజా లకమిక్కిలి సంతాపమొందిరి. పండుగవెళ్ళినదాకనీవుండఁగూడదానా యనాయనిసహజమాతృవాత్సల్యముచేతఁదల్లియడిగెనుగానికళాశాల పండుగులోపుగానె తెఱువఁబడుననియు వెంటనేచేరవలెననియునతఁడు చెప్పియామెనేదోవిధముగా సమ్మతింపఁజేసిబయలుదేఱెను రాజరత్న ముపీఠిగుమ్మమువఱకుఁబోయి యన్నగారిసిసాగనంపిఅన్నయ్యా! భాగ వతము చెన్నపట్టణములో ముద్దులుమూటగట్టునట్లు క్రొత్తగానచ్చువే

సినారంట నీదగ్గఅడబ్బుసర్దినపక్షమునను నాకాపుస్తకమొకటికొనితీసికొ నిరా! డబ్బుసర్దకపోయినపక్షమున నానిమిత్తము బదులుచేయవద్దుకొ నలేకపోతినని విచారింపవద్దు ఇప్పుడునాదగ్గఅప్పుస్తకమున్నదికానిప్పుస్త కమునిండతప్పులే. చదువుకొనుటెంతో కష్టముగానున్నది అనిచెప్పెను "అమ్మా.తప్పకతెచ్చి పెట్టెదనులే"యని యతఁడుబదులుచెప్పివెళ్ళెను

అప్పడములు వడియములుఆవకాయమెంతికాయ చీనారేకుడ బ్బాలలోవైచి తల్లియిచ్చెను. తినియెడువస్తువులుకనుక నవిశూద్రులు పట్టుకొనఁగూడదని తండ్రియాడబ్బాస్వయముగాఁబట్టుకొనిపడవదగ్గఅ కుగొడుకుతో స్వయముగాఁబోయితండ్రిపడవయెక్కించిపదిపర్యాయము లుజాగ్రత్తజాగ్రత్తయని జెప్పి "వారమున కొకయుత్తరము వేయినాయ నా! జగన్నాధరావునీక్షేమమువినకపోయినపక్షమునమాకుఁదోచ"దని పలికితండ్రితిరిగివచ్చెను. కేశవరాజుమరునాడుదయముననిడదవోలులో బడవదిగి మధ్యాహ్నమక్కడపూటకూళ్ళయింటిలో భోజనముచేసినా లుగుగంటలకుఁజెన్నపురికిఁబోవు మెయిలుబండిమీఁదనెక్కి వెళ్ళెను.

కేశవరాజు వచ్చునని జాబులవలనముండే తెలిసెనుగనుక జగ న్నాధపురా స్టేషనుకువచ్చి కేశవరాజుంగలిసికొనిబసకుఁదోడ్కొనిపో యెను ఆపగలంతయుఁ గేశవరాజు పెనుగొండలోనివిశేషంబులుచెప్పు చుజగన్నాధరావునలరించెనుచెన్నపట్టణపువిశేషములేవని కేశవరాజు జగన్నాధరావునడిగెనుకాని యతడిట్లనియె కేశవరాజు! చెన్నపురివిశే షములు పెనుగొండలోనున్న నీకెంతదెలియునో నాకునంతే తెలియును నేను కొట్టుకదలలేదు వార్తాపత్రికలయినఁ జదువలేదు. సముద్రపు టొడ్డునకయినఁబోవలేదు. వంటపూటియిల్లేమొనాకొట్టేమొ. దరిద్ర గొట్టులకుకొట్టేస్వర్గముకొట్టేమోక్షముకదా!నీవదృష్టవంతుఁడవుకనుక స్వగ్రామమునకుఁబోయి తల్లిదండ్రుల యాదరణముఁబడసి తల్లిపెట్టిన యమృతోపమానమైన యన్నముభుజించి చెల్లెలిపాటలంజొక్కిచిన్న

నాఁటిచెలిమికాంద్రసరససల్లాపములఁదనివినొంది బంతిపూలుధరించిన గ్రామలక్ష్మి సౌందర్యముఁజూచిభూలోకస్వర్గమనుభవించివచ్చితివిమందభాగ్యుల కవియెట్లుచేకూరును? హృదయము తేలికగానున్నప్పుడు వేడుకలులేనితావైనను నుల్లాసముగలిగించును హృదయము విచారభారమున నడఁగియున్నప్పుడు చెన్నపట్టణమేకాదులండనుపట్టణముప్యారిసుపట్టణము మొదలైనవి కూడ నుల్లాసమును గలిగింపలేవు మనమనస్సులు నిర్విచారములై లఘువులై యున్నకాలమున సముద్రపుటొడ్డే మనకెంతో యానందము గలిగించినది ఇప్పుడు వైకుంఠమైనను నాకానందము గలిగింపఁజాలదు అందుచేత నేనేవిశేషములు నీకుఁజెప్పఁజాలను

అనవుడు గేశవరాజొక్కనిమేషము మాటలాడకయూరకుండి యావిషయమైమఱిప్రసంగించుటయతనినిదుఃఖభాజనముచేయుటయని తలంచి యతనిం బ్రసంగాంతరమునదింపెను

ఇట భీమడోలులో శంకరరాజుమన స్సూరకుండలేదు కాగుచున్ననీటనుండి యావిరివెడలునట్లుక్రోధాగ్నిచే మరుగుచున్నమనస్సునుండి కుటిలాలోచనపరంపర వెడలుచుండెను పురుషోత్తమరావుగారి భార్యకిచ్చినమొత్తము, తాను చెన్నపురివెళ్ళినందుకు తనశ్యాలకుఁడు వెళ్ళినందులకు నైనఖర్చులు వానివడ్డి చేపడినఁగాని యతనిమనస్సు కుదుటపడుటకు వీలుకలుగదయ్యెనుఎన్నివందలరూపాయలునష్టమైనవో యన్నివందలుతలంపు లతనితలలోఁబ్రభవించి కొంతసేపువిజృంభించి సముద్రతరంగములవలె నడఁగుచువచ్చెను నష్టద్రవ్యము మరలసంపాదించుటకుఁ దగినయుపాయమేదైనఁ జెప్పుటకై తనశ్యాలకుఁడగు కొచ్చెర్లకోట గోవిందరాయనిరమ్మనివర్తమానమంపెను గోవిందరాయడు శంకరరాజుకంటెనెక్కుడుబుద్ధికుశలతగలవాఁడు శంకరరాజుతాటియాకుమంటవలె కోపాగ్నిచేమండిపడును గోవిందరాయఁడు తొందర

పడఁడు దీర్ఘక్రోధమున నిద్దఱుసమానులేకానిగోవిందరాయఁడుమాట తొందరలేక సమయమువచ్చినప్పుడు కీలెఱిగి వాతబెట్టినట్లునిష్కరుణముగాఁ బనిచేయును పరధనాకర్షణమందునిద్దఱును సమానప్రజ్ఞావంతులే అందుచేత శంకరరాజునకును గోవిందరాయునకునుసంబంధబాంధవ్యముచేతనేగాక బుద్ధిసామ్యముచేతఁగూడ నధికమైత్రి కలిగెను బావగారువర్తమానమంపఁగానె గోవిందరాయఁడు పనితీరికఁ జేసికొనిభీమడోలువెళ్ళెను బావమరుదులిద్దఱు నష్టద్రవ్యసంపాదనమునుగూర్చి రెండు మూఁడుదినములాలోచించిరి. శంకరరాజునకుఁ దోచినయుపాయములు గోవిందరాయఁడు ఖండించెను గోవిందరాయనియుపాయములలోనిబాధలు శంకరరాజుకనిపెట్టి ఖండించెను అట్లుకొంతసేపువారాలోచించునప్పటికి గోవిందరాయనికొక్కయుపాయముతట్టెను అదియతఁడు శంకరరాజున కీక్రింవిధముగా నెఱింగించెను

"బావగారు! నాకొక్కయుపాయముతట్టినదిఅత్తిలిసంబంధము మనమొప్పుకొని తాంబూలములు పుచ్చుకొందము కట్నముమూఁడు వేలరూపాయలుముందుగామనయింటికిఁబంపించవలసినదనిచెప్పుదము పిల్లవాఁడు రెండవపెండ్లిచేసికొనఁడుకదా! కట్నముపుచ్చుకొన్నంతమాత్రమున నేమిలాభమని మీరు సంశయింపనక్కఱలేదు మనము సంబంధము వప్పుకొని ప్రథానముచేసికొని కట్నముకూడ పుచ్చుకొన్నామని తెలిసినతరువాత జగన్నాథరావు మీపరువుదక్కించుటకు తప్పక వివాహముచేసికొనితీరును ఇందువలన మూఁడువేలరూపాయలు మనచేతిలోఁబడును మనపిల్లవానికి రెండవపెండ్లియగును వల్లూరివారిగర్వమడఁగును తల్లాప్రగడ రఘుపతిగారియాస్తియావత్తు మనకుఁగలియును. రఘుపతిగారికుఱ్ఱవాఁడుమిక్కిలిజబ్బుగానున్నాఁడఁట ఈదెబ్బతో మనకోరికలన్నియునెరవేరును ఇది మీరంగీకరింపవలెను మీరొప్పుకొన్నపక్షమున రఘుపతిగారి సంబంధము నేనేలాగోయొకలాగు కుది

ర్పెదను మనముసరేయన్నపక్షమున వారిచ్చుటకుసిద్ధముగానున్నారు మనని యోగములో జగన్నాథరావువంటి పిల్లవాఁడు తపస్సుచేసిన ప్పటికి దొరకఁడు. మనయొప్పుదల కాఁగానే వారెగిరిగంతువైచి పిల్లను రూపాయలమూఁటనుదెచ్చి మనకాళ్ళమీఁద పడవైతుతు. ముందు రూపాయలమూట మనకొంపలోఁబడనీయండి. తరువాత జగన్నాథరావు మోటుతనముచేసి యొప్పుకొనకపోయినప్పటికి మనము కావసినన్ని పన్నుగడలు పన్నవచ్చును.."

ఈయుపాయము శంకర్రాజునకు లెస్సగానచ్చెను. రూపాయల మూట తనగృహమునఁబడు నన్నమాట లతని చెవులలో నమృత బిందువులవలెఁబడియానందపారవశ్యతనొందిచెను. "అబ్బాయి! గోవిందరాయఁడు! నీయుపాయము మిక్కిలిపసందుగానున్నది. రఘుపతిగారితో ముందుగారాయబారముపెట్టి సంబంధము నిశ్చయముచేయుము. ప్రధానము నిడదవోలులోఁ జేసికొనవచ్చును. ఎందుకంటే, మాగ్రామములో వాళ్ళు మునుపటిపిల్లయుండఁగా మరల వివాహమెందుకని లేనిపోని శంకలు చేయుదురు. అదిగాక రఘుపతితోవెళ్ళి లేనిపోని మాటలుచెప్పుదురు. అంతమాటపుట్టి కుఱ్ఱవాఁడు వివాహమొప్పుకొన్నపక్షమున నిడదవోలునుండియే తరలివెళ్ళుదము. బ్రహ్మదేవునికిఁ దెలియకుండ సాధ్యమయినంతత్వరలో మనకార్యముచేయు" మని లేచి మరిదివీపుతట్టి, నీ పుణ్యమాయని నానష్టద్రవ్యము నాకువచ్చును. నీవు చెప్పినట్లు రూపాయలు కొంపలోఁబడెనా పైమాట చూచుకోవచ్చును. ప్రధానమైనతరువాత జగన్నాథ మంత మోటుతనము చేయఁగలఁడా? కాని దైవమున్నాఁడు. మనమనుకొన్నట్లు జరిగినపక్షమున వెంకటేశ్వరులకు దీపారాధనఁజేసి సత్యనారాయణవ్రతముఁ జేసి రెండు సంతర్పణములు జేసెదను. నీవు నీప్రయత్నముమీఁదనుండు" మని మఱఁదితోఁగలిసిభోజనమునకుఁబోయెను. ఆసాయంకా

లమే గోవిందరాయఁడు నిడదవోలున కరిగి లోకవ్యవహారములయం దు; దగినమంత్రియై కుడిభుజమై మూర్తీభవించిన యనృతదేవతయో యనునట్లున్న లంకదామోదరయ్య యనుబ్రాహ్మణుని బిలిచి తనబావగారివృత్తాంత మతనితో సవిస్తరముగఁజెప్పి యిట్లనియె.

"దామోదరయ్యా! నీవు నాగుండెకాయవు, మాబావగారికి గొప్పయాపత్తువచ్చినది. ధనమాపోయినది. కుమారుఁడా అత్తవారి నోఁదూఱి విరోధియైనాఁడు. మా మేనల్లునకిప్పుడు రెండవవివాహ ము జేసితీరవలెను. ఏలాగోమెడలువిఱచి వానినొప్పించగలము. ఒప్పు కొనకపోయిన పక్షమున కాళ్ళుచేతులు విఱచి కూర్చుండఁబెట్టియైన వానిచేత మంగళసూత్రము కట్టించెదము. తల్లాప్రగడ రఘుపతిగారు తమకూఁతునిచ్చిపెండ్లిచేయుదుమనియానడుమవర్తమానమంపినారు. కాని యెందుచేతనో యీనడుమ సద్దుసద్దుగా నూరకుండినారు. మా వాఁడు రెండవపెండ్లిచేసికోఁడని కర్ణాకర్ణినివిన్నారోయేమిటో! నీవి ప్పుడత్తిలివెళ్ళి వారియభిప్రాయమేమిటో తెలిసికొనిరా! నీవు వై దికపువాఁడవైనా మాసహవాసముచేత లౌక్యము బాగుగా నెరుఁగు దువు. అందుచేత మేము పంపినామని కాకుండా నీయంతటనీవే యే దోపనిమీఁద వెళ్లినట్లువెళ్లి మావాఁడు రెండోపెండ్లి చేసికొనుటకు సిద్ధముగా నున్నాఁడని వారితోఁ జెప్పవలెను. మునసబులు, డిప్టికలె క్టరులు తమపిల్లలనుదెచ్చి కాళ్ళమీఁద పడవయిచుచున్నారని చెప్ప వలెను. సంబంధము దాఁటిపోవుచున్నదని గడబిడగాఁజెప్పి వారికడ లెత్తింపవలెను. మాటలవిషయములో నీకునేను చెప్పవలెనాయేమి టి! పద్యాలు చెప్పలేవుగాని రసపుష్టిచేసిమాటలకవిత్వము చెప్పఁగల వు. నీమాటలతోనే మూటలువచ్చి మాబావగారింటిలో పడవలెను. నీగడుసుదన మిందులోఁగనఁబడవలెను. వెనుకచేసినచేత లన్ని యొక యెత్తు; ఇదొకెత్తు. నీమాట మఱచిపోములే! కట్నపుసొమ్ములోనూ

టికి రూపాయవంతున నీకిప్పించకమానను. పయిగా ప్రాప్తముంటే మఱొక్కవరహాసొమ్ము నీకు ముట్టవచ్చును. నీవునిర్భాగ్యదామోదరుఁడుగా వెళ్ళక శుద్ధవైదికవేషముతో వెళ్ళవలెను. ఇన్నిమాటలెందుకు! నీవక్కడనుండి వచ్చినమరునాఁడోమూఁడవనాఁడోవాళ్ళు సంబంధమునిమిత్తము భీమడోలు వెళ్ళవలసినదే. రెండవపెండ్లెందుకుచేసికొనుచున్నాఁడంటే నీవేదోగట్టినంక చెప్పవలెను. దామోదరయ్యయంటే అబద్ధాలసముద్రముఆసముద్రములోనుండి ఒక్కకెరటముదీసివయిచినావంటే యెందరో మునిఁగిపోఁగలరు. నీకు నేను వేరేచెప్పఁగలనా?ఎప్పుడుప్రయాణమై వెళ్లెదవు? పంచాంగముచూచి మంచిముహూర్తము పెట్టుకో.!"

అనుటయు దామోదరయ్య యిట్లు ప్రత్యుత్తరమిచ్చెను.

"గోవిందరాయుఁడుగారు! మీకార్యమంటే ఱెక్కలుకట్టుకొనినేను పనిచేయఁగలవాఁడనని మీరే యెఱుగుదురు. నాసంగతి నేను చెప్పుకోరాదు. మీకుటుంబము మాకుటుంబము రెండుమూఁడు తరములనుండి కలసిమెలసి యేకకుటుంబముగానున్నది. మనలోమనకు భేదములేదు. మీకార్యమే మాకార్యము. మీబావగారికి వచ్చినభయములేదు. ఆసంబంధము నేనుకుదర్చఁగలను. నే నేయెండకాగొడుగుపట్టఁగలను. చిన్నప్పుడు చదువుకొన్న "యెప్పటికెయ్యది ప్రస్తుతమప్పటికామాటలాడి" యన్న సుమతీశతకపద్యము ప్రకారము నేనునడచెదను. నేనువెళ్ళి పాచికవైచినానంటే అది వరుణపాశములాగున పట్టుకొనివదలదు. నాశక్తి మీరెఱుఁగనిదికాదు. కోర్టులో మీరు తెచ్చిన దొంగవ్యాజ్యములలో నేనిచ్చిన యబద్ధపుసాక్ష్యములలో నొక్కసారైన పట్టుబడినానా? ఎన్నోతప్పుదస్తావేజులు మీసెలవుప్రకారము వ్రాసినానుగదా! నావ్రాత యొక్కసారయినా పట్టుపడిందా? సాక్ష్యమిచ్చినానంటె రాతిగోడపెట్టినట్లేకదా! బెంచిమీఁద కూర్చున్న

మునసబు, అడ్డుసవాళ్ళు వేయవచ్చిన యెదిరిప్లీడరుకూడ నాడాబునాద ర్పము నామాటలపొందిక నాదర్జాచూచి డంగుపోయినారుకదా! అం దుచేత మాటలపొందిక విషయమయి నాకుఁ జెప్పనక్కఱలేదు. కో ర్టుకు సాక్ష్యమునకువెళ్ళినప్పుడు దామోదరయ్యయని పేరుపెట్టుకొని జరీతలగుడ్డ తెల్లకోటు జరీయుత్తరీయము జరీపంచ ధరించి వెళ్ళెదను. వివాహాదులనిమిత్తము వెళ్ళవలసివచ్చినపుడు దిట్టముగా విభూతి పెం డికట్లుపెట్టి మెడలో రుద్రాక్షతావళములు తగిలించి రాజమహేంద్ర వరములో చాకలిసరప్పగాడికి రూపాయి చేతిలోఁబెట్టికొన్న శాలువక ప్పుకొని దర్భాసనమువీపుమీఁద వేసి బ్రహ్మదేవునినోట్లోనుండివూడి పడినట్లెవెళ్ళి పగటివేషగాళ్ళవలె కంఠతాపట్టిన నాలుగుపద్యములూయే కరువు పెట్టుదును దానితో నెటువంటివాళ్ళయినా గుండెబాదుకొని నాయనా! వీఁ డసాధ్యుఁడు రాయని నాకాళ్ళకుదండముపెట్టినాలుగో మూఁడో రూపాయలిచ్చి నన్ను పంపుదురు ఎంతెంత కార్యములైనా జయించుకొనిరాఁగలను. మీకార్యములెంత? చూచుకొనండి? నాలు గుదినములలో రఘుపతిగారో వారిపురోహితులో లేక వారివారుమ ఱొకరో మీయింటికివచ్చిపిల్లనుచేసికొమ్మని మిమ్ము బ్రతిమాలుదు రు నూరుకల్లలాడి యొకయిల్లునిలుపమన్నాఁడు మీరునాకు రుసుమి చ్చినను సరే, యియ్యకపోయినను సరే దామోదరయ్య మనకీయు పకారముచేసినాఁ డన్నమాట మీహృదయములో నుండవలెకాని రూపాయలా శాశ్వతము? వెధవరూపాయిలు బోగంపాపి గడించలే దు! తమకటాక్షమే నాకుగావలెనుగానిరూపాయలెందుకు? రేపుమం చిది యిందాకనే పంచాంగముచూచినాను రే పుదయముబండిమీఁ ద బయలుదేఱి తాడేపల్లిగూడెంవెళ్ళి అక్కడనుంచి రెండెడ్లబండి తీసుకొనివెళ్లి మూఁడుదినములలో తిరిగివచ్చెదను భారమునా మీదె ప్పుడు పెట్టినారో మీకార్యమప్పుడే అయిందని నమ్మండి! రెండవ

పెండ్లెందుకుఁ జేసికోదలఁచుకున్నాఁడని వారడిగేపక్షమున సమాధానమే చెప్పలేనా? పిల్లకేదో రోగమున్నదని గాని లేకపోతే సాంప్రదాయము మంచిదికాదనికాని నోటికేమాటవచ్చునో ఆమాటచెప్పెదను మీరన్నట్లు నేనాలాటిచోట్ల కవిత్వమే చెప్పుతానని నమ్మండి! కవిత్వంలో నవరసాలేకాని, నామాటలలో నూరురసాలుంటవి నాయిష్టమువచ్చినట్లు చెప్పుటకు మీరధికారమియ్యవలెను భత్యఖర్చుకుమాత్రము రెండురూపాయలు దయచేయించండి!" అనిదామోదరయ్య లేచి నిలువఁబడి "మాయింటికి జుట్టాలువచ్చినారు నేనుత్వరగా వెళ్ళవలె సెలవియ్యండి" యని తొందరపడెను అతఁడు కోరినప్రకారము గోవిందరాయఁడు రెండురూపాయ లియ్యదలఁచెనుగాని ఆరెండురూపాయిలు పులుసులోవేసి మరలఁగనఁబడఁడేమో యనియతఁడు "సరే! దామోదరయ్యా! లెక్కహాజరులోలేదు నీవుప్రయాణమైరయిలుదగ్గరకురా! రూపాయలక్కడ నీకిచ్చి నిన్ను రైలెక్కించెద" నని యప్పటి కాతనిబంపెను.

అత్తిలి పట్టణములలోఁబల్లెటూరు. పల్లెలలోఁ బట్టణము. ఆ గ్రామములోఁ బ్రసిద్ధికెక్కిన నియోగులనేకులుగలరు. తల్లాప్రగడ రఘుపతిగా రందులోనొకరు. పిత్రార్జితములైనట్టియు స్వార్జితములైనట్టియు భూములమీఁద రఘుపతిగారికి సంవత్సరమునకు నాలుగువేలరూపాయ లాదాయమువచ్చును. రమారమేబదివేలరూపాయలవఱకు వడ్డీవ్యాపారము నడుచుచున్నది. అదిగాక యించుమించుగఁ బదివేలరూపాయలు విలువగలనగలు వెండిసామానులు మొదలగునవికలవు. రఘుపతిగారు దర్జాగలపెద్దమనుష్యులు, ఏఁబదిసంవత్సరములు ప్రాయముకలదు కాయముస్థూలము ఇల్లుగదలనక్కఱలేదు. అంతకుమున్నే విచారములేక హాయిగాఁ గాలక్షేపముసేయుచుండుటచే గ్రామములో రఘుపతిగారివంటి యదృష్టవంతుఁడు లేడని యెల్లవారుఁ

జెప్పుకొనుచుండిరి ఆయన గొప్ప యన్నప్రదాత. బ్రాహ్మణులుగాని భట్రాజులుగాని యెంతమందివచ్చిననుసరే, యేసమయమునవచ్చిననుసరే! వారియింట భోజనము సేయవచ్చును. రఘుపతిగారు వడ్డివ్యాపారము విరివిగాఁ జేయుచుండినను బీదసాదలకుఁదక్కువవడ్డికిచ్చుచు వారిననేకభంగులఁ గనిపెట్టుచు నూటికి బంగ్రెండణాలకంటె నెవ్వరి యొద్ద నెక్కువవడ్డిగ్రహింపక సాధ్యమైనంతవఱ కెవ్వరి గృహారామక్షేత్రంబులఁ దెగనమ్మింపక పేరుపెంపు పాడిపంటగలిగి యోపికకొలఁది నెల్లవారికుపకారముచేయుచు ఖ్యాతిగాంచుచుండిరి. రఘుపతిగారియిల్లు రెండుమండువాల భవంతి. మేడకట్టవలెనని యూహనతలంచెనుగాని గ్రామమం దొంటిమేడ యుండగూడదని పెద్దలనేకులు చెప్పుటచే నదిమానవలసివచ్చెను వీధియరఁగులు విశాలమైనవి. సింహద్వారముదాఁటి లోపలికి వెళ్ళగానే మండువాయుండును మండువాకిరుప్రక్కల రెండుచావడులుకలవు. ఒక్కొక్కచావడిలో నొక్కొక్క గదిగలదు, "అందెడమచేతిప్రక్కచావడిలో వెదురుపేళ్ళచాపయు దానిమీఁద నొక్కపెద్దజముఖాణయు జముఖానమీఁద నొక్కతివాసియునుండును. తివాసిమీఁదఁగూర్చున్నవారు చేరఁబడుటకై గోడవంటియొకపొడుగుదిండుకలదు. ఒకనాఁడుదయమున రఘుపతిగారు దిండునకుఁజేరఁబడి తివాసిమీఁద గూర్చుండె. అప్పుడొక జ్యోతిష్కుఁడు ప్రక్కనుగూర్చుండి రెండుమూఁడు జాతకములు బరీక్షించుచు నందలిగుణదోషముల నాయనకు నివేదించుచుండెను. ఎదుటి చావడిలో నొక వైద్యుఁడు కల్వములలో నేదోయౌషధమిద్దఱు సేవకులచేత నూరించుచుండెను. తనఖాలమీఁద బదులుకావలెనని బంగారపునగలమీఁద బదులుకావలెనని ప్రామిశరీనోట్లమీఁద బదులుకావలెనని కొందఱుమనుష్యులత్తిలినుండియుఁ జుట్టుప్రక్క గ్రామములనుండియుపచ్చికూర్చుండిరి. రఘుపతిగారు సిద్ధాంతితో జాతక

ములనుగూర్చి ప్రసంగించుచు నడుమనడుమ బదులుకావలసివచ్చినమ నుష్యులు తెచ్చిన నగలు వన్నె గీటురాయిమీఁదఁ జూచుచు దస్తా వేజు చదువుచు నష్టావధానము గాకపోయినను పంచావధానమయి నను జేయుచుండెను. అప్పుడు "నవోనవోభవతి" యనుపనస గంభీ రస్వరముతో జదువుచు నొకబ్రాహ్మణుఁడు చావడిలోనికి వచ్చెను. వెండిరేకులు తాపటముచేసినట్లు భుజములమీఁదను వక్షస్థలముమీఁ దను విశాలఫాలముమీఁదను వెలయువిభూతిపెండికట్లఁజూచి నాభీవివ రపర్యంతము వ్రేలు రుద్రాక్షతావళము జూచి తలకుఁజుట్టినయెఱ్ఱనిశా లువఁజూచి వీపుపై వ్రేలుకృష్ణమృగాజినముఁజూచి లోపలిభాగమెల్ల ప్రతిధ్వనించుచున్నట్లు నోటినుండివెడలు వేదనాదముఁజూచి యాఱ డుగుల పొడవును దానికిందగిన గంభీరకాయముజూచి మూర్తీభవిం చిన వేదపురుషుఁడనుకొని రఘుపతిగారు,రఘుపతిగారితో సిద్ధాంతితో ఋణమునకువచ్చినవారు గుభాలునలేచి నిలిచిరి. రఘుపతిగారు నేల చాగిలఁబడి బ్రాహ్మణుని పాదములకు సాష్టాంగనమస్కారముఁజేసె ను. తక్కినవారందఱ్ఱేచేసిరి. "దీర్ఘాయుష్యమస్తు! ఆచంద్రార్కం వంశాభివృద్ధిరస్తు! అఖండలక్ష్మీప్రసాదసిద్ధిరస్తు?" అనిదీవించి యా జన్నిగట్టు "నాయనా! యీలోగి లెవరిది?" యని యడిగెను. ఇది త ల్లాప్రగడ రఘుపతిరావుగారిదండి "ఏమిటి! తల్లాప్రగడరఘుపతిరా వుగారిలోగిలేయిది. నేఁటికాలమునకు వారిలోగిటిలో నడుగుపెట్టుట చేత నాజన్మముతరించినది రఘుపతిగారు గ్రామములోనున్నారా నా యనా? యింట్లోనున్నారానాయనా?" యనిమహాశ్చర్యసంతోషభరిత మనస్కుఁడై పలికెను. ఆపలుకులువిని రఘుపతిగారుమిక్కిలివినయము తో మందహాసముచేయుచు "చిత్తము చిత్తము నేనేరఘుపతిని దేవ రవారివంటి మహానుభావులు దయచేయుటచేత మాగృహము పావన మైనది. నేనుధన్యుఁడనయినాను. అజ్ఞానులమగుటచే దేవరవా రెవరో

యేగ్రామమునుండి మీరు దయచేయుచున్నారో మాకుఁదెలియదు ఆకారము సందర్శించిన మాత్రముచేతనే పూజ్యులన్నమాట తెలిసినది. మాయందనుగ్రహించి రెండుమూఁడుపూటలు మాగృహమందుదయచేసి యింత గంగామృతము మావల్లగ్రహించి నన్నుతరింపఁజేయవలెనని కోరిక. మీవంటివారు వేయి సంవత్సరములు తపస్సుచేసినను లభింపరు. అర్ధోదయము మొదలయిన పుణ్యకాలములు లభించునట్లే తమవంటివా రప్పుడప్పుడు లభించుచుందురు మీయాశీర్వచనముచేత తమకుకావలసిన సమస్తవస్తువులు మాగృహమందు దొరకగలవు" అని బదులుచెప్పెను. అనవుడు బ్రాహ్మణుఁ డిట్లనియె "ఓహోహో! ఏమి నాయదృష్టము ! ఇంతకాలమునుండి శ్రోత్రానందముగా తమయశస్సు వినుటయేగాని నేత్రానందముగా మూర్తినిచూడలేదు. తల్లాప్రగడవారంటే దేశపాండ్యాలు. అందులో రఘుపతిగారంటే సాక్షాత్తు రఘుపతిగారే. ఆహాహా! ఆనిరతాన్నప్రదానము ఆదాతృత్వముతమ కేచెల్లినది. వెనుక భోజరాజుగారిసభలో అలసానిపెద్దన్నగారు సెలవిచ్చినారట "పరివర్తిని సంసారంమృతః కావానజాయతే సజాతాయేనజాతేనయాతి వంశంసమున్నతి." అని సెలవిచ్చినారఁట! ఏలినవారివల్ల తల్లాప్రగడవారి వంశమున కింతింతనరాని కీర్తివచ్చినది.ఉంగుటూరులో గొప్పమేడలుమిద్దెలు కట్టినప్రకాశరాయడుగారు తమపూర్వులేకాదూ! మీవంశమంటే రత్నాలగని.మీయశస్సీలోకములోనేగాకుండా పదునాల్గులోకములలోకూడవ్యాపించినది. రాయలవారిసభలో వెనుక కాళిదాసుగారు సెలవిచ్చినారఁట! భోజనం దేహి రాజేంద్రఘృతసూపసమన్వితం మహిషంచ శరశ్చంద్రచంద్రికాధవళం దధిం॥

తెల్లనిగేదెపెరుగు పప్పు నెయ్యి మొదలైనవస్తువులతో భోజనము పెట్టవలసినదని బ్రాహ్మణుఁడు యాచించినాఁడఁట. ఆరాయలను

యాచించినారో లేదో తెలియదుగాని యీకాలంలో కృష్ణాగోదా వరీతీరములలోతమరిని యాచించనివారు తమరిప్రసాదముతిననివారు తమచేత వుపకారంపొందనివారులేరు. చంద్రునికైనా కళంకమున్నది గాని మీకు లేదు బుద్ధికిబృహస్పతేకదా! దేవేంద్రభోగము దుర్యోధ నసంపత్తి ఆహాహా పాండిత్యములో ఆదిశేషుఁడేగదా! యేమి యో గ్యత యేమియోగ్యత. విష్ణుమూర్తివారు భూలోకంలో పూర్వందశ రథమహారాజు గర్భమందుబుట్టినారు ఇప్పుడుతల్లాప్రగడవాసుదేవయ్య గారిగర్భమందవతరించినారు కట్టుగుడ్డలతో నడవికి లేచిపోయినాఁడనే అప్రతిష్టరామావతారానికున్నదిగానిఈయవతారానికేలోపములేదు. తమదర్శనము చేయుటచేత కన్నులుచెవులు సమానముగాధన్యములై నవి. తమరుకోరకుండగనే తమయింటిలో నేనుండఁదలఁచి వచ్చినాను మూడుపూటలుకాదు ముప్పదిపూటలుండవచ్చును. ఈకలికాలంలో మావంటిశిష్టులు బసచేయదగినలోగిళ్ళు భోజనముచేయదగినలోగిళ్ళు అత్తెసరైనావేసికొనఁ దగినలోగిళ్ళు సాధారణముగాలేవు.నూటనాట మీవంటివారిలోగి లేదోయొకటియుండుటేదుర్లభము. రఘుపతిగారి గృహములో యజ్ఞములుచేసిన సోమయాజులవారైనను నిస్సందేహము గ భోజనముచేయవచ్చును. అటువంటి ఆహితాగ్నిగృహముమీది. నే నల్లాటప్పగా అందరియిండ్లలో భోజనముచేయను. సాధారణముగా యిల్లుకదిలినానంటే నేనుస్వయంపాకమేచేసుకొందును. ఎంతోశిష్టులై తేనేగాని నాకుపనికిరాదు. మీవంటివారు వేయివిధములచేత వేఁడు కొంటే అప్పుడువారియిల్లుచూచి ఆచారవ్యవహారములుచూచి నాకు నచ్చితేఅక్కడభోజనముచేయఁగలను. మీకీర్తిమీశుచిమీయాచార వ్యవహారములు మీసాంప్రదాయములు నే నిదివఱకేవిన్నాను. మీ యింట భోజనముచేయుటకు నాకభ్యంతరమేలేదు. మాదిపూర్వము తునిదగ్గఱ యరకభూపతిఅగ్రహారం. మాతండ్రిగారు సర్వతోముఖ

వాజపేయపౌండరీకయాజులవారు. మాకువత్సవాయవారు పూసపాటి వారు దయచేసిన అగ్రహారములు మాన్యములు మాతండ్రిగారుక్రతువులవ్యయముకై అమ్మివేసినారు ఒకరిని దేహియనియాచించకుండ యజ్ఞములుచేయవలెనని మానాయనగారిసంకల్పము. మాస్థితిగతులు చెడినతరువాత నేనుస్వాధ్యాయముశాస్త్రముచదువుకొని నిడదవోలు లోనున్నాను. భీమవరంతాలూకాలో మెంటేపూడిగ్రామంలోనాకొకరు రెండెకరములభూమి దానముచేసినారు. ఆసిస్తు తెచ్చుకోవలెనని వెళ్ళివచ్చుచున్నాను. రాత్రితాడేపల్లిగూడెమువెళ్లి రైలెక్కవలెనని యున్నది. ఇది నావృత్తాంతము. క్రతువులుమాతండ్రిగారివలె చేయవలెననియున్నదిగానియొకరినియాచించుటనాకిష్టము లేదు.మానాయనగారివలె నేనుకూడ దుర్దానములుపట్టక దురన్నములుతినకనప్రతిగ్రహీతనై కాలక్షేపముచేసి నాయనగారికీర్తి నిలువబెట్టవలెననియున్నది. తనుమాట తీసివేయలేనుగనుక మీయింటబసచేయఁగలను."

ఆపలుకులు రఘుపతిగారికి బ్రాహ్మణునియందధికగౌరవముగలిగించెను. రఘుపతిగారికిగాని యాయనప్రక్కనుగూర్చుండిజాతకములు చూచుచున్న సిద్ధాంతికిఁగాని సంస్కృతభాషాపరిచయ ముండినపక్షమున నూతనబ్రాహ్మణునినోటవెడలిన రెండుశ్లోకములలో నెన్నితప్పులుండెనో తెలిసియుండును. శరచ్చంద్రియనుటకు శరశ్చంద్రియనియు సంసారెయనుటకు సంసారమనియుజదివి యతఁడంతతోఁబోకభోజరాజుసభలోఁ బెద్దనకవిని రాయలసభలోఁ గాళిదాసునునిలిపి పుంలింగముండవలసినచోట స్త్రీలింగనపుసంకలింగములువైచి యిష్టమువచ్చినన్నితప్పులుచేసెను. అక్కడనున్నవారికి సంస్కృతాక్షరజ్ఞానములేకపోవుటచేత క్రొత్తబ్రాహ్మణుడు "ఓట్టకట్టుదేశమునబట్టఁగట్టినవాఁడు సంపన్ను" డన్నట్లు పెద్దపండితుఁడై వారినిక్షణములో వశపఱచుకొనెను. రఘుపతిగారాయనను దయచేయుమనితివాసిమీఁదఁగూర్చుండ

బెట్టి తానాయనయెదుటఁగూర్చుండెను. రఘుపతిగారికిలౌకిక్యవ్యాపారజ్ఞానమేగాని ధర్మశాస్త్రము వేదాంతము మొదలగునవి తెలియవు కావున బ్రాహ్మణుఁడదియెఱిగి వేదాంతముగూర్చియుఁ గలిధర్మములం గూర్చియు యథేచ్ఛగా నుపన్యసించి తాను బ్రహ్మణ్యుఁడనివారను కొనునట్లు జేసెను. ఆమహానుభావుని రాకవలనఁదన గేహ దేహ పావనమైనదని భావించి లోపలికిబోయి పిండివంటయుక్షీరాన్నముం జేయుమని తనవంటబ్రాహ్మణున కానతిచ్చి మంగలినిబిలిపించి బ్రాహ్మణుఁడువద్ద నుచున్నను గమ్మనియావునేతితోఁదలయంటించి జపమునకై యొకగది లోముందుపీట వెనుకపీటవేయించి యుద్ధరణియరివారణము మంచితీర్థము వీభూతిపండ్లుమొదలైనవిపెట్టించి "స్వామీ! తమకుజపమాలస్యమౌనుగనుక ముందుగా మడికట్టుకొనుండి" యనిమడిబట్టలిప్పించెను.

బ్రాహ్మణుఁడు మడిబట్టలుకట్టుకొని గదిలోనికివెళ్లి తలుపులు మూసికొని జాము సేపునకు బయటకువచ్చెను. నడచివచ్చుటచేత శరీరమాయాసపడియుండుటయు దానిమీఁదమంగలివాఁడుహాయిగాఁదలయంటుటయుఁ బీటమీఁదగూర్చుండగానే యతనికినిద్రింగలుగఁజేసెను. వెంటనేయతఁడు చేరఁబడుటకు వైచినరెండవపీట తానుగూర్చుండుటకువైచినపీటతోఁగలిపి హాయిగాఁబండుకొనినిద్దురపోయెను. ఎంతసేపటికి రాకపోవుటచే వంటబ్రాహ్మణుఁడు కిటికీలోనుండితొంగిచూచి "అవధానులుగారునిద్రిపోవుచున్నా"రని యందఱితోఁజెప్పెను. కొందఱు ముసిముసినవ్వులునవ్విరి. కొందఱాలాగనుటతప్పనిముక్కుమీఁదవ్రేలుపెట్టియు నాలుకకఱచుకొనియు వంటబ్రాహ్మణునితోఁజెప్పిరి. మెలకువ వచ్చినతరువాత బ్రాహ్మణుఁడు చప్పుచప్పున విభూతిపాముకొని యరివాణమునిండనీళ్ళుపోసి యుద్ధరిణచప్పుడులుచేసిసంధ్యావందనము చేసినట్లు తెలియఁజేసి యావలకువచ్చెను. అప్పుడు విస్తళ్ళువైచివడ్డనఁజేసిరి. భోజనముచేయుచుండఁగా ననేకప్రసంగములువచ్చెను.

నానిమిత్తముచేతఁ దమకీదినముభోజనము ప్రొద్దుపోయినదని బ్రాహ్మణుఁడురఘుపతిగారితోననెను. అంతలో వంటబ్రాహ్మణుఁడందుకొని "తమకుగాఢనిద్రపట్టినదిగాని లేకపోతేభోజనమీపాటికేయగుననియుత్తరముఁజెప్పెను. ఆపలుకులువిని రఘుపతిగారు తెల్లబోయి మాటతొనతనినివారింపకున్నను కనుసన్నలతో నతనినివారించిరి. అప్పుడుబ్రాహ్మణుఁడు కనులెఱ్ఱఁజేసి వంటబ్రాహ్మణునివంకఁ జూచి "ఏమేమీప్రేలుచున్నావా? నేను నిద్రపోయినానా?జాగ్రత్తగామసలుకో!నాకుకోపంతెప్పింపకు!భస్మపటలముచేయఁగలనుఎవరనుకున్నావో!అయ్యాయిటువంటి వంటబ్రాహ్మణుఁడు మీయింటనుండతగడు. వీఁడు కేవలము మూర్ఖుఁడులాగుననకనఁబడుచున్నాఁడు. పెద్దపిన్నలతారతమ్యమీనిర్భాగ్యునికిఁదెలియదు.మధ్యాహ్నసంధ్యావందనసమయముననేనుజపముచేసుకొని తన్మయత్వముఁజెంది సమాధిలోప్రవేశించుటనాకలవాటు. అదినిద్రయని మూర్ఖులునోటికివచ్చినట్లు ప్రేలుచుందురు. తెలియని నిర్భాగ్యులు తెలియనట్లుండరు. నావంటివాళ్ళతోవేళాకోళములాడుట త్రాచుబాములతో సరసములాడుటసుమీ! జాగ్రత!" యని కఠినముగా బిగ్గరగాఁబలికెను. రఘుపతిగారు గడగడవడఁకి "అయ్యా! తమరాగ్రహింపవద్దు. వాఁడు తెలివితక్కువ నిర్భాగ్యుఁడు. బుద్ధిలేకయేదోప్రేలినాఁడు. తమరువానినిక్షమింపవలె"నని వేడుకొనినంటవానివంక దిరిగి "నిర్భాగ్యుఁడా! కాళ్ళుపట్టుకొని రక్షింపుమని వేడుకో! వినాశకాలే విపరీతబుద్ధి, యన్నట్లు మీరుకొఱివితోఁ దలగోకికొందురు. చెంపలువైచికో" యని మందలించెను.

అనవుఁడు వంటబ్రాహ్మణుఁడు చెంపలువైచుకొని స్వామీ! బుద్ధిలేకచేసితిని రక్షింపవలెనని చేతులుజోడించి దండముపెట్టెను. పెట్టుటయు బ్రాహ్మణుఁడుకరుణించి "శరణన్నవారిమీఁద మహాత్ములెప్పుడును కోపముజూపరు. బుద్ధిలేకచేసితి నన్నావుగనుక క్షమించితి

ననిభయము లేదు. జాగ్రత్తగా మసలుకోవు యనియభయమిచ్చి క్షీరాన్న ముతోఁ బిండివంటలతో సుష్టుగా భోజనము చేసెను. భోజనానంతరమున వారందఱు సావడిలోఁ గూర్చుండిరి. రఘుపతిగా రా బ్రాహ్మణునికిఁ తాంబూలమిచ్చి చాకలివానిచేత విసనకర్రతో విసరించిరి. తదువాత లో కాభిరామాయణము విశేషముగాఁ బారాయణము సేయఁబడెను. ప్రసంగవశమున రఘుపతిగారిట్లనిరి.

"అయ్యా! నిడదవోలులోఁ గాని చుట్టుప్రక్క గ్రామములలోఁ గా నివివాహము కావలసిన మగపిల్ల లెవరయిన నియోగులలోనున్నారా? ఈరోజులలో తగిన పెండ్లికొడుకులు దొరుకుటమిక్కిలి కష్టముగానున్నది చదువుకొన్న వారికి భూములు లేవు. భూములున్న వారికి చదువులు లేవు ఈ రెండుగలవారికి సరియైన సాంప్రదాయములుండవు. సాంప్రదాయ మున్న వారికిస్థితిగతులుండవు. స్థితిగతులున్న వాళ్లకు గుణములుండవు పుత్రికాసంతానము దుఃఖహేతువేగాని సుఖహేతువుకాదనితోఁచు చున్నది. పూటకుగతిలేనివాఁడుకూడ వేలకొలదిరూపాయలు కట్న మిమ్మనియడుగుచున్నాఁడు. మగపిల్ల లతండ్రులుఆడపిల్ల లరూపు రేఖలు చూడరు. సాంప్రదాయముచూడరు పిల్ల తెల్వితేటలుచూడరు. సంచు లుమాత్రమే వారికి కావలెను. అనాకారిపిల్లయైననుసరేసొమ్మిచ్చినపక్ష మునచేసికొందురు. నేనుచదువుకొన్న పిల్లవానికిమాపిల్ల నియ్యవలె ననియున్నది. కాని కొంచెమైనను భూమియుండవలెనని నాయభిప్రా యము. నల్లబంగారముబొత్తిగాలేక కేవలము ఱెక్కల నేనమ్ముకొన్న వాఁడు పూర్తిగా సుఖపడజాలఁడు. పదిదినములు సెలవుపుచ్చుకున్న యెడలవారికిజరుగదు. నాలుగువందలరూపాయలుపొలముమీదవచ్చి నపక్షమున వాఁడుచన్నీళ్ళకు వేడినీళ్ళుతోడుచేసికొని జీతపురాళ్ళనే నమ్ముకొనక హాయిగాజీవింపవచ్చును. ఇంతకు పరమేశ్వరుని యిచ్ఛ యెట్లున్నదో మనకోరికలు నెరవేరవు. మీయెఱుక నేమైన సంబంధ

ములున్న పక్షమున దయచేసి చెప్పండి!"

అనుటయు నాబ్రాహ్మణుఁడు తలపయికెత్తి కొంచెమాలోచించి ప్రత్యక్షరమునకు దీర్ఘములుదీయుచు మెల్లగానిట్లనియె.

మానిడదవోలులో సంబంధములు లేవుగాని నేనెరిగినదిమరియొక యూరిలో నొక్క సంబంధమున్నది. నిడదవోలులో కొచ్చర్ల కోటగో విందరాయుఁడుగారని ఒకరున్నారు. వారుని యోగములో చాలా ప్రతిష్టగలవారు. ఆయన మేనల్లుఁడు పెండ్లికావలసియున్నాఁడు. ఆపిల్లవాఁడు బి.యె. చదువుచున్నాఁడు. డబ్బపండలాగున్నాఁడు. నేత్రములు తామరరేకులులాగు విశాలముగనున్నవి. మంచిబుద్ధిమంతుఁడు. తెలివిగలవాఁడు. ఈకలికాలపుపిల్లలవంటివాఁడుకాఁడు. తల్లిదండ్రులంటే చాలభక్తి. ఆపిల్లవానికి మీపిల్లనిచ్చి పెండ్లిచేయుటమంచిది.

ఐతే పిల్లవానియింటిపేరెవరు? కాపురమేగ్రామము? గోత్రమేమిటి? తండ్రిగారెవరు? స్థితిగతులెట్టివి?

ఇంటిపేరు బంధకవివారు, కాపురము భీమడోలు, తండ్రిపేరు శంకరరాజుగారు, పిల్లవానిపేరు జగన్నాధరావు గోత్రముమాత్రము నాకు జ్ఞాపకములేదు. గోత్రముజోలెందుకు తల్లాప్రగడవారికి బంధకవివారికి తరతరములనుండి సంబంధబాంధవ్యము లున్నవి. స్థితిగతులు చాలమంచివి.

ఈసంబంధమా మునుపొకసారిమేము ఈపిల్లవానికి మాపిల్లనియ్యవలెనని సంకల్పించి వర్తమానమంపినాము కాని యతనికదివరకే వివాహమైనదనియు భార్యజీవించియున్నదనియువియ్యాలవారిమీఁద విరోధముచేత శంకరరాజుగారు కుమారునికిరెండోవివాహంచేయతలచుకొన్నారనియు దెలిసినది. మేము మొదట తెలియక వర్తమానమంపినాము. తెలిసినతరువాత మానుకొన్నాము. పిల్లమీఁద పిల్లనిచ్చుట నాకెంతమాత్రమిష్టంలేదు. వియ్యాలవారిమీఁద విరోధమున్నమాత్ర

ముచేత పాపమాపిల్ల కపకారముచేయుట న్యాయమా? పాపములో నేను సగము మూటగట్టుకొనుట నాకిష్టములేదు.

అయ్యయ్యయ్యో! తమరుమిక్కిలిపొరపాటుపడినారు. వియ్యాలవారిమీఁద విరోధముచేత శంకరరాజుగారు రెండవవివాహంచేయుటలేదు. శంకరరాజుగారుసామాన్యులనుకొన్నారేమో! ఆయనకుకూడా సాలుకు రెండువేలరూపాయలువచ్చును. మంచిదర్జాగలవారుఅల్లరిచిల్లరిపనులకు వెళ్ళునట్టివారుకారు.

ఐతే శంకరరాజుగారు కుమారునకు రెండోవివాహమేలచేయదలఁచుకొన్నారు?

ఆలాగడుగండి! సావధానముగామనవిచేసెదను. శంకరరాజుగారి కోడలువెర్రిది. మాటలు తిన్నగారావు. యిల్లాలైకాపురముచేయుటకు తగనిది. మొదటసంగతి తెలియకవారుబందలోఁబడినారు. పెండ్లిలో పెండ్లికూతురుని యెన్నిసార్లుపలుకరించినను పలుకలేదు. ఇదేమమ్మాపలుకదనిఅత్తగారునొక్కిఅడుగగా 'మాపిల్లకుసిగ్గమ్మాభయముచేతమాటలాడ'దని జబాబుచెప్పినారు. పెండ్లికూతురు చూపులకువెళ్ళినపుడుచుట్టుప్రక్కలవారిపిల్లనెవతెనో తీసుకొనివచ్చికంటిలోదుమ్ముకొట్టినారు. ఇటువంటిస్థితిగతులలో రెండవవివాహంచేయుటతప్పా? పిల్లవాఁడు చదువుకొన్నవాఁడు కాగలవాఁడు. ఈవెర్రిపెండ్లామునుపెట్టుకొని కాపురముచేయగలఁడా? భార్యలేకపోతే బ్రహ్మచర్యమైనా చేయవచ్చునుగాని వట్టిమొద్దునుపెట్టుకొని సంసారముచేయుట మిక్కిలి కష్టముగదండి.

ఆలాగా! యీరహస్యముమాకు తెలియదు. ప్రపంచములోనెటువంటి మోసగాండ్రైన నున్నారు. అంతద్రోహముచేసినపుడు రెండవపెండ్లిచేయుటతప్పుగాదు న్యాయమే! సరేగానిపిల్లవాఁడు రెండవపెండ్లిచేసికొనుటకు సిద్ధముగనున్నాఁడా? అతఁడేమొ పెంకితనముచేయుచున్నాఁడనిలోకములో వదంతి బయలుదేరినది. ఎంతవఱకు నిజము?

అవివట్టివదంతులేగాని యథార్థములుకావు. గొప్పపరీక్షలకుచదువుచున్నాఁడుగనుక మొదటిభార్యనువదలివేసితిరిగి పెండ్లాడినపక్షము నతోడివిద్యార్థులు నలుగురుదెప్పుతారేమోయని కొంచెమాలాగునబెట్టుసరిచేయుచున్నాఁడేమోగాని రహస్యములో తండ్రితోపాటే.

సరిసరి! ఆలాగా ఐతేమాకాసంబంధము కుదిర్చిపెట్టఁగలరా ?

ఆహా! కుదిర్చిపెట్టకేమి! తప్పక కుదర్చగలననుధైర్యము నాకున్నది. ఆపిల్లవాని తండ్రిగారితో నాకాట్టేపరిచయములేదుగాని మేనమామకునాకుమిక్కిలిస్నేహము. బావమరదియెంతచెప్పితేఅంత. శంకరరాజుగారికి గోవిందరాయుఁడుగారు గీచినగీటుదాటఁడు

అయితే వారికోరికలేప్రకారముగా నున్నవో? కట్నమెంతకావలెనో, కానుకెంతకావలెనో, మావంటివారము తూగఁగలమో లేదో వారితో?

తమరే తూగలేకపోతే! నియ్యోగములో తూగఁగలవారెవరు? మీరు నిగర్వచూడామణులుగనుక వినయముకోస మాలాగున సెలవిచ్చినారు. జమీందారుసంస్థానముగాని మీది సామాన్యసంస్థానమా? మీయింటికితగినట్లు వారుతరలిరాగలరాయని ఆలోచించవలెనుగాని మీరు తూగగలరా అనువిషయ మాలోచింప నక్కరలేదు వారికోరికలు నాతోవారెప్పుడూ చెప్పలేదుగాని నేనుండగామేనమామగారికడకు రెండుమూఁడుసంబంధములువచ్చినవి. వారితోగోవిందరాయఁడుగారుకట్నములుమాట కానుకలమాట చూచాయగసెలవిచ్చినారు, ఆమాటలుచెప్పెదను వినండి! మూఁడువేలరూపాయలురొక్కము వరదక్షిణ రానుపోనుఖర్చులు వియ్యపురాలి లాంచనముక్రింద ఐదువందలు ఇవికాక వెండిచెంబువెండియారులు పట్టుపంచిపెండ్లికొడుక్కియ్యవలెను తరువాత మీయిష్టము, మీవంటి గొప్పదర్జాగలవారుకూఁతురుకు పసపుకుంకుమక్రింద కొంతభూమి యియ్యకపోరు.

ఇంతకంటె వారికోరిక లెక్కువుండవుగదా? ఈప్రకారం మీరు సంబంధముకుదిర్చి తాంబూలము లిప్పించఁగలరా?

సందేహమేమి! మీరుభీమడోలువెళ్లనక్కరలేకుండా నిడదవోలులోనే తాంబూల మిప్పించగలను

అట్లయినమీరు నిడదవోలువెళ్ళిగోవిందరాయుఁడుగారితో మాటలాడి నాకు త్తరముప్రాయండి. శంకరరాజుగారినికూడ అక్కడికేపిలిపించండి అక్కడే తాంబూలములు పుచ్చుకోవచ్చును.

చిత్తము! అలాగేచేసెదను. అయితే అడుగుట మరిచిపోయినాను. తమకుపుత్రిక లెందరు? పుత్రులెందరు?

నాకీపిల్లఒక్కతేకుమార్తె. కుమారుఁడొక్కఁడేయున్నాఁడు. వాడునాలుగుమూఁడు మాసములనుండి జబ్బుగానున్నాఁడు అతనికోసమేమందులు సూరుచున్నారు

ఈపిల్లవాని కేమిజబ్బు నేనుచూడవచ్చునా?

మీరేమైనా వైద్యముచేయఁగలరాయేమిటి?

నేనువైద్యము చేయలేనుగానిభూతవైద్యముచేయఁగలను, నేను మంత్రింపించివిభూతి పెట్టినానంటే యెంతో భయంకరములైన భూతభేతాళశాకినీఢాకినీకామినీబ్రహ్మరాక్షసగణములుకూడ తోకతెంచుకొనిపారిపోఁగలవు. నామంత్రమంటే పిశాచాలకుఈశ్వరవేరు. నేనున్నచుట్టుప్రక్కల పదామడదూరములో దయ్యాలుండవు. భూతబాధయేదైనవున్నదేమో అనినేను చూడవలెననుకున్నాను. మంత్రశాస్త్రములో నేను పాకుకాంతదీక్షపుచ్చుకొన్నాను. బాలబగళముఖ్యలైనదేవతలు నేనేలాగునచెప్పితే అలాగున విని పడియుండును

మావాఁడు గ్రహపీడవల్ల బాధపడుచున్నట్లులేదు దేహారోగమయినట్టేకనబడుచున్నది ఎందుచేతనో కాళ్ళుపడిపోయినవి లేవలేడు నిలువబడలేడు కాళ్ళుకూడానీరుపట్టినవి అదేగొప్పవిచారమునాకు ఎంత

మాత్రముతోచదు ఈవిచారములోనే వివాహముచేయవలసివచ్చినది అబ్బాయికినెమ్మదిగానున్నతరువాతచేయుదామంటేపిల్లకట్టుతప్పిపోవుచున్నదనిభయము పదియేండ్లువెళ్ళినవి అందుచేత నేనింతతొందరపడిపిల్లవాఁడాలాగుననుండఁగానే వివాహప్రయత్నముచేయుచున్నాను

అయ్యా! గ్రహబాధలుకూడ దేహరోగములవలెనే కనపడును గ్రహములే కీళ్ళలోఁజేరి కాళ్ళుపడిపోవునట్లుచేయును గ్రహములే శరీరములోనిరక్తముత్రాగివేసి నీళ్ళెక్కించును, అదేవుబ్బురోగము గ్రహములుకీళ్ళలోగూర్చున్నసంగతి తెలిసికోలేక వైద్యులు దేహరోగమని భ్రమపడి వైద్యముచేయుదురు ననొకసారి చూడనిచ్చితిరా గ్రహబాధో వ్యాధిబాధో చెప్పఁగలను.

ఆలాగా! అట్లైతే చూచినందువల్ల లోపమేమి. తమరొకసారి చిత్తగించండి!తమకుశక్యమైనపక్షమున మాకుపకారము చేయించండి! రండిచూడండి! అనిరఘుపతిగారుబ్రాహ్మణునిలోపలికితీసికొనిపోయి పిల్లవానిం జూపెను. బ్రాహ్మణుఁడు పిల్లవాని నాడిజూచి కన్నులపరీక్షించి నాలుకశోధించి పాదములునొక్కిచూచిఆకలియగుచున్నదా? నిద్రపట్టుచున్నదా? పీడకలలేమైనా వచ్చునాయనికొన్ని ప్రశ్నలువైచి కొంచెమాలోచించి యిట్లనియె.

"ఇది కేవలముగ్రహరోగముకాదు, కేవలముగ్రహబాధకాదు రెండును కలిసియున్నవి ఒకమూలగ్రహము పీల్చిపిప్పిచేయుచున్నది ఒకమూలరోగము బాధించుచున్నది ఒకదానితో వేగులేకష్టము రెండుచేరి బాధించుచున్నప్పుడు శ్రమ యింతంతని యెవరుచెప్పగలరు పాపము పిల్లవాడు మిక్కిలిసుకుమారుడు రెండగ్ని హోత్రములమధ్యనున్నట్లున్నాఁడు ఇతనిబాధనివారణచేయుటకు రెండుపాయములున్నవి ఎప్పటివలె మందిచ్చుచుండవలెను గ్రహబాధశాంతికూడచేయవలెను మునుపు మందిప్పించుచున్నవైద్యునిచేతనేమందిప్పించండి గ్రహపీడా

శాంతినేనుచేయఁగలను మీసెలవైతే యిప్పుడేచేసివెళ్లెదను"

"ఇంతకన్న మహోపకారంకలదా? మీరుమాపాలిటిదైవము వలె వచ్చినారు భూతవైద్యము మీరుచేయండి వైద్యునిచేత మందు లిప్పించెదను."

సరే! మీసెలవుప్రకారము నేనుచేసెదను ఈరాత్రినేనాంజనేయోపాసనజేసి మంత్రింపించినవిభూతిమీకిచ్చెదను ఆవిభూతికీళ్ళమీఁదను పాదములమీఁదను ప్రతిదినమువుదయమున సాయంకాలమునచక్కగారాయండి ఆబూడిద రాయగానేపిశాచమునకుశరీరమునంటలెత్తును ఈప్రకారము ఒకనెలదినములు మీరుచేసితిరా యీచుట్టుప్రక్కలలేకుండ భూతములుపారిపోవును.

మంచిది! మహాప్రసాదముమాపిల్లవాఁడుబ్రతికెనా యావజ్జీవము నేనుమీపాదసేవజేసెదను.

అన్నన్న! ఎంతమాట! తమరాలాగు సెలవియ్యవలదు నాచేతనైనయుపకారము యత్కించిదైనను నేను మీకు చేయుటనావిధి.

ఈసంభాషణ మైనతరువాత వారిరువురు రోగియున్న గదివిడిచి కచేరిసావిడిలోనికరిగిరి అనంతరము రఘుపతిగారినిమిత్తము కొందఱు రైతులు ఋణములు కావలసినవారు వచ్చినందున వారితోమాటలాడుచు, నాయనగూరుచుండెను బ్రాహ్మణుఁడు వారికెదురుగానున్న రెండవచావడిలోఁదనకృష్ణాజినముఁబఱచుకొని తానుదెచ్చినతాటియాకులపుస్తకముం జదువుకొనుచుఁ గాలక్షేపముజేసెను అంతట సాయంకాలమయ్యెను బ్రాహ్మణుఁడు కాలువకుబోయిసంధ్యావందనాదికృత్యములుదీర్చికొనిమరలగృహంబునకువచ్చి మడికట్టుకొనిమధ్యాహ్నముకూర్చుండి జపముఁజేసికొన్నగదిలోనేకూర్చుండిబుట్టెడుబూడిదదెమ్మని యాజ్ఞాపించియాబుట్టదగ్గఱఁబెట్టుకొని గదితలుపులుమూసికొని యింటిమీదిపెంకులెగురునట్లుగృహజంతువులగు మార్జాలాదులుబెదరి

పారిపోవునట్లు చిన్నబిడ్డలదుచునట్లు హ్రీం హ్రామ్మని కేకలువేయుచు నాంజనేయమంత్రముఁజదివి విభూతిమంత్రించెను. పిమ్మట రఘుపతి గారు, బ్రాహ్మణుఁడుగలిసి భోజనము జేసిరిభోజనానంతరమున నిడద వోలు వెళ్ళుదుననిచెప్పెను మఱి రెండుదినములుండవలెనని రఘుపతిగా రాయనను మిక్కిలిబలవంతము జేసిరి, కాని యతఁడుండుటకెంతమాత్ర మిష్టపడనందునరఘుపతిగారుతమ రెండెడ్లబండిఁగట్టించియందుమెత్త నిపఱుపులు తలగడలువేయించి యాయన నందులో నెక్కించి పయన ముచేసి యిట్లనియె.

"అయ్యా! శంకరరాజుగారిసంబంధము నా కేవిధముగానైనగు దిర్చిపెట్టవలెను వారిపద్ధతిప్రకారము నేనునడుచుకొందును మీరు వారితోమాటలాడి మమ్మురమ్మని జాబువ్రాయండి! వ్రాయఁగానే మేమువచ్చి తాంబూలము పుచ్చుకొందుము."

అనవుఁడుబ్రాహ్మణుఁడిట్లనియె. "మీపిల్ల మిక్కిలిలక్షణమైన పిల్ల. ఆపిల్లనాపిల్లవానికిచ్చినయెడల అది యనుకూలదాంపత్యమగును. మీరొక్కపనిమాత్రముచేయవలెను. తాంబూలము పుచ్చుకొనుటకు వచ్చినప్పుడేకట్నముమూఁడువేలరూపాయలు పట్టుకొనివచ్చి శంకరరా జుగారిమీఁద పారవేయండి! బరువు వారిమీఁదనేయుండును. గావున త్వరగావివాహమునకు ప్రయత్నముచేయుదురు. ఇఁకనాకుసెలవియ్యం డి!" అనుటయు రఘుపతిగారుచిత్తమని బండితోలుమని బండివానితోఁ జెప్పికొంతదూరము బండితోనడిచి సాగనంపిగృహమునకుఁబోయెను.

అత్తిలిలో రఘుపతిగారిగృహరంగమున శుద్ధశ్రోత్రియడాంబిక బ్రాహ్మణనాటకమాడి కలాపమువినిపించిన యాప్రజ్ఞావంతుఁడు లంక దామోదరయ్యయేగాని యన్యబ్రాహ్మణుఁడుకాఁడని రసగ్రహణనిపు ణులగు పాఠకమహాశయు లిదివఱకే గ్రహించియుందురు. అతఁడు ప న్నినవలలో రఘుపతిగారవలీలగాఁబడిరి. రఘుపతిగారియంతవానినిఁ

దనబుట్టలో వైచికొంటినని మిక్కిలిసంతోషించుచు బండిలో హాయిగాఁ బండుకొని తెల్లవారునప్పటికిఁ దాడేపల్లిగూడెము వెళ్లి రైలుబండెక్కి నిడదవోలు జేరెను. దామోదరయ్య రాకకై యెదురుచూచుచున్న గోవిందరాయనికతని రాక పరమానందముఁ గలిగించెను. దామోదరయ్య తాను రఘుపతిగారినిఁ గలిసికొనుట, తనవచోనైపుణిచేవారినెల్లవశము జేసికొనుట మొదలైన తనప్రజ్ఞనంతయు గోవిందరాయనికెఱుఁగఁ జెప్పి యిట్లనియె.

"గోవిందరాయఁడుగారు! రఘుపతిగారివైభవమెటువంటిదనిచెప్పను. ఆపిల్ల మనజగన్నాథరావునకుదక్కెనామనమెంతో యదృష్టవంతులము పిల్లచాలలక్షణమైనది. ఆపిల్ల యేయింటిలో అడుగుపెట్టునో యాయిల్లు లక్ష్మీప్రసన్నమైయుండును. ఆయనకు నాలుకు నాలుగువేల రూపాయలువచ్చును ఒక లకారము నడ్డిమీద తీరుగుచున్నది. ఆయన కుమారుఁడు చాలజబ్బుగానున్నాఁడు. వాఁడుబ్రతుకఁడుఆసంస్థానము మనజగన్నాథరావునకేదక్కును. ఒకడాబుడాబినాను. పిల్లవాఁడికిగ్రహబాధనిచెప్పి మంత్రపువిభూతిచ్చినాను. కర్మముచాలకవాఁడు బ్రతికెనానాలుగైదువందలరూపాయలు గుంజివేయగలను. వాఁడుచచ్చెనా ఆస్తిపిల్లదే. ఎవఁడు రేఖవేసికొనిపుట్టినాఁడో కానిమంచియదృష్టవంతుఁడుదానిమగఁడు. శంకరరాజుగారిని పిలిపించినపక్షమున వారిక్కడకువచ్చి తాంబూలము పుచ్చుకొందురు. మూడువేలరూపాయలుముందుగానే యిమ్మని చెప్పినాను. వారందు కంగీకరించినారు. రానుపోనకర్చులిచ్చుకొనుటకు, వియ్యపురాలిలాంఛనములక్రింద నయిదువందలిచ్చుకొనుటకు వెండిచెంబులు పట్టుపంచెలుపళ్లెముకట్నములో చేర్చకుండా వేరేయిచ్చుటకు ఏర్పాటుచేసినాను. పిల్ల పసుపుకుంకుమక్రింద రెండు మూఁడుపుట్లభూమికూడ యియ్యదలచుకొన్నాఁడు. 'ఆలస్యమమృతం విషమన్నాఁడు.' 'శుభస్యశీఘ్రి'మన్నాఁడు. త్వరగా తాంబూలముపు

చ్చుకోండి! ముందురూపాయలుచేతిలోపడనీయండి! తరువాతచూచు కోవచ్చును. శంకరరాజుగారిని పిలిపించండి. కష్టపడి కోయరాని కోతలు కోసి సంబంధము కుదిర్చినాను. తరువాత మీదయ."

అనవుఁడు గోవిందరాయఁడు మందహాసముచేసి మీఁదఁజెయి వయిచిచఱచి "నీవువెళ్ళినతరువాత కార్యసాధనముకాకపోవునా!నిన్ను పంపించిన దెందు"కని ప్రశంసించి తక్షణమే శంకరరాజుగారినిరమ్మని జాబువ్రాసెను. మరునాఁడు శంకరరాజుగారువచ్చిరి. తాంబూలములు పుచ్చుకొనుటకై రఘుపతిగారిని రమ్మనిదామోదరయ్యజాబువ్రాసెను. జాబుచూచుకొని రఘుపతిగారు తనతోబుట్టువుభర్తయైన సూరంపూడి కృష్ణంరాజుగారినిఁ దనపురోహితుని మూఁడువేలరూపాయలిచ్చి తాంబూలములు పుచ్చుకొమ్మని నిడదవోలుపంపిరి. కృష్ణంరాజుగారుమూడువేలరూపాయలు శంకరరాజుగారి కిచ్చిరి. తాంబూలములు పుచ్చుకొనిరి. ముహూర్తము నిర్ణయముచేసి పంపుదుమనిశంకరరాజుగారు వారితోఁజెప్పి గోవిందరాయఁడుగారియింటనే పిండివంటలతో భోజనముబెట్టి వారినిబంపిరి. మాటదక్కకపోయినను మూఁటదక్కెను.

రూపాయలమూటచేతఁబడఁగానెశంకరరాజుమదపుటేనుఁగంత మనుష్యుఁడయ్యెను. అతని నిద్రిపోనియ్యక యన్నము దిననియ్యక కొంతకాలమునుండి వేధించుచున్న మనోవేదన తీరిపోవుటచే తనజన్మము ధన్యమైనదని యతఁడు భావించెను. "బావా యింక నాకన్నము రుచించును. ఇఁక నాకు నిద్రపట్టును. నీదయవల్ల లంక దామోదరయ్యదయవల్ల నేను బ్రతికితిని. కాని జగన్నాథము దీనికొప్పుకొని మాట దక్కించవలెనుకదా. ఆవిషయమై నీవుగట్టిగృషిచేయవలయు" నని శంకరరాజువలుక గోవిందరాయఁ డిట్లనియె. కొంతకాలముపోయినతరువాత జగన్నాథరావుతప్పకమనమాటవినవచ్చును, ఇంతవరకు వచ్చినతరువాత మోటతనము చేయఁడు. కన్నులుమూసికొనియే

దోవిధముగ పుస్తె ముడివేయును. ఆపని జరిగినపక్షమున తరువాత మాట చూచికొనవచ్చును. జగన్నాథము సమ్మతించువఱకు మన మేదో వంకజెప్పి ముహూర్తనిర్ణయము చేయకుండవలయును." అన వుడు శంకరరాజు సరేయని యాసొమ్ముదీసికొని మరునాఁడుభీమడోలు వెళ్ళెను.

తల్లాప్రగడ రఘుపతిగారు తాంబూలమునుపుచ్చుకొన్నపిదప పదిదినములైనతరువాత ముహూర్తనిశ్చయము జేయవలసినదని శంక రరాజుపేర జాబువ్రాసిరి. ఆజాబునకు శంకరరాజుత్తరమే వ్రాయ లేదు. ఆయన మరల రెండవజాబు వ్రాసెను. దానికైనను శంకరరా జు ప్రత్యుత్తరము వ్రాయలేదు. రఘుపతిగారంతట దమ పురోహి తుని బంపిరి. ఆయన భీమడోలువెళ్ళి శంకరరాజును గనుఁగొని సుము హూర్తము నిశ్చయించుమనిశంకరరాజును వినయపూర్వకముగనడిగె ను. ఆమాటలు శంకరరాజున కమితాగ్రహముగలిగింప నతఁడిట్లుత్తర ముజెప్పెను. "ఏమిటాతొందర మేముగూడ వీలు చూచుకొనవల యునా వద్దా. మాపిల్లవాఁడు చెన్నపట్టణములోనున్నాఁడు ఆతనికిఁ బరీక్షరోజులు పెండ్లికోసము పరీక్ష చెడగొట్టుకొని రావలయునాయే మిటి? నేనాలాగున రమ్మని మాపిల్లవానిపేరవ్రాయను. వ్రాసినప్పటి కి వాఁడురాఁడు. వచ్చువఱకు మీరు కనిపెట్టుకొని యుండవలయును" అనవుడు రఘుపతిగారిపురోహితుఁడు "సమస్తధర్మములుఁ దెలిసినవా రు తమరాలాగంటే చెప్పవలసినదేమున్నది? పిల్లపెద్దదిగనుక భయమ గుచున్నది. అందుచేత నేనాలాగున మనవిజేసినాను కాని మఱియొక కారణముచేతగాదు. తమరు వారికష్టసుఖములుగూడ కొంచెమాలో చింపవలయునని ప్రత్యుత్తరముజెప్ప శంకరరాజు మఱింత గోపించి పిల్లపెద్దదైనదాక నుంచుమని యెవరు చెప్పిరారు? అందుకు నేనేమి చేయను నాకొడుకు వచ్చినతరువాతముహూర్తనిర్ణయముజేయవచ్చు

ను ఈలోపుగ నాగుమ్మములోనికి రావద్దు తరువాత మీయిష్టమని కఠినముగఁబలికెను సామవాక్యములతనియొద్ద పనికిరావని తెలిసికొని పురోహితుఁడు చేయునదిలేక వెడలిపోయెను. పురోహితునిపలుకులు విని రఘుపతిగారు భయపడఁజొచ్చిరి అప్పటికి సెలవులింకను రెండు మాసములుండెను కన్నులుమూసికొనియేలాగో నా రెండుమాసములు గాలక్షేపము సేయుదమని రఘుపతిగారునిశ్చయించుకొనిరి ఆయనతల్లి యు భార్యయుఁ దక్కినచుట్టములు "పిల్ల కట్టుదప్పిపోవుచున్నది. ముహూర్తము త్వరగా నిశ్చయించి వివాహము చేయవలయును ఇఁక మీఁద పిల్లనుంచుటకు వీలులేదు సాటినియోగములో మన కప్రతిష్ట వచ్చుచున్నది మఱొకలాగైనపక్షమున మనము గంగాప్రవేశము గావలయున"ని రఘుపతిగారిని నిమిషనిమిషము తొందరబెట్టజొచ్చిరి ఆ రెండుమాసములు రఘుపతిగారు ముండ్లమీఁదనిలిచినట్లు నిలిచిరి తప్పక వేసవికాలము సెలవులలోవివాహమగునని రఘుపతిగారు పెండ్లి ప్రయత్నములఁ జేసిరి ధాన్యముదంపించిరి అప్పడములు, వడియములు వెట్టించిరి పచ్చళ్ళు చేయించిరి అంతలో వేసవికాలము సెలవులు వచ్చెను సెలవులిచ్చిన పదిదినములకు రఘుపతిగారు మరలవారిపురోహితుని భీమడోలు పంపిరి రఘుపతిగారిమనుష్యులను జూచినప్పుడెల్ల శంకరరాజుమనస్సు మండుచుండును తనదగ్గఅనున్న రూపాయ లెత్తుకొనిపోవుటకు వచ్చినదొంగను జూచినట్లె యతఁడా పురోహితుని జూచెను ఆబ్రాహ్మణుఁ డడిగినమాటలలో నొక్కదానికైన సరియైనప్రత్యుత్తరమియ్యకపోయెను మీఁదుమిక్కిలియాబ్రాహ్మణుని దూషించి యతనిం బంపిసరఘుపతిగారిపై నిందారోపణలుచేసి ఛీ! పరువుతక్కువ సంబంధము వచ్చినది మాగౌరవమునకుఁ దగనివారితో సంబంధము జేయవలసివచ్చినది పెద్దపిన్న యెఱుఁగరు మేము దొంగలమనుకున్నారాయేమిటి. మాటిమాటికి మనుష్యులనుబంపించి బాధపెట్టుచు

న్నారు మాయిష్టమువచ్చినప్పుడు మేము తరలివత్తుము కావలెనంటే పదిరోజులుకలదనఁగాఁ దెలియఁజేయుదుము. అంతేకాని యీరాయ బారాలతో మాకక్కఱలేదు మావాఁడు వేసవికాలములోనిక్కడ చాలవేఁడిగానున్నదనిచెన్నపట్టణములోనేయుండఁదలఁచుకొన్నాఁడు పెండ్లికిమాత్రము వచ్చును వ్యవహారముచూడఁగా శుద్ధవైదికములా గున్నది కాని లౌక్యముగాలేదు, అని పరుషవాక్యములాడి యతనిని బంపెను ఆపలుకులువిని పురోహితుఁడు చిన్నబోయి తనసందేశార్థము లు రఘుపతిగారి కెఱింగించెను రఘుపతిగారికి గొప్పసంకటము సంభ వించెను ఆసంబంధమువదలుకొనుటకుగాని వదలుకొనకపోవుటకుగాని వీలులేదని యాయన విచారింపజొచ్చెను వదలుకొన్నపక్షమున రెండు బాధలాయనకుపొడగట్టజొచ్చెను మూఁడువేలరూపాయలునష్టపోవుట మొదటిబాధఁ ధననష్టమునకొడంబడినను శంకరరాజునీతిలేనివాఁడగు టచే యాసంబంధము కాకపోవుటకు హేతువెవ్వరైనఁ దన్నడిగినపు డు రఘుపతిగారి సాంప్రదాయము మంచిదికాదు, ఎఱుఁగక మొదట చేసికొనదలఁచితిమి. తెలిసినతరువాత నేనే మానుకొంటిననియైన వా డుకవేయును అటు కానిపక్షమున వారి పిల్లకంటిలో నేదోకాయయు న్నది పువ్వున్నది వెన్నమీఁదమచ్చలున్నవి యనియైన నింద వేయ వచ్చు"ననియతఁడు భయపడఁజొచ్చెను ఏమిజేయుటకాయనకుఁదోఁచ లేదు ఆలోచన చెప్పువారుసయిత మిదమిత్థమని కార్యనిర్ణయముఁ జేయలేకపోయిరి ఏదోవిధముగ శంకరరాజుగారిని కాళ్ళపైఁబడి వేడి కొనియైన సత్వరముగ వివాహముసేయుట కర్తవ్యమనిరఘుపతిగారు నిశ్చయించి తానే భీమడోలు స్వయముగావెళ్ళి శంకరరాజుతోమాట లాడవలయునని సంకల్పించిరి. ఆసంకల్పప్రకారము రఘుపతిగారుమం చిముహూర్తమునబయలుదేఱి కాగల వియ్యంకుఁడుగారి దర్శనార్థము అగిరి. శంకరరాజు వియ్యంకుని గౌరవించెను. భోజనానంతరమురఘు

పతిగారు వివాహముమాట తలపెట్టి వినయవృత్తుల నిట్లనిరి. బావగారు మీకన్న నేను చిన్నవాఁడను నావల్ల నేవైన వాచాదోషము లున్న యెడల క్షమించి నామనవి చిత్తగించవలెను. పిల్ల యెదిగి కూర్చున్న ది. ఉంచుటకువీలులేదు. ప్రధానముచేసికొనిమూడుమాసములైనది మాచుట్టాలలో నగుబాటుగ నున్నది. తల యెత్తికొని తిరుగుటకువీ లులేదు. సెలవుదినములలో వివాహము తప్పక జరుగునని మీరుమా పురోహితునితో సెల విచ్చినారు. కాఁబట్టి నాయం దనుగ్రహించి యీసెలవుదినములలో వివాహము జరిపించి నన్నొక దరికి జేర్పవల యునని వేఁడుకొను చున్నాను. మీఁద తమ చిత్తము."

రఘుపతిగారినోట వెడలిన మాటలలో కోపముఁ బుట్టించునట్టి దొకటియు లేక పోవుటచేతను బురోహితుఁడు మొదలయిన వారితో మాటలాడిన విధముగ నతనితో మాటలాడఁగూడ దని మనంబునఁ దోఁచుటచేతను శంకరరాజు నమ్రభావముతో నిట్లనియె. "బావగా రు! మి మ్మిబ్బంది పెట్ట వలయునని నా కెంతమాత్రము లేదు. మీ మెడలో పేగు దీసి నామెడలో వేసినపుడు మీకష్టసుఖములు నేను,నా కష్టసుఖములు మీరు జూచికొనవద్దా. మీపిల్ల యొకటి నాపిల్లయొక టియునా. నేను బుద్ధిపూర్వకముగా నాలస్యము జేయుటలేదు. మాపి ల్లవాని యాలస్యము లేదు. చెన్నపట్టణ మింతకంటెఁజల్లగా నుండునని మావాఁడక్కడనేయున్నాఁడు. ముహూర్తనిశ్చయముకాఁగానే వత్తు నని చెప్పినాఁడు. చేతిలో కర్చుకు సొమ్ములేక యిబ్బంది పడుచు న్నాను. అదిముఖ్యకారణ మాలస్యమునకు. మీరిచ్చినరూపాయలుపె ట్టి మంచి భూమికొన్నాను. అందుచేత నాకిప్పుడు డబ్బుచిక్కుగాను న్నది. నాకు రావలసినడబ్బు చాల యున్నది. కాని యదియిప్పుడు వచ్చునని ధైర్యములేదు. ఇందుచేత నేనేనుముహూర్తనిశ్చయముచేయు టకు తటపటాయించుచున్నాను. సాధ్యమయినంతత్వరలో ముహూర్త

నిశ్చయముచేసి పంపుదును." అని యుత్తర మిచ్చుటయురఘుపతిగారు కుమార్తెవివాహ మెట్లయిన ద్వరగాఁ జేయవలయునని తలంపుచే శంకరరాజునకుఁ గావలసినసొమ్ము తానే యిచ్చినపక్షమునవివాహము త్వరగా నగుననినమ్మి "బావగారూ! కావలెనంటె కర్చునకుసరిపడిన సొమ్ము నేను బదులిచ్చెదను. పుచ్చుకొని ముందు వివాహము జరిపించండి" యని బదులు చెప్పెను. "అబ్బో!వడ్డికిబదులు తెచ్చి నేను వివాహము చేయఁగలనా!యేదోనాకు సొమ్ము రావలె చేయవలె"నని శంకరరాజుత్తరము చెప్పెను. "మీరు వడ్డి నాకివ్వనక్కఱలేదులెండి. అసలుమాత్రమీయండి. నేనింటికివెళ్ళి వేయిరూపాయలుపంపుదునా" యని రఘుపతిగారు పలికి. "వేయిరూపాయలు చాలవు. తల్లాప్రగడ రఘుపతిగారియింటికితరలి వెళ్ళునపుడు వేయిరూపాయలొకలెక్కా. రెండువేలరూపాయలుపంపించండి" యనిశంకర రాజుచెప్పెను "సరె ఆలాగే పంపెదను తిరిగి యెంతకాలములో మీరీసొమ్ముపంపించగలరని రఘుపతిగా రడిగిరి." రెండు మూడు మాసములలోపంపించగలనని శంకరరాజు చెప్పెను "సరే యింటికి వెళ్ళిపంపెద" నని రఘుపతిగారు ప్రత్యుత్తర మిచ్చి "నోటు వ్రాసెదరా" యని యడుగఁ దలఁచియు దానివలన శంకరరాజు కోపించి కార్యభంగము సేయునేమోయని యట్లడుగుట మాని సాయంకాలమురయిలుబండియెక్కి తాడేపల్లిగూడెముదగ్గఱ దిగి బండిచేసికొని యత్తిలి వెళ్ళిమరునాఁడు రెండువేలరూపాయలు తన బావమఱఁదిచేత శంకరరాజునకుఁబంపిరి ఆసొమ్ము పుచ్చుకొని శంకరరాజు "వారము దినములలోపుగనేము హూర్తము పెట్టించి పంపుదు నని చెప్పండి. ఈలోపుగమాపిల్లవానిని రప్పించెద" ననీ యతని బంపెను. ఆలస్య మమృతం విషమ్మనులోకోక్తి శంకరరాజుపట్ల విపరీత మయ్యెను. ఆలస్యముకార్యభంగమని యీసామెతయొక్క తాత్పర్యము. ఆలస్యముశంకర రాజునకుపకార మే

చేసెను. కాని యపకారము చేయలేదు. ఆలస్య మాయనకు రెండువే లరూపాయల లాభము గలిగించెను. ఇది ఋణమే కదా లాభ మెట్ల యైనని చదువరులు సందేహింప వచ్చునుకాని యట్టి సందేహము నకు బనిలేదు. నోటులు దస్తావేజులు మొదలయిన కాగితము లు న్నపుడె ఋణ మెగబెట్టఁజూచునట్టి శంకరరాజు పద్దైనలేకుండనందు లో వియ్యంకునివద్ద బుచ్చుకొన్న సొమ్ము మరలనిచ్చుననికానినిన్య వలయునను తలంపు కలలోనైన నుండెననికాని యెవరైనఁదలఁచిన పక్షమున నది వట్టి పొరబాటు. ఈయదృష్ట మతనికిఁ గలుగుననియ తఁ దెన్నడనుకొనలేదు. తలవని తలంపుగ వచ్చి పడినది. అందుచే శంకరరాజు తన భాగధేయము నగ్గించుచు నటుమీఁదనాలస్యముజే యఁ గూడదని నిశ్చయించి రూపాయలు పుచ్చుకొన్న దినముననెగో విందరాయఁడును రమ్మని వర్తమాన మంపెను. వచ్చినమనుష్యునితో నె గోవిందరాయఁడు భీమడోలు వెళ్ళెను. శంకరరాజతనితో ముహూ ర్తముమాట తలపెట్టెను. "జగన్నాథరావును రప్పించుట కేదైన దారియున్నదా?" యని గోవిందరాయఁడడిగెను. అనపుడుశంకరరా జిట్లనియె. "మీ యప్పను దీసికొని నీవు చెన్నపట్టణము వెళ్ళితివా జగన్నాథము తప్పక రావచ్చునని నాకునమ్మక మున్నది. తల్లిమీఁద వానికెంతో ప్రేమ. తల్లిమాట కడుగు దాటఁడు. తల్లివెళ్ళినీవు రెం డవ వివాహముఁ జేసికొనవలసినది. లేకపోతే నేనేనూతిలోనో గోతి లోనో దిగి ప్రాణము విడువదలఁచికొన్నానని గట్టిగాఁజెప్పినపక్షమున వాఁడు వినితీరును. సందేహము లేకుండ తల్లిగట్టిగా యామాట లని తీరవలయును. దానితో వానిమనస్సు తిరిగిపోవును" అనుటయుగో విందరాయఁడు "శహబాసు బాగున్నదండీ బావగారు! మీయుపాయ ము. సరే యీరాత్రియే మేము వెళ్ళేదము అయితే మీరు మరల రెండువేలరూపాయలు పుచ్చుకొన్నారటేమివారివద్దనుంచిఇదినిజమే

నా" యని పలికెను. "ఆహా నిజమే కర్చులకు సొమ్ములేక బదులు పుచ్చుకొన్నాను. అంతేగాని యుచితముగా గాదు ఇదిపుచ్చుకొనబట్టి మనమీఁద భారమెక్కువయినది త్వరగాజగన్నాథమునుదీసికొని రా" యని యతఁడు బదులుచెప్పెను. "గట్టివాడవయ్యా బావగారూ! నీదగ్గఱనసాధారణశక్తియున్నది. డబ్బులాగుటలోనీవంటివానిని నేను చూడలే" దని పలికి చెన్నపురి ప్రయాణమునకు వలసినప్రయత్నములు చేసికొనజొచ్చెను. చెన్నపురివెళ్ళవలసినదనిశంకరరాజు భార్యతోఁజెప్పెను. కుమారుఁడు దృఢమనస్కుఁడగుటచేతదాను చెప్పినట్లు వినకపోయినను నీపనివలన నతని గన్నులార నొకసారిచూచుటకవకాశముగలిగిన దని యామె సంతోషించి ప్రయాణము కొప్పుకొనెను. తోబుట్టువును దీసికొని గోవిందరాయఁడు రైలుబండియెక్కెను బండిలో జనులసంఖ్య మితిమీరి యుండుటచే వారు రాత్రిచాలసేపు నిలిచి యుండవలసిన వారయిరి తరువాత గూర్చుండుటకుగొంతచోటు దొరికినను వారొక్కమార్గయినను గన్నుమూయుట కవకాశము లేకమిక్కిలి శ్రమపడి యలసి మరునాఁ డుదయమునఁ జెన్నపురి జేరిరి. గోవిందరాయఁ డదివఱకు చెన్నపురిజూచియున్నందునవారిరువురు రామస్వామి మొదలియారిగారిసత్రమునకుఁబోయిరి పూటికూళ్ళయింట భోజనము సేయుమని గోవిందరాయఁడుతోబుట్టువునుబలవంతపెట్టెనుగాని ప్రాణముపోయినను సరేయామె పూటకూళ్ళయింట దిననిస్పష్టముగఁ జెప్పెను వంటచేసికొనుట కామెసమ్మతించెను కానియదివఱ కెవరో వండుకొన్న ప్రొయ్యి యలుకుకొనుట కాపుపేడ యచ్చట దొరకనందుననామెవంటచేయుటకిష్టపడలేదు. నీళ్ళకుళాయి యదివఱ కామె యెన్నఁడుఁజూచి యెఱుఁగదు. "అన్నివర్ణములవారు వచ్చి కుళాయినీరు తోడుకొనుచుండుటచే నానీటితో స్నానముజేయుటకయిన నామెమన సొప్పలేదు. అందుచేత నామె యాపూట

భోజనమే చేయనని సోదరునితోఁజెప్పి యతనినిపూటకూళ్ళయింటభో జనము జేయుమనెను. గోవిందరాయఁడు స్నానము చేసి సత్రములోనె యున్న పూటకూళ్ళయింటికి భోజనార్థ మరిగి కూర్చుండెను. అతని పంక్తిని గొందఱు తొడిగికొన్న చొక్కాలు కోట్లువిప్పకుండగనుకొం దఱు నెత్తిమీఁద టోపి దీయకుండగను కొందఱు కాలిజోడైన వదల కుండగను కొందఱు కనుల సులోచనములయినఁ దీయకుండగనుభో జనము చేయుచుండిరి. అతని కది మిక్కిలి నసహ్యమగుటఁజేసి ముం డ్లమీఁదఁగూర్చుండినట్లు గూర్చుండి క్షుద్బాధానివారణార్థమునాలు గు మెదుకులు నోటిలో వైచికొని నాలుగు పండ్లైనదిన మనిఁతో బుట్టు వును వేడుకొనెను. కాని యామె యెంతమాత్రి మొడంబడనందునబం డితీసికొనివచ్చి యామెం దోడ్కొని మేనల్లునిబసకుఁ బోయెను. వెను క గోందరాయఁడు వచ్చినపు డేబసలో నుండెనోయిప్పుడునుజగన్నా ధరా వాబసలోనె యుండెను. ఆతఁడు తల్లిని మేనమామను జూచివా రి రాకకు మిక్కిలి యక్కజంపడి "మామయ్యా! ఇదియేమిటి? అమ్మ నుగూడ దీసికొని వచ్చినావు. లోపలికిరండి." యని వారిని తన గది లోఁబ్రవేశపెట్టెను. అప్పుడు కేశవరాజు చెన్నపురిలో లేఁడు. సెలవు దినము లగుటచే నతఁడు పెనుగొండవెళ్ళెను. కేశవరాజు లేకపోవుటచే త స్వేచ్ఛగా మాటలాడికొనుట కవకాశముగలిగినదనిగోవిందరాయఁ డు సంతసించెను. వారుగఁదిలోనికి రాఁగానె తల్లి కుమారునిగౌఁగలిం చుకొని చిరకాలమునుండి తైలాభ్యంజన మెరుఁగక యున్న యతని శి రస్సును బాష్పబిందువులచే నభిషేకించి ముద్దుపెట్టుకొని "నాయనా! యెంతకాలమయినదిరా చూచి. డబ్బులేక నీవు నానాబాధలు బడు చుండఁగా నేను జీవచ్ఛవమునై బ్రతికియుండి నీకష్టములు చూడవలసి వచ్చెను. నాయనా చిక్కసగమైనావు. నేను చచ్చినా బ్రతికినా యొక టే నీకని యొక్క నిమిషము విచారించెను. జగన్నాధరావుకన్నుల

నుండి యొకటి రెండు బాష్పబిందువులు స్రవించెను. ధైర్యవంతుఁ డగుటచే నవి అడంచుకొనలేదు. యతఁడు "అమ్మా! నేను సుఖముగా నున్నాను. నీవు విచారించనక్కరలేదు. నీవు భోజనము జేసితివా" యని యడిగెను. ఆమాటకామె యుత్తర మీయలేదు. కాని గోవిందరాయఁ డందుకొని "యబ్బాయీ మీయమ్మ యాచారము నీవెఱుఁగుదువుకదా. పొయ్యి యలుకుకొనుట కావుపేడ కావలయునఁట కొళ్ళాయిలో స్నానము చేయదఁట కొళ్ళాయినీరు త్రాగదఁట నాలుగుపండ్లయినఁ దిన్నదికాదు. నేనేమిచేయుదు." నని పలికి "యీవైపున మనవా రెవ్వరైన నున్నారేమో చూచి వారియింటికిఁదీసికొనివెళ్ళు" మని చెప్పెను. తల్లి యుదయమునుండి భోజనము సేయనందు కతఁడెంతో నొచ్చుకొని క్షణమాలోచించి గంగనామంటపముదగ్గఱనున్న తన మిత్రుఁడైన దేశరాజు శోభనాద్రిరావుగారియింటనామెకుబసయనకూలముగా నుండునని నిశ్చయించి వెంటనే యతనియింటికిఁబోయి తన తల్లిరాకయు ఛాందసాచారముచేత నామె భోజనము చేయఁపోవుటయు నెఱిఁగించి వండుకొనుటకు చోటిమ్మని యడిగెను. అడుగుటయు నతఁ "డయ్యో! జగన్నాథరావు మీయమ్మమాయింట వేరేవండుకొనవలయునా మనము సాటి నియోగులము. మాయింటమీరు మీయింట మేము భోజనములు చేయఁదగినవారము. నిన్ను చూచుటకు మీయమ్మ వచ్చినపుడు రెండురోజులు పనికి వేరేపొయిపెట్టివండవలయునా. మాయమ్మకు మీయమ్మకంటెనెక్కువాచారము. పొయిలలుకుకొనుటకు విస్తరాకులు తీసినతరువాత శుద్ధిచేయుటకు రోజుకు రెండుడబ్బులుపెట్టియావుపేడకొని తెప్పించుచున్నది. ఈయింట రెండుకొళ్ళాయిలున్నవి. ఒకటిప్రత్యేకము మానిమిత్తము. రెండవది పనివాళ్ళ నిమిత్తము. కాఁబట్టిమీయమ్మను మాయింటికి తీసికొనిరా యని పలికెను. పలుకుటయు "సరే బ్రతికినానోయినాయనా" యన యతనిం బ్రి

శంసించ తన బసకుం జని తల్లిం తోడ్కొని వారియింటి కరిగెను.

ఆమె యచ్చట స్నానముచేసిభోజనముఁ జేసెను. పిమ్మట జగన్నాథరావు మేనమామను తాను భోజనము చేయున్న పూట కూళ్ళయింటికి దోడ్కొనిపోయి యిరువురు భుజించిరి. భోజనానంతర మున జగన్నాథరావు శోభనాద్రిరావుగారియింటి కరిగి తల్లిని దనబస కుఁదోడ్కొనిపోయి మడతమంచ మామెకును బరుపు మేనమామకు నిచ్చి పండుకొమ్మని చాపమీఁదఁ దా నొకరొజాయి పరచి పండుకొన దలఁచెను. తల్లియు మేనమామయు నేదోవివాహవిషయమైన పనిమీఁ దఁ దండ్రిపంపున వచ్చియుందురని యతనికి మొదటినుండియుసంశయ ము మనస్సులోఁ గలిగెను. అందుచేత మీరిక్కడికేలవచ్చినారనివారి నడుగకయెయతఁడామాటయు నీమాటయుఁ జెప్పుచుఁగాలయాపనముఁ జేయఁజొచ్చెను. పక్కలు పరచుకొన్నతరువాత జగన్నాథరావుపండు కొనఁబోవుచుండఁగా గోవిందరాయఁడు "అబ్బాయిమీయమ్మ యెం దుకువచ్చినదో నీవు కనుగొన లేదుకదా. అంతదూరమునుండి యింత దూరము పెద్దది కదలి వచ్చినదికదా యెందుకు వచ్చినదో తెలిసికొన నక్కఱలేదా"యని యీవిషయము కదిపెను. కదుపుటయు "మామ య్య కనుగొనుటకుఁ గనుఁగొనక పోవుటకు నవకాశమేది. వచ్చినది మొదలుకొని భోజనపుప్రయత్నమే చేసితిమికదా ఇప్పుడేకదా మన ముపచ్చినా" మని జగన్నాథరావు బదులు జెప్పెను. అప్పుడు తల్లి యాప్రసంగ మందుకొన, అవునురా గోవిందరాయుఁడు వ్యవధానమే ది. అబ్బాయి చెప్పినట్లు వచ్చినది మొదలుకొనిభోజనంప్రయత్నము నకె సరిపోయెను. ఇప్పుడేకదా తీరికయైనది. నాకురాత్రి బొత్తిగాని ద్ర లేదు. ఎంతో బడలికగనున్నది. కన్నులు మూతపడిపోవుచున్నవి. నేను మేలుకొనలేను. నీవుగూడ నెంతో యలసిపోయినావు. ఇప్పుడు మాటలాడక పండుకొని రేపుదయము మాటలాడుకొంద"మని పలి

కెను "సరే నీయిష్టమని గోవిందరాయఁడు పండుకొనెను. అందఱు నిద్రపోయిరి మరునాడుదయమున వారు దంత ధావనాదికృత్యములు దీర్చుకొని గదిలోఁ గూర్చుండినప్పుడుతల్లి కుమారుని మీఁదఁ జెయి వైచి మెల్లగా శరీరము నిమిరి యిట్లనియె.

"నాయనా! నేను నీపనిమీఁదనెవచ్చినాను. ఆముహూర్తబలి మియెటువంటిదో కాని వల్లూరివారి సంబంధము చేసికొన్నదిమొదలు కొని వారికి మనకు చూపులు మాటలు పోయినవి వివాహ మయిన ప్పటికి భార్య పెద్దదైనప్పటికి బ్రహ్మచారివై పరదేశాలలో నీవుకాల క్షేపము చేయుచున్నావు కోడలువచ్చి కాపురము చేయునని యెం తో ముచ్చటనేనుపడితిని కాని యాముద్దుముచ్చటలునా మొగముమీఁ దలేవు మీబాబయ్యగారి సంగతి నీకుఁ దెలుసుకదా నాయనా! ఆ యన బ్రతికియుండఁగా వల్లూరివారి పిల్లను గాపురమునకు రానియ్య రు ఎన్నాళ్ళు నీవీలాగున దలిదండ్రులకుఁజుట్టాలకు దూరమయియుం డఁగలవు కష్టములు లేకుండ నీవు సుఖపడుటకు మీనాయనగారే దో దారి త్రొక్కినారు ఆదారిని నీవుగూడ నడవవలసినదని నాకోరిక నీవు మరియొకలా గనుకొనవద్దు. తల్లాప్రగడరఘుపతిగారి సంబం ధము నీకు మీబాబయ్యగారు నిశ్చయించినారు పండ్రెండేండ్ల పిల్ల మూఁడువేల రూపాయిలు కట్నముమీబాబయ్యగారికిచ్చినిడదవోలు లోప్రధానము జేసికొన్నారు కర్చులకు మాచేతిలో సొమ్ములేదని రెండువేల రూపాయిలు పైగా మున్న పంపించినారు ముహూర్తము త్వరగాఁ బెట్టి వివాహమునకురమ్మని వర్తమానముమీఁద వర్తమాన ము పంపుచున్నారు ఇదివరకాయన పురోహితుడు రెండుసారులువచ్చి నాడు. ఆయన యొకసారి స్వయముగా వచ్చినారు. వారు పిల్ల నా పుటకు వీలులేదట. రఘుపతిగారనఁగా మననియోగములో దేశప్ర ఖ్యాతిగాంచిన పురుషుఁడు. వల్లూరివారిమీఁద గిట్టకైతేనేమి డబ్బు

కక్కురితిచేతనై తేనేమి మీబాబయ్యగాను రఘుపతిగారిపిల్లనుచేసికొ నుటకు నిశ్చయించుకొని మాటయిచ్చినారు. ఇప్పుడుమాటతిరిగిపోతే బాగుండదు. ప్రధానమైనది. కట్నములక్రింద కానికలక్రింద అయిదు సంచుల రూపాయలు గ్రుమ్మరించారు. ఆయన సమస్త ప్రయత్నము చేసికొన్నారు. అటుకులు గూడ కొట్టుకున్నారు. నీకోసము కనిపెట్టు కొనియున్నారు. ఇదిగో అదిగో అని జరప గలిగినంతకాలము మీ బాబయ్యగారు జరిపినారు. ఇఁక జరుపుటకు వీలులేదు. ముందు మం గళవారమునాఁడు ముహూర్త మేర్పరచినారు. ఈముహూర్తముదాటిం చుటకువీలులేదు. ఇప్పుడు వివాహము జరుగకపోతే మనకుతలవంపు లె, వారికితలవంపులె. మనపేరు దేశదేశాలవెంట మోగిపోవును. గను క నీవీవిషయములో లేనిపోనిపట్టుపట్టకనాముద్దుచెల్లించి మీబాబయ్య గారిమాటవిని పెండికి రా. ఆయనపంతము చెలించినపక్షమున శాంత పడి నీయిష్టమువచ్చినట్లె మీబాబయ్యగారుకూడచేయఁగలరు. ఈమా టు మాటదక్కకపోతే మీబాబయ్యగారు నన్నుబ్రతుకనీయరు. ఆ యనకూడ నేమిసాహసము చేయుదురోయని భయమగుచున్నది. నా నాయనా నీవేకుటుంబము నిలబెట్టవలె. లేకపోతే నిష్కారణముగ మనకెన్నో యాపదలు రాగలవు."

అని పలికి యూరకుండుటయు నంతట గోవిందరాయఁడందు కొని "అబ్బాయీ! మీయమ్మ పెద్దదైనది. కాపురమునకు వచ్చిన దిమొదలుకొని మీబాబయ్యగారిచేత నానాబాధలుపడినది. నీవలన సుఖపడఁ దలఁచుకొన్నది. నీవుగూడ సుఖపెట్టక పెంకెతనముచేసినప క్షమున నీపదియాయము భీమడోలు వెళ్ళనని నాతో రైలుబండిలో స్పష్టముగఁ జెప్పినది. మీయమ్మమీకు దక్కదు. ఇప్పుడు వట్టిచేతు లతో నామెవెళ్ళినపక్షమున బాబయ్యగొంతుగోసివేయును వెనుక గొ య్యి ముందునుయ్యి యన్నట్లున్నది దానిపని. నీవు పెద్దవాఁడవు ప్రా

జ్ఞుఁడవు మంచిచెడ్డలు దెలిసినవాఁడవు పరువుప్రతిష్టలమాటయటుంచు ముందుమీయమ్మబ్రతికియుండవలెనంటేఈవిషయములోఆమెచెప్పిన ట్లుచేయుము తరువాత నీయిష్ట" మని యూరకుండెను తల్లియు మేన మామయుఁ బలికినపలుకులు వినుచుండ రాజరత్నమతని మనోవీథిని నిలిచెను హృదయము విషాదపూరితమయ్యెనుఅతఁడుమాటలాడఁజాల క తలవంచికొని యూరకుండెను ముఖము కళావిహీనమయ్యెను క న్నులు బాష్పపూరితములయ్యెను ఉత్తరీయ మతఁడు మొగమునవై చికొనెను అపుడుతల్లి కుమారునియవస్థజూచి జాలినొంది "నాయనా! విచారింపకు నీకీదుఃఖమెందులకు వచ్చినదో మేమెఱుగము రాజరత్న మునకన్యాయము జరుగునని నీవువిచారించుచున్నావు ముందుగామీ నాయనగారి పంతముచెల్లించి యీపెండ్లిచేసికోపంతముచెల్లినతరువా త మీనాయనగారు రాజరత్నమునుగూడదీసికొనివచ్చియింటిలోనుం డునట్లు నేనుజాగ్రత్తపెట్టెదను నీవిద్దఱుభార్యలనేలవచ్చును నాతండ్రీ నా మాటవిను నన్నుబ్రతికించు మీబాబయ్యగారి నొకదరికిజేర్చు నీవు దుఃఖపడుట నేను చూడలే" నని యుత్తరీయాంచలముతోఁ గన్నీరు దుడిచి గడ్డముపట్టుకొని బ్రతిమాలెను అప్పుడు జగన్నాథరావు శోక విహ్వాలమైన మనస్సుతో గద్గదకంఠముతో తల్లికిట్లనియె "సరె మీ యిష్టము వచ్చినట్లుచేసెదను నావలన నీకుగూడ బాధలు కలుగుచు న్నవని చెప్పితివి గాననేను నీయిష్టమువచ్చినట్లు బాబయ్యయిష్టమువ చ్చినట్లు చేయుటకు నిశ్చయించుకొన్నాను ఈసాయంకాలమె ప్రయా ణము నాచేతులు నాకాళ్ళు మీవి మీరెక్కడికి నడువుమందురొయ క్కడికి నాకాళ్ళునడుచును మీరేపని జేయుమందురో నాచేతు లాప ని జేయునుక్రొత్తపెండ్లికూఁతురునకు పుస్తె ముడివేయుమన్ననుసరె రాజరత్నము గొంతుకోయుమన్ననుసరె నాచేతులు తప్పకచేయును. ఈశరీరము మీవలనకలిగినది. గనుక దీనిపై మీకు సంపూర్ణాధికార

ముగలదు కాబట్టిదీనిచేత మీరు కావలసినపనిచేయించుకొనవచ్చును నామనస్సుమట్టుకు మీదికాదు. ఇఁకభోజనముచేసి ప్రయాణముకావలసినదె కాని నాతో మీరేవిషయము మాటలాడనక్కఱలేదు రానిన్ను దేశరాజువారింటికిఁ దీసికొనిపోయెదను. ఇప్పుడు తొమ్మిదిగంటలయినది ఈపాటికి వారియింట వంటయగును పద" యని తాను లేచి యుత్తరీయము మీఁదవైచికొని బయలుదేఱి "మామయ్యా! నేను వచ్చువఱకు నిక్కడుండు అమ్మనక్కడ దిగవిడచివచ్చెద నని తల్లిందోడ్కొని దేశరాజువారియింటికరిగి యామె కక్కడ దిగబెట్టితానును మేనమామయు స్నానముజేసి పూటకూళ్ళయింటికిఁబోయి భోజనము జేసిరి భోజనానంతరమున జగన్నాథరావు తన తల్లియు మేనమామయుఁ దనకడకువచ్చి మరలవివాహముజేసికొమ్మనిబలవంతపెట్టుటయుఁ దానందుల కంగీకరించుటయు లోనుగాగల వృత్తాంతములు కేశవ రాజునకు జాబువ్రాసి టపాలోవైచెను. గోవిందరాయఁడు దేశరాజువారియింటి కరిగి తనతోబుట్టువును మేనల్లుని బసకుఁదోడ్కొనివచ్చుచుమార్గములో "అక్కయ్యా! ఏదోవిధముగ వ్యవహారము చక్కబడినదికదా నీవురాకరాక వచ్చినావు. కాలుకదిపి మరలవచ్చెడుదానవు కావు ఇది గొప్పపట్టణము చూడవలసినవి శేషములెన్నో యున్నవి ప్రయాణమీనాటికాపి మధ్యాహ్నము రేపుదయమఁ జూడవలసినస్థలములచూచి రేపు వెళ్లుదమా" యని పలికెను. "నాయనా! చెన్నపట్టణము నెలదినములు చూచినప్పటికిఁ దనివితీరదని మీబావగారుచెప్పినారు. రెండుపూటలలో మనమేమిచూడఁగలము? అదిగాక జగన్నాథరావు తిక్క నేదోవిధముగఁదిరిగినది. ఈయూరులో వానికెందఱో స్నేహితులున్నారు వాళ్ళతోఁగలిసి వాఁడుమాటలాడిన పక్షమునమనను మాఱిపోవచ్చును కాబట్టి వెంటనే తీసికొనిపోవుదము ఈవేళెప్రయాణము ఇంతవఱకు మనము ధన్యులము దైవముమనపట్లనున్నాఁ"

డని బదులుచెప్పెను. అంతలో వారు బసకువచ్చిరి. తరువాత రెండు చిఱుచాపలు రెండిత్తడిబియ్యముకడుగు బుట్టలు నెయ్యివడపోయుట కినుపచిక్కమొకటి మరకోరమొకటి తెమ్మని యప్పగారుపంప గోవిందరాయుఁడు చీనాబజారునకుఁబోయి యవికొనితనకుఁగావలసిన సరకులు మఱికొన్నికొని నాలుగుగంటలకింటికివచ్చెను. అనంతరమువారు ప్రయాణమై స్టేషనుకు బోయి రైలెక్కి మరునాఁడుదయమున భీమడోలులోదిగిరి. కుమారునిమొగము జూడఁగానె శంకరరాజు మొగ మానందాతిశయమున వికాసమునొందెను. తనజన్మము ధన్యమైనదని తాను కృతకృత్యుఁడయ్యెనని తన కైదువేల రూపాయలు దక్కినవని తలంచి పరమానందభరితుఁడై "నాయనా! వచ్చినావా" యని కొడుకు నపరిమిత ప్రేమతోఁబలుకరించెను. వెనుఁటియాగ్రహమంతయు ననుగ్రహముగమారెను. ఆమధ్యాహ్నమే శంకరరాజు భార్యను బిలిచి ముహూర్తమింక నాఱుదినములున్నది. అప్పడములువడియములు బెట్టు. అటుకులుకొట్టించు. కావలసిన ప్రయత్నమంతయుఁ జేయుమనిచెప్పి చుట్టాలను బిలువుమని గోవిందరాయని నియోగించెను. జగన్నాథరావు మనోవికాసశూన్యుఁడై తన్నుఁ జూడవచ్చినగ్రామవాసులకు స్నేహితులకుఁగనఁబడక యేదోగొప్పనేరముచేసినవాఁడు సిగ్గుపడి దాగొనునట్లు తనగదిలోనె గూర్చుండుచు నెవ్వరితోడమాటలాడక రోగపీడితునట్లు సర్వకాలములయందు మంచముపైఁబండుకొనుచు నేమియుందోచనప్పుడేదో పుస్తకముఁజదువుకొనుచుఁగాలక్షేపము సేయఁజొచ్చెను. అతనికి రాత్రులుసరిగ నిద్రపట్టుటలేదు. పట్టినను బహువిధస్వప్నములచేత దానికి భంగము కలుగుచు వచ్చెను. ఒకసారి రామలింగస్వామివచ్చి తనచేతులు గడ్డము బట్టుకొని "నాయనా! నా బిడ్డగొంతు కోయఁదలఁచుకొంటివా" యనియేడ్చినట్లును మఱియొకసారి కేశవరావు జెట్టయెదుటనిలిచి, జగన్నాథరావు! నీవుచదువుకొన్నచ

దువంతయు బూడిదలోఁబోసినపన్నీరైనదిగదా యనితన్ను పెండ్లిపీట మీఁదనుండి క్రిందికీడ్చినట్లును వేరొకసారి రాజరత్నము బాష్పాకులి తనేత్రియై తనప్రక్కనిలిచి జాలిగొలుపు చూపులు తనపైఁబ్రసరింపఁ జేసినట్లును గలలు కనఁజొచ్చెను. ఒకసారియర్ధరాత్రిమున లేచి మంచ ముమీఁద బాసెనపట్టువెచికొని కూర్చుండి తనలో నిట్లుతలంచెను. "అయ్యయ్యో! నేనెంత ఘోరకృత్యము జేయుచున్నాను. ఆశాపాశ బద్ధులైన తలిదండ్రులమాటవిని యేదోషమెఱుఁగనిదానిని నన్నేనమ్ము కొని యున్నదానిని కుశలసలపన్న రాలును నగ్నిసాక్షిగ వివాహమైన దానినివిడుచుచున్నానుగదా. నేనుచదువుకొన్న శాస్త్రవిద్యవ్యర్థమైన దికదా. తల్లి బలవంతముచేత తండ్రిపరువు నిలబెట్టవలెనన్న యళికకా రణముచేత నేను పాపముచేయుచున్నానుకదా. తండ్రి పాపము చేయు మన్నపుడు పాపముచేయక ధైర్యమే సహాయముగలిగి నీతికి నిలువం బడిన ప్రహ్లాద చరిత్రము నేను చదువుట వ్యర్థమైనదికదా! ఆధైర్య ము నాకులేకపోయినది కదా. ఎందుకీచదువు. ఎందుకీ పాడుబ్రతుకు. నావంటి నీతిమాలినవాఁడు భూమికిభారము. ఏనూతిలోనైనదిగి యీ బ్రతుకునకేల సమాప్తముకలిగింపఁగూడదు." అని చివాలున లేచి తలుపుదీసికొని యాత్మహత్యయందుఁ గృతనిశ్చయుఁడై వీధిలోనికి వచ్చి యెవరు లేరుకదాయని యిట్టటుఁజూడఁదొడఁగెను.

అప్పుడెక్కడనుండియొ కఱ్ఱచేతబట్టుకొని శంకరరాజు వచ్చి "అబ్బాయీ! నిద్రిపోవుటలేదా. వీధిలోనెందుకు నిలిచియున్నా"వని యడిగెను. జగన్నాధరావప్పలుకులు విని తెల్లబోయిమనంబునఁగలత జెంది "యేమిలే దేమిలే" దని లోపలకుబోయితలుపుగడియవైచికొని నేనాత్మహత్య జేసికొనుట యీశ్వరున కిష్టములేదు. ఈశరీరము తలి దండ్రులదికదా, దీనిచేతవారిని సుఖపెట్టక వారిని మహాదుఃఖసము ద్రమునఁ బాఱవేయుటన్యాయమా? ఇఁక నేనాత్మహత్య జేసికొనను,

పరమేశ్వరా! "నాశరీరము నాప్రాణము నీయధీనము జేసితిని. నీసం కల్పము కొనసాగుగాక" యని కన్నులు మూసికొని క్షణకాల మీశ్వరధ్యానము జేసి పండుకొనెను.

రాత్రి చాలప్రొద్దుపోవువఱకు మేలుకొనుటచేత జగన్నాథరావు మరునాడుదయమున నిద్రమేలుకొనునప్పటికి నాలుగుగడియలప్రొద్దెక్కెను. వివాహమప్పటికి నాలుగుదినములుండుటచేత శంకరరాజు పెందలకడ లేచి పల్లకికి భజంత్రీ మేళమునకు బజానా యిచ్చుటకు చాకలిపెద్దను మంగలిపెద్దను బిలిపించి వాండ్రితో వ్యవహారము తెగకుండ బేరమాడఁజొచ్చెను. ఉదయమున రెండుగడియలప్రొద్దెక్కునప్పుడు మొదలుపెట్టి రెండుజాములగువఱకు నాయనబేరమాడెనుకానియది తెగలేదు. మధ్యాహ్నముమరలకలిసికొనవలెనని వారినాజ్ఞాపించిపంపి యాయన భోజనమునకుఁబోయెను. భోజనముచేసి లేచి శంకరరాజు చుట్ట కాల్చుకొనుచు నిట్టట్టు బచారుచేయుచుండ వీధితలుపుదగ్గఱ నొక కేక వినఁబడెను. ఎవరు వారని శంకరరాజు తలుపు తీసెను. అప్పుడొకమంగలి తనయుత్తరీయపుకొంగునగట్టినజాబుతీసి శంకరరాజు చేతికిచ్చెను. శంకరరాజులోపలికివెళ్ళి సులోచనములుపెట్టుకొని జాబు చదువుకొని "అయ్యయ్యో! వివాహమాగిపోయినదే" యని భార్యనుబిలిచి విన్నావటే రఘుపతిగారితల్లి హటాత్తుగా నిన్న రాత్రి పోయినదఁట. ఇదిగో మంగలిచేత నుత్తరముపంపినారు. వివాహ మాగిపోయినది. తరువాత మఱియొక ముహూర్తముపెట్టి పంపుదుమని వ్రాసినారుసరె. మనమిప్పుడు పల్లకికి భజంత్రీలకు బజానాయియ్యనక్కఱలేదు. పాపము! పెద్దది. మరుమరాలివివాహము కన్నులారఁ జూడకుండ వెళ్ళిపోయినది. ఆపిడకేమి యదృష్టవంతురాలని మంగలిని జూచి యోరీ నీవువెళ్ళవచ్చును. వెళ్ళుమని పలికెను. పలుకుటయు మంగలి "బాబయ్యగారు నొకరుకన్నముపెట్టించవలెననిమనవి" యని

దండముపెట్టెను. అన్నములేదు గిన్నములేదు వెళ్ళుమని చివాలున లోపలకుఁ బోయెను. పాపము మంగలివాఁడు పేరాకలితో మరల రైలుబండియెక్కి తాడేపల్లిగూడెముదగ్గఱ దిగి నడిచి యత్తిలి వెళ్లెను శంకరరాజుగారు తప్పక మంగలికి భోజనముపెట్టుదురను నమ్మకతో రైలుబండిఖర్చులుమాత్రమె యిచ్చి రఘుపతిగారు వానిని బంపిరి రఘుపతిగారు తల్లికుత్తరక్రియలునిర్వర్తించి పదిమూఁడవనాఁడు జ్యోతిష్కులఁబిలిపించి మరల ముహూర్తము పెట్టించుటకుఁ బ్రయత్నము చేయుచుండఁగా నెవఁడోవచ్చి రఘుపతిగారి పినతాతమనుమఁడయిన కైలాసరాయఁడు కోనాలలో రాచకురుపువలన మృతినొందెననిచెప్పిరి. అందుచేత మఱిపదిమూఁడుదినములు ముహూర్త మాగిపోవలసి వచ్చెను. ఆమైలవెళ్ళిపోయినతరువాత ముహూర్తముపెట్టించవలెనన్న మూఢమి ప్రవేశమగుచుండెను. వైశాఖమాసమంతయు మైలతోనె వెళ్ళిపోవుటచేతను జ్యేష్ఠమాసము మూఢమగుటచేతను నాషాఢము శూన్యమాసమగుటచేతను శ్రావణమాసములోఁగాని వివాహ మగుటకు వీలులేదని రఘుపతిగారును జ్యోతిష్కులును నిర్ణయించిరి. తల్లిపోయినదని వియ్యంకుని బరామర్శచేయుటకుశంకరరాజత్తిలివెళ్ళగా శ్రావణమాసములో వివాహముచేయ నిశ్చయించితిమని రఘుపతిగారాయనతోఁ జెప్పిరి. శ్రావణమాసమునాఁటికిమాయబ్బాయి చెన్నపట్టణము వెళ్ళకతప్పదు. అప్పుడు సెలవుపుచ్చుకొని వచ్చుటకు వీలుండునో యుండదో తెలియదని శంకరరాజుత్తరముచెప్పెను. "ఏలాగో కష్టపడి యైదుదినములు సెలవుపుచ్చుకొనిరావలెనని మీయబ్బాయితోఁజెప్పండి. ఇదివరకె పిల్ల కట్టుతప్పినది. ఇక నిలుపుటకువీలులేదు కదాయని రఘుపతిగారు ప్రత్యుత్తరము చెప్పిరి సరేయని వియ్యంకునికడ సెలవుపుచ్చుకొని శంకరరాజు భీమడోలు వెళ్ళెను.

జగన్నాథరావు మరల వివాహము చేసుకొనుటకు తానునిశ్చ

యించుకొన్నట్లును భీమడోలు వెళ్లుచున్నట్లును గేశవరాజు పేర జాబు వ్రాసెనుకదా. ఆజాబు చేరిననాఁడు; రామలింగస్వామిగారికుటుంబము యొక్కయవస్థ యెటులుండవలయునో యట్లుండెను. కేశవరాజుగాని రాజరత్నముకాని తలిదండ్రులుకాని పగటిపూట భోజనమే చేయలేదు. రాజరత్నమును గౌఁగలించుకొని తల్లి మిక్కిలివగచెను. రామలింగస్వామియు భార్యవాపోయినంత వాపోవకపోయినను గూఁతునుగౌఁగిలించుకొని అమ్మా! నాచేతులార నీగొంతు కోసినాను. నీకు నేను తండ్రిని కానని దుఃఖించెను. రాజరత్నము తనదుఃఖమును తలిదండ్రులవలె మాటలచేతగాక యెడతెగక యోడికగట్టుకన్నీటిసోనలచే వెడలఁబుచ్చెను. కేశవరాజు జాబుచదువుకొని తలిదండ్రుల కావార్తలు చెప్పి మంచముపైఁబండుకొనితదేకచింతాపరాయణుఁడై సాయంకాలమునరకు లేవనేలేదు అతని మనంబున నెన్నోయాలోచనలుపొడమెను. భీమడోలువెళ్లి నూటలాడుదునాయని యెకమా రతఁ డాలోచించెను. భీమడోలువెళ్లినపక్షమున శంకరరాజు గుమ్మములోనికైనను రానీయఁడని యాయాలోచనము బరిత్యజించెను. జగన్నాథరావుపేర జాబువ్రాయుదునా యని రెండవయాలోచనము దోఁచెను. ఆయాలోచనమునకు మరల నీవిధముగ నతనిమనస్సునకె పరిహారము దోఁచెన. "రాజరత్నముమీఁద నంతటిప్రేమానుబంధముగలిగి కొండవిరిగి మీఁదపడినను రెండవ వివాహము చేసికొననని ప్రతిజ్ఞపట్టి తలిదండ్రులకు విరోధియై బంధువులచేత నిందలుపడి చదువునకుభోజనమునకు తండ్రి సొమ్మియ్యకపోయినను లెక్కసేయక నానాకష్టములు పడినవాఁడిప్పుడు తల్లినిర్బంధముచేతఁ దననియమమువదలి మరల వివాహము చేసికోదలఁచినప్పుడు నామాటలు నాజాబులుఁ బనిచేయునా?" యని జాబు వ్రాయకపోవుటయె యుచిత మని తలంచి యతఁడూరకుండెను. తాను రెండుదినములు పూర్వాపర్యములు విచారిం

చిన పిదప నతఁడిట్లు తలంచెను. "తల్లి తా నాత్మహత్య చేసికొందు నని బెదరించుటచేతనో కాళ్ళవ్రేళ్ళఁబడి బ్రతిమాలుటచేతనో యీకా నిపని కతఁడుసమ్మతించి యుండవచ్చును. నేనుకఠినముగానొక జాబు వ్రాసి యతని హృదయము కరగించిన పక్షమున మున్నుచేసికొన్న నిశ్చయము నతఁడు విడువ వచ్చును." అని జాబువ్రాయుటకు నిశ్చ యించుకొని రెండుదినములుకూర్చుండి జగన్నాథరావుమనస్సునకుఁ గష్టముకలుగకుండ కోపముగాకుండ జాలిపుట్టున ట్లింగ్లీషుభాషతో నొకజాబువ్రాసెను. దాని తెనుఁగిట్లున్నది.

"ప్రియమిత్రమా! నీవువ్రాసినజాబు చేరినది. అది వానలేని పిడుగువలె మాపైఁబడిమాహృదయములఁ గాల్చివైచినది. మగవాఁ డనై కొంచెముగానో గొప్పగానో చదువుకొన్నవాఁడనైన నాకేయ ది దురంతసంతాపము గలిగించుచుండఁగా నిన్నమాతల్లికిని రాజర త్నమునకును నదియెంత హృదయదారుణముగ నున్నదో నేను వేరే వ్రాయనక్కఱలేదు. నీవు విద్యావంతుఁడవు. యుక్తాయుక్తవివేచన జ్ఞానము గలిగించునంతటి ప్రియముగలవాఁడవు కావున నీవంటివా నియొద్దనుండి యిటువంటి జాబువచ్చునని నేనెన్నఁడుఁ దలంపలేదు. నీకును నాకునుగల స్నేహబాంధవ్యములలో మనస్నేహమే మొట్ట మొదట నారంభమైనది. అరఁటిగెల పుట్టి ప్రవర్ధమానమై తుట్టతు దకుఁ జెట్టుచావునకుఁ గారణమైనట్లు మనస్నేహము వలనఁ బుట్టిన బాంధవ్యము మనస్నేహమును నిర్మూలము చేయుచున్న దని నేను మిక్కిలి వగచుచున్నాను. నీవుమనయిరువుర గాఢస్నేహమైనఁదలఁప వైతివి. ఆస్నేహబంధము నొక్కక్షణములో ద్రుంచివైచితివి. మన స్నేహముమాట యటుండనిమ్ము. ఎందఱో వేనవేలమహాపాయలు నీకుఁ గట్నములిచ్చిపిల్లలనిచ్చుటకువచ్చుచున్ననుమనయిరువురస్నేహముచే తను నాచెలియలియందేవో కొన్నిగుణాతిశయము లున్నవని నీవుభా

వించుటచేతను దానిని వివాహము చేసికొంటివి. అగ్నిసాక్షిగ వివాహముచేసికొన్న పసిబిడ్డను నాసోటితో నేననఁగూడదుగాని నిజముగ ననేకశుభలక్షణములు గలదానిని దానివలన నేదోషము లేకున్నను దానినివిడిచి వేరొకకన్యను తలిదండ్రుల బోధలకు లోబడి ధనాశచేత పాణిగ్రహణము జేసికొనఁదలఁచుటవిద్యాగంధశూన్యుఁడైనమూర్ఖునకయినను నీతిగాదుగదా. నీవంటి విద్యావంతునకు నీతి యగునా? ధర్మమగునా? న్యాయమగునా? ఈపని చేయుటకునీమన సెట్లొప్పినది? అధర్మకార్యములు సేయుట కెన్నడు నొడంబడని నీయంతఃకరణము చచ్చిపోయినదా. నీలోని దయారస మెండిపోయినదా. దయారసమున్నస్థానమున క్రూరరసము ప్రవేశించినదా. రాజరత్నము యొక్కయవస్థ నీవొక్కసారితలంచుకో. కళ్యాణప్రదమైన దానిమొగము నేఁడునీకారణమున దుఃఖభాజనమైయున్నది. తామరపువ్వు మంచుబిందువులచేత మ్రగ్గినట్లు నిరంతరబాష్పబిందువులచేత దానిమొగము వివర్ణమైనది. అన్నము ముట్టుటలేదు. నిద్దురపోవుట లేదు. పుస్తకము చదువుట దానికెంతో యిష్టము. అట్టిపుస్తకమైనను స్పృశించుటలేదు. తలిదండ్రులతోఁగానినాతోఁగానిచెలిమికత్తెలతోఁగాని మాటలాడుటలేదు. ఇందతిశయోక్తి రవంతయైనను లేదు. ఆమెదేహసంబంధమైన రోగముచేతఁ బీడింపఁబడుచున్నయెడల నేదేనిచికిత్స చేయించి జాడ్యము నివారింపఁ బ్రయత్నము చేయుదుము. అట్లుకాక యిదిమనోవ్యాధియైనదికదా. మనోవ్యాధికి మందులేదని మన పెద్దలుచెప్పగా నీవును వినియుందువుకదా. ప్రస్తుతస్థితినిఁ బట్టిచూడగా నాచెలియ లొకటి రెండుమాసములలో.....కటకటా! ఆమాటలు నేను వ్రాయఁజాలను. ఈమాటలు వ్రాయునపుడు నాకన్నులనుండి రాలుచున్న బాష్పబిందువులు నీవు చూడలేవు గదా. ఆమె మఱియొక లాగయిన పక్షమున నాతలిదండ్రులు జీవింపరు. నాసంగ

తినేను వేరుగ వ్రాయనక్కఱలేదు. నీవే యెఱుఁగుదువు. నీవు చదువుకొన్న చదువు చిట్టచివరకు మాకుటుంబనాశనము జేయుటకు వినియోగింపఁబడు చున్నదని వ్రాయుటకు నేనెంతయు సిగ్గుపడుచున్నాను. అఖిలసద్గుణసంపన్నమైనదానిని యపరాధము చేసియెఱుంగని దానిని నతిబాల్యావస్థలో నున్నదానిని నాచెలియలను మరణము పాలుచేసి నీవనుభవించు సుఖమిహమునఁగాని పరమునఁగాని లేదని నేను నిశ్చయముగఁ జెప్పఁగలను.

మునుపటి యాపాపభీతి యెందరిగెనో చెప్పఁజాలను. ఈవిషయమున నీవు గుండెలుతీసిన బంటువై తివి మనము చేసెడి పాపపుణ్యములు విచారించునట్టి న్యాయమూర్తి పరమేశ్వరుఁ డొకఁడు కలఁడని విద్యావంతుఁడవైననీకు నేను వేరుగఁ జెప్పనవసరము లేదు. పరమేశ్వరుని మొగముచూడుము. పతిభక్తినిరతయైనబాలిక మొగము చూడుము. రాఁదలచుకొన్న యపకీర్తిని దలంచుకొమ్ము. అటుమీఁద నీచిత్తమువచ్చినట్లు చేయుము. నీవు ధర్మముతప్పుట నియోగికులమున కప్రతిష్ఠ. ఆంధ్రదేశమున కప్రతిష్ఠ. విద్వన్మండలమున కప్రతిష్ఠ. నీవు విద్యనేర్చిన కళాశాలకప్రతిష్ఠ ఇంతకంటె నీకునేను వేరు వ్రాయఁజాలను. మాతాపిత్రుప్రేరణ మనియెడు మేఘముచేత సంఛిన్నమై నీమనోజ్యోతి మునుపటియట్లు ప్రకాశింపఁజాలకున్నది. జ్ఞానమహావాయువుచేత మబ్బును దవ్వుగఁబాఱఁద్రోలి మనస్సును నిర్మలముగ నుంచి యాలోచింపుము. అవివేకాంధకార పరివృతమై ధర్మమార్గమును దెలిసికొన లేక తప్పుదారిని నడచుచున్న నీమనస్సును సకలకళ్యాణగుణాకరుఁడైన భగవంతుఁడు సంపూర్ణానుగ్రహముతో మంచిదారిని నడిపించుఁగాక! దీనికిఁ బ్రత్యుత్తరము వ్రాయవలయునని కోరుచున్నాను.

ఇట్లు,

పెనుగొండ,

నీప్రియమిత్రుఁడు,

కేశవరాజు.

జాబు జగన్నాథరావందుకొనెను. పై విలాసముఁ జూడఁగానె యది కేశవరాజువ్రాతయని గుర్తెఱిఁగి యతఁడేమికతినోక్తులు వ్రాసెనోయని భయపడుచుదానినివిప్పి తనగదిలోఁ గూర్చుండి రహస్యముగఁ జదువుకొనియెను. ఒకసారి చదువుకొనుటతోఁ దనినినొందక రెండవసారి చదువుకొని మూఁడవసారి చదువుకొని కేశవరాజుకలము నుండి వెడలినపలుకులనియెడు ములుకులు గాటముగ మనమునవాటుటచేత శ్రాంతుఁడై యంచుకసేపు మంచముపైఁ బండుకొని యెద్ది యుందోఁచక పైనున్నబల్లకూర్పుసరంబివంక కొంతసేపు గోడలవంక కొంతసేపు చూచి చూచి మరల జాబొకసారి చూచి యది గుండెపై వైచికొని క్షణకాలము బాష్పాకులితలోచనుఁడై విచారించి మరలధైర్యముఁదెచ్చుకొని తువాలుతోఁ గన్నీరు దుడుచుకొని తనలో నిట్లు తలపోసెను.

"అయ్యయ్యో! నాబ్రదుకెంత హాస్యాస్పదమైనది. ఎందఱో గొప్పవారు వేలకొలఁదిరూపాయలు వరదక్షిణలిచ్చి తమకూఁతులను నాకువివాహముచేయఁదలఁచి యుండఁగా వల్లూరి కేశవరాజునకును నాకునుగల గాఢస్నేహబంధమునఁ గట్టుపడి యతనిచెలియలియందే వోగుణములున్నవని నిశ్చయించి యితరసంబంధములు నిరాకరించి యాబాలికను వివాహమాడి యిప్పుడు మాతాపిత్రు ప్రేరణమున నన్యాయమునకొడిగట్టి పాపభీతివిడిచి లోకాభిప్రాయమునకు జంకకయేపాప మెఱుఁగని యాబాలికను నట్టేటవిడిచి వే ఱొకపిల్లను నేనిపుడు పెండ్లియాడఁ దలపెట్టితినిగదా. నాకంటెఁగతినుఁడు నాకంటెకూర్మిరుఁడు నాకంటెబుద్ధిహీనుఁడు లోకమున వేఱొకఁడు కలఁడా? నాచదివినచదువు లడవిని గాచినవెన్నెల యైనది. దయానందసరస్వతీస్వాములవారిజీవితము రామమోహనరాయలవారిజీవితముచదివితిని గాని మంచిగంధపుమోపులు మోసినగాడిదకు దానివాసనలంట

నట్లే నాకామహాత్ములజీవితములలో నిపరమార్థముకఠినహృదయముపై నాటినదికాదు. ఆహాహా! ఎటువంటిధర్మసందేహములుకలిగినవి. పితృవాక్యపరిపాలకుఁడనై గుణవంతురాలైన భార్యను విడుతునా? భార్యనిమిత్తమై తలిదండ్రులకు విరోధినగుదునా? ఇందెవ్వరియాలోచన మడుగుదును. అడిగిన ఫలమేమి? ఎవ్వరికిఁ దోఁచిన తెఱఁగున వారు చెప్పుదురు. ఎవరిమాటలుపరిగ్రహించి యెవరిమాటలు నిరాకరింతును. "సతాంహి సందేహపదేషువస్తుషుప్రమాణమంతఃకరణప్రవృత్తయః" అని మహానుభావుఁడైన కాళిదాసు తనయభిజ్ఞాన శాకుంతలములో దుష్యంతునినోటఁ బలికించియున్నాఁడు. సందేహవిషయములలో మనుష్యునకుఁ దనమనస్సేప్రమాణము. "ఆత్మబుద్ధిస్సుఖంచైవ" యని యెడు నార్యోక్తిగూడ నున్నదికదా. అందుచేత నాకు నేనేయాలోచించుకొనియెదను. రఘుపతిగారు మూడుమాసములవఱకు వివాహముచేయుటకు వీలులేకపోవుట నేనుమరల బౌర్వాపర్యములు విచారించుకొనుటకు భగవంతుఁడవకాశము కలిగించెనని నమ్మకముకలుగుచున్నది. నాకును రాజరత్నమునకును శాశ్వతవియోగము గలుగవలసిన ట్లీశ్వరనిర్ణయమే యైనపక్షమున రఘుపతిగారితల్లి చావకపోవును. ఈ ముహూర్తముదాటకపోవును. కావున నీశ్వరనిర్ణయము వేరుగనున్నదనిదీనినిబట్టినమ్మవచ్చును. "మాతృదేవోభవపితృదేవోభవ" యని చెప్పిన వేదములోనే యనవద్యము లగు కర్మలే చేయవలసిన దని కాని పాపకర్మములు చేయఁగూడదని విధింపఁబడియున్నది. అందుచేత ననన్యశరణ్యయగు ధర్మపత్నియొక్కజీవనము దుఃఖభాజనముచేసి వల్లూరివారికుటుంబము వల్లకాఁటిపాలుచేయుటనావంటిప్రాజ్ఞునకుఁదగినపనికాదు. అట్లాబాలికను విడిచి మఱియొకకన్యను వివాహ మాడుదునేని కేశవరాజు వ్రాసినట్లు నియోగకులమునకు, నేను జదువుకొన్నకళాశాలకుఁ దెలుఁగుదేశమునకుఁగూడనప్రతిష్ఠ వాటిల్లుట నిశ్చ

యము. కావున రఘుపతిగారిసంబంధము మానుకొనుటకు న్యాయ మైన ప్రయత్నము చేసెదను."

అని నిశ్చయించుకొని కాగితముఁ గలముఁ బుచ్చుకొని కేశవ రాజున కీక్రిందివిధముగ జాబువ్రాసెను.

ప్రియమిత్రుఁడా!

నీజాబు చేరినది. నీమాటలు కొన్నిదినముక్రిందట ఆయిగా నూఱిపోయి కఠినమైయున్న నాహృదయమును గరగించినవి. నిజ ముగా నేనీనడుమద్విపాదపశువు నైతిని. నీవంటి యాప్తమిత్రునితో నాదౌర్బల్యమొప్పుకొనుట యవమానముకాదు. మాతల్లియు మేన మామయువచ్చి చెన్నపురమున నన్నెంతో నిర్బంధించుటచే నొకచె డ్డగడియలోఁ బరవశుఁడనై నేను రఘుపతిగారిసంబంధము చేసికొను టకు నిశ్చయించితిని. కాని మత్తగజముమావటివానియంకుశపుబోటు లవలన మంచిదారిని నడచునట్లు ములుకులవంటి నీపలుకులవలన నా మనోమాలిన్యము విడిచి సరియైనదారిని బడితినని నేఁదలంచు చుం టిని. రాజరత్నముయొక్క సహజమనోహరముఖారవిందముబాష్పక లుషము చేసినవానిజీవితము నిరర్థక మని తలంచి యతిసాహసము గూడఁజేయుట కొకనాఁటిరాత్రి సంకల్పించి దైవవశమున నేతద్వ్య వసాయము మానుకొంటిని. నాపడినమనోవ్యథలు వర్ణించి నిన్ను నేను బాధింపఁదలచుకొనలేదు. కాని మీనాయనగారితోను మీయమ్మ గారితోను మీచెల్లెలితోను నేను పాపవ్యవసాయమునుండి తొలఁగితి నని స్పష్టముగఁ జెప్పుము. కాని మీరు మాతండ్రియందు దోషా రోపణముచేసి యాయనగారియం దేమియు మనసులో నుంచుకొన వలదని కోరుచున్నాను. నేను కొలఁది దినములలోనే నిన్నుఁగలసి కొనఁగలను.

ఇట్లు మిత్రుఁడు,
జగన్నాథరావు.

ఆలేఖ కేశవరాజందుకొని చదువుకొని తలిదండ్రుల కందలి వృత్తాంత మెఱింగించినప్పుడు రాజరత్నముయొక్క ముఖము వికచారవిందసామ్యమునంది హృదయదౌర్బల్యమును వీడెను. మనస్సు ధైర్యలక్ష్మీసంపన్న మయ్యెను. తలిదండ్రులకాదినమే పండుగయయ్యెను. కేశవరాజుయొక్క హృదయముమీఁదనుండి పెద్దబరువు దిగెను. "జగన్నాథరావు రెండవవివాహము చేసికొనుట మానుకొన్నపక్షమున నేను సత్యనారాయణవ్రతము చేయుదునని మ్రొక్కుకొంటిని. సత్యనారాయణస్వామికి మనమీఁద యనుగ్రహమున్నది" యని తల్లిపలికెను. "ఇల్లలకఁగానే పండుగగాలేదు. ఇప్పుడే సంతోషించకు" మని తండ్రి తల్లిని మందలించెను. కేశవరాజు తనసంతోషమును దెలియఁజేయుచు జగన్నాథరావునకు మరియొకజాబు వ్రాసెను. తండ్రియొక్క బారినుండి తప్పించుకొని యెటులైన నావలఁబడుటకు జగన్నాథరావుపాయములనన్వేషింపఁ దొడఁగెను. అంతలో గుంటూరునుండి యతనికొకజాబువచ్చెను. ఆజాబుచూచుకొని అయ్యయో! పాపము! సుందరరావున కెంతకష్టమువచ్చినదని మనంబున విచారించి తండ్రి కడకుఁబోయి బాబయ్య! నాప్రియమిత్రుఁడైన కస్తూరిసుందరరావు యొక్క భార్య జ్వరబాధచేత మృతినొందినది. పాప మాపిల్ల కాపురమునకువచ్చి మూఁడుమాసము లైనది. అతఁడు బి. యల్ పరీక్షలో మొన్ననే కృతార్థుఁడైనాఁడు. గుంటూరులో ప్లీడరుగాఁజేరి పనిచేయుటకారంభించి రెండుమాసములైనది. యతని కిరువదిరెండవయేడు ఈపిల్ల గాదివారిపిల్ల. ఎంతోచక్కనిది. ఎంతోయోగ్యురాలు. పాప మతనికి గొప్పకష్టము సంభవించినది. అతను నేను నాలుగైదు సంవత్సరములు సహాధ్యాయులము. ఇప్పుడు మనయింట వివాహమాగిపోయినదిగనుక నతనినొక్కసారిపరామర్శచేసివచ్చెదను" అనిచెప్పెను.

కుమారునిపలుకులు శంకరరాజునకు భయము గలిగించెను.

కొడుకు తనచేతిలోనుండి దాటిపోయినపక్షమున నెవరితో సంభాషించునో యెవ్వరతని కేమియాలోచనలు చెప్పుదురో వివాహము జరుగునో జరగదోయని యతనికి సందేహముదోఁచెను. వెళ్ళనీయకపోయినపక్షమునఁ గోపమువచ్చి తనమాట మొదలే వినక తనకవమానముఁదెచ్చునేమో యని రెండుభయములుపుట్టెను. ఈభయద్వయము మనస్సును ముందుకువెనుకకు లాగుటచేత వెళ్ళుమనిగాని వద్దనికాని వెంటనే చెప్పఁజాలక సరే వెళ్ళవచ్చునులే. ఇప్పుడతనికి మైలకదా. అతని ముట్టుకొనుటకు వీలులేని సమయమున వెళ్లి నీవేమి చేయుదువు. రెండుమూడుదినములలో వెళ్ళుదువుగాని ఆమెపోయి నేఁటికినాలుగుదినములే కదా యైనవి" యనిబదులుచెప్పి కుమారుని ప్రయాణమాపుట కుపాయములు పన్నఁదొడఁగెను. నాలుగుదినములు లైనతరువాత గుంటూరు పంపవలసినదని మరల జగన్నాథరావడుగ శంకరరాజేవోవంకలుచెప్పెను. ఆవంకలువిని ప్రాణమువిసిగి యొకనాఁడు జగన్నాథరావు తండ్రినిబిలిచి "బాబయ్యా! నేనీదినమునఁ గుంటూరు వెళ్ళకమానను. మిత్రి మాపది జానీయాత్తను నార్యోక్తిప్రకారము కష్టకాలమునందు గనఁబడినమిత్రుఁడే మిత్రుఁడు శుభశోభన మైనప్పుడు విందు లారగించు వేడుకచెలికాండ్రు వేనవే లుందు. కళత్రి వియోగదుఃఖజ్వరమున బాధపడుచున్నమానవునకు మిత్రవాక్యములు దుఃఖమును దూరముచేసి మనంబున ధైర్యము నెలకొల్పి యాతని నొక్కదరిఁ జేర్చును. ఇప్పుడక్కడికి వెళ్లకపోయినపక్షముననిఁకముందు నేనక్కడకు వెళ్లనక్కఱలేదు. కాఁబట్టి పదిరూపాయలు నాకిచ్చి నన్ను బంపుమని కోరెను. నాదగ్గఱ ప్రస్తుతము లెక్కలేదని తండ్రి బదులుచెప్పెను. "అట్లైన భోగరాజుశరభరాజుదగ్గర నేను పదిరూపాయలప్పుపుచ్చుకొని వెళ్ళెదను. నీకందినప్పు డదివాని కీయవచ్చు" నని ప్రత్యుత్తరము చెప్పి మరలఁ దండ్రితో మాటలాడకయె శరభరా

జుకడకుఁ బోయి పదిరూపాయలు బదులు పుచ్చుకొని ప్రయాణమై తల్లితో మాత్రము చెప్పి తండ్రి యాసమయమున నింటలేకపోయినను వచ్చువఱకుఁ గనిపెట్టుకొనియుండక మేలుబండి యెక్కి గుంటూరు వెళ్ళెను.

జగన్నాథరావు గుంటూరుఁ జేరిననాఁడు కస్తూరి సుందరరావు గారిభార్యపోయిన ద్వాదశాహస్సు. జగన్నాథరావునుజూడఁగానెసుం దరరావుకంటనుండి వేడికన్నీరు బొటబొటదొరగెను. మిత్రదర్శనము న దుఃఖము మరల నభివృద్ధిఁ జెంది బాష్పరూపమున బయికి వెడలె ను. జగన్నాథరావు మిత్రుని సముచితవాక్యములనోదార్చియిట్లనియె. "ఓయీ సుందరరావు ఓదార్పులు నిరర్థకము లని నేనెఱుఁగుదును అదినీవు నెఱుఁగుదువు. అయినను శోకవిహ్వలుఁ డైనమిత్రుని యో దార్చుట సదాచారము గనుక నేనువచ్చితిని. మంటితోఁ జేసిన ఘట ములు కులాలుఁడు చేయునప్పుడు కొన్నియు నెండఁబెట్టునప్పుడు కొన్ని యుఁ బోగుచేయునప్పుడు కొన్నియు నావములోఁ బెట్టునప్పుడుకొన్ని యు దానినుండితీయునప్పుడు కొన్నియు విక్రయమునకుఁ గొంపోవు నప్పుడు కొన్నియు వాడుకొనునప్పుడు కొన్నియు భిన్నములగు తెఱఁ గున మన దేహఘటములు గూడ జన్మించునప్పుడు ప్రయాణములు చేయునప్పుడు రోగపీడలు గలిగినప్పుడు నిదియది యననేల ప్రత్యవస్థ యందు భంగము నొందుచుండును. దేహధారులకు మరణముప్రకృ తియగుటచే దానికయి ప్రాజ్ఞులు వగవఁగూడదని వేదాంతులుచెప్పు దురు గాని పరిపక్వమనస్కులై బ్రహ్మజ్ఞాన పారంగతులైన తత్వ కోవిదులు సయితము దుఃఖము కన్నీటికాలువలద్వారమున మనస్సు నుండి యావలకుఁ బాఱఁదోలుదురు. జగంబుమిథ్యయనియు బ్రహ్మస త్యమనియు నిదియెల్ల స్వప్నతుల్యమనియు గ్రంథములలో వ్రాయు ట చదువుట సులభముగాని భావించుట దుస్తరము. దేవతుల్యులు

ధైర్యసంపన్నులునైన పూర్వపురాజర్షులు దేవర్షులుఁ గష్టములుగలిగి నప్పుడు విలపింపఁగా ధైర్యముచిక్కబట్టుటకు మనుష్యమాత్రులము మన మెంతవారము. కళత్రవియోగమైనప్పుడు నారాయణావతారుఁడగు రాముఁడును పుత్రవియోగమైనప్పుడు భగవద్గీతలు నిశ్శేషముగా విన్నయర్జునుఁడునుగురువులకుగురువై నవసిష్టుఁడునునే తెఱఁగునదుఃఖోపశమనము జేసికొనిరో పురాణములె సాక్ష్యమిచ్చుచున్నవి ఈప్రపంచము మహావృక్షము. మనుష్యాదిజంతువు లాచెట్టున మొలిచిన యాకులు. మృత్యువు గాలి. ఆగాలితాకున నీయాకులు జలజలరాలుచుండును. రాలినవి రాలుచుండఁగా మొలిచినవి మొలుచు చుండును. అట్లేపోయినవారు పోవుచుండఁగా జన్మించినవారుజన్మించు చుందురు. అనేకాంశములు గలిగిన యీజగన్నాటకమున నెవరికథాకలాపములు వారు వినిపించి వారుపోవలసినదె కాని పోయినవారికొఱకు రంగస్థలమున నున్నవారు విచారింపనక్కఱలేదు. నాకన్న నన్నివిధముల నధికవిజ్ఞానముగలనీకు నేనుపదేశముచేయుట హాస్యాస్పదమని యెఱుంగుదును. కాని దుఃఖభాజనులగు వారిజ్ఞానతేజస్సు తత్కాలమున నజ్ఞానావృతమైయుండును. గావున నాయజ్ఞానమును తెరతొలఁగించుటయె మిత్రునికర్తవ్య మగుటచేత నాపనిని నేనుచేసితిని."

అనిశోకోపశమనవాక్యములు జగన్నాథరావుపలుకుటయుసుందరరావు మెల్లఁగ నతనితో నిట్లనియెను. "జగన్నాథరావు! ఈపండ్రెండుదినములనుండియు ననేకు లూరడించిరి. కాని నీవలె జ్ఞానగర్భితములైనపలుకులతో మనశ్శాంతి గల్గించినవా రెవ్వరులేరు. తక్కిన వారందఱు నీకు పదిమూఁడవనాఁడే పెండ్లిచేయుదుము. ఉత్తరీయము పోవుట యెట్టిదో భార్యపోవుట యట్టిదియెయని యసహ్యములగుపలుకులతో పరామర్శించిరి. నీవుపదియేనుదినములు నావద్దనుండవలయునని కోరుచున్నాను. కళాశాల తెరచునప్పటికి నీవు మరల చెన్నపట్ట

ణము వెళ్లవచ్చును. నీసంభాషణలవలన నీయుపదేశమువలనఁ గ్రమ క్రమముగ నామన సూరటఁజెంది దుఃఖము మఱచును. కావుననాకో రిక నిరాకరింపక నీవుండు"మని బ్రతిమాల జగన్నాథరావచ్చటనుం డుట కియ్యకొనెను. ఇరువురుఁగలిసి ప్రతిదినము వృత్తాంతపత్రికలు చదువుటలోను గ్రంథపఠనములను సరససల్లాపములను సాయంసమయ ముల షికారులను వా రిరువదిదినములు గడపిరి. సుందరరావు మన స్సునఁ బడినదుఃఖవ్రణపుగాయముక్రమక్రమముగఁబూడిపోవఁజొచ్చె ను. జగన్నాథరావు వెళ్లిపోవుటకుఁ బ్రయాణమగుచుండెను. సుందర రావు వానిని విడువలేక నేవోవంకలుపెట్టినాలుగైదుదినము లాపెను జగన్నాథరావు వచ్చి యప్పటికి రమారమి నెలయయ్యెను. ముప్పది యొకటవదినమున జగన్నాథరావుప్రయాణము నిశ్చయ మయ్యెను. రేపుదయమునఁ బ్రయాణమనఁగా నా రాత్రి జగన్నాథరావు మిత్రుని తోఁగలిసి ప్రొద్దుపోవువఱకు నానావిషయములఁగూర్చి సంభాషించి కట్టకడపట నిట్లనియె.

"సుందరరావు! నీతో నేనొక్కవిషయము గట్టిగామాటలాడ వలసిన దున్నది. అది స్వవిషయ మైనను నీవలనఁగావలసియున్నది. నేను కేశవరాజుచెల్లెలిని వివాహ మాడితినని నీవెఱుఁగుదువు. ఆతని తండ్రి కట్న మీయఁజాలనందున నే నావిషయమునఁ జేసిన రహస్య వ్యాపారమువలన నాకును మాతండ్రికిని మనస్పర్థలుగలిగెనని వెనుక మన మొకసారి చెన్నపట్టణమునుండి వచ్చుచుండఁగా రైలులో నీతోఁ జెప్పితిని, అది నీకుజ్ఞాపకముండియుండవచ్చును.

"అవును జ్ఞాపకమున్నది. నీచదువున కాయన సొమ్ము పంపక పోవుట నీవెవరిపిల్లలకో యింటివద్ద పాఠములు చెప్పుట మొదలైన సంగతులు కేశవరాజువల్ల నేను విన్నాను. ఇప్పుడు మీతండ్రికి నీకుఁ గలవివాదము తగ్గినదా లేదా"?

"తగ్గుట లేదు గిగ్గుట లేదు. క్రమక్రమముగ హెచ్చినది. వల్లూరివారిపిల్లను విడిచిపెట్టి మఱియొకరిపిల్లను బెండ్లియాడుమని నన్నాయన బలవంతపెట్టుచున్నాఁడు. సంబంధముకుదిర్చినాఁడు. ముహూర్తము నిశ్చయించినాఁడు. కట్నముసొమ్ముపుచ్చుకొన్నాఁడు. ఈ పాటికి వివాహము కావలసినదే. దైవయోగమువల్ల వారిమునలమ్మ చచ్చిపోఁబట్టి పెండ్లి యాగినది."

"ఎవరిపిల్ల? నీవు కేశవరాజుచెల్లెలను వదలిపెట్టి వేఱొకపిల్లను బెండ్లిచేసికొనుటకు నొప్పుకొన్నావా యేమి? ఈఘోరకృత్యమునకు నీవొడిగట్టితివా."

"మాతల్లియు మేనమామయుఁ జెన్నపురమునచ్చి నాగొంతు మీఁద గూర్చుండుటచే నేనొకదుష్టసమయమున రెండవవివాహమున కొప్పుకొంటిని. కానియిటీవల కొన్ని కారణములచేత మరల నాసంకల్పము మానుకొంటిని. అటుసూర్యుఁ డిటుపొడిచినను నేను రెండవ వివాహము చేసికొనను ఇది నిశ్చయమె. ఆపిల్ల తల్లాప్రగడ రఘుపతి గారికుమార్తె వారి దత్తిలికాపురము. వారు దేశపాండ్యాలుమిక్కిలి పరువుగలవారు మనసంబంధములో రఘుపతిగారు శిరోభూషణమని చెప్పవచ్చును చాలసంపత్తిగలవారు."

"నీవు రెండవవివాహము చేసికొనఁదలఁచికొనలేదని నీవలన విని సంతసించినాను తల్లినిర్బంధించుఁగాక! తండ్రినిర్బంధించుఁగాక! ఇటువంటియకార్యము నీవంటివాఁడు చేయఁదగినదికాదు పరువుప్రతిష్టలులేని పామరుఁడు చేయఁదగినపని తలిదండ్రులయుపదేశములకుసయితము హద్దున్నది వేశ్యనుంచుకొమ్మని తండ్రి నిర్బంధించినపక్షమున మనముంచుకొందుమా? ఎవరిగొంతుకైనఁ గోయుమన్న గోయుదుమా? మొదట మెత్తపడినను నీవిప్పుడు చేసికొన్న నిశ్చయము బాగున్నది కాని నీకీవిషయమునఁ జేయవలసిన సహాయ మేమున్నది?"

"చెప్పుచున్నాను. ఆమాట నేనిప్పుడు కదుపుట మిక్కిలికష్ట మైనను విధిలేక కదుపుచున్నాను. రఘుపతిగారికుమార్తెను నాకిచ్చుటకుముఖ్యకారణము నేను బి. యే. పరీక్షప్యాసై బి యల్ చదువుచున్నానని సంపద గలవాఁడనని పరువు గలవాఁడనని నే నిప్పు డాపిల్లను జేసికొనకపోయినపక్షమున వారికి మంచిసంబంధము దొరకదు. అవివేకియైన మాతండ్రివలన వారి కీచిక్కు సంభవించినది. సంబంధములు వెదఁకికొనుటకు వారికి వ్యవధిలేదు. పిల్లపదిమూఁ డేండ్లది. విద్యావినయసంపదలచేతను రూపముచేతను దరుణవయస్సుచేతను వంశగౌరవముచేతను నీవెల్లవిధముల రఘుపతిగారికుమార్తెకుఁ దగినవరుఁడవు. నీసంబంధము వారికిఁగుదిర్చి వారికాశాభంగములేకుండఁ జేసి నేను మానికొన్నందువలన వారికి నష్టము గలుగలేదు కదా యని సంతుష్టహృదయముతో నాభార్యను నేను స్వీకరింతును. వారి పిల్లను జేసికొందునని రఘుపతిగారితో నేనెప్పుడు వాగ్దానముఁ జేయలేదు. అందుచేత వారికి సంబంధము కుదర్చవలసినభారము నాపై లేదు. కాని మాతండ్రియొక్క దుష్ప్రయత్నమువలన నుదాసీనుఁడై యుండుటకు నామనస్సు యొప్పుట లేదు. ఇది మృదువైన యంశము. ఇంతత్వరలో నీయొద్దకదుపుటకువీలులేకపోయినను గార్యవ్యగ్రతవలన నిట్లు చేయవలసివచ్చినందుకు క్షమింపుము."

వివాహముమాట మిత్రునినోట వెడలుటతోడనే ప్రథమకళత్రముజ్ఞప్తికి వచ్చెను. ముఖము వైవర్ణ్యము నొందెను. నేత్రయుగళమునుండి బాష్పబిందువులు రాలెను అదిచూచి జగన్నాథరావు "మిత్రుఁడా! ఈవిషయము కదపఁగానె యింతవఱకు నీమనంబున నడఁగియున్నశోకవహ్ని మరల రవులునని నేనెఱుఁగుదును. కాని రెండు కారణములచేత నేనిప్పు డీవిషయము కదపవలసివచ్చినది. మొట్టమొదటిది నాస్వవిషయము. అది నీకిదివఱకె చెప్పితిని. రెండవవిష

యముఁగూడఁజెప్పెద వినుము. ఎప్పటికైనను నీవు మరలవివాహముఁ జేసికొనక తప్పదుకదా. నీ విరువదిరెండువత్సరములు వయస్సువాఁడవు. పెండ్లి మానుకొనఁ దగినవయస్సు కాదు. మనము జితేంద్రియులము కాము. కళత్రవియోగమైనప్పు డీకాలపుయువజనులుకొందఱు మేము వివాహము చేసికొనమని పట్టుబట్టి కొంతకాలము జరిగినపిదప నాత్మదౌర్బల్యపరిజ్ఞానముచేతనో బంధుజనప్రేరణముచేతనో మరల గృహస్థు లగుచున్నారు. ఆవిధముగ నీవు వెఱ్ఱిపట్టుపట్టక వివాహముఁ జేసికొమ్ము. భార్యపోయినపదిమూడవదినముననే నిన్ను పెండ్లి చేసికొమ్మనలేదు. నెల వెళ్ళకుండఁగనే చేసికొమ్మనలేదు. శ్రావణ మాసములో ముహూర్తములున్నవి. రఘుపతిగారుకూడ శ్రావణ మాసములోనె కుమార్తెకు వివాహముచేయ నిశ్చయించినారు. వారి పురోహితుని మీయొద్దకుఁ బంపుమని రఘుపతిగారిపేర నేను జాబు వ్రాసెదను. తరువాత మీమేనమామ యత్తిలివెళ్ళిపిల్లనుజూడవచ్చును. పిల్లనచ్చినతరువాత ముహూర్తనిశ్చయము చేసికొనవచ్చును. రేపునాపయనము మాని రఘుపతిగారి కొకయుత్తరము మాతండ్రికొకయుత్తరము వ్రాసి యెల్లుండి వెళ్లెదను. బహుకారణములచేత నేను దీని కియ్యకొమ్మని వేఁడుకొనుచున్నాను" అని తనకుర్చీమీఁదినుండి లేచి యాతనిచేయిఁబట్టుకొని తనయుత్తరీయముతో నాతనికన్నీరుదుడిచెను. సుందరరా వాతనిపలుకుల కెట్టిప్రత్యుత్తర మీయక యూరకుండెను. అప్పుడు రమారమి రాత్రిపండ్రెండుగంటలగుటచేత వారు నిద్రిపోయిరి.

మరునాఁడుదయమున జగన్నాథరావు ప్రయాణము మాని రఘుపతిగారి కీక్రిందివిధముగ జాబువ్రాసెను.—

మహారాజశ్రీ తల్లాప్రగడ రఘుపతిగారి సముఖమునకు, విధేయుఁడు బంధకవి జగన్నాథరావు నిత్యమనేకనమస్కారములు చేసి చేయంగలవిన్నపములు.

ఇక్కడ గుంటూరులోఁ గుశలము.

త॥ నేనిదివఱకెన్నడు మీదర్శనముచేసియుండలేదు. నాపేరునుబట్టి నాకాపురముభీమడోలనియు నేను బంధకవిశంకర రాజుగారికుమారుఁడ ననియు మీకుఁదెలిసియే యుండును. మీకుమార్తెను నాకియ్యవలె ననిసంకల్పించి ముహూర్తనిశ్చయముచేసి కట్నముసొమ్మేగాకకర్చు లక్రిందఁగూడకొంతధనము మాతండ్రిగారికిమీరిచ్చియున్నారు. ప్రథమకళత్రము జీవించియుండఁగా నామెను విడిచిపెట్టి మఱియొకకన్యను వివాహమాడుట ధర్మవిరుద్ధము లోకవిరుద్ధము నని లోకజ్ఞాన సంపన్నులుసత్కులప్రభూతులునగు మీవంటివారికిఁ దెలియనివిషయము కాదు. ఇద్దరుపిల్లలను వివాహము చేసికొని యెవరిని సుఖపెట్టలేక జీవితము దుఃఖభాజనము జేసికొనుటకు నేను సిద్ధపడి యుండలేదు. కాఁబట్టి మీపిల్లను వివాహమాడుట నాకు మొదటినుండియునిష్టము లేదు. తల్లిదండ్రులబలవంతముచేత నేనొక్కసారి యీరెండవపెండ్లి కొప్పుకొంటిని గాని యీనడుమ బహుకారణములచేత నామనస్సు మారిపోయినది. కోటివరహాలుకట్నమిచ్చినను భూమండలము నాకు పట్టాభిషేకముచేసినను నేను రెండవవివాహముఁ జేసికొనను. ఇదినిశ్చయము. మాతండ్రి మీపగ్గరపుచ్చుకొన్న కట్నముసొమ్ము కర్చుల క్రింద బదులుపుచ్చుకొన్నసొమ్ము నే నపహరింపను. నాకు స్వాతంత్ర్యమువచ్చినతరువాత మీసొమ్ము వడ్డితోఁగూడ నిచ్చివేసెదను. ఈ యుత్తరమే పత్రముగ మీయొద్దనుంచుకొనవచ్చును. ఆవిషయమట్లుండనిండు. మీపిల్లను నేను చేసికొందునని మాతండ్రిగారు మిమ్ము నమ్మించి మీచేత వివాహప్రయత్నములు చేయించి మీకమితాయాసము గలిగించినందునకు నేను మీకు మంచిసంబంధము కుదిర్చిపెట్టెదను. ఆసంబంధ మీగుంటూరుగ్రామములోనె యున్నది. అతనిపేరు కస్తూరిసుందరరావు. వారిమాతామహులు సత్యరాజువారు అతనికిఁ

దండ్రి లేఁడు. తల్లి యున్నది. తలిదండ్రుల కొక్కఁడే కుమారుఁడు. ఆడపిల్లలు లేరు. అతని కిరువదిరెండు సంవత్సరములు వయస్సు. బి. యల్ పరీక్షయందుఁ గృతార్థుఁ డైనాఁడు. పట్టాకుదర ఖాస్తు చేసినాఁడు చక్కనివాఁడు. ఎంతచక్కదన మున్నదో యంత సుగుణసంపద యున్నది. సంవత్సరమునకు భూములమీఁద రెండువేలరూపాయలు వచ్చును. వారు కాపురమున్న యిల్లు గొప్పమేడ రమారమిపాతిక వేలరూపాయలరొక్కమున్నది. మంచికుటుంబము, గుణబాహుళ్యము కులగౌరవము రూపసంపత్తిభాగ్యము విద్యావినయవిశేషములుఁ గలిగిన పెండ్లికుమారుఁడు. వేయిసంవత్సరములు మనము తలక్రిందు గాఁదపస్సుచేసినను దొరకఁడు. ఇతనిభార్య యీనడుమ మృతినొంది నది. ఆమెపోయి రమారమి యిప్పటికి మూఁడుపక్షములైనది. భార్య పోయినమూఁడవనాటనుండి మునెంద ఱెంద ఱో వేనవేలుకట్నము లిచ్చి తమపిల్లల నిచ్చెదమని వర్తమానము లంపి బ్రతిమాలుచున్నారు కాని కళత్రవియోగజనితమైన మనోవ్రణ మింకను మానకపోవుటచే నతఁడామాటయే దలపెట్టకున్నాఁడు ఇతఁడు నాకుముఖ్యస్నేహితుఁ డగుటచేఁ బరామర్శ చేయుట కిక్కడకు నేను వచ్చియుంటిని. ఇతనికి నామాటమీఁద గురిగలదు. నిన్నరాత్రి యీవిషయమై యతనితోఁ బ్రసంగించితిని. అతఁ డంగీకరించినట్లె. ఈజాబు చేరినవెంటనే మీరు మీపురోహితునిగుంటూరుపంపుఁడు. ఆయనమేనమామగారుగూడ నిచ్చటనే ప్లీడరై యున్నారు. ఆయనపేరు సత్యరాజురాజశేఖరరావు గారు ఆలస్యముచేయవద్దు. మీపురోహితునితో మఱియెవరినొయిచ్చటకు పంపవలసినదెకాని మీరు నాపేర మరల జాబు వ్రాయనక్కఱలేదు. ఈదినముననే నేనురెండవవివాహముఁ జేసికొనఁదలఁచుకొనలేదని మాతండ్రిగారిపేర జాబు వ్రాయుచున్నాను. కొన్నిమాసముల నుండి మీమనస్సునకు నేనాయాసముఁ గలిగించితిని. దానికి మీరు

నన్ను క్షమింపవలయును.

చిత్తగించవలెను,

గుంటూరు.

ఇట్లు,

మీవిధేయుఁడు,

బంధకవి జగన్నాథరావు.

ఆజాబువ్రాఁత ముగించినతరువాత జగన్నాథరావు తండ్రిపేర నీక్రిందివిధమున జాబువ్రాసెను—

మహారాజశ్రీ బాబయ్యగారికి,

కుమారుఁడు జగన్నాథరావు నమస్కారములుచేసి చేయంగ లవిన్నపములు.

ఇక్కడ గుంటూరులోఁ గుశలము.

త॥ నే నిప్పుడు మీమనస్సునకు మిక్కిలి కష్టమైనవిషయము వ్రాయవలసివచ్చినందుకు నాకెంతోవిచారముగ నున్నది. అయినను విధిలేక నే నిట్లువ్రాసినందుకు క్షమింపవలెను. నేను నాభార్య యుండఁగా రెండవవివాహము చేసికొనను. ఇదిముమ్మాటికినిశ్చయము. ఈలాగే రఘుపతిగారిపేర నే నీరోజుననె యుత్తరము వ్రాసినాను. నేను కొంతకాలము దేశసంచారము చేయవలె నని బుద్ధిపుట్టినది. కాఁబట్టి ప్రస్తుత మింటికి రాను. ఇంతకంటె విశేషము మీకిప్పుడు నేనువ్రాయదలఁచుకొనలేదు.

చిత్తగించవలెను,

గుంటూరు }

ఇట్లు,

మీపుత్రుఁడు,

జగన్నాథరావు.

ఈవిధముగ జాబులు రెండును ముగించి పైవిలాసములువ్రాసి టపాలో వైచెను. మధ్యాహ్నముభోజన మైనతరువాతజగన్నాథరావు సుందరరావును బిలిచి "ఓయీ! నీతో నేనింకొక్కసంగతి చెప్పవలసి యున్నది. నే నిప్పుడుమాయింటికి వెళ్ళను. ఇప్పుడు వెళ్ళినపక్షమున మాతండ్రికినినాకును ఘోరయుద్ధముజరుగును. ఇప్పుడు కలహపడుట నాకిష్టము లేదు. రెండుమూఁడుమాసములవఱకు నేను దేశాటనము జేసివచ్చెదను. నేనెక్కడ నుందునో నీకుఁ దెలియఁజేసెదను. నాయునికిపట్టు నీవు మాతండ్రికిఁగాని యత్తవారికిఁగాని తెలియఁజేయవద్దు నాకు నీవు నూరురూపాయలు బదు లీయవలెను. ఒకసంవత్సరములోపుగ నీకు నేనది తీర్చెద". నని కోరుటయు సుందరరావు "నీకు నూరురూపాయలు బదు లిచ్చుట నాకిష్టమె కాని నీవిప్పుడుదూరదేశము వెళ్ళుట నాకిష్టము లేదు. మీతండ్రితో వివాదపడుట యిష్టము లేనిపక్షమున నీవు రెండుమూఁడుమాసములు నాయొద్దనె యుండుము నీకిది స్వగృహము కాని పరస్థలము కాదు. కాదు కూడదు నేను వెళ్ళక మాన నంటివా మంచిదెకాని గృహచ్ఛిద్రములచేత మనస్సు విఱిగి సాహసకార్యములు చేయనని నాతోనీవు ప్రమాణము చేసినఁగాని నేను నిన్ను విడువ"నని పలుకుటయు జగన్నాథరావుమందహాసముచేసి నీకు నాయందుఁగల యపారప్రేమకు సంతసించితిని. నే నేసాహసకార్యముఁ జేయనని యిదిగోనీచేతిలోఁ జేయి వైచుచున్నానని యట్లు చేసెను. అప్పుడు సుందరరావు సంతుష్టమనస్కుఁడై లోనికిఁబోయి నూరురూపాయలు తెచ్చి జగన్నాథరావునకిచ్చి "మిత్రుఁడా! నీవుకడుదూరముపోవక నిజామురాజ్యమునకు వెళ్ళుము అందు సగముకంటె నెక్కువ మన తెనుఁగుదేశమె. ఆరాజ్యమునకు రాజధానియైన హైదరాబాదు చూడఁదగినస్థలము ఆంగ్లేయనాగరకతకు స్థాన మైనచెన్నపురమునందుఁ గొంతకాలమున్న మనము హైదరాబా

దునకుఁ బోయితిమేని యచ్చటిమొగలాయినాగరకతమహమ్మదీయా
చారములు తురకవేషభాషలు మనమనస్సుల కెంతో యానందముఁ
గొల్పి యెన్నో క్రొత్తవిషయములనుమనకునేర్పఁగలవు. అంతియగాక
కాకతీయసామ్రాజ్యలక్ష్మికిఁ గస్తూరితిలకమనిచెప్పఁదగినయోరుగల్లు
ను భామినీరాజ్యస్థానము లగుకలబర్గా గోల్కొండఅహమ్మదునగరు
మున్నగుపురాతనపట్టణములును దప్పక దర్శనీయములు లక్ష్మీకాపుర
ముండి వెడలిపోవుటచేత పాడుపడినమందిరములో యనునట్లునేఁటికా
లమున మిక్కిలికళాహీనములైన యాపట్టణములఁ జూచుటవలన న
నంతమైనకాల మెన్నిమార్పులు చేయఁగలదో మనముగ్రహింపఁగల
ము కావున నీ వక్కడికె పొమ్ము. అదిగాక మన కదిదగ్గఱ నీకుసా
మ్మింకను గావలసినపక్షమున సందేహములేక నాకువ్రాయుము నేను
పంపెద"నని తనమైత్రికుచితమగు తెఱఁగున భాషించుటయు జగన్నా
థరావుకృతజ్ఞతాసూచకముగ "మిత్రుఁడా! నీవు నాకు చేసినియుప
కారము మరవఁజాలను. నీవు బదులిచ్చినసొమ్మునకు ప్రామిస్సరీనోటు
వ్రాసి యిచ్చెద పుచ్చుకొ"మ్మనిపలుక నతఁడు "చాలుఁ జాలు
ఈచిన్న మొత్తమునకు ప్రామిసరీనోటు కావలెనా? నీమాటయెనా
కు ప్రామిస్సరీనోటు నీయిష్టమువచ్చినప్పుడు మూలధనమెయియ్యవ
లసినది. కాని వడ్డి పుచ్చుకొనను. నీకు నేను మిత్రుఁడను కాని షా
హుకారును గానని ప్రత్యుత్తర మిచ్చి యతనిప్రయత్నమువారించె
ను. అతనియౌదార్యమునకును నిర్వ్యాజమైన ప్రేమకును నిష్కపట
మైన సంభాషణమునకును జగన్నాథరావు మిక్కిలిసంతసించితనకృత
జ్ఞతను మాటలతో వెలిబుచ్చ మునుముందు దలంచెను. కాని యది
ముఖస్తుతి యగు ననుభయమున "అపత్కాలమున నుపచరించినమి
త్రునిఋణము దీర్చుట దుష్కర"మని తనలో ననుకొనినట్లుగట్టిగనని
యూరకుండెను. ఆమరునాఁడు బండిమీఁదనే జగన్నాథరావుబయలు

దేటి బెజవాడవెళ్ళి యారాత్రి హైదరాబాదుబండియెక్కి వెళ్లెను.

తల్లాప్రగడరఘుపతిరావుగారుజగన్నాథరావువ్రాసినజాబుచదువుకొని విషణ్ణహృదయుఁడై "అబ్బబ్బా! ఈవివాహమున కెన్నియంతరాయములు సంభవించుచున్న"వని తనలో ననుకొని భార్యను బిలిచి యాలేఖ చదివి వినిపించి యిప్పుడు కర్తవ్యమేమిటి! శంకరరాజుగారిసంబంధము మనము సంపూర్ణముగవదలుకొందమా; యింకనేమైనయాశ యున్నదా. నామట్టుకు నా కేవిధమైనయాశయులేదు. ఆ పిల్లవాఁడు పెద్దమనుష్యుఁడు. అందుచేతనే తన సంబంధముకంటె మంచి సంబంధము మనకుఁ జూచి పెట్టినాఁడు. పిల్లమీఁదఁబిల్ల నియ్యఁబోవుట మనదే తప్పు. ఇప్పుడైనను మనము మేలుకొనియీసంబంధమైనను దాఁటిపోకుండ గట్టిప్రయత్నము చేసికొందము. ప్రాప్తమున్నపక్షమున శంకరరాజుగారి కిచ్చిన సొమ్ము మరల వచ్చును. లేకున్న లేదు. మనపురోహితుని రేపు గుంటూరు పంపుదును. నీకిష్టమేనా" అని యడుగ నామె బంధకవివారి సంబంధము మీఁద నాకాశపోయినది. వెంటనే గుంటూరుసంబంధము ప్రయత్నము చేయుట నాకిష్టమే" యని బదులుచెప్పెను. ఆదినముననె రఘుపతిగారు తమపురోహితుని బిలిపించి పంచాంగము చూపించి ప్రయాణమునకు వారశూలలు నక్షత్రదోషములు లేనిదిన మేర్పఱచి యాయననుగుంటూరు వెళ్లుమని చెప్పిరి. ఆశుభదినమునఁబురోహితుఁడు గుంటూరు వెళ్ళి పెండ్లికుమారునిఁజూచి రఘుపతిగారి యభీష్టము సుందరరావు యొక్కతల్లికిని మేనమామకును దెలిపి పెండ్లికూఁతురును జూచుటకై తనవెంట నతనిమేనమామను దోడ్కొనివచ్చెను. మేనమామయురఘుపతిగారిదర్శనముఁజేసి పెండ్లికూఁతుం జూచి వారిస్థితిగతులుచుట్టుప్రక్కలవారి నడిగి దెలిసికొని తమతీవికి గౌరవమునకు రఘుపతిగారి సంబంధము సరిపోయియున్నదని గ్రహించి సంబంధము నిశ్చయించు

కొని పెద్దమనుష్యులయెదుట తాంబూలములుపుచ్చుకొనియెను. ఉభయుల కనుకూల మైనముహూర్తము శ్రావణమాసములో నిశ్చయముచేసి పంపుదుమని రఘుపతిగా రాయనతోఁ జెప్పిపంపిరి.

కుమారుఁడు లిఖించినలేఖ శంకరరా జందుకొని చింపిచదువుకొని మొట్టమొదట నాజాబు కొడుకుపేరు పెట్టి తన్నువంచించుటకు దురాత్ము లెవరైన వ్రాసి రేమో యని సందేహించి సందేహనివారణార్థము శోధకతాబుద్ధితో మరలఁ జదివి లోపలివ్రాతయుఁబై విలాసపువ్రాతయు నతనిదస్తూరీయే యని తెలిసికొనియాజాబు చింపి రెండుముక్కలు చేసి యవ్వలఁ బాఱవైచి పండ్లు పటపటఁ గొఱుకుచు "ఓరీదుర్మార్గుఁడా! ఓరిపితృద్రోహీ! ఓరివంశనాశకుఁడా! నీవంటిపాడుముండకొడుకు కుమారుఁడని చెప్పుకొనుటకంటె వేరు సిగ్గు లేదు. నీవు చచ్చిపోయినపక్షమున నే నెంతోసుఖపడుదును, ఛీ! ఇఁక నీమొగముఁ జూడనురా దుర్మార్గుఁడా. వల్లూరివారును నీవునుగలిసికట్టుకట్టుకొని యొక్కవల్లకాఁటిలోనె మండిపొండి" యని గొంతుపగులునట్లు చావడిలోఁ గేకలువేయుచుండఁగా నేమో యనుకొనిలోపలినుండిభార్య పరుగుపరుగున వచ్చి యేమి టేమిఁటి యెందుకు మీరు కేకలువేయుచున్నారు. పిల్లవాఁడు సుఖముగ నున్నాఁడా? ఏదోయుత్తరము వచ్చినట్లున్నదని యడిగెను. ఆమెనుఁ జూడగానే శంకరరాజుయొక్క యాగ్రహము మిన్నుముట్ట పిశాచావిష్టుఁ డైనట్లు సురాపానమత్తుఁ డైనట్లు దేహము తెలియక యిట్లు దుర్భాష లాడఁజొచ్చెను.

"పిల్లవాఁడా! పిల్లవాఁడు చచ్చిపోయినాఁడు. మూఁడుదినములైనది. ఇదిగో దినవారములు తేపారంభించి చేయఁదలఁచుకొన్నాను. దిక్కుమాలినముండవు. నీకాన్పు గంగలోఁ గలిసిపోను. నీకడుపునబుట్టినదుర్మార్గుఁడు మంచివాఁడగునా? వేలకొలఁదిరూపాయలు వాఁడికాష్టముమీఁదఁ బోసి చదువు చెప్పించినాను. వాఁడిమొగము మండ.

వాఁడిచదువు తగులఁబెట్టు. ఇంతమందికివిశూచిజాడ్యములుమశూచిజాడ్యములు వచ్చుచున్నవి వీఁడికి రాదేమి. సిగ్గుబిడియములు లేనిసిఖండి వెధవ యెవఁడంటె వీఁడొక్కఁడె. లోకములో వీఁడుబ్రాహ్మణుఁడన్నమాఁటె కాని పరమచండాలుఁడు. తండ్రికిద్రోహముచేసినపరమదుర్మార్గుఁడు. రఘుపతిగారిపిల్లను వాఁడు పెండ్లి చేసికోఁడట! ఉత్తరమువ్రాసినాఁడు. వీఁడుత్తరము మండిపోను." అని మఱియుఁ బలుతెఱఁగుల గొడుకును నిందించుచుండ భార్య మాటల కడ్డమువచ్చి "అయ్యో! ఈవఱ కాసంబంధము చేసికొనుటకు నిశ్చయించినాఁడే. ఇంతలో నేమివచ్చినది చెప్పుమా. సహవాసమువల్ల వానిబుద్ధిపాడైనదని మరల నేమోయనుచుండ శంకరరాజు "దిక్కుమాలినముండా! వాఁడిబుద్ధిగాదు పాడైనది. నీబుద్ధి బుగ్గియైనది. దిక్కుమాలినముండా! నీవు వాఁడుగలిసి యాలోచించుకొనియీపనిచేసి యేమి యెఱుఁగని నంగనాచివలె నాదగ్గఱకు వచ్చి కల్లబొల్లిమాటలు చెప్పుచున్నావా? నీమూలముననె యింతఫుట్టె మునిఁగినది. నీవుచచ్చిపోతేనేకాని నా కొంపకు దరిద్రదశ తీరదని తిట్టి కోప మాపుకొనలేక బెబ్బులి యురికొన్నట్లామెమీఁద కొక్కఁగంతున నురికి కొప్పుపట్టి వంగదీసి చెళ్ళుచెళ్ళున వీఁపుమీఁద పదిచరపులుచరచి "పోముండా! నీవు తాటకివి ఆవెధవ మారీచుఁడు చావండియిద్దఱుఁగలిసి" యని వగర్చుకొనుచు చావడిలో నున్నబల్లమీఁదఁ గూర్చుండెను. పాప మాయిల్లాలు నోరెత్తక యన్ని దెబ్బలుదిని గుర్రిడ్లనీళ్ళు కుర్రిక్కుకొనుచు "నారాయణ నారాయణ నే నిందులో నేపాప మెఱుఁగను తనంతట తనకే తోఁచి పిల్లవాఁ డీపని చేసినాఁడు కాని నేనటువంటి దుర్బోధలు చేయుదునా" యని మెల్లఁగాననుకొనుచు లోనికిఁ బోయెను.

శంకరరాజుయొక్కమనోవేదనము వర్ణించుటకు వేయినాలుకలుగల యాదిశేషుఁడుసయితముఁ జాలఁడు. ఒకసారి గుంటూరు పో

యి కుమారునిఁ గలిసికొనఁ దలఁచును. అతఁడు దేశాంతరముపోవద లఁచుకొన్నమాట యంతలో నెఱ్ఱపికివచ్చి యాప్రయత్నము మాను కొనెను. ఒకసారి రఘుపతిగారియొద్దకుఁబోయి యేవో నాలుగబద్ధ ములాడి కొడుకు దేశాంతరమునుండి మరల వచ్చువఱకు ముహూ ర్త మాపించుటకై యత్నముసేయును. కాని రఘుపతిగారికిఁ గూడ వారిబిడ్డను చేసికోనని జాబువ్రాసినమాట తలపునకు రాఁగానేయా యాలోచనముఁ బరిత్యజించును. ఒక్కసారి తనమరఁదియైనగోవింద రాయని బిలిపించి కొడుకును వెదకింపఁదలఁచును. కాని యతఁడే దేశ ము వెళ్ళినాఁడో తెలియనప్పుడు వెదకించుట యెట్లని యాతలంపుప రిహరించును. శంకరరాజునకు గలిగినగొప్పదుఃఖమునకుముఖ్యకారణ ము కుమారునిదుర్వినయము కాదు. వివాహభంగముగాదు. రఘుపతి గారు కట్నములక్రిందను కానుకలక్రిందను కర్చులక్రిందనుతనకిచ్చిన ధనము నిప్పుడొక్కసారి క్రిక్కవలసివచ్చుగదాయనిమహాదుఃఖమత నిమనంబు నావరించెను. వల్లూరివారిమీఁద నాగ్రహము రూపాయల మీఁదియాశ యనునట్టిరెండుపిశాచములు శంకరరాజును బీడించుచుం డినను రఘుపతిగారికి మరల రూపాయ లీయనక్కఱ లేకుండ నెవ రైన నుపకారములుచేసినపక్షమున వల్లూరివారిమీఁదికోపమేదోవిధ ముగ సరిపెట్టుకొని యుండుట కతనిమనస్సును సమాధానముజేసికొ నెను. కాని రఘుపతిగా రూరకుండరనియు న్యాయస్థానముల కెక్కిం చియైన వడ్డీతోను కర్చులతోను తనసొమ్ము తాను పుచ్చుకొనకమా నఁ డని యతఁడు నిశ్చయముగ నమ్మి దానివిషయమై బెంగబెట్టుకొ నెను. అనాయాసముగను నప్రయత్నముగనుదనయిల్లుచొచ్చినలక్ష్మి ని దా నెట్లు బొమ్మనఁగలఁడు. అన్నిసంచులరూపాయ లొక్కసారి యతఁడు చేతులార నితరుల కెట్లీయఁగలఁడు అవసర మైనప్పుడు లో కులు ప్రాణములనైన నిత్తురు గాని నాణెములనీయఁజాలరుగదా! అట్టి

మహాపత్సమయమున నతనికి సరియైన దారి చూపువారు తనపెట్టెలో ని రూపాయలు కదలకుండసలహా జెప్పువారు భీమడోలునం దెవ్వరు లేకపోయినందున మంచిచెడ్డల కన్నింటికి మరఁది గోవిందరాయఁడొ క్కఁడె కలఁడని తత్క్షణమె యతని రమ్మని జాబు వ్రాసెను. అర్జును నకు రాజసూయయాగసమయమునను కురుపాండవయుద్ధకాలమునను గోవిందుఁడు సహాయముచేసినట్లు గోవిందరాయుఁడు తనబావకు య థాశక్తిగ వెనుకటినుండియు సాయము చేయు చుండుట మనమెఱుఁ గుదుముగదా! అందుచేత బావగారిజాబు చేరినపూటే గడియయైన యాలసింపక రైలుబండియెక్కి భీమడోలు చేరి బావగారిని చూచి తన్ను రమ్మని వ్రాసినఁతొందరపని యేమియని యడిగెను. అందుకు శంకరరాజు దీనముఖుఁడై యిట్లనియెను.

"గోవిందరాయఁడూ! నాకొంప మునిగిపోయినది. నాకొడుకే నాకొంప నట్టేటిలో గట్టినాఁడు. నీవంతకష్టపడి చెన్నపట్టణము వెళ్ళి మరలఁ బెండ్లిచేసికొనుటకు వానినొడంబరచినానాశ్రమములుంబడితివి గదా! నీశ్రమలన్నియు వ్యర్థము లయిపోయినవి. అదిగో అదిగో నీ మేనల్లుఁడు వ్రాసినజాబు చదువుకో. ఆకోపములో రెండుముక్కలుగా జంపి పాఱవైచినాను. కాని కొంతకోపముపశమించినతరువాత నెందు కైనను మంచిదే యని యారెండుముక్కలుదీసి జాగ్రత్తపెట్టితిని. అ ని యారెండుముక్కలు చేతికిచ్చెను. ఆరెండుముక్కలు దగ్గఱగాఁబె ట్టి గోవిందరాయఁడు చదువుకొని "వీడెంతదుర్మార్గుఁడయ్యా. వీఁడు కొడుకు గాఁడు నీకు. నీపాలిటియమధర్మరాజు. సింహముకడుపునఁజె వులపిల్లి పుట్టినట్లు నీకడుపున నీనిర్భాగ్యుఁడు పుట్టినాఁడు. సరే! దీని కిప్పు డేమిచేయుదము. మీయభిప్రాయము చెప్పండి" యని పలికెను.

"అందుకేకాదుటోయి నిన్ను రమ్మన్నది. నీవుబుద్ధిలో బృహ స్పతియంతవాఁడవు. నాకిప్పుడు మతి లేదు. నేనేయాలోచనముఁ జె

ప్పఁజాలను. వల్లూరివారిగర్వభంజనముఁ జేయ లేకపోతిమి. రఘుపతిగారి దగ్గర మనమాఁట బోటువోయినది. తలవంపులైనవి. ఈదిక్కుమాలి నకొడుకు నన్ను న్నివిధములఁ బాడుచేసినాఁడు రా నాయనా. వీఁడికిం త వినాశకాలము వచ్చునని నేను కలలోనైన ననుకొనలేదు. మాయ చదువు లింగ్లీషుచదువులు వచ్చి కుఱ్ఱముండాకొడుకులమతులు పాడు చేసినవి. ఇప్పుడేమిబుద్ధి మనకు."

"నీచిత్తమేలాగో ఆలాగు చేయుదము. ముందునీయభిప్రాయ ముచెప్పు. నీకొడుకును వెదకి తీసికొని రమ్మని నీయభిప్రాయమా లేక పెండ్లిమానుకొంద మని యభిప్రాయమా. అది యేదో తేల నియ్యండి."

"నాయనా! నామనస్సులో నున్నగుట్టుమట్టు నీకుఁజెప్పుచున్నా ను విను. నీదగ్గఱ మర్మము దాచుటకు వీలు లేదు. ఈసంబంధము వాఁడేలాగుననుజేసికొనఁడు. అదినిశ్చయము. కాని"—అని తనచేతు లతో గోవింద రాయనితల పట్టుకొని తనప్రక్కకు వంగఁదీసి చెవిలో "మనచేత బడినరూపాయలు మరల రఘుపతిగారికి వెళ్ళకుండునట్టి దా రిమాత్రము చూడు నాయనా" యని రహస్యముగఁ జెప్పి "చూడు. నీవు నాకన్న చిన్నవాఁడవు. అందుచేతనీకాళ్ళు నేను పట్టుకొనఁగూడ దు. ఇవి చేతులు కావు. కాళ్ళని చేతులుపట్టుకొని తరువాత గడ్డము పట్టుకొని బతిమాలుకొనెను. గోవింద రాయఁడు తొట్రిపాటుతో నత నిచేతులు తీసివైచి "బావా! యెంతమాట మీకుఱ్ఱవాఁ డొకటి నేనొ కటి గాదు. నన్నింతబ్రతిమాల నక్కఱలేదు. కాని నా కీవిషయము లో మంచియుపాయము పొడకట్టుట లేదు. ఏమంటే రఘుపతిగారు కుమార్తెను మనకీయఁదలఁచుట లోకప్రసిద్ధమైనది. కట్నముగూడ పెద్దమనుష్యులయెదుట మన కిచ్చినారు. కర్చులకింద ఁగూడ మనకిచ్చి నసొమ్ము పైవారు కొంద ఱెఱుఁగుదురు. అందుచేత మనమీసొమ్మి

యక తప్పదేమో యని భయపడు చున్నాను. పెండ్లి జరిగినపక్షమున నీసొమ్ము మనకు దక్కును."

"అయ్యో! గోవింద రాయుఁడు! మన కంతయదృష్టమా. మన బంగారము మంచిది కాదు. కాబట్టి మనకిన్ని పాట్లు వచ్చినవి. మన వాఁడు మనమాట వింటేనా ఒకఁడు మనలను వ్రేలుపెట్టిచూపఁగలఁడా. రావువారియేనుగును గుమ్మములోఁగట్టివేయించఁగలను. కాని కార్యము చెడివచ్చినది. పెండ్లి యేలాగుకాఁగలదు.

"బావగారూ!వల్లూరివారిపిల్ల జీవించి యుండగమనపిల్లవాఁడు రెండవపిల్లను పెండ్లిచేసుకొనఁడు."

"బాబూ! గోవింద రాయఁడూ! ఆదిక్కుమాలినపిల్ల చావదు.ఆ పిల్ల చావకపోతే వీఁడు పెండ్లి చేసికొనఁడు. చేతబడిచేయించియాపిల్ల ను ద్వారలోఁ గడ తేర్చునట్లు లేర్పాటుచేయఁగలవా? అతఁడికేదైనాప దిరూపాయలసొమ్ము మనము ముట్టచెప్పవచ్చును. మీగ్రామములో భైరవశాస్త్రిమంత్రిశాస్త్రములో గొప్పవాఁ డఁట. అతనిచేత ప్రయోగము చేయించలేవా."

"బావగారూ! పూర్వకాలములో మంత్రాలుచెప్పినట్లు పనిచేసినవి. ఇప్పు డాతపస్సులు సత్యములు లేవు గనుక మంత్రములు పని చేయుట లేదు. డాబులు తంత్రములు యంత్రములే కాని మంత్రములు లేవు."

"ఏలాగో నొకలాగు దానినిఁ గడ తేర్చవలయును. ఇంతకంటె మంచియుపాయము లేదు. అది మన కేలాగు దొరకఁగలదు?"

"అయితే బావగారూ వినండి. నన్ను మీరు పెనుగొండపంపండి. పిల్లను నెలదినములు నాదగ్గఉనుంచుకోవలెనని యున్నది. పంపండి యని రామలింగస్వామిగారిపేర నొకయుత్తరమువ్రాసి నాచేతి కియ్యండి. నేను పట్టుకొనివెళ్ళిపిల్లను తీసికొని వచ్చెదను. ఇదే మొద

టిపర్యాయము గనుక పిల్లతోఁ దల్లి యన్నగారు రావచ్చును. వచ్చి వారముదినము లుండి వారు వెళ్ళుదురు. అందుకు మీ రాటంకపెట్టవద్దు. వాళ్ళను తిట్టవద్దు. సూటిపోటిమాటలతో మనస్సు నొప్పించవద్దు. ఈలా గైనపక్షమున మనము కార్యము సాధించఁగలము."

"రామలింగస్వామికి మనకుఁబచ్చగడ్డి వైచిన భగ్గునమండునం తవిరోధ మున్నది. చూపులు మాటలు లేవు తనమీఁద కక్షగట్టి నా పిల్లవానికి రెండవపెండ్లి చేసి తనకూఁతురుకాపురము నేనుపాడుచేయఁ దలఁచి యుండఁగా నామాట నమ్మి నాయింటికిఁదనబిడ్డ నిప్పుడతఁడు పంపునా! పంపకపోయినయెడ మనపన్నగడ సాగునా?"

"పంపకేమి! చక్కఁగాఁ బంపును తేనె లుట్టిపడునట్లు మాటలు చెప్పఁగల నేర్పున్నవాఁడు వెళ్ళికోఁతలు కోయఁగలిగినయెడఁదీసికొని రావచ్చును"

"గోవిందరాయఁడూ! అట్టిమాఁటనేర్పు గలవాఁడవు నీవుతప్ప మఱియొకఁడు లేఁడు ఈపని నీతలమీఁదనె పెట్టినాను పాలముంచినను నీట ముంచినను నీదేభారము"

"బావగారూ! ఈవిషయములలో మీరు స్వయముగ వెళ్ళుటయె మంచిది మీ రడిగినపక్షమున వియ్యంకుఁడు ప్రసన్నుఁడైనాఁడని సంతోషించి మీవెంటఁ బంపును పైగా నిది ఘోరకృత్యము నామన సొప్పుట లేదు"

"ఓయీ గోవిందరాయఁడు! నీ వీలా గన్నపక్షమున నాపరువంతయు పోవును నాసంసారము నశించిపోవును నేను బాగుపడితినా నీవుఁగూడ బాగుపడుదువు నేను కాఁటికిఁగాళ్ళుచాపుకొన్న పెద్దముండకొడుకను నీమేనల్లుఁడెబాగుపడును నీయప్పగారెబాగుపడును అదిగాక నీవిందులో పనిచేసినపక్షమున నాప్రమాణకముగ నీ కొక్కనహాస్రముపాయలు ముట్టచెప్పెదను కాఁబట్టి యీభారమునీమీఁద

వేసికో మారుమాటాడకు పైగానేను దురహంకారుఁడను ఆడఁదగి నమాట, ఆడకూడనిమాట యెఱుఁగను అందుచేతనీవేదానిని దీసికొ నివచ్చి కార్యసాఫల్య మగువఱకు నిచ్చట యుండుము"

"అబ్బె బావగారూ! చేతులు కట్టుకొని మీపని చేయవలసిన వాఁడనె కాని మీవద్ద డబ్బు పుచ్చుకొందునా అలాటిమాట తమరు సెలవియ్యవద్దు. అది నా కెంతో కష్టముగ నున్నది ఎందుకు వెళ్ళలే నన్నానంటే నాకింటిదగ్గఱ కొంచెముపని యున్నది. నేనొకరికి రెండు వందలరూపాయలు, నొకరికి మూడువందలరూపాయలు నియ్యవలెను. చాలకాలమైనది పుచ్చుకొని. రెండుమూడుసారులు నోటుత్రిప్పివ్రా సియిచ్చితిని. ఇప్పుడు వాళ్ళు నామీఁదవ్యాజ్యము వేయఁదలఁచుకొ" న్నారు. వాళ్ళ నేలాగో నేసమాధానము జేసికొని రావలెను గనుక నన్ను విడిచిపెట్టండి"

"అబ్బబ్బానిన్ను నేనువిడిచిపెట్టను ప్రస్తుతముమూడువందలరూ పాయలు పట్టుకొనివెళ్ళి వాఱిద్దరికి చెరిసగమిచ్చి వ్యవహారము సర్దు బాటు చేసికొనిరా నాకార్యమైనతరువాతతక్కినసొమ్ము నీకిచ్చెదను.

"సరే మీసెలవుప్రకారము చేయవలసినవాఁడనెకానిమఱియొ కలాగు నడవవలసినవాఁడను కానుగదా. డబ్బుపావనమావెధవడబ్బు గుడ్డిముండ గడించగలదు. మీరుపెద్దలు. మీకు చిక్కువచ్చినప్పుడు మీసెలవుప్రకారము చేయుట నాకు విధి. ఉత్తరమువ్రాసి యివ్వం డి. ఈవుత్తరము పుచ్చుకొని మూడువంధలరూపాయలు పుచ్చుకొని నిడదవోలు వెళ్ళి యక్కడబాకీదార్లకులెక్క సర్దుబాటుచేసియక్క డే పడవయెక్కి పెనుగొండ వెళ్ళి పిల్లను దీసికొనివచ్చెదను."

"సరే యిదిగో జాబు వ్రాసియిచ్చెదను."

అని కాగితముఁ గలముఁబుచ్చుకొని యీక్రిందివిధముగా జాబువ్రాసెను.

మహారాజశ్రీవల్లూరి రామలింగస్వామిభావగారికి- మీావియ్యం కుడు బంధకవి శంకరరాజు అనేకనమస్కారములు చేసి జేయంగల విన్నపములు.

ఇక్కడ భీమడోలులోఁ గుశలము. అక్కడఁదమసంతోషాతిశయములు వ్రాసి పంపుచుండ వలయును.

త॥ ఈమధ్య కొన్ని కారణములచేత మీాకుమాకుమనస్పర్థలు కలిగి చూపులు మాటలులేక యున్నాము. ఇచ్చి పుచ్చుకొన్నచోట యెవరివల్లనైన నేమి భేదములు కలిగినప్పు డవి సర్దుబాటు చేసికొని మనము సుఖపడవలెను. మనలో మనకున్న వివాదములచేతనాఁ బోతులు పొట్లాడి లేఁగదూడలను బొడిచి చంపినట్లు మంచిసౌఖ్యమనుభవింపవలసిన రోజులలో మీాపిల్లనుమాపిల్ల వానినిమిక్కిలిగష్టపెట్టుచున్నాము. మీాపిల్లయు క్తవయస్కురాలై రెండుసంవత్సరములయినది అప్పుడు వెంటనే పునస్సంధానము జరిగినపక్షమున నీపాటికి మనమిద్దఱము తాతలమై మనుమని ముద్దులాడుచుండవలసినపద్దు. అల్లుఁడు మీాయింటికి వచ్చుటకు మనవివాదమువలన సిగ్గుపడుచున్నాఁడు కాఁబట్టి పునస్సంధానము మాయింటిదగ్గరనే నేను జరిగించఁదలఁచుకొన్నాను. గనుక పిల్లను మాగోవింద రాయునివెంటఁ బంపించవలెను పిల్లను శ్రావణమాసమువఱకు మాయింటికడనే యుంచుకొని కార్యమునుచేసి యల్లుని గూఁతును మీాయింటికి మనుగడుపునిమిత్తము పంపించెదము. మాకోడలికి శ్రావణమంగళవారమునోము నాలుగేండ్లు మాత్రమెయైనదని తెలిసినది. ఈయేడుమాయింటిదగ్గఱ నోము నోపించఁదలఁచుకొన్నాను. దానితో వ్రతము పూర్తి యగును. కాఁబట్టివిరోధములు విడిచిపెట్టి పిల్లక్షేమము గోరి యేమాటఁకములు చెప్పక పిల్లదానిని వెంటనే పంపవలయును. పిల్లతో మాావియ్యపురాలు

నుగేశవరాజును బంపినయెడలఁ బిల్ల మాకలవాటుపడువఱకుమాయిం టవారముదినములుండి తరువాత వెళ్ళవచ్చును.

చిత్తగించవలెను,

బంధకవి శంకరరాజు.

భీమడోలు

జాబు ముగించి పైపేరు వ్రాసి గోవిందరాయనిచేతి కిచ్చి విధి లేక మూడువందలురూపాయలుఁగూడఁ దీసికొనివచ్చి లెక్కపెట్టి యతనికిచ్చి ప్రయాణమునకుఁ గావలసిన కర్చులిచ్చుట కిష్టములేక "గోవిందరాయఁడూ! లెక్కసర్దుబాటుగా లేదు. కావలసిన దిందులో నుండియే కర్చుపెట్టి ప్రయాణముచేసిరా. వచ్చినతరువాత నీకుబత్తిక ర్చుసొమ్మిచ్చెద"నని చెప్పి యారాత్రిబండిమీఁదనె యతనినిబంపెను "పిల్లికిబిచ్చము పెట్టనిపిసినిగొట్టువద్దనుంచినెత్తురుబొట్లుతీసినట్లుమూడు వందలరూపాయ లిప్పటికితీసితినిగదాతక్కినయేడువందలరూపాయలు వీనికడలాగలేకపోదునా" యని తలపోయుచు నప్పుడు చేతిలోఁబడిన తాత్కాలికలాభమునకు నంతోషించుచు గోవిందరాయుఁడింటికరిగె ను. "మూడువందలరూపాయలుమాత్రమే ప్రస్తుత మిచ్చితినిగదా.ఏ వొకల్లబొల్లిమాటలు చెప్పియాశపెట్టి యరచేతిలో వైకుంఠముఁజూపి తక్కినయేడువందలరూపాయలీయకుండ నాకార్యమీతనిచేతఁజేయిం చుకొనలేకపోదునా? వీని తాతలవంటివారిని నేనుబుట్టలోఁ బెట్టినాను. వీఁ డెంత" యని శంకరరాజు గోవిందరాయనివచించుటకుపాయము లఁబన్నుచుండెను. ఆశాపిశాచావిష్టు లైనమనుష్యులు న్యాయ మైన వ్యాపారములలోను నన్యాయమైనవ్యాపారములలోను గూడ పరస్ప రవంచనమే సేయుచు నన్యోన్యవిశ్వాసము లేక భ్రష్టు లగుచుండుట మన మనుదినమును లోకమునఁ జూచుచున్న విషయమే గోవిందరా యఁడు నిడదవోలు వెళ్ళి రెండుదినము లచ్చట నిలిచి తనపనిఁజూచు కొని మూఁడవనాఁడు పెనుగొండ ప్రయాణమాయెను. తనపనిఁజూచు

కొనుట యనుటచే శంకరరా జిచ్చినమూఁడువందలరూపాయలు ఋణ ములుదీర్చి కొనుటకింద వినియోగించె నని మనము తప్పభిప్రాయ ముపడఁగూడదు. ఏజన్మమునందో శంకరరాజు ఋణపడియాఋణము గోవిందరాయున కీజన్మమునఁదీర్చికొన్నాఁడనితలంపవలసిన దేకానిగో విందరాయఁ డితరులకు ఋణపడియున్నాఁడని తలంపఁగూడదు. ఏల యననదివఱకుఁ జేసినఋణము గోవిందరాయఁడెగఁబెట్టుటచేతఁ గొం తకాలమునుండి యతని కెవ్వరు ఋణ మిచ్చుట మానిరి. అప్పులు దీ ర్చుకోవలసినట్లు శంకరరాజుతో నతఁ డన్నమాటయొక్క యర్థము మనము పరిగఁ దీసికొనఁ గూడదు.

అతఁడు నిడదవోలులో రహదారీపడవ యెక్కి,మఱునాడుద యమునఁగాకులుకూయువేళకుఁ బెనుగొండలోఁదిగితిన్న గారామలింగ స్వామిగారియింటికి వెళ్ళెను. రామలింగస్వామిగారునువారికుటుంబము వారును రాజరత్నముయొక్క వివాహకాలమందెకాని తరువాతగోవిం దరాయని మఱెప్పుడుఁ జూచియుండనందునఁ గేశవరాజును రామలిం గస్వామియు వానినివెంటనే యానవాలు పట్టఁజాలకపోయినను గృహ మునకు వచ్చి చెప్పులు వాకిటిలో వదలి చుట్టముయొక్క నామధే యాదులు తెలియకపోయిననుగౌరవము చేయుట గృహస్థధర్మమగుట చే బల్లమీఁద దయచేయుఁడి యని పడవమీఁదదయ చేసినారాయని తండ్రికొడుకులు పలుకరించిరి. గృహయజమానురాలు పాదప్రక్షాళన ము జేసికొనుట కుదకముఁదెచ్చి యిచ్చెను. గోవిందరాయఁడు కాళ్ళుక డుగుకొని తానెవ్వరో తెలియక వారందఱుఁ గళవళము పడుచున్నా రని తెలిసికొని యాసందిగ్ధదశ తొఁలగింపఁదలఁచి "అయ్యా! అన్న గారు నేనెవరో మీరు గుర్తింపలేరు. బంధకవి శంకరరాజుగారిభా ర్యనాతోబుట్టువు. జగన్నాథరావునామేనల్లుఁడు. మాబావగారు మీ కుత్తరము వ్రాసియిచ్చి మీతోఁ గొన్నిసంగతులు మాటలాడవలసి

న దని నన్నిక్కడకుఁ బంపినారు. అందుచేత నేనుమీదర్శనమునకు వచ్చినా నని చెప్పెను. శంకరరాజు చండశాసనుఁడగుటచే నెట్టిపన్ను గడ పన్ని యతనిఁ దమకడకుఁ బంపినాఁ డోయని వానివలుకులువినఁ గానె యింటిలో నున్నవారి కందఱకు నొక్కసారిగభయముగలిగెను. కాని రామలింగస్వామి మనసు నిబ్బరముచేసికొని చిత్తము చిత్తము మిమ్ము నేనానవాలు పట్టలేకపోయినమాట నిజము. నాఁడు వివాహములోఁదప్ప మఱియెప్పుఁడుఁ గలిసికొనకపోవుట చేబావగారికి మీకు మామీఁదసంపూర్ణానుగ్రహము కలదు. గనుక వారుపంపినారుమీరుదయచ్చేసినారు. రాకపోక లున్నప్పుడె బంధుత్వలాభమనుభవించుటకు నీ లుండుమని యతనితో సాదరంబుగఁ బలికి తానుగూడనతని సన్నిధిఁ గూర్చుండి వచ్చినపని యేమని యడిగెను. అడుగుటయునతఁడుజాబు చేతికిచ్చెను. ఆలేఖ రామలింగస్వామి చదువుకొనిలోపలికిఁ బోయిభార్యకుఁ గుమారునకుఁ జదివి వినిపించెను "మనమీఁదశంకరరాజున కింతదయ కలుగుటకుఁ గారణ మేమి చెప్పుమా. దుర్మార్గుఁడు దురంత మేదియైనఁ దలఁచుకొనలేదుగదా" యని భార్యపలికెను. కాదు కాదు. నేనువ్రాసినజాబు చూచి జగన్నాథరావు వివాహము జేసికో నని స్పష్టముగఁ జెప్పియుండును. అందుచేత విధిలేక తనపట్టినకుందేటికి మూఁడేకాళ్ళన్నమాట మాని యాముసలివాఁడు సరియైనదారికి వచ్చినాఁడు. సర్వప్రయత్నములు భగ్నమైనతరువాత రాజీకి వచ్చినాఁ డని కేశవరాజు పలికెను "సరే! భోజన మైనతరువాతమన మాలోచించుకొందము లెండి. యిప్పుడు తొందరపడకండి" యనియావఁకుఁబోయి మధ్యాహ్నము మాటలాడవచ్చునని గోవిందరాయనితోఁ జెప్పి క్రొత్తచుట్టమునకు మంచినెయ్యి పెరుగుఁ గూరలు తెప్పించవలయును గనుక గ్రామములోనికిఁ బోయెను. గోవిందరాయఁడు పెరుగొండ మున్నెన్నఁడుఁ జూచియుండమి కేశవరాజును వెంటఁబెట్టుకొనికన్య

కాపరమేశ్వరీదేవతాలయముఁ జూచి గ్రామము నాలుగువీధులవెంటఁ దిరిగి జాముప్రొద్దెక్కునప్పటికి యింటికి వచ్చి స్నానము జేసి రామలింగస్వామిపంక్తిని భోజనము జేసెను. భోజనానంతరమున రాత్రి పడవలో సరిగా నిద్ర లేనందునఁ గొంచెము సేపు నిద్రించి జాముప్రొద్దు వేళ లేచి మినపరొట్టె యుపాహారముగ భక్షించి పిదప గోవిందరాయఁడు రామలింగస్వామిని జూచి యిట్లనియె.

"అన్నగారూ! బావగారు వ్రాసినజాబు మీరుచూచుకొన్నారుగదా. నేనుగూడ చెప్పవలసినమాటలు నాలుగున్నవి. అవి సావధానముగఁ జిత్తగింపవలయును. మనబావగారు తిక్కశంకరయ్యయన్నమాట మీరెఱుఁగుదురుకదా. ఆయనకాతోఁచదు. ఒకరుచెప్పిన మాట వినరు. జగన్నాథరావుమీసంబంధముచేసికొనఁ దలఁచిమీరు కట్న మీయలేనందున తాను నోటువ్రాసి సొమ్ము తెచ్చి మీకిచ్చుట, యాసొమ్ము సమయమునకు మీరీయలేకపోవుట, ఋణప్రదాతలు వేసినవ్యాజ్యములో మీపేర డిక్రీయగుట మొదలయినవానివలనసహజముగానె దురహంకారుఁడుపరమలోభియునుగనుక బావగారు మీమీఁద క్రోధము వహించి యున్నాఁడు. మీరు పెద్దలు. మీదగ్గఱయేసంగతులు దాఁచగూడదు. కుమారునకు రెండవపెండ్లిగూడ జేయఁదలఁచుకొన్నాఁడు. ముహూర్తము నిశ్చయించుకొన్నాఁడు. కట్నము పుచ్చుకొన్నాఁడు. కన్యాప్రదాతయొక్కతల్లి హటాత్తుగాఁ జచ్చిపోవుట చేతగాని లేకపోతే యీపాటికి పెళ్ళికావలసినదే. ఆవివాహము కావలసినయోగము లేదు; కావుననె పీటలమీఁదపెండ్లి చెడిపోయినది. ఆముహూర్తము దాటిపోయిన తరువాత జగన్నాథరావుమనస్సున కేమితోఁచినిదో యేమో వివాహము చేసికోనని తండ్రిపేర వ్రాసినాఁడు. తండ్రిపేరేగాదు రఘుపతిగారిపేరఁగూడ వ్రాసినాఁడు. ఆయుత్తరము చూచినతరువాత శంకరరాజుగారి మనస్సు పిరిగిపోయినది.

కుమారుఁడు తనయిష్టప్రకారము వెళ్ళఁడని తెలిసికొని రెండవపెండ్లి యాశ వదలుకొన్నాఁడు. కుమారునకు రెండవపెండ్లిచేయవద్దని రామలింగస్వామిగారుమఱియొకరివంటివారుకారు,చాలయోగ్యులు నని చెప్పి నేను గడ్డముపట్టి బ్రతిమాలుకొన్నాను. అప్పుడు నామాట నచ్చినదికాదు. బొప్పికట్టితేనేకాని యెవ్వరికి నచ్చదు. ఇప్పుడాయనంతటాయనకె తోఁచినది. నేల పదునుకు వచ్చినపుడె విత్తనము నాటవలె. ఆలస్యమమృతంవిషమ్మనియన్నాఁడు. అందుచేతనిప్పుడాయన తికక్తిరిగినది గనుక వెంటనే పాకము చెడకుండా మీపిల్లను పంపడి. తికక్తిరిగినపక్షమున మనస్వాధీనము కాఁడు. చలచిత్తులతోవ్యవహారము మిక్కిలికష్టము. కావున నామనవి వినండి. వదినెగారిని అబ్బాయి నిచ్చి పిల్లను బంపండి. మనవాళ్ళు వారముదినము లుండి రావచ్చును. పునస్సంధానకాలమున తిరిగి రావచ్చును. పునస్సంధానమక్కడ చేయుటకు మీ రాటంకములు చెప్పవద్దు. ఎక్కడోయొకచోట కార్యముజరిగి దంపతు లిద్దఱు సుఖముగా నుండుట కావలసినదికాని మనకు యెక్కడైనా యొకటే. ఈసంగతులన్ని సావకాశముగా దంపతు లిద్దఱు నాలోచించుకొని రేపుసాయంకాలము నాతోవచ్చుటకు సిద్ధముగా నుండండి. నామాట వినండి. మీకిందులో మేలు కలుగును."

"తమ్ముఁడుగారు మీరు చెప్పినమాట బాగున్నది.దీనిలోమేమాలోచించుకోవలసిన వంతగా లేవు. బావగారు మొదటపొరఁబడినను తరువాత న్యాయబారి సరియైనదారికి వచ్చినందుకు నాకెంతోసంతోషముగానున్నది. జగన్నాథరావు విప్పు డెక్కడనున్నాఁడు?"

"జగన్నాథరావుగుంటూరువెళ్ళినాఁడు ఆతనిస్నేహితుని కేదో చిక్కువచ్చినదని పరామర్శకు వెళ్ళవలసివచ్చినది. నాలుగుదినములలో రాఁగలఁడు."

"సరే! జగన్నాథరావు వచ్చునప్పటికి మావాళ్ళనుగూడనాలు గైదుదినములలోఁ బంపెదను. మీరు ముందు వెళ్ళండి."

"అయితే మీరు నిశ్చయముగ రాఁదలఁచుకొని చెప్పినమాటే నాయిది. లేక నన్నుఁ బంపివేయుట కన్నమాటాయిది."

"అన్నన్నా! యెంతమాట నేనుచెప్పెడిదొకమాట చేసెడిదొకమాటగాదు. తప్పక వారముదినములలోఁ బంపించెదను."

"సరే నేనీరోజుననే సెలవుపుచ్చుకొని వెళ్ళెదను. పెందలకడ వంటచేయించండి."

"రాకరాక వచ్చినచుట్టములు మీరు. రెండుపూటలైనసరిగా మాయింటిదగ్గఱ నుండకుండ వెళ్ళుట భావ్యమా."

"సరే మీయాజ్ఞ దాటఁజాలను. రేపే వెళ్ళెదలెండి" యని గోవిందరాయఁ డాదినమున నచ్చటనుండి మరునాఁడుసాయంకాలము ప్రయాణమై నిడదవోలు వెళ్ళి యచ్చటినుండి భీమడోలునకు జని యావృత్తాంతము శంకరరాజునకుఁ దెల్పెను. ఆపలుకులు వినినపిదప వల్లూరువారు తనయింటికి నిజముగా వత్తురో రారో యని శంకరాజునకు సందియముదోఁచెను. అయినను వారముదినములలో వచ్చునట్లు వారు మాట యిచ్చిరి. గనుక వారమువఱకు నిరీక్షించుటమంచిదని యట్లు చేసెను. వల్లూరువారు వారమునాఁటికి సరిగ రాలేదు. తనసంకల్ప మీడేరువఱకు శంకరరాజు గోవిందరాయని దనయొద్దనే యుంచుకొన్నందున నాతనితో నాలోచించి వల్లూరివారిని సత్వరము రప్పించుటకు రామలింగస్వామి కొకయుత్తర మీక్రిందివిధముగ వ్రాసెను.

"బావగారూ! మాపిల్లవాఁడు నిన్న నిక్కడికి వచ్చినాఁడు. మీరిక్కడికి వచ్చినారుకారని యతనికి మీమీఁదను మామీఁదను

మిక్కిలికోపము వచ్చినది. కాఁబట్టి వెంటనేపిల్లనుతీసుకొని రావలెను.

చిత్తగించవలెను,

బంధకవి శంకరరాజు.

ఆజాబు చేరినవెంటనే రామలింగస్వామి జాగుచేసినయెడలతన యల్లునకుఁగూడ కోపము వచ్చునని భయపడి కేశవరాజును భార్యను రాజరత్నమును భీమడోలు పంపెను. తాను కోడలును రావించి స్వగృహమునందె శ్రావణమాసమునఁ బునస్సంధానము సేయ నిశ్చయించినట్లును వల్లూరివారిని రమ్మని పిలుచుటకై గోవిందరాయని బంపినట్లును గుమారునిఁగూడ రప్పించుచున్నట్లును గోవిందరాయఁడు వచ్చినతరువాత శంకరరాజు భార్యతోఁ జెప్పినందున నామెతనమగని యొక్కయు సోదరునియొక్కయు మనస్సులో లీనమై యున్న పాప వ్యవసాయము గ్రహింపలేక కోడలు వచ్చి తనకడఁ గొంతకాలముండుననియు నేఁటికాలమునకుఁ దనకొడుకుఁదనకోడలుఁదనకన్నులుచల్లగఁ గాపురము సేయుదు రనియు బరమసంతోషము నందికొడుకురాకకై నిరీక్షించుచు దనభర్తయొక్క కోపముతీర్చి తనసోదరుఁడేయాతనిఁ బ్రసన్నుంజేసె నని భావించి యాశుభదినము జూచుటకై యువ్విళ్ళూరు చుండెను. కోడలను వియ్యపురాలను జూడఁగానే యామె మహానందభరితురాలయ్యెను. శంకరరాజును గోవిందరాయఁడును గేశవరాజును సగౌరవముగ నాదరించిరి. రాజరత్నము మగనింగన్నలార జూచెడుభాగ్యము తన కబ్బిన దని నమ్మి మనస్సున నుదయించినమేర మీఱినయానందమును ముఖవిలాసములచేతను నిండారు మోదమునుదెలియఁజేయునిరీక్షణములచేతనువ్యక్తముచేయుచుండెను. కానిజగన్నాథరావు కనఁబడకపోవుటచే రాజరత్నమునకుఁ గేశవరాజునకుఁ దల్లికిఁగూడ మనస్సున ననుమాన ముదయించెను. తక్కినవారావిషయమై ప్రశ్నచేయుటకు సందేహించిరి. కాని కేశవరాజు సందేహనివారణార్థ

ముగ రహస్యముగ గోవిందరాయని బిలిచి "యేమండీ! బాబుగారూ జగన్నాథరావు వచ్చినాఁడని మామగారువ్రాసినారు. అతఁడు కనఁబడఁ డెందుచేత" ననియడిగెను, "నాయనా! అతఁడునాలుగుదినములక్రితము వచ్చినాఁడు. మీరు రాలే దని మొగము చిన్నబుచ్చుకొని యేదోపని యున్న దని గుంటూరు వెళ్ళినాఁడు. నాలుగుదినములలో వచ్చునని యుత్తరము చెప్పెను. వల్లూరివారిమనస్సులలో ననుమానముపుట్టిన దని భయపడి వారియనుమానము నివృత్తి చేయుటకై గోవిందరాయఁ డీయుపాయము శంకరరాజుతోఁ జెప్పెను. బావగారూ! నాకొక్కమంచియుపాయము దోఁచినది. అవసరమైనపనిమీఁదనిడదవోలు వెళ్లవలె నని కేశవరాజుతోఁ జెప్పి యీరాత్రిబండిమీఁద గుంటూరు వెళ్ళెదను. అక్కడనుంచి జగన్నాథరావువ్రాసినట్లు మీపేర నేనొక జాబువ్రాసెదను. అందులో జగన్నాథరావు నాలుగుదినములలో వచ్చుచున్నానని మీకు వ్రాసినట్లుండును. ఆజాబు చదివి వారికి వినిపించండి. తరువాతమాట చూచుకొందము" అనవుడు శంకరరాజు సంతోషించి "మంచియుపాయము పన్నినావోయి. లోకములను సృష్టించి బ్రహ్మగొప్పవాఁడైనాఁడు. ఉత్తరములనుసృష్టించినీవుబ్రహ్మయంతవాఁడవైనావు. కాదుకాదు. నీవు విశ్వామిత్రుఁడంతవాఁడవు. నీప్రజ్ఞయింతగొప్ప దని నే నింతవఱకు నెఱుఁగను. బాగున్నది. కానీ" యని యతనివీపుమీఁదఁ జేయివైచితట్టెను. అనవుడు గోవిందరాయఁడు తనప్రజ్ఞ నించుక జాటుకొనఁ దలఁచి సగర్వముగ నిట్లనియె. "బావగారూ! నాసంగతి మీరెఱుఁగరు. ఇదియొకలెక్క. నాచేతిమీఁదుగాఁ నిదివఱకు నాలుగైదుప్రామిస్సరీనోట్లు సృష్టించినాను. మానిడదవోలు పంచమహాపాతకపట్న మని పేరువడివదికదా. అవసరమైనపట్ల చిన్నయుద్యోగస్థులకుగావలసినయెడఁ బాఱవేయించిరికార్డుతగులఁబెట్టించినాను. కాగితముల లెక్కమిటి. అనేకగృహములే

మాకోపాగ్ని కాహుతులైనవి. నిడదవోలులోను చుట్టుపట్లగ్రామాదులలోను మనపేరు సింహస్వప్నము. మీయనుగ్రహ మున్నపక్షమున దీనితాతలవంటివ్యవహారము లవలీలగఁ జిటికలోఁ జేసికొనిరాఁగలను. గోవిందరాయఁ డంటే యేదో వెఱ్ఱిముండాకొడు కనుకొనుచున్నారు.

అనుచుండ శంకరరా జడ్డమువచ్చి "నీప్రజ్ఞలు వేరె చెప్పనక్కఱలేదు. నాపనిసంపూర్ణముగఁ జేసినపక్షమున నీకు మంత్రియుగంధరుఁ డని బిరుదునిచ్చెదను. కాని ప్రొద్దుపోయినది. బండివేళయైనది. లేచివెళ్ళు." అని రైలుఖర్చునిమిత్తము నాలుగురూపాయ లిచ్చెను. అవి పుచ్చుకొని గోవిందరాయఁడు నేను నిడదవోలు వెళ్ళెదను. ఎల్లుండి వచ్చెద నని యప్పగారితోను కేశవరాజుతోను చెప్పి వెళ్ళెను. మూఁడవనాఁడు గుంటూరునుండి శంకరరాజునకు జాబువచ్చెను. ఆజాబులో నిట్లున్నది. "బాబయ్యగారికి జగన్నాథరావు నమస్కారములు. మీరువ్రాసిన జాబు చేరినది. మనవాండ్రిందఱు నక్కడకు వచ్చినారని విని చాలసంతోషించినాను. వారిని మిక్కిలిమర్యాద చేయవలసినది. మీకోపస్వభావముచేత వారిమనస్సునకు నొప్పి గలిగింపవద్దు. కేశవరాజు మిక్కిలియభిమానస్థుఁడు. నేఁటికిమీరు పట్టిన పట్టు వదలి నామీఁదను నాభార్యమీఁదను మాయత్తవారిమీఁదను ననుగ్రహముఁ జూపినందులకు మే మందఱము ధన్యుల మైతిమి. నేనైదారు దినములలో వచ్చుచున్నాను. ఈసంగతి కేశవరాజుతోఁ జెప్పవలెను.

చిత్తగించవలెను,

గుంటూరు జగన్నాథరావు.

ఆజాబు చదువుకొని శంకరరాజు కేశవరాజునకుఁ గూడఁ జదివి వినిపించెను. అది నిక్కమైన జాబె యనుకొని కేశవరాజు తల్లితోడ

ను జెలియలతోడను జెప్పి వారిని సమాధానపరచెను. ఈజాబు చేరిన మరునాఁడె గోవిందరాయఁడు నిడదవోలునుంచి వచ్చిన ట్లభినయించి జగన్నాథరావునొద్దనుంచి యుత్తరము వచ్చిన దని శంకరరాజు చెప్పగా నవ్వార్తక్రొత్తగాఁ దానువిన్నట్లు విని మిక్కిలి సంతోష మభినయించెను. ఆజాబులో వల్లూరివారివిషయమున దయారసగర్భితములై నమాటలు కొన్ని యుండుటచేతఁ గేశవరాజు సంతోషహృదయుఁడై తల్లిం జూచి "అమ్మా! మామగారికోప మణఁగిఁపోయినది. అత్తగారు మనరాజరత్నమును గనులనద్దుకొని కూఁతునజూచినట్లు చూచుచున్నది. కాఁబట్టి రాజరత్నమువిషయమున మనము బెంగపెట్టుకొన నవసరములేదు. మనయింటిదగ్గర బాబయ్యయొక్క రేయున్నారు. ఆయనస్వయముగావండుకొని తినుచున్నారు. స్వయంపాకమాయనకు జబ్బుచేయును. జగన్నాథరావు వారముదినములలోఁగాని రాఁడు. అంతవఱకు మన ముండుటకు వీలులేదు. రేపు బయలుదేరి వెళ్ళవలె ననియున్నది. నీయభిప్రాయమేమిటి" యని యడిగెను. "నాయనా! మీబాబయ్యగారికి సౌఖ్యము జరుగుట లేదన్న మాట నిజము కాని రాజరత్నమును నేను వదలఁజాలకున్నాను పుట్టినతరువాత దానిని నేనెన్నఁడు వదలియుండలేదు అయినప్పటికి నీవు చెప్పినట్లత్తగారు తల్లివలెచూచుచున్నదిగనుక మనము వెళ్ళవచ్చు" నని బదులుచెప్పి "అమ్మా! మేము వెళ్ళవలెననియున్నదినీవుండఁగలవా?" యని కూఁతునడిగెను నాకేమి భయములేదు నేనుండఁగలను మీరువెళ్ళండి" యని యామెప్రత్యుత్తరమిచ్చెను అప్పుడు కేశవరాజు శంకరరాజుం గలిసికొని యామరునాఁడు తాము పయనమై పెనుగొండ వెళ్ళదలంచుకొన్నట్లు చెప్పెను. ఆపలుకు శంకరరాజున కింతింతయనరాని యానందము గల్గెను కాని యాయానందమునుగప్పిపుచ్చి మఱి నాల్గుదినంబులుండవలసినదని యాతను బలవంతముజేసి, యుండుటకు

వీలు లేదని యతఁడునొక్కి చెప్పినమీఁదట వారిపయనమున కంగీకరించెను. మొదటిసారి యత్తవారియింటనుండుటకుఁ బోయినయాడుబిడ్డను విడుచుటకుఁ దల్లి యెంతపరితాపమొందునో యాడుబిడ్డలుగల తలిదండ్రుల కేదెలియవలెనుగానియనుభవైకవేద్యమగు నవ్విషయమువర్ణింపనలవికాదుగదా! బ్రహ్మచర్యవ్రతనిష్ఠుఁడై, నారీపరాఙ్ముఖుఁడై జాలిపెంపున శకుంతలను గొంతకాలముపెంచిన బ్రహ్మజ్ఞానికణ్వుఁడేశకుంతలపతిసన్నిధానమునకరుగుచున్నప్పుడుకన్నులనీరుబెట్టుకొనియాపెనువదలలేకవదలలేక మిక్కిలిఖేదపడినప్పుడు కడుపారఁగని పెంచినకూఁతులతో వియోగము సంభవించినప్పుడు వేదాంతశాస్త్రపరిచయములేని సామాన్యసంసారులు విచారించుటొకయాశ్చర్యమా! అందులో స్త్రీలవిషయమై చెప్పవలసిన దేమున్నది? మఱునాఁడు కేశవరాజు పయనమైనప్పుడు తల్లి వియ్యపురాలింబిలిచి "వదినె! మీకోడలిని జేతిలోఁజేయివైచి నాగవల్లినాఁడె యప్పగించితిని. మీకు కూఁతురైననిదె, కోడలైన నిదె నా పంచప్రాణములు దానిమీఁదనె యుండును. నా బొంది పెనుగొండలోనుండును గాని ప్రాణము లిక్కడనే యుండును. నాఁటి యప్పగింతగాక నేఁడు మరలనీకు నా బిడ్డ నప్పగించుచున్నా" నని దుఃఖాతిశయమున నంతకంటె నెక్కువఁ బలుకఁజాలక రాజరత్నముయొక్కచేయి యత్తగారిచేతిలోవైచి యప్పగించిబిడ్డను గౌఁగలించుకొని ముద్దుపెట్టుకొని వెడలెను. సహజముగ ధైర్యశాలియయ్యును గేశవరాజుగూడ చెల్లెలినెడఁబాయలేక కన్నీరువెట్టుకొనెను. అంతలో రైలుబండివచ్చువేళయైనదని గోవిందరాయఁడుతొందరపెట్టుటచే వారు స్టేషనుకువెళ్ళి బండెక్కిరి. అత్తగారు మనఃపూర్వకమైనప్రేమనుజూపి రాజరత్నమును మిక్కిలిదయతో నాదరింపఁజొచ్చెను. లేనిప్రేమను దెచ్చుకొని మామగారు పండ్లు మిఠాయి మొదలైనవి తెచ్చిపెట్టుచు 'అమ్మా! తల్లీ' అని పిలుచుచు నడిచినఁగంది

పోవుననియు, నెండలోఁదిరిగిన వాడిపోవుననియు భయపడుచు నద్భుత ప్రేమ నభినయించెను. ఇట్లు నాలుగైదు దినములు గడిచెను. ఒక నాఁడురాత్రి శంకరరాజు తనకోడలు, భార్యయు నిద్రించినతరువాత గోవిందరాయని దనదగ్గరకుఁబిలిచి వానిని సావడిలోనికిఁదీసికొనివెళ్ళి గూర్చుండఁబెట్టి కోడలు, భార్యయు గాఢముగనిద్రించుచున్నవారో లేరో యని రెండుమూడుసారులు లోనికివెళ్ళి చూచి వారు గాఢ నిద్రాసక్తులై యున్నట్లుగ్రహించి మరఁదితో మెల్లఁగనిట్లనియె. "గోవిందరాయఁడు! నీవు నాపాలిఁటి గోవిందుఁడవె. అన్నిఁటికి నేనునిన్నే నమ్ముకొన్నానుగదా! కాఁబట్టి నన్నొక దరిజేర్పవలసిన భారము నీమీఁదనున్నది. నీసలహాప్రకారము పిల్లనిక్కడికిఁ బిలిపించినాను కదా! నాపని నేను చేసినాను. నీపని నీవు చేయవలసినది.

బావగారూ! మొదట తెలివితక్కువచేత నే నేదో అన్నాను గాని ఆపిల్లరూపురేఖ విలాసములు చూచినను, దానివిద్యచూచినను సుగుణసంపత్తిచూచినను, నిష్కపటమైన భావముచూచినను, నాకు దుష్కార్యముచేయుటకు మనసొప్పకున్నది. అత్తమామలంటే దాని కెంతభక్తియున్నదో మీరే చూచుచున్నారుగదా! నేనేసంబంధము లేనివాఁడనుగదా. బాబుగారు బాబుగారని పిలుచుచు నాస్నానమున కు నీళ్లుతోడి నాకెన్నో యుపచారములు చేయుచున్నది. మీకది చేయుచున్న యుపచారములకు లెక్కయే లేదుకదా! అత్తగారు చే యుచున్న ప్రతిపనికిఁ దానడ్డముపెళ్ళి యాపనిచేయును. మధ్యాహ్న మప్పుడు లేనిపోనిచొల్లుమాటలతోఁ గాలక్షేపముచేయక భాగవతము చక్కఁగాఁజదివి యర్థముచెప్పుచున్నది.నిజముగానిదినీకుగృహలక్ష్మి. అది నీనట్టింట నుండినంతమాత్రముచేత నీయింటిలో లక్ష్మీసరస్వతు లు తాండమాడుచుందురు. అటువంటి పిల్లను చేతులార నష్టపెట్టుకొ నుట భావ్యముకాదు. మీఁద నీయిష్టము.

ఇదేమిటోయి! ఇంతలోనేక్రొత్తపుంత త్రొక్కినావు. నీమట్టు కాపిల్ల గృహలక్ష్మిలాగు కనఁబడుచున్నదికాని, నామట్టుకది పిశాచములాగు నాపాలిటి బ్రహ్మరాక్షసిలాగు కనఁబడుచున్నది. దీనిని మారణహోమము చేసినప్పుడుగాని నామనస్సు శాంతిబొందదు. అది యైననుండవలె. నేనైన నుండవలె. నీవీపని కొప్పుకొనకపోయినపక్షమున నేను మనదొడ్డినూఁతిలో దిగి చచ్చిపోయెదను. ఇదినిశ్చయము అందముగా నున్నదన్నావు. అందమేమిటి? అందం బోగంవాళ్ళకు, గుడిసేటివాళ్లకు కావలె, సంసారివాళ్ల కెందుకు? త్రొచుపామందముగా నుండదూ? దీనికోసమైదువేలు రూపాయలు పోగొట్టుకొందునా? రూపాయలమాట యటుండఁగా వల్లూరివారితో సంబంధము నాకుఁ దెగిపోవలెను. ఈపని చేయుదువాలేదా? చేయఁదలఁచుకొన్న పక్షమున నేలాగుచేయుదువో చెప్పు. లేకపోతే యేకత్తిపీటతోనో దానిని నఱికి తరువాత నే నురిస్తంభమెక్కెదను.

బావగారు! తొందరపడకుఁడు. ఆపిల్ల మొగంచూచినప్పుడు నాకుజాలిపుట్టి యాలాగన్నానుగాని మీసెలవుప్రకారం చేతులుకట్టుకొని చేయవలసినవాఁడనే కాని మీకు విరుద్ధముగాఁ జేయవలసినవాఁడనుగాను.

సరె! నీవు చేయఁదలఁచుకొన్న పక్షమున నేలాగునఁ జేయఁదలచుకొన్నావో అది చెప్పు? మనకు ప్రమాదములేకుండా చేయవలెను.

బావగారు! మనకు ప్రమాదమెన్నఁడు లేదు. అట్లైన మర్మము విడిచి యన్నిసంగతులు మనవి చేయుచున్నాను. వినుండి. జాతివారి సర్కారులో తగినంత సాక్ష్యముంటేనేగాని యేనేరమునకు శిక్ష వేయరు. అందులో కూనీనేరమునకు మఱింత సాక్ష్యము కావలెను. పట్టపగలు బాజాభజంత్రీలతో తరలివచ్చి లోకులందఱినిబిలిచి కూనీ

జేయఁగలవాఁడుండఁడుగదా! అందుచేత కూనీనేరములు రుజువుకావు. ఏనేరము చేసినప్పటికి యీసర్కారులో కొంచెముగానో, గొప్పగానో శిక్షపడవచ్చునుగాని కూనీనేరము చేసినవాఁడు నిరపాయముగా దాఁటిపోవచ్చును. ఏమంటే దానికెన్నో రుజువులు కావలెను. ఏమాత్రము సందేహమున్నప్పటికి నేరస్థుని వదలివేయుదురు. అందులో డబ్బున్నవాఁడు కూనీచేసినపక్షమున నీప్రభుత్వములో మిక్కిలి సులభముగా దాఁటిపోవచ్చును. ఏమంటే నాల్గువందలు రూపాయలు మనవికావంటె దిట్టమైన ప్లీడరు దొరుకుతాఁడు. వాఁడు క్రిందామీదా బెట్టి వాళ్ళ సాక్షులను కంగారుపెట్టి అసెసర్లను భ్రమపెట్టి జడ్జిగారికండ్లలో దుమ్ముకొట్టి మసిపూసి నేరేడుకాయచేసి గండము తప్పించును. అంతవఱ కక్కఱలేదు. పోలీసువాళ్ళ ముఖమున వాళ్ళకళ్ళు తిరుగునట్లు పాఱవేసినపక్షమున కేసేవుండదు. పైగా జిల్లాకెక్కడో వకరిద్దరుతప్ప మేజస్ట్రీటులందరు హిరణ్యాశ్రద్ధాలవాళ్ళే కాఁబట్టి యన్ని నేరములలోకి కూనీనేరమే క్షేమకరమైనది. మనకెంతమాత్రము ప్రమాదములేదు. ఇక నేనేమి చేయఁదలచుకొన్నానో వినండి. కూనీ చేయదలఁచుకొన్నవాఁడు కత్తితోఁజంపఁగూడదు. నెత్తురు ప్రవహించిన నేరము త్వరగాబైలుపడును. అన్నటిలో విషప్రయోగము మంచిది. నేను మొన్న నిడదవోలు వెళ్ళినప్పుడు కొంచెము పాషాణము తెచ్చినాను. ఉల్లిపాషాణమన్నటిలోఁబ్రబలమైనది. అది వడ్లగింజెత్తు వేసినపక్షమున ఢాం అని మనిషి చచ్చిపోవును. అది నేను పట్టుకొని వచ్చినాను. ఈపిల్లకు రెండుమూడు దినములనుంచి పొడిదగ్గు వచ్చుచున్నది. దగ్గుగానున్నది. ఆవుపెరుగు తెప్పించి పోయవలసిదనిమీరు మాయప్పతో చెప్పండి. నేనువెళ్ళి ఆవుపెరుగు స్వయముగాఁ దెచ్చి యందులోఁ బాషాణము పెట్టెదను. నేదెచ్చిన గిన్నెలో పెరుగేవడ్డించుమని మాఅప్పతో చెప్పండి. ఆమెతో యీరహస్యముమాత్రము

చెప్పవద్దు ఆపెరుగు పోసికొని అన్నముతిన్న జామునకుగాని రెండు జాములకుగాని ప్రాణముపోవును. దానికి డోకులు, విరోచనములు వెళ్ళును. ఈచుట్టుప్రక్కల గ్రామములలో విషూచిజాడ్యములుకూడ నున్నవి. ఎవరైన నడిగినపక్షమున మాకోడలికి విషూచివచ్చినదని మీరు చెప్పవచ్చును. ఇది నాకుతోచిన యుపాయము.

వహవ్వా! బాగున్నదోయిబావా! ఆలాగేచేయి. ఉదయమే నేను మీ అప్పతో ఆలాగేచెప్పెదను. రాత్రి నీవేవెళ్ళి ఆపెరుగుపట్టు కొనివచ్చి చేయవలసినపని చేయుము. బాబూ బాబు నన్నేదోగట్టున పాఱవేయవయ్యా! ఇంకొక జన్మమున నీకడుపునపుట్టి నీరుణముతీర్చు కొందును. ప్రొద్దుపోయినది యీపాటికి పండుకొందములే. అని యె పరి ప్రక్కమీఁదకు వారు వెళ్ళి పండుకొని నిద్రపోయిరి.

మఱునాడు ప్రాతఃకాలమున శంకరరాజు భార్యను బిలిచి "ఓసీ! యిదిగోనే. కోఁడలికి రెండుదినములనుంచి పొడిదగ్గువచ్చుచు న్నది చూచితివా. అదివేడిచేసివచ్చినట్లున్నది. ఇంతమాత్రము నీవు కనుక్కొని దానికిఁదగిన చికిత్సచేసినావు కావుగదా! ఊఁ ఈమాత్ర ము నీవు చూడకపోతే అది మనస్సులో నేమనుకొనునో గదా! దాని తల్లిదండ్రు లిక్కడలేరు, మనయింట గేదెపెరుగేగాని ఆవుపెరు గులేదు. గేదెపెరుగుపోసుకుంటే యిది తగ్గదు. ఆవుపెరుగు తెప్పించి యీరాత్రిపోసిచూడు. రేపటికి దగ్గు తగ్గిపోవును. "గోవిందరాయఁడు నీవువెళ్ళి యీరాత్రి కమ్మనాగన్నగారి యింట్లో ఆవుపెరుగు తెచ్చి కోఁడలికి పోయించవోయి" యని యిరువురతోఁజెప్పెను. వారిద్దరు సరేయనిరి. ఆమధ్యాహ్నము రాజరత్నమెప్పటియట్ల పుస్తకముచేతఁ బుచ్చుకొని ప్రహ్లాదచరిత్ర జదివి యర్థము చెప్పెను, చుట్టుప్రక్కల నున్న యాడువాండ్రిందఱు వచ్చి యాకథవిని సంతోషించిరి.

అట్లు జగన్నాథరావు హైదరాబాదువెళ్ళి నిజాము రాజ్యము

నకు రాజధానియైన యాపట్టణమున దర్శనీయములైన స్థలములెల్లఁ జూచి ఫలక్‌నామాయను భవనరాజముయొక్క నిరుపమానరామణీయతకు నచ్చెరువంది హుసేన్‌సాగర సరస్సుమీఁదఁ గట్టిన వంతెనఁ గనుంగొని దాని నిర్మాణ చాతుర్యమునకు సంతసించి చార్‌మినారు పంచమహల్ మొదలగు వానింగని నేత్రపర్వముచేసికొని యాయుమ్మరావులయొక్కయు నమీరులయొక్కయు నవాబులయొక్కయు, వైభవము వేషభాషలు, నాంగ్లేయుల వేషభాషలతోఁ బోల్చిచూచి తాను నూతనముగ జ్ఞానమునంపాదించినందుకు మనంబున నలరుచుఁ జిలకలపూడి బసవరాజుగారియింట భోజనముచేయుచు వారియింటఁ బండుకొనుచు నచ్చటఁ గొన్నిదినములుండి తరువాత కాకతీయ సామ్రాజ్యలక్ష్మీముఖాయమానమై యద్వితీయ శోభావైభవంబులచేఁ జిరకాలము విరాజిల్లి యీనాడు పాడువడి చూపరకు మిక్కిలి విషాదమునుగలిగించు నోరుగల్లుపురమును జిరకాల మాంధ్రదేశమునకు రాజధానియై భామినీరాజ్యశకలములలో నొకదానికి ముఖ్యపట్టణమై చాలకాలము మహైశ్వర్యము ననుభవించి యెట్టకేల కౌరంగజీబుపాదుషాయొక్క కోపాగ్నికింధనమై ప్రాణముపోయినతరువాతఁ జైతన్యములేకయుండువిధమున నున్న గోల్కొండపురమునుజూచి విచారించి యచ్చటనుండిమరల హైదరాబాదుపోయి పిమ్మట భామినీరాజ్యసంస్థాపకుఁడైన అలాఉద్దీన్‌హుస్సేన్‌గంగోభామినీయనురాజుయొక్క రాజధానియైన గల్బర్గానగరమును, దానియందలి పూర్వపరిపాలకుల సమాధులును జూచి మహమ్మదీయులయైశ్వర్యము హిందువులయైశ్వర్యమువలెనే శోచనీయమైయున్నది గదాయనుకొని చాందుబీబీయను రాణియొక్కయద్వితీయసామర్థ్యమునుజ్ఞప్తికిఁదెచ్చినట్టియహమ్మదునగరమునుదర్శించియచ్చటనుండి యౌరంగబాదునకు, బోయిభ్రాతృహంతయుఁ బితృఘాతకుఁడునైన యౌరంగజీబుచక్రవర్తియొక్కసమాధినివీ

క్షించి "అహాహా! యీచక్రవర్తి రాజ్యకాంక్షచేనీపాపమాపాపమనకస కలపాపంబులఁ జేసినాఁడు. అన్నదమ్ములనంత మొందించినాడు. జనకుని జెఱలోఁబెట్టినాఁడు జ్ఞాతులకుఘాతలుగావించినాఁడు. పైవారిమాటలె న్ననేల! అనుమానముతోఁచినప్పుడు కన్నబిడ్డలనె కారాగృహములకం పినాఁడు, ధనకాంక్షయు రాజ్యకాంక్షయుమానవహృదయముఁ బ్రవే శించి వానిం దమగులాముంజేసికొనియెట్టిపనినైన వానిచేఁ జేయించు ననుట కీమహాచక్రవర్తియొక్క జీవితమేశాశ్వతసాక్ష్యమిచ్చుచున్న ది కదా! ఇన్నిఘాతలుచేసి యేమిమూటగట్టుకొనియెను! సేతుహిమా చలమధ్యస్థమైన సకలసామ్రాజ్యమువిడిచి, గణనాతీతములైన గజతు రంగాదిచతురంగబలములవిడిచి యమూల్యములై యతిప్రస్తుతములై లెక్కకు మిక్కిలియైన రత్నరాసులువిడిచి యచ్చరలనుఁ దిరస్కరిం చు నంతఃపురాంగలనువిడిచి మిద్దెలు మేడలు మహాభవనములువిడిచి నిరుపేద ప్రాణములు విడిచినట్లె యితఁడుగూడ ప్రాణములు విడిచెను తానుచేసినపాపమును మాత్రమె వెంటఁగొనిపోయెను. ఆర్యావర్త భూమిమీఁద నీతఁడుచల్లిన యసంతుష్టిబీజములేగదా మహావృక్షము లై దేశము నీకడకుఁదెచ్చె! కాని యీతనివిషయమై చెప్పవలసినమేలి గుణములు రెండుమూఁడుగలవు. ఈతఁడు భక్తులలోనొక్కఁడు. తన మతముమీఁద నత్యంతగౌరవము గలవాఁడు. త్రాగుడు మొదలైన దుర్గుణము లీతని దరికైన వచ్చి యెరుఁగవు. ఇతని పరిపాలనము మి క్కిలి కట్టుదిట్టమై ప్రజలకుసౌఖ్యకరమై శత్రుదుర్నిరీక్ష్యమైయుండె ను." అని యాతని గుణాగుణములు దలపోసియచ్చటినుండి కదలి గో దావరీతీరమందున్న సిక్కుమతస్థుల పుణ్యక్షేత్రమగు నాందేరుచూచి మఱియుఁ గొన్ని తావులుచూచి యాదేశమందలి బ్రాహ్మణక్షత్రియ వైశ్య శూద్రాదులగు హిందువులందఱు మహమ్మదీయులవలెనేగుడు గుడీపీల్చుచు షరాయిలు నిలువుటంగీలు తొడుగుచు టోపీలుపెట్టుకొ

నుచు హిందూస్థానిభాషయె మాటలాడుచు మతములో హిందువులై
నను వేషభాషలఁ దురకలనుమించియుండుటచేత "యథా రాజా తథా
ప్రజా" యనుమాట సత్యమైనదనుకొని ప్రభువులంబట్టి భాషలో నా
చార్యవ్యవహారములలో వచ్చుమార్పులిట్లే యుండునుగదా! యని త
లంచి మరల హైదరాబాదునకుఁ బోయి కేశవరాజు పేరఁ దాను
మొట్టమొదటఁ దండ్రిబారినుండి తప్పించుకొనుటకు గుంటూరుపో
యి యచ్చటి నుండి హైదరాబాదునకుఁ బోవుటయు నాదేశమునఁ
దా ననేకస్థలములదర్శించుటయు నవీనవిషయజ్ఞానము సంపాదించుట
యులోనుగాఁగల వృత్తాంతములు గల యొకజాబు వ్రాసెను. ఏనా
డు గోవిందరాయఁడు పాషాణము పెరుగులోఁ గలిపి రాజరత్నమున
కపాయము వాటింపఁదలచెనో యానాడుదయమునను జగన్నాథరా
వు వ్రాసిన జాబు కేశవరాజున కందెను. ఆజాబతఁడు చదువుకొని త
లిదండ్రుల కెరిగింప వారు మిక్కిలి యక్కజము నొందిరి, జగన్నాథ
రావు గుంటూరులో నుండినట్లు నైదారు దినములలో భీమడోలు వ
చ్చునట్లు జాబు వచ్చెనుగదా! ఇదియేమి చిత్రమని వారుమహాశ్చర్య
రసమగ్నులై యేదో మాయ జరుగుచున్నదనియు రాజరత్నమునకే
దైన ప్రమాదము జరుగవచ్చుననియు భయంపడి తండ్రి కొడుకులా
నాఁటి సాయంకాలమే భీమడోలునకుఁ బ్రయాణమై పడవయెక్కిరి.
ఇఁక నిచ్చట భీమడోలులో శంకరరాజు తనమనోరథసిద్ధియార్రాత్రియ
గునని పుట్టెడాసపెట్టుకొనియుండెను తనకుఁదలయేరు గలిగించుకో
డలు తెల్లవాఱు నప్పటికిఁ దనయిల్లువిడిచి గేహమువిడిచి పోవునని
నిశ్చయముగనమ్మి యెప్పుడు సాయంకాలమగు నెప్పుడుసూర్యుఁడస్త
మించు నెప్పుడు కారుచీకటులు గ్రమ్మునని సూర్యాస్తమయమునకె
దురు చూచుచుండెను. అంతట నాలవజాముకూడగడచెను. మానవ
హృదయాకాశమున రాగద్వేషము లొనరించిన తెఱంగున గగనము

న సంధ్యారాగము వ్యాపించెను. జన్మించినప్పుడు మానవున కేగుణములుండునో మరణకాలమునందు గూడ నాగుణములే కనఁబడుననుసత్యము చాటుటకోయన నుదయకాలమున నున్న యారుణ్యమే యస్తమించునప్పుడు గూడ భానుమండలమందుఁ జూపట్టెను. మానవుఁడెంతచండ ప్రతాపదుర్నిరీక్షుఁడైనను, నెంత తేజోవంతుఁడైననునెంతటి ప్రజ్ఞాశాలియై జగన్మాత్రిఁ డనుపేరు వహించినను గాలమువచ్చినప్పుడస్తమయము నొందకతప్పదనిజగంబునకు వెల్లడిసేయుటకో యనునట్లు భాస్కరుఁడు దేదీప్యమాన ప్రభలతోఁ బగలెల్ల వెలిఁగి సకలభూత సౌఖ్యసంధాయకుఁడై యెట్టకేల కస్తంగతుఁడయ్యెను. మానవశరీర ప్రపంచమునుండి జ్ఞానతేజ మస్తమించిన వెనుక మేరమీఱిన యజ్ఞానము వ్యాపించునట్లే తేజోరాశియైన భాస్కరుఁడస్తమించినపిదప గాఢాంధకారము దశదిశలు వ్యాపించెను. శంకరరాజుమనస్సు పాపభూయిష్టమయ్యెను. చీకఁటి పడఁగానె యతఁడుగోవిందరాయని బిలిచి పెరుగు దెమ్మనెను పాపవ్యవసాయమున గోవిందరాయఁడు కృతనిశ్చయుఁడయ్యు మిక్కిలి సందిగ్ధమనస్సుతోనె పోయి సత్తుగిన్నెతోఁ బెరుగుదెచ్చి యందులో వడ్లగింజంతపాషాణభస్మముగలిపిశంకరరాజు చేతికిచ్చెను. శంకరరాజది పుచ్చుకొని మందు కలిపినావా? కలిపినావా? యని రెండుమూఁడుసారులు గోవిందరాయనడిగి, కలిపినానని యతఁడు దృఢముగాఁ జెప్పినపిదప నాసత్తుగిన్నె దీసికొని భార్యకడకుఁ బోయి "ఆవు పెరు గిదిగో ఈసత్తుగిన్నె మనగేదెపెఱుగు సత్తుగిన్నె దగ్గఱఁబెట్టక జాగ్రత్తగానుంచి కోడలికివడ్డించు" మనిచెప్పి మరచిపోయెదవుసుమీ యని మరల నొక్కిచెప్పి యామెచేతికిచ్చెను. ఆమచ్చుసత్తుగిన్నెలు వారియింట మూఁడుండెను. రెండుసత్తుగిన్నెలలో నదివఱకు గేదెపెఱుగు పోసి యామెనీళ్ళబిందెలు పెట్టుకొను తిన్నెమీఁదబెట్టెను. ఆవుపెరు గెందుకు దేఁబడినదో యది యెఱుఁగక పోవుటచే నామె మన యాడువాండ్రికు సామాన్యముగాఁగల యత్ర

ద్దచేత మగఁ డాగిన్నె వేఱుగాఁబెట్టుమని చెప్పినను బనితొందరచేత నాగిన్నె గేదెపెరుగున్న గిన్నెలప్రక్కను బెట్టెను, మధ్యాహ్నము వండిన యన్నము మిగిలియుండుటచే నాయన్నము పాఱవేయవలసివచ్చునని రాజరత్నము పెట్టుకొని మధ్యాహ్నమువండినకూరను పులుసునువైచికొని తినియెను. మజ్జిగవడ్డించుసమయమువచ్చినప్పుడత్తగారు పొరఁపాటుచేత గేదెపెరుగున్నగిన్నె పుచ్చుకొని కోడలికి గేదెపెరుగే వడ్డించెను. ఆమె భోజన మైనతరువాత నొకగంటకు శంకరరాజు గోవిందరాయఁడు లేచి మడిగట్టుకొని భోజనమారంభించిరి. మజ్జిగవడ్డించుసమయము వచ్చినప్పు డామె గేదెపెరుగే యనుకొని యావుపెరుగు దెచ్చి మగనికిఁ దమ్మునకు వడ్డించెను. వారు సుఖముగా భోజనముచేసి లేచిరి. భుజించి లేచినతరువాత శంకరరాజు భార్యను బిలిచి "కోడలి కావుపెరుగే వడ్డించినావా యని యడిగెను. తాను జేసిన పొరబాటెరుఁగక వడ్డించినా నని యామె చెప్పెను. శంకరరాజది విని సంతుష్టుఁడై "ఏమోయి! కోడలికడుపులో గడబిడ యెప్పుడారంభించును ఈపాటి కారంభించవలెనుకాదా! తెల్లవారునప్పటికి నాశని వదలిపోవునుగదా!" యని యడిగి పండుకొనెను. గోవిందరాయఁడు కూడ తనమంచముమీఁద శయనించెను. వారిద్దఱకు నొక్కకునుకు పట్టెను. అప్పుడందఱికి మెలకువవచ్చెను. నా కడుపులో నెందుచేతనో పోటుగానున్న దని శంకరరాజు ముందుభార్యతోఁజెప్పి బాధపడఁజొచ్చెను. ఆమె గోవిందరాయనితోఁ జెప్పఁబోయెను అక్కయ్యా! నాకుకూడ కడుపులో మంటపోటు వచ్చినదనిచెప్పి మంచముమీఁద దొరలనారంభించెను. శంకరరాజు మెల[illegible] గోవిందరాయనివద్దకు వచ్చి "ఏమిటోయి యీబాధ [illegible]ద్దఱికి వచ్చినది" యని యడిగెను. గోవిందరాయఁడు "మా[illegible] పొరపాటుచేత నావు పెరుగు మనకే వడ్డించినదేమొ ఆలాగైన[illegible] వచ్చినాము. కానినోరు మూసికో. నోరెత్తినావం[illegible]కూటడక్కదు,

V.R. NARAYANA MEMORIAL LIBRARY V.R. NARAYANA D.P.B. Acc. No.

అప్రతిష్ట, ఆడువాళ్ళు కచేరీలెక్కుట, ఉన్నసొమ్ముల్వ్యయమగుటసం భవించును. మనపాపము మనమే యనుభవించుచున్నాము నిరపరా ధురాలిని బసిబిడ్డను మనము చంపదలఁచుకోగా భగవంతుఁడు దాని పాలిటినుండి మాఅప్పగారి బుద్ధి భ్రమపెట్టి మాఘాతమనకే చేయిం చినాఁడు" అని బదులుచెప్పెను.

అయ్యో, అయ్యో! చచ్చినాను చచ్చినాను. విరుగుడు చెప్ప రా గోవిందరాయడూ! విరుగుడు చెప్పరా యని మొత్తుకొని యత ని నడిగెను. "విరుగుడు వెంటనే ప్రయోగించిన పక్షమున పని జరు గునుగాని యింత ఆలస్యమైనతరువాత పనిజరుగదు. దీనికిచావేవిరు గుడు" అని బదులు చెప్పెను. ఇద్దఱికి గడుపులో మంటలు బయలు దేఱెను. ఇద్దఱికి నెత్తురు విరేచనములువెళ్లెను. ఇద్దఱురక్తముకక్కు కొనిరి. ఇద్దఱికి కన్నులెఱ్ఱబడెను. మొగములుకందియుండెను. కాలుసే తులులాగెను. అమితబాధపడఁజొచ్చిరి. అప్పగా రేమిటిరాయిదియని మొత్తుకొని గోవిందరాయని నడుగ "అమ్మా మాయిద్దఱికి విషూచి జాడ్యమువచ్చిన" దని చెప్పెను. ఆమె కలవరమునొంది కోడలిని లేపి తాను చుట్లుబ్రిక్కలయిండ్లవారిని లేపి విశూచిజాడ్యమునకు మందు దెమ్మని ప్రార్థించెను. మందులేవియు లేక వారు రెండేసితులములు కర్పూరము వేయుమనిచెప్పిరి. ఎవరోయొకరు వెళ్ళికర్పూరముదెచ్చిరి అది శంకరరాజు మ్రింగెను. గోవిందరాయఁడు మ్రింగలేదు. గోవింద రాయనికిసంధించెను. అతఁడసందర్భములైన పలుమాటలాడి పెరుగు లో పట్టగింజంతపాషాణముకలిపినానయ్యా. అదిచాలునయ్యాప్రాణ ముఁదీయుటకు" అని ప్రేరెను. శంకరరాజు మాట చూపు లేక పడి యుండెను. ఇద్దరి శరీరములు చల్లబడెను, తెల్లవాఱు జామున నైదు గంటలకు శంకరరాజు మృతినొందెను, ఆరుగంటలప్పుడు గోవిందరా యుఁడు కాలధర్మము నొందెను. శంకరరాజు యొక్క విరోధులుకొం దఱు మరణకారణము విశూచి కాదనియు విషప్రయోగమై యుండ

వలెననియు నచ్చట చేరిన వారితోఁజెప్పి శవము నేలూరుడాక్టరుపరి క్షనిమిత్తము పంపవలసినదని మునసబుకరణములతోఁ జెప్పిరి. వారి మాటంబట్టి మునసబు కరణములు పంచాయితీఁ జేయ వలసివచ్చెను. పంచాయితీదారులు "విషముగాని విశూచిగాని యేదో జరిగిపోయిం దేమిటోజరిగిపోయినది. ఆడువాళ్ళనల్లరిపెట్టఁకూడ"దనియైదుగురునేకీ భవించి విశూచిజాడ్యమే మరణ కారణమని తీర్పు వ్రాసిరి. గ్రామ వాసులు పదిమంది యభిమానించి కటుకులు కట్టుకొమ్ములకు నిప్పు కుండలుకట్టి మోసికొని శ్మశానమునకుఁ తీసుకొనిపోయి దహనము చేసిరి. వారి చుట్టములలో నొకరియింటనుండి యొక ముసలమ్మవచ్చి యత్తకోడండ్రిను స్నానము జేయించివంట జేసెను. రమారమిపదిగంట లగు నప్పటికి, రామలింగస్వామియుఁ గేశవరాజును గైలుదిగి యిం టికిఁ జనకుండఁగనే త్రోవలోనే వారి కాదుర్వార్త తెలిసెను.కొంద ఱువిశూచియనిరి. కొందఱెవరోవిషముపెట్టిరనిరి. వారిద్దఱువియ్యా లివారియింటికరుగునప్పటికి వియ్యపురాలుమగనికొఱకుసోదరునికొఱ కుమిక్కిలి దుఃఖించెను. రామలింగస్వామియు సమయోచిత వాక్య ములతో ధైర్యముచెప్పి పరామర్శచేసెను. కేశవరాజు నాఁటిమధ్యా హ్నమే యేలూరు వెళ్ళి తండ్రిమరణించినందున తక్షణమెబయలు దేరి రమ్మని జగన్నాథరావునకు తంత్రీవార్తబంపెను. అతఁడు తం త్రీవార్తనందుకొని మూఁడవనాటికి వచ్చి తల్లి నోదార్చి తండ్రినిమి త్తము మిక్కిలివగచి పారలౌకిక క్రియలాచరించి "పుత్రిమంతే చ కర్మణి" యను వాక్యప్రకారము నడిచెను. తల్లివలన నతఁడావు పెరు గుయొక్క వృత్తాంతము విని తండ్రిస్వయముగా యొకరికిఘాత జేయఁ బోయి తానే హతుడయ్యెనని నమ్మి తండ్రికట్టిదుర్మరణము గలిగి నందుకు మిక్కిలి విచారించెను. ఆకథవిన్నపిదపఁ గేశవరాజును రా మలింగస్వామియు రాజరత్నమును జంపుటకే శంకరరాజామెనురప్పిం చెననియు దైవవశమున నదృష్టవశమున నామెకుఁ బెట్టఁదలఁచినవిష ము భావమరదులు తిని చచ్చిరని తెలిసికొని తమబిడ్డను దమకు నిర

పాయముగ నిచ్చినందులకు భగవంతునకనేకనమస్కారములు చేసిరి. ద్వాదశాహస్సులు గడచిన పిదప రామలింగస్వామి జగన్నాథరావు వనుజ్ఞమీఁదతనకూఁతుందీసికొని పెనుగొండవెళ్ళెను. చాటపల్లునుండి జగన్నాథరావు పినతల్లి రెండవనాటికే వచ్చి తోఁబుట్టువుయొక్క సంరక్షణసేయఁ జొచ్చెను. ఒకమాసమైనతరువాత జగన్నాథరావు తల్లాప్రగడ రఘుపతిగారి వద్ద తండ్రికట్నములకు కర్చులకుఁదీసికొన్న సొమ్ము వడ్డీతో వారికిఁబంపెను. రఘుపతిగారి కుమార్తెను శ్రావణమాసములోనె సుందరరావు వివాహమాడెను. కార్తికమాసములో రాజరత్నము జగన్నాథరావులకుఁ బునస్సంధానము జరిగెను. జగన్నాథరావు తరువాత సంవత్సరము బి. ఎల్. కు జదివికృతార్థుడయ్యెను. ఏలూరులో నిద్దరుపట్టాలుపుచ్చుకొనిన్యాయవాదులుగానుండి పనిచేసి డిస్ట్రిక్టుమునసబులైరి. జగన్నాథరావు రామలింగస్వామిగారి కొఱకు బురుషోత్తమరావువద్ద బదులు తెచ్చిన సొమ్మంతయుఁగ్రమక్రమముగా జగన్నాథరావున కిచ్చిరుణవిముక్తుడయ్యెను. వారిప్పటికిని సుఖముగా నుద్యోగములు జేయున్నారు. రాజరత్నము నారీరత్నమై తనకన్నెతనము, తనయాలితనము, తనతల్లితనము, పెఱకన్నియలకు నిల్లాండ్రకుఁ దల్లులకు, యంగనలకు మార్గప్రదర్శకములై యుండునట్లు నీమెకు సాటియగుబోటియెందును లేదనియెల్లవారుఁగొనియాడునట్లు గొప్పయుద్యోగస్థుని భార్యయయ్యుఁగర్వమించుక లేక పతిహితాచరణ శీలయై పరుషవాక్యములు నోట రానియ్యక సేవకులయెడల మిక్కిలిదయగలిగి యేయూరికిఁబోయిన నాయూరియంగనలందఱు. నెల్లకాల మీమె యిక్కడనె యుండిన బాగుండునని కోరునట్లు వర్తిల్లుచున్నది. ఆశాపిశాచా విష్టుఁడు నొరుల కపకారము చేయఁదలఁచువాఁడు తప్పక తానే చెడును.

స మా ప్త ము.

శ్రీసుజనరంజనీ ముద్రాక్షరశాల, రాజమహేంద్రవరము.

మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	AOUA104B106
పుస్తకం పేరు	చింతకుంట్ల లక్ష్మీనరసింహంకవి సంపూర్ణ గ్రంథావళి03
తారీఖు	31 December 2025
ముందు అట్ట	no
వెనుక అట్ట	nd
మొత్తం పేజీలు	585
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	IV, 416, 135 iii, 9194
లేని పేజీలు	Jayalakshmi
తయారు చేసినది	Jayalakshmi
పేజీలు విడదీసినది	Hosmat
స్కాన్ చేసినది	BUJJI
పరీక్ష చేసినది	
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good